గీర్వాణ కవుల కవితా గీర్వాణం

గబ్బిట దుర్గాప్రసాద్

ప్రచురణ:

సరసభారతి

ఉయ్యూరు, కృష్ణాజిల్లా

Geervana kavula kavithaa geervanam

by

Gabbita Durga Prasad

First Edition: **MARCH 2015**

Copies: 1000

(C) **Author**

Price. Rs.**300/-**

Cover Design: **Kalasagar**

For Copies: **Gabbita Durga Prasad**
President, "Sarasabharathi"
H.No.2-405, Sivalayam Street,
Near Raja gari kota, Vuyyuru- 521 165
Krishna Dist. Phone:08676- 232797
Cell: 9989066375
e-mail: gabbita.prasad@gmail.com
sarasabharati.vuyyuru@gmail.com
http/sarasabharati.wordpress.com
http/suvarchalanjaneyaswamy.wordpress.com

Type Setting: **"Ramya Bharathi"** vja

Printed : **Rainbow Graphics,** vijayawada-2

అంకితం

శ్రీ మైనేని గోపాలకృష్ణ గారికి....

మనవి మాటలు

సాహితీ బంధువులకు శుభ కామనలు – సంస్కృత లేక అమరభాష లేక గీర్వాణ బాషా కవుల సంక్షిప్త జీవితాన్ని వారి కవితా అమరత్వాన్ని, ప్రతిభా వ్యుత్పత్తులను ఈ తరం వారికి పరిచయం చేయటానికి “గీర్వాణ కవుల కవితా గీర్వాణం” శీర్షికతో సంస్కృత కవుల పరిచయాన్ని చేయటానికి సాహసిస్తున్నానని సవినయంగా మనవి చేస్తున్నాను. 146 మంది గీర్వాణ కవుల కవితా గీర్వాణమే ఇది.

గీర్వాణ కవుల కవితా గీర్వాణం

శ్రీ చిలుకూరి నారాయణ రావుగారు రాసిన "సంస్కృత కవుల చరిత్ర" ఎప్పుడో చదివిన గుర్తు మాత్రమే ఉంది. శీర్షిక మొదలు పెట్టి నాలుగైదు ఎపిసోడ్‌లు రాసిన తర్వాత లైబ్రరీలో దానికోసం ప్రయత్నిస్తే లభించలేదు. వీకీపీడియా ఆధారంగానే మొదలు పెట్టాను. తర్వాత శ్రీమతి ముదిగంటి సుజాతారెడ్డిగారు పరిశోధన చేసి సంస్కృతకవి జీవితాలపై ఒక గ్రంధం రాశారని తెలిసి మిత్రుడు శ్రీ కట్టుకోలు సుబ్బారెడ్డిగారి దగ్గర ఉంటుందేమోనని వాకబు చేస్తే, ఉందని చెప్పి నాకు పంపించారు. కనుక ఈ వ్యాస పరంపరకు డాక్టర్ ముదిగంటి గోపాలరెడ్డి, డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డిగార్లు రచించిన "సంస్కృత సాహిత్య చరిత్ర" ముఖ్య ఆధారం అని మనవి చేస్తున్నాను. కాని ఇంకా కొత్త సంగతులేమైనా ఉన్నాయేమోనని గూగుల్‌ను, తెలుగు వీకీపీడియాలు వెతికి సేకరించి పొందుపరచాను. ముఖ్యంగా ఇంగ్లీష్‌లో ఆయా గ్రంధాలను రాసిన వారు ఇంకా లోతుగా చర్చించి అనర్ఘ మణిరత్నాలను వెలువరించారు. వాటిని సేకరించి రాశాను. ఎంత చెప్పినా ఇంకా చెప్పాల్సింది ఉంది అనే అసంతృప్తి నాకు ఉంది. దాదాపుగా కవుల కాలాన్ని బట్టి మొదలుపెట్టి రాశాను. ఆధునిక యుగంలో కూడా ప్రసిద్ధులైన సంస్కృత కవులున్నారు. గొప్ప గ్రంధాలే రాశారు. వారిని గురించి కూడా రాశాను.

"పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు"గా ఇంగ్లాండ్, అమెరికా దేశపు 125మంది పూర్వకవులపై రాసి ప్రచురించిన తర్వాత నా మనసులో ఒక బాధ పీడిస్తూనే ఉంది. మన దేశ పూర్వ కవులపై ఇంతవరకు రాయలేకపోయానే అనేది మనసులో తొలుస్తూనే ఉంది. ముఖ్యంగా మన సాహిత్యానికి మూలం సంస్కృతం కనుక పూర్వ సంస్కృత కవులపై రాసి ఆ లోటు భర్తీ చేయాలనిపించింది. శీర్షిక కోసం రెండు మూడు రోజులు ఆలోచిస్తే ఫ్లాష్‌గా "గీర్వాణ కవుల కవితా గీర్వాణం" పేరు స్ఫురించింది. వెంటనే రాయటం మొదలుపెట్టాను. అది పెరిగి పెరిగి విస్తృత రూపం దాల్చింది. మధ్యలో కొద్దిరోజులు విరామం తర్వాత కొనసాగించి ఈ రోజుకు 96

ఎపిసోడ్‌లలో, 146మంది సంస్కృత కవుల గురించి రాశాను. నా అంతర్జాల రాత ప్రయత్నాలలో ఇది చాలా బృహత్తరమైనదే. నేను రాసినవి చాలా ప్రాధమిక విషయాలే. వారి గురించి తెలుసుకోవాల్సింది చాలా ఉండి ఉంటుంది. నాకు లభించిన సోర్సుల నుండి గ్రహించిన సమాచారాన్ని మీకు తెలియ చేశాను అంతే. ఇంకా ఎందరో నా దృష్టికి రాని వారు ఉండవచ్చు.

ఇంతమంది సంస్కృత మహాకవులు, రచయితలను సంస్మరించగలిగాను. వారి గురు పరంపరను స్పృశించి ధన్యమయ్యాను. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇంకా నా దృష్టికి రాని వారి గురించి తెలుసుకొని వారినీ చేర్చే ప్రయత్నం చేస్తాను. అంతవరకు ఈ శీర్షికకు "మరొక కామా లేక మరో విరామం"గా భావించండి. ఆదరించిన వారందరికీ ధన్యవాదాలతో కూడిన కృతజ్ఞతలు.

మరొక విషయం – నేను ఎప్పటికప్పుడు తనకుఅంకితం ఇద్దామనుకొన్న నాలుగు పుస్తకాలను ఒకటి "సిద్ధయోగి పుంగవులు" తమ తల్లిగారు కీ.శే.మైనేని సౌభాగ్యమ్మగారికి, రెండవది "మహిళా మాణిక్యాలు" తన అర్ధాంగి శ్రీమతి సత్యవతిగారికి, మూడవది "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" తన బావగారు డాక్టర్ శ్రీ రాచకొండ నరసింహ శర్మ – ఎండి గారికి, నాల్గవది "దర్శనీయ దైవక్షేత్రాలు" తన జీవితానికి మార్గదర్శి అయిన "కపటమెరుగని సౌజన్య సౌశీల్యమూర్తి" శ్రీ కోగంటి సుబ్బారావు గారికి అంకితం ఇవ్వమని చెప్పి, ఇప్పించిన స్పాన్సర్‌గా ఉన్న ఉదార హృదయులు, నాకు బహు ఆత్మీయులు, సరసభారతికి అత్యంత శ్రేయోభిలాషులు, మార్గదర్శి శ్రీ మైనేని గోపాలకృష్ణ –(అమెరికా) గారికి "గీర్వాణ కవుల కవితా గీర్వాణం" అనే ఈ అంతర్జాల గ్రంధం, అంతర్జాల సాక్షిగా – రూపాయి కూడా వారికీ నాకు ఖర్చు లేని విధంగా వారి సాహిత్యాభిలాషకు, సరస హృదయానికి, సౌశీల్యతకు, స్నేహ ధర్మానికి, మాతృ దేశాభిమానానికి, మాతృభాషాభిమానానికి, భారతీయ అధ్యాత్మకతపై ఉన్న గౌరవానికి, గుర్తింపుగా 10-01-2015న శ్రీ

గోపాలకృష్ణగారి 80వ జన్మ దినోత్సవం సందర్భంగా ఇప్పుడే కృతజ్ఞతా పూర్వకంగా, చిరుకానుకగా ఈ "గీర్వాణ కవుల కవితా గీర్వాణం" అంతర్జాల గ్రంథాన్ని అంకితమిస్తున్నాను.

ఇదేదో వారిని మభ్యపెట్టి గ్రంథ రూపంలో దీనిని తీసుకురావాలనే ఆలోచనతో మాత్రం కాదని, వారు "ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్న అంకిత విషయం"పై నా నిర్ణయమేనని సవినయంగా మనవి చేస్తున్నాను. వారికి తెలియబరచకుండానే నేను చేసిన ఈ సాహసానికి గోపాలకృష్ణగారు సహృదయంతో అర్థం చేసుకొంటారని భావిస్తున్నాను.

ఇది రాసిన సుమారు ఇరవై రోజులకు ఒక రోజు రాత్రి శ్రీ మైనేని గోపాలకృష్ణగారు అమెరికా నుండి ఫోన్ చేసి "గీర్వాణ కవుల కవితా గీర్వాణం"ను పుస్తకంగా తీసుకొని రావటానికి తన మేనకోడలు, తన బావగారు డా.రాచకొండ నరసింహశర్మ – ఎండి గారి కుమార్తె శ్రీమతి డాక్టర్ జ్యోతి (అమెరికా) ఉత్సాహంగా ఉందని నేను ఒప్పుకొంటే వెంటనే ఆ పని ప్రారంభిద్దాం అన్నారు. సంతోషంగా అంగీకరించాను. దీన్ని మార్చి 15వ తేదీ సరసభారతి నిర్వహించే శ్రీ మన్మథ ఉగాది సంబరాలలో ఆవిష్కరించాలని భావించాం. మర్నాడు ఉదయం శ్రీ చలపాక ప్రకాష్‌గారికి ఫోన్ చేసి విసయం చెప్పా. మీరందరూ అంత ఉత్సాహంగా ఉంటే సమయం రెండు నెలలే ఉన్నా ప్రయత్నించి గ్రంథాన్ని తెద్దాం అన్నారు. ఎంతో ఆనందమేసింది. ఇక, పని ప్రారంభించాం. ఇంతమంది సాహితీ మూర్తుల సహకారం లభించింది. అందుకే పుస్తకం ఈ రూపం దాల్చింది. దీనికి శ్రీమతి జ్యోతిగారిని, వారి సోదర, సోదరీమణులకు (అమెరికా) అంకితం తీసుకుంటున్న ఆత్మీయులు శ్రీ మైనేని గోపాలకృష్ణగారికి, ముద్రణ బాధ్యతలను మా తరపున స్వీకరించిన శ్రీ చలపాక ప్రకాష్‌గారికి, అడిగిందే తడవుగా పెద్ద మనసుతో అంగీకరించి గ్రంథానికి ముందు మాట రాసిన సహృదయ ఆత్మీయ సాహితీ మూర్తి డా. శ్రీ రామడుగు వెంకటేశ్వర శర్మగారికి కృతజ్ఞతలు

అందజేస్తున్నాను. సరసభారతి వీరందరికీ ఆత్మీయ ధన్యవాదాలు తెలియజేస్తోంది.

ఈ పుస్తకం సరసభారతి ప్రచురించిన 15వ గ్రంథం. నేను రాసిన 10వ గ్రంథం. అంతర్జాలంలో నేను రాసిన ఆరవ పుస్తకం. ఇదంతా సరస్వతీ దేవి కరుణా, మా శ్రీ సువర్చలాన్జనేయస్వామి వారల అనుగ్రహం, మా కుటుంబ సభ్యుల, అందునా ముఖ్యంగా నా సతీమణి శ్రీమతి ప్రభావతి సహకారమే అని సవినయంగా తెలియజేస్తున్నాను.

ఎందరో మహానుభావులు. అందరికి వందనములు.



- గబ్బిట దుర్గాప్రసాద్

"గీర్వాణ కవుల కవితా గీర్వాణం" గ్రంధ రచనకు సహకరించిన పుస్తకాలు

1. డా.శ్రీ ముదిగంటి గోపాలరెడ్డి, డా. శ్రీమతి ముదిగంటి సుజాతాదేవి రాసిన "సంస్కృత సాహిత్య చరిత్ర"
2. తెలుగు విజ్ఞాన సర్వస్వం
3. 20వ శతాబ్ది తెలుగు వెలుగులు (1,2 భాగాలు) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ
4. వీకీ పీడియా మొదలైనవి.

నా మనసులోని మాటలు

కృతి స్వీకర్త - శ్రీ మైనేని గోపాలకృష్ణ

ఇలా మొదలైంది- "సిద్ధయోగి పుంగవులు" మొదలుకొని, "మహిళా మాణిక్యాలు", "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు", "దర్శనీయ దైవక్షేత్రాలు" ఒకొక్కటీ ఎప్పటికప్పుడు శ్రీ దుర్గాప్రసాద్‌గారు నాకు అంకితమివ్వాలనుకోవటం, నేను వాటి స్వీకర్తగా సరియైనవారికి సూచించటం, వారు దానికి అంగీకరించటం జరిగి పోయాయి. ఇప్పుడు "గీర్వాణకవుల కవితా గీర్వాణం" అంతర్జాలంలో ధారా వాహికంగా ప్రచురించిన దానిని నా ప్రమేయం లేకుండానే నాకు అంకితమివ్వటం నన్ను అమితాశ్చర్యాలకు గురిచేసింది. ఇంతటి పవిత్రమైన అమృతంలాంటి రచనకు స్వీకర్తగా నాకున్న అర్హత శ్రీ దుర్గాప్రసాద్ గారికి నాయందున్న అభిమానం మాత్రమేనని నా నిశ్చితాభిప్రాయం.

తదుపరి, ఈ విషయాన్ని గురించి మేనకోడలు జ్యోతితో సంభాషిస్తున్న సందర్భంలో, జ్యోతి ఉత్సాహానికి ప్రోత్సాహం తోడై ఈ మహోన్నత విలువైన రచనను పుస్తకరూపంగా ప్రచురించాలని, అందుకు జ్యోతి తండ్రిగారైన మా పెద్దబావగారు డా. రాచకొండ నరసింహశర్మగారి ఆశీస్సులతో, అన్న సుధాకర్, తమ్ముడు రమేష్, చెల్లెలు సంధ్య (అంతా అమెరికా వాసులు) లను కలుపుకొని సమిష్టిగా ప్రాయోజకత్వం (స్పాన్సర్షిప్) వహించాలనుకోవటం, ఈ సూచనకు శ్రీ దుర్గాప్రసాద్ గారు పచ్చజెండా ఊపటం ఒకదానివెంట ఒకటి దైవనిర్ణయాలుగా జరిగిపోయాయి. వీరందరికీ నా ధన్యవాదాలు.

- మైనేని గోపాలకృష్ణ

హన్ట్స్ హిల్- అలబామా-యు

డా॥ రామడుగు వేంకటేశ్వర శర్మ
విశ్రాంతాంధ్రోపన్యాసకుడు,
ఫ్లాట్ నెం. 201, 2వ ఫ్లోర్, ఆర్.వి.టవర్స్,
శ్రీ వేంకటేశ్వర బాల కుటీర్ వద్ద, 2/17 బ్రాడీపేట,
గుంటూరు – 522 002.సెల్. 98669 44287,
ల్యాండ్. 0863 – 2243762.

అంతరింద్రజాలం

శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ కృష్ణాజిల్లా ఉయ్యూరు నివాసి. సాహిత్య తృష్ణగల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. విశేషించి 'సరస భారతి' అధ్యక్షులు. సాహితీ మండలి కన్వీనర్. ప్రధానంగా అనేక విషయాలను అంతర్జాలం ద్వారా తెలుసుకొని, సేకరించి సాధారణ విద్యావంతులకు అందజేసే ఆసక్తీ – శక్తీ గల మేధావులు. స్వదేశ విజ్ఞానపరంగానే కాదు – ముఖ్యంగా విదేశ విజ్ఞానపరమైన దృష్టితో అంతర్జాలాన్ని ఉపయోగించుకొని ఇటీవల "మహిళా మాణిక్యాలు" అన్న పేరుతో విదేశ వనితల జీవిత విశేషాలను విశిష్టంగా సేకరించి, గ్రంథ రూపంలో వెలువరించారు. ఆకాశవాణి – విజయవాడ కేంద్రం వనితా వాణిలో వీరు సేకరించి మహిళా గాథల్ని అప్పుడప్పుడు ప్రసారం చేస్తోంది. ఇది సంతోషించదగిన అంశం. అంతటితో ఆగలేదు ఈయన. మన భారతదేశంలోని "దర్శనీయ దైవక్షేత్రాల్ని" గ్రంథరూపంలో వెలువరించి పఠితల్ని పునీతుల్ని చేశారు శ్రీ సువర్చలాంజనేయ స్వామివారి పరిపూర్ణ కటాక్షంతో.

ఇంతటి నెట్‌వర్క్ నేపథ్యంగా మేటి జీవలక్షణంగా గలిగిన ఈ సరసభారతి అధ్యక్షులవారి దృష్టి ఇప్పుడు సంస్కృత భారతిపై ప్రసరించింది. అసలింతకు పూర్వమే "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు"ను అమోఘంగా వ్రాసిన అనుభవం ఈయనకుంది. ఆ అనుభవ పరిపాకంతో దేశవిదేశీయ పండితులు గీర్వాణ

కవుల కావ్యాలపై వ్యక్తీకరించిన అనేకాంశాలనూ, అభిప్రాయాలనూ పాఠకులకు ఆశ్చర్యంకలిగేలా, సాధారణ విద్యావంతులు గూడా తెలుసుకునే రీతిలో ఆసక్తిదాయకమైన పద్ధతిలో 145 మంది ప్రాచీనాధునిక సంస్కృత కవిపండితాలంకారికుల జీవిత - సాహిత్య జీవిత చరిత్రలను గురించి ఈతరం వారికి పరిచయమయ్యే విధంగా - వారివారి కావ్యగత కవితాంశాలను కొద్దిగా జోడిస్తూ - అంతర్జాలవ్రాతగా, సుమారుగా 350 పేజీల గ్రంథంగా వెలుగులోకి తీసుకురాబోతున్నారు. మన తెలుగునకు మూలమైన సంస్కృత కవులను గురించి వ్రాయాలనే తపనతో, ఇప్పటి వారికి (అంటే సాధారణ పఠితులకు) తెలిసే రూపంలో ఇట్టి రచన లేదు కాబట్టి ఆ లోటును భర్తీ చేసే విధానంలో ఈ గ్రంథాన్ని వెలువరిస్తున్నారు దుర్గాప్రసాద్‌గారు.

నా దృష్టిలో అందరినీ ఆకర్షించగల అంశాలు ఈ బృహద్గ్రంథంలో ఇవి ఉన్నాయి.

శీర్షికల్ని కవితాత్మకంగా ఏర్పరచడం, అసలు ఈ గ్రంథం పేరే దర్జాగా ఉంది. శీర్షికల్నీ, ఉపశీర్షికల్నీ ఏర్పరిచారు. గీర్వాణ కవుల పేర్లకు అనుకూలంగా, చమత్కారభరితంగా ఆయా కవుల కావ్యాలను పరిచయం చేసే సందర్భాల్లో "బౌద్ధ నాటకకర్త - హర్షవర్ధనుడు" ఈ కవిని గురించి చెబుతూ "హర్షుని కవితా హర్ష వైభవం" అన్న పేరుతో ఆయన రచనా విశేషాలు తెలిపారు. ఆ కవి పేరునకు అనుకూలంగా ఉపశీర్షికను ఏర్పరిచారు. అలాగే "అష్టపదుల జయదేవుడు - భక్త జయదేవం", "నవసాహసాంక చరిత్రకర్త - పద్మగుప్తుడు", "గుప్తుని కవితా పద్మపరిమళం" ఇత్యాదులిందుకు నిదర్శనాలు.

పాఠకుల్ని చదివింపజేసే సజీవ వ్యావహారికాంధ్ర భాష తెలుగు నుడికారాలు ఆకర్షిస్తాయి. కాదంబరిని రచించిన బాణుని కవితా గీర్వాణాన్ని గురించి వ్రాస్తూ "ప్రతీ అలంకారానికీ ఆధారంగా స్వభావోక్తిని బాణుడు తీసుకున్నాడని ఈ రచయిత చెబుతూ "వక్రోక్తికి శ్లేష, అతిశయోక్తులే బాగా రాణిస్తాయని భావించినవారికి బాణుడు చేసిన ఈ ప్రయోగం దిమ్మ తిరిగేట్లు చేసింది". ఇక్కడ "దిమ్మ తిరడగం" అనేది సజీవ వ్యావహారిక పదం. భట్టనారాయణుని వేణీ సంహార నాటక రచనా

విశేషాలను చెబుతూ ఈయన "సుదర్శకుడు అనే చార్వాక సంభాషణం 'సుదీర్ఘ స్తుతి' అనిపిస్తుంది" అని అన్నారు. 'సుదీర్ఘ స్తుతి' నేటి కాలానికి అర్ధమయ్యే చాలా పదునైన పదం. పైగా ఈ వాక్య విన్యాసం ద్వారా ఈ రచయిత విమర్శలో నిర్మొహమాట ధోరణి గలవారని తెలుస్తోంది. రాజశేఖరుని విద్ధసాలభంజిక "కవిత్వపరంగా హిట్టే – నాటక కళాపరంగా ఫట్టే". ఈ అంత్యానుప్రాసయుక్తమైన సజీవ భాషా వాక్యం ఆకర్షణీయం. అక్కడక్కడా ఇలాంటివెన్నో కనిపిస్తాయి.

ఈ బృహద్వ్యాస గ్రంథంలో ఎక్కడ బడితే అక్కడ ఆంగ్ల పదాల పోహళింపు కానవస్తుంది. "హ్యాట్సాఫ్", "రూట్‌మాప్", "సాంపిల్", "క్లైమాక్సు", "టెంపో". ఇలాంటివెన్నో కోకొల్లలు.

తులనాత్మక సమీక్షా దృక్పథం కూడా ఈ బృహద్వ్యాస గ్రంథంలో ఎక్కువే. కాళిదాస భవభూత్యాదుల్ని గురించి చెప్పేటప్పుడు చాలా కనిపిస్తాయి.

మచ్చుకి సంగీత సాహిత్యాలలో రాజైన సింగభూపాలుణ్ణి గురించి వ్రాస్తూ ఈ రోజు "రసార్ణ వసుధాకరం" అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రాశాడని చెబుతూ, ఈ రాజకవి "కువలయావలి" అనే నాలుగు అంకాల నాటకం రాశాడనీ, దీనికే రత్నపాంచాలిక అనే పేరు కూడా ఉందని పేర్కొంటూ, శ్రీకృష్ణుడు కువలయావలి అనే లలనామణిని వివాహమాడటం ఇతివృత్తమంటూ "ఈ నాటకంపై స్వప్న వాసవదత్త, మాళవికాగ్ని మిత్ర నాటకాల ప్రభావం కనిపిస్తుంది" అని చెప్పారు. తెలుగు కవి రామరాజ భూషణుని వసుచరిత్రను అప్పయదీక్షితులవారి శిష్యుడైన కాళహస్తి కవి 1575వ కాలంవాడు సంస్కృతీకరించాడని చెబుతూ, "తెలుగులో ఉండే యతిప్రాసలనే వాడి, సంస్కృతానికి మాధుర్యం, లయా, ఊపూ తెచ్చాడంటూ, ఎక్కడా కవిత్వాన్ని కుంటుపడనీయకుండా తెలుగు పద్యంలోని భావాన్ని ఒకే శ్లోకంలో పొదివి పట్టాడనీ, మూలంలోని గద్యాన్ని గద్యంగానే గీర్వాణీకరించాడనీ, అవసరమైన చోట్ల సీస పద్యాన్ని మూడు శ్లోకాలలో చెప్పాడనీ, ప్రాస సౌందర్యాన్ని రామరాజ భూషణుడికి తగినట్లు సంస్కృతంలోకి తెచ్చి "వారెవా" అనిపించాడని మూలాను వాదాలలో ఉండే రచనా విశేషాలను పోల్చిమరీ చెబుతూ ఉదాహరణగా రామరాజ భూషణుని వసుచరిత్రలోని

"వేణి చలింపఁగంపితనవీనమృణాళభుజాగ్రకంకణ
శ్రేణి నటింప – లోన శఫరీని చిరీస కటాక్ష కాంతివి
న్నాణముఁజూప, హంసకగణక్వణనంబులు మీద, సైకత
శ్రోణి పవర్త తాబ్జముఖ శోభిత యై కడు సంభ్రమించినన్"

అన్న పద్యానికి కాళహస్తి కవి సంస్కృత శ్లోకాన్ని ఇలా తెలిపారు –

"వేణీచచాల బిసవద్భుజ కంకణానాం / శ్రేణీ ననార్త విబభుశ్శ ఫరీకటాక్షాః నాణీయసీ పరిరరణచ హంసకాలీ! శ్రోణీల సత్పులిన సాచిత మబ్జ వక్రమ్" అయితే ఆయా మూలాలను వాదాలలోని సొగసులను బేరీజు వేసినట్లుగా చెబితే ఇంకా బాగుండేది.

ఈ గ్రంథంలో గీర్వాణ కవులు – వారి కావ్యాల్ని గురించి చెప్పేటప్పుడు ఆయా కవులున్న రాజాస్థానాలూ, ఆ రాజుల చరిత్రలూ, ఆ కావ్యాలలో ఎక్కడైనా కానవచ్చే చరిత్రకాంశాలూ – ఇటువంటి వాటిని ఈ రచయిత ఎక్కువగా ప్రస్తావించారు. మచ్చుకి నవసాహసాంక చరిత్రకర్త – పరిమళ పద్మగుప్తుని గురించి చెబుతూ ఆయన రచించిన కావ్య గత విశేషాలను పరిచయం చేస్తూ "పదవ సర్గలో సింధు రాజు వాగడ, మురళ, లాభాహూణ దేశాలను జయించినట్లు రాశాడు. ఇవన్నీ చారిత్రక సత్యాలే. విద్యాధరుల సాయంతో సింధురాజు వజ్రాంకుశ రాజును జయించి నాగరాజు కూతురు శశిప్రభను వివాహం చేసుకోవటం చారిత్రక సత్యమే అన్నారు. వజ్రాంకుడి రాజధాని రత్నావతి నర్మదా నదికి దక్షిణాన ఉంది. వీరు జీమూత వాహనుడిని తమ వంశమూల పురుషుడిగా చెప్పుకొంటారు. బహుశా వీరి రాజ్యం కొంకణ ప్రాంతం అయి ఉండాలి".

ఈ వాక్యాలను బట్టి దుర్గాప్రసాద్‌గారి చారిత్రక అవగాహన ఎట్టిదో వ్యక్తమౌతోంది. పఠితులకు గూడా చారిత్రక పరిజ్ఞానం కలుగుతుంది. ఈ గ్రంథాన్ని చదివితే అసలు ఏ భాషా కవుల జీవితాలైనా చరిత్రతోనే ముడిపడి ఉంటాయి గదా!

కేవలం – "సుదీర్ఘ స్తుతి" వంటి అత్యాధునిక సజీవ వ్యవహారికములైన పలుకుబడులతో ఈ వ్యాస రచయిత నిర్మొహమాట ధోరణిని వ్యక్తం చేయడమే

కాదు – మురారి అనర్ఘ రాఘవ నాటకాన్ని గురించి చెబుతూ “మురారి మాఘ భవభూతులకున్న ‘సరుకు’ లేదనిపిస్తుంది” అని ప్రత్యక్షంగా సూటిగా, ధాటిగా కూడా వ్యక్తీకరించారు. ఈ రకమైన ధోరణిని ఈ రచయిత ఇటువంటి వాక్యాల్ని సాధారణ విద్యావంతులైన పాఠకులు ఆలోచిస్తారు. ఈ స్టేట్‌మెంట్ నిజమో, కాదో తేల్చుకోడానికి ఆయా కవుల గ్రంథాలను పండితుల సహాయంతో పఠిస్తారు.

కొంతమంది గీర్వాణ కవుల్ని గురించి, ముఖ్యంగా భాసుడు – అప్పయ దీక్షితులు వంటి వాళ్లని గురించి అంతర్జాలంలో ఎక్కువ విషయ సమాచారం లభించిందో ఏమో అధికంగా చెప్పారు. ఆసక్తిదాయకంగానూ చెప్పారు. చాలా చోట్ల కథలూ – గాథలుగానే చెప్పారు. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించే కార్పొరేట్ విద్యా వ్యవస్థలో ఉన్నవారికి అనుకూలమైన రీతిలో గబ్బిట వారు గ్రంథ రచన గావించారు.

ఈ గ్రంథం చాలావరకు ఇన్‌ఫర్మేటివ్‌గా, విజ్ఞానదాయకంగా ఉంది అనడానికి మన సంస్కృత కవుల కావ్యాలను చదివి ఎందరెందరో ఆంగ్లేయులు ఎంతెంతగా తమ భాషలో వ్యాఖ్యానాలు వ్రాశారో, అనువాదాలు చేశారో – ఆ సందర్భం వచ్చినప్పుడల్లా అ రచయిత ఏ మాత్రమూ వదలక తాము గూడ ఆసక్తి చెందుతూ ఆ విషయాలను ఔరా! అనిపించేలా తెలియజేశారు. ఎందుకంటే సామాన్యులు ఆ ఇంటర్‌నెట్, కంప్యూటర్లలో ఆ సమాచారాలను త్వరగా పట్టుకోలేరు. చాలా కష్టంగూడాను. ఈ విషయమై మచ్చుకి ఒక ఉదాహరణను చూపిస్తాను – “ఆంద్రూపీలే అనే ప్రఖ్యాత విమర్శకుడు ‘ఈ భూమండలంపై ఇంతటి ప్రేమ శృంగార కవిత్వం ఉన్న గ్రంథం లేనేలేదు’ అని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. అమరుక అష్టకానికి విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉంది. ఇంగ్లీష్‌లో దీన్ని ‘ఈస్తోటిక్ పొయెమ్స్ ఆఫ్ ఇండియా’ పేరిట ఆంద్రూ షెల్లింగ్ అనువాదం చేశాడు. ‘లవ్ లిరిక్స్’ పేరు మీద గ్రెగ్ బైలీ మరో అనువాదం చేశాడు.”

మరో విషయం నన్నానందపరిచింది. రుద్రటుడనే గీర్వాణాలంకారికుని ‘కావ్యాలంకారం’ అన్న గ్రంథాన్ని పరిచయం చేస్తూ రుద్రటుడు మొత్తం యాభై యేడు అలంకారాలను గురించి వివరించాడనీ, అలంకారాన్ని సమర్థించినా

రసనిష్పత్తికి విలువనిచ్చాడనీ, అందరికంటే ఇంకొక అడుగు ముందుకు వేసి 'ప్రేయోరసాన్ని', 'పదవ రసంగా' ప్రతిపాదించాడనీ దీనికి 'స్నేహం' స్థాయి భావంగా చెప్పాడనీ చెబుతూ 'ప్రేయోరసం' అంటే అమలిన శృంగారం. మన రాయప్రోలు సుబ్బారావుగారు దీనిపైనే 'తృణ కంకణం' అనే ఖండ కావ్యం రాశారని మనకు తెలిసిన విషయమే" అన్నారు. ఈ వాక్యాలను బట్టి ప్రాచీన గీర్వాణాధునాత నాంధ్ర సాహిత్యాంశాలకు ఎంతగా అవినాభావ సంబంధం ఉందో తెలియడమే కాదు – ఆ విషయమై దుర్గాప్రసాద్ గారి నిశిత పరిశీలనా నైపుణ్యాసక్తి ఎట్టిదో తెలుస్తోంది.

గీర్వాణ కవుల కాలాన్ని బట్టి మొదలు పెట్టి రాశానని పీఠికలో ఈ రచయిత చెప్పుకొన్నప్పటికినీ ఆ నియమాన్ని చివరి వరకు పాటించలేకపోయారు. 1850–1900 వాడైన అంబికా దత్తుని ముందు తెలిపి, ఆ తర్వాత 10వ శతాబ్దికి చెందిన త్రివిక్రమ భట్టును గురించి తెలిపారు. ఏమైనా, చివరి దాకా ఈ నియమాన్ని పాటించడం కష్టం కూడా. ఎందుకంటే విషయ సమాచార సేకరణ స్పష్టంగా, క్రమానుగుణంగా లభ్యం కావటం కష్టం గదా!

ఈ బృహద్వ్యాస గ్రంథంలో కొన్నిచోట్ల కొంతమంది సుప్రసిద్ధ గీర్వాణ కవుల కావ్యగత శ్లోకాలను ఒకటి రెంటికైనా ఉదాహరణలనిస్తే బాగుండేది అని నాకనిపించింది. ముఖ్యంగా హర్షవర్ధనుని నాగానంద నాటకం సుప్రసిద్ధం గదా! అందులోంచి ఒక్క శ్లోకాన్నైనా ఉదాహరిస్తే బాగుండేది. అలాగే రామభద్రాంబ చెప్పిన చాటు శ్లోకాన్ని ఒక్కదానినైనా చెప్పి తద్భావాన్ని విశదీకరిస్తే బాగుండేది. ఆమె శ్లోకాల్లో తెలుగు పద్యాల్లో మాదిరిగా యతిప్రాస నియమాల్ని పాటించింది గదా! వాటిని పాఠకులు తెలుసుకోడానికైనా ఈ రచయిత రామభద్రాంబది ఒక్కో శ్లోకాన్నైనా పేర్కొంటే బాగుండేది. ఎందుకంటే ఎంతయినా సంస్కృత కవిత్వాన్ని చెప్పిన మన తెలుగు ఆడుపడుచు గదా! విదుషీమణియైన రామభద్రాంబ.

ప్రతాపరుద్రరాజ కవిని గురించి వ్రాస్తూ – ఈ రచయిత – "స్వయంగా కవి అయిన ప్రతాపరుద్రుడు "యయాతి చరిత్ర" అనే సంస్కృత నాటకం రాశాడు. రాజు కావటానికి ముందే 'కుమార రుద్రుడు' అనే పేరుతో 'అమరుక రాజు రాసిన

"శృంగార శతకానికి' వ్యాఖ్యానం రాశాడు. తెలుగులో భాస్కర రామాయణం కూడా కొంతభాగం రాశాడు. అసలు కవి భాస్కరుడకి రుద్రదేవుడు శిష్యుడు. దీన్నిబట్టి రెండవ ప్రతాప రుద్ర చక్రవర్తి సంస్కృతంలోనూ, తెలుగులోనూ కవిత్వం రాశాడని అర్ధమవుతోంది" అన్న ఈ వాక్యాల ద్వారా ఈ రచయిత భాస్కర రామాయణ కవులలో ఒకడైన కుమార రుద్రదేవుడూ – ప్రతాపరుద్ర రాజ కవీ ఒక్కరేననే క్రొత్త విషయాన్ని చెప్పారు బాగానే ఉంది గానీ – ఈ విషయానికి తగిన ఉపపత్తిపూర్వకమైన ఆధారాలను గూడా చెబితే బాగుండేదని నాకనిపించింది.

ఆధునిక కాలానికి చెందిన సుప్రసిద్ధులైన సర్వశ్రీ తాతాసుబ్బరాయ శాస్త్రి, జటావల్లభుల పురుషోత్తం, కాశీకృష్ణాచార్య, పళ్లెపూర్ణ ప్రజ్ఞాచార్యవంటి కవి పండితుల్ని గురించి విశేష సమాచారాన్ని అందించిన దుర్గాప్రసాద్‌గారు అభినంద నీయులు కానీ – ఒక చిన్న సూచన – సర్వశ్రీ బెల్లంకొండ రామరాయ కవి, చిట్టి గూడూరు వరదాచార్య, కోగంటి సీతారామాచార్యులు, యజ్ఞ నారాయణ, చెరువు సత్యనారాయణ శాస్త్రి, కొలచల అనంత పద్మనాభ యజ్ఞనారాయణ దీక్షితులు(క్షేమేంద్ర) గార్లను గురించి గూడా విషయ సేకరణ గావించి మలి ముద్రణలో చేరిస్తే బాగుంటుంది.

దుర్గాప్రసాద్‌గారికి ఒకందుకు నేను ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఎందుకంటే ప్రాచీనాధునాతన గీర్వాణ కవుల కవితా గీర్వాణాన్ని ఒక్కచోటగా, ఒక్కసారిగా గ్రంథరూపంలో చదివే భాగ్యాన్ని కలిగించారు. నా జన్మ చరితార్ధం అయ్యేలా చేశారు.

మొత్తంమీద సాధారణ పాఠకుల అంతరంగాకాశంలో అనంతంగా ఇంద్రధనస్సు కాంతుల్ని వెదజల్లి, ఆనందమయూర నృత్య తరంగితుల్ని గావించిన విజ్ఞానాత్మక బృహద్వ్యాస గ్రంథమిది. అంతర్జాలం ద్వారా గీర్వాణ కవుల కవితా గీర్వాణ చరిత్రద్యుతులను అపూర్వంగా ప్రదర్శించి, ఆశ్చర్యపరచిన అక్షర మహేంద్ర జాలమిది.

– డా॥ రామడుగు వేంకటేశ్వర శర్మ

సాహిత్య సేవలో 'సరసభారతి'

సాహిత్యాభిమానులందరికీ ఉగాది శుభాకాంక్షలు, అభినందనలు. సరసభారతి సాహిత్య సంస్కృతీ సంస్థ 24-11-2009న ప్రారంభమైనది. అయిదేళ్ళుగా సాహితీ సేవ చేస్తూ ఆరవ ఏడాదిలోకి అడుగుపెట్టింది అని తెలియజేయటానికి సంతోషంగా ఉంది. సరసభారతి ప్రచురించిన "సిద్ధ యోగ పుంగవులు", మహిళా మాణిక్యాలు" పుస్తకాలలో మొదటి నుంచి అప్పటిదాకా అంటే, అరవైయవ సమావేశం దాకా జరిగిన ప్రగతిని వివరంగా తెలియజేశాం. ఆ తర్వాత చేసిన కార్యక్రమాలను మీ ముందు ఉంచుతున్నాను.

21-5-2014 బుధవారం హనుమజ్జయంతి సందర్భంగా శ్రీ సువర్చలా న్జనేయ స్వామి దేవాలయంలో శ్రీమతి కొమాండూరి కృష్ణ గారిచే 61వ సమావేశంగా "దాస్య భక్తీ- శ్రీ ఆంజనేయ స్వామి" అనే అంశంపై ధార్మిక ప్రసంగం ఊర్పాటు చేశాం. శ్రీమతి కృష్ణ ఎంతో భావగర్భితంగా ప్రసంగించి అందర్నీ భక్తి భావనలో తేల్చారు. యధోచిత సత్కారం చేశాం. 62వ సమావేశం 22-5-2014 గురువారం మచిలీపట్నం సోదరులు చి|| వీరుభోట్ల పవన్‌కుమార్, చి|| వరప్రసాద్‌లచే "ఏకపాత్రాభినయం" ఏర్పాటు చేయగా, సోదరులు ఎంతో హుషారుగా చలాకీగా ఆయా పాత్రలలో తన్మయులై ధారళంగా సంభాషణలు చెప్పి గొప్ప అభినయాన్ని ప్రదర్శించి, జీవించి ఆకట్టుకొన్నారు. వారి తండ్రిగారు మూర్తిగారు వీరిని తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. సరసభారతి ఈ ముగ్గురిని ఘనంగా సత్కరించి సంస్కృతీ సేవ చేసింది. వర్ధిష్ణులైన ఆ చిరంజీవులను అందరూ అభినందించారు.

తెలుగు విద్యార్థి మాసపత్రికను సమర్థంగా అరవై ఏళ్ళు నిర్వహించిన ఆ పత్రిక సంపాదకులు, శాసన మండలి మాజీ సభ్యులు విద్యారంగంలో ఉపాధ్యాయుల సేవలో తరించిన శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు గారి మరణానికి సంతాప సభగా

23-6-14 సోమవారం ఏ.సి.గ్రంథాలయంలో సంతాప సభను 63వ సమావేశంగా జరిపి శ్రద్ధాంజలి ఘటించాం. శ్రావణమాసంలో "శ్రావణ మాసం- నోములు- విశిష్టత"పై మన దేవాలయంలో 64వ సమావేశం 29-7-14 సాయంత్రం శ్రీమతి వేదాంతం శోభాశ్రీ ప్రసంగం ఏర్పాటు చేశాం. 65వ సమావేశం శ్రీకృష్ణాష్టమి వేడుకలను 17-8-14 ఆదివారం నిర్వహించి చిన్న పిల్లలకు కృష్ణ గోపికా వేషాలలో పోటీ నిర్వహించి బహుమతులను అందించాం.

సరసభారతి అధ్యక్షులు శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ రచించిన శ్రీ మైనేని గోపాలకృష్ణగారు స్పాన్సర్ చేసి, డా. శ్రీ రాచకొండ నరసింహ శర్మ ఎం.డి.గారికి అంకితమిచ్చిన "పూర్వాంగ్ల కవుల ముచ్చట్లు" గ్రంథావిష్కరణ సభను స్థానిక ఏ.జి అండ్ ఎస్.జి.సిద్ధార్థ డిగ్రి కాలేజి ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ వారి సౌజన్యంతో డిగ్రీ విద్యార్థుల సమక్షంలో 66వ సమావేశంగా 28-8-14 గురువారం శ్రీ రాచకొండ శర్మగారి 90వ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించాం. సభాధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావుగారు- కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, శాసన మండలి మాజీ సభ్యులు శ్రీ యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి గ్రంథావిష్కరణ చేసి తొలి కాపీని విశాఖపట్నం నుండి విచ్చేసిన ప్రముఖ రచయిత స్వర్గీయ రా.వి.శాస్త్రి గారి కుమారులు శ్రీ రాచకొండ లక్ష్మీనరసింహప్రసాద్ గారికి అందజేసారు. కాలేజి ప్రిన్సిపల్ శ్రీ కొడాలి సత్య నారాయణ, శ్రీ డా॥జి.వి.పూర్ణచంద్, శ్రీ చలపాక ప్రకాష్, శ్రీమతి జోశ్యుల శ్యామలాదేవి ఆత్మీయ అతిథులుగా విచ్చేసి వేదికను సుసంపన్నం చేశారు. ఉదయం అల్పాహార విందును కాలేజి వారు ఏర్పాటు చేయగా అతిథులకు మాధ్యాహ్నం భోజనం సరసభారతి ఏర్పాటు చేసింది. ఇంగ్లీష్ లెక్చరర్ శ్రీమతి జి.సోని పుస్తకాన్ని సంక్షిప్తంగా సమీక్షించారు. గ్రంథకర్తను మైనేని గోపాలకృష్ణగారు ఏర్పాటు చేసిన 'బంగారు బ్రేస్‌లెట్' శ్రీ సుబ్బారావుగారు రచయిత చేతికి అలంకరించారు. సరసభారతి అతిథులందరికి "ఆధునిక ఆంగ్ల కవితాపిత" జియోఫ్రీ చాసర్ చిత్రం ఉన్న జ్ఞాపికలను అందజేసి శాలువాలతో సత్కరించింది. కార్యదర్శి శ్రీమతి శివలక్ష్మి, ఆంగ్ల లెక్చరర్ శ్రీమతి అరుణకుమారి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సాహిత్యం

విద్యార్థులకు చేరువ అవ్వాలన్న సరసభారతి సంకల్పం ఇలా నెరవేరింది.

కవులు, కళాకారులు జన్మించిన గ్రామంలో వారి సభలు జరపాలని నిర్ణయించి శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారి జయంతి వర్ధంతిని చిట్టూర్పులో వారి స్వగ్రామంలో జనవరి పన్నెండున నిర్వహించిన సంగతి మీకు తెలుసు. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు స్వర్గీయ శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు గారి 30వ వర్ధంతిని 67వ సమావేశంగా వారి స్వగ్రామం కాటూరులో శాఖా గ్రంథాలయంలో కాటూరు గ్రామ పెద్దల సహకారంతో 31-8-14 ఆదివారం సాయంత్రం జరిపి ఈ తరానికి పరిచయం చేసి కాటూరి ప్రజల మన్ననలు అందుకొన్నాం. శ్రీ వేమూరి కోటేశ్వర రావు, శ్రీ బాబ్జిగారు, లైబ్రేరియన్‌గారు సహకరించారు. 68వ సమావేశంగా ప్రముఖ చిత్రకారులు సినీ దర్శకులు స్వర్గీయ బాపుగారికి భాష్పాంజలిని ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో 6-9-14 సాయంత్రం నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించాం.

విజయవాడ 'రమ్యభారతి', ఉయ్యూరు 'సరసభారతి' సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు గారి శతజయంతిని విజయవాడ ఠాగూర్ లైబ్రరీలో 14-9-14 ఆదివారం ఉదయం నిర్వహించాం. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ కథారచయిత శ్రీ వేదగిరి రాంబాబు గారికి శ్రీ మైనేని గోపాలకృష్ణగారు ఏర్పాటు చేసిన "బాపు-రమణ"ల స్మారక పురస్కారం అయిదు వేల రూపాయలను సరసభారతి ద్వారా అందజేసాం. మొదటిసారిగా ఆ పురస్కారాన్ని ఆంధ్రదేశంలో ఏర్పాటు చేసిన ఘనతను శ్రీ గోపాలకృష్ణగారు, అందజేసిన ఘనత సరసభారతి, అందుకొన్న ఖ్యాతి శ్రీ రాంబాబుగారికి దక్కింది. ఇది సరసభారతి 69వ సమావేశం. ఒక వారం వ్యవధిలో మచిలీపట్నం మహతి కళా వేదికపై 21-9-14 ఆదివారం సాయంత్రం 70వ సమావేశాన్ని కృష్ణాజిల్లా రచయితల సంఘం సహకారంతో జరిపాం. ప్రముఖ చిత్రకారులు, కవి, నవలా, రచయితా శ్రీ శీలా వీర్రాజు గారికి శ్రీ మైనేని గోపాలకృష్ణగారు ఏర్పాటు చేసిన బాపు - రమణల స్మారక పురస్కారం 10,000/- రూపాయలు అందించాం. జిల్లా ఒకటవ అదనపు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ యం రామశేషగిరిరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పురస్కారాన్ని జ్ఞాపికను వీర్రాజు దంపతులకు అందజేయటం శాలువాతో సత్కరించటం చారిత్రాత్మక

విషయం. వారం వ్యవధిలో ఈ పురస్కారాన్ని ఇద్దరు ప్రముఖులకు అందజేసిన ఘనత సరసభారతికి శ్రీ మైనేని వారి వలన దక్కింది. వారి వితరణశీలతకు కృతజ్ఞతలు. శ్రీ గుత్తికొండ సుబ్బారావు, డా.శ్రీ జి.వి.పూర్ణచంద్ గార్లు ఆత్మీయ అతిధులుగా వేదికకు నిండుదనం తెచ్చారు. ఈ సభా నిర్వహణ బాధ్యతా ఖర్చు అంతా కృష్ణాజిల్లా రచయితల సంఘమే భరించింది. శ్రీ సుబ్బారావుగారు తీసుకొన్న ప్రత్యేక శ్రద్ధకు ధన్యవాదాలు అందజేస్తున్నాం. నెల రోజులలో 5 కార్యక్రమాలు నిర్వహించి రికార్డు నెలకొల్పింది సరసభారతి.

71వ సమావేశంగా కవి సమ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ గారి 38వ వర్ధంతిని వారి స్వగ్రామం నందమూరులో వారి తండ్రిగారు శోభనాద్రి గారు నిర్మించిన శ్రీ గంగా అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో 19-10-14 ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించాం. గ్రామస్తులు విశేషంగా పాల్గొని విశ్వనాధ వారి కీర్తిని ప్రస్తుతించారు. శ్రీ వల్లభనేని రమేష్‌చంద్ విశ్వనాధతో ఉన్న అనుబంధాన్ని జ్ఞప్తికి తెచ్చుకొన్నారు. విశ్వనాధ వారి మనుమలు విశ్వనాధ సత్యనారాయణ సోదరులు కూడా పాల్గొని నిండుదనం తెచ్చారు. 22-11-14 శనివారం శ్రీ సువర్చలాంజనేయ స్వామి దేవాలయంలో 72వ సమావేశాన్ని కార్తీక మాసం సందర్భంగా ధార్మిక ప్రసంగం ఏర్పాటు చేశాం. రిటైర్డ్ తెలుగు లెక్చరర్ శ్రీ నౌడూరి రమేష్‌గారు "తెలుగు కావ్యాలలో శివపార్వతి వర్ణన"పై అద్భుత ప్రసంగం చేసి శ్రోతలను భక్తి ప్రవాహంలో తన్మయులను చేశారు. నెల రోజులలో 5 సమావేశాలను నిర్వహించి రికార్డ్ నెలకొల్పింది సరసభారతి. సాహిత్యం విద్యార్ధులకు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యం 27-12-14 శుక్రవారం సాయంత్రం 73వ సమావేశంలో తీరింది. మా తెలుగు తల్లికి గేయ రచయిత స్వర్గీయ శంకరంబాడి సుందరాచారిగారి శత జయంతి సభను ఫ్లోరా విద్యాలయంలో జరిపాం. మచిలీపట్నం నుండి శ్రీ పి. వెంకటేశ్వర రావు, శ్రీ దండిభొట్ల దత్తాత్రేయ శర్మగార్లు వచ్చి సుందరాచారి గారి కవిత్వాన్ని సాహిత్య ధోరణులను చక్కగా విద్యార్ధులకు అర్ధమయ్యేట్లు వివరించి వారి ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు.

గ్రంథాలయోద్యమ సారధి, బాల సాహిత్య రచయిత, గ్రంథాలయ శాస్త్రంపై

అనేక సాధికారిక గ్రంథాలు రచించిన వారు ఉయ్యూరు ఏసి లైబ్రరీ నిర్మాణంలో పూర్తి సహకారం అందించిన వారు శ్రీ వెలగా వెంకటప్పయ్యగారి మరణానికి, ఉయ్యూరు సాహితీ మండలి సంస్థాపక సభ్యులు, ప్రస్తుత నిర్వాహకులు సాహిత్యోప జీవి శ్రీ గూడపాటి కోటేశ్వరరావుగారి మృతికి సంతాప సభనుగా ప్రత్యేక సమావేశాన్ని 31-12-14 బుధవారం సాయంత్రం ఏ సి లైబ్రరీలో నిర్వహించి వారి సేవను శ్లాఘించి నివాళులర్పించాం.

మైనేని వారి గురుభక్తికి నిదర్శనంగా ఏర్పాటు చేసిన వారి చిన్ననాటి గురువుగారు స్వర్గీయ కోట సూర్యనారాయణ గారి స్మారక నగదు పురస్కారం 10,000/- రూపాయలను సరసభారతి ద్వారా శాంతినికేతన్‌లో పదవ తరగతి చదువుతున్న ప్రతిభ ఉన్న పేద విద్యార్థిని ఛి. లంకె లావణ్యకు ఆ స్కూల్‌లో సభ జరిపి అందించాం. భగవద్గీతలో రాణిస్తున్న అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గీతను వినిపించిన కుమారి మాదిరాజు బిందు దత్తశ్రీ కి ఉన్నత విద్యాభ్యాసం ప్రోత్సాహక నగదు బహుమతి 15,000/- రూపాయలను శ్రీ గోపాలకృష్ణగారు ఏర్పాటు చేసి పంపగా, సరసభారతి తరపున శ్రీ సువర్చలాంజనేయస్వామి సన్నిధిలో అందించాం. ఉయ్యూరు హిందూ స్మశాన వాటికను ఆధునిక రీతిలో అభివృద్ధి చేస్తున్న ఉయ్యూరు రోటరీ క్లబ్ వారికి సహాయంగా పెద్ద మనసుతో శ్రీ మైనేని గోపాలకృష్ణ గారు పంపిన 25,000 రూపాయలను. శ్రీ సువర్చలాంజనేయస్వామి సన్నిధిలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీ యార్లగడ్డ నాగేశ్వరరావుగారికి సరసభారతి ద్వారా అందజేసాం. ఇన్ని రకాల వితరణలను సరసభారతి ద్వారా అందజేయించిన శ్రీ గోపాలకృష్ణగారి ధార్మిక సేవను యెంత ప్రస్తుతించినా సరిపోదు. సరస భారతిపై వారికి ఉన్న నమ్మకానికి కైమోడ్పులు. ఒక రకంగా మైనేని వారు మా సరసభారతికి "చీఫ్ పాట్ర'న్". అందుకు మాకు గర్వంగా ఉంది.

11-1-15 ఆదివారం సాయంత్రం ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో 74వ సమావేశంగా శ్రీ మైనేని గోపాలకృష్ణగారి 80వ జన్మ దినోత్సవం సందర్భంగా నిర్వహించాం. సాయంత్రం అయిదు గంటలకు సద్గురు త్యాగరాజ స్వామి

ఆరాధనోత్సవం సందర్భంగా శ్రీ పి. ఇంద్రకీలాద్రి శర్మ బృందంచే సంగీత కచేరి నిర్వహించాం. తర్వాత శ్రీ దుర్గా ప్రసాద్ రచించిన "దర్శనీయ దైవ క్షేత్రాలు" గ్రంథాన్ని నది మాసపత్రిక సంపాదకులు శ్రీ జలదంకి ప్రభాకర్ ఆవిష్కరించి మొదటి కాపీని గ్రంథశాన్ని అంకితం పొందిన మైనేని వారి మెంటార్ – కపట మెరుగని సౌజన్య సౌశీల్యమూర్తి శ్రీ కోగంటి సుబ్బారావుగారికి అందజేశారు. ఈ పుస్తకానికి, ఆ రోజు మొత్తం ఖర్చుకు స్పాన్సర్ గోపాలకృష్ణగారే. దీన్ని ప్రత్యక్ష ప్రసారం చేసి దేశ విదేశాలలో కంప్యూటర్ ఉన్న వారందరూ చూసే ఏర్పాటు చేశాం. ఒక సాహిత్య సంస్థ ఇలా లైవ్ ప్రోగ్రాం నిర్వహించటం ఇదే మొదలు. దీన్ని వీక్షించిన మైనేని గోపాలకృష్ణ దంపతులు పులకించిపోయారు. తన ఆత్మీయులు, స్నేహితులు మార్గదర్శి ఎనభై అయిదేళ్ళ జ్ఞాన వయో వృద్ధులు శ్రీ సుబ్బారావుగారికి సరసభారతి చేత పట్టుబట్టలు శాలువా, బంగారు శ్రీలక్ష్మీ నరసింహ కాయిన్, తెనాలి రామాయలంలో సంక్రాంతి వేదుక ఉన్న ప్రత్యేక జ్ఞాపిక, సరసభారతి గ్రంథాలు అందజేశారు. కోగంటి వారి కుటుంబ సభ్యులు, హితులు, సన్నిహితులు తెనాలి నుండి తరలి వచ్చి పాల్గొని ఎంతో నిందుదనం తెచ్చారు. గోపాలకృష్ణగారి బావగారు శ్రీ అన్నే హనుమంతరావు చెల్లెలు శ్రీమతి హేమలత, కోగంటి వారి అల్లుడు శ్రీ రామినేని భాస్కరేంద్ర రావు వారి కుమార్తె శ్రీమతి శ్రీదేవి, కోగంటి వారి పెద్ద కుమారుడు శ్రీ శివప్రసాద్ కోడలు శ్రీమతి పుష్పలత, స్నేహితుడు శ్రీ అన్నే వెంకటేశ్వర్లు దంపతులు, కోగంటి వారి మనుమలు వారి శ్రీమతులు మనుమరాళ్ళు అందరూ హాజరై పెళ్లి వేడుకను చేశారు. వచ్చిన వారందరితోబాటు సరసభారతి కోశాధికారి ఈ కార్యక్రమం ఇంత ఘనంగా జరగటానికి కృషి చేసిన శ్రీ గబ్బిట వెంకట రమణ, శ్రీమతి మహేశ్వరి దంపతులకు మైనేనిగారు అందజేసిన నూతన వస్త్రాలు, శాలువా, జ్ఞాపిక అందజేశాం. అందరికీ ఆత్మీయ సత్కారం జరిపాం. గ్రంథకర్త శ్రీ దుర్గాప్రసాద్ శ్రీమతి ప్రభావతి దంపతులకు శ్రీ ప్రభాకర్, శ్రీ సుబ్బారావుగార్లు ఘన సత్కారం చేసి నూతన పట్టు వస్త్రాలు, శాలువా, జ్ఞాపికలను మైనేని వారి తరపున అందజేశారు. శ్రీ చలపాక ప్రకాష్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. 500 పుస్తకాలను సభకు వచ్చినవారికి,

తెనాలి వారికి, మదన పల్లి వారికి అందజేశాం. శ్రీ దుర్గాప్రసాద్‌గారి గురువుగారు మాజీ డ్రిల్ మాస్టారు శ్రీ ఎస్.వి. సుబ్బారావు గారు శిష్య వాత్సల్యంగా దుర్గాప్రసాద్ గారికి నూతన వస్త్రాలు, శాలువా బహూకరించి సాహితీ సేవను ప్రస్తుతించి ఆశీర్వదించారు. కన్నుల పండువుగా జరిగిన ఈ సమావేశం చారిత్రాత్మకంగా నిలిచింది.

సభ ప్రారంభానికి ముందు అందరికి స్వీటు, హాట్ అందజేసి టీ ఇచ్చాం. మధ్యలో బిస్కట్లు మళ్ళీ తేనీరు అందించాం. సభానంతరం అందరికి షడ్రసోపేతమైన విందు ఏర్పాటు చేశాం. వచ్చిన వారందరూ సంతృప్తిగా భోజనం చేసి ఆనందించి అభినందించారు. ఇంత గొప్ప సభకు నూటపాతిక మందికి పైగా సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమ నిర్వహణలో శ్రీ వీరమాచనేని బాలగంగాధరరావు గారు, శ్రీమతి శివలక్ష్మి, శ్రీ గబ్బిట వెంకట రమణగారు, శ్రీ వెంట్రప్రగడ ఆంజనేయులుగారు ఎంతో తోడ్పడ్డారు. వీరందరికీ శాలువా, జ్ఞాపిక, పుష్పహారం చందన తాంబూలాలతో సత్కరించాం. ఇందరి సమిష్టి కృషియే ఈ విజయానికి కారణం. సరసభారతిపై ఉన్న అభిమానానికి నిదర్శనం. అందరికి కృతజ్ఞతలు.

75వ సమావేశంగా భావకవి, ఆంధ్రా షెల్లీ స్వర్గీయ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిని ఈతరం విద్యార్థులకు పరిచయం చేసే కార్యక్రమం అమరవాణి హైస్కూల్‌లో 25-2-15 బుధవారం జరిపాం. శ్రీ దుర్గాప్రసాద్- కృష్ణశాస్త్రి గారితో తనకున్న ప్రత్యక్ష పరిచయాన్ని, మద్రాసులో వారింటికి నాలుగైదు సార్లు వెళ్ళిన విషయమూ వారి కుటుంబంతో మద్రాసులో ఉన్న వారి పెద్దక్క పెద్దబావగారు కీ.శే.గాడేపల్లి లోపాముద్ర, కృపానిధి గారల బంధుత్వమూ వారు తనను తన మేనకోడలు సత్యకళను కారులో త్యాగరాజనగర్, పాండీబజార్‌లలో త్రిప్పిన మధురమైన రోజులను గుర్తు చేసుకొన్నారు. కృష్ణశాస్త్రిగారు కాటూరి వెంకటేశ్వరరావు గారు తమ చిన్నతనంలో ఉయ్యూరులో వారింటికి వచ్చి రెండు గంటలు తమ తలిదండ్రులతో మాట్లాడిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకొన్నారు. శ్రీమతి మందరపు హైమవతి చక్కని ప్రసంగం చేసి విద్యార్థులకు కృష్ణశాస్త్రి గారి జీవితం, వ్యక్తిత్వం

రచనలను సుభోదకంగా వివరించారు. "కృష్ణశాస్త్రిగారిని చూసి మాట్లాడిన దుర్గాప్రసాద్ గారు ధన్యజీవులు. వీరింటికి వారు, వారింటికి వీరు వెళ్ళిన బాంధవ్యం గొప్పది. దుర్గాప్రసాద్ గారికి నా పాదాభివందనాలు" అని ఉద్వేగంతో ఆనంద పులకంకితంగా చెప్పారు. వారికి ప్రిన్సిపల్ శ్రీ పి.నాగరాజు, ఉపాధ్యాయ బృందం గొప్ప సహకారం అందజేసారు. కృష్ణశాస్త్రి గారి జీవితం సాహిత్యంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాం. శ్రీ మాదిరాజు శ్రీనివాసశర్మ, శ్రీ జాన్సన్ గార్లు కృష్ణశాస్త్రి సినీ సంగీతాలను మధురాతి మధురంగా గానం చేసి రస డోలికలో ఊపేశారు. శాస్త్రి గారి గీతం "జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి" గానం చేసిన విద్యార్థులందరికీ సరసభారతి బహుమతులను అందించి విద్యార్థులకు సాహిత్యం చేరువ చేయాలన్న మా సంస్థ ఆశయం ఇలా మళ్ళీ నెరవేరింది.

శ్రీ మన్మథ నామ సంవత్సర ఉగాది వేడుకలుగా 76వ సమావేశాన్ని 15-3-15 ఆదివారం నిర్వహిస్తున్నాం. శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్, డా.శ్రీ శలాక రఘునాధ శర్మ, డా. శ్రీ రామడుగు వెంకటేశ్వరశర్మ, శ్రీ గుత్తికొండ సుబ్బారావు, ఆచార్య మన్నవ సత్యనారాయణగార్లకు సరసభారతి అధ్యక్షులు శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారు తమ తలిదండ్రులు స్వర్గీయ గబ్బిట భవానమ్మ, శ్రీ మృత్యుంజయ శాస్త్రి గారల స్మారక ఉగాది పురస్కారాలను అందజేస్తున్నారు. ప్రోత్సాహక పురస్కారాలుగా శ్రీ కళాసాగర్, శ్రీమతి గొన్నాబత్తుల శిరీష, శ్రీ బాషా (ఈనాడు), శ్రీ రాజా (మన ఛానల్), శ్రీ గూడవల్లి రామారావు (పోస్ట్ మాస్టర్, ఉయ్యూరు), శ్రీ ఫజులాల్ మొయిద్ (జాగృతి పొదుపు సమకార సంస్థ, ఉయ్యూరు)కు అలాగే "స్వయం సిద్ధ" ప్రత్యేక పురస్కారాన్ని శ్రీమతి పెద్దిభొట్ల సౌభాగ్య లక్ష్మి (తెలుగు పండిట్, ఉయ్యూరు) గారికి శ్రీ దుర్గాప్రసాద్ దంపతులు అందజేస్తున్నారు.

శ్రీ దుర్గాప్రసాద్ రచన "గీర్వాణ కవుల కవితా గీర్వాణం" గ్రంథాన్ని శ్రీ మంగళగిరి ఆదిత్య ప్రసాద్ ఆవిష్కరిస్తారు. ఈ గ్రంథం అంకిత స్వీకర్త శ్రీ మైనేని గోపాలకృష్ణ గారికి, దీన్ని స్పాన్సర్ చేసి సరసభారతి తరుపున ముద్రిస్తున్న శ్రీ మైనేని వారి మేనకోడలు డా. శ్రీమతి జ్యోతిగారికి, వారి సోదర సోదరీమణులకు

(అమెరికా) ధన్యవాదాలు, కృతజ్ఞతలు. సరసభారతి మిత్రులు ప్రముఖ హాస్యరచయిత శ్రీ తాడిమేటి సత్యనారాయణ రచన "త్యాగి పే'రెడీలు+" పుస్తకాన్ని సరసభారతి తరుపున ముద్రించి ఈ సభలో శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్ గారిచే ఆవిష్కరింపజేస్తున్నందుకు ధన్యవాదాలు. దీనితో సరసభారతి ప్రచురణలు 16, అందులో శ్రీ దుర్గాప్రసాద్ గారి రచనలు 10.

80మంది ప్రముఖ కవులతో "నవ్యాంధ్ర ప్రదేశ్" అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహిస్తున్నాం. ముఖ్య అతిధిగా విచ్చేసే శాసన మండలి మాజీ సభ్యులు శ్రీ వై.వి.బి.రాజేంద్రప్రసాద్, ఆత్మీయ అతిధులు శ్రీ జంపాన పూర్ణచంద్రరావు (ఉయ్యూరు నగర పంచాయితీ ఛైర్మన్), శ్రీ చలసాని రాజేంద్రప్రసాద్ (ఆంధ్రజ్యోతి ఇంఛార్జ్, విజయవాడ), డా.శ్రీ జి.వి.పూర్ణచంద్, శ్రీ కలిమిశ్రీ (మల్లెతీగ మాసపత్రిక సంపాదకులు) మొదలైన వారికి ధన్యవాదాలు. సరసభారతి అధ్యక్షులు నితోత్సాహి శ్రీ దుర్గాప్రసాద్, 'సరసభారతి- శ్రీ సువర్చలాంజనేయ స్వామి' అనే రెండు బ్లాగులను నిర్వహిస్తున్నారు. వీటి వీక్షకుల సంఖ్య మూడు లక్షల పాతిక వేలు అంటే అందరికీ ఆశ్చర్యమేస్తోంది. మా గౌర్వాధ్యక్షులు శ్రీమతి జోశ్యుల శ్యామలాదేవి, కోశాధికారి శ్రీ గబ్బిట వెంకట రమణ, సాంకేతిక నిపుణులు శ్రీ వి.బి.జి.రావు మిగిలిన కార్యవర్గ సభ్యులకు వారందిస్తున్న సహకారానికి సేవకు సరసభారతి కృతజ్ఞతాభి వందనాలందిస్తోంది. సరసభారతి కార్యక్రమాలకు హాజరవుతూ ప్రోత్సహిస్తున్న సాహిత్యాభిమానులకు కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేర్చి సహకరిస్తున్న మీడియా మిత్రులకు సదా కృతజ్ఞతలు. మా కార్యవర్గ సభ్యుల సహకారం మరువలేనిది. అందరికి శ్రీ మన్మథనామ ఉగాది శుభాకాంక్షలతో కృతజ్ఞతాభినందన వందనాలు.

- మాదిరాజు శివలక్ష్మి

సరస భారతి కార్యదర్శి

విషయ సూచిక

1. అపర శంకరులు – శంకర భగవత్పాదులు 31
2. ముకుంద మాల రాజకవి – కులశేఖరాళ్వార్............ 38
3. అర్ధ శాస్త్ర రచయిత – కౌటిల్యుడు 48
4. భరతనాట్య సృష్టికర్త – భరత ముని 52
5. కవికుల గురువు – కాళిదాసు మహాకవి 54
6. యమక చక్రవర్తి – ఘటకర్పకుడు (పగిలిన కుండ) 58
7. వ్యాస వాల్మీక సమానుడు – గుణాఢ్యుడు 61
8. బౌద్ధ వేదాంతి, కవి – అశ్వ ఘోషుడు 65
9. నైషధ కర్త – శ్రీహర్షుడు 69
10. "మట్టి బండి" ప్రకరణ కర్త – శూద్రక మహాకవి 73
11. చోళ రాజ్య చరిత్ర రాసిన – విరూపాక్ష కవి 76
12. ముద్రారక్ష నాటక కవి – విశాఖ దత్తుడు 77
13. గద్య మహాకావ్య రచయిత – సుబంధు..82
14. సింహళ రాజ కవి – కుమార దాసు 85
15. కవితా కామిని దరహాసమే – భాస మహాకవి 88
16. అర్ధ గౌరవాన్ని అందలం ఎక్కించిన కవి – భారవి 95
17. వేణీసంహార నాటకకర్త – భట్ట నారాయణుడు 101
18. సుభాషిత శతకకర్త – భర్తృహరి మహారాజు 108
19. సూర్య శతక కర్త – మయూరుడు 111
20. అలంకార శాస్త్రకర్త, వచన పితామహుడు – దండి 115
21. శృంగార శతక కర్త – అమరుక కవి 118
22. జైన కవి – జట సింహనంది 121
23. బౌద్ధ నాటక కర్త – హర్షవర్ధనుడు 122
24. వచన బాణం – భట్ట బాణుడు 126
25. చిత్రగర్భ కవితా సంపన్నుడు – మాఘుడు 131
26. తొలిశాస్త్ర కావ్య కవి – భట్టి 136
27. మొదటి శ్రవ్యకావ్య అలంకారికుడు – భామహుడు 139

28. ప్రాకృత కావ్య కవి రాజు - వాక్పతి రాజు 142
29. శాంతాన్ని నవమ రసంగా చెప్పిన - ఉద్భటుడు 143
30. దిగంబర జైనకవి - "అసగ" 145
31. కరుణ రసానుభూతి - భవభూతి-1 147
32. తృతీయ పంథా తొక్కిన - మురారి 160
33. వసంత తిలక వృత్త - రత్నాకరుడు 164
34. ఆశ్చర్య చూడామణి నాటకకర్త - శక్తి భద్రుడు 166
35. సూత్ర పద్ధతిలో అలంకార గ్రంథం రాసి కావ్యాత్మను చెప్పిన - వామనుడు 168
36. ధ్వన్యాలోక కర్త - ఆనంద వర్ధనుడు 171
37. బాల కవి - రాజశేఖరుడు 175
38. భల్లట కవి 180
39. ప్రేయోరస ప్రతిపాదకుడు - రుద్రటుడు 182
40. వికట నితంబ 185
41. వక్రోక్తి విన్యాసి - రాజానక కుంతక కవి 186
42. అభివ్యక్తివాద వ్యాపకుడు - అభినవ గుప్తుడు 188
43. ఔచిత్య సిద్ధాంతకర్త, నాటక కర్త - క్షేమేంద్రుడు 190
44. కవి శిక్ష రాసిన - మొదటి వాగ్భటుడు 193
45. యశస్తిలక కర్త - సోమప్రభ సూరి 194
46. మహారాజ కవి - భోజుడు 195
47. ప్రబోధ చంద్రోదయ నాటకకర్త - కృష్ణ మిశ్రుడు 199
48. వ్యంజనా వృత్తి కారుడు - ముమ్మటుడు 201
49. కుందమాల నాటక రచయిత దిజ్ఞాగుడు 203
50. లీలాశుకుడనే - బిల్వ మంగళుడు 206
51. ఆర్యా సప్తశతి కర్త - గోవర్ధనాచార్యుడు 208
52. కావ్యశాస్త్ర కర్త - హేమ చంద్రాచార్యుడు 210
53. పృధ్వీ రాజ చరిత్ర కర్త - జయాంకుడు 211
54. నవ సాహసాంక చరిత్రకర్త - పరిమళ పద్మ గుప్తుడు 212
55. ద్వ్యర్థికవి రాజు - కవిరాజు 214
56. అలంకార సర్వస్వం కర్త - రుయ్యకుడు 216
57. రాజ తరంగిణి కర్త - కల్హణుడు 217

58. వీరశైవ కవి - ఉదాహరణ కావ్య నిర్మాత -
పాల్కురికి సోమనాధుడు 219
59. అష్టపదుల - జయదేవుడు 225
60. జైన కవి రుషి - జిన రత్న 229
61. నృత్త రత్నావళి రాసిన జాయపసేనాని 231
62. వేదాంత దేశికులు 233
63. ప్రతాప రుద్ర యశోభూషణ కర్త - విద్యానాధుడు 236
64. సాహిత్యాంబుధిని ఆపోశన పట్టిన - అగస్త్యుడు 239
65. ప్రతాప రుద్రరాజ కవి 241
66. నల చంపువును రాసిన - త్రివిక్రమ భట్టు 242
67. రస తరంగిణి కర్త, మాయా రస ప్రతిపాదకుడు- భానుదత్తుడు 243
68. మహా వ్యాఖ్యాన పండితుడు - కోలాచలం మల్లినాధసూరి 245
69. సాహిత్య దర్పణ రచయిత - విశ్వనాధుడు 250
70. విద్యారణ్యుల శిష్యుడు, గద్య కవి - వామన భట్ట బాణుడు 251
71. రాణి కవయిత్రి - గంగా దేవి 254
72. వసంత రాజీయం రచించిన - కుమారగిరి రెడ్డి 256
73. సాహిత్య చింతామణి కర్త - పెదకోమటి వేమభూపాలుడు 257
74. సంగీత సాహిత్యాలలో కూడా రాజు - సింగ భూపాలుడు 258
75. ఛందో శాస్త్రం రాసిన - రెండవ వాగ్భటుడు 260
76. హమ్మీర చరిత్ర కర్త - నయ చంద్రసూరి 261
77. కంచు ఢక్కల - గౌడ డిండిమ భట్ట కవి సార్వభౌముడు 262
78. భక్తిరస స్థాపకుడు - రూప గోస్వామి 263
79. స్వభావోక్తి కవయిత్రి మురళ 266
80. ప్రణయ కవయిత్రి - మోరిక 267
81. అభినవ కాళిదాసు 268
82. చంపూ భారత కర్త - అనంత భట్టు..269
83. సాహితీ సమరాంగణ సార్వభూముడు - శ్రీకృష్ణదేవరాయలు 271
84. సిద్ధయోగి పుంగవుడు - అప్పయ్య దీక్షితులు 272
85. రూప గోస్వామి శిష్యుడు - గోస్వామి కర్ణ పూరుడు 278
86. పట్టపు రాణి కవయిత్రి - నంజన గూడు తిరుమలాంబ 279

87. వసుచరిత్ర చంపువు కర్త - కాళహస్తి కవి 281
88. రస గంగాధర కర్త - జగన్నాథ పండితరాయలు 283
89. భక్తికి శాస్త్రీయత కల్పించిన - మధుసూదన సరస్వతి 289
90. హోయసల రాజ చరిత్ర రాసిన - సకల విద్యా చక్రవర్తి 290
91. తానీషా రాజ గురువు - అక్బర్ షా...291
92. సంస్కృత ద్వ్యర్థి కావ్య కవి - వేంకటాధ్వరి 292
93. తంజావూర్ కృష్ణదేవరాయలు - రఘునాథ రాయలు 293
94. ఆస్థాన కవయిత్రి - రామ భద్రాంబ 295
95. మౌలికత ఉన్న కవయిత్రి - గౌరీ 296
96. ప్రకృతి కవయిత్రి - పద్మావతి 296
97. చమత్కార సిద్ధాంత కర్త - విశ్వేశ్వరుడు...297
98. కృష్ణలీలా తరంగిణి కర్త - నారాయణ తీర్థులు 298
99. భాషార్ణవ కర్త - నుదురుపాటి వెంకన్న 299
100. కిల్లినూర్ రాజ - రాజవర్మ 300
101. ధర్మ సింధు సారం కర్త - కొల్లూరు కామశాస్త్రి 301
102. షడ్దర్శన తత్త్వావగాహి - ముడుంబై నరసింహాచార్య స్వామి 302
103. మహా వ్యాఖ్యానకర్త, శ్రీ సత్యనారాయణ స్వామి ప్రతిష్ట చేసిన -
అద్దేపల్లి కృష్ణశాస్త్రి 304
104. శివాజీ చరిత్ర రాసిన - అంబికా దత్త వ్యాసుడు...............................306
105. "నాయన" కావ్య కంఠ వాసిష్ట గణపతి 307
106. బహు భాషావేత్త - అభినవ కాళిదాసు పండిత భట్ట మధురానాథ శాస్త్రి 308
107. వ్యుత్పత్తి నిఘంటు రచయిత - తాత వెల్లి మిరాచార్ శేషగిరి శాస్త్రి 312
108. కౌముది పాఠ ప్రవచన శ్రేష్ట - శౌంఠి భద్రాది రామశాస్త్రి 314
109. రావు బహదూర్ - కిడాంబి రామానుజాచార్యులు 315
110. తర్క తీర్థ - ఆదిభట్ల రామమూర్తి శాస్త్రి 317
111. షేక్స్‌పియర్ నాటక కథలు సంస్కృతంలో రాసిన -
మేడేపల్లి వెంకట రమణాచార్యులు 319
112. క్రోడ పత్ర రచయిత - గుమ్మలూరి సంగమేశ్వర శాస్త్రి 321
113. సంస్కృతంలోనే ఉత్తరాలు రాసిన - నాగపూడి కుప్పుసామయ్య 323
114. బహుగ్రంథ పరిష్కర్త, బహుభాషా కోవిదులు -

మానవల్లి రామకృష్ణ కవి 324
115. గురువులకు గురువు, సర్వ శాస్త్రవేత్త - శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రి 327
116. అవధూత - శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర యతి 331
117. ఖచర మణి పేటికర్త, సకల శాస్త్రాభిజ్ఞ -
అలుకూరు గోల్లాపిన్ని మల్లికార్జున శాస్త్రి 334
118. ఆంధ్ర ఆస్థాన కవి - శ్రీ కాశీ కృష్ణాచార్యుల వారు 339
119. సంస్కృత హరికథలు రాసిన - బంకుపల్లి మల్లయ్య శాస్త్రి 342
120. న్యాయ భూషణ, న్యాయ స్థాపక -పేరి లక్ష్మీ నారాయణ 345
121. వైయాకరణి - వజ్ఝల చిన సీతారామ శాస్త్రి 347
122. కళానిధి, విద్యా వాచస్పతి - విక్రాల రామచంద్రా చార్యులు 349
123. భారతీయ గణితశాస్త్రాన్ని కొత్త మలుపు త్రిప్పిన జగద్గురు -
శ్రీ భారతీ కృష్ణ తీర్థజీ మహారాజ్ 352
124. కాళిదాస సములు - శ్రీ పేరి కాశీనాథ శాస్త్రి 355
125. పండిత ప్రవర - మల్లాది రామకృష్ణ చయనులు 356
126. ధర్మ శాస్త్ర నిధి, న్యాయాధీశ కవి - గుండేరావు హర్కారే 358
127. కావ్య తీర్థ - శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి 361
128. బాలవ్యాస, వ్యాకరణాలంకార - వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి 363
129. ఆధునిక యుగ మహా గీర్వాణ పండిత కవి -
వేదాల తిరువేంగళాచార్యులు 365
130. అజాత శత్రువు - పళ్ళెపూర్ణ ప్రజ్ఞాచార్యులు 367
131. తెనాలి రాముని కథలను సంస్కృతీకరించిన ఆ జన్మ సిద్ధ కవి -
సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి 369
132. రాజగురు, విద్యా వాచస్పతి - విద్యాధర శాస్త్రి 372
133. స్వాతంత్ర్య సమరయోధ కవి పండితులు -
శ్రీ జటావల్లభుల పురుషోత్తం 375
134. అభినవానంద వర్ధన, రస జగన్నాథ-
శ్రీ జమ్మలమడక మాధవరామ శర్మ 380
135. స్వర్ణ కమల గ్రహీత, నడిచే పాణిని -
పేరి సూర్యనారాయణ శాస్త్రి 385
136. కులపతి - కప్పగంతుల

సుబ్రహ్మణ్య శాస్త్రి **388**
137. ఆంధ్ర బిల్హణ - కప్పగంతుల లక్ష్మణశాస్త్రి **390**
138. శంకరాద్వైత నిష్ణాతులు - చదలవాడ సుందర రామశాస్త్రి **393**
139. గణితావధాన శేఖర - పులివర్తి శరభాచార్యులు **394**
140. రేడియోలో సంస్కృత పాఠాలు బోధించిన సర్వోదయ ప్రచారకులు
- కే.వేం.నృ.అప్పారావు **396**
141. రాయల్ సొసైటీ సభ్యుడు - రాం కరణ్ శర్మ **399**
142. సాహిత్య రత్న రహస్ బిహారీ ద్వివేది **401**
143. విద్యా సాగరుడైన ఆచార్య జ్ఞాన సాగర్ **402**
144. సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత - రేవా ప్రసాద్ ద్వివేది **403**
145. జగద్గురు శ్రీరామ భద్రాచార్య **405**
146. శతావధాని - గణేష్ **407**

గీర్వాణ కవుల కవితా గీర్వాణం



1. అపర శంకరులు - శంకర భగవత్పాదులు (509 bc)

కేరళలో కాలడి గ్రామంలో జన్మించిన అపర శివావతారులే ఆది శంకరాచార్యులు. అద్వైత మత స్థాపకాచార్యులు త్రిమతాచార్యులలో ప్రధములు. జగద్గురువులుగా భావింపబడ్డారు. కాలంపై భిన్నాభిప్రాయాలున్నాయి. కాని క్రీ.శ.780–820 అని అందరూ అంటారు. "దుష్టాచార్య వినాశాయ ప్రాతుర్భూతో మహీతలే - స ఏవ శంకరాచార్యః సాక్షాత్ కైవల్య నాయక: - శ్రోత స్మార్త ప్రతిష్టార్థం భక్తానాం హితకామ్యయా - కరిష్యత్సవతారం స్వం శంకరో నీల లోహిత:" అని శివ రహస్యంలో ఉంది. స్వయానా పరమ శివుడే వేద విహిత కర్మలను వ్యాపింపజేయటానికి, దుష్టాచారాలను నిర్మూలించటానికి భూమిపై అవతరించాడని తాత్పర్యం. విద్యారణ్య స్వామి రచించిన "శంకర విజయమే" అందరికి ఆధారం. దానినిబట్టి శంకరాచార్య కాలడిలో ఆర్యాంబ శివగురువులకు పూర్ణా నది ఒడ్డున జన్మించారు. తలిదండ్రులు వృషా చలం కొండమీద ఉన్న శివుడిని ప్రార్థించి ఆయన అనుగ్రహంతో శంకరుడికి జన్మనిచ్చారు. వైశాఖ శుద్ధ పంచమి, ఆర్ద్రా నక్షత్రంలో సూర్య, శని కుజ, గురులు ఉచ్ఛస్థితిలో ఉండగా

జన్మించారు. కంచి మఠం రికార్డుల ప్రకారం ఆదిశంకరుల జననం క్రీ.పూ. 509.

శంకరుని బాల్యంలోనే తండ్రి చనిపోయారు. తల్లి ఆర్యాంబ పిల్లవాడిని పెంచి ఉపనయన సంస్కారం చేయించింది. ఏక సంతాగ్రాహి అయిన ఈ బాలుడు వేదవిద్యలన్నీ చిరుప్రాయంలోనే అభ్యసించాడు. బాల బ్రహ్మచారిగా ప్రతి ఇంటా భిక్షాటన చేసేవాడు. ఒకరోజు ఒక ఇంటిముందు భిక్షాం దేహీ అని అన్నప్పుడు ఆ ఇంటి ఇల్లాలు కడు పేదరికంతో ఉండటం వలన ఉసిరికాయలను మాత్రమే భిక్షా పాత్రలో వేసి కన్నీటితో నిలబడింది. అర్థం చేసుకొన్న బాల శంకరుడు ఆశువుగా లక్ష్మీదేవిని “కనక ధారా స్తోత్రం”తో ప్రసన్నం చేసుకొని ఆ ఇంటిముందు బంగారు నాణాలు రాలేట్లు అమ్మవారి అనుగ్రహం పొందాడు. ఆ ఇల్లాలి ఇక్కట్లు తీర్చాడు. తల్లి ఆర్యాంబ పూర్ణా నది నుండి రోజూ నీరు తెచ్చుకోలేకపోతుంటే నదినే ఇంటి ముందు ప్రవహింపజేసి అందరికి ఆశ్చర్యం కలిగించాడు.

బాల శంకరులకు సన్యాసంపై మనసైంది. ఒక్కగానొక్క కొడుకు ఇలా అయితే ఎలా అని తల్లి అడ్డు చెబుతోంది. ఒకరోజు పూర్ణా నదిలో స్నానం చేస్తూ ఉండగా మొసలి కాళ్ళను పట్టి లాగేస్తుంటే ఒడ్డున ఉన్న తల్లిని ఇప్పటికైనా సన్యాస స్వీకారానికి అంగీకరించని వేడుకొన్నాడు. తల్లి మనసూ కరిగి సరేనంది. మనస్సాక్షిగా సన్యాసి అయ్యాడు. దీనిని “ఆతుర సన్యాసం” అంటారు. సన్యాస స్వీకార మంత్రాలు జపిస్తుండగానే మొసలి పట్టు వదిలేసింది. జీవితాంతం సన్యాసిగా ఉండిపోతానని శపథం చేశాడు. విద్య మీద మక్కువ ఎక్కువై తగిన గురువు కోసం ఉత్తర దేశ యాత్రకు బయల్దేరుతూ తల్లి అనుమతి పొందాడు. ఆమె ఏ సమయంలో ఎప్పుడు మనసులో తానూ రావాలని అనుకుంటుందో ఆ సమయానికి ఆమె ముందు వచ్చి వాలుతానని తానూ యతి అయినా ఆమె అంత్య సంస్కారాలను తన చేతులమీదుగానే చేస్తానని ప్రతిజ్ఞ చేసి బయలుదేరాడు.

గురు దర్శనం - విద్యా వ్యాసంగం

కాలి నడకన బయల్దేరిన శంకరుడు మధ్య భారతంలోని నర్మదా నది ఒడ్డున ఉన్న గౌడ పాదుల శిష్యుడైన గోవింద భగవత్పాదులున్న గుహను చేరాడు. వ్యాస మహర్షి కుమారుడైన శుక మహర్షియే, గౌడపాదులని అంటారు. గోవింద

భగవత్పాదులకు శంకరుడు నమస్కరించాడు. ఆయన "ఎవరు నువ్వు?" అని అడిగాడు. వెంటనే శంకరుడు - "న భూమి ర్నతోయం నతేజో నవాయు ర్మఖంనేంద్రియం వా నతేషాంసమూహ: - అనైకాన్తికత్వా త్సుషు ప్త్యైక సిద్ధి స్తదేకోవ శిష్ట శ్శివోహం శివోహం" అంటూ పది శ్లోకాలను ఆశువుగా చెప్పాడు. వీటికే "దశ శ్లోకి" అని పేరు. ఇంత విజ్ఞానాన్ని మూట కట్టుకొచ్చిన ఆ శంకరుడు సాక్షాత్ శివుడే అని గ్రహించారు గోవిందపాదులు. "స ప్రాహ శంకర స శంకర ఏవ సాక్షాత్" అంటే భూమికి దిగి వచ్చిన శంకరుడే ఈ శంకరుడు అని మెచ్చారు. వెంటనే గోవిందపాదులకు పాదపూజ చేశాడు శంకరుడు. బ్రహ్మ జ్ఞానాన్ని, ఉపపనిషత్ సారాన్ని నాలుగు మహా వాక్యాలతో గురువు శిష్యుడికి బోధించారు. ఒకరోజు అకస్మాత్తుగా నర్మదా ఉధృతంగా వరద వచ్చి భగవత్పాదుల తపస్సుకు భంగం కలిగిస్తుంటే "ఓంకార శక్తితో" నది ప్రవాహాన్ని తగ్గించాడు. గురువు వద్ద విద్యాభ్యాసం పూర్తి అయిన వెంటనే గురువు ఆదేశంపై బ్రహ్మ సూత్రాలకు భాష్యం రాయటానికి పండితలోక వాసి అయిన కాశికి చేరాడు శంకరుడు.

శ్రీశంకర కవితా గీర్వాణం

వారణాసి చేరి గంగా స్నాన పులకితులై విశ్వేశ్వర దర్శనం అంటే నిజ దర్శనమేగా చేసుకొన్నారు శంకరులు. వేద విచారణ చేసి సూక్ష్మాలు గ్రహించారు. అక్కడ సదానందుడు మొదటి శిష్యుడైనాడు. కాశీ వీధుల్లో తిరుగుతుంటే ఒక చండాలుడు నాలుగు శునకాలతో ఎదురౌతాడు. శంకరుడు అతన్ని దారి తొలగమంటాడు. ఆతను తప్పుకోకుండా "అన్నమయాత్ అన్నమయం అధవా చైతన్య మయాత్ చైతన్యం - ద్విజ వర దూరీకృతం వాంచసి కిం బ్రూహి గచ్ఛ గచ్ఛతి" అన్నాడు. అంటే "అన్నిటికీ ఆధారమైన అన్నంతో ఈ శరీరం నిర్మితమైంది. అడ్డు తప్పుకోమన్నది శరీరాన్నా, లోపలి ఆత్మనా?" అన్నాడు. సాక్షాత్తు పరమ శివుడే నాలుగు వేదాలతో ప్రత్యక్షమయ్యాడని గ్రహించి శంకరులు పాదాక్రాంతులయ్యారు. మహేశ్వరుడిని "మనీషా పంచకం"తో స్తోత్రం చేశాడు. శివుడు అపర శివుడికి కర్తవ్య బోధ చేశాడు. వేదవ్యాస ప్రణీతమైన బ్రహ్మ సూత్రాలకు ఇంతవరకు లేనట్టి అద్భుత భాష్యం, రాసి దేవతలచే ప్రశంసలు పొంది వాటి

వ్యాప్తికి శిష్యులను దేశమంతా పంపమని హితవు చెప్పాడు. ఈ పనులు పూర్తిచేసి తనను చేరాలని చెప్పి అదృశ్యమయ్యాడు శివుడు. పన్నెండేళ్ళ వయసులోనే భగవత్పాదులు బ్రహ్మసూత్ర భాష్యం రాశారు. భగవద్గీతకు ఉపనిషత్తులకూ అంటే ప్రస్తాన త్రయానికి భాష్యాలు రాశారు ఆ లేత వయసులో, పండిన జ్ఞానంతో.

పరమ శివుని అనుజ్ఞతో బదరికా వనం చేరాడు. అక్కడ పండిత గోష్టులు జరిపారు. బదరి నుండి కాశీకి తిరిగి వచ్చి బ్రహ్మసూత్ర భాష్యాల సారం అయిన అద్వైతాన్ని శిష్యులకు, ప్రజలకు బోధించటం ప్రారంభించారు. సనత్సు జాతీయం, విష్ణు సహస్ర నామం, లలితా త్రిశతి, నృసింహిత పాణిలకు భాష్యాలు పూర్తి చేశారు. ఒకరోజు శిష్యులకు బోధిస్తుండగా వ్యాస మహర్షి వృద్ధ బ్రాహ్మణ వేషంలో వచ్చి ఎనిమిది రోజులు ఆయనతో వాదించాడు. వచ్చినవాడు వ్యాసర్షి అని పద్మపాదుడు శంకరులకు తెలియజేస్తే పాదాలపై వ్రాలి పూజించారు. బ్రహ్మ సూత్రాలకు అసలైన అర్ధాన్ని గ్రహించింది శంకరాచార్యులు మాత్రమేనని కృష్ణ ద్వైపాయన వ్యాసుడు ప్రస్తుతించి ఆశీర్వదించాడు. తాను ఈ ప్రపంచంలోకి వచ్చిన పని పూర్తి అయిందని శరీరం చాలించటానికి అనుమతిమ్మని వ్యాసుని వేడాడు. అప్పుడు వ్యాస భగవానులు “నీ అసలు ఆయుర్దాయం ఎనిమిదేళ్ళు. అగస్త్యాది మహర్షులు వరంతో మరో ఎనిమిదేళ్ళు పొందావు. నేను ఇంకా నీకు పదహారేళ్ళ ఆయుర్దాయాన్ని ప్రసాదిస్తున్నాను. వేద విహిత కార్యప్రచారం చేయి. దీనికి విరుద్ధమైన మతాలను చీల్చి చెండాడి అద్వైతానికి పట్టం కట్టే పని నీ వల్లనే సాధ్యం అందుకే నీ ఆయుష్షు పొడిగిస్తున్నాను” అని అదృశ్యమైనాడు.

స్తోత్ర రత్నాలు

జ్ఞానులకు మోక్షగాములకు ప్రస్థాన త్రయ భాష్యం రాసిన శంకర భగవత్పాదులు అమూర్తిమత్వానికే ప్రాధాన్యతనిచ్చినా, సామాన్యులను వారు వదలలేదు. వారికి మోక్ష మార్గాన్ని భక్తి, స్తోత్రాల ద్వారా చూపించారు. అందులో కవిత్వం పొంగి పొర్లుతుంది. మధురమైన శబ్దాలు, ప్రాసలుతో ప్రతివారికి ఒక్కసారి వింటే యిట్టే నోటికొచ్చేట్లు రాసి ఈనాటికీ ప్రతి ఇంటా, దేవాలయాలలో వినిపిస్తున్నాయి. అది వారు చేసిన మహోపకారం. జాతివారి రుణాన్ని తీర్చుకొనలేని

రుణమే అది. ఇందులో ముఖ్యమైనవి – విష్ణువును పాదం దగ్గర నుండి కేశాల వరకు వర్ణించిన స్తోత్రం యాభై ఒక స్తోత్రాలలో తలమానికం. పార్వతీ దేవిని స్తుతిస్తూ చెప్పిన అంబాష్టకంలో ఎనిమిది శ్లోకాలున్నాయి. శివాపరాధ స్తోత్రంలో సంసారం నశ్వరరమైనదని బోధించి వేదాంత మార్గానికి సోపానాలు వేశారు. దేవి అపరాధ క్షమాపణ స్తోత్రంలో దుర్గా స్తుతి కలిసి ఉంది. ఆనంద లహరిలో పార్వతీదేవి స్తుతి ఉంది. ఇది అనేక భాషల్లోకి అనువాదం పొందింది కూడా. మానస పూజా స్తోత్రం–దీనిలో మానసిక పూజ పద్ధతి చెప్పారు. భజ గోవింద స్తోత్రం–లోకంలో విపరీత ప్రచారం పొందటమే కాదు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి నోటి ద్వారా సువర్ణమయమయింది.

వంద శ్లోకాలున్న శివానంద లహరి బాలమురళీ కృష్ణ ద్వారా బాగా ప్రచారమైంది. ఇందులో తొంభై తొమ్మిది శ్లోకాల వరకు విని శంకరులు ముందు శంకరుడు ప్రత్యక్షమైనాడట. గొప్ప అలంకారిక శైలితో విరాజిల్లే శతకం ఇది. లోతైన భావాలు. కవిత్వ పరంగా ఉన్నత శిఖరాలు అధిరోహించింది. ఆద్యంతం రసాలంకార సంశోభితం.

దీనికన్నా ఇంకొంచెం లోతుగా రాసింది సౌందర్య లహరి. బాంబే సిస్టర్స్ గానంతో చిరస్మరణీయమైంది. రసగుళిక అనిపిస్తుంది. పద్దెనిమిది శ్లోకాలున్న మోహ ముద్గరం విష్ణుదేవతా పరస్తుతి. మోహం మాయలను దాటితే వివేకం ప్రాప్తిస్తుందని చెప్పారు. విలియం జోన్స్ ఆంగ్లంలోకి దీన్ని అనువదించాడు. నూట ఒక్క స్రగ్ధరా శ్లోకాలున్న శత శ్లోకీలో వేదాంత భావన అలంకారికంగా బోధించారు. ఇవి కాక అన్నపూర్ణాష్టకం, కనక ధారా స్తవం శివ భుజంగ స్తోత్రం, లక్ష్మీ నరసింహ జగన్నాథాష్టకాలు, రామ భుజంగ స్తోత్రం. అన్నీ అన్నే. దేనికదే సాటి. భక్తిభావం పొంగి పొరలేవే. వింటే చాలు తరింపజేసేవి. వివేక చూడామణి, ఉపదేశ సహస్రి, ఆత్మ బోధ, ఏక శ్లోకి, అపరోక్షానుభూతి, సాధానా పంచకం, నిర్వాణ శతకం, మనీషా పంచకం, యతి పంచకం, వాక్య సుధా, తత్వ బోధ, సిద్ధాంత తత్వ విందు, పాండురంగాష్టకం, మీనాక్షి స్తోత్రం, గణేశ స్తోత్రాలు, గంగా స్తోత్రం మరచిపోలేనివి. సంస్కృత భాషను జన సామాన్యంలోకి స్తోత్రాల

ద్వారా తీసుకొచ్చిన ఘనత శంకరాచార్యుల వారిదేననటంలో ఏమాత్రం సందేహం లేదు.

అద్వైత ప్రచారం

కీటవార సంప్రదాయం, భోగవార సంప్రదాయం, ఆనంద వార సంప్రదాయం, భూరి వార సంప్రదాయం అనే నాలుగు సంప్రదాయాలను ప్రమాణంగా తీసుకొని శంకరులు నాలుగు ఆమ్నాయ పీఠాలు నారాయణుడిని సిద్ధేశ్వర శివుడిని ఆది దేవతలుగా ఏర్పాటు చేశారు. హిందూ ధర్మంలో ఏ ఒక్క మార్గాలన్నీ అనుసరించక కొత్త పద్ధతిలో వీటినేర్పాటు చేశారు. తమ ధర్మాన్ని తామే పోషించుకోవాలి అనే విధానాన్ని సన్యాసులు అనుసరించేట్లు చేశారు. ప్రజా సహకారంతో వీరు జీవించాలి. ధర్మాన్ని కాపాడే బాధ్యతా ప్రజలకూ ఉందని వారినీ భాగస్వాములను చేశారు. పూరీకి హస్తామలకా చార్యుడిని, శృంగేరికి సురేశ్వరాచార్యులను, ద్వారకకు పద్మపాదులను బదరికి తోటకాచార్యులను పీఠాధిపతులుగా నియమించారు. మండన మిశ్రుని వాదంలో ఓడించి శిష్యుడిని చేసుకొని, అతని భార్య ఉమా భారతిని కామ విద్యలో ఓడించారు. దేశమంతా కాలినడకన ప్రయాణిస్తూ ఎదురైన జైన, బౌద్ధ వాదులను ఓడిస్తూ వేద ధర్మానికి ప్రచారం చేస్తూ అద్వైత మతానికి వ్యాప్తి తెచ్చారు. చివరికి కాశ్మీర్‌లోని సర్వజ్ఞ శారదా పీఠం అధిరోహించి ఎదురులేని యోగి మహారాజు అనిపించారు. ప్రయాగలో కుమారిల భట్టును ఆయన బౌద్ధాన్ని ఆచరించటంతో పశ్చాత్తాపం చెంది ఊకలో కాలిపోతుంటే చూశారు. ఆయనే వ్రాద్దామనుకొన్న వార్తికలను మాహిష్మతిలో ఉన్న మండన మిశ్రుని చేత రాయించమని కోరి భట్టు ప్రాణం విడిచాడు.

శిష్యులతో దేశ సంచారం చేశారు శంకరులు. శ్రీశైలంలో శివానంద లహరి రాశారు. మహారాష్ట్రలో పర్యటించారు. గోకర్ణంలో హరి శంకర మందిరాన్ని, కొల్లూరులో మూకాంబికా మందిరాన్ని, శృంగేరిలో శారదా మందిరాన్ని స్థాపించారు. కేరళ, సౌరాష్ట్ర దేశాలు తిరిగి చూశారు. ద్వారక సోమనాదాలయాలను సందర్శించారు. దశనామి సంప్రదాయం, షణ్మత విధానం,

పంచాయత విధానం శంకరాచార్యులవారు ఏర్పరచినవే. తల్లి మరణ శయ్య మీద ఉండి స్మరించగా కాలడి వెళ్లి నిర్వహించి మాతృ ఋణం తీర్చుకొని తల్లికిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకొన్నారు. ముప్పై రెండేళ్ళ సార్థక జీవితాన్ని జీవించి అద్వైత మత స్థాపనాచార్యులుగా చరిత్రలో నిలిచిపోయిన అపర శంకరులు శ్రీ ఆది శంకరాచార్య భగవత్పాదులు. కంచి మఠం లెక్క ప్రకారం క్రీ.పూ.477లో, మన లెక్క ప్రకారం క్రీ.శ.820లో పార్థివ దేహాన్ని వదిలి నిజ నివాసమైన కైలాసాన్ని చేరారు.

"శృతి స్మృతి పురాణా మాలయం కరుణాలయం – నమామి భాగవత్పాదం శంకరం లోక శంకరం".❁

2. ముకుంద మాల రాజకవి - కులశేఖరాళ్వార్ (806 bc)

కేరళలో కాలడి గ్రామంలో జన్మించిన అపర శివావతారులే ఆది శంకరాచార్యులు. అద్వైత మత స్థాపకాచార్యులు త్రిమతాచార్యులలో ప్రధములు. జగద్గురువులుగా భావింపబడ్డారు. కాలంపై భిన్నాభిప్రాయాలున్నాయి. కాని క్రీ.శ. 780–820 అని అందరూ అంటారు. "దుష్టాచార్య వినాశాయ ప్రాతుర్భూతో మహీతలే - స ఏవ శంకరాచార్యః సాక్షాత్ కైవల్య నాయక: - శ్రోత స్మార్త ప్రతిస్టార్ధం భక్తానాం హితకామ్యయా - కరిష్యత్సవతారం స్వం శంకరో నీల లోహిత:" అని శివ రహస్యంలో ఉంది. స్వయానా పరమ శివుడే వేద విహిత కర్మలను వ్యాపింపజేయటానికి, దుష్టాచారాలను నిర్మూలించటానికి భూమిపై అవతరించాడని తాత్పర్యం. విద్యారణ్య స్వామి రచించిన "శంకర విజయమే" అందరికి ఆధారం. దానినిబట్టి శంకరాచార్య కాలడిలో ఆర్యాంబ శివగురువులకు పూర్ణా నది ఒడ్డున జన్మించారు. తలిదండ్రులు వృషా చలం కొండమీద ఉన్న శివుడిని ప్రార్ధించి ఆయన అనుగ్రహంతో శంకరుడికి జన్మనిచ్చారు. వైశాఖ శుద్ధ పంచమి, ఆర్ద్రా నక్షత్రంలో సూర్య, శని కుజ, గురులు ఉచ్చస్థితిలో ఉండగా జన్మించారు. కంచి మఠం రికార్డుల ప్రకారం ఆదిశంకరుల జననం క్రీ.పూ. 509.

శంకరుని బాల్యంలోనే తండ్రి చనిపోయారు. తల్లి ఆర్యాంబ పిల్లవాడిని పెంచి ఉపనయన సంస్కారం చేయించింది. ఏక సంతాగ్రాహి అయిన ఈ బాలుడు వేదవిద్యలన్నీ చిరుప్రాయంలోనే అభ్యసించాడు. బాల బ్రహ్మచారిగా ప్రతి ఇంటా భిక్షాటన చేసేవాడు. ఒకరోజు ఒక ఇంటిముందు భిక్షాం దేహీ అని అన్నప్పుడు ఆ ఇంటి ఇల్లాలు కడు పేదరికంతో ఉండటం వలన ఉసిరికాయలను మాత్రమే

భిక్షా పాత్రలో వేసి కన్నీటితో నిలబడింది. అర్థం చేసుకొన్న బాల శంకరుడు ఆశువుగా లక్ష్మీదేవిని "కనక ధారా స్తోత్రం"తో ప్రసన్నం చేసుకొని ఆ ఇంటిముందు బంగారు నాణాలు రాలేట్లు అమ్మవారి అనుగ్రహం పొందాడు. ఆ ఇల్లాలి ఇక్కట్లు తీర్చాడు. తల్లి ఆర్యాంబ పూర్ణా నది నుండి రోజూ నీరు తెచ్చుకోలేకపోతుంటే నదినే ఇంటి ముందు ప్రవహింపజేసి అందరికి ఆశ్చర్యం కలిగించాడు.

బాల శంకరులకు సన్యాసంపై మనసైంది. ఒక్కగానొక్క కొడుకు ఇలా అయితే ఎలా అని తల్లి అడ్డు చెబుతోంది. ఒకరోజు పూర్ణా నదిలో స్నానం చేస్తూ ఉండగా మొసలి కాళ్ళను పట్టి లాగేస్తుంటే ఒడ్డున ఉన్న తల్లిని ఇప్పటికైనా సన్యాస స్వీకారానికి అంగీకరించని వేడుకొన్నాడు. తల్లి మనసూ కరిగి సరేనంది. మనస్సాక్షిగా సన్యాసి అయ్యాడు. దీనిని "ఆతుర సన్యాసం" అంటారు. సన్యాస స్వీకార మంత్రాలు జపిస్తుండగానే మొసలి పట్టు వదిలేసింది. జీవితాంతం సన్యాసిగా ఉండిపోతానని శపథం చేశాడు. విద్య మీద మక్కువ ఎక్కువై తగిన గురువు కోసం ఉత్తర దేశ యాత్రకు బయల్దేరుతూ తల్లి అనుమతి పొందాడు. ఆమె ఏ సమయంలో ఎప్పుడు మనసులో తానూ రావాలని అనుకుంటుందో ఆ సమయానికి ఆమె ముందు వచ్చి వాలుతానని తానూ యతి అయినా ఆమె అంత్య సంస్కారాలను తన చేతులమీదుగానే చేస్తానని ప్రతిజ్ఞ చేసి బయలుదేరాడు.

గురు దర్శనం - విద్యా వ్యాసంగం

కాలి నడకన బయల్దేరిన శంకరుడు మధ్య భారతంలోని నర్మదా నది ఒడ్డున ఉన్న గౌడ పాదుల శిష్యుడైన గోవింద భగవత్పాదులున్న గుహను చేరాడు. వ్యాస మహర్షి కుమారుడైన శుక మహర్షియే, గౌడపాదులని అంటారు. గోవింద భగవత్పాదులకు శంకరుడు నమస్కరించాడు. ఆయన "ఎవరు నువ్వు?" అని అడిగాడు. వెంటనే శంకరుడు - "న భూమి ర్నతోయం నతేజో నవాయు ర్మఖంనేన్ద్రియం వా నతేషాంసమూహ: - అనైకాన్తికత్వా త్సుషు ప్త్యైక సిద్ధి స్తదేకోవ శిష్ట శ్శివోహం శివోహం" అంటూ పది శ్లోకాలను ఆశువుగా చెప్పాడు. వీటికే "దశ శ్లోకి" అని పేరు. ఇంత విజ్ఞానాన్ని మూట కట్టుకొచ్చిన ఆ శంకరుడు సాక్షాత్ శివుడే అని గ్రహించారు గోవిందపాదులు. "స ప్రాహ శంకర స శంకర

ఏవ సాక్షాత్" అంటే భూమికి దిగి వచ్చిన శంకరుడే ఈ శంకరుడు అని మెచ్చారు. వెంటనే గోవిందపాదులకు పాదపూజ చేశాడు శంకరుడు. బ్రహ్మ జ్ఞానాన్ని, ఉపపనిషత్ సారాన్ని నాలుగు మహా వాక్యాలతో గురువు శిష్యుడికి బోధించారు. ఒకరోజు అకస్మాత్తుగా నర్మదా ఉధృతంగా వరద వచ్చి భగవత్పాదుల తపస్సుకు భంగం కలిగిస్తుంటే "ఓంకార శక్తితో" నది ప్రవాహాన్ని తగ్గించాడు. గురువు వద్ద విద్యాభ్యాసం పూర్తి అయిన వెంటనే గురువు ఆదేశంపై బ్రహ్మ సూత్రాలకు భాష్యం రాయటానికి పండితలోక వాసి అయిన కాశికి చేరాడు శంకరుడు.

శ్రీశంకర కవితా గీర్వాణం

వారణాసి చేరి గంగా స్నాన పులకితులై విశ్వేశ్వర దర్శనం అంటే నిజ దర్శనమేగా చేసుకొన్నారు శంకరులు. వేద విచారణ చేసి సూక్ష్మాలు గ్రహించారు. అక్కడ సదానందుడు మొదటి శిష్యుడైనాడు. కాశీ వీధుల్లో తిరుగుతుంటే ఒక చండాలుడు నాలుగు శునకాలతో ఎదురౌతాడు. శంకరుడు అతన్ని దారి తొలగమంటాడు. ఆతను తప్పుకోకుండా "అన్నమయాత్ అన్నమయం అధవా చైతన్య మయాత్ చైతన్యం - ద్విజ వర దూరీకృతం వాంచసి కిం బ్రూహి గచ్ఛ గచ్ఛతి" అన్నాడు. అంటే "అన్నిటికీ ఆధారమైన అన్నంతో ఈ శరీరం నిర్మితమైంది. అడ్డు తప్పుకోమన్నది శరీరాన్నా, లోపలి ఆత్మనా?" అన్నాడు. సాక్షాత్తు పరమ శివుడే నాలుగు వేదాలతో ప్రత్యక్షమయ్యాడని గ్రహించి శంకరులు పాదాక్రాంతులయ్యారు. మహేశ్వరుడిని "మనీషా పంచకం"తో స్తోత్రం చేశాడు. శివుడు అపర శివుడికి కర్తవ్య బోధ చేశాడు. వేదవ్యాస ప్రణీతమైన బ్రహ్మ సూత్రాలకు ఇంతవరకు లేనట్టి అద్భుత భాష్యం, రాసి దేవతలచే ప్రశంసలు పొంది వాటి వ్యాప్తికి శిష్యులను దేశమంతా పంపమని హితవు చెప్పాడు. ఈ పనులు పూర్తిచేసి తనను చేరాలని చెప్పి అదృశ్యమయ్యాడు శివుడు. పన్నెండేళ్ళ వయసులోనే భగవత్పాదులు బ్రహ్మసూత్ర భాష్యం రాశారు. భగవద్గీతకు ఉపనిషత్తులకూ అంటే ప్రస్తాన త్రయానికి భాష్యాలు రాశారు ఆ లేత వయసులో, పండిన జ్ఞానంతో.

పరమ శివుని అనుజ్ఞతో బదరికా వనం చేరాడు. అక్కడ పండిత గోష్టులు జరిపారు. బదరి నుండి కాశీకి తిరిగి వచ్చి బ్రహ్మసూత్ర భాష్యాల సారం అయిన

అద్వైతాన్ని శిష్యులకు, ప్రజలకు బోధించటం ప్రారంభించారు. సనత్సు జాతీయం, విష్ణు సహస్ర నామం, లలితా త్రిశతి, నృసింహిత పాణిలకు భాష్యాలు పూర్తి చేశారు. ఒకరోజు శిష్యులకు బోధిస్తుండగా వ్యాస మహర్షి వృద్ధ బ్రాహ్మణ వేషంలో వచ్చి ఎనిమిది రోజులు ఆయనతో వాదించాడు. వచ్చినవాడు వ్యాసర్షి అని పద్మపాదుడు శంకరులకు తెలియజేస్తే పాదాలపై వ్రాలి పూజించారు. బ్రహ్మ సూత్రాలకు అసలైన అర్ధాన్ని గ్రహించింది శంకరాచార్యులు మాత్రమేనని కృష్ణ ద్వైపాయన వ్యాసుడు ప్రస్తుతించి ఆశీర్వదించాడు. తాను ఈ ప్రపంచంలోకి వచ్చిన పని పూర్తి అయిందని శరీరం చాలించటానికి అనుమతిమ్మని వ్యాసుని వేడాడు. అప్పుడు వ్యాస భగవానులు "నీ అసలు ఆయుర్దాయం ఎనిమిదేళ్ళు. అగస్త్యాది మహర్షులు వరంతో మరో ఎనిమిదేళ్ళు పొందావు. నేను ఇంకా నీకు పదహారేళ్ళ ఆయుర్దాయాన్ని ప్రసాదిస్తున్నాను. వేద విహిత కార్యప్రచారం చేయి. దీనికి విరుద్ధమైన మతాలను చీల్చి చెండాడి అద్వైతానికి పట్టం కట్టే పని నీ వల్లనే సాధ్యం అందుకే నీ ఆయుష్షు పొడిగిస్తున్నాను" అని అదృశ్యమైనాడు.

స్తోత్ర రత్నాలు

జ్ఞానులకు మోక్షగాములకు ప్రస్థాన త్రయ భాష్యం రాసిన శంకర భగవత్పాదులు అమూర్తిమత్వానికే ప్రాధాన్యతనిచ్చినా, సామాన్యులను వారు వదలలేదు. వారికి మోక్ష మార్గాన్ని భక్తి, స్తోత్రాల ద్వారా చూపించారు. అందులో కవిత్వం పొంగి పొర్లుతుంది. మధురమైన శబ్దాలు, ప్రాసలుతో ప్రతివారికి ఒక్కసారి వింటే యిట్టే నోటికొచ్చేట్లు రాసి ఈనాటికీ ప్రతి ఇంటా, దేవాలయాలలో వినిపిస్తున్నాయి. అది వారు చేసిన మహోపకారం. జాతివారి రుణాన్ని తీర్చుకొనలేని రుణమే అది. ఇందులో ముఖ్యమైనవి – విష్ణువును పాదం దగ్గర నుండి కేశాల వరకు వర్ణించిన స్తోత్రం యాభై ఒక స్తోత్రాలలో తలమానికం. పార్వతీ దేవిని స్తుతిస్తూ చెప్పిన అంబాష్టకంలో ఎనిమిది శ్లోకాలున్నాయి. శివాపరాధ స్తోత్రంలో సంసారం నశ్వరరమైనదని బోధించి వేదాంత మార్గానికి సోపానాలు వేశారు. దేవి అపరాధ క్షమాపణ స్తోత్రంలో దుర్గా స్తుతి కలిసి ఉంది. ఆనంద లహరిలో పార్వతీదేవి స్తుతి ఉంది. ఇది అనేక భాషల్లోకి అనువాదం పొందింది కూడా.

మానస పూజా స్తోత్రం-దీనిలో మానసిక పూజ పద్ధతి చెప్పారు. భజ గోవింద స్తోత్రం-లోకంలో విపరీత ప్రచారం పొందటమే కాదు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి నోటి ద్వారా సువర్ణమయమయింది.

వంద శ్లోకాలున్న శివానంద లహరి బాలమురళీ కృష్ణ ద్వారా బాగా ప్రచారమైంది. ఇందులో తొంభై తొమ్మిది శ్లోకాల వరకు విని శంకరులు ముందు శంకరుడు ప్రత్యక్షమైనాడట. గొప్ప అలంకారిక శైలితో విరాజిల్లే శతకం ఇది. లోతైన భావాలు. కవిత్వ పరంగా ఉన్నత శిఖరాలు అధిరోహించింది. ఆద్యంతం రసాలంకార సంశోభితం.

దీనికన్నా ఇంకొంచెం లోతుగా రాసింది సౌందర్య లహరి. బాంబే సిస్టర్స్ గానంతో చిరస్మరణీయమైంది. రసగుళిక అనిపిస్తుంది. పద్దెనిమిది శ్లోకాలున్న మోహ ముద్గరం విష్ణుదేవతా పరస్తుతి. మోహం మాయలను దాటితే వివేకం ప్రాప్తిస్తుందని చెప్పారు. విలియం జోన్స్ ఆంగ్లంలోకి దీన్ని అనువదించాడు. నూట ఒక్క స్రగ్ధరా శ్లోకాలున్న శత శ్లోకీలో వేదాంత భావన అలంకారికంగా బోధించారు. ఇవి కాక అన్నపూర్ణాష్టకం, కనక ధారా స్తవం శివ భుజంగ స్తోత్రం, లక్ష్మీ నరసింహ జగన్నాధాష్టకాలు, రామ భుజంగ స్తోత్రం. అన్నీ అన్నే. దేనికదే సాటి. భక్తిభావం పొంగి పొరలేవే. వింటే చాలు తరింపజేసేవి. వివేక చూడామణి, ఉపదేశ సహస్రి, ఆత్మ బోధ, ఏక శ్లోకి, అపరోక్షానుభూతి, సాధానా పంచకం, నిర్వాణ శతకం, మనీషా పంచకం, యతి పంచకం, వాక్య సుధా, తత్వ బోధ, సిద్ధాంత తత్వ విందు, పాండురంగాష్టకం, మీనాక్షి స్తోత్రం, గణేశ స్తోత్రాలు, గంగా స్తోత్రం మరచిపోలేనివి. సంస్కృత భాషను జన సామాన్యంలోకి స్తోత్రాల ద్వారా తీసుకొచ్చిన ఘనత శంకరాచార్యుల వారిదేననటంలో ఏమాత్రం సందేహం లేదు.

అద్వైత ప్రచారం

కీటవార సంప్రదాయం, భోగవార సంప్రదాయం, ఆనంద వార సంప్రదాయం, భూరి వార సంప్రదాయం అనే నాలుగు సంప్రదాయాలను ప్రమాణంగా తీసుకొని శంకరులు నాలుగు ఆమ్నాయ పీఠాలు నారాయణుడిని

సిద్ధేశ్వర శివుడిని ఆది దేవతలుగా ఏర్పాటు చేశారు. హిందూ ధర్మంలో ఏ ఒక్క మార్గాలన్నీ అనుసరించక కొత్త పద్ధతిలో వీటినేర్పాటు చేశారు. తమ ధర్మాన్ని తామే పోషించుకోవాలి అనే విధానాన్ని సన్యాసులు అనుసరించేట్లు చేశారు. ప్రజా సహకారంతో వీరు జీవించాలి. ధర్మాన్ని కాపాడే బాధ్యతా ప్రజలకూ ఉందని వారినీ భాగస్వాములను చేశారు. పూరీకి హస్తామలకా చార్యుడిని, శృంగేరికి సురేశ్వరాచార్యులను, ద్వారకకు పద్మపాదులను బదరికి తోటకాచార్యులను పీఠాధిపతులుగా నియమించారు. మండన మిశ్రుని వాదంలో ఓడించి శిష్యుడిని చేసుకొని, అతని భార్య ఉమా భారతిని కామ విద్యలో ఓడించారు. దేశమంతా కాలినడకన ప్రయాణిస్తూ ఎదురైన జైన, బౌద్ధ వాదులను ఓడిస్తూ వేద ధర్మానికి ప్రచారం చేస్తూ అద్వైత మతానికి వ్యాప్తి తెచ్చారు. చివరికి కాశ్మీర్‌లోని సర్వజ్ఞ శారదా పీఠం అధిరోహించి ఎదురులేని యోగి మహారాజు అనిపించారు. ప్రయాగలో కుమారిల భట్టును ఆయన బౌద్ధాన్ని ఆచరించటంతో పశ్చాత్తాపం చెంది ఊకలో కాలిపోతుంటే చూశారు. ఆయనే వ్రాద్దామనుకొన్న వార్తికలను మాహిష్మతిలో ఉన్న మండన మిశ్రుని చేత రాయించమని కోరి భట్టు ప్రాణం విడిచాడు.

శిష్యులతో దేశ సంచారం చేశారు శంకరులు. శ్రీశైలంలో శివానంద లహరి రాశారు. మహారాష్ట్రలో పర్యటించారు. గోకర్ణంలో హరి శంకర మందిరాన్ని, కొల్లూరులో మూకాంబికా మందిరాన్ని, శృంగేరిలో శారదా మందిరాన్ని స్థాపించారు. కేరళ, సౌరాష్ట్ర దేశాలు తిరిగి చూశారు. ద్వారక సోమనాదాలయాలను సందర్శించారు. దశనామి సంప్రదాయం, షణ్మత విధానం, పంచాయత విధానం శంకరాచార్యులవారు ఏర్పరచినవే. తల్లి మరణ శయ్య మీద ఉండి స్మరించగా కాలడి వెళ్లి నిర్వహించి మాతృ ఋణం తీర్చుకొని తల్లికిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకొన్నారు. ముప్పై రెండేళ్ళ సార్థక జీవితాన్ని జీవించి అద్వైత మత స్థాపనాచార్యులుగా చరిత్రలో నిలిచిపోయిన అపర శంకరులు శ్రీ ఆది శంకరాచార్య భగవత్పాదులు. కంచి మఠం లెక్క ప్రకారం క్రీ.పూ. 477లో, మన లెక్క ప్రకారం క్రీ.శ. 820లో పార్థివ దేహాన్ని వదిలి నిజ నివాసమైన కైలాసాన్ని చేరారు.

"శృతి స్మృతి పురాణా మాలయం కరుణాలయం – నమామి భాగవత్పాదం శంకరం లోక శంకరం".

కేరళ రాజు కులశేఖర వర్మనే కులశేఖర ఆళ్వార్ అంటారు. ఆయన రాసిన "ముకుంద మాల" వైష్ణవ భక్తులకు నిత్య పారాయణం. కలియుగం ఆరంభమైన ఇరవై యేడు సంవత్సరాలకు ఆయన జన్మించాడని వైష్ణవ గ్రంధాలు తెలియజేస్తున్నాయి. క్రీ.పూ.3075 కాలంవాడుగా పరిగణిస్తారు. పునర్వసు నక్షత్రంలో జన్మించాడు. శ్రీహరి యొక్క కౌస్తుభాంశలో జన్మించాడు. రాజ్యాన్ని కుమారుడికి అప్పగించి సంపదలను, వినోదాలను విసర్జించాడు. తమిళదేశంలోని పన్నెండు మంది అఘూవర మునులలో ఏడవ వానిగా భావిస్తారు. ఈ పన్నెండు మంది మునులు రాసిన మహా గ్రంధాన్ని "నాలాయిర దివ్య ప్రబంధం" అంటారు. నూట ఎనిమిది వైష్ణవ దివ్య క్షేత్రాలను దివ్య దేశం అంటారు. ముకుందమాల అనే స్తోత్ర గీతాలను సంస్కృతంలో రాశాడు కులశేఖరుడు. భక్తీ జ్ఞానానికి పరాకాష్టగా నిలిచే పుస్తకం ఇది. తమిళంలో "పెరుమాళ్ తిరుమోఘి" రాశాడు. ఇది దివ్యప్రబంధంలో ఒక భాగం. సంస్కృతంలో కులశేఖరుడు "తపతి సంవర్ణం", "సుభద్రా ధననంజయం", "విచ్ఛిన్నాభిషేకం" రాశాడని తెలుస్తోంది. వైష్ణవ క్షేత్రాలలో ముకుంద మాలను సామూహికంగా గానం చేస్తారు.

కులశేఖరుడు కేరళలోని పెరియార్‌లో జన్మించాడు. తండ్రి దృఢ వర్మ. ఆయన క్రీ.పూ.3102 కలియుగం ప్రారంభమైన 27వ సంవత్సరంలో అవతరించాడని నమ్మకం. కనుక ఆయన జన్మించినది క్రీ.పూ.3075 అవుతుంది. కులశేఖరుడు కేరళ రాజు. కొల్లి, ఊదార్, కొంగు అనే ప్రాంతాలను పాలించాడు. వీటినే ఇప్పుడు ఉద్దెయూర్ మదురై, ట్రావెంకూర్ అంటున్నారు. ఆధునిక చరిత్రకారులు ఆయన చేరరాజు అని కాలం క్రీ.శ.800-820 అంటున్నారు. దీనితో ఎవరూ ఏకీభవించటం లేదు. వైష్ణవ సంప్రదాయాన్ని పటిష్టంగా పాటించిన వేదాంత దేశిక మహారాజు. దక్షిణ భారతంలో భక్తీ ఉద్యమ సారధిగా కీర్తిపొందాడు. సామాన్య ప్రజలకు భక్తిని అందించి తరింపజేసిన పుణ్యాత్ముడు కులశేఖరుడు.

గబ్బిట దుర్గాప్రసాద్

కవితా గీర్వాణం

ఆళ్వార్ దివ్య ప్రబంధంలో నాలుగు వేల శ్లోకాలు ఉంటే అందులో కులశేఖరునివి నూట అయిదున్నాయి. శ్రీరామ శ్రీకృష్ణులపై సంస్కృతంలో చెప్పిన ముకుందమాల నలభై శ్లోకాల రస గుళికలు కలిగి ఉన్నది. అద్వైత మత స్థాపకుడు ఆది శంకరాచార్యులు కులశేఖరులకు సమకాలికులు. ఆయనకంటే చిన్నవారు. కులశేఖరులు మహా శ్రీరామ భక్తులు, రాముడు అనుభవించిన కష్టాలన్నీ తనకు ఆపాదించుకొన్నాడు. అందుకే ఆయన్ను "పెరుమాళ్" అంటారు. అంటే గొప్పవాడు అని అర్థం. పెరుమాళ్ అనే పేరు తిరుమల వెంకటేశ్వర స్వామికి ఉందన్న సంగతి మనకు తెలుసు. విష్ణు భక్తులను సాక్షాత్తు విష్ణుమూర్తి స్వరూపంగా భావించి పూజించేవాడు కులశేఖరాల్వార్. రామ, కృష్ణ చరిత్రలను స్మరించుకొని తన్మయత్వంతో ఇద్దరినీ ఒకే శ్లోకంలో వర్ణించాడు. శ్రీకృష్ణుని తల్లి దేవకిగా తనను భావించుకొని రచన చేశాడు కొన్ని శ్లోకాలలో. కుమారుడు కృష్ణుడు తనను వదిలి వ్రేపల్లెలో నంద యశోదల వద్ద పెరగటాన్ని దేవకీ దేవి భరించలేకపోయినట్లు, ఎప్పుడు తన బాల కృష్ణుడు తన ముందు వచ్చి వాలుతాడా అని ఎదురు చూస్తున్నట్లూ రాశాడు.

శ్రీరంగంలో ఉండి శ్రీరంగనాథ స్వామిని సేవించేవాడు కులశేఖరుడు. శ్రీ వేంకటేశ్వరుడిని ఆయన ద్వారం వద్ద గడపగా పడి ఉండే భాగ్యాన్ని కలిగించమని వేడుకొన్నాడట. తథాస్తు అని వరమిచ్చాడు బాలాజీ. అందుకే తిరుమలలో గర్భగుడి ద్వారానికి ఉన్న గడపను "కులశేఖర పడి" అంటారు. కులశేఖరుడు రాసిన "తిరుమొఘి"లో "గోవిందరాజ శ్రీపాద పద్మాలను తప్ప మరి దేనిని రాచరికంగా భావించను" అని చెప్పుకొన్న పరమ భక్తా గ్రేసరుడు. ఆయన "గడప ప్రార్థన" చూద్దాం – "శేదియాయ సేల్వినైగల్, తీర్కుం తిరుమాలే – నేదియానే వేంగడవా నిన్ కోయిల్ వాశేల్ అడియారుం వారరువం అరంబై యెరుం కిడందు ఇంగల్ – ప్పడియాయ్ కిడందు ఉన్ పవళ వాయ్ కాన్ బెనే" అంటే "వేంకటేశా! అనాదిగా ఆర్జించిన పాపాలను తొలగించేవాడై, తిరుమలలో వేంచేసి ఉండే నీ భక్తులు, దేవతలు కలిసి సంచరించేట్లు నీ దివ్య సన్నిధి వాకిలిలో అందరూ కాలితో

తొక్కే గడపగా పడి ఉండి, పగడంలాగా ఉండే నీ కింది పెదవిని ఎప్పుడూ సేవించే భాగ్యాన్ని ప్రసాదించు". కులశేఖరుడు ప్రతి రోజు రామాయణాన్ని వింటూ ప్రవచనం చేస్తూ తన్మయత్వం చెంది భక్తులను తన్మయులను చేసేవాడు.

కులశేఖరుని ముకుంద మాలలో మొదటి శ్లోకం – "ఘుష్యతే యస్య నగరే రంగ యాత్రా దినే దినే తమహం వందే రాజానం కుల శేఖరం" అని చెప్పుకొన్నాడు. పరమాత్మను గురించి చెబుతూ "హరి సరస్సవి గాహ్య ఆపీయ తేజో జలౌఘం – భవ మరు పరిఖిన్నః ఖేదమద్యచ్ఛజామి" భావం – "హరి అనే దివ్య సరస్సు సంసార తాపాన్ని తొలగిస్తుంది. తాపం తగ్గించుకోవటానికి మనమే అందులో మునగాలి. వీరు వారు అనే భేదం అక్కర్లేదు. ఉన్నది అదొక్కటే సరస్సు. మునిగి పాప ప్రక్షాళనం చేసుకోవాలి". "నాలుకా! ఇది వరకు ఎన్నో రుచులు చూశావు. ఇప్పుడు శ్రీకృష్ణ నామ రుచి చూడు. దానికి మించిన మాధుర్యం ఉండదు. నువ్వు నన్ను అడగాల్సినది పోయి నేనే నిన్ను అడగాల్సి వస్తోందం"టారు మరో శ్లోకంలో.

విష్ణు భక్తులపై కులశేఖర మహారాజుకున్న విశ్వాసాన్ని తెలియజెప్పే కథ ఒకటి ఉంది. విష్ణువును, విష్ణు భక్తులను సేవించటం కులశేఖరులకు నిత్య విధి. వారికి అందుబాటులో అన్నీ ఉంచేవాడు. ఒకసారి విష్ణు భక్తులు అంత:పురానికి వస్తారు. వారిని సేవించేందుకు కులశేఖరుడు వచ్చాడు. ఈ విష్ణు భక్తుల బాధ తప్పించాలని అనుకోని కాపలా అధికారులు అక్కడ పెట్టి ఉన్న విలువైప ఆభరణాలను తీసి దాచేసి రాజుకు వైష్ణవ భక్తులే కాజేశారని ఫిర్యాదు చేస్తారు. ఆయనకు భక్తులపై అచంచల విశ్వాసం, నమ్మకం ఉన్నాయి. వారీ పని చేసి ఉండరని భావించాడు. ఏమైనా నిజం తేల్చాలి కనుక ఒక గంగాళం తెప్పించి అందులో కాల నాగుల్ని వేయించి దానిలో తన ఉంగరాన్ని జార విడుస్తాడు. అందులో పడేసిన తన ఉంగరాన్ని చేతులు పెట్టి తీసివ్వమని తన పర్యవేక్షకులను ఆదేశిస్తాడు. వాళ్ళు భయపడి చేయి పెట్టలేదు. అప్పుడు రాజు విష్ణుభక్తులకు విష్ణువుపై భక్తీ, విశ్వాసాలుంటే విష జంతువులు కూడా ఏమీ చేయలేవని హరి నామం చేస్తూ తానే మిన్నాగుల మధ్య చెయ్యిపెట్టి తన ఉంగరాన్ని తీస్తాడు. అధికారుల మొహాలు

మాడి నిజం చెప్పేస్తారు. తప్పు ఒప్పుకొని క్షమించమని వేడుకొన్నారు. అదీ కుల శేఖరాల్వారులకు విష్ణు భక్తీ, భక్తులపై ఉన్న నమ్మకం.

ముకుంద మాలలోని మరిన్ని భక్తీ స్తోత్రాలు చూద్దాం –

"జయతు జయతు దేవో దేవకీ నందనోయం – జయతు జయతు కృష్ణో వృష్ణి వంశ: ప్రదీప:

జయతు జయతు మేఘశ్యామలః కోమలాగః – జయతు జయతు పృధ్వీ భారనాశో ముకున్ద:"

"కృష్ణ త్వదీయ పదపంకజ పంజరాంతమ్ – అద్యైవ మే విశతు మానస రాజ హంస:

ప్రాణ ప్రయాణ సమయే కఫ వాత పిత్తా – కంఠావ రోదన విధౌ స్మరణం కుతస్తే"

"హే గోపాలక హే కృపాజలనిధే హే సింధు కన్యాపతే – హే కంసాంతక హే గజేంద్ర కరుణా పారీణ హే మాధవ

హే రామానుజ హే జగత్రయ గురో హే పుండరీకాక్ష మాం – హే గోపీ జననాధ పాలయ పరం జానామి నత్వాం వినా"

"నమామి నారాయణ పాద పంకజం – కరోమి నారాయణ పూజనం సదా

వదామి నారాయణ నామ నిర్మలం – స్మరామి నారాయణ తత్వ మవ్యయం"

"యస్య ప్రియౌ శ్రతి ధరౌ కవిలోక వీరౌ – మిత్రే ద్విజన్మ పదపద్మ శరావ భూతాం

తేనామ్బుజాక్ష చరణాంబుజ షట్ పదేన – రాజ్ఞాకృతా కృతి రియం కుల శేఖరేణ". ❀

3. అర్ధ శాస్త్ర రచయిత - కౌటిల్యుడు (350-280 bc)

క్రీ.పూ. 350-283 వాడైన చాణక్యుడు భారతదేశంలోనే అతి విశాలమైన మౌర్య సామ్రాజ్య స్థాపకుడు చంద్ర గుప్తుని రాజ్యాభిషిక్తుడిని చేసి, ప్రతిజ్ఞ చేసి నందవంశ నిర్మూలనం చేసి పిలక ముడి వేసుకొన్న చాణక్యుడే అర్ధశాస్త్రం అనే మహా గ్రంధాన్ని రాసిన కౌటిల్యుడు. విష్ణుగుప్తుడు అనే పేరు కూడా ఉంది. తక్షశిల విశ్వవిద్యాలయానికి అర్ధశాస్త్ర విభాగానికి అధ్యక్షుడు. నందరాజ మంత్రి రాక్షసుడిని ఎన్నో మాయోపాయాలతో ఓడించి ప్రతిజ్ఞ నిలుపుకొన్నవాడు చివరికి రాక్షసుడినే శాంతి సమయంలో చంద్రగుప్తుని మంత్రిని చేసి సుపరిపాలన ప్రజాక్షేమం కాంక్షించినవాడు. నాలుగు పురుషార్ధాలలో రెండవది అయిన అర్ధానికి ప్రాధాన్యం ఇచ్చి రాసి అన్ని ధర్మాలు అందులో నిక్షిప్తం చేశాడు కౌటిల్యం అని కీర్తించే రచన అది. చాణక్య, రాక్షస మంత్రుల ఎత్తులపై శూద్రక కవి ముద్రా రాక్షస నాటకంలో చక్కగా వివరించాడు.

చణకుడు అనే బ్రాహ్మణుని కుమారుడు. తక్షశిల నివాసి. ఆయన జీవితం తక్షశిలా, పాటలీ పుత్రలలోనే గడిచింది. చాణక్యుడు చిన్నతనం నుండి విద్యపై అభిరుచి ఉండటం వలన సకల శాస్త్రాలు కొద్దికాలంలోనే అభ్యసించి ఆర్ధిక ఆచార్యుడయ్యాడు. ఆనాటికి ప్రపంచంలోనే అత్యున్నత అతి ప్రసిద్ధమైన విశ్వవిద్యాలయం తక్షశిల. అందులో ఆర్ధిక విభాగాధ్యక్షుడై విద్యాబోధన చేశాడు. ఇందులోనే అశోక చక్రవర్తి కూడా విద్యాభ్యాసం చేశాడు. మహోన్నతమైన పదవిలో ఉన్నా సాధారణ జీవితం గడిపి అందరికి ఆదర్శంగా నిలిచాడు. చెప్పింది చేసి చేపించిన ఘనత ఆయనది. రాజు రాజ్యభద్రత మీద ఎక్కువ దృష్టి ఉండాలని చెప్పాడు. చంద్రగుప్తుని చక్రవర్తిని చేసి రాక్షసుడిని అమాత్యుడిని చేసి రాజభోగాలను త్యజించి అరణ్యాలకు చేరి ఒంటరి జీవితం గడిపాడు. ఆయన మరణంపై విభిన్న కధనాలు ఉన్నాయి. హేమచంద్రుడు అనే బౌద్ధ రచయిత రాసిన దాని ప్రకారం

బిందుసారుని మంత్రి సుబంధు కుట్ర వలన అడవిలో ఆహారం నీరు అందక పస్తులతో గడిపి మరణించాడట. దీనికి కారణం బిందుసారుని తల్లిని హత్య చేయించింది చాణక్యుడే అని సుబంధు రాజును నమ్మించటమే. బౌద్ధ రాజనీతి ప్రకారం హంతకుడికి నీరు ఆహారం అందకుండా మరణించేట్లు చేయటమే అతి కఠిన శిక్ష. తన తల్లి మరణం సహజమే అని ఆలస్యంగా తెలుసుకొన్న బిందుసారుడు సుబంధును చాణక్య మరణాన్ని ఆపమని ఆజ్ఞ చేసినా, అమలు చేయకుండా తగలబెట్టి చంపించాడని కథనం.

కౌటిల్య గరిమ

కౌటిల్యం అంటే కుటిల రాజకీయం అనే అర్ధం లోకంలో స్థిరపడిపోయింది. కాని మహోన్నత మానవతా వాదిగా కౌటిల్యుడు దర్శనమిస్తాడు. అర్ధశాస్త్రాన్ని చాణక్య నీతి శాస్త్రం అనీ పిలుస్తారు. ఇందులో ఆర్ధిక విషయాలు ఆదాయ వ్యయాలు, రాజనీతి, ప్రజా సంక్షేమం, ఇతర దేశాలతో సత్సంబంధాలు, వ్యాపార వాణిజ్య విషయాలు, యుద్ధ తంత్రాలు అన్నీ చర్చించాడు. రాజ్యపాలన ఎలా ఉండాలో రాజులు తెలుసుకొనేట్లు రాశాడు. మనుధర్మ శాస్త్రాన్ని అనుసరించాడు. శిక్షా స్మృతిని తెలియజేశాడు. రక్షణ వ్యవస్థను పటిష్ట పరచటం గూర్చి వివరించాడు. పన్నులు, వసూళ్లు, సైన్య విభాగం వాటి సద్వినియోగం ఒకటేమిటి అన్నిటినీ పేరు పేరునా చర్చించి వివరించాడు. సులభంగా అర్ధమయ్యే భాషలో రాసి అందరికి చేరువ అయ్యేట్లు చేశాడు. చాణక్య ప్రతిభ నిరుపమానం. ఎవరైనా ఏదైనా గొప్ప ఆలోచన చెబితే వారిని “అపర చాణక్యుడు” అనటం లోక రివాజు. కుటిల ఆలోచనలిస్తే “అబ్బో పెద్ద కౌటిల్యుడు రా” అని ఆయన చెడు చెప్పకపోయినా ముద్ర వేయటమూ ఉంది. ఆనాటి అఖండ భారత సార్వభౌమత్వానికి ఏమాత్రం ముప్పు లేకుండా చేయగల్గిన మేధావి చాణక్యుడు. అర్ధశాస్త్రం అంటే రాజకీయ యదార్ధ శాస్త్రం అని, ప్రభుత్వం ఎలా పని చేస్తుందో తెలియజేస్తూ, ఎలా పని చేయాలో సూచిస్తూ, రాజు విధులేమిటో తెలియబరుస్తూ, ప్రజలకు పాలన దగ్గర కావాలని తెలుపుతూ, ప్రజలు రాజ్య నిర్మాతలని అంటూ, వారు కూడా హద్దుదాటితే తీవ్ర శిక్ష ఎలా అమలు చేయాలో తెలియజేసింది అని

పాశ్చాత్య పండితులు మెచ్చారు. రాజు నిరంకుశుడే ఆనాడు. అలాంటి కాలంలో ఆర్థిక పరిపుష్టి కల్గించటం ఎలాగో చెప్పాడు. న్యాయ సంబంధమైన విషయాలను వివరిస్తూ అధికారుల విధి విధానాలు సూచిస్తూ, సంస్కృతిని నిలబెడుతూ పురోగతికి మార్గాలు సూచించాడు. గనుల శాస్త్రాన్ని, గని తవ్వకాలను, లోహ శాస్త్రాన్ని, వ్యవసాయం లాభసాటిగా చేయటాన్ని, పశువుల పెంపకం, యాజమాన్య పద్ధతులు, వనమూలికలు, ఔషధాలు, ఆయుధాలు వచ్చినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రకృతి వైపరీత్యాలను ప్రజా సహకారంతో పరిష్కరించటం, గూఢచారి వ్యవస్థా, కోటలను స్వాధీనం చేసుకొనే విధానం, సంస్థల నిర్వహణ విధానం, యుద్ధ నీతి యుద్ధ ఖైదీలను చూడాల్సిన పద్ధతులు, క్రమశిక్షణ, దండయాత్రా విధానాలు, సంధి విగ్రహాలు, వ్యసనాలు నిర్మూలన, ప్రభుత్వాధికారుల బాధ్యతలు, విధులు వంటివి తెలియజెప్పాడు. వీటిని పదిహేను విభాగాలలో వివరించాడు.

పాశ్యాత్యులు అర్ధ శాస్త్రాన్ని మాక్ విల్లీ రాసిన “ప్రిన్స్”తో పోలుస్తారు. అది సరైన పోలిక కాదు. కౌటిల్యుడు రాజు “రాజర్షి” కావటానికి కావలసిన సకల విషయాలు వివరించాడు. “ప్రజల సుఖ సంతోషాలే రాజు సుఖసంతోషాలు. వారి సౌభాగ్యమే తన సౌభాగ్యం వారి సంక్షేమమే తన సంక్షేమం. తనకు ఆనందాన్ని, లాభాన్ని కలిగించేవి కాదు. ప్రజలకు ఆనందాన్ని, లాభాలను కలిగించేవే రాజు చేయాలి” అని గొప్ప రాకీయ సూక్ష్మాన్ని బోధించాడు కౌటిల్యుడు. రాజర్షికి ఉండాల్సిన లక్షణాలను వివరిస్తూ – రాజు ఆత్మ నిగ్రహం కలిగి ఉండాలి. విజ్ఞులైన పెద్దలతో ఉంటూ విజ్ఞానాన్ని పెంచుకోవాలి. వేగుల వారి కన్నులే తన కన్నులుగా చూడాలి. రక్షణ, సంక్షేమమే ధ్యాయంగా ఉండాలి. తానూ ధర్మ బద్ధంగా ఉంటూ ప్రజలూ అనుసరించేట్లు చేయాలి. అన్ని శాస్త్రాలలోను అభినివేశం కలిగి ఉండాలి. ప్రజలకు సహాయపడుతూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి. క్రమశిక్షణతో ప్రవర్తిస్తూ ప్రజలను అదే దారిలో నడిచేట్లు చేయాలి.

రాజు ఇతరుల భార్యలపై వ్యామోహపడరాదు. ఇతరుల సంపదను దోచుకోరాదు. అహింసనే అవలంబించాలి. ఆడంబరం, అసత్యం ఉండరాదు. దుష్టులకు దూరంగా ఉండాలి. అని రాజులకు సూక్తి ముక్తావళి చెప్పాడు.

పటిష్టమైన ఆర్ధిక వ్యవస్థ రాజ్యానికి శ్రీరామ రక్ష అన్నాడు కౌటిల్యుడు. ధర్మం కర్మ దీనిపైనే ఆధారపడి ఉంటాయి అన్నాడు. రాజు శక్తివంతుడైతే రాజ్యాన్ని లోబరుచుకొంటారు. కనుక రాజర్షి ఎల్లప్పుడూ చలాకీగా ఉండాలి. అప్పుడే రాజ్యానికి ప్రమాదం ఉండదు. పగలు, రాత్రిని ఎనిమిది విభాగాలు చేసుకొని ఒక్కో విభాగానికి ఒకటిన్నర గంటలు కేటాయించి తన కార్యక్రమాలను అమలు చేయాలి.

పగలు మొదటి విభాగంలో – రక్షణ, ఆర్ధిక ఖర్చులపై నివేదికలపై దృష్టి పెట్టాలి. రెండవ విభాగంలో – ప్రజా విజ్ఞప్తులు స్వీకరించి పరిష్కరించాలి. మూడులో అధికార నియామకాలు కానుకల స్వీకరణ, వారికి పనులు పురమాయించటం చేయాలి. నాలుగవ భాగంలో ఉత్తర ప్రత్యుత్తరాలు, మంత్రులతో సమావేశాలు చేయాలి. అయిదులో స్వీయ వినోద విషయాలలో పాల్గొనాలి. ఆరులో సైనిక విశేషాలు, పర్యవేక్షణ నిర్వహించాలి. సాయంకాల ప్రార్ధనతో పగలు కార్యక్రమం పూర్తి అవుతుంది.

సాయంత్రం మొదటి గంటన్నరలో – గూఢచారులతో సమావేశం నిర్వహించాలి. రెండవ భాగంలో – స్నానం పూజాదికాలు. మూడు నాలుగులో – నిద్రకు ఉపక్రమించి హాయిగా నిద్రపోవాలి. అర్ధరాత్రి దాటినా గంటన్నరలో మంగళ ధ్వానాలతో మేల్కొనాలి. రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలి. మూడవ భాగంలో మంత్రులతో సమావేశం వేగులను పంపటం చేయాలి. సూర్యోదయానికి గంటన్నర ముందు గృహ మత సంబంధ విధులు, గురువుల సందర్శనం, పురోహిత హితులతో వైద్యులతో భేటీ ముఖ్యమైన వంటవాడితో, వైద్యులతో సమావేశం నిర్వహించాలి.

శత్రురాజుల యెడ సామదాన భేద దండ మాయ, ఉపేక్ష ఇంద్రజాలాలను ప్రయోగించాలని చెప్పాడు కౌటిల్యుడు. రాజ్య సరిహద్దుల్లో అరణ్యాలు పెంచి వాటికి కాపలాగా ఏనుగులను, రక్షకులను నియోగించాలని చెప్పాడు. కౌటిల్యుడు ఆనాడు చెప్పినవన్నీ నేటికీ శిరోధార్యాలే అని ఆర్ధిక ధర్మ న్యాయ, శిక్షా శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ❁



4. భరతనాట్య సృష్టికర్త - భరత ముని (100 bc)

క్రీ.పూ. మూడవ శతాబ్దానికి చెందిన భారత ముని నాట్యశాస్త్ర రచయిత. సంగీత నాట్యాలలో మహా పండితుడు. భారతీయ నాటక ధర్మాలను అవలోడనం చేసినవాడు. నాటకశాలా నిర్మాణంలో సుప్రసిద్ధుడు. ప్రాచీన భారతదేశ సంగీత నృత్య సంప్రదాయాలను బాగా తెలిసి ప్రయోగించాడు. గాన, వాద్య సంగీతాలను నాట్య కళలను గురించి సంపూర్ణంగా వివరించిన మహాగ్రంధం నాట్య శాస్త్రం. ఇవన్నీ సంస్కృత నాటక రంగ భాగాలే. దశ విధ రూపక భేదాలను గుర్తించి వివరించాడు. పాశ్యాత్యులు డ్రామా అని పిలిచే నాటకం ఈ పదిలో ఒకటి మాత్రమే. దశ విధ రసాలపై చర్చించాడు. 35 అధ్యాయాలున్న ఈ శాస్త్రానికి భరతుడు ఆద్యుడు. భారత నాట్యానికి అభినవ గుప్తుడు అనితర సాధ్యమైన “అభినవ భారతి” అనే పేరిట వ్యాఖ్యానం చేశాడు. గాంధర్వ వేదం అంటే సామగానం ఆధారంగా దీన్ని రాశాడు. 36,000 శ్లోకాలున్న ఉద్గ్రంధం భరత శాస్త్రం. నాట్య వేదం అని పిలువబడేది దొరకకపోవటం దురదృష్టం.

భరతముని కవితా గీర్వాణం

ఇప్పుడు మనకు లభిస్తున్న భరతశాస్త్రంలో ఆరువేల శ్లోకాలున్నాయి. దీనిని ఆంగ్లంలో “డ్రామాటిక్ ఆర్ట్” “పెర్ఫార్మన్స్ ఆర్ట్ థీరీ” అన్నారు. నాట్యాన్ని దృశ్య రూపకం లేక దృశ్య కావ్యం అంటారు. ఇది నాట్య నృత్య సంగీత త్రివేణీ సంగమం. మునులు భరతుని వద్దకు వచ్చి నాట్య వేదాన్ని గురించి తెలియజేయమని కోరితే బ్రహ్మ తెలియజేసిన దానిని వారికి దీనిద్వారా తెలియజేశాడు. దుస్తులు

ఆహార్యం రంగస్థలం, విభజన, నటన, దర్శకత్వం వగైరాలను గురించి వివరంగా తెలిపాడు. ఆంగిక, వాచిక, ఆహార్యాలను వివరించాడు. అరిస్టాటిల్ రాసిన పోయేటిక్స్‌తో పోలుస్తారు. ప్రేక్షకులు ఆదరించే రసోత్పత్తి కోసం నటులు రంగం మీద అభినయించి రసోత్పత్తి చేస్తారు. సంగీతాన్ని గురించి విపులంగా చర్చించిన తొలి గ్రంథం భరతుని నాట్య శాస్త్రమే. పదమూడవ శతాబ్దం వరకు భారతదేశానికి ఇదే ఉపయుక్త సంగీత గ్రంథం. ఆ తర్వాత ఉత్తరాది సంప్రదాయం, దక్షిణాది సంప్రదాయాలు ఏర్పడ్డాయి. వాటినే హిందూస్తానీ అని, కర్నాటక సంగీతం అనీ పిలుస్తున్నాం.

భరతుడు షడ్జమాన్ని "గ్రామ" (గామ) అన్నాడు. అదే మొదటిది. మూలమైనవి అవినాశి అని అవిలోపి అని అవిమానవని తెలియజేశాడు. శృతుల మధ్య సామరస్యమే సంగీతం అన్నాడు. నాట్యశాస్త్రాన్ని అయిదువ వేదంగా గుర్తిస్తారు. దీనిపై ఎన్నో వ్యాఖ్యానాలొచ్చాయి అందులో మాతంగుడు రాసిన బృహద్దేశి, అభినవ గుప్తుని అభినవ భారతి, సారంగ దేవుని సంగీత రత్నాకరం ముఖ్యమైనవి. భరతుని నాట్య శాస్త్రం నాట్యకళా సంబంధం "విజ్ఞాన సర్వస్వం". ఇందులో లేనిది లేదు. భరతుని తర్వాత నందీశ్వరుడు అభినయ దర్పణం రాశాడు. ఇతని కాలం పన్నెండో శతాబ్దం. ఆచార్య పోణంగి శ్రీరామ అప్పారావుగారు భరతముని నాట్యశాస్త్రాన్ని తెలుగులోకి అనువదించి కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారాన్ని పొందారు.❁

5. కవికుల గురువు - కాళిదాసు మహాకవి (100 bc)

కాళికాదేవి దాసుడిని అని చెప్పుకొనే కాళిదాస మహాకవి గొప్ప సంస్కృత నాటక కర్త, కావ్య సృజనశీలి, వ్యాస, వాల్మీకుల తర్వాతి స్థానాన్ని ఆక్రమించుకొన్న మహాకవి. ఈ మహానుభావుడి కాలాన్ని కూడా సరిగ్గా ఇప్పటికీ తేల్చలేకపోయారు. ఐదవ శతాబ్ది వాడని అనుకుంటారు. అభిజ్ఞాన శాకుంతలం నాటకంతో విశ్వవ్యాప్త కీర్తి నార్జించినవాడు. ఉపమా కాళిదాసస్య అనే టాగ్ ఉన్న కవి.

కుమార సంభవ కావ్యంలో హిమాలయ సౌందర్యాన్ని అత్యద్భుతంగా కీర్తించాడు కనుక హిమాలయ సానువులలో ఉండేవాడేమోనని కొందరి ఊహ. మేఘదూతం కావ్యంలో ఉజ్జయినిని కమనీయంగా చెప్పాడు కనుక ఉజ్జయిని వాసుడని మరి కొందరి అభిప్రాయం. రఘువంశ కావ్యంలో కళింగ రాజు హేమాంగదుడి గురించి రాశాడు కనుక కళింగ వాసి అని ఇంకొందరి అనుమానం. లక్ష్మీధర కల్లా అనే పరిశోధకుడు వీరికి భిన్నంగా కాశ్మీరుకు చెందిన వాడని చెప్పాడు. అధిక సంఖ్యాకుల మనోభావం ప్రకారం కాళిదాస మహాకవి ఉజ్జయిని ప్రాంతంవాడే. ఒక రాజ కుమారిని వివాహం చేసుకొని, చదువేమి లేకపోవటంతో సవాలుగా కాళికాదేవిని ప్రసన్నం చేసుకొని నాలుకపై బీజాక్షరాలు రాయించుకొన్న అదృష్టవంతుడు. దానితో ఆయన మహాకవిగా రూపుదాల్చాడనే కథ అందరికి తెలిసిందే. శ్రీలంక రాజుకుమార దాసును కలిశాడని అక్కడ జరిగిన కుట్రలో హత్య చేయబడ్డాడనే కథనమూ ఉంది.

కాని కాళిదాసు కాలం నాలుగవ శతాబ్దికి విక్రమాదిత్య మహారాజు కాలంతో సరిపోతోందని కొందరు వాదిస్తే, కాదు అయిదవ శతాబ్దపు చంద్ర

గుప్తుని సమకాలీనుడని మరికొందరి వాదన. ఇదంతా శుద్ధ తప్పు క్రీ. పూ. ఒకటవ శతాబ్దంలోని అప్పటి ఉజ్జయిని పాలకుడు విక్రమాదిత్యుని కాలంవాడని అన్నారు మరింత వెనక్కి నెట్టేసి. ఆధునికులు మాత్రం అయిదు ఆరు శతాబ్దికి చెందాడు అంటారు. 634 శిలాశాసనం ప్రకారం బారవి కాళిదాసు పేర్లు ఒకేచోట కనిపించాయి. ఈ శాసనం కర్నాటకలోని ఐహోల్‌లో లభించింది. కాళిదాసు కాలంపై చర్చను వదిలేసి ఆ మహాకవి రచనా వైవిధ్యాన్ని సామర్థ్యాన్ని గురించి తెలుసుకొందాం.

మహాకవి రాసిన అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం అనే మూడు నాటకాలలో అభిజ్ఞాన శాకుంతలం ప్రపంచ ప్రసిద్ధ నాటకంగా గుర్తింపు పొందింది. జర్మనీ ఫిలాసఫర్, కవి విమర్శకుడు నాటకకర్త గోధేశాకుంతలాన్ని చదివి యెగిరి గంతేసి ఆనంద బాష్పాలు కార్చాడని చెబుతారు. అంతటి కీర్తి పొందింది. ఇందులో నాలుగో అంకం నాలుగో శ్లోకం అన్నిటికంటే గొప్పది అనే పేరుంది కన్వ మహర్షి పెంచిన కూతురు శకుంతలను అత్తవారింటికి పంపేటప్పుడు కాళిదాసు ఆయనతో అనిపించినా శ్లోకే ఇది పెంచిన తండ్రి తానే దు:ఖాన్ని ఆపుకోలేకపోతుంటే కనీ పెంచి పెళ్లి చేసి అత్తవారింటికి కూతుర్ని పంపించే తల్లిదండ్రుల మనోక్షోభ ఎంతటిదో అనే భావం ఇందులో ఉంది. వీరేశలింగంగారు ఈ నాటకాన్ని తెలుగులో గొప్పగా అనువదించారు. మాళవికాగ్ని మిత్రం అంటే ఆ ఇద్దరి కథా. మాళవిక అనే ఒక దాసీపై ప్రేమలో పడిన రాజు అగ్ని మిత్రుడి కథ. రాణిగారికి వీరి ప్రేమాయణం తెలిసి దాసిని నిర్బందిస్తుంది. మాళవిక రాజ పుత్రికయేనని తెలుస్తుంది. రెండవది అభిజ్ఞాన శాకుంతలం. దీని కథ అందరికి తెలిసిందే. మూడవది విక్రమోర్వశీయం – పురూరవ రాజు దేవతా స్త్రీ ఊర్వశిల ప్రణయం ఇదివృత్తం. వీరి ప్రేమ అనేక ఆటంకాలకు లోనై చివరికి ఇద్దరూ ఏకమై ఊర్వశి విజయ విక్రమ అవుతుంది.

కాళిదాస మహాకవి మహాకావ్యాలు కుమార సంభవం, రఘువంశం. పార్వతిదేవి జననం శివునితో కల్యాణం తాటక సంహారం కోసం కుమారస్వామి ఆవిర్భావం కథ కుమారా సంభవం. రఘువంశ రాజుల చరిత్రను తెలిపేది

రఘువంశం. ఈ రెండు కావ్యాలలో కాళిదాస ప్రతిభ బహుముఖీనంగా విస్తరించింది. గీర్వాణం అంటే దైవ స్వభావాన్ని పొందింది. వీటితోబాటు ఋతు ఘోష, మేఘదూతం అనే రెండు ఖండ కావ్యాలు రాశాడు కాళాదాసు. భారతదేశ ఋతు వర్ణనను ప్రతిభావంతంగా ఋతుఘోషలో వర్ణించాడు. మేఘదూతంలో మేఘాన్ని రాయబారిగా ఒక యక్షుడు తన ప్రియురాలికి పంపిన సందేశాన్ని కవితాత్మకంగా దారిలో కనిపించే ప్రదేశాల వివరాలతో సహా రాశాడు.

కాళిదాసు కవితా ప్రతిభ

శృంగార రసాన్ని పిండి వడబోశాడు కాళిదాసు. ఆయన దృష్టిలో ప్రపంచం రాగమయంగా దర్శనమిస్తుంది. వైదర్భీశైలితో నాటకాలు రాశాడు. సులభ శైలిలోనే రాశాడు. ఆయన సూక్తులు రసమాధుర్యంతో తొణికిసలాడతాయి. శకుంతల సౌందర్యమే కాళిదాసు కవితా సౌందర్యం “అనాఘ్రాతమ్ పుష్పంకిసలయ మలూనం కరరుహై - రానావిధం రత్నం మధునవ మనాస్వాదిత రసం - అఖండం పుణ్యానాం ఫల మివచ తద్రూప మనఘం”. కవుల్లో అగ్రేసరుడు కాళిదాసు. దీన్ని ఒక కవి తమాషాగా చెప్పాడు. “కవులు ఎవరెవరు అని లెక్కించటానికి చిటికెన వేలితో ప్రారంభిస్తే మొదటివాడు కాళిదాసు రెండవవాడు తగలనే లేదట అదీ ఆయన గొప్పతనం అంటాడు. శాస్త్ర సంబంధ ఉపమానంకాలారాలు విరివిగా వాడాడు.

“తతో మందానిలోద్ధత కమలాకర శోభినా - గురుం నేత్ర సహ్స్రేనా నోదయామాస వాసవ:” ఇంద్రుడు తనకున్న వెయ్యి కళ్ళతో గురువు బృహస్పతిని చూశాడట. ఆ కదలిక మెల్లని చల్లని గాలి చేత కమల వనం కదిలినట్లుగా ఉందట. మరో ఉపమాలంకారం - ఇందుమతీ స్వయంవరంలో రాజులు వరుసలో కూర్చున్నారు. ఆమె ఒక్కొక్కరిని చూస్తూ తిరస్కరిస్తూ వెడుతుంటే ప్రతివారికి తననే వరిస్తుందనే ఆశతో ముఖం వెలిగింది. దాటిపోగానే ముఖాలు చిన్నబోయాయి. దీన్ని దీపశిఖతో పోల్చాడు. దీపం ముందుకు వెడుతుంటే వెనకాల చీకటిని వదిలి పెట్టటం సహజం కదా అలా ఉంది ఈ సీను. దీప శిఖా వర్ణన కాళిదాసు చాలాచోట్ల చేశాడు. దేని ప్రత్యేకత దానికి ఉంది.

ఉత్ప్రేక్షలను, అర్థాంతరన్యాసాలను అర్థవంతంగా వాడాడు. వాల్మీకి తర్వాత ప్రకృతి వర్ణనలకు కాళిదాసుకే పేరు. ప్రకృతిని కవిత్వంలో చిత్రం గీసి చూపిస్తాడు. స్త్రీలను కోమలంగా వర్ణించాడు. వారికి ప్రత్యేక వ్యక్తిత్వం ఉంటుంది. సంవాదాలు నాటకీయంగా నడిపిస్తాడు. ఋతు సంహారంలో ఒక్కో సర్గలో ఒక్కో రుతువును వర్ణించాడు. మల్లినాథ సూరి కాళిదాస కావ్యాలకు గొప్పగా టీకా తాత్పర్యాలు సంస్కృతంలో రాస్తే వేదం వెంకటరాయ శాస్త్రిగారు చక్కని తెలుగులో చెప్పారు. కాళిదాస రచనలు ప్రపంచ భాషలన్నిటిలోకి అనువాదం పొందాయి. కొందరు ఆంగ్ల కవి నాటక రచయితా షేక్స్పియర్‌తో కాళిదాసును పోలుస్తారుకాని కాళిదాసు ప్రతిభ ముందు ఆయన సరిపోలడని ఎక్కువ మంది అభిప్రాయం. కొందరి భావనలు చూద్దాం – ముందుగా గోతే ఏమన్నాడో గమనించండి –

"Wouldst thou the young year's blossoms and the fruits of its decline and all by which the soul is charmed, enraptured, feasted, fed, Wouldst thou the earth and heaven itself in one sole name combine? I name these, O Sakuntala! and all at once is said (Translation by E.B.Eastwick)

"Here the poet seems to be in the height of his talent in representation of the natural order, of the finest mode of life, of the purest moral endeavor, of the most worthy sovereign, and of the most sober divine meditation, still he remains in such a manner the lord and master of his creation"

Goethe, quoted in Winternitz❁

6. యమక చక్రవర్తి - ఘటకర్పకుడు (పగిలిన కుండ) (100 bc)

విక్రమాదిత్య చక్రవర్తి ఆస్థానంలోని నవరత్న కవులలో ఘటకర్పకుడు ఒకడు. కాళిదాసు మహాకవి సమకాలికుడు. నీళ్ళు మోసే కులంలో పుట్టాడు. కనుక ఘట కర్పకుడు అని పిలువబడ్డాడు. కనుక క్రీ.పూ. ఒకటవ శతాబ్దికి చెందిన వాడుగా అనుకోవచ్చు. భాసుడే ఘటకర్పకుడు అనే ప్రచారమూ ఉంది. భాసుడే కూడా నీళ్ళు మోసేవాడు కనుక అతన్ని పరిహాసం చేయటానికి ఘటకర్పకుడు అని పిలిచేవారనే మాట వాడుకలో ఉంది కాని ఇది సమ్మతం కాదు. ఇద్దరూ వేరువేరు. భాసుడులాగా శూద్రకులంలో జన్మించాడని భావిస్తారు. ఈ పేరు రావటానికి ఆయనే తన కావ్యంలో కారణం చెప్పుకొన్నాడు.

"ఆలంబ్య చాంబు త్రుషిత: కరకశ పేయం - భావాను రక్త వనితా సురతై: శపేయం

జీయేయ యేన కవినా యమకైః పరేన - తస్మై వహేయముదకం ఘట కర్పరేణ" అంటే "ఎవరు యమకాన్ని ప్రయోగించటంలో నన్ను మించిపోతారో వారికి ఘటకర్పరంతో - పగిలిన కుండలో నీళ్ళు మోస్తాను" అని చాలెంజి చేసిన యమక చక్రవర్తి ఘటుడు. ఇతనికి కాళిదాసుతో స్పర్ధ ఉన్నదట. కుమార సంభవంలో కాళిదాసు "ఏకోహి దోషో గుణ సన్నిపాతేనిమజ్జ తోందో: కిరణే ష్వివాన్కః" అన్న శ్లోకంలోని అనౌచిత్యాన్ని ఎత్తి చూపాడు కర్పకుడు. యమకాన్ని

కాళిదాసు తక్కువగా వాడితే కర్పకుడు యమకంతో కావ్యాన్నే రాసి పారేశాడు. కాళిదాస మేఘ సందేశంలో యక్షుడు భార్యకు మేఘం ద్వారా సందేశం పంపిస్తే కర్పకుడు భార్య భర్తకు మేఘసందేశం పంపుతుంది. భర్త ఆమెను ఎప్పుడూ వర్షాకాలంలో వంటరిగా వదిలేసి వెళ్ళిపోతాడు అందుకే ఈ సందేశం. అదీ ముఖ్యమైన తేడా. రెండు కావ్యాలు వర్ష రుతువులోనే ఆరంభమౌతాయి. యక్షుడి విరహం ఎదాదిది అయితే కర్పర కావ్య నాయిక విరహం మూడే నెలలు. మేఘం ఎలా ప్రయాణం చేయాలో యక్షుడి చేత కాళిదాసు చెప్పిస్తాడు కాని కర్పర కావ్యంలో భార్య రూట్‌మాప్ ఇవ్వలేదు.

ఘట కర్పరుని కవితా గీర్వాణం

ఘట కర్పరకుని కావ్యంలో లభించినవి కేవలం 23 శ్లోకాలే. అందులో ఇరవై రెండవ శ్లోకం ప్రక్షిప్తం అని తేల్చారు. దీనికి అభినవ గుప్తుడు వ్యాఖ్య రాయలేదు. దివాకరుడు ఇరవైకి మాత్రమే వ్యాఖ్యానం చేశాడు. కనుక ఇరవై ఒక్క శ్లోకాల యమక కావ్యం "యమహా కావ్యం". ఇది సందేశ కావ్యాలలో మొదటిది అని విమర్శకాభిప్రాయం. అంటే మేఘ సందేశం కంటే ముందుది అని అనుకోవాలి. ఈ కావ్యానికి పేరు కూడా లేదు. అందరూ "ఘట కర్పర కావ్యం" అనే పిలుస్తున్నారు. మొట్టమొదటిసారిగా జర్మనీ దేశంలో "దుర్సే" అనే ఆయన సంపాదకత్వంలో 1828లో ప్రచురింపబడింది. అంతకుముందు ఏ భారతీయ రచయితా, కవి, ముద్రాపకుల దృష్టి దీనిపై పడకపోవటం దురదృష్టం. 1959లో డా.జతీంద్ర విమల్ చౌదరి ఆధ్వర్యంలో వ్యాఖ్యానంతో కలకత్తా నుంచి "సంస్కృత రూప సంగ్రహ" సిరీస్‌లో ప్రచురితమైంది. సంస్కృతంలో ఘట కర్పర కావ్యానికి వ్యాఖ్యానాలు రాసిన ప్రముఖులలో అభినవ గుప్తుడు, భారత మల్లికా, శంకర, తారా చంద్ర, గోవర్ధన, రంనాపతి మిశ్ర, దివాకర వైద్యనాధాదులున్నారు. అభినవ గుప్తుడు దీన్ని కాళిదాస కావ్యంగా భావించాడు. వృత్తిక అనే పేరుతో వ్యాఖ్యానం రాశాడు. "poem of the broken jug" అని ఇంగ్లీష్‌లో ఘటకర్పర కావ్యాన్ని పిలుస్తారు.

ఘటకర్పకుడు యమక చక్రవర్తి అన్నాం కదా. యమకం మహా

యమహాగా సుందరంగా చెవులకు ఇంపుగా హృదయోల్లాసంగా ఉంటుంది. సహజ సుందరమైన యమకాలను ప్రయోగించాడు కర్పక కవి. అప్రయత్నంగా మహా ఆశువుగా యమకం కర్పకునిలో ఊరి కర్పూర సువాసనలనీనుతుంది. అది అతని ప్రత్యేకత. మచ్చుకి ఒకటి.

"మేఘావృతం నిశిన భాతి నభో వితారం – నిద్రాభ్యుపైతి చ హరిం సుఖ సేవితారం

సేంద్రాయుధశ్చజలదోద్యర సన్ని భానాం – సంరంభ మావహతి భూధర సన్నిభానాం"

ఈ కావ్యంలో అయిదు రకాల ఛందస్సులను వాడాడు. కాళిదాసు మేఘ సందేశం అంత ప్రచారం దీనికి రాకపోయినా తర్వాత కవులపై ప్రభావం చూపింది. మదనుడు అనే కవి ఆకర్షితుడై తన కృష్ణలీల కావ్యంలో కర్పరకుని ఒక్కొక్క శ్లోకంలోని మొదటి పాదాన్ని తీసుకొని మిగిలిన మూడు పాదాలు తానూ చేర్చి రాశాడు. అలాగే రెండవ పాదాన్ని తన శ్లోకంలో రెండవ పాదంగా గ్రహించి మిగిలిన పాదాలు అల్లాడు. మొత్తం ఎనభై నాలుగు శ్లోకాలతో మదనుడు కృష్ణలీల కావ్యం రాశాడు. ఇలా ఇంతవరకు ఏ కవి కావ్యానికి ఆ గౌరవం అబ్బలేదు. ఘటకర్పకుడికే ఆ గౌరవం దక్కించాడు మదన కవి. యమకాన్ని కూడా కర్పక కవి వాడినట్లే దట్టించి వదిలాడు. కృష్ణ జననం, లీలలు, గోపికా విరహం, రాసలీలలను అత్యద్భుతంగా మదనుడు మదన మనోహరంగా, సుందరంగా, మనోహరమైన శైలిలో రాసి ఒక రకంగా కర్పకునికి అంకితం చేశాడు అన్నట్లు ఉంటుంది కావ్యం. మర్దనుడు పదహారవ శతాబ్ది దక్షిణ దేశ కవిగా భావిస్తారు. ❁

7. వ్యాస వాల్మీక సమానుడు
– గుణాధ్యుడు (100 bc)

గుణాధ్యుడు బృహత్కధ రాశాడు. ఇది సంస్కృతంలో ప్రాకృతంలో ఒక భేదమైన పైశాచీ భాషలో రాయబడింది. గ్రంధం మొదట ఉదయన రాజు చరిత్ర ఉంటుంది. ఆయన వాసవదత్త వివాహం తర్వాత అసలు కథ అతని కొడుకు నరవాహన దత్తుడితో ప్రారంభమవుతుంది. తర్వాత దత్తుని సాహస యాత్రలు, అనేక మంది కథలు చేరుతాయి. అంటే కథాకావ్యం అన్నమాట. గుణాధ్యుడు వ్యాస వాల్మీకి అవతారం అన్నారు. రామాయణ మహాభారతాలు బృహత్కధ అనే త్రివేణీ సంగమంలా కవిత్వాన్ని ప్రవహింప చేశాడని గోవర్ధనాచార్య అన్నాడు. గుణాధ్యుడు శ్రుతార్ధ అనే బ్రాహ్మణ స్త్రీకి కీర్తి సేనుడు అనే నాగరాజుకు గాంధర్వ వివాహంలో జన్మించాడని అంటారు. సుప్రతిష్టాన పురం అతని నివాసం. అతని కాలం క్రీ.శ అయిదు ఆరు నుంచి క్రీ.పూ ఒకటవ శతాబ్దం దాకా ఊహించారు. చివరికి స్మిత్ పండితుడు క్రీ.పూ ఒకటవ శతాబ్ది వాడేనని నిర్ణయంతో అందరూ ఏకీభవిస్తున్నారు.

పైశాచిలో రాయటానికి నేపథ్యం

సుసంపన్నం అయిన సంస్కృతాన్ని వదిలి పైశాచీ భాషలో ఎందుకు

రాశాడు? దీనికి ఒక కథ ప్రచారంలో ఉంది. శాతవాహన రాజు కుంతకుడు రాణితో జలక్రీడలో ఆమెపై నీరు చల్లుతాడు. ఆమె సంస్కృతంలో "మొదకైస్తాడయ" అన్నది అర్ధం తెలియని రాజు మోదకాలు అంటే ఉండ్రాళ్ళు కావాలని అడుగుతోందేమోనని భావించి తెప్పించి విసిరాడు. అతని అజ్ఞానానికి ఆమె పరిహసించింది. ఉక్రోషం వచ్చిన రాజు ఆస్థాన పండితుడు గుణాఢ్యుడిని ఆశ్రయిస్తే ఆరేళ్లలో పండితుడిని చేస్తానంటే అక్కడే ఉన్న శర్వ వర్మ ఆరు నెలల్లో చేస్తానని సవాలు విసిరాడు. వర్మ నిజంగా అలా చేస్తే తాను సంస్కృత, ప్రాకృత మొదలైన దేశ భాషలను త్యజిస్తానని గుణాఢ్యుడు శపథం చేశాడు. శర్వ శర్మ కాతంత్ర అనే వ్యారణాన్ని రాసి అన్న మాట ప్రకారం రాజును సంస్కృతంలో పండితుడిని చేశాడు. మాట నిలబెట్టుకోవటానికి గుణాఢ్యుడు సంస్కృతాది భాషలు త్యజించేశాడు. భూతాల భాష అయిన పైశాచిలో కావ్యం రాశాడు.

బృహత్కథ - కవితా గీర్వాణం

గుణాఢ్యుడు శివ గణాలలో ఒకడు అని కథా సరిత్సాగరంలో ఉంది. శివుడు పార్వతికి ఈ కథలు చెబుతూండగా పుష్పదంతుడనే శివ గణంలోనివాడు చాటుగా విన్నాడు. ఇది గమనించిన పార్వతి మానవునిగా పుట్టమని శపించింది. రహస్యంగా విన్న ఏడు కథలను పిశాచంగా ఉన్న కాన భూతికి చెప్పి కైలాసానికి రమ్మని ఆదేశించింది. అతని సోదరుడు మాల్యవంతుడు మధ్యలో అడ్డుకోగా అతన్నీ మనిషిగా పుట్టమన్నది. పుష్పదంతుడు వర రుచిగా పుట్టి మగధ పాలకుడు నందరాజు దగ్గర మంత్రి అయ్యాడు. ముసలితనంలో వింధ్య పర్వతాలను చేరి కానభూతిని కలిసి కథలు చెప్పి కైలాసం చేరాడు. మాల్యవంతుడు గుణాఢ్యుడుగా పుట్టి ప్రతిష్టానపురంలో శాతవాహన రాజ మంత్రి చేసి, తర్వాత వింధ్య ప్రాంతానికి వెళ్లి పైశాచి భాష నేర్చాడు. కానభూతి చెప్పిన కథలు విన్నాడు. భూతి పిశాచ రూపం పోయింది. కానభూతి చెప్పిన వాటిని ప్రచారం చేస్తూ భూలోకంలో ఉండి శిష్యులు గుణ దేవ, నంది దేవుల సలహాతో శాతవాహన రాజుకు చూపాడు. పైశాచీ భాషలో ఉండటం వలన దాన్ని నిరాకరించాడు రాజు. అవమానం పొంది వింధ్యకు వెళ్లి చితి పేర్చుకొని రాసిన గ్రంథంలో ఒక్కో పత్రం మంటల్లో

వేసి కాల్చేస్తున్నాడు. రాజు తప్పు తెలుసుకొని వచ్చి ఆపాడు. అప్పటికే ఆరువంతుల గ్రంథం దగ్ధమైంది. నరవాహన దత్తుని వృత్తాంతం ఉన్న లక్షపద్యాలే మిగిలాయి. దీన్ని శిష్యులకిచ్చి శాప విమోచనం పొంది కైలాసం చేరాడు.

శిష్యులను రాజధానికి తీసుకొని వెళ్లి రాజు వారిని సత్కరించి దానికి ఆముఖంగా 'కథా పీఠం' రాశాడు. అప్పటి నుంచి బృహత్కథగా ప్రచారమైంది. మూల పైశాచీ గ్రంథం లోకంలో లేకుండాపోయింది. బాణాది కవులు దీన్ని ఉదహరించారు. పైశాచీ భాష భారతదేశంలో ఉత్తర – పశ్చిమ అంటే వాయవ్య దిశలో ప్రచారంలో ఉండేదట. ఈనాటి దర్దిక్ భాషకు దగ్గరలో ఉంటుందట. పాంచాల, కేకయ, బాహ్లిక, నేపాల, కుంతల గాంధార ప్రజలు పైశాచీని మాట్లాడేవారని పిశేల్ అనే చారిత్రకుడు అన్నాడు. శౌరసేనికి దగ్గరగా ఉంటుందని అన్నారు. బౌద్ధ భిక్షువులు దీనిని నేర్చుకొనేవారట. అంటే నిత్య జీవితంలో ప్రజలు మాట్లాడే భాషగా పైశాచి ఉండేదని తెలుస్తోంది. నాగరకులు కాక మిగిలిన సామాన్యులు మాట్లాడే భాష. భోజరాజు పైశాచిని నిషేధించాడట. ప్రజా సామాన్య భాష కనుకనే గుణాఢ్యుడు దీనిలో బృహత్కథ రాశాడని గ్రహించాలి. ఇప్పుడు బృహత్కథ క్షేమేంద్రుడు రాసిన బృహత్ కథా మంజరిగా, సోమదేవుడు రాసిన కథా సరిత్సాగరంగా దర్శనమిస్తోంది. బృహత్కథలో రాజు విరక్రమాదిత్యుడిని పేర్కొన్నాడు గుణాఢ్యుడు. గాథా సప్తశతి రాసిన హాలుడు, గుణాఢ్యుడు విక్రమాదిత్యుని కాలంలో ఉండేవారు. మహారాష్ట్రలో పైఠాన్ అనే ప్రాంతాన్ని పాలించిన శాతవాహన రాజు ఆస్థానంలో గుణాఢ్యుడు ఉండేవాడు. గుణాఢ్యుడు తన కావ్యాన్ని సకల కళాసారంగా రచించాడు. అతడు అన్నిటా ఆరితేరిన వాడనిపిస్తాడు. ఈ కథా కావ్యాన్ని ఉత్తమ పురుషలో రాసి తానే మనకు చెబుతున్నట్లు రాయటం విశేషం. తన దృష్టికోణంలో కథలను వివరిస్తాడు.

ప్రభావం

బృహత్కథను క్షేమేంద్రుడు, బుద్ధస్వామి సోమదేవుడు అనువాదం చేశారని చెప్పుకొన్నాం. ఇందులోని కథలెన్నో పంచతంత్రం భేతాళ వింశతి, శుక సప్తతి వంటివాటిల్లో చేరాయి. బౌద్ధ జాతక కథల్లోనూ దూరాయి. కథా అనే గద్య

ప్రక్రియపై కూడా దీని ప్రభావం ఉంది. బాణుడు, సుబంధు దీన్ని చాలా గౌరవించారు. ఉదయనుడి భార్య వాసవదత్త పేరును సుబంధు తన కావ్య నాయికకు పెట్టాడు. బాణుడు ఉజ్జయినిలో బృహత్కథా కుశలురు ఉండేవారని తెలియజేశాడు. కథా మహాకావ్యాలకు బృహత్కథ ప్రేరణనిచ్చింది. దశకుమార చరిత్ర, కాదంబరి కథలపై దీని ప్రభావం ఉంది. అనేక దేశ విదేశీ భాషల్లోకి అనువదింపబడింది.

గుణాలకు ఆఢ్యుడు అతిగొప్ప గ్రంథం బృహత్ కథను రాసి ఎందరికో ప్రేరణనిచ్చాడు. జన సామాన్య భాషలో సామాన్య జనాలకు అర్థమయ్యేట్లు రాసి వ్యావహారిక భాషోద్యమానికి ఆనాడే పునాది వేసిన మార్గదర్శి గుణాఢ్యుడు.❁

8. బౌద్ధ వేదాంతి, కవి - అశ్వ ఘోషుడు (80-150ad)

అశ్వ ఘోషుడు అంటే చాలాకాలం వరకు బౌద్ధ వేదాంతి అనే అనుకొన్నారు. కాని అతని కావ్య, నాటకాలు వెలుగు చూసిన తర్వాత కాళిదాసాది కవుల సరసన చేర్చారు. సౌందరనందం చివర్లో తనను గురించి "ఆర్య సువర్ణాక్షి పుత్రస్య సకేతస్య భిక్షోరాచార్యస్య భదంతా ఆశ్వ ఘోషశ్యా మహా కవేర్మహా వాదిన: కృతిరిహస్య" అని చెప్పుకొన్నాడు. దీనిని బట్టి సువర్ణాక్షి తండ్రి అని, అయోధ్యా నగర వాసి అని, బౌద్ధ ఆచార్య పదవి అందుకొన్నాడని, అప్పటికే ప్రసిద్ధి చెందాడని తెలుస్తోంది. వేద ధర్మాచరణ చేసే బ్రాహ్మణుడని అర్థమవుతోంది. తర్వాత బౌద్ధానికి ఆకర్షితుడై వసుమిత్రాచార్యుల వద్ద దీక్ష తీసుకొన్నాడని మహాయాన శాఖకు చెందినవాడని అవగతం అవుతుంది. తన పాండిత్య, కవిత్వాలను బౌద్ధ మత వ్యాప్తికే వెచ్చించాడు. గొప్ప ప్రచారమూ చేశాడు. గొప్ప సంగీతజ్ఞుడు కనుక మాధుర్య గానంతో జనాలను పరవశులను చేసేవాడట.

అశ్వఘోషుడు బుద్ధ చరిత రాశాడు. దీనికి చైనా అనువాదం ధర్మరక్ష అనే భారతీయ పండితుడు క్రీ.శ.414-421లో చేశాడట. కనుక అంతకుముందు వాడేనని భావించాలి. మధ్య ఆసియాలో బుద్ధ చరిత్రలోని శారీపుత్ర ప్రకరణ వ్రాతప్రతులు దొరికాయి. దీన్నిబట్టి కుషానుల కాలానికి కనిష్కుడి కాలానికి చెందినవాడని పాశ్చాత్య పండితుడు లూదర్స్ అభిప్రాయపడ్డాడు. బౌద్ధ అభిధర్మానికి

"విభాష" అనే వ్యాఖ్య అశ్వఘోషుడు కనిష్కుని బౌద్ధ ధర్మ మహాసభల సమయంలో రాశాడు కనుక కనిష్కుని సమకాలీనుడే కాని క్రీ.పూ ఒకటవ శతాబ్ది అంటే 80-150 అని నిర్ణయించారు. ఒక ఐతిహ్యం ప్రకారం కనిష్కుడు పాటలీపుత్రం మీదికి దండెత్తి, ఆ రాజును జయించి ఆరుకోట్ల డబ్బును పరిహారంగా అడిగాడని, రాజు దానికి మూడుకోట్ల విలువ అని భావించి, బదులుగా బుద్ధుని భిక్షాపాత్రను, మరో మూడుకోట్లకు బదులుగా అశ్వఘోషుని సమర్పించాడట. ఇలా కనిష్కుడు అశ్వఘోషుడిని దక్కించుకొని రాజధాని పెషావర్ అని పిలువబడే పురుష పురానికి తీసుకువెళ్లి, అతని ప్రేరణ చేత బౌద్ధాన్ని స్వీకరించాడని తెలుస్తోంది. తర్వాతే కనిష్కుడు బౌద్ధమత వ్యాప్తికి పూనుకొన్నాడట. చైనా, టిబెట్, జపాన్ మధ్య ఆసియా మొదలైన చోట్లకు బౌద్ధ భిక్షువులను పంపి ప్రచారం చేయించాడు.

ఘోషుని కవితా ఘోష

అశ్వ ఘోషుడిని బౌద్ధులు మహా దార్శనికునిగా ఆరాధిస్తారు. అనేక దార్శనిక గ్రంథాలు రాశాడు. కనుక కవిగా మరీ గుర్తింపు తెచ్చుకొన్నాడు. అతను బుద్ధ చరిత్రతో బాటు, సౌందర నందం సూత్రాలంకారం, మహాయాన వ్రద్ధోత్సవం, వజ్ర సూచీ మొదలైనవి రాశాడని అంటారు. ఇందులో బుద్ధచరిత్ర, సౌందరనందాలకు విశ్వవ్యాప్తి ఉంది. శారీపుత్ర అనే ప్రకరణాన్నీ రాశాడు. ఇరవై స్రగ్ధరా వృత్తాలతో "గాండీ స్తోత్రం" రాశాడు. ఇది బుద్ధ స్తుతి. రాష్ట్ర పాలుడు అనే గేయ నాటకమూ రాశాడని "సిల్వీ లేవి" భావించాడు.

సంస్కృత బుద్ధ చరిత్రలో పదిహేడు సర్గాలున్నాయి. చివరి నాలుగు సర్గాల్ని పందొమ్మిదో శతాబ్దంలో అమృతానందుడు రాశాడని అంటారు. చైనా భాషలో అనువాదానికి ఇరవై ఎనిమిది సర్గలున్నాయట. బుద్ధుడు జన్మించినది మొదలు చివరిదాకా ఉన్న కథ, అశోకుడి కాలంలో జరిగిన యుద్ధాలు, బౌద్ధ సభా వర్ణనలూ ఉన్నాయి. బుద్ధ చరితకు ఆధారం ఏమిటో ఎవరూ చెప్పలేకపోతున్నారు. "లలితా వర్తనం" నుంచి మూలకథ తీసుకొని మార్పులు చేశాడని ఊహ. శృంగారాన్ని రమ్యంగా వర్ణించాడు. సభ్యత మీరలేదు. బుద్ధుడు తపస్సు చేస్తుండగా మన్మథుడు వేసిన బాణం నిష్ఫలం అయిన సందర్భంలో

"శైలేంద్ర పుత్రీం ప్రతి ఏవ ద్దో దేవో పి శంభు స్చలితో బభూవ – నచిన్తయత్యేష తమేవ బాణంకిం స్యా వచితో న శరః స ఏషః" – దీని అర్థం – "ఏ బాణం చేత శివుడు పార్వతిని చూసి చలించి విచలమనస్కుడైనాడో ఆ బాణాన్నే బుద్ధుడు లెక్క చెయ్యలేదు ఏమిటి? ఇతనికి హృదయమే లేదా? లేకపోతే ఈ బాణం బాణమే కాదా?" ప్రకృతి వర్ణనలూ బాగానే రాశాడు, బుద్ధుడు శాక్య వంశానికి చెందినవాడు. శాక్యులు శ్రీరాముని ఇక్ష్వాకు వంశస్తులు. అశ్వ ఘోషుడు శ్రీరాముని అయోధ్య వాసి కనుక వాల్మీకినే అనుసరించి బుద్ధ చరిత్రలో వర్ణనలు చేశాడు. బుద్ధుడు మారుని అంటే మన్మధుని జయించే ఘట్టాలు చాలా మనోజ్ఞంగా ఉంటాయి.

సౌందరనందంలో కవిత్వ సౌందర్యం

బుద్ధుడు సోదరుడు నందుడు బౌద్ధమతాన్ని తీసుకోవటమే ఇందులో కథ. ఇది ప్రౌఢ రచన. బద్ధచరితలోనివే. ఇందులోనూ కొన్ని పునరావృత్తమైనాయి. నందుడు సుఖాభిలాషి. సంసార జీవితంపై మోజున్నవాడు. భార్య సుందరి అంటే ప్రాణం. అలాంటి వాడి మనసు మార్చి బుద్ధుడు దీక్షనిస్తాడు. ఇది మహాకావ్యాల సరసన చేరింది. సుందరీనందుల శృంగారాన్ని రమణీయంగా వర్ణించాడు. రసరమ్య కావ్యంగా చిరకీర్తి నందుకొన్నది సౌందర నందం. తెలుగులో దీనినే పింగళి లక్ష్మీకాంతంగారు కాటూరి వెంకటేశ్వరరావుగారు సుమధుర కావ్యంగా తీర్చిదిద్దారు. ఘోషుడు మంచి ఉపమానాలు వాడాడు. అన్ని రసాలను పోషించి కావ్యానికి శోభ చేకూర్చాడు. కవిత్వం హృదయాన్ని ఆకర్షిస్తుంది. అశ్వ ఘోషుడి భావాలను కాళిదాసు అనుకరించాడని అంటారు. సుందరీ నందుల వియోగాన్ని అశ్వఘోషుడు రాత్రికి చంద్రునికి మధ్య వియోగంతో పోల్చటం విచిత్రమనిపిస్తుంది.

"తాం సుందరీం చేన్న లభేతనన్దః సా వా నిషేవేతే న తమ్ నత భ్రూ: –
ద్వంద్వం ధ్రువం తద్వికలం న శోభేదన్యోన్య హీనా వివ రాత్రి చంద్రౌ"

వేదాంత భావనలనూ సరళంగా అర్థమయ్యే రీతిగా వర్ణించాడు. శాంత, కరుణ రసాలనూ అద్భుతంగా పోషించాడు. అయితే "సిమెట్రీ" ఘోషునిలో కాళిదాసు కంటే తక్కువేమో ననిపిస్తుంది. మానవ హితం కోసం ఈ రెండు

గ్రంధాలూ రాశాడు కనుక కావ్య సౌందర్యం కంటే ప్రజా ప్రయోజనం కోసం రాశాడు. బుద్ధ ధర్మ ప్రచారమే ధ్యేయం. హైందవ ధర్మంపై ద్వేషం లేనివాడు. కారణం మొదట్లో ఆ సంస్కారంలో పెరిగిన వాడే కనుక. అందుకే బుద్ధ కథల్లో రామాయణ భారత కథలను జోడించాడు.

అశ్వఘోషుడి తర్వాత గుప్తుల కాలం వరకు నాలుగు వందలేళ్ళు సంస్కృత కవులు కనపడటం లేదు. అప్పటిదాకా ప్రసిద్ధ కవులు కావ్యాలు లేకపోయి ఉండవచ్చు. గుప్తులకాలం వైదిక మతం పునరుద్ధానం చెంది స్వర్ణయుగం అనిపించుకొన్నది. క్రీ.శ.345 అలహాబాదు శాసనంలో సముద్ర గుప్తుని ప్రశస్తి కనిపించింది. ఈ శాసనాన్ని హరి శేనుడు అనే కవి రచించాడు. శైలి వైదర్భా రీతిలో రమ్యంగా ఉంటుంది. గద్యమూ ఉన్నది. సముద్ర గుప్తుడి ఆస్థానంలో యితడు ఏదైనా కావ్యాలు రాసి ఉంటాడని ఊహిస్తున్నారు. క్రీ.శ.472 మందసర్ శాసనాన్ని వత్సభట్టి కవి గౌడీ శైలిలో రాశాడు. ఇతనిపై మేఘ సందేశ, ఋతుసంహార కావ్య ప్రభావం ఉందని భావన.❀

9. నైషధ కర్త - శ్రీహర్షుడు (106 ad)

ఇప్పుడు హర్షుని కాలం నుండి సుమారు అయిదు వందల ఏళ్ళు ముందుకు దూకి శ్రీహర్షుడి గురించి రాస్తున్నాను. దీనికి కారణం ఇద్దరూ ఒకే కాలానికి చెందిన వారు కాకపోయినా ఇద్దరూ వేరు వేరు వ్యక్తులని చాలా మందికి తెలియదు. ఒక్కరే అని చాలామంది భ్రమ పడుతున్నారు. చక్రవర్తి హర్షుడు నాగానందం మొదలైన మూడు నాటకాలు రాస్తే, శ్రీహర్షుడు సంస్కృత పంచకావ్యాలలో ముఖ్యమైన "నైషధ చరిత్ర" అంటే మన శ్రీనాధుడు అనువాదం చేసిన శృంగార నైషధం రాశాడు. దీన్ని రాస్తూ "హర్ష నైషధ కావ్యమాంధ్ర భాష" అన్నాడు. విద్వాంసులకే ఔషధం అనిపించుకొన్న మహాకావ్యం నైషధం. శ్రీహర్షుడు మహా మేధావి. కనిపించిన ప్రతిదానిపై అమోఘంగా కవితలల్లేవాడట. అవి అర్ధం చేసుకోవటం సామాన్యులకు అలవి అయ్యేది కాదట. పండితులే ముక్కున వేలేసుకొనే వారట. బుర్రలు బద్దలు కొట్టుకొన్నా మింగుడు పడేవికాదట. ఆ తెలివి తేటలు అనితర సాధ్యంగా ఉండేవట. తల్లికి భయం వేసేదట. అతని మేనమామను పిలిపించి గోడు వెళ్ళబోసుకొనేదట. ఆయన దీనికి విరుగుడుగా అతని మేధస్సు తగ్గించటానికి రెండు కిటుకులు చెప్పి చేయించాడట. ఒకటి కాకర పాదు కింద రోజు వేడినీళ్ళతో స్నానం చేయించటం, రెండవది బుద్ధిమాంద్యం కలిగించే మినప పప్పుతో రోజు కుడుములు లేక గారెలు వేసి తినిపించటం. ఈ రెండూ ఆమె క్రమం తప్పకుండా చేసిందట. వీటి ప్రభావం వలన వెయ్యోవంతు మేధ మాత్రమే తగ్గిందట. "మాష పూపాలపై" (గారెలు) అలవోకగా అప్పుడు శ్లోకం చెప్పి వాళ్ళమ్మను మేనమామను సంభ్రమాశ్చర్యాలతో ముంచేశాడట. అతని మేధస్సును ఎవరూ తగ్గించలేరని నిర్ణయించుకొన్నారట. అలాంటి శ్రీహర్షుని గురించి ఇప్పుడు మనం తెలుసుకోబోతున్నాం. శ్రీనాధ కవి సార్వభౌముడు రాసిన

అన్ని గ్రంథాలకంటే శృంగార నైషధానికే గొప్ప పేరు వచ్చింది. హర్షుని హృదయాన్ని వెతికి పట్టుకొని రాసిన మహా కావ్యం అది. "సీసాల"తో ఉయ్యాల లూగించాడు. అంతేకాదు సంస్కృత నైషధంలో శ్రీహర్షుడు మంత్రం శాస్త్రాన్ని నిక్షిప్తం చేశాడని మహా పండితుడు కవి, శ్రీ గుంటూరు శేషేంద్ర శర్మగారు గొప్ప వ్యాఖ్యానం రాశారు.

శ్రీహర్ష చరితం

కనోజు పాలకుడైన జయచంద్రుని ఆస్థానకవి శ్రీహర్షుడు. కాలం 1130-1190. తల్లి మామల్లాదేవి. తండ్రి శ్రీహీరుడు. "నైషధ చరిత" రాసి ప్రసిద్ధుడు అవటం వలన "నర భారతి" అనే బిరుదు పొందాడని రాజశేఖరుడు "ప్రబంధ కోశం"లో రాశాడు. జీవితంలో చివరికాలం గంగా నదీ తీరంలో తండ్రి ఉపదేశించిన "చింతామణి మంత్రం" జపిస్తూ ఒక ఏడాది గడిపాడు. అప్పుడు త్రిపుర సుందరీదేవి ప్రత్యక్షమై అపూర్వ శేముషిని, ప్రతిభను అనుగ్రహించిందని, ఆ ప్రభావంతో అలవోకగా నోటి నుండి కొన్ని శ్లోకాలు బయటికి వచ్చాయి అని పండితులకే అర్థం కాలేదట. మళ్ళీ దేవి అనుగ్రహాన్ని పొంది అందరికి సులభంగా అర్థమయ్యే రీతిలో కవిత్వం చెప్పే సామర్థ్యాన్ని పొందాడట. పండిత సభలో ఉదయనాచార్య అనే పెద్ద పండితుడిని ఓడించాడట.

1174లో నైషధ చరితను గుజరాత్‌కు వీర ధవళ రాజు వద్దకు శ్రీహరుడు తీసుకొచ్చాడని, చందూ పండితుడు "దీపిక"లో చెప్పాడట. దీనికి విద్యాధరుడు వ్యాఖ్యానం రాశాడట. శ్రీహర్షుడు "ఖండన ఖండ ఖాద్య" రాసిన దానికంటే ముందే నైషధము రాశాడట. శ్రీహర్షుడు రాసినట్లుగా చెప్పబడుతున్న విజయ ప్రసస్తి, చంద్ర ప్రశస్తి, గౌడీర్వికాసకుల ప్రశస్తి, సాహసాంక చరిత, ఆర్ణవ వర్ణన, అమర ఖండన అలభ్యాలు, న్యాయ శాస్త్ర విశేషాలపై హర్షుడు వ్యాఖ్యానంగా "ఖండన ఖండ ఖాద్య" రాశాడని అంటారు. ఇవి కాక స్థైర్య విచారం, చింది శ్రస్తి, శివ శక్తి సిద్ధి, ఈశ్వర త్రిసంది రాశాడని అంటారు.

శ్రీహర్షుడు కనోజు రాజు జయచంద్రుని ఆస్థానకవి. జయచంద్రుడు పృథ్వీరాజ్ చౌహాన్‌కు మామ. కూతురు రాణి సంయుక్త పృథ్వీ రాజును

ప్రేమించింది. జయచంద్రుడికి ఇష్టం లేదు. ఆమెను పృధ్వీరాజు వీరోచితంగా తీసుకొని వెళ్లి వివాహం చేసుకొన్నాడని చరిత్ర. నైషధకావ్యాన్ని రాసి కాశ్మీర్‌కు తీసుకువెళ్లి అక్కడ సర్వజన పీఠ అధినేత్రి సరస్వతీ దేవి హస్తాలలో ఉంచాడని, ఆమె అదరంతో స్వీకరించిందని, తన కావ్యానికి సరస్వతి ఆమోదం తెలిపిందని కాశ్మీరరాజు మాధవ దేవుని నుండి రాజముద్రికను వేయించుకొని లేఖను తెచ్చాడని ఒక కథనం ఉంది. పృధ్వీ సంయుక్తల అమరప్రేమనే నైషధంలో ప్రతిబింబింపజేశాడని అంటారు.

నైషధంలో శ్రీహర్షణీయం

నైషధ మహాకావ్యం ఇరవై రెండు సర్గలున్నది. నల దమయంతుల ప్రేమకథా పూర్ణం. కథ మనకు తెలిసినదే. నలుడిని పరీక్షించటానికి ఇంద్ర, వరుణ, అగ్ని, యములు దమయంతి స్వయంవరానికి రావటం, నలుడికి తిరస్కరిణీ విద్యనిచ్చి తమ దూతగా దమయంతి దగ్గరకు రాయబారిగా పంపటం, నలుడి వేషంలోనే దిక్పాలకులు కూర్చోవటం, సరస్వతీ దేవి స్వయంగా వచ్చి స్వయంవర రాజులను చమత్కారంగా పరిచయం చేయటం, దేవతల అనుగ్రహంతో నలుని దమయంతి గుర్తించటం, నల దమయంతుల వివాహం, కలి విజృంభణ, మొదలైనవి ఉన్నాయి. ఇది మహాభారత కథయే. కొంత కథా సరిత్సాగరంలోనూ ఉంది. వివాహం వరకు శృంగార కావ్యంగానే రాశాడు. ఔచితీ యుతమైన రచన చేశాడు.

ఆలంకారిక శైలి భారవితో ప్రారంభమై, మాఘునిలో పరిపక్వమై శ్రీహర్షునితో ఉత్కృష్ట స్థాయి పొందింది. తరువాత వచ్చినవన్నీ అంత గొప్పవి కావు కనుక "ఉదితే నైషధే కావ్యే క్వ మాఘః క్వచ మాఘః క్వచ భారవిః" అన్న లోకోక్తి ప్రచారమైంది. విద్వాంసుల గర్వమనే రోగాన్ని పోగొట్టే ఔషధం నైషధం – అంటే "నైషధం విద్వదౌషధం". అంతేకాదు "అందమైన కన్య సౌందర్యం బాలుని మనస్సును ఎలా ఆకర్షించలేదో అదే విధంగా సరసం లేని అరసులకు నా కావ్యం అర్థం కాదు" అని చెప్పాడు హర్షుడు. గురువు దగ్గరైనా చదువుకోవాలి, లేకపోతే వ్యాఖ్యానాలన్నా చదవాలి. అప్పుడే అర్థమవుతుంది.

హర్షుని కవిత్వంలో ఓజో గుణం ఉంటుంది. నారికేళ పాకం. పగలగొట్టుకు తింటూ నమిలితేనే మాధుర్యం. శ్లేషతో చమక్కులు చేశాడు. దీర్ఘ సమాసాలతో ఊపిరి ఆడనీయడు. ఉక్తి వైచిత్రికి అగ్రాసనం వేశాడు. ప్రతిశ్లోకం అలంకార శోభితం. భావ కల్పనా అనితర సాధ్యం, అద్భుతం, ఆశ్చర్యం. అంత మాత్రాన పదలాలిత్యం లేదనుకోరాదు. అదీ తగు మోతాదులో ఉంది. "నైషధే పద లాలిత్యం" అన్న పేరూ పొందింది. శైలి గాఢమైన బంధాలతో గౌడీ రీతిలో ఉంటుంది. ప్రతిశ్లోకం రమణీయమే. ప్రతిభావం అపూర్వమే. ప్రతి అలంకారం పరమ రమణీయమే.

ప్రబంధంలో ఉండే వర్ణనలన్నీ చేశాడు. ఒకే విషయాన్ని పలుచోట్ల పలు రకాలుగా వర్ణిస్తేనే కాని హర్షుడిని తృప్తి ఉండదు. "ఏకామత్యజతో నవార్థ ఘటనాం" అన్నాడు. ప్రతిదానిలో కొత్తదనాన్ని కల్పిస్తాడు. కన్పించేట్లు చేస్తాడు. నైషధానికి 23 వ్యాఖ్యానాలున్నా మల్లినాథ సూరి రాసిన "జీవాతువు" ప్రముఖమైనది. తర్వాత నారాయణ భట్టు రాసిన, నైషధ ప్రకాశం. హర్షుడు మహా పండితుడు, మహా కవీ, మహా వ్యాకరణవేత్త, మహా దార్శనికుడు. షట్ దర్శన పాండిత్య విశేషుడు. అద్వైత సిద్ధాంతి. చార్వాకాది సిద్ధాంతాలనూ చదివాడు. ఇతర దర్శనాలను అవహేళన చేశాడు. అతని వ్యాకరణ పాండిత్యాన్ని తెలియజేసే శ్లోకాలు అపరిమితంగా కనిపిస్తాయి. అతని కామశాస్త్ర పారంగత్యమూ జ్యోతకమవుతుంది. ఇందులో కొన్ని ప్రతీకలు కనిపిస్తాయి. నల దమయంతుల ప్రేమకు హంస రాయబారం జరుపుతుంది. ఈ హంసను జీవాత్మ, పరమాత్మలను కప్పి ఉంచే అజ్ఞానాని తొలగించి, వారిద్దరి కలయికకు తోడ్పడే గురువుకు ప్రతీక అని భావించారు. ఇలాంటి అద్వైత భావనలెన్నో ఇందులో ఉన్నాయనే శేషేంద్ర శర్మ గొప్పగా నిరూపించారు. హర్షుడి మేనమామయే "కావ్య ప్రకాశం" అనే అలంకార గ్రంధం రాసిన ముమ్మటుడు అని ఒక అభిప్రాయం వుంది లోకంలో. మేనల్లుడు రాసిన నైషధాన్ని ముందే చూసి ఉండినట్లయితే తాను తన అలంకార శాస్త్రంలో దోష ప్రకరణానికి వేరేచోట్ల వెతుక్కొనే పని ఉండేది కాదు కదా అని అనుకొన్నాడట. ❁

10. "మట్టి బండి" ప్రకరణ కర్త - శూద్రక మహాకవి (200 ad)

శూద్రక మహాకవి నాటక నవలాకారుడు. మూడవ శతాబ్దికి చెందినవాడు. శూద్రకనామం కలంపేరు. అసలు పేరు అభీర రాజులలో ఒకడై ఉంటాడని ఊహిస్తున్నారు. ఇంద్రాణి గుప్తుడు లేక ఈశ్వర సేనుని తండ్రి శివదత్తుడే శూద్రక మహారాజు అని భావిస్తున్నారు. "పద్మ ప్రభృతిక" అనే భాణం ఏకాంకిక నాటక రచనా చేశాడు. ఇది ఒకే వ్యక్తీ తన అంతరంగాన్ని వివరిస్తూ స్వగతం (మోనోలోగ్)గా చెప్పుకొనే తమాషా ప్రయోగం. మృచ్ఛకటికం లేక మట్టిబండి నాటకంతో లేక విఖ్యాతుడైనాడు. దీనికే ప్రకరణం అనే పేరుంది. ప్రకరణ రచనకు ఆద్యుడు శూద్రకుడు.

శూద్రక మహాకవి రాజుకు సకల శాస్త్రాలలో పాండిత్యం ఉంది. శివుడి అనుగ్రహంతో లోకోత్తర దర్శనం పొందాడట. గొప్ప యోధుడని, పరాక్రమశాలి అని, వందేళ్ళపై పది రోజులు జీవించి అశ్వమేధ యాగం చేసి దాని విధి విధానం ప్రకారం అగ్ని ప్రవేశం చేశాడనేది ప్రచారంలో ఉంది. పాశ్చాత్యులు కొందరు మృచ్ఛకటికం ఈతని రచన కాదన్నారు. కాని విల్సన్, డాక్టర్ స్మిత్‌లు మాత్రం శాతవాహనరాజు శ్రీముఖుడే శూద్రకుడు అన్నారు. అయితే క్రీ.పూ. రెండవ శతాబ్ది వాడై ఉండాలి. ప్రాచీనకాలంలో "శూద్రకు" అనే గణ రాజ్యం ఉండేదని, అలెక్సాండర్ భారతదేశంపై దండయాత్ర చేసినప్పుడు వీరు ఎదిరించారు, వీరిని గ్రీకులు "సోద్రోయి" అని పిలిచేవారట. అలెక్సాండర్‌తో విరోచితంగా యుద్ధం చేసినట్లు గ్రీకు చరిత్రకారులే రాసుకొన్నారట. వ్యాకరణకర్త పాణిని "శూద్రాయణులు" అని అంటే పతంజలి బ్రాహ్మణేతరులని పేర్కొన్నాడని తెలుస్తోంది. శూద్రులు, మహా శూద్రులు అని వీరిలో రెండు తెగలున్నాయట.

శూద్రకుడు వామన కవి చేత ఉద్ధరింపబడ్డాడని ప్రచారంలో ఉంది. బాణుడు, దండి కూడా ఇతనికి పరిచయస్తులే. భేతాళ పంచ వింశతికలో శూద్రక ప్రసక్తి ఉంది. విక్రమాదిత్యుని సమకాలీనుడు కావచ్చుననే వారూ ఉన్నారు.

ఆయనకంటే ఇరవై ఏడేళ్లకు పూర్వం శూద్రక మహారాజు రాజ్యపాలన చేశాడట. రాజధాని "శోభావతి" అని కథా సరిత్సాగరంలో ఉన్నది. కాళిదాసుకు పూర్వం భాసుని తర్వాతి వాడు అని మరి కొందరివాదం. కాదు మృచ్ఛకటికంలో కాళిదాసును అనుసరించిన సందర్భాలున్నాయి కనుక కాళిదాసు తర్వాత వాడు అన్నారు మరి కొందరు.

మృచ్ఛకటిక ఔన్నత్యం

ఈ నాటకంలో పది అంకాలున్నాయి. భాస మహాకవి రాసిన "చారుదత్త" నాటకం ఆధారంగా కథ నడుస్తుంది. ఇది ప్రకరణం అనే రూపక భేదానికి చెందింది. ఇందులో నాయకుడు చారుదత్తుడు వ్యాపారి. ఆస్తి అంతా దానధర్మాలు చేసి దరిద్రం పాలైనాడు. నాయిక వసంత సేన వేశ్య. వీరిద్దరూ గాఢప్రేమికులు. ఈమెను రాజుగారి బావమరిది శకారుడు కోరుకొంటాడు. వసంత సేన ప్రియుడిని కల్సుకోటానికి వెడుతూ శకారుడి చేతిలో పడుతుంది. మెడ పిసికేస్తే మూర్ఛ పోతుంది. చనిపోయిందనుకొని చారుదత్తుడే చంపాడని ప్రచారం చేస్తాడు. దత్తుడికి మరణ శిక్ష పడుతుంది. వధ్య స్థానానికి తీసుకొని వెడతారు. వసంత సేన ఒక బౌద్ధ భిక్షువు చేత కాపాడబడి అక్కడికి చేరుకొంటుంది. చారుదత్తుని స్నేహితుడు ఆర్యకుడు గోపాల వేషంలో పాలకుడు అనేవాడిని తొలగించి రాజు అవుతాడు. చారుదత్తుని క్షమించి వారిద్దరికీ పెళ్లి చేయటంతో సుఖాంతం అవుతుంది.

చారుదత్తుడి కొడుకు మట్టిబండీతో ఆడుకొంటాడు. "చారు"కు సాయం చేయదలచి వసంత తన నగలను మూటకట్టి ఆ బండిలో పెడుతుంది. ఆమె నగలకోసం చారుదత్తుడే చంపాడని అభియోగం మోపి మృచ్ఛకటికాన్ని న్యాయస్థానానికి తెస్తారు. బండిలో నగలు సాక్ష్యం కనుక మరణ దండన పడుతుంది. మట్టి బండి గొప్ప పాత్ర పోషించింది కనుక నాటకకర్త ఆ పేరు పెట్టటం ఎంతో సముచితంగా ఉంది. చిన్న సంఘటన ఇతివృత్తమే ఆసాంతం రక్తి కట్టిస్తుంది. రక్షించాలనే ఉద్దేశ్యంతో ప్రియురాలు బండీలో పెట్టిన నగలు ప్రియుడికి మరణశిక్ష పడటం దాకా వెళ్ళింది. కనుక నా మౌచిత్యం భేషుగ్గా ఉంది.

నాటక రచన శాస్త్రీయ పద్ధతిలో సాగలేదంటారు. నీతి బోధకం కాదు సాంఘిక పరిస్థితికి దర్పణం. పాశ్చాత్యుల "కామెడీ"కి దగ్గర... ప్రదర్శన యోగ్యత లేదని కొందరి వాదన. సంభాషణలు అర్థవంతంగా సన్నివేశ కల్పనా మహత్తరంగా ఉంటుంది. అనేక రకాల మనస్తత్వాలున్న మనుషులు కనిపిస్తారు నాటకంలో. గణికలు, వేశ్యలు, విటులు పాత్రదారులే. సముద్ర వ్యాపారం ఆకాలంలో ఉండేదని తెలుస్తోంది.

శూద్రక మహాకవి రాజు ప్రాసాద గుణంతో మాధుర్యంతో కవిత్వ రచన చేశాడు. చక్కని శైలి నాటక గమనానికి బాగా తోడ్పడింది. ఉదాత్త భావాల కల్పలనలను చేసి మెప్పు పొందాడు. వర్ణనలు అతి సహజంగా ఉండటం ప్రత్యేకత. దృశ్యకావ్యంగా మలిచాడు. శృంగారం ప్రధాన రసంగా ప్రవహిస్తుంది. దరిద్రం మీద శూద్రకుడు చెప్పిన శ్లోకాలు చిరస్మరణీయాలై అందరి నాలుకల మీదా నేటికీ నర్తిస్తున్నాయి.

"దారిద్ర్యాత్ పురుషస్య బాంధవ జనో వాక్యేన సంతిస్టతే – సుస్నిగ్ధా విముఖీ భవంతి సుహృద: సపరీ భావంత్యాపద: – సత్వంహాసముపైతి శీల శశిన: కాంతి: పరిమ్లాయతే – పాపం కర్మచ యత్న రైరపి కృతం తత్తస్యసంభావ్యతే" – దీని అర్థం

"దరిద్రంతో ఉన్నవాడి మాటలు బంధువులు వినరు. మిత్రులు విముఖులౌతారు. కస్టాలు రోజురోజుకూ పెరుగుతాయి. తేజస్సు క్షీణించింది. శీలకాంతి మలినం అవుతుంది. ఇతరులు చేసే చెడ్డ పనులు కూడా వాడి నెత్తినే పడతాయి."

మృచ్ఛకటికం తర్వాతే భవభూతి మాలతీ మాధవం ప్రకరణం రాశాడు. కనుక ప్రకరణానికి ఆద్యుడు శూద్రక కవి. ఈ నాటకం అనేక ఇతర భాషల్లోకి అనువదింపబడి ప్రదర్శింపబడి విఖ్యాతమైంది. ఫ్రాన్స్, జర్మనీలలో రంగస్థల నాటకంగా ఆడబడి ప్రేక్షకాదరణ పొందింది. "వసంత సేన" పేరిట తెలుగు సినిమా వచ్చింది. నాగేశ్వరరావు, బి. సరోజాదేవి నాయకా నాయికలు. రాజేశ్వరరావు సంగీతం. అందులో "బంగారు బండిలో వజ్రాల బొమ్మతో" అనే పాట ప్రజాదరణ పొందింది. ❀

11. చోళ రాజ్య చరిత్ర రాసిన - విరూపాక్ష కవి (300 ad)

చోళ రాజుల చరిత్రను విరూపాక్ష కవి "చోళ చంపువు"గా సంస్కృతంలో రాశాడు. కావేరి పట్టణాన్ని రాజధానిగా చేసుకొని తమిళదేశాన్ని పాలించిన చోళరాజుల చరిత్ర అంతా ఇందులో చూపాడు. ఈ రాజ్యం క్రీ.శ.మూడు నాలుగు శతాబ్దాలలో పల్లవ రాజుల చేత అంతమైంది. మళ్ళీ తొమ్మిదవ శతాబ్దంలో చోళ వంశం పునరుద్ధరింపబడింది. అప్పుడు వీరు తంజావూర్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలన సాగించారు. ఇది మాత్రమే లభ్యం అవుతోంది. పూర్వ చోళ చరిత్ర దొరకలేదు. కాని తమిళ సంగమ సాహిత్యంలో లభిస్తోంది. చోళ చంపువును మొదట కనుగొన్న వాడు "హల్చ్". ఇది పౌరాణిక కల్పన అన్నాడు. స్థల పురాణం అయిన "బృహదీశ్వర మహత్మ్యం" ఆధారంగా విరూపాక్షుడు ఈ చంపువు రాశాడు. చోళ చంపువు పదిహేడవ శతాబ్దపు రచన. భట్టబాణుడి శైలిలో విరూపాక్షుడి శైలి ఉంటుంది. సరళ సుందర కవిత్వంతో ఈ చంపువు చంపక పరిమళాన్ని వెదజల్లింది. ❀



12. ముద్రారక్ష నాటక కవి - విశాఖ దత్తుడు (400-500 ad)

ముద్రా రాక్షస నాటకాన్ని రాసిన విశాఖదత్త మహారాజు తన గురించి ఎక్కువగా చెప్పుకోలేదు. కాని తండ్రి భాస్కర దత్తుడు అని, తాతగారు మహారాజా వటేశ్వరదత్తు అని ముద్రారాక్షసంలో చెప్పుకొన్నాడు. అంతకుమించి ఏమీ లేదు. వీరిది దత్త వంశం అని దీన్నిబట్టి అర్ధమౌతోంది. ముద్రారాక్షసంలో చంద్రగ్రహణ ప్రస్తావన ఉంది. దీన్ని ఆధారంగా యాకోబి అనే చారిత్రక పరిశోధక రచయిత 02-12-860న అలాంటి గ్రహణం ఏర్పడింది అని, కనుక తొమ్మిదవ శతాబ్దివాడు అని నిశ్చయించాడు. కీత్, దాస్ గుప్తాలు కూడా దీనితోనే ఏకీభవించారు. ఇంకా కొందరు విశాఖదత్తుడు గుప్తరాజు రెండవ చంద్రగుప్తుని సామంతరాజన్నారు. ఈ చంద్రగుప్తుడు హూణులను జయించాడు. విశాఖదత్తుడు ఈతనిని నాయకుడిగా చేసి "దేవీ చంద్రగుప్త" నాటకం రాశాడు. ఇందులో హూణులపై విజయమే కధాంశం. దత్తుడు చౌహాన్ రాజులకాలం వాడని కొత్తవాదం తీశాడు విల్సన్ పండితుడు. ఇంత గందరగోళంలో పడేశాడు కవి. కాని ముద్రా రాక్షస నాటకంలోని రాజకీయ సాంఘిక విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే విశాఖదత్తుడు క్రీ.శ. నాలుగు - అయిదు శతాబ్దాల వాడని రూఢిగా చెప్పి వాదానికి ఫుల్‌స్టాప్ పెట్టవచ్చు. పై రెండు నాటకాలు కాకుండా "అభిసారికా వంచితం" అనే నాటకాన్ని కూడా రాశాడని అంటారు. ఒక్క ముద్రారాక్షసంతో విశాఖదత్తుడు అసమాన నాటక నిర్మాణ శిల్పంతో రాజకీయ ఎత్తుగడలతో దేశ స్వాతంత్ర రక్షణ బాధ్యతతో, ఆర్య చాణక్యుని అసమాన ప్రతిభను సరిసమానమైన పాటవం గల రాక్షమంత్రి గొప్పతనాన్ని నాటకంలో ఉంచి మేధో విలసిత నాటకం అనిపించాడు. మానవీయ కోణాలనూ స్పృశించాడు. శౌర్యం ధైర్యమే కాకుండా గుండె తడినీ, ఆర్ద్రతనూ

ఇంత కఠిన, కర్కోటక రాజకీయ నాటకంలో ప్రదర్శింపజేశాడు.

అనితర సాధ్యం – ముద్రా రాక్షసం

నాయిక లేని నాటకం ముద్రా రాక్షసం. రాజకీయ పరిజ్ఞానం విస్తరిల్లిన నాటకం ఇది. రాచకీయ ఎత్తులు, పై ఎత్తులతో విస్తరిల్లింది. అడుగడుగునా సస్పెన్స్. ఒకసారి చాణక్యుడిది పైచేయి అనిపిస్తే మరోసారి రాక్షసామాత్యుడిది గెలుపు అని ఊరిస్తూ సాగే నాటకం. రాక్షసుడికంటే చాణక్యునిది సునిసిత మేధ. పరిపక్వ ఆలోచన. అవతలివాడికి నిద్రపట్టనీయకుండా గుండెల్లో నిద్రపోతాడు మంత్రి చాణక్యుడు. అన్ని రకాల ఉపాయాలను ప్రయోగిస్తాడు. ఇదంతా దేనికి? తానేమీ బావుకోవటానికి కాదు. దుస్టనంద వంశ నిర్మూలనం జరిపి చంద్రగుప్త మౌర్యుని అభిషేకించి భారత మాత కష్టాలను దూరం చేయటమే ఆయన ధ్యేయం. ఇది ఏడు అంకాల నాటకం. కథ అందరికి తెలిసిందే. అన్నిటా చాణక్యునిదే విజయం. రాక్షసుడు అన్ని దశల్లో ఓడిపోయి తన వారెవరూ లేకుండా ఒంటరిగా మిగిలిపోతాడు. తాను అసమర్ధుడినని విచారిస్తూ ఆత్మహత్యకు ప్రయత్నిస్తాడు. అప్పుడు మంత్రి చాణక్యుడు రాక్షసమంత్రి మంత్రాంగం మౌర్య చంద్రగుప్తునికి ఎంతో అవసరమని తన పాత్ర రాజకీయం నుండి నిష్క్రమించటం శ్రేయస్కరం అని రాజ్య నిర్మాణం సమర్ధంగా చేయటానికి రాక్షసుడే తగినవాడని భావించి రాక్షసుని ఒప్పించి చంద్రగుప్తుని మంత్రిగా చేస్తాడు. ఆర్య చాణక్యుని అసమాన రాజనీతికి దాసోహం అంటాడు రాక్షసుడు.

నామ ఔచిత్యం

ముద్రా రాక్షసం అంటే "ముద్రయో గృహీతం రాక్షస మది కృత్య కృతో గ్రంధ: ముద్రా రాక్షసం" అని వ్యుత్పత్తి అర్ధం చెప్పారు ముద్ర అంటే రాజ చిహ్నం అయిన ఉంగరం లేక అంగుళీయకం. ఇదే నాటకాన్ని నడిపిస్తుంది. ఎత్తులతో జిత్తులతో ఎత్తుగడలకు సూత్రధారి చాణక్యుడు. పాత్రధారి రాజముద్ర. ఈ అంగుళీయక ముద్ర రాక్షసుడి కొంప కొల్లేరు చేసి దాసోహం అనేట్లు చేసింది. కౌటిల్యుని అసమాన ధీ శక్తివలన. అందుకే ఈపేరు నాటకాని పరమ ఉచితం అని అందరూ సర్టిఫికేట్ ఇచ్చారు.

దత్తుడు నాటక కళలో అందెవేసిన చెయ్యి అని ప్రతి అంకంలోను రుజువు చేస్తాడు. ప్రతి సంభాషణా ఔచిత్యానికి పరాకాష్టగా ఉంటుంది. రాజకీయాన్ని దృశ్యకావ్యంగా మలచిన తీరుకు జోహార్ అనక తప్పదు. మొదటి నుంచి చివరి సన్నివేశం వరకు కుతూహలాన్ని రేకెత్తిస్తాడు. తరువాత ఏమి జరుగుతుందో ఎవరికీ తెలియని ఉత్కంఠ భరితంగా నాటకాన్ని నడిపించాడు. అతని రచనా పాటవాన్ని గమనిస్తే విశాఖుడైన కుమారస్వామి దేవ సేనాధిపత్యానికి యెంత అర్హుడో దత్తుడు కూడా ఈ నాటక నిర్మాణ, గమన విజయాలకూ అంతే సమర్థుడై అన్వర్థ నాముడు అనిపిస్తాడు. లక్ష్య సాధనకు ప్రతి అంకం తోడ్పడింది. అతని వ్యూహానికి ఇది గొప్ప విజయం.

పాత్ర చిత్రణ

ఈ నాటకం వీరరస ప్రాధాన్యం కలది కాని ఇందులో వీరం భీభత్సం కాదు. ఉత్సాహ భరితం. అందుకే గుండెలకు తాకుతుంది. ప్రతి పాత్రను వ్యక్తిత్వంతో భాసింపజేశాడు. కౌటిల్యుడైన ఆర్యచాణక్యుని పాత్ర చిత్రణ అద్వితాయం అనిపిస్తుంది. ఈయనకు సమ ఉజ్జీగా నందరాజమంత్రి రాక్షసామాత్యుని తీర్చిదిద్దాడు. స్థాయి ఏ మాత్రం తగ్గించలేదు. అయితే చాణక్యుడు నిస్వార్థ జీవి. దేశ రక్షణ శీలి. పండితుడేకాక కార్యశీలి, సాహసి. వ్యూహకర్త. అనుకొన్నది సాధించటానికి ఎంతదాకానైనా పోగలవాడు. చేపట్టిన పని మధ్యలో వదిలే రకం కాదు. కార్యం సానుకూలం కావాల్సిందే. దానికి ఎన్నిరకాల మార్గాలున్నాయో అన్నీ ప్రయోగిస్తాడు. అతని బుర్ర పాదరసమే.

ప్రతి ద్వంద్వి రాక్షమంత్రి కొంచెం మెత్తటివాడు. దీనికి విరుద్ధం చాణక్యుడు. కార్యసాధనలో అతి కఠినంగా వ్యవహరిస్తాడు. తన మనసులోని ఆలోచనను రాజు చంద్రగుప్తుడికీ తెలియనివ్వని రహస్య మంత్రాంగం ఆయనది. రాక్షసుడూ ఏ పదవీ కోరుకోలేదు. నంద వంశ సంరక్షణే ధ్యేయంగా జీవించాడు. ధర్మ పక్షపాతి చాణక్యుడైతే అధర్మానికి ఆసరాగా నిలిచి, రాక్షసుడు దెబ్బతిన్నాడు. కురుక్షేత్ర యుద్ధంలో భీష్మాదులు ఎలా ప్రవర్తించి దెబ్బతిన్నారో ఇక్కడ రాక్షసుడు, ఆయనను నమ్మినవారు సర్వం కోల్పోయారు. ధర్మానికి విజయం అన్నదే ఈ

నాటకంలో విశాఖదత్తుడు చెప్పకుండా చెప్పాడు.

ఈ రాక్ష రాజకీయం ఎవరికోసం అంటే మౌర్య వంశ స్థాపకుడిగా చంద్రగుప్తుని అభిషేకించటానికే. దీన్ని చంద్రుడిని ఆసరాగా చేసుకొని మొదటి నుంచి చివర వరకు చాణక్యుడే ఆడించాడు నాటకాన్ని. సఫల మనోరథుడయ్యాడు. చేసిన ప్రతిజ్ఞా తీర్చుకొన్నాడు. కులం, ఆభిజాత్యం ప్రధానం కాదు. గుణం ప్రధానం రాజుకు అని రుజువు చేసి చూపించాడు. ఆదర్శ చక్రవర్తిని తీర్చిదిద్దాడు. ముర అనే నిమ్న జాతి స్త్రీ సంజాతుడు చంద్రగుప్తుడు. కాని సకల సద్గుణ సంపన్నుడు. అందుకే చాణక్యుని దృష్టి చంద్రునిపై పడింది. రాజ్యానికి సర్వ సమర్థుడని భావించి పావులు కదిపాడు. మన నాటకాలకు నాయకుడు క్షత్రియుడై ఉండాలి కాని ఇక్కడ "దృశ్యం" వేరు అయినా నాయకుడు చంద్రుడే. అలంకార శాస్త్రానుసారం ఇది తప్పు అని పండితులు ఈసడించారు. కాని సూర్యకాంతిని అరచేతులతో ఆపలేరు కదా. నాటక భానుమండల తేజో పుంజం అయింది ముద్రా రాక్షసం.

కవితా గీర్వాణం

అర్థ, నాట్య, న్యాయ, రాజనీతి శాస్త్రాలలో మహా నిష్ణాతుడు అనిపిస్తాడు విశాఖదత్త కవి. కవిత్వం గంభీరమూ శక్తి జలపాతమూ. స్రగ్ధర వృత్తాన్ని ఎక్కువసార్లు ప్రయోగించాడు. ఇది గంభీరభావాల ఆవిష్కరణకు అత్యంత దోహదకారి. సందర్భాన్ని బట్టి ఛందో భేదం చూపించాడు. శ్లేష కూడా వాడాడు. కవిత్వం ప్రసన్న మధురమే. స్త్రీ పాత్రలు లేకపోవటం కోమలత్వానికి దూరం చేసిందేమో? కాని విషయం అంతా ఘర్షణమయం కనుక లేకపోయినా ఇబ్బంది ఏమీ ఉండదు. కొన్ని సుకుమార భావనలు చక్కగా వర్ణించాడు. విశాఖ కవి –

"నామం బాహులతాం నివేశయ శిథిలం కంఠే నివృత్తాననా –
స్కందే దక్షణయా బలాన్ని హితయా ప్యాంకే పతంత్యాముహు:
గాఢాలింగన సంగ పీడిత సుఖం యస్యోద్య మాశంకినీ
మౌర్యస్యోరపి నాదునాపి కురుతే వామేతరం శ్రీ: స్తనం"

అమాత్య రాక్షసుడికి ఝుడిసి మౌర్యరాజ్యలక్ష్మి చంద్రగుప్తుడిని పూర్తిగా

ఆలింగనం చేసుకోలేకపోతోందట. ఆమె ఎడమ బాహువు అనే లతను చంద్రగుప్తుడి మెడలో వేసినా, అది విరిగిపోయిందట. ముఖాన్ని అతని వైపు నుంచి పక్కకు తిప్పుకొందట. కుడి చేయి మాత్రం బలవంతంగా రాజు బుజంమీద పెట్టిందట. కాని అది మాటిమాటికీ జారిపోతోందట. అందుకే చంద్రగుప్తుడిని ఆలింగనం చేసుకోలేకపోతోందట. కాని ఆమె కుడి రొమ్ము రాజు వక్షస్థలాన్ని అంటుకొని ఉన్నప్పటికీ గాఢాలింగన సుఖాన్ని అతనికి ఇవ్వలేకపోతోందట.

చాణక్యుని ఆశ్రమ వర్ణన చూస్తే ఆయన యెంత దరిద్ర స్థితిలో జీవించేవాడో అర్థమయ్యేట్లు ఉంటుంది.

ఈ నాటకాన్ని "రాక్షాసాస్ రింగ్" అనే పేరుతో క్లే సాంస్క్రిట్ లైబ్రరివారు ప్రచురించారు. విశాఖదత్తునిది అని చెప్పబడుతున్న "దేవీ చంద్రగుప్త" నాటకంలో కొన్ని భాగాలు మాత్రమే భోజమహారాజు రచనలు శృంగార ప్రకాశ, సరస్వతీ కంఠాభరణంలోను, సాగర నంది రాసిన నాటకరత్న కోశంలోను, రామచంద్ర, గుణ చంద్రులు రాసిన "నాట్య దర్పణం"లోను లభిస్తున్నాయి. ఇందులో ఇతివృత్తం – రామగుప్త రాజుతో శకరాజు చేసుకొన్న కపట ఒడంబడిక, దాని ప్రకారం గుప్తరాజు భార్య ధృవాదేవిని శకరాజు దగ్గరకు పంపాలి. గుప్తుని తమ్ముడు చంద్రగుప్తుడికి ఈ విషయం తెలిసి ప్రతీకారం తీర్చుకొంటాడు. శకరాజును యుద్ధంలో చంద్రగుప్తుడు చంపి అన్న రామగుప్తుడికి పట్టాభిషేకం జరిపించి ధృవాదేవితో వివాహం చేయిస్తాడు.❀

13. గద్య మహాకావ్య రచయిత - సుబంధు (400- ad)

గుప్త చక్రవర్తుల కాలానికి సంబంధించిన కల్పిత ఆఖ్యాయికను అంటే కథను సుందర సురుచిర శైలిలో వచనంగా రాసిన కవి "సుబంధు". 414 - 454 కాలపు రాజు కుమారగుప్తుడు. 455 - 467కు చెందిన అతని కొడుకు స్కంద గుప్తుల ఆస్థానంలో సుబందు ఉండేవాడు. పాండిత్య గర్వ స్పర్శ ప్రతి అంగుళంలో కనిపించేట్లు రాసిన కవి సుబంధు. తరువాత కాలపు వచన రచయితలను ఎందరినో ప్రభావితం చేశాడు. అతని రచనా పటిమకు అద్దం "వాసన దత్త". దీనిపై పద్దెనిమిదో శతాబ్దంలో రెండు వ్యాఖ్యానాలు వెలశాయి. శివరామ త్రిపాఠి రాసిన "కాంచన దర్పణం", జగద్ధారుడు రచించిన "తత్వ దీపిని" సుబంధును అజరామరం చేశాయి. లూయిస్ హెర్బర్ట్ గ్రే వాసవదత్తను ఆంగ్లంలోకి అనువాదం చేస్తే 193లో కొలంబియా యూనివర్సిటి ప్రెస్ ప్రచురించింది. విలియమ్స్ జాక్సన్ సంపాదకత్వంలో కొలంబియా యూనివర్సిటి - ఇండో ఇరానియన్ సిరీస్‌లో పదమూడు భాగాలుగా వెలువరించింది.

ప్రాకృత వ్యాకరణం రాసిన "వరరుచి"కి సుబంధు మేనల్లుడు అంటారు. విక్రమాదిత్య చక్రవర్తి చనిపోయిన తర్వాత సుబంధు వాసవ దత్తను రాశాడని

నరసింహ వైద్య అన్నాడు. కాని బహుజనాభిప్రాయం ప్రకారం గుణాఢ్యుడి తరువాత వాడు. 1859లో వాసవదత్తను పరిష్కరించి ఫిడ్జ్ ఎడ్వర్డ్ హాల్ సంస్కృత ప్రతిని ముద్రించాడు. వచన రచనలో మేటి అయిన బాణుడి ప్రశంసలు పొందాడు సుబంధు. "అలబ్ధ వైదగ్ధ్య విలాస ముగ్ధయా దియా నిబద్ధే య మతిద్వయా కదా" అని బాణుడు మెచ్చాడు అంటే సుబంధు రచనా ప్రౌఢిమ యెంత గొప్పదో తెలుస్తోంది. వాసవ దత్త చారిత్రక కథ కాదు. కవికల్పితమే. భాస, కాళిదాసాదుల సరసన చేరిన కవి సుబంధు. వక్రోక్తి కవిగా సుబంధును పన్నెండవ శతాబ్దం వాడైన "కవిరాజు" పేర్కొన్నాడు. మంఖ అనే కవి భారవి బాణ కవులతో చేర్చి శ్లాఘించాడు. పదిహేనవ శతాబ్దికి చెందిన వామన భట్ట బాణుడు మయూరుడు మొదలగు కవులతో పోల్చాడు. "ప్రతి కవి భేద బాణ: కవితా త్రుగహన విహరణ మయూరః – సహృదయ లోక సుబంధుర్జయతి శ్రీ భట్ట బాణ కవి రాజ:" అని కీర్తించాడు.

వాసవ దత్త కథ

కందర్ప కేతు అనే రాజకుమారుడు కలలో అందమైన కన్యను చూసి మనసు పారేసుకొని స్నేహితుడు మకరాండుడితో వెతుకుతూ ఉంటాడు. అడవిలో ఒక చెట్టుకింద పడుకొని ఉంటే చెట్టుపై ఉన్న చిలుకా గోరింకల సంభాషణలో వాసవదత్త కలలో కనిపించిన రాకుమారుడికోసం అన్వేషణకు బయల్దేరినట్లు వింటాడు. పక్షుల సాయంతో వాసవదత్తను కలుస్తాడు. ఇద్దరూ ప్రేమించుకొంటారు. ఆమె తండ్రి ఒక గంధర్వ రాజుతో కూతురు పెళ్లి చేయాలనుకొంటాడు. ఇది తెలిసి వీళ్ళిద్దరూ జంప్ జిలానీ. అడవిలోకి చేరి పడుకొంటారు. వాసవదత్తకు నిద్ర రాక ఒంటరిగా అడవిలోకి వెడుతుంది. ఇంతలో రెండు కిరాత దళాలు వచ్చి ఆమె కోసం తగాదా పడతాయి. ఇదే అదను అనుకోని, తప్పించుకొని ఒక ఆశ్రమంలో చేరుతుంది. ముని శాపంతో రాయిగా మారిపోతుంది. కందర్పుడు వెతుక్కుంటూ వచ్చి కనపడక ఆత్మ హత్యకు పూనుకొంటాడు. ఆకాశ వాణి విషయం తెలియజేస్తే ఆ రాయిని కౌగలించుకోగానే వాసవదత్తగా మారిపోతుంది. ఇద్దరూ రాజనగరానికి వెళ్లి పెళ్లి చేసుకొని హాయిగా

ఉంటారు.

సుబంధు కవితా గీర్వాణం

శ్లేష కవిత్వానికి సుబంధు పెట్టింది పేరు. "సరస్వతీదత్త వర ప్రసాదా చ్చక్రే సుబన్ధు: – సుజనైక బన్ధు: ప్రత్యక్షర శ్లేష మయ ప్రపంచ విన్యాస వైదగ్ధ్య నిధిం ప్రబంధం" అని చెప్పుకొన్నాడు. ఈ శైలి బాణుడికి ఆధారం అయింది. కథా, కథనం, శైలీ పరిపక్వంగా ఉండి చదివే వారిని ఊపిరి సలపనివ్వడు. చాలా ఆహ్లాదం కలిగించటం అతని లక్షణం. గ్రీకు రోమాన్స్ ఇక్కడికి చేరి ఉండవచ్చునని భావన. వక్రోక్తి, విరోధా భాసలకూ సముచిత న్యాయం చేశాడు. మీలిత, రత్నావళి, సమ, సంభావన, కారణ మాల మొదలైన అరుదైన అలంకారాలను మిగిలిన అలంకారాలతో పాటు వాడి కావ్యానికి సౌందర్యం తెచ్చాడు. ఋతు, సూర్య చంద్రోదయ అస్తమయాలను హృదయాహ్లాదకంగా వర్ణించాడు. మార్గదర్శిగా మారాడు. ఇందులో పక్షులు మాట్లాడి జానపదం అనిపిస్తుంది. మాయా గుర్రం ఉంది. కథా కథన కల్పనాశైలిలలో సుబంధు తరువాతి వారికి స్ఫూర్తిగా నిలిచాడు. ❁

14. సింహళ రాజ కవి - కుమార దాసు (413-520 ad)

మహా కావ్యం “జానకీ హరణం” రాసిన కుమార దాసు 413-523 కాలంలో శ్రీలంకను పాలించిన కుమార సేన మహారాజు అని భావించారు. కాని కావ్యం చివరలో ఉన్నదాన్ని బట్టి తన తండ్రి కుమారసేనుని సైన్యాధికారి “మానిత” అని, తన చిన్నతనంలో యద్ధంలో చనిపోయాడని మేనమామలు మేఘ, అగర బోధిలు తనను పెంచి పెద్దవాడిని చేశారని రాశాడు. క్రీ.శ. తొమ్మిది వందల కాలం వాడైన రాజశేఖరుడు కుమార దాసు అంధుడుగా జన్మించాడని తన కావ్య మీమాంసలో “మేఘా విరుద్ధ కుమారాదాసదయ: జాత్యన్ధా:” అని రాశాడు. కాని ఈ మాట రాసింది మహా కవి కాళిదాసు అని, కాళిదాసు తర్వాత కుమార దాసు వచ్చాడని అంటారు. కనుక క్రీ.శ.అయిదు వందల నాటివాడని చెప్పారు. మాఘుడికి ముందు భవభూతికి తరువాత కుమారదాసు ఉన్నాడని అంటారు. జానకీ హరణ కావ్యం రాసేముందు కుమారదాసు కాళిదాసు రాసిన రఘు వంశకావ్యం చదివి ఉంటాడని భావిస్తున్నారు. కుంహాన్ రాజ అనే పరిశోధకుడి పరిశోధనలో కుమారదాసు దక్షిణ దేశంలోని కంచిలో నివశించి ఈ కావ్యాన్ని రాశాడని ఉంది. ఈ కావ్యం కాళిదాసకృత రఘువంశ స్థాయి ఉందనీ చెప్పాడు. సుభాషిత రత్న కోశంలో కుమార దాసు రాసిన జానకీహరణ కావ్య ప్రస్తావన ఉంది. “జానకీహరణం కర్తుం - రఘు వంశే పురస్తితే - కవి: కుమారా దాసోవా - రావణోవా యది క్షమ:” దీని అర్ధం - రఘు వంశ అంటే సూర్యవంశ కావ్యం కాళిదాసు రాసింది ఉండగా జానకీహరణం అంటే కుమారదాసు కావ్యం

సీతాపహరణం చేసే సామర్థ్యం కుమార దాసుకు, రావణుడికి మాత్రమే ఉంది అని చమత్కరించాడు.

కుమార రామదాసీయం

కుమారదాసు కావ్యాన్ని చాలా గొప్పగా రాశాడు. ఇరవై సర్గల మహాకావ్యం ఇది. దశరథునిపై కమ్మని కవిత్వం చెప్పాడు. సందర్భాలను ఎన్నుకొని మహా కావ్యానికి తగినట్లు వర్ణనలు చేశాడు. బృహస్పతి మహావిష్ణువుతో రావణుడి దురాగతాలను అంతం చేయమని ప్రార్థిస్తాడు. దాసు జలక్రీడల్ని, సూర్యోదయ సూర్యాస్తమయాలను నేర్పుగా వర్ణించాడు. తరువాత కథ మిథులకు చేరుతుంది. విశ్వామిత్ర, జనకుల సమాగమం కమనీయంగా కాళిదాస మార్గంలో వర్ణించాడు. కవిత్వంలో "వైదర్భీ రీతి"ని వాడి, కావ్య గౌరవాన్ని ఇనుమడింపజేశాడు. కుమారదాసు గొప్ప వ్యాకరణ పండితుడు. అనుకూలమైన ఛందస్సులను సందర్భాన్ని బట్టి వాడి, కథాగమనానికి, రమణీయతకు తోడ్పడ్డాడు. ద్రుత విలంబితం, ప్రమితాక్షరం, ఇంద్ర వజ్ర ఉపజాతులు బాగా ఉపయోగించి సమర్థత నిరూపించాడు. వంకస్త, వైతాళీయ, రదోద్ధత, ఛందో భేదాలను సద్వినియోగం చేసుకొన్నాడు. శార్దూలం శిఖరిణి, స్రగ్ధర, పుష్పితాగ్ర, ప్రహర్షిణి, వసంత తిలక, అవితా, మందాక్రాంత, మాలిని లను అవసరాన్ని బట్టి ప్రయోగించాడు. వాల్మీకానికి పూర్తి విధేయకంగా రామాయణ పాత్రల ఉదాత్తతకు ఉన్నత స్థానం కల్పించేట్లుగా మనోభావాలను, భావోద్వేగాను పరిపూర్ణంగా స్పష్టంగా వ్యక్తం చేసేట్లు రాశాడు కుమారదాసు. అంతకుముందు ఏ కవీ వాడని కొన్ని పదాలను కుమారదాసు వాడి నూతనత్వానికి దారి వేశాడు.

''మాక్డోవేల్ పండితుడి'' దృష్టిలో కుమారదాసు మౌర్యరాజు ముద్గాలాయనుడి కొడుకు. తండ్రి తొమ్మిదేళ్ళు రాజ్యపాలన చేశాడట. దాసు గురించి బౌద్ధ వాజ్మయంలో విస్తృతంగా ఉందట. సింహళ దేశంలో జానకీహరణ కావ్యాన్ని ప్రతిమాటనూ అనువాదం చేసి భద్రంగా దాచుకొన్నారు. అంటే సింహలీయులపై అతని ప్రభావం జాస్తీగా ఉందని అర్థం.

వాల్మీకి రామాయణంలోని కథనే తీసుకొన్నా దాసు కొన్ని మార్పులు

చేశాడు. విశ్వామిత్రుడు అడిగిన వెంటనే దశరథుడు యాగ రక్షణకు రాముడిని పంపుతూ క్షత్రియ ధర్మాలు బోధిస్తాడు. మారీచుడు కూడా సుబాహుతో పాటు రాముడి చేతిలో చచ్చినట్లు చెప్పాడు. మాయ లేడి విషయాన్ని సంక్షిప్తం చేశాడు. సీతా స్వయంవరానికి ముందే జానకీ రాములు పరస్పరం కలుసుకొని అనురాగం పొందినట్లు మార్చాడు. తనకు నచ్చిన ఘట్టాల్లోని భారవి, భవభూతి, కాళిదాస కవితలను స్ఫూర్తిగా తీసుకొని గొప్ప ప్రేరణ పొంది చక్కగా అనుకరించి కవిత్వం చెప్పాడు – "గగన సరసి చంద్ర రూప్య కుంభే – వ్యప సరతిస్మ నిపాతితే రాజన్యా" అని, భారవి ఉపమానమైన "హేమ కుంభ ఇవ పూర్వ పయోదేర్మున మజ్జ శనకైస్తు హిమాంశు:"ను అనుకరించి కుమారదాసు చెప్పాడు.

నఖ శిఖ పర్యంత సీతా సౌందర్యాన్ని వర్ణించి తరువాతి వారికి మార్గదర్శి అయ్యాడు దాసు. అనుకరణను అవసరానికి తగ్గట్టు చేసిన స్వతహాగా మహా భావుకుడైన కవిగా దర్శనమిస్తాడు. అందరికంటే ఒక ఆకు ఎక్కువే చదివి సంభోగ శృంగారాన్నీ తనివి తీరా వర్ణించాడు. పరశురాముడు రాముడిని కలిసినప్పుడు ఇద్దరి మధ్యా సంభాషణలను రౌద్ర వీర రసాలతో పుష్టి కల్గించాడు. దాదాపు అన్ని రసాలను కావ్యంలో పోషించాడు. విశ్వామిత్ర ఆశ్రమ ప్రశాంతతను శాంత రసంతో నింపాడు. విభావాన్ని, అనుభవాన్ని గొప్పగా ప్రదర్శించి రస పుష్టి చేకూర్చాడు. పద్దెనిమిదవ సర్గలో శబ్ద చమత్కృతీ వైభవాన్ని అనుభవైక వేద్యం చేశాడు. అనేక రకాలుగా బంధ కవిత్వంలో చెలరేగిపోయి రాశాడు. అందులో గోమూత్రిక, మురజాదులు ముఖ్యమైనవి. నిరోష్ట్య, అనులోమ, ప్రతిలోమ కవిత్వంలోను తన ప్రజ్ఞా ప్రదర్శనను అత్యద్భుతంగా చేశాడు. శ్లేషనూ సమాదరించాడు.

ప్రతిభతో బాటు వ్యుత్పత్తి కూడా సంపూర్ణంగా ఉన్న కవి కుమారదాసు. అందుకే సుప్రసిద్ధ అలంకారికులైన విద్యాకరుడు, జల్హనుడు, శ్రీధరుడూ, వల్లభ దేవుడు కుమార దాసకృత మహాకావ్యం జానకీ హరణం నుంచి శ్లోకాలను రాసి ఉదాహరించారు. ఎవరి ప్రచారమూ అక్కర్లేకుండా కుమారుడు మహా కవి కుమారుడై, దాసు వాణీ దాసుడైనాడు.❀

15. కవితా కామిని దరహాసమే - భాస మహాకవి (500 ad)

సంస్కృత రూపకర్త భాసమహాకవి చరిత్ర కూడా లభ్యం కాకపోవటం దురదృష్టం. కాని మహాకవి కాళిదాసు మాళవికాగ్ని మిత్రంలో "భాస, కౌమిల్ల, కవిపుత్ర వంటి కవులను మరిచిపోతున్నామా? నవీనుడైన కాళిదాసునే ప్రేక్షకులు ఆదరించటం న్యాయమా?" అని ప్రశ్నించాడు. భాసుడి కాలాన్ని క్రీ.పూ. రెండవ శతాబ్ది అని కొందరు క్రీ.శ రెండవ శతాబ్ది అని కొందరన్నారు. కాని అయిదవ శతాబ్దానికి చెందినవాడుగా ఎక్కువ మంది అభిప్రాయ పడుతున్నారు. 880-920కు చెందిన రాజశేఖరుడు రాసిన "కావ్య మీమాంస" భాస రూపకం స్వప్న వాసవదత్త గురించి, భాసుని గురించి ప్రస్తావన ఉంది. 1912లో శ్రీ టి.గణపతి శాస్త్రి కేరళలో భాస నాటకాల వ్రాత ప్రతులను సేకరించి ప్రచురించేవరకు భాసుడి గురించి ఎవరికీ తెలియదు. ఇవన్నీ మళయాళ లిపిలో ఉన్నవే. సంస్కృత లిపిలో ఉన్నవి దొరకలేదు.

"సూత్రధారుని చేత ప్రారంభింపబడిన భూమికతో ఉన్న పతాక శోభితమైన నాటకాల వలన భాసుడు గొప్ప కీర్తి పొందాడు" అని బాణ కవి ప్రశంసించాడు. దండి కూడా అవంతీ సుందరిలో భాసుని నాటక లక్షణాలను మెచ్చుకొన్నాడు. ప్రాకృత కవి వాక్పతి రాజు ప్రశంసించాడు. జయ దేవుడు "భాసోహాస: కవికుల

గురు: కాళిదాసో విలాస:” అన్నాడు అంటే “కాళిదాసు కవితా కామిని విలాసం. భాసుడు కవితా కామిని హాసం”. భాసుడు పదమూడు రూపకాలు రాశాడు. ఇవన్నీ ఒకే రకమైన నాంద్యంతంతో ప్రారంభమైనాయి. ప్రస్తావనను స్థాపన అన్నాడు. ప్రస్తావనలో తనను గురించి ఎక్కడా చెప్పుకోలేదు. ప్రతి నాటకం చివర ఒకే రకమైన వాక్యాన్ని రాశాడు. దాదాపు అన్నీ ఒకే విధమైన శైలీ, ఛందస్సు కలిగి ఉన్నాయి. వ్యాకరణ విరుద్ధాలెన్నో ఉన్నాయి. భాసుని గొప్ప నాటకం స్వప్న వాసనదత్తం. ఇందులో నాటక కళ, సంస్కృత ప్రాకృత భాషల వాడకం, శైలీ, ఛందస్సు ఆయన మిగిలిన నాటకాల్లాగానే ఉన్నాయి కనుక ఇది భాస కృతమే. కాదు అనటానికి వీల్లేదు. చరిత్ర పరిశోధకుడు కీత్ పండితుడూ దీన్ని సమర్ధించాడు. ప్రతిమా నాటకంలో “బృహస్పతి” రాసిన అర్ధ శాస్త్రాన్ని గురించి ప్రస్తావించాడు. కౌటిల్యుడి అర్ధశాస్త్రం ప్రస్తావన లేదు. అయినా అందులో ఒక శ్లోకాన్ని ఉటంకించాడు. స్వప్న నాటక రాజు ఉదయనుడు బుద్ధుని సమకాలికుడు. కనుక భాసకాలం క్రీ.పూ.అయిదు లేక ఆరవ శతాబ్దం అవచ్చు. కౌటిల్యుడికి ముందు, ఉదయనుడికి తర్వాత ఉండి ఉండవచ్చు. ఏతావాతా భాసుని కాలం క్రీ.పూ.నాలుగు అయిదు శతాబ్దాల మధ్య అని తేల్చారు. ఇంతటితో కాలానికి గొళ్ళెం పెడదాం. భాసుడు దక్షిణాత్యుడు అని కీత్ అభిప్రాయపడితే, ఉజ్జయిని వాడని కొందరన్నారు. భాసుని కృష్ణభక్తి నాటకాలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

“దావకాపర నామాయం భాసో భాసయతే సగత్ తత్తైరివాది పురుష శ్చతు ర్వింశతి రూపకం” అనే లోకంలో ప్రచారంగా ఉన్న శ్లోకాన్ని బట్టి భాసుడు ఇరవై నాలుగు రూపకాలు రచించాడని తెలుస్తోంది. కాని దొరికింది పదమూడు మాత్రమే. రాసిన వరుస – దూత వాక్యం, కర్ణ భారం, దూత ఘటోత్కచం, ఊరు భంగం, మధ్యమ వ్యాయోగం, పంచ రాత్రం, అభిషేకం, బాల చరిత్ర, అవిమారకం, ప్రతిమా, ప్రతిజ్ఞా, యౌగంధ రాయణం, స్వప్న వాసనదత్త, చారుదత్త అని “పుసాల్కర్” అనే విశ్లేషకుడు చెప్పాడు. భాసుని నాటకాలను “భాస నాటక చక్ర” అని రాజశేఖరుడు అన్నాడు. ఇందులో రామ కథ ఉన్నవి – ప్రతిమ, అభిషేక నాటకాలు.

మహాభారత కథ కలవి – పంచరాత్ర, మధ్యమ వ్యాయోగ, దూత ఘటోత్కచ, కర్ణ భార, దూతవాక్య, ఊరు భంగ నాటకాలు. భాగవత పరమైనవి – బాల చరిత్ర ఒక్కటే. ఉదయన రాజుతో సంబంధం ఉన్నవి – ప్రతిజ్ఞా యౌగంధ రాయణం, స్వప్న వాసవ దత్త – సామాన్య లోక కథవృత్తం కలవి – దరిద్ర చారుదత్త, అవిమారక నాటకాలు.

భాసుడు కిరణావళి, ఉదాత్త రాఘవం కూడా రాశాడని ప్రతీతి. హర్షుడి రచనల్లో భాసుని చాటువులు కనిపిస్తాయి. "వీణా వాసవ దత్త" అనే నాలుగు అంకాల అసంపూర్ణ నాటకం దొరికింది. ఇది భాస కృతం కాదని తేల్చారు. రాజ వైద్య కాళిదాసు "యజ్ఞ ఫల" నాటకాన్ని 1914లో భాస నాటకంగా ప్రచురించాడు. ఇదీ భాస రచన కాదని నిర్ణయించారు.

భాస నాటకాల విషయాలు

ప్రతిమ నాటకంలో ఏడు అంకాలున్నాయి. దశరధుడి మరణం నుండి రామ పట్టాభిషేకం వరకు కథ ఉంటుంది. తండ్రి చనిపోయిన తర్వాత మేనమామ ఇంటి నుంచి వస్తూ దారిలో భరతుడు "ప్రతిమా గృహం"లో తన వంశ పూర్వరాజుల ప్రతిమలను చూస్తాడు. అందులో దశరధుని ప్రతిమ కనిపించి తండ్రి చనిపోయాడని తెలుసుకొంటాడు. అందుకే దీనికి ప్రతిమ అని పేరు పెట్టాడు. మిగతా కథ మనకు తెలిసిప రామాయణ కథయే.

అభిషేక నాటకం తొమ్మిది అంకాలున్నది. రామాయణంలో కిష్కింధ, సుందర, యుద్ధ కాండ విశేషాలతో రచింపబడింది. రామ పట్టాభిషేకం ఉంది కనుక "అభిషేకం" అన్నాడు. నాటక ధర్మానికి విరుద్ధంగా వాలివధ రంగస్థలం మీద చూపించాడు. రాముడిని నారాయణావతారుడిగా తీర్చాడు.

బాల చరిత్ర – అయిదు అంకాలు. శ్రీకృష్ణ జననం, బాల్యం ఇతివృత్తం, శ్రీకృష్ణ చరిత్ర ఉన్న అది ప్రాచీన నాటకం ఇదే. యుద్ధం, కంస వధ బాల్య క్రీడలూ అన్నీ రంగ ప్రదర్శన చేసిన నాటకం.

పంచరాత్రం – మూడు అంకాలు. మహాభారత కథ. దుర్యోధనుడు యజ్ఞం చేసి ద్రోణాచార్యుడిని ఏదైనా కోరుకొమ్మన్నాడు. పాండవులకు అర్ధ రాజ్యం

ఇవ్వమన్నాడు. శకుని దుర్యోధనులను సంప్రదించి సరేనన్నాడు. అజ్ఞాతవాసంలో ఉన్న వారి జాడ అయిదు రోజుల్లో తెలిస్తే ఇస్తానని షరతు పెడతాడు. జాడ తెలియదు. ఇంతలో ఉపకీచకుల వధ గురించి తెలుస్తుంది. చంపింది భీముడే అని భీష్ముడు అంటాడు. నియమానికి ఒప్పుకోమని ఆచార్యుడితో చెబుతాడు. గోగ్రహణానికి బయల్దేరుతారు. ఉత్తరుడు అర్జున సాయంతో విజయం సాధిస్తాడు. ద్రోణుడికిచ్చిన మాట ప్రకారం పాండవులకు అర్ధ రాజ్యం ఇస్తాడు చిన్నరాజు. ఈ నాటకంలో దుర్యోధన కర్ణులను మంచివాళ్ళుగా చిత్రించాడు. శకుని ఒక్కడే దుష్టుడు. అభిమన్యుడు కౌరవ పక్షాన పోరాడటం విశేషం. కురుక్షేత్ర యుద్ధం జరగకుండానే పాండవులకు అర్ధ రాజ్యం ఇప్పించాడు భాసుడు.

మధ్యమ వ్యాయోగం – ఏకాంకిక. ఇది దశ రూపకాలలో "వ్యాయోగం" అనే దానికి చెందింది. పాండవ వనవాసమే కథ. హిడింబ ఘటోత్కచుడికి భీముడు తండ్రి అని చెప్పుతుంది. భవిష్యత్తులో బ్రాహ్మణులకు ఆపద తలపెట్టనని ప్రతిజ్ఞ చేస్తాడు భీముడు. భీముడే కథా నాయకుడు. కుంతీపుత్ర మధ్యముడు భీముడు కనుక "మధ్యమ వ్యాయోగం" అయింది.

దూత ఘటోత్కచం – ఇదీ ఒకే అంకం ఉన్న నాటిక. అభిమన్యు వధ తర్వాత శ్రీకృష్ణుడు ఆదేశిస్తే ఘటోత్కచుడు దుర్యోధనుడి దగ్గరకు రాయబారిగా వెడతాడు. అర్జునుని చేతిలో కౌరవ నాశనం జరుగుతుందని భవిష్యత్తు చెబుతాడు. కల్పిత కథ.

దూత వాక్యం – ఇదీ ఏకాంకికయే. దీన్నీ వ్యాయోగం అనే అంటారు. శ్రీకృష్ణ రాయబారం కథ విశ్వరూప సందర్శనం ఉన్నాయి.

కర్ణ భారం – ఏకాంకిక. బ్రాహ్మణ వేషంలో వచ్చిన ఇంద్రుడికి సహజ కవచ కుండలాలను కర్ణుడు దానం చేసే కథ.

ఊరు భంగం – ఏకాంకిక. దుర్యోధన భీముల గదాయుద్ధం. తొడలు విరిగిన దుర్యోధన మరణం ఉంటాయి. దుర్యోధనుడి పాత్రచిత్రణ అపూర్వం. ఈతని ఏకాంకికలలో ఇది ఉత్తమమైనది. గ్రీకు ట్రాజెడీ వాసన కనిపిస్తుంది.

ప్రతిజ్ఞా యౌగంధ రాయణం నాలుగు అంకాలు. ప్రకరణ విభాగ

రూపకంగా భాసుడే చెప్పాడు. ప్రస్తావనలో ఉజ్జయిని రాజు ప్రజ్యోతుడు కౌశాంబి రాజు ఉదయునుడిని మాయోపాయంతో బంధిస్తే రాజును విడిపిస్తానని మంత్రి యుగంధరుడు ప్రతిజ్ఞ చేస్తాడు. కారాగారంలో ఉన్న ఉదయనుడు ప్రజ్యోతుడి కూతురికి వీణ నేర్పుతాడు. ఇద్దరూ ప్రేమించుకొంటారు. ఆమెను వదిలి తాను విముక్తికి ఒప్పుకోడు. అప్పుడు యుగంధరుడు – ఉదయనుడిని అతని, ఘోషవతి అనే వీణను, నలగిరి అనే ఏనుగును వావదత్తను విడిపిస్తానని మళ్ళీ ప్రతిజ్ఞ చేస్తాడు. సఫలుడౌతాడు. అందుకే "ప్రతిజ్ఞా యౌగంధ రాయణం". ఇందులో నాయకుడు యౌగంధ రాయణుడే. కృత్రిమ ఏనుగు ఉంటుంది. ట్రోజన్‌వార్‌లోని ట్రోజన్ గుర్రం గుర్తుకొస్తుంది.

స్వప్న వాసవదత్త – ఆరు అంకాలు. దాదాపు అదే కథ. ట్రీట్‌మెంటఖ అద్భుతం. ఉదయన రాజు భార్యపద్మావతి ప్రేమికురాలు వాసవదత్త. ఉదయనుడు అర్ధ జాగ్రత్ అవస్తలో కలను నిజాన్ని కలబోసుకొన్న అనుభవాన్ని కవి బాగా తీర్చిదిద్దాడు. అనంగ హర్షమాత్రు రాజు రాసిన "తాపస వత్సరాజ" నాటకం ఇదే కథ ఆధారంగా నడుస్తుంది.

అవిమారకం – ఆరు అంకాల నాటకం. నాయకుడే అవిమారకుడు. "అవి" అనే పేరున్న రాక్షసుడిని చంపాడు కనుక ఆ పేరు. రుషి శాపంతో రాజరికం కోల్పోతాడు. మేనమామ కూతురు కురంగిని ప్రేమించి అక్కడ తిష్ట వేస్తాడు. రహస్యం బయట పడితే కురంగి అగ్నిలో దూకి ఆత్మహత్యకు పాల్పడితే విద్యాధరుడు ప్రత్యక్షమై మాయా ఉంగరాన్నిస్తాడు. దాని సాయంతో ఆమెను రక్షిస్తాడు. నారదుడు వచ్చి విషయం తెలిపి ఇద్దరికీ తండ్రి అనుమతితో పెళ్లి చేస్తాడు. ప్రతిజ్ఞలో లాగానే ఇందులోనూ విదూషకుడు ఉన్నాడు. షేక్స్పియర్ రాసిన రోమియో – జూలియెట్ నాటకాన్ని తలపిస్తుంది. ఈ కథ వాత్సాయన కామసూత్ర, గుణాఢ్యుడి బృహత్కధలో చోటు చేసుకొన్నది.

చారుదత్త – నాలుగు అంకాలు. అభినవ గుప్తుడు దీన్ని "దరిద్ర చారుదత్తం" అన్నాడు. వసంత సేన అనే వేశ్య, చారుదత్తుడనే బీద పెళ్లి అయిన బ్రాహ్మణుడి ప్రేమకథ. మృచ్ఛకటికం కథ. అసంపూర్ణ నాటకం. శూద్రకుడి

మృచ్ఛకటికానికి సంక్షిప్తం ఇది అన్నారు. ఇది నిజం కాదు శూద్రకుడూ భాసుడి కథను ఆధారంగా చేసుకొని పెంచి నాటకంగా రాశాడని అందరి అభిప్రాయం. భాస నాటకాలను గుజరాతీ, మణిపురి భాషల్లోకి గోవర్ధన పంచాల్ అనువాదం చేశారు. వీటిని రవీంద్రుని విశ్వభారతిలో ప్రదర్శించారు. భాసుడు కృష్ణుడి ఆయుధాలను కూడా సజీవ పాత్రలుగా మార్చటం విశేషం అని సునీల్ కొఠారి అనే చారిత్రక విశ్లేషకుడు తెలిపాడు.

కవితా గీర్వాణం

భాసుని ప్రతినాటకం ఒక ప్రత్యేకతను సంతరించుకొన్నది. ఏదీ పూర్వ రచయితల అనుకరణలు కానేకావు. అతని శైలి సంభాషణలు రస సంపూర్ణాలు. కల్పనలు, సన్నివేశాల నిర్వహణ మహా ప్రతిభావంతంగా చేశాడు. ఒక రకంగా అతని సంభాషణా రచన అనితర సాధ్యం అనిపిస్తుంది. సులభంగా హృదయాలను తాకుతాయి. ప్రదర్శన యోగ్యంగా నాటకాలు రాయటం భాసుని ప్రత్యేకత. అందుకే కేరళ నటులు "చాక్యారులు" వంద ఏళ్ళ నుండి భాస నాటకాలు ప్రదర్శిస్తున్నారు. కనుకనే ఇప్పటికి సజీవంగా నిలిచాయి. భాసుడంత సమర్ధంగా తర్వాత నాటక రచయితలు చేయలేకపోయారు. ఏకాంకికలను కూడా సర్వాంగ సుందరం చేశాడు. ఊరు భంగంలో నాటక కళ పరిపుష్టి పొందింది. బాలచరిత్రలో కథాకథనం లేకపోయినా, సంఘటనల కూర్పుతో చిరస్మరణీయం చేశాడు. పంచరాత్రం నాటకం "సామవ కార భేదం" అనే దానికి చెందింది. కథా కల్పనా చాతురికి ఇది గొప్ప ఉదాహరణం. అభిషేకం ప్రౌఢ నాటకం. నీరస కథలను రసమయం చేసిన కవి మాంత్రికుడు భాసుడు. వాలి వధను రంగంపై చూపించాడు. భాసుని అనుసరించి భవభూతి మహావీర చరిత్ర, ఉత్తర రామ చరిత్ర రాశాడు. భాసుని ప్రతిమా నాటకం పాత్ర చిత్రణ, కళా దృష్టిలో ఉత్తమ నాటకం.

స్వప్న వాసవదత్తలో భాసుని నాటక కళా ప్రతిభ విశ్వరూపం దాల్చింది. ప్రౌఢ కవిత్వం, సన్నివేశ కూర్పు, అన్ని ఒకదానిని మించి ఒకటి అమిరాయి. విధి విలాసాన్ని (ఐరనీ ఆఫ్ ఫేట్) చక్కగా చిత్రించాడు. మధ్యమ వ్యాగోగం,

ప్రతిజ్ఞా నాటకాలలో నాటకీయ శిల్పం పరాకాష్టకు చెందింది. పతాక సన్నివేశాలను ప్రతిభావంతంగా నిర్వహించాడు. తన అభిరుచిననుసరించి స్వతంత్రించి కథలను మార్చాడు. పాత్రల చుట్టూ కొత్త కథ అల్లాడు. అదే అతని నేర్పు. అవి ఎబ్బెట్టుగా లేకుండా ప్రేక్షకాభిరుచిని పొందాయి.

సలక్షణమైన మన కవిత్వం రాశాడు భాసుడు. వర్ణనలు ఔచిత్యంగా చేయటం భాస ప్రకృతి. చమత్కారాలు ఉండనే ఉండవు. ఉపమానాలు ప్రకృతి నుంచే తీసుకొంటాడు. అనవసర శ్లోకాలు రాయడు. లోకోక్తులతో భావ వ్యక్తీకరణం చేశాడు. భాస భావాలు సూటిగా గుండెల్లోకి దూరిపోతాయి. మనుష్యులంతా భాసుడికి మంచివారుగానే కనిపించటం మరో ప్రత్యేకత. మానవ జీవితాన్ని సూక్ష్మ దృష్టితో దర్శించి చిత్రించాడు. కవికుల గురువు కాళిదాసుకు భాసుడు అంటే అభిమానం ఎక్కువ. భాస సౌమిల్లాది కవుల ముందు తాను తీసికట్టు అని కాళిదాసే చెప్పుకొన్నాడు. భాసుడిని అనేక సందర్భాలలో అనుసరించాడు. ప్రతిమా నాటకంలోని రఘువంశ క్రమాన్నే కాళిదాసు రఘువంశంలో పాటించాడు. భవ భూతిపైనా భాస ప్రభావం పడింది. మాలతీ మాధవం భాసుని అవికార నాటకంలా ఉంటుంది. హర్షుని రత్నావళి, ప్రియ దర్శకాలు భాస వాసవదత్త అనుకరణలే. నాగానందం మీదా భాస ప్రభావం ఉంది. విశాఖదత్తుడు ముద్రా రాక్షసం కూడా భాసుని చారుదత్త నాటకం మీదే ఆధారపడి రాశాడు. ఇలా నాటక కళా చాతుర్యం, కథా కల్పనా నైపుణ్యాలతో భాసుడు ఎందరో తరువాత కవులకు ప్రేరణగా, స్ఫూర్తిగా నిలిచాడు.

మన గీర్వాణ కవుల్లో కాళిదాసు కంటే పూర్వంవాడు భాసుడు. క్రీ.పూ వాడు కూడా. కనుక మన సీరియల్‌లో మొదటి స్థానం భాసుడిదే. ఆ తర్వాతే మిగతా కవులు అని విన్నవిస్తున్నాను.❀

16. అర్ధ గౌరవాన్ని అందలం ఎక్కించిన కవి - భారవి (530-550 ad)

అసలు భారవి పేరే విచిత్రంగా ఉంది. దీని అర్థం "సూర్య దీప్తి" (ప్రకాశం). అందరి కవుల్లాగానే భారవి జీవిత కాలమూ అసందిగ్ధంగానే ఉండిపోయింది. పద్దెనిమిది సర్గల మహాకావ్యం "కిరాతార్జునీయం" రాసిన మహాకవి భారవి. కిరాత అంటే మారువేషంలో వచ్చిన శివుడికి పాండవ సోదరుడు అర్జునుడికి మధ్య జరిగిన పోరాటం, మెచ్చిన శివుడు కిరీటికి పాశుపతాస్త్ర ప్రదానం చేయటం కథ. ఈ కథ బెజవాడ ఇంద్రకీలాద్రిపైన జరిగిందని అందరి నమ్మకం. క్రీ.శ.ఆరవ శతాబ్దంవాడు భారవి అని ఎక్కువమంది చెప్పారు. 634 చాళుక్య "ఐహోళ శాసనం"లో భారవి కాళిదాసుల పేర్లున్నాయి. పశ్చిమ గంగ వంశ పాలకుడైన దుర్వినీత కిరాతార్జునీయంలోని పదిహేనవ అధ్యాయంపై వ్యాఖ్యానం చేసినట్లు తెలుస్తోంది. ఈ రాజులు నాలుగవ శతాబ్దం మధ్యభాగం నుండి పరిపాలన చేశారు. దుర్వినీత మహారాజు ఆరవ శతాబ్ది చివరలో రాజ్యపాలన చేసినట్లు చరిత్ర చెబుతోంది. ఏడవ శతాబ్దికి చెందిన దండి కవి రచనల్లో భారవి తన ముత్తాతగారి స్నేహితుడు అని పేర్కొన్నాడు. భారవియే తన తాతగారికి విష్ణువర్ధన మహారాజు ఆస్థానంలో చోటు కల్పించాడని చెప్పాడు. ఆ తర్వాతే తాతగారు

పల్లవరాజైన దుర్వినీత, సింహ విష్ణుల కొలువులో చేరాడట. ఈ విష్ణు వర్ధనుడు మనం అనుకొనే కుబ్జ విష్ణువర్ధనుడు కాదని యశోధర్మ విష్ణువర్ధనుడు అని పరిశోధకులు అంటున్నారు. కనుక భారవి కాలం 530-550 అని అందరూ ఊహించారు. భారవి దాక్షణాత్యుడని, పల్లవ రాజులతో సంబంధం ఉన్నవాడని చరిత్రకారుడు "కాలే" అన్నాడు.

భావ ప్రకటన భారవితోనే ప్రారంభమైనదని విశ్లేషకాభిప్రాయం. "భారవే రర్థ గౌరవం" అన్న టాగ్ కలిగి ఉన్నవాడు. కిరాతార్జునీయ కథ మహాభారతంలోనిదే అయినా దాన్ని సుందర కావ్యంగా తీర్చిదిద్దాడు. కాళిదాసు రాసిన కుమార సంభవ రఘువంశ కావ్యాలు భారవికి ప్రేరణగా నిలిచాయి. కాని సర్వ స్వతంత్రమైన కొత్త శైలికి నాందిపలికి తన ప్రత్యేకతను చాటుకొన్నాడు. "అవంతి సుందరి" కథ ప్రకారం భారవి విష్ణువర్ధనుడి ఆస్థానకవి. వామనుడు "కావ్యాలంకార సూత్ర ప్రవృత్తి"లో భారవి శ్లోకాన్ని ఉదాహరించాడు. అసలు పేరు "దామోదరుడు" అని అవంతి సుందరి కథ వలన తెలుస్తోంది.

కిరాతార్జునాయ కథ

జూదంలో ఓడిపోయిన పాండవులు ద్వైత వనంలో ఉంటారు. దుర్యోధనుడి పరిపాలన ఎలా ఉందో తెలుసుకొని రమ్మని ధర్మరాజు ఒక అడవి మనిషిని గూఢచారిగా పంపిస్తాడు. వాడు తిరిగి వచ్చి సుస్థిర రాజ్యపాలన చేస్తున్నాడు గాంధారీ తనయుడు అని వివరిస్తాడు. భీముడు, ద్రౌపది యుధిష్టిరుడిని యుద్ధానికి ప్రేరేపిస్తారు. చేసిన ప్రతిజ్ఞ ప్రకారం దానికి ఆయన అంగీకరించడు. వ్యాస మహర్షి అక్కడికి వచ్చి అర్జునుడు శక్తి పరాక్రమవంతుడు కావాలని అందుకోసం ఇంద్రకీలాద్రిపై ఇంద్రునికోసం తపస్సు చేయమని ఉపదేశిస్తాడు. ఆ ఆదేశం ప్రకారం బెజవాడ వచ్చి ఇంద్రకీలాద్రి పర్వతంపై తీవ్ర తపస్సు చేస్తాడు. తపోభంగం చేయటానికి దేవతా స్త్రీలు ప్రయత్నం చేసి విఫలురౌతారు. ఇంద్రుడు ప్రత్యక్షమై శివుడిని గూర్చి తనస్సు చేయమని సలహా ఇస్తాడు. శివుడు అర్జున తపోదీక్షను పరీక్షించటానికి కిరాత వేషంలో మాయరూపంలో ఉండే పందిని అతనిపైకి ఉసిగొల్పుతాడు. స్వీయ రక్షణలో కిరీటి మాయా సూకరాన్ని బాణంతో చంపేస్తాడు,

అదే సమయంలో మాయా కిరీటి శివుడు వేసిన బాణం దానికి గుచ్చుకుంటుంది. పందిని కొట్టినవాడు నేను అంటే నేను అని వారిద్దరి మధ్య తీవ్ర వాదోపవాదాలు జరుగుతాయి. ఇద్దరూ ద్వంద్వ యుద్ధానికి తలపడుతారు. శివుడు అర్జున బల పరాక్రమాలకు సంతోషించి పాశుపతాస్త్రాన్ని ప్రదానం చేస్తాడు. కథ చిన్నదే కాని భారవి సకల వర్ణనాత్మకంగా పద్ధెనిమిది సర్గల మహాకావ్యంగా విస్తరింపజేశాడు.

కవితా గీర్వాణం

కాళిదాసు కంటే ఒక అడుగు ముందుకు వేసి జలక్రీడ, వన విహారాలు మధుపానం, ప్రయాణం (ట్రావేలోగ్) వర్ణనలు కూడా చేశాడు. కావ్యంలో ఇవి చోటు దక్కించుకొన్నవి మొదటిసారిగా ఈ కావ్యంలోనే. వర్ణనలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన మొదటికవి భారవి అనిపిస్తాడు. చాలా ప్రౌఢమైన భాషలో కావ్యం రచించాడు. ఉక్తి చమత్కారం ఈ కావ్యానికి భారవి పెట్టిన అదనపు సొమ్ము. నాలుగు నుంచి పది సర్గలు అంటే ఆరు సర్గలను వర్ణనలతో గుప్పించేశాడు. భారవి కవిత్వాన్ని మల్లినాథ సూరి "నారికేళ పాకం" అన్నాడు.

"నారికేళ ఫల సన్నిభం వచో భారవేః సపది తద్విభజ్యతే

స్వాదయంతు రస గర్భ నిర్భరం సామరస్య రసికా యధేప్సితం" అంటే రసగర్భితమైన పదాలను విడగొట్టి ఆస్వాదిస్తే పరమ రుచికరంగా ఉంటుంది. ఆ ఓపికే మనకు కావాలి. రుచి మరిగితే కొబ్బరి నమిలినట్లు నములుతూ రసానందాన్ని పొందవచ్చు. భాష భారవి చేతిలో ఒదిగిపోయింది. శబ్దం అర్థం కలిసి నాట్యమే చేశాయి. అయిదవ సర్గలో చిత్రకవిత్వమూ రాసి షోకులు తెచ్చాడు. సర్వతో భద్ర, యమక, విలోమం మొదలైన చిత్రకావ్య శైలుల్ని ప్రయోగించాడు. ఇంకో గమ్మత్తైన విశేషం ఏమిటంటే "ఏకాక్షర శ్లోకం" కూడా రాసి తన ప్రతిభా ప్రదర్శనం చేశాడు. అంటే ఒకే అక్షరంతో శ్లోకం అంతా చెప్పాడన్న మాట. "న నోనా నున్నో నున్నోనో నానా నాన నాను – నన్నో నున్నో ననున్నేనో నానేనా నున్న ననున్నాత్" – న అనే ఒకే అక్షరంతో రాసిన శ్లోకం ఇది. బాగా ప్రచారమైంది కూడా. దీని అర్థం – "అనేక ముఖాల వాళ్ళల్లారా! ఆయన మనిషి కాదు. తనకంటే తక్కువ బలవంతుని చేతిలో ఓడిపోయాడు. ఆయన బలహీనుడి చేతిలో

ఓడిపోయే వాడేమీకాదు. నిజానికి అతని అధినాయకుడు ఓడిపోలేదు. పైచేయి ఆయినంత మాత్రాన అయిపోలేదు. పీడించేవాడు అదృశ్యమైనాడు. అది పాప కార్యం కాదు". ఆ తర్వాత ఇదే ధోరణిలో నారాయణ పండితుడు తన "మధ్వా చార్య చరిత్రలో "న"తోనే ప్రయోగం చేశాడు. వడిరాజు, రూప గోస్వామి ఇదే దారి పట్టి ఏకాక్షర శ్లోకాలకు పట్టాభిషేకం చేశారు సంస్కృతంలో...

భారవి ఛందో వైవిధ్యంతో ఎన్నో శ్లోకాలు రాశాడు. కాని ఆయన ఇష్టమైనది "వంశస్థ" అనే ఛందస్సు మాత్రమే. ఈ ఛందస్సు భారవి ప్రతిభను ద్విగుణీకృతం చేసిందని క్షేమేంద్రుడు "సువృత్తి తిలకం"లో అన్నాడు. "వృత్త చత్రస్య సా కాపి" వంశస్థస్య "విచిత్రతా – ప్రతిభా భారవేర్యేన సచ్ఛాయే నాధికీ కృతా"

శక్తివంతమైన శబ్ద ప్రయోగం చేశాడు భారవి. ఏ పాత్ర ఎలా మాట్లాడాలో అలానే మాట్లాడించటం భారవి గొప్పతనం. లోకోక్తులు, నీతులు సందర్భాన్ననుసరించి వాడాడు. వీరరస కావ్యం కనుక దాన్ని బాగా పోషించాడు. అది భారవి అభిమాన రసం కూడా. అర్ధాంతరన్యాసాలంకారాలతో లేక జ్ఞానాన్ని కలిగిస్తాడు. 1050 శ్లోకాలున్న ఈ కావ్యంలో 115లో అర్ధాంతారాలంకారాలే ఉన్నాయి.

అర్ధ గౌరవం

భారవి అంటే "అర్ధ గౌరవం" అని ముందే చెప్పుకొన్నాం. తక్కువ మాటలలో ఎక్కువ అర్ధాన్ని చెప్పటమే అర్ధ గౌరవం. ఇంగ్లీష్‌లో "బ్రివిటి" అంటారు. దర్శనాలలో, ధర్మ శాస్త్రాలలో, సూత్రాలలో తక్కువ శబ్దాలలో ఎక్కువ భావం ఉండేట్లు చెప్పారు. అదే భారవి పాటించాడు కావ్యంలో. అంటే కావ్యానికి శాస్త్ర గౌరవ స్థాయి కల్పించాడు. ఈ లక్షణం మన తిక్కనగారిలో కనిపిస్తుంది. "అల్పాక్షరాల్లో అనంతార్ధం" అంటే ఇదే. భారవి ఇలా శబ్దార్ధాల్ని సమతూకంలో వాడటం వలన కావ్య సౌందర్యం హెచ్చింది. శబ్దానికి ఓజోగుణాన్ని చేర్చాడు. మనుష్యుల కావ్య రుచిని గురించి చెబుతూ – "స్తువంతి గుర్వీ మభి దేయ సంపదం విశుద్ధి ముక్తేరపరే విపశ్చిత: – ఇతి స్థితాయాం ప్రతి పూరుషంరుచౌ

సుదుర్లభా: సర్వ మనోరమా గిర:" అన్నాడు – అంటే "కొందరికి అర్ధ సంపత్తి ఇష్టం. కొందరు శబ్ద సంయోజనం కోరుకొంటారు. ఇలా మనుష్యులు భిన్న రుచులను కోరుతారు. అందరి మనస్సులనే ఆకర్షించే కవిత్వం రాయటం సులభం కాదు". ఓజస్సు, ప్రసాద గుణాలతో కవిత్వాన్ని రంజింపజేశాడు... "వికట కవి" శబ్దంలో ఎటునుంచి అయినా అదే మాట వచ్చినట్లు ఒక తమాషా శ్లోకమే రాశాడు. "దేవా కాని నికావా దే – వాహికస్వ స్వకా హి వా – కాకా రే భాభా రేకాకా – ని స్వభ వ్యవ్య భ స్వ ని" పాదాలను మార్చినా వెనక్కి నడిపించినా అలాగే రావటం గొప్ప ప్రక్రియ. దీని అర్ధం – మానవా! యుద్ధం ఎవరికి కావాలి? ఈ యుద్ధభూమి దేవతలకూ ఉత్సాహమిస్తుంది. ఇక్కడ పోరాటాలు జరుగుతాయి. త్యాగాలుఇతరులకోసం చేసుకొంటారు. ఈ భూమి మదించిన ఏనుగులతో, జంతువులతో నిండి ఉంది. యుద్ధం అంటే ఇష్టం ఉన్నా లేకపోయినా ఈ యుద్ధక్షేత్రంలో పోరాడక తప్పదు. మన తెలుగు కవులూ ఈ ప్రయోగాలు బాగానే చేశారు. మరొక గొప్ప శ్లోకాన్ని గమనిద్దాం – "వికాస మీ యుర్ జగదీశ మార్గణా వికాస మీ యుర్ జగతీశ మార్గణ: – వికాస మీ యుర్ జగదీశ మారణా వికాస మీ యుర్ జగతీశ మార్గణ:" దీని అర్ధాన్ని అవలోకిద్దాం – జగధీశుడైన అంటే రాజు అయిన అర్జునుని బాణాలు వ్యాపిస్తున్నాయి. ప్రమాద గణాలు కోలాహలం చేస్తున్నాయి. శివార్జున యుద్ధాన్ని ఆసక్తిగా తిలకించటానికి ఆకాశంలో దేవతలు, మహర్షులు పరివేష్టించి శోభ కలిగిస్తున్నారు."

ఇంకొక శ్లోకంలో "స్థల నళినుల నుంచి రేగిన పుప్పొడి గాలిచేత ఎగర గొట్టబడి ఆకాశంలో ఒక వలయాకారంగా వ్యాపించిందిట. అది బంగారు దారాలతో అల్లబడిన "ఆతపత్రం" అంటే గొడుగులాగా శోభాయమానంగా ఉందట. పరమ రమణీయ భావన ఇది. దీన్ని మెచ్చినవారు భారవిని "ఆతపత్ర భారవి కవి"అనిపిలిచారట.

కిరాతార్జునీయం ప్రతి సర్గలోని చివరి శ్లోకంలో భారవి కవి "లక్ష్మి" శబ్దాన్ని ప్రయోగించాడు అందుకే దీనికి "లక్ష్మ్యంత కావ్యం" అనే పేరొచ్చింది. ఇలాగే హర్షుడు సర్గ చివరి శ్లోకంలో, ఆనంద శబ్దాన్ని ప్రయోగించాడు మాఘుడు

శిశుపాల వధను "శ్ర్యంత" అంటే శ్రీ అంతంగా ఉన్న కావ్యం అన్నారు. నైషధాన్ని "ఆనందాంత" కావ్యమన్నారు. భారవి కిరాతార్జునాయంలోని కవితా సౌందర్యాన్ని తెలియజేయటానికి అనేకమంది ప్రయత్నించారు. మల్లినాధుని వ్యాఖ్యానంతో బాటు 36 వ్యాఖ్యానాలున్నాయి దీనికి. "ప్రకృతి మధురా భారవి గిరి:" అని ఒక కవి ప్రశంసించాడు.

ఈ కావ్యంలో రాజనీతి ఎక్కువ. ఇలా ఉన్న కావ్యాలలో ఇదే మొదటిది. రాజాస్థానంలో మంత్రిగా ఉండబట్టే దీన్ని ఇలా రాయగలిగాడని ఊహిస్తారు. ద్రౌపదితో చెప్పించిన సంభాషణలు చాలా అర్ధ గౌరవంతో కర్తవ్య నిర్దేశకంగా ఉంటాయి. స్త్రీ అబల కాదు సబల అని నిరూపిస్తాడు కవి. సకల సద్గుణ సమేతుడిగా కథానాయకుడైన అర్జునుడిని భారవి చిత్రీకరించి కావ్య గౌరవాన్ని పెంచాడు. భారవి బాటలో నడిచిన మాఘ మహాకవి శిశుపాల వధ కావ్యంలో ఇంకొంచెం విజృంభించి ఇరవై మూడు రకాల ఛందస్సులు వాడాడు. భారవి శివుడిని ఆరాధిస్తే మాఘుడు విష్ణు ఆరాధకుడు. భారవి కావ్యాన్ని జర్మని భాషలోకి మొదట అనువాదం చేసినవాడు కారల్ కాపెల్లర్. హార్వర్డ్ ఓరిఎంటల్ సిరీస్ ద్వారా ముద్రింపబడింది. ఆరు రకాల ఆంగ్ల అనువాదాలు వచ్చాయి. 'జయన్తితే సుక్రుతినో రస సిద్ధాః కవీశ్వరా". ❁



17. వేణీసంహార నాటకకర్త - భట్ట నారాయణుడు (550-600 ad)

భట్ట నారాయణుడు ఏడవ శతాబ్ది కవి అంటారు. 550-650 అని చెప్పవచ్చు. ఆయన రాసిన "వేణీసంహార నాటకం" వీర రస ప్రధానమైన గొప్ప పేరు పొందింది. గంభీరమైన రచనతో సాగి ఉత్కంఠ రేకెత్తిస్తుంది. దీన్ని విశాఖ దత్తుని ముద్రా రాక్షసంతో పోలుస్తారు. రాక్షసంలో స్త్రీ పాత్రలేదు. ఇందులో ద్రౌపది ఉన్నది. అది ముఖ్యమైన భేదం. భట్ట నారాయణుడు కన్యాకుబ్జ బ్రాహ్మణుడు. బెంగాల్ రాజు ఆదిసూరుని ఆహ్వానం మేరకు బెంగాల్‌లో స్థిరవాసం ఏర్పరచుకొన్న అయిదుగురు బ్రాహ్మణులలో భట్టు ఒకడు. టాగూర్ వంశమూల పురుషుడు భట్ట నారాయణుడు అని భావిస్తారు. బెంగాల్‌రాజు ఆదిసూరుడు బ్రాహ్మణాభిమాని కనుక ఈ కుటుంబాలను ఆహ్వానించి పోషించాడు. నారాయణుడికి "భట్టు" అనేది బిరుదు వాచకం. అలాగే "మృగ రాజలక్ష్మ" అనేది, సింహ అనేది కూడా ఇతని బిరుదే. వేణీ సంహారంలో తనను గురించి ఏమీ చెప్పుకోలేదు. ఇతరులు చెప్పింది, లోకంలో ప్రచారంలో ఉన్నవాటిని బట్టే వివరాలు తెలిశాయి. వామనుడు వేణీ సంహారం నుంచి కొన్ని ఉదాహరణలిచ్చాడు. దండి కూడా భట్టును గురించి రాశాడు. కనుక వీరిద్దరికంటే ముందువాడు అని నిర్ణయించారు. భట్టు మూడు రచనలు చేశాడని దండి అన్నప్పటికీ వేణీసంహారం ఒక్కటే లభించింది. వేణీ సంహారం అనేదానికి పెద్దలు - జుట్టుముడి వేయటం

కోసం సంహారం అని, వేణి వలన జరిగిన కౌరవ సంహారం అని, వేణికి సంహారం అంటే జుట్టుకు నివృత్తి అని అర్థాలు చెప్పారు. ఇందులో మొదటిదే బాగా ఉందనిపిస్తుంది.

వేణీసంహారంలో భట్టు కవితా పట్టు

వేణీసంహార నాటకం మహాభారత ఇతివృత్తం. వేణి అంటే జడ. ఇందులో ఆరు అంకాలున్నాయి. ప్రధమాంకంలో శ్రీకృష్ణుని కౌరవుల వద్దకు రాయబారిగా ధర్మరాజు పంపి సంధి చేయమని కోరటం భీమ ద్రౌపదులకు ఇష్టం ఉండదు. సహదేవుడు భీముడిని శాంత చిత్తుని చేస్తాడు. కాని నిండు సభలో పాండవ రాజ పత్నియైన ద్రౌపది తీవ్ర అవమానం పొందటం హృదయ శల్యంగా భావించి భీముడిని రెచ్చగొట్టే ప్రసంగం చేసి అతనిలోని పౌరుషాగ్నిని రగుల్గొల్పుతుంది. ఈ మాటలకు ఉద్రేకం, ఉత్తేజం పొందిన భీముడు తన గదతో దుర్యోధనుడి తొడలను విరుగగొట్టి, దుశ్శాసనుడి వక్షస్థలాన్ని చీల్చి రక్తం తాగి, ఆ రక్తంతో తడిసిన చేతులతో ద్రౌపది కేశపాశాన్ని ముడుస్తాను అని ఘోర, భీషణ ప్రతిజ్ఞ చేస్తాడు. ద్రౌపది దీనితో శాంతిస్తుంది. విఫలమైన సంధి రాయబారంతో వికల మనస్కుడైన కృష్ణుడు అప్పుడే తిరిగి వస్తాడు. ధర్మరాజు ఇక గత్యంతరం లేక కురుక్షేత్ర సంగ్రామానికి పూనుకొనగా భీముడు రెట్టించిన ఉత్సాహంతో యుద్ధ భూమిలో ప్రవేశిస్తాడు.

రెండవ అంకంలో దుర్యోధనుడి భార్య భానుమతికి నూరు పాములను ఒక ముంగిస చంపినట్లు కల వచ్చి కీడును శంకించి కలవర పడుతుంది. శాంతికోసం సూర్యుడికి అర్ఘ్యప్రదానం చేస్తుంది. దుర్యోధనుడు వచ్చి భార్యను ఓదారుస్తాడు. భార్య భర్తలు ప్రేమ సాగిస్తారు. జయద్రధుడి తల్లి వచ్చి తన కొడుకును అర్జునుడు చంపుతానని ప్రతిజ్ఞ చేసిన వార్త తెలియజేస్తుంది. గాంధారీ పుత్రుడు యుద్ధానికి వెడతాడు.

మూడో అంకంలో ధ్రుష్టద్యుమ్నుడు ద్రోణుడిని చంపుతాడు. ఈ వార్త ద్రోణ సుతుడు అశ్వత్థామకు తెలిసి క్రోధంతో ఉడికిపోతుంటే మేనమామ కృపుడు ఊరడించి దుర్యోధనుడి దగ్గరకు తీసుకొని వెళ్లి మేనల్లుడిని సేనాపతిని

చేయమంటాడు. అంతకుముందే కర్ణుడిని చేస్తానని అతను మాట ఇచ్చానంటాడు. కర్ణ అశ్వత్థామల మధ్య తీవ్ర వాదోపవాదాలు నడుస్తాయి రాజు సమక్షంలోనే. కర్ణుడు బతికుండగా తాను ఆయుధం దాల్చనని ప్రతిజ్ఞ చేస్తాడు ద్రోణ సుతుడు. ఇంతలో భీముడు దుశ్శాసనుడిని చంపి వక్షస్థలం చీల్చి నెత్తురు తాగాడన్న వార్త తెలుస్తుంది.

నాలుగో అంకంలో – కర్ణుడి కొడుకు వృష సేనుడు చనిపోయాడని వార్తాహరుడు రాజుకు చెబుతాడు. రెట్టించిన కోపంతో ధ్రుతరాష్ట్ర సుతుడు యుద్ధానికి సన్నద్ధమవుతాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు యుద్ధం వద్దని పాండవులతో సంధి ముద్దు అని హితం చెబుతారు.

ఐదో అంకంలో – భీముడు అర్జునుడు దుర్యోధనుడు ఎక్కడో దాక్కున్న సంగతి తెలిసి వెతుకుతూ ఉంటారు. భీముడిని ద్వంద్వ యుద్ధానికి రమ్మంటాడు రాజు. కాని అర్జునుడు కల్పించుకొని ఆపేస్తాడు. ధర్మరాజు వీరిద్దరిని రమ్మనమన్న వార్త విని అన్నగారి దగ్గరకు వెళ్ళిపోతారు. అశ్వత్థామ వచ్చి రాజును కలుస్తాడు.

చివరిది అయిన ఆరవ అంకం – కౌరవ పక్షంలో అందరూ యుద్ధంలో చనిపోతారు. దుర్యోధనుడొక్కడే మిగిలాడు. ప్రాణ భీతితో ఒక సరస్సులో దాక్కుంటాడు రాజు. పసికట్టిన భీముడు సరస్సు సమీపానికి వస్తాడు. దుర్యోధనుడు పైకి వచ్చి భీముడితో గదా యుద్ధం చేస్తాడు. ధర్మరాజు గూఢచారి భీముడి చేతిలో దుర్యోధనుడు చనిపోయినట్లు చెబుతాడు. అందరూ సంతోషిస్తారు. ధర్మరాజుకు పట్టాభిషేకం, ద్రౌపదికి వేణీ సంహారోత్సవానికి సర్వం సిద్ధం చేస్తారు. ఇంతలో దుర్యోధనుడి రాక్షస స్నేహితుడొకడు చార్వాక ముని వేషంలో వచ్చి ద్వంద్వ యుద్ధంలో భీముడు నిహతుడైనట్లు వార్త చెపుతాడు. ఇదివరకు తాను చేసిన ప్రతిజ్ఞ ప్రకారం ధర్మరాజు మరణ ప్రయత్నం చేస్తాడు. ఈలోగా ఒళ్ళంతా రక్త ప్రవాహంతో తడిసి అలసిన భీకర రూపంలో భీముడు రంగ ప్రవేశం చేస్తాడు. అతడే దుర్యోధనుడు అనుకోని యుద్ధిష్ఠిరుడు యుద్ధం చేయటానికి సిద్ధమవుతాడు. కాసేపటికి రక్తం ఓడుతున్నవాడు దుర్యోధనుడిని చంపిన భీముడుగా అందరూ గుర్తిస్తారు. భీముడు దుశ్శాసన రక్తంతో నిండిన చేతులతో ద్రౌపదీ దేవి వేణీకి

పూసి కురులను ముడిచి వేణీ సంహారం చేస్తాడు, శ్రీకృష్ణుడు వచ్చి భరత వాక్యం పలుకుతాడు.

వేణిలో నారాయణ భట్టు నాటక రీతి

భారత యుద్ధ క్లైమాక్స్ ఘట్టాలను ఎన్నుకొని, నాటకీయతను పోషించి మంచి ఉత్సుకతను నింపాడు వేణీసంహారంలో కవి భట్ట నారాయణుడు. నాటక భాగాలైన సంధి, దాని అంగాలను చక్కగా వినియోగించుకొన్నాడని విమర్శక ప్రశంసలు పొందాడు. ధనుంజయ, విశ్వనాధ మొదలైన నాటక లక్షణకారులు ఈ నాటకాన్ని చాలాచోట్ల ఉదాహరించారంటే దాని ప్రతిభ ఏమిటో అర్ధమవుతుంది. ఇందులో వేణీ సంహారానికే ప్రాధాన్యతనిచ్చి రాశాడు. యుద్ధ ఫలితం అయిన పాండవరాజ్య ప్రాప్తికి అంత ప్రాధాన్యమీయలేదు. ఫల ప్రాప్తి నిర్వహణలో బహుముఖీన ప్రజ్ఞ చూపాడు కవి. మొదటి అంకంలో ముఖ సంధి ద్వితీయంలో ప్రతిముఖ సంధి తర్వాత గర్భ సంధి చివర అవముఖ సంధిలను భట్టు నిర్వహించాడని తెలుస్తోంది. యుద్ధ ఫలితం చివరి అంకంలో డోలాంన్దోళనంలో కాసేపు పడేశాడు చార్వాక రాకతో. కనుక ఫలాపేక్ష అనిశ్చితం అనిపిస్తుంది. టెంపో సృష్టించి కుతూహలం పెంచి కధను నడిపాడు. దుర్యోధనుడు చచ్చాడని ఒకసారి, కాదు భీముడే అసువులు బాశాడని ఒకసారి ప్రేక్షకులు భావించే సస్పెన్స్ మెయింటైన్ చేశాడు కవి. అలాగే ఇంకో మలుపు – వస్తున్న భీముడే దుర్యోధనుడనుకొని ధర్మరాజు రెచ్చిపోయి యుద్ధానికి దిగటం నాటకీయ పరాకాష్ట అనిపిస్తుంది. వీటినన్నిటినీ అద్భుత భయానక భీభత్సాలతో ఆశ్చర్యాలతో నిర్వహించిన భట్ట బాణుడి నాటక నిర్వహణ తీరుకు హాట్స్ ఆఫ్ అనబుద్ధి వేస్తుంది.

ఇంత బాగా నాటకం ఉన్నా ఇందులో కొన్ని లోపాలూ ఉన్నాయి. సన్నివేశాలు వేగంగా నిర్వహింపబడలేదు. కృత్రిమ సంఘటనలు ఆకట్టుకోలేదు. సుదర్శకుడు అనే చార్వాక సంభాషణ “సుదీర్ఘ సుత్తి” అనిపిస్తుంది. వర్ణనలు సాగదీయటంతో గమనం మందగించింది. కాని ఈ నాటకంలో శైలిని “రసాభాస” అన్నారు. ఇది పాత్రల చిత్రణకు దోహద పడింది. ఈ దృష్టిలో ఇది శ్రేష్టమైన నాటకం అనిపించింది. సందట్లో సడేమియా అన్నట్లు యుద్ధంలో దుర్యోధనుడు

భార్యతో ప్రేమకలాపం చేయటం ఎబ్బెట్టు, అనౌచిత్యం అనిపించి "దా.వీ.శూ.కర్ణ" (దాన వీర శూర కర్ణ)లో దుర్యోధన "ఎన్టిఆర్", భానుమతి "ప్రభ"తో పాడిన డ్యూయెట్ గుర్తుకొస్తుంది. దీన్ని "ముమ్మటుడు" కూడా అధిక్షేపించాడు. మనకే అలా ఉంటే ఆయనకు ఉండటంలో ఆశ్చర్యమేముంది? భానుమతి స్వప్నం షేక్స్పియర్ నాటకం జూలియస్ సీజర్ భార్య కలను జ్ఞాపకం చేస్తుందన్నారు. కవిత్వ పరంగా వేణి సంహారం తొంభై మార్కులు సాధించినా నాటక కళా ధర్మం ప్రకారం "అత్తెసరు మార్కులు" అంటే పాస్ మార్కులే పొందింది. వీర రసం కోసం వాడిన దీర్ఘ సమాసాలు, క్లిష్ట పదాలు ప్రేక్షకులకు కొరుకుడు పడవు.

భట్టు శైలి హృదయగతం. మనోగతం కాదు అదే పెద్ద లోపం. వాచ్యార్థమైన శైలి. మన "పరుచూరి బ్రదర్స్ రకం" అన్నమాట. ఇన్ని లోపాలున్నా వేణీ సంహార నాటకాన్ని సంస్కృత నాటకాలలో విశిష్ట నాటకంగానే భావిస్తారు. శృంగారాన్ని అంగాంగంలో పూసి వదిలిన నాటకాల కంటే భిన్నంగా వీరానికి "వీర తాళ్ళు" వేసి రంజించే ప్రయత్నం చేసి వినూత్న మార్గానికి దారి వేశాడు భట్ట బాణుడు. ఈ గొడవ ఇలా ఉంటే, ఇందులో నాయకుడు ఎవరు అనే ప్రశ్న వేసుకొని విమర్శకులు బుర్రలు బద్దలు చేసుకొన్నారు. ధర్మరాజే అన్నారు. భారత వాక్యం ద్వారా ఫలప్రాప్తి పొందాడు కనుక ఆయనేనన్నారు. కవికి కూడా ఇది ఇష్టమేనన్నట్లు కథాగమనం వలన అర్థం అవుతుంది.

ఇది కుదరదు – మొదటి అంకంలో ప్రతిజ్ఞ చేసి చివరి అంకం దాకా కథ నడిపించి అన్నదమ్ములిద్దర్నీ చంపి రక్తం తాగి తొడలు విరగ్గొట్టి ద్రౌపదికి వేణీ సంహారం చేసింది భీముడే కనుక రియల్ హీరో ఆయనే అన్నారు కొందరు. ఫలప్రాప్తి కలిగించిన వాడు భీముడు. ఫల భోక్త ధర్మరాజు. ప్రధాన సాధకుడు భీముడు. సాధన ఫలాన్ని పొందినవాడు పెద్దన్న యుదిస్థిరుడు. కనుక భీముడికే హీరోగా ఎక్కువ మార్కులు. ఇక్కడ ముద్రా రాక్షస నాటకాన్ని దీనితో పోలుస్తున్నారు. అక్కడ చాణక్యుడు కార్య సాధకుడు, చంద్రగుప్త మౌర్యుడు ఫలభోక్త. అక్కడ చాణక్యుడు. ఇందులో భీముడు తిరుగులేని నాయకులు అనుకొంటే సరిపోతుంది.

ధర్మాధికారి, మహోపాధ్యాయ బిరుదాంకితుడైన "జగద్ధార పండితుడు"

వేణీ సంహారానికి గొప్ప వ్యాఖ్యానం రాశాడు. వేణీ సంహారాన్ని వడ్డాది సుబ్బరాయ కవి తెలుగులోకి అందమైన కంద పద్యాలలో అనువాదం చేశారు. దీన్ని చిలకమర్తి వారికి చదివి వినిపించారట వ.సు.కవి. ఎంతో బాగుందని మెచ్చి ఆశువుగా – "వేణీ సంహారంబును – వాణీ ధవతుల్యుడైన వసురాయుడు తా – నాణెముగా తెనిగించెను – ప్రాణంబులు లేచి వచ్చు పద్యము విన్నన్" అని మెచ్చుకున్నారు. వసురాయని వేణీ సంహార అనువాద పద్య గద్యాలను రంగస్థలంపై పఠించేవారట.

వేణీ సంహారం కొన్ని అద్భుత శ్లోకాలను చూద్దాం. భట్టు వైవిధ్యమైన ఛందస్సును వాడాడు. పద్యా వక్త్రం, లలితా, ఔపచ్ఛందసిక, ఆర్యా, ద్రుత విలంబిత, ప్రహర్షిని, పృథ్వీ ఛందస్సులను మామూలు వాటితో పాటు సందర్భోచితంగా ఉపయోగించి రక్తి కట్టించాడు.

"చంచద్భుజ భ్రమిత చండ గదాభి ఘాత – సంచూర్ణి తోరుయుగళస్య సుయోధనస్య

స్యానవ నద్ధ ఘన శోణిత సిక్తపాణి – రుత్తం సయిష్యతి కచాస్తవ దేవి భీమ:". దీని అర్థం "వేగంగా కదిలే భుజాల చండ గద యొక్క దెబ్బలతో ముక్కలైన తొడలు కల సుయోధనుడి రక్తంతో పూసుకొన్న చేతులతో భీముడు నీ సిగను ముడి వేస్తాడు" అని భీముడు ద్రౌపదికి చేసిన ప్రతిజ్ఞ ఇది. వసంత తిలక వృత్తంలో వీర రసస్పోరకంగా భట్టు రాసిన శ్లోకాన్ని అందరూ ఉదాహరిస్తారు. ఇది మన నన్నయ్యగారు భారతంలో భీమునితో నిండు సభలో "అమ్మోరు నిజోరు దేశమున పంచిన ఇద్దురాత్ము చండ గదాభిఘాత హతిన్ భగ్నోరు తరోరు జేసెద యుగ్ర రణాంతరంబునన్" అనిపించిన పద్యం గుర్తుకు తెస్తుంది. భట్టు తనను "కవి మృగరాజు" అంటే "కవి సింహం" అని పిలుచుకొన్నాడు. మాఘుడిలాగా విలక్షణమైన వినూత్న పదాలను ఉపయోగించాడు భట్టు. "కొణాఘాతమ్" అనే శబ్ద ప్రయోగం యుద్ధ సందర్భంలో చేశాడు. అంటే లక్ష ఢక్కలు, వెయ్యి భేరులు ఒకేసారి మోగితే వచ్చే శబ్దం అని అర్థంట. కరభం అనే శబ్దాన్ని వాడాడు అంటే – మణికట్టు నుంచి చిటికెన వేలి వరకు ఉన్న భాగమట. తొడలు కలిగినదీ అనే అర్థం కూడా ఉందట.

గబ్బిట దుర్గాప్రసాద్

నాటకంలో హాస్యం పండించే విదూషక పాత్ర లేకుండా రాశాడు భట్టు. కాల, వస్తు, సమయ, నటన, ఐక్యతలు లేవని పాశ్చాత్య విమర్శకులు విల్సన్, బారువాలు ఎత్తి చూపారు. దుర్యోధనుడు భానుమతితో సరసాలు ఆడుతుంటే ద్వారపాలకుడు ఒక్కసారిగా ప్రవేశించి "భగ్నం భగ్నం" అని అరుస్తాడు. అంటే ఆ గది బయట దుర్యోధనుడి రాజధ్వజం పెనుగాలికి విరిగి ఊడిపడిందని అర్ధం. ఈ సన్నివేశ కల్పనా అతనికి జరుగబోయే కీడుకు సంకేతంగా కవి చెప్పించాడు. నాటక ప్రస్తావనలో ధార్తరాష్ట్రులు" అనే శబ్దాన్ని హంసలకు, కూరవులకు చక్కగా అన్వయించే గొప్ప శ్లోకం చెప్పాడు.❀



18. సుభాషిత శతకకర్త - భర్తృహరి మహారాజు (650 ad)

మధ్య భారతంలో ఉజ్జయిని రాజధానిగా చేసుకొని పాలించిన రాజు భర్తృహరి. గొప్ప పాలనా దక్షుడుగా ప్రేమ శృంగారాల పెన్నిధిగా గుర్తింపబడ్డాడు. వందమంది భార్యలతో శృంగార సామ్రాజ్యాన్ని ఏలాడని కథలు గాథలు తెలియజేస్తున్నాయి. ఈ విలాసాలతో గడిపే ఆయనకు రాజ్యపాలన చేసే తీరిక ఉండేదికాదు. కనుక ఆయన చిన్న తమ్ముడు విక్రమాదిత్యుడే రాజ్యభారాన్ని సజావుగా నిర్వహిస్తూ అన్నగారి కీర్తికి లోపం లేకుండా కాపాడుతున్నాడు. తన అపూర్వ శృంగార అనుభవాలను అన్నిటిని రంగరించి భర్తృహరి “శృంగార శతకం” సంస్కృతంలో రాసి కొత్త ఒరవడి తెచ్చాడు. ఈ శృంగారం ఇలా విజృంభిస్తూండగా, ఆయన చిన్న భార్య పింగళ (అనంగ సేన) రథ చోదకుడితో సరస సల్లాపాలు సాగించింది. ఈ విషయం గమనించిన తమ్ముడు విక్రమాదిత్యుడు ఆమెను దేశ బహిష్కరణ చేసి రాజ్యం పరువు కాపాడమని కోరాడు. అన్నగారు తమ్ముడి మాటను నమ్మలేదు. పెడచెవిని పెట్టాడు. ఇదే అదనుగా తీసుకొని ఆమె విక్రమాదిత్యుడినే భర్తృహరి చేత దేశ బహిష్కారం చేయించి అడ్డు తొలగించుకొన్నది.

ఒకరోజు ఒక యోగి రాజాస్థానానికి వచ్చి దైవ ఫలాన్ని మహారాజుకు ఇచ్చి ప్రియమైన భార్యకు అందజేయమని, ఆ ఫలం సామాన్యమైనది కాదని కోరిన కోరికలను నెరవేర్చే కల్పవృక్షమని, నిత్య యవ్వనాన్ని, దీర్ఘాయుష్షును ఇస్తుందని

చెప్పాడు. రాజు తన ముద్దుల చిన్నభార్య పింగళకు ఆ పండునిచ్చాడు. ఆమె తినకుండా తన ప్రియుడు రథసారథికి ఇచ్చింది. వాడు ఎప్పుడూ యవ్వనంతో బలంగా ఉండాలని కోరుకొన్నది. ఆ దివ్యఫలాన్ని రథం తోలేవాడు వాడి ప్రియురాలు వేశ్యకు ప్రేమగా సమర్పించాడు. ఆమె చాలా ఉదారురాలే కాక దేశహితం కోరే వ్యక్తి. సుస్థిర రాజ్య పాలన ప్రజా భవిష్యత్తు మహారాజు చేతిలో ఉంటుంది కనుక భక్తిగా ఆ ఫలాన్ని రాజుకు సమర్పించింది. యోగి తనకు ఇచ్చిన పండు ఈ వేశ్యకెలా లభ్యమైనదో అడిగితే ఆమె అసలు విషయం అంతా బయటపెట్టింది. ఈ సంఘటన మహారాజు భర్తృహరిలో గొప్ప మార్పు తెచ్చింది. తన శృంగారం యెంత చేటు తెచ్చిందో గ్రహించాడు వెంటనే ఒక నీతి శ్లోకం ఈ ఘటనను ఆధారంగా చేసుకొని ఆశువుగా చెప్పాడు. “రత్నైర్మహర్షి స్తుతుర్న దేవా న భోజిరే భీమ విషేణ భీతిం – సుధాం వినాన పరయుర్విరామం న నిశ్చితార్థ ధవిర్మంతి ధీరా:” వైరాగ్య భావం కట్టలు తెంచుకొని ప్రవహించింది. దీనితో నీతి శతకం, తర్వాత వైరాగ్య శతకం రాశాడు.

భర్తృహరి కాలం ఇదమిద్ధంగా తెలియటం లేదు. విక్రమాదిత్య మహారాజు అన్నగారు కనుక క్రీ.పూ. 56కాలం వాడు కావచ్చు. రాజు కేశవశర్మ నాలుగు వర్ణాల స్త్రీలను వివాహమాడాడు. వారికి వరరుచి, విక్రమార్క, భట్టి, భర్తృహరి జన్మించారని కథనం. భర్తృహరి అద్భుత రచన “సుభాషిత త్రిశతి” అంటే శృంగార నీతి, వైరాగ్య శతకాలు. వీటితోబాటు “వాక్య ప్రదీపం” “రాహత కావ్యం”, పతంజలి వ్యాకరణానికి “కారిక” కూడా రాశాడు. శాలివాహన శకానికి పూర్వమే 135 ఏళ్ళు సుస్థిర రాజ్యపాలన చేశాడు. 1691లో ఇండియాలో పర్యటించిన చైనా యాత్రికుడు ఈత్సింగ్ అప్పటికి నలభై ఏళ్ళ క్రితం భర్తృహరి జీవించి ఉన్నాడని రాశాడు. ఏడుసార్లు సన్యాసిగా మారి మళ్ళీ సంసార జీవనంలోకి వచ్చాడని చెప్పాడు. కనుక కాలం క్రీ.శ.650 అని తేల్చారు.

కవితా గీర్వాణం

భర్తృహరి శ్లోకాలు రాని వారెవరూ ఉండేవారు కారు. ముఖ్యంగా నీతిశతక పద్యాలు బోధనా అంశాలుగా ఉండేవి. సరళంగా, గంభీరంగా భావ సంపదతో

రాణిస్తాయి శ్లోకాలు. సంక్షిప్తత ఆయన ముఖ్య లక్షణం. సూటిగా హృదయానికి తాకుతాయి. సహజ సుందరమైన అలంకారాలతో శతకాలకు దివ్యాలంకారాలను అమర్చాడు. ఈ శతకాలు డచ్ భాషతో సహా అన్ని భాషల్లోకి అనువాదం పొంది ప్రపంచ ప్రసిద్ధిని పొందాయి. నీతి శతకంలో నూట తొమ్మిది శృంగార, వైరాగ్య శతకాలలో వందేసి శ్లోకాలున్నాయి. నీతి శతకంలో లోక పరిశీలన బాగా కనిపిస్తుంది. పండితుల ప్రశంసలందుకొన్నాడు. సేవాధర్మం, పరోపకారం, డబ్బు చేసే మార్పులు అన్నీ ఉన్నాయి. శృంగార శతకంలో స్త్రీ సౌందర్యం సంయోగ శృంగారం వేశ్యానింద, ఋతువులలో మనిషికి ఉండే కామ కాంక్ష మొదలగునవి వర్ణించాడు. వైరాగ్య శతకంలో మానవుడి అజ్ఞానం, కోరిక చాపల్యం, లౌల్యం, విషయ సుఖ త్యాగం, ఆత్మగౌరవం, పరబ్రహ్మతత్త్వం, కాలమహిమ, కాశీ నివాస ప్రయోజనాదులను వర్ణించాడు.

భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులో "సుభాషిత రత్నావళి" పేరిట ఏనుగు లక్ష్మణ కవి, పుష్పగిరి తిమ్మన, ఎలకూచి బాల సరస్వతి చక్కని అనువాదం చేశారు. ఇవి సెకండరీ స్థాయిలో బోధక అంశాలుగా ఆనాటి నుండి నేటి వరకూ ఉంటూనే ఉన్నాయి. వీటిని కంఠస్త పద్యాల జాబితాలో చేర్చారు. మనోహర సందర్భోచిత శైలితో మనసుకు ఆహ్లాదం కల్గిస్తాయి. ధారణకు మహాసులువుగా ఉంటాయి.

"ఆకాశమున నుండి శంభుని శిరంబందుంది శీతాద్రి సు
శ్లోకంబైన హిమాద్రి నుండి భువి భూలోకంబు నందుండి య
స్తోకాం బోధి, పయోధి నుండి, పవ నాంధో లోకమున్ చేరే గం
గా కూలంకష పెక్కు భంగులు వివేక భ్రష్ట సంపాతముల్."

ఈ పద్యం రాని తెలుగువారు ఉదహరించని సందర్భం లేనేలేదు. అలాగే "ఆరంభింపరు నీచ మానవులు", "గ్రాసము లేక స్రుక్కిన", తివిరి ఇసుమున తైలంబు "క్షమ కవచంబు" మొదలైన పద్యాలతో భర్తృహరి తెలుగు వారింట చిరంజీవి అయ్యాడు❁

19. సూర్య శతక కర్త - మయూరుడు (606 ad)

సూర్య శతకాన్ని రాసిన మయూర భట్టు క్రీ.శ.606-648 కాలంవాడు. హర్షుని ఆస్థాన కవులలో ఒకడు. బాణుడి సమకాలీకుడు. మయూరుని వంశస్తులు గొప్ప సూర్యోపాసకులు. అందుకే సూర్య శతకం రచించాడు. సాహిత్యంలో, ఆధ్యాత్మిక భావాలలో మయూర శతకం విశిష్ట స్థానాన్ని పొందింది. రాజశేఖరుడు - మయూరుడు, బాణుడు హర్షుని ఆస్థాన కవులని పేర్కొన్నాడు. నిడదవోలు వెంకట రావుగారు తమ పరిశోధనలో "మయూరుడు - ఆంధ్ర వాఙ్మయం"లో మయూరుడు భోజుని ఆస్థానకవి అన్నారు.

"అహో ప్రభావో వాగ్దేవ్యాయన్మాతంగా దివాకర:-శ్రీహర్షస్యా భవద్ సభ్య: సమో బాణ మయోరయో:" అని రాశాడు. మయూరుడు, బాణులతో బాటు హర్షుని ఆస్థానంలో "మాతంగ దివాకరుడు" కూడా ఉన్నట్లు చెప్పాడు. బాణుడికి మయూరుడికి కవితా స్పర్ధ ఉన్నట్లూ చెప్పాడు. మనవాళ్లకు పుకార్ల షికార్లు చేయటం బాగా అలవాటే కదా. ఈ పుకారు షికారులో విలసిల్లిన మరో కట్టు కథ కూడా లోకంలో కనిపిస్తుంది. అదేమిటంటే - మయూరుడు తన కుమార్తెను బాణుడికిచ్చి పెళ్లి చేశాడు. అంటే బాణుడిని అల్లుడుగా చేసుకొన్నాడన్న మాట. ఒకరోజు నవ దంపతులు శృంగార క్రీడలో ఉండగా, మయూరుడు చాటుగా

చూసి కూతురు అందానికి ముగ్ధుడై ఎనిమిది శ్లోకాలు చెప్పాడట. అదే "మయూరాష్టకం". దీన్ని విన్న మయూరుని కూతురు తండ్రిని కుష్టు వ్యాధిగ్రస్తుడు కమ్మని శపించిందిట. ఆ వ్యాధితో తీసుకొంటూ సూర్యోపాసన చేస్తూ సూర్య శతక రచన ప్రారంభించాడట. ఆరవ శ్లోకం రాసేసరికి పూర్తిగా కుష్టు తొలగిపోయిందట. మయూరుని పేర లోకంలో కొన్ని చాటువులు వ్యాపించాయి. ఇవి స్రగ్ధరా వృత్తాలు.

మయూర శతక ప్రఖ్యాతి

మయూరుడికి ఒకప్పుడు కుష్టు వ్యాధి సోకింది. ఆ దుఖంలో ఆరోగ్యం భాస్కరా దిచ్ఛేత్ అనే దాన్ని నమ్మి సూర్య ఉపాసన చేస్తూ సూర్య శతకాన్ని రాసినట్లు కధలు ప్రచారంలో ఉన్నాయి. ఈ శతకం పూర్తి అయ్యేసరికి వ్యాధి పూర్తిగా నయమైనదట. బాణుడి శాపం వల్ల ఈ వ్యాధి వచ్చిందనే ప్రచారమూ ఉంది కాని జగన్నాధుడు పూర్వజన్మ వల్లనే వచ్చిందని తెలియజేశాడు. సూర్య శతకంలో వంద శ్లోకాలున్నాయి. స్రగ్ధరా వృత్తంలో మయూరుడు ఈ శతకం రాశాడు. చదువుతుంటే మహానందం కలుగుతుంది. రచన గౌడీ రీతిలో ఓజో గుణ ప్రధానంగా ఉంది. యమక పంట పండించాడు. ఈ శతకంలో అనేక అర్ధాలంకార సంయోజనంతో రచించాడు. ప్రౌఢ రీతిలో నడిచింది.

మొదటి నుంచి నలభై మూడవ శ్లోకం వరకు సూర్య కిరణాల వర్ణన, సూర్య స్తుతి ఉంది. తర్వాత అయిదు శ్లోకాలలో సూర్యుని రధం, సూర్యాశ్వాల వర్ణన చేశాడు. పిమ్మట పన్నెండు శ్లోకాలలో సూర్య రధ సారధి అరుణుడిని (అనూరుడు) వర్ణించాడు. సూర్యుని రధాన్ని పదకొండు శ్లోకాలలో చెప్పాడు. ఏడు శ్లోకాలలో సూర్యబింబాన్ని, మూడు శ్లోకాలలో శివ, విష్ణు, బ్రహ్మ స్వరూపుడుగా సూర్యుని స్తుతించాడు. మరొక శ్లోకంలో సమస్త దేవతల కంటే సూర్యుడు సర్వ శ్రేష్టుడని వివరించాడు. సూర్యుడు ప్రకాశించేటప్పుడు భూమిపై జరిగే పరిణామాన్ని వర్ణించి చెప్పాడు. మరొక్క శ్లోకంలో సూర్యుడు సమస్త చరాచర జగత్తుకు సార్వభౌముడు అని నిరూపిస్తూ వర్ణించాడు. మయూర కవి రాసింది ఒకే ఒక్కటి అదే మయూర శతకం. దీనితోనే కవుల్లో అగ్రభాగాన నిలిచాడు. అంటే అంతటి

ప్రశస్తిని ఈ శతకం ద్వారా సాధించాడని గ్రహించాలి. ఒక్క శతకంతో "జాక్‌పాట్" కొట్టి సాహితీ ఉద్యానవనంలో కవితా మయూర నృత్యం చేశాడు సప్తవర్ణ శోభ కల్పించాడు అంతేకాదు – సాహిత్య నభోమండలంలో సూర్య శతకంతో శతసహస్ర భాను కిరణ పుంజాలను వెదజల్లి ఆరోగ్యంతో బాటు, ఆనందాన్నీ, హృదయాహ్లాదాన్ని కల్గించి నభోమండల సవిత్రు నారాయణమూర్తి యై భాసించాడు.

మయూరుని చాటువుల్లో ఒకటి – అర్థనారీశ్వరుడైన పార్వతీ పతికి సంధ్యాదేవి వలన జన్మించిన సంధ్యపై ప్రేమ కల్గిందట. అప్పటికే నెత్తిమీద గంగ సవతిగా ఉంది. ఒకరోజు శివుడు నాట్యం చేసే సమయం వచ్చింది. పార్వతి గంగను దించను, సంధ్యను వదించను అన్నదట. శివుని శరీరం నుండి వేరైపోవాలనీ అనుకొందిట. ఆమెను ఆపే ప్రయత్నంలో శివుడి హస్తం సర్వమంగళ కుచాన్ని తాకిందట. అలాంటి మంగళకరమైన చేయి మనల్ని రక్షించాలి అని కవి శ్లోకం చెప్పాడు –

"అనన్యా సంప్రతీమం కురు మదన రిపో – స్వాంగ దాన ప్రదానం – నాహం సోఢుం సమర్ధా శిరసి సురనదీం – నాపి సంధ్యాం ప్రణతుం – ఇత్యుక్త్వా కోప విద్ధాం విఘట యితు ముమా – మాత్మ దేహం ప్రవృత్తాం – రుంధానః పాతు శంభో: కుఛ కులశ హఠ క్రుస్తో భుజోవా"

మయూర శతకానికి పద్నాలుగు వ్యాఖ్యానాలున్నట్లు తెలుస్తోంది. ఈ శతకానికి ఖండాంతర ఖ్యాతి ఉన్నది. ఆనందవర్ధనుడు మయూర శ్లోకాలను ఉదాహరించాడు. జగన్నాధ పండితరాయలు మయూరుని అనుసరించి "సుధా లహరి"ని స్రగ్ధరా వృత్తాలలో రచించాడు. మయూరుని కవితా శక్తికి ఆకర్షితులైన వారిలో పింగళి లక్ష్మీకాంతం, దాసు శ్రీరాములు, వడ్డాది సుబ్బారాయ కవులే కాక పూర్వకవులలో శ్రీనాథ, పోతన, పెద్దన, రామరాజ భూషణాదులూ ఉన్నారు. ఇందులో శ్రీనాధుడు మయూరుని పదిహేను శ్లోకాలను అనువదించి కాశీఖండం, శివరాత్రి మహాత్మ్యంలలో చేర్చాడు. అంటే తెలుగు వారికి మొదటగా మయూరుని పరిచయం చేసిన ఘనత శ్రీనాధుడిదేనన్న మాట. "భట్ట బాణ మయూర భవభూతి, శివ భద్ర కాళిదాసుల సరసన మయూరుని నిలిపి గౌరవించాడు. మయూరుని

కవితా వేగం అతన్ని బాగా ఆకర్షించి ఆ ధోరణిలో పద్యాలు అల్లాడు. దాసు శ్రీరాములుగారు 1902లో సూర్య శతకాన్ని అనువదించారు. ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రిగారూ తెనుగు చేశారు. రాజశేఖరుడు మయూరుని –

"దర్పం కవి భుజంగానాం గతా శ్రవణ గోచరం – విష విద్యేవ మయూరీ మయూరీ వాఙ్మి కృతం తతి" అని మెచ్చుకొన్నాడు. దీని అర్థం – నెమలి చేసే క్రేంకారం లాంటి మయూర కవి వాక్కు నీచ కవులు అనే విష సర్పాల చెవి సోకగానే వాళ్ళ గర్వాన్ని నశింపజేస్తుంది" మయూర శతకంలో మొదటి శ్లోకం అందాన్ని చూద్దాం –

"జమ్భారీతివ కుమ్భోద్భావమివ దాదాస్సాంద్ర సింధూర రేణుం – రక్తా సిద్ధా ఇవౌఘే రుదయ తటీ దారాద్రవస్య

ఆయాంత్యాతుల్యకాల కమల వన రుచే వారుణోవో విభూత్యై – భూయాసుర్భా సయం తో భువన మభినవా భానవో భాన:వీయా"

అర్థం – సూర్య కిరణాలు దేవగజం అయిన ఐరావతం కుంభస్థలం నుండి పుట్టిన సింధూరపు ధూళి కమ్మినట్లు కమ్మాయి. అంటే దేవలోకం నుంచి బయల్దేరాయని చెప్పటం. తర్వాత తూర్పు కొండపై ఉన్న గైరికాది వనమూలిక ద్రవాలతో తడిసి యెర్రబడ్డాయి అన్నట్లున్నాయి. సూర్యుని రాకతో పద్మాలు వికసించి పద్మవనం యొక్క యెర్రని కాంతిని సంతరించుకొన్నాయి. మూడు లోకాలను ప్రభావితం చేస్తాయి అని అంతరార్థం.

మయూరుని సూర్య శతకం సి.డిలు లభిస్తున్నాయి. ఇంటర్‌నెట్‌లోనూ వినచ్చు. వింటే చాలు ఆనందానుభూతి లభిస్తుంది. నమ్మకం ఉంటే ఆరోగ్యమూ సిద్ధిస్తుంది. ❁



20. అలంకార శాస్త్రకర్త, వచన పితామహుడు - దండి (700 ad)

దండి కవి కాలాన్ని ఇదమిద్ధంగా చెప్పలేకపోతున్నారు. కాని ఆరు, ఏడు శతాబ్దాల కాలం వాడని భావిస్తారు. కొందరు భారతదేశంపై ముస్లింల దండయాత్రకు ముందే దండి జీవించి ఉన్నాడని అంటారు. దండం చేతిలో ఉన్నవాడిని దండి అంటారని మనకు తెలుసు. ముగ్గురు దండిలున్నారని మరో కధనం. దండి అనేది అసలు పేరు కాకపోవచ్చు. అయిదవ శతాబ్దికి చెందిన 'సేతు బంధ' కావ్యంలో కావ్యాదర్శాన్ని గురించి ఉంది కనుక అయిదు ఆరు శతాబ్దాల మధ్యకాలమే దండి జీవించిన కాలం అని గట్టిగా చెబుతున్నారు. పదవ శతాబ్దము వరకు దశకుమార చరిత్రను ఎవరూ పేర్కొనకపోవటం విచిత్రమే. మరికొందరు కాళిదాసు సమకాలీనుడు అన్నారు కాని అది నమ్మశక్యం కాని విషయమే. వచన కావ్యాలు, అలంకార శాస్త్రమూ రాసి పేరుపొందాడు. సృజనకు మారుపేరుగా ఆయన రాసిన "దశ కుమార చరిత్ర" నిలబడింది. దండిని పదలాలిత్యానికి ఉదహరిస్తారు. "కావ్యాదర్శం" అనే గొప్ప అలంకార శాస్త్రాన్ని కవిత్వంగా సృష్టించాడు. ఇది మొదటి అలంకార శాస్త్రంగా గుర్తింపు పొందింది. తమిళనాడులోని కాంచీపుర వాసి. భట్టి కావ్యాలకు ఈ అలంకార శాస్త్రం

ప్రేరణనిచ్చింది. ముప్పైఆరు రకాల అలంకారాల గురించి చర్చించాడు. అలంకారాలు కావ్యానికి నిజమైన అలంకారాలని వాటి వలన శోభ కలుగుతుందని దండి భావన. సంక్లిష్ట సమాస రచన దండి ప్రత్యేకత. సుదీర్ఘ వాక్య విన్యాసంతో ఉక్కిరిబిక్కిరి చేస్తాడు. ఒక్కోసారి వాక్యం అరపేజీ దాకా ఉండేట్లు రాసిన సందర్భాలున్నాయి. అనేక సంయుక్తపదాలను అలవోకగా వాడి నిండుదనాన్ని తెచ్చాడు.

దశ కుమార చరిత్రలో పదిమంది యువరాజులు ప్రేమ, రాజరిక అధికారం కోసం చేసే ప్రయత్నాల కథలుంటాయి. ఆనాటి సమాజంలోని వివిధ అంశాలకు ప్రతిరూపంగా కమనీయమైన సంస్కృత వచన శైలితో దీనిని తీర్చిదిద్దాడు. సామాన్య జన జీవితాన్ని ప్రదర్శించాడు ఆ కథల్లో. ఇందులో పూర్వపీఠిక, దశ కుమార చరిత్ర, ఉత్తర పీఠిక అని మూడు భాగాలున్నాయి. ముందే చెప్పినట్లు పదలాలిత్యానికి పట్టాభిషేకం చేశాడు దండి. అందుకే “దండిన: పదలాలిత్యం” అంటారు (Dandi is the master of playful words). దండి దశకుమార చరిత్రను ఆంగ్లంలో “హిందూ టేల్స్” అని “అడ్వెంచర్స్ ఆఫ్ టెన్ ప్రిన్సెస్” అనీ 1927లో అనువదించారు. దశ కుమార చరిత్రలో మొదటి చివరి భాగాలలో కొన్ని పేజీలు లభ్యం కాలేదు. రాజవాహన, విశృత రాజకుమారుల చరిత్రలు అసంపూర్ణంగా ఉన్నాయి. మొదటి, మూడు భాగాలలో కొంత ఇతరులు రాసిన చేర్పులున్నాయి. అందుకే బహుక్రుతం అనే పేరొచ్చింది. అయితే ఆసాంతం కథ లేక రీతిగానే నడిచింది.

దశకుమార చరిత్రంలో మొదటి రెండు అధ్యాయాల్లో ఉపోద్ఘాతంగా కథను చెప్పాడు. ముసలి రాజు రాజహంస తన కుమారులు చాలాకాలం కనిపించకపోవటంతో ఒక మునీశ్వరుడిని అర్థిస్తే, వాళ్లు పదహారేళ్ళ తర్వాత తిరిగి వస్తారని ఆయన సెలవిచ్చాడు. అలాగే వారు చేరుకొని పెద్ద సైన్యంతో వచ్చి శతృరాజు “మనసార”ను ఓడించి, అనేక దేశాలను జయించి సుస్థిరంగా దేశసంచారంలో లభించిన విజ్ఞానంతో ప్రజారంజకంగా రాజ్యపాలన చేశారు.

కేతన కవి తెలుగులోకి పద్య కావ్యంగా దశ కుమార చరిత్రను 1250లో

అనువదించారు. సంస్కృత మూల కావ్యాన్ని అగాశే, కాలే గాడ్ బోలె మొదలైనవారు సేకరించి ముద్రించారు. ఆంగ్లంలోకి హస్కర్, కాలే, జాకబ్ మున్నగువారు అనువదించారు. అజంతా గుహల నిర్మాణాన్ని దశ కుమార చరిత్ర ఆధారంగా అధ్యయనం చేశారు. అవి అయిదవ శతాబ్దికి చెందిన వాకటక వంశ రాజుల కాలం నుండి ఏడవ శతాబ్దానికి చెందిన పల్లవ రాజుల కాలం వరకు విస్తరించాయని తేల్చారు. వాకటక రాజుల కాలంలో దండికి ముఖ్యపాత్ర ఉండి ఉండేదని తెలిపారు పరిశోధకులు. ఈకాలంలో వ్యాపించిన 'వింధ్య వాసిని" గురించి కూడా దండి రచనలో ఉందని భావించారు.

దశ కుమార చరిత్రను స్పెయిన్ దేశపు "పికారేస్క్యు" కావ్యంతో పోలుస్తారు. మొదటి దానిలో ఆరవ శతాబ్దపు రాజకీయ అస్తవ్యస్తత ఉంటే రెండో దానిలో స్పెయిన్ దేశంలోని రాజకీయ కల్లోలం కనిపిస్తుందని అన్నారు. మొదటి దానిలో దొంగలు, వ్యభిచారులు, సంఘ విద్రోహులు మొదలైన సమాజ తిరస్కృతులే ఎక్కువగా కనిపిస్తారని అంటారు. ఇందులోని ముఖ్య కథా భాగాన్ని దండి "బృహత్కథ" నుండి గ్రహించినట్లు అనిపిస్తుంది. ఆనాటి ప్రజలు, సంఘం ఎలా ఉన్నారో చెప్పాడుకాని, దండి ఎలా ఉండాలో చెప్పలేదు అనే విమర్శా అంటించుకొన్నాడు.

దండి రాసిన అలంకార శాస్త్ర కావ్యంలో మూడు అధ్యాయాలున్నాయి. 660 శ్లోకాలున్నాయి. "గుణ ప్రస్తాన" భావాన్ని దండి వ్యాపింపజేశాడు. కవిత్వంలో శ్లేష, ప్రసాద గుణం, సమతా గుణం, మాధుర్యం, అర్ధ వ్యక్తీ, ఓజ అనే గుణాలు లేక లక్షణాలు ఉంటేనే అది గొప్ప కావ్యం అవుతుందని ఈ శాస్త్ర తాత్పర్యం. ❀

21. శృంగార శతక కర్త - అమరుక కవి (700-800 ad)

అమరుక కవిని గూర్చిన పూర్తి వివరాలు తెలియరావటం లేదు. కాని కాశ్మీర్ రాజు అమరకుడే అమరకవి అని అందరూ భావిస్తున్నారు. ఆయన రాసిన వాటిని పరిశీలిస్తే అవి ఒక్కరే రాసినట్లు కనిపించదు. అమరుకుని కాలం క్రీ.శ.ఏడు ఎనిమిది శతాబ్దాల మధ్యకాలం. అమరుక జీవితంపై అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒక కథనంలో అద్వైత మత స్థాపకులు ఆది శంకరాచార్యులవారు మండన మిశ్ర పండితునితో వాదానికి దిగి ఓడిస్తే, ఆయన భార్య ఉమా భారతి తనను కూడా వాదంలో జయిస్తేనే శంకరులకు సంపూర్ణ విజయం లభించినట్లు కాదని తెలియజేసి కామశాస్త్రంపై ప్రశ్నలు సంధించింది. ఆదిశంకరులకు అది అనుభవంలో లేని విషయం కదా. అందుకని ఆ శాస్త్రాధ్యయనానికి వంద రోజులు గడువు కోరుతూ వాదాన్ని వాయిదా వేయించారు. అప్పుడు కాశ్మీర రాజు అమరకుడు మరణిస్తే, ఆయన శరీరంలోకి పరకాయ ప్రవేశం చేసి రాజాంతఃపురంలో కామశాస్త్రాన్ని వంద రోజుల్లో ఆపోసన పట్టాడు. ఒక్కోరోజు శృంగారానుభవాన్ని ఒక్కొక్క శ్లోకంలో వర్ణించి రాసిన శతకం ఇది. రాజు అమరకుడు శృంగారంలో నిష్ణాతుడు. ఈ అనుభవాన్ని భగవత్పాదులు "అమరుకాస్టకం"లో రాసి చిరస్మరణీయం చేశారు.

అమరకాస్టకంపై భాష్యం రాసిన "రవి చంద్రుడు" శంకరులు అమరకుడిని చిరంజీవిని చేయటానికే ఈ అష్టకం రాశారని, ఇందులో రూపకాలంకారాలు విశేషంగా వాడారని చెప్పాడు. శంకరుల వింత, విపరీత ప్రవర్తనను గుర్తించిన రాణులు, ఉద్యోగులు గేలి చేయటం ప్రారంభిస్తే మళ్ళీ రాజు శరీరంలో ప్రవేశించాడని తెలిపాడు. ఆధిభౌతిక శాస్త్రంలో నిష్ణాతుడైన బెంగాలు కవి విమర్శకుడు అయిన రవి చంద్రుడు అమరుకాస్టకానికి ఆధ్యాత్మిక భావాన్ని జోడించి

వ్యాఖ్యానం చేశాడు. అది శంకర కృతమేకాని అమరుక రచన కాదన్నాడు కూడా. దీనికే అమరుక శతకం అని కూడా పేరుంది.

సంస్కృత సాహిత్యంలో "అమరుకాస్టకం" ప్రత్యేక స్థానాన్ని పొందింది. కవి ప్రతిభకు తార్కాణంగా నిలిచింది. ఆ మహాకవి కాళిదాసు కవిత్వానికి, భర్తృహరి శృంగార శతకానికి సరి సమానంగా నిలుస్తుందని తేల్చారు కూడా. తొమ్మిదవ శతాబ్దానికి చెందిన ధ్వన్యాలోకం అనే అలంకార శాస్త్రకారుడు ఆనంద వర్ధనుడు దీన్ని విపరీతంగా మెచ్చుకొన్నాడు. ఇందులో ఒక్క శ్లోకం చదివి అర్థం చేసుకొంటే ప్రేమ శృంగారాల సర్వవిషయాలు అవగతం అవుతాయన్నాడు. అమరుక శ్లోకాలను ఎందరో ఉదాహరించారు. వీటితోనే ఇతర కవుల కవిత్వాలను బేరీజు వేసి నిగ్గ తేల్చారు విమర్శకులు, విశ్లేషకులు. ఆంద్రూ షీలే అనే ప్రఖ్యాత విమర్శకుడు "ఈ భూ మండలంపై ఇంతటి ప్రేమ శృంగార కవిత్వం ఉన్న గ్రంథం లేనేలేదు" అని నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. ప్రేమ, మనోభావం, విరహం, కోరిక, వ్యామోహం, పునస్సంధానం, ఆనందం, విషాదం, దుఃఖం మొదలైన శృంగారం విషయాలకు ఈ కావ్య శతకం అద్దం పడుతుంది. గ్రెగ్ బైలీ అనే మరో విఖ్యాత విమర్శకుడు ఇందులో ప్రేమికుడిని ప్రేమలో పడేయ్యటానికి పడే తిప్పలు, వారి కలయికల్లో అలకలు, ప్రేమికుల మధ్య అనుమానాలు, మోసాలు, ఆనాటి సమాజ స్థితి అంతా తెలుస్తోంది అని చెప్పాడు. పురుషత్వాన్ని నమ్మి మోసపోవటం, స్వీయ సానుభూతి కూడా ఇందులో దర్శనమిస్తాయి. ప్రేమలో కలయిక కోసం వెదికే దారులు, విరహంలో పొందే వేదనలు, తిరిగి కలవాలనే తహతహ ఈ శతకంలో పరమ అద్భుతంగా కవి చిత్రించాడు.

అమరుక అస్టకానికి విశ్వవ్యాప్తంగా ఆదరణ ఉంది. ఇంగ్లీష్‌లో దీన్ని "ఈసోటిక్ పోయెమ్స్ ఆఫ్ ఇండియా" పేరిట ఆంద్రూ షెల్లింగ్ అనువాదం చేశాడు. "లవ్ లిరిక్స్" పేరుమీద గ్రెగ్ బైలీ మరో అనువాదం చేశాడు.

అమరుక కవి అష్టకంలో రెండు శ్లోకాలు వాటి రమణీయత చూద్దాం.

"నిశ్శేషచ్యుత చందనం స్తనతటం నిర్మృష్ట రాగోధరో
నేత్రే దూరమంజనే పులకితా తన్వీ తవేయం తను:

మిధ్యావాదిని దూతి బాంధవజన స్యాజ్ఞాతపీడాగమే
వాపీం స్నాతుమితో గతాసిన పుంస్త స్యాథమస్యానికమ్

నాయకుడి దగ్గరకు నాయక దూతికను పంపింది. అది సందట్లో సడేమియా అని నాయకునితో శృంగారంలో మునిగి తేలింది. ఈ విషయం పసికట్టిన నాయిక దాన్ని వక్రోక్తిలో దూషించింది. భావం చనులమీద గంధం జారింది, కింది పెదవి ఎర్రదనం మాసింది. కన్నుల కాటుక చెదిరింది. శరీరం అంతా పులకాంకితంగా ఉంది, బంధు పీడ తెలియటం లేదు. అబద్ధాలు ఆడుతున్నావు. బావి నీళ్ళకు వెళ్లావు. ఆ వెధవ దగ్గరికి పోలేదుకదా? రెండో శ్లోకం –

స్విన్నం కేనముఖం? దివాకకర్తైస్తే రాగిణీలోచనే?
రోషాత్త్వద్వచనోదితాద్ విలులితా నీలాలకా? వాయునా
భ్రష్టం కుంకుమ? ముత్తరీయ కషణా త్క్లాంతాసి? గత్యాగతై
ర్యక్తం తత్సకలంకి మత్రవద హే తుది క్షతాస్యాధరే!

ఎందుకు మొహం చెమ్మగిల్లింది? అంటే అది ఎండకు అన్నది. కన్నుల్లో ఆ ఎరుపేమిటి? అంటే నీ మాటలకు అని జవాబు. జుట్టు చిక్కుపడిందేమిటి? గాలికి అని జవాబు. కుంకుమ జారిందేమిటి? పైట రాపిడికి. అలసిపోయావేమిటి? రాకా, పోకా వలన అని జవాబు. అంతా బానే ఉంది కాని పెదిమపై ఆ గాట్లేమిటి?

అమరు శతకాన్ని గరికపాటి మల్లావదాన్లుగారు తెలుగు పద్యాలలోకి అనువాదం చేశారు. క్లాసు విద్యార్థులకు వాటిని బోధించారట కూడా. 1981లో “వైజయంతి” పత్రిక అనే స్వీయ కవితా సంకలనంలో వీటిని వెలువరించారట. అలానే వెంపరాల సూర్యనారాయణ శాస్త్రిగారు కూడా పద్యాలలో చెప్పారు. ఈ రెండు అనువాదాల్లో గరికపాటి అనువాదమే ధారశుద్ధితో ఉందని వెంపరాల వారే స్వయంగా చెప్పారట. అమరుక శ్లోకాలు అనేక మంది ఉదాహరించారు. విద్యాకరుని “శుభాషిత రత్నకోశం”లో అనేక మంది కవుల పేర్లతో ఈ శ్లోకాలు కనిపిస్తాయి. ❀

22. జైన కవి - జట సింహనంది (600-900 ad)

కర్నాటక దేశానికి చెందిన జటసింహ నంది జైన కవి. ఆరు నుంచి తొమ్మిదో శతాబ్దం లోపు ఇతనికాలంగా భావిస్తారు. అనేక కావ్యాలు సంస్కృతంలో రాశాడు. అందులో "వరంగ చరిత్ర" బాగా ప్రసిద్ధి చెందింది. బుద్ధచరిత్ర రాసిన అశ్వ ఘోషుని ప్రభావం జటసింహ నందిపై ఉన్నది. ఈయనకు "జటిల ముని" అనే పేరు కూడా ఉంది.

వరంగ చరిత్ర వరంగ మహారాజు జీవిత చరిత్రను తెలిపే నవల. ఇందులో జైన ధర్మాలు న్యాయాలు అన్నీ పూర్తిగా వివరింపబడినాయి. ముప్పై ఒక్క అధ్యాయాలున్నాయి. చివరిభాగంలో వేదమతంపై తీవ్ర దూషణలున్నాయి. జైన విధానంలో మోక్ష సాధనకు మార్గాలను వివరించాడు జట సింహుడు.❀



23. బౌద్ధ నాటక కర్త - హర్షవర్ధనుడు (606-690 ad)

స్థానేశ్వరాన్ని రాజధాని చేసుకొని వింధ్య నుండి హిమాలయాల వరకు రాజ్యపాలన చేసిన హర్ష చక్రవర్తి మూడు నాటకాలు రాశాడు. హర్షుడు క్రీ.శ.606-648 కాలానికి చెందినవాడు. తన నాటకాలలో హర్షవర్ధనుడు అని చెప్పకుండా "హర్ష దేవుడు" అని చెప్పుకొన్నాడు. తండ్రి ప్రభాకర వర్ధనుడు. చైనా యాత్రికులు హ్యూన్ సాంగ్, ఈత్సింగ్‌లు ఇతని పాలన గురించి రాశారు. బాణుడు హర్ష చరిత్ర రాశాడు. "శీలాదిత్యుడు" అనే బిరుదు ఉంది. అంటే శీలంలో, సదాచారంలో సూర్యుని వంటి వాడని అర్ధం. హర్షుడికి ముందు అన్న రాజ్యవర్ధనుడు రాజరికం చేశాడు. సూర్యారాధక వంశం. తర్వాత బౌద్ధ మతావలంబి అయ్యాడు. గౌడరాజు శశాంకుడు రాజవర్ధనుడిని ఓడించి చనిపోతే హర్షుడు రాజ్యాభిషిక్తుడయ్యాడు. రెండవ పులకేశి ఓడించి దక్షిణంలో నర్మదా నది వరకు హర్షుడు రాజ్య వాప్తి చేశాడు. అయిదేళ్ళకోసారి ధనాగారంలోని డబ్బునంతా ప్రజలకు దానం చేసేవాడు. రాజ్యాధికారం కంటే సాహిత్యంపై మోజెక్కువ. మంచి కవి. హర్షుని కాలంలో నలందా విశ్వవిద్యాలయం పదివేల మంది దేశ విదేశీ విద్యార్థులతో మహోన్నత దశలో ఉండేది. ధర్మకీర్తి ఇక్కడ ఆచార్యుడుగా ఉండేవాడు. తన అన్న, రాజవర్ధనుడిని చంపిన శశాంకుని ఓడించి

సంహరించి ప్రతీకారం తీర్చుకొన్నాడు హర్షుడు. శశాంకుని చెరలో ఉన్న చెల్లెలు రాజ్యశ్రీ తప్పించుకొని బయటపడి బౌద్ధ భిక్షువు చేత రక్షింపబడి హర్షుని చేరుతుంది. ఆ భిక్షువు తత్వబోధతో హర్షుడు బౌద్ధాన్ని స్వీకరించాడు. అంతకుముందు హర్షుడు శివుడి అభిమాని. హర్షుని పట్టమహిషి పారశీక కన్య. ఆమెనే మహాశ్వేతగా బాణుడు చిత్రించాడని అంటారు. రెండవ భార్య సౌరాష్ట్ర రాజ వంశానికి చెందినదని ఆమెయే కాదంబరి అని పండితుల పిండితాభిప్రాయం. హర్ష సామ్రాజ్యం అస్సాం నుండి సౌరాష్ట్ర వరకు, హిమాలయం నుండి వింధ్య వరకు వ్యాపించింది.

హర్షుని కవితా హర్ష వైభవం

హర్షుడు రాసిన మూడు నాటకాలలో ప్రియదర్శిని మొదటిది. నాలుగు అంకాలున్నాయి. బృహత్కథ నుండి తీసుకొన్న ప్రేమకథ ఇది. వత్సరాజు ఉదయనుడు నాయకుడు. కళింగరాజు దృఢ వర్మ శత్రువుల చేతిలో ఓడిపోగా కూతురు ప్రియదర్శిని ఉదయనుడి భార్య వాసవదత్త దగ్గర పరిచారికగా చేరుస్తాడు. సేనాపతి విజయసేనుడు. ప్రియదర్శిని ఉదయనుడు ఒకసారి ఉద్యానవనంలో చూడటంతో ఇద్దరి మధ్యా ప్రేమ చిగురిస్తుంది. వీరిద్దరి ప్రేమను నాటకంగా వేస్తారు. అందులో ఉదయనుడు వాసవదత్తగా ప్రియదర్శిని నటిస్తారు. వీరి ప్రేమ రాణి వాసవదత్తకు తెలుస్తుంది. ప్రియదర్శికను బంధిస్తుంది. దృఢవర్మ శత్రువులను జయించి వాసవదత్తకు అసలు విషయం చెబుతాడు. వాసవదత్త ఉదయన ప్రియదర్శికల వివాహం జరిపిస్తుంది. ఈ నాటకంపై మాళవికాగ్ని మిత్ర ప్రభావం ఉంది.

రత్నావళి నాటకంలో నాలుగు అంకాలున్నాయి. రత్నావళి నాయిక సింహళ దేశానికి చెందింది. రత్నావళి పెళ్లి చేసుకొన్నవాడు చక్రవర్తి అవుతాడనే జ్యోతిష్యం బయట పడుతుంది. వాసవదత్త, యౌగంద రాయణులు ఒక పన్నాగం పన్ని వాసవదత్త చనిపోయినట్లు పుకారు పుట్టించగా, వార్త తెలిసిన మంత్రి వసుభూపతి ఉదయుని దగ్గరకు రత్నావళిని పంపుతాడు. ప్రయాణంలో నౌక ప్రమాదానికి గురై రత్నావళి సముద్రంలో పడి ఎల్లాగో బయట పడి వాసవదత్తను

చేరి సాగరిక పేరుతో పనిమనిషిగా ఉంటుంది. రాజు కంటబడకుండా ఈమెను జాగ్రత్తగా చూసుకొంటున్నా, ఒకసారి వారిద్దరూ ఉద్యానవనంలో కలుసుకొని హృదయాలను పారేసుకొంటారు. తరువాత కొన్ని మలుపులు తిరిగి ఉదయన సాగరికల వివాహం జరిగిపోతుంది. ప్రియదర్శినిలోను ఇందులోనూ దాదాపు ఒకే కథ ఉంది. భాసుడి స్వప్న వాసవదత్త ప్రభావం దీనిమీద ఎక్కువ. నాటకం మనసును ఆకర్షిస్తుంది.

మూడవ నాటకం నాగానందం. ప్రౌఢ రచన. అయిదు అంకాలు. ఇది జీమూత వాహనుడి త్యాగ కథ. అహింసకు ప్రాధాన్యతనిచ్చాడు. ఈ కథకు ఆధారం జాతక కథలోని విద్యాధర చరిత్ర అని హర్షుడు చెప్పాడు కాని అది దొరకలేదు. నాటకారంభంలో బుద్ధుని స్తుతించాడు. అయినా హిందూ మతంపై కోపం లేదు కనుకనే నాటకంలో నాయిక మలయావతిని గౌరీదేవి భక్తురాలుగా చిత్రించాడు. సన్నివేశాలను వేగవంతంగా నడిపిస్తాడు. విసుగు ఉండదు... మొదటి మూడు అంకాలలో శృంగార రసం పోషింపబడింది. తరువాత శాంత రసం సాగింది. హాస్య, అద్భుత రసాలకూ ఇందులో చోటు కల్పించాడు.

కాళిదాస భవభూతుల తర్వాతి స్థానం హర్ష దేవుడిదే. సరళ సుందర శైలితో, కోమలమైన రచన చేశాడు. హర్షుడు నాట్య సంగీతాలలో నిష్ణాతుడు అని తెలుస్తుంది. లలిత కళా ప్రియుడుగా కనిపిస్తాడు. హర్షుని రస హృదయం ప్రేక్షకాదరణ పొందింది. ప్రకృతి చిత్రణా సహజ సుందరంగా చేశాడు. పాత్రల స్వభావాలను సుస్పష్టంగా చిత్రించాడు. కవిగా, నాటకకర్తగా హర్షుడు సవ్య సాచిత్వం చేశాడు. రచనా ప్రావీణ్యం అమోఘమనిపిస్తుంది. హర్షుడు హృదయ హర్షుడనిపిస్తాడు. నాగానంద నాటకాన్ని 2008లో దేశంలో పలుచోట్ల ప్రదర్శించారు. అఖిల భారతీయ మరాఠీ నాట్య పరిషత్ ఆధ్వర్యంలో చాలాచోట్ల ప్రదర్శించారు.

ఈనాటి హర్యానా పంజాబ్ ప్రాంతంలో రాజధాని నేర్పరచుకొన్న హర్షుడి సైన్యంలో లక్షమంది అశ్వికి సైన్యం, అరవై వేలమంది ఏనుగులు ఉండేవి. ప్రజలకు విద్యా వైద్య సౌకర్యాలను ఉచితంగా కల్పించాడు. మంచినీటి సరఫరా నాణ్యంగా

ఉండేది. విశ్రాంతి గృహాలు ఉండేవి. ప్రజలకు కంటికి రెప్పలాగా కాపాడాలని చరిత్రకారులు రాశారు. తక్కువ పన్నులు వేసేవారు ఆరోవంతు భూమి శిస్తు వసూలు చేసేవాడు. ఈనాడు స్థానేశ్వరంలో ఒక కిలో మీటరు పొడవు ముప్పాతిక కిలోమీటరు వెడల్పు ఉన్న శిథిల "హర్షకా తిల" కనిపిస్తుంది. అత్యాధునిక సౌకర్యాలున్న ప్రాంతంగా ఇది కనిపించి ఆశ్చర్యపరుస్తుంది. తాంగ్ వంశానికి చెందిన చైనా చక్రవర్తి తిజాంగ్‌తో సత్సంబంధాలు నేరపాడు. సందర్శకులు ఇరు దేశాల నుంచి వచ్చి వెడుతూ ఉండేవారు. చైనా యాత్రికుడు హ్యూన్ చాంగ్ హర్షుని రాజ్యంలో ఎనిమిదేళ్ళు భారతదేశంలో గడిపాడు. ప్రయాగలో అయిదేళ్లకోసారి మహాకుంభమేళను నిర్వహించేవాడు. నలభై ఒక్క ఏళ్ళు హర్షుడు రాజ్యాన్ని పాలించాడు. హర్షుని కుమారులు వ్యాఘ్ర వర్ధనుడు, కళ్యాణ వర్ధనుడు. హర్షుని ముఖ్యమంత్రి అరుణాశ్వుడు వీరిద్దరిని చంపి, రాణి ప్రభావతిని చెరలో పెట్టాడు.

జయదేవుడు తన గీత గోవిందంలో హర్షుని కాళిదాసుతో పోల్చాడు. జయదేవుని కాలానికే హర్షుని కీర్తి దేశ వ్యాప్తమైందని తెలుస్తోంది. ఆర్.సి.మజుందార్ అనే పరిశోధకుడు హర్షుని గురించి రాస్తూ "A great general and just administrator. Harsha was even greater than patron of religion and learning. He gathered around himself finest intellects holiest sages. Men like Bana, Mayura, Divakara and Huen tsang thronged round his throne. In this respect he is more fortunate than Smudra Gupta for still we posses some gems of literature that proceedede according to tradition from his pen" అని హర్షుని భహుముఖీన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాడు. ఈసారి నైషధాన్ని రాసిన హర్షదేవుడి గురించి తెలుసుకొందాం.



24. వచన బాణం - భట్ట బాణుడు (606-647 ad)

హర్షవర్ధన మహారాజు ఆస్థానకవి అయిన బాణభట్టు ఏడవ శతాబ్దానికి చెందినవాడు. 606-647 అసలు కాలంగా భావిస్తారు. స్థానేశ్వర అని పిలువబడే నేటి కనోజ్ జన్మ స్థలం. హర్షుని జీవితచరిత్రను హర్షహరిత్రగా రాశాడు. బాణుడి "కాదంబరి" జగత్ ప్రసిద్ధం. "బట్ట బాణుని ముద్దుపట్టి కాదంబరి కథలు చెప్పెడి చెల్మి కత్తె నాకు " అని తెలుగు కవి ప్రశంసలనందుకొన్నాడు బాణుడు. సంస్కృతంలో తొలి వచన కావ్యం కాదంబరి. ఈ కథా నవలను పూర్తి చేయకుండానే మరణిస్తే కుమారుడు భూషణ భట్టు పూర్తి చేశాడని అంటారు. బాణుడు చండికా శతకం, పార్వతి పరిణయం నాటకం రాశాడని చెబుతారు. ఈ రెండు గ్రంధాలలో ఆయన చెప్పుకొన్న విషయాలవల్లనే జీవిత చరిత్ర తెలుస్తోంది. "ముకుట తాడితం" అనే నాటకాన్ని కూడా రాశాడని చంద్రపాలుడు, గుణ విజయ గణులు చెప్పారు. కాని అది బాణకృతం కాదు. పార్వతీ పరిణయం వామనభట్ట బాణుడు రాశాడంటారు. కాంబరి మాటకు నానార్ధాలున్నాయి - ఆడుకోయిల, గోరింక, మద్యం. బాణ కవిత్వం కోయిల గానంగా పరవశాన్ని కల్గిస్తుంది. గోరింకలా ముచ్చటగా ఉంటుంది. మద్యంలా హృదయానికి కిక్కు ఇస్తుందని సరదాగా మనం అర్ధం చెప్పుకోవచ్చు.

బాణుడి తండ్రి చిత్రభాను. తల్లి రాజాదేవి. హిరణ్యా బాహు నదీ తీరంలో ఈనాటి చాప్రా జిల్లాలోని ప్రీతికూటలో పుట్టాడు. భోజక కుటుంబంలో

వాత్సాయన గోత్ర సంభవుడు. దేశ సంచారం చేస్తూ ఇంటికి తిరిగి వచ్చాడు. హర్షుడి తమ్ముడు కృష్ణుడు ఆహ్వానం పంపితే వెళ్ళాడు. మనితరలో ఉన్న హర్షవర్ధనుడిని కలుసుకొన్నాడు. మూఖాభినయంతో, కోపాభినయంతో హర్షుని మనసును ఆకర్షించాడు. ఈనాటి ఔరంగాబాద్‌లో హోస్సురా జిల్లాలోని పీరూ గ్రామంలో బాణుడు జన్మించాడని మరో కథనం. "బాణోచ్చిష్టమిదం జగత్" అని లోకంలో సామెత ఉంది. అంటే బాణుడు ముట్టి వదలనిదేదీ లేదు. అనగా ఉన్నదంతా బాణుడు ఎంగిలి చేసి వదిలినదే అని భావం. దీనికి ఇంగ్లీష్‌లో సమానమైన ఒక లోకోక్తి ఉంది. "He did not leave which he did not adorn" సాక్షరం వాసుదేవ దీక్షితులు, నేతా శర్మ, కే.కృష్ణమూర్తి బాణుని జీవితచరిత్ర రాశారు. ఆంధ్ర పండితుడు, కవి రాంభొట్ల లక్ష్మీ నారాయణ శాస్త్రిగారికి "అభినవ భట్ట బాణుడు" అనే బిరుదునిచ్చారు.

బాణ కవితా గీర్వాణం

ఒక్క కాదంబరితోనే బాణుడు సుప్రసిద్ధుడయ్యాడు. "కాదంబరీ రసజ్ఞానానం ఆహారోపి న రోచతే" అని ఒక లోకోక్తి ప్రచారంలో ఉంది. అంటే – కాదంబరిని చదువుతుంటే ఎవరికీ అన్నం మీద కూడా దృష్టి పోదు, తినటం మర్చిపోతారు. బీహార్‌లోని ఔరంగాబాద్ గ్రంధాలయంలో ఇప్పటికీ కాదంబరి సంస్కృత వ్రాత ప్రతి ఉంది. హర్షుడు బాణుడికి అనేక ప్రశంసలే కాక పురస్కార సన్మానాలు కూడా చేశాడు. బాణుడి వచన శైలి మహా ప్రవాహం. అలంకారమయం చేశాడు కాదంబరిని. బాణ భాష కర్ణామృతం. ప్రాసపూరితమై హృదయాహ్లాదిగా ఉంటుంది. బాణుడి విధానం తరువాతి కవులపై ప్రభావం చూపింది. ఆయన ధోరణిలో పడిపోయారు. బ్రాహ్మణ భావాలు, వైదిక సంస్కృతీ ప్రతిబింబించేట్లు రచనలు చేశాడు. దీనికి అసూయ పడిన కొందరు ఇతర పండితులు హర్షుడికి బాణుడిపై చాడీలు చెప్పారు. కాని బాణుడు బెదరలేదు. రాజు స్వయంగా బాణుడిని ఆహ్వానించి నిజ నిర్ధారణ చేసుకోమన్నాడు. ధైర్యంగా తన జీవిత విధానాన్ని రాజుకు పూసగుచ్చినట్లు వివరించి రాజు మనసు దోచుకొని అభామానాన్ని మరింత పొందాడు. గౌరవాలు లభించాయి.

అద్భుత కథామంజరి కాదంబరి. కాదంబరీ చంద్రా పీడుల, మహాశ్వేత, పుండరీకుల ప్రేమకథలు జోడింపబడ్డాయి. చంద్రా పీడుడు పూర్వ జన్మలో చంద్రుడు. తర్వాత జన్మలో శూద్రక రాజు. పుండరీకుడు వైశంపాయనుడు. ఇంకో జన్మలో చిలుక. కాదంబరి మహాశ్వేతలకు ఒకే జన్మ చెప్పాడు. అంటే నాయికల కాలంలో నాయకులూ త్రిజన్ములైనారన్నమాట. నాయికలిద్దరూ గంధర్వ రాకుమారికలు. కాదంబరి చంద్రాపీడుడని శ్వేత పుండరీకుని ప్రేమిస్తారు. విరహాన్ని భరించలేక పుండరీకుడు హరీ మంటాడు. మహాశ్వేత ఆత్మహత్యకు పాల్పడుతుంది. ఇంతలో ఆకాశవాణి చెప్పిన మాట విని ప్రయత్నాన్ని మానుతుంది. సన్యాసిని యై ప్రేమికుడి కోసం ఎదురు చూస్తూంటుంది. చంద్రాపీడుడు తన స్నేహితుడు వైశంపాయనుడి చావు విని చనిపోయి, శూద్రక రాజుగా పుడతాడు. పుండరీకుడు వైశంపాయనుడిగా పుడతాడు. మహాశ్వేతను చూసి మనసు పారేసుకొంటాడు. వైశంపాయనుడే పుండరీకుడు అని తెలియక చిలుకగా మారమని శపిస్తుంది. చిలకను లక్ష్మీదేవి శూద్రక రాజు దగ్గరకు చేరుస్తుంది. జాబాలి ముని దయవలన పూర్వజన్మ తెలుసుకొన్న చిలుక శూద్రుడికి చెబుతుంది. శూద్రకుడు ప్రాణాలు వదిలి కాదంబరిచే రక్షింపబడి చంద్రాచూడుడి కళేబరంలో ప్రవేశిస్తాడు. చిలుక పుండరీకుడవుతాడు. నాయకులిద్దరూ నాయిలకలను కలుసుకొని వివాహం చేసుకొని సుఖ జీవనం గడుపుతారు. ఇదీ కాదంబరిలో మొత్తం కథ.

కాదంబరిలో అద్భుత సంఘటనలున్నాయి. మానవ, గాంధర్వ, చంద్ర లోకాలలో కథ జరగటం విశేషం. టెంపో బాగా నడిపాడు. ఉత్సుకతతో చదివే వాళ్ళు రోమాలు నిక్కబొడుచుకొని ఆశ్చర్యభరితులౌతారు. కల్పిత కథకు మహాద్భుత వచనాన్ని జోడించి హాయిగా చదివేట్లు రాశాడు. ఈ కథ కథా సరిత్సాగరంలో "మకరందికోపాఖ్యానం" ఆధారం అనిపిస్తుంది.

అనేక కథా మిశ్రమంగా ఉన్నా, వర్ణనలతో ప్రాధాన్యాన్ని తగ్గకుండా రాయటం బాణుడి ప్రతిభ. అనేక జన్మల కథలు తమాషాగా ఉండి కథాగమనం మహా వేగంగా సాగిపోతుంది. ఎక్కడా విసుగు రాకుండా రాశాడు బాణుడు. అందుకే వచన రచనలో బాణుడు మేటి అనిపించాడు. బాణంలాగా

దూసుకుపోయేట్లు రచన చేశాడు. మధుర, అలౌకిక ప్రేమకే విలువనిచ్చాడు. అశ్లీలం తాకని శృంగారం వర్ణించాడు. దివ్య ప్రేమకు పట్టంకట్టాడు. కామ వాంఛలను ఎక్కడా చూపలేదు బాణుడు. ప్రేమలో మానవీయ కోణాన్ని ఆవిష్కరించి ఉత్కృత సాధించాడు. కావ్యం లోకానికి మార్గదర్శకంగా ఉండాలన్న సామాజిక బాధ్యత బాణునిలో ప్రస్ఫుటంగా గోచరిస్తుంది.

బాణుడు ఎందుకు ఇప్పటికీ అభిమాన పాత్రుడయ్యాడు? అని ప్రశ్నించుకొంటే బాణుని శైలియే అంతటి పని చేసిందని తెలుస్తుంది. పొడవైన సమాసాల జోలికి వెళ్ళకుండా హ్రస్వ సమాసాలతో కూడిన "పాంచాలీ" శైలిని అవలంబించాడు. అదే అతని సక్సెస్‌కు లాండ్‌మార్క్ అయింది. బాణుడి శబ్దజ్ఞానం చూస్తే మహాశ్చర్యమేస్తుంది. శబ్దాన్ని అర్థంతో సంయోజనం చేసిన తీరు ముచ్చట గొల్పుతుంది. క్లిష్టమైన విషయాన్ని అయినా సరళ సుందరంగా వర్ణించి చెప్పగల నేర్పు బాణుడిది. వక్రోక్తికి పెద్దపీట వేశాడు బాణుడు. వట్టి వక్రోక్తి మాత్రమే కాదు శ్లేషతో అనుపానం చేసి మహా సౌందర్యాన్ని కలిగించాడు. విరోధాభాస, పరిసంఖ్య మొదలైన శ్లేషపై ఆధారపడి ఉన్న అలంకారాలను వాడి రంజకత్వం సృష్టించాడు. వక్రోక్తితో బాటు స్వభావోక్తికీ సమాన స్థానం చూపాడు. అంటే చక్కని సమతుల్యతను పాదుకొల్పాడు రచనలో. కుంతకుడి వక్రోక్తి స్వభావోక్తి అలంకారాన్ని "ఆలం - కార్యం"గా భావించాడు. కాని బాణుడు స్వభావోక్తిని ఆదరించి దాని గుణాన్ని మరింత పెంచాడు. ఇంకొక తమాషా కూడా చేశాడు బాణుడు. ప్రతి అలంకారానికి ఆధారంగా స్వభావోక్తిని తీసుకొన్నాడు. అందుకే అసంభావ్యత కనిపించదు. అదీ అతని మహిమ. వక్రోక్తికి శ్లేష, అతిశయోక్తులే బాగా రాణిస్తాయని అప్పటిదాకా భావించిన వారికి బాణుడు చేసి ఈ ప్రయోగం దిమ్మతిరిగేట్లు చేసింది. సహజ భావ సంపన్నుడు బాణుడు. వస్తువును కాని దృశ్యాన్ని కాని, సన్నివేశాన్ని ఒక చిత్రం గీసినట్లు అద్భుతంగా చిత్రించి వన్నె తెచ్చాడు.

"నవార్థో జాతిర గ్రామ్యో శ్లేషో క్లి స్టః స్ఫుటో రసః - కవిటాక్షర బంధశ్చ కృత్స్న మేకత్ర దుష్కరం" అని బాణుడు చెప్పాడు - అంటే "కొత్త అర్థం, అశ్లీలం

కాని స్వభావోక్తి, రస స్ఫోరకం. వికటమైన అక్షర బంధం, శ్లేష వీటన్నిటి సమాహారమే నా కవిత్వంలో చూడచ్చు" అన్నాడు. సంస్కృతం మీద మోజున్న వారికి బాణ రచన నవలోకాలను చూపిస్తుంది. అనేక మంది తర్వాత కవులు బాణుని శైలిని ప్రశంసలతో ముంచెత్తారు.

"జాతా శిఖండినీ యథా శిఖండీ తదావ గచ్ఛామి – ప్రాగల్భ్య మధిక మాప్తుం వాణీ బబాణో బభూవేత్" అని గోవర్ధనాచార్యుడు బాణుడిని సరస్వతీ అవతారంగా భావించాడు. "అధికమైన ప్రాగాల్భ్యాన్ని సాధించటానికి శిఖండిని శిఖండిగా మారిపోయినట్లు పురుష రూపంతో అతి చమత్కారం పొందాలని వాణి వాణ(బాణ) రూపాన్ని ధరించింది. రాజశేఖరుడు బాణుడి శబ్ద సౌందర్యాన్ని, సుకుమార పద విన్యాసాన్ని శ్లాఘించాడు. ఒక అజ్ఞాతకవి "బాణం గుచ్చుకొంటే ఊపిరి బయటికి రానట్లే, బాణుని కాదంబరి చదివిన తర్వాత, కవులకు వాణి నోటినుంచి బయటికి రాదు" అని చమత్కరించాడు. "శబ్దార్థయోః సమో గుంఫః పాంచాలీ రీతి రిష్యతే – శీలా భట్టారి వాచిబాణోక్తిషు చసాయది".

ధర్మదాసు బాణుని కవిత్వం రుచియైన వర్ణన, పదాలతో కలిసి రసభావ పరిపూపర్ణంగా ఉంది. తరుణ అయిన నాయికలాగా రసిక హృదయాలను దోచుకోవటానికి సమర్ధత కలిగి ఉంది అన్నాడు – "రుచిరస్వర వర్ణ పదార రసభావ వతీజగన్మోహన రతి – సాకిం తరుణీ నహి నహి వాణీ బాణస్య మధుర శీలస్య". మరో కవి "అలంకార, సమాస భూయిష్టమైన బాణుని కవిత్వం వింధ్యారణ్యం లాంటిది. దానిలో విహరించే కవి కుంజరాల(ఏనుగుల) గండ స్థలాలను చీల్చే సింహమే బాణకవి" అని ఉత్ప్రేక్షించాడు. ఎవరేమి చెప్పినా అపూర్వమైన మౌలికమౌన భావాలతో, పిండి ఉండలా కాకుండా బాణ కవిత్వం నవీన అర్థ శోభితంగా ప్రకాశిస్తుంది అని చెప్పటంలో సందేహమే లేదు. కాదంబరి అనేది నవలకు పర్యాయపదంగా నిలిచింది. పీటర్సన్, కానేలు సంస్కృత కాదంబరిని మొదటిసారిగా వెలువరించారు. కాలే, లేన్, రిడ్డింగ్‌లు కాదంబరిని ఆంగ్లంలో అనువదించారు. తెలుగులో రెంటాల గోపాలకృష్ణ మొదలైనవారు అనువదించారు. ❁

25. చిత్రగర్భ కవితా సంపన్నుడు - మాఘుడు (7 ad)

మాఘ కవి ఏడవ శతాబ్దానికి చెందిన కవి. ఆనాటి సంయుక్త గుజరాత్ - రాజస్థాన్ రాజ్యం శ్రీమాలి రాజధానిలో వర్మలత రాజు ఆస్థానంలో ఉండేవాడు. శ్రీమాలి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. శ్రీమాలి నగరం అతను పుట్టిన ఊరు. అది ఇప్పుడు రాజస్థాన్‌లోని భిల్నార్ జిల్లాలో భిమాన్‌గా ప్రసిద్ధిలో ఉంది. సంపన్న కుటుంబంలో జన్మించి, విలాస జీవితం గడిపి చివరికి దరిద్రంతో చనిపోయినట్లు తెలుస్తోంది. తండ్రి దట్టక సర్వాచార్య. తాత సుప్రభ దేవుడు. మాఘకవి "శిశుపాల వధ" అనే మహాకావ్యం రాశాడు. ఇది ఇరవై సర్గల కావ్యం. నూరు తప్పులు చేసిన శిశుపాలుడిని శ్రీకృష్ణుడు చక్రంతో చంపటం కథా కృత్తాంతం. మాఘుడిపై భారవి ప్రభావం బాగా ఎక్కువ. వల్లభ దేవుడు, క్షేమేంద్రుడు ఉదహరించిన శ్లోకాలు ఇందులో కనిపించవు. ఇంకా కావ్యాలు రాశాడంటారు కాని అవి అలభ్యం. ఇతర కవుల్లాగా కాకుండా తన చరిత్ర, సంఘ జీవితాన్ని చివరి శ్లోకాలలో చెప్పుకొన్నాడు. వీటిని నిజవంశ వర్ణన లేక కవి వంశ వర్ణన అన్నారు. తండ్రి దత్తకుడు అని తాత సుప్రభ దేవుడని తెలియజేశాడు. వర్మలత, ధర్మనాద మొదలైన రాజుల స్థానాలో వారు ఉండేవారని అన్నాడు. ఆనంద వర్ధనుడు, భోజుడు మాఘ కావ్య విషయాలను ఉదాహరించారు. చైనా యాత్రికుడు

ఇత్సింగ్ మాఘుడు ఎనిమిదవ శతాబ్దం వాడని రాశాడు. హెర్మన్ జాకోబి ఆరవ శతాబ్దివాడు అన్నాడు. మాఘుడు వైశ్యుడు అని కొందరి అభిప్రాయం. దానశీలి. విపరీతంగా దానధర్మాలు చేసి చివరికి చితికిపోయాడు.

"ఉపమా కాళిదాసస్య భారవే రర్ధ గౌరవం – దండిన – పదలాలిత్యం మాఘే సంతి త్రయీ గుణం" అని సాహితీ లోకంలో వ్యాప్తి చెందింది ఒక శ్లోకం. కాళిదాస భవభూతి, భారవుల మూర్తిత్రయమే మాఘ మహాకవి. అంతటి గొప్పవాడు. భారవిని అన్నిటా మించిపోయాడు మాఘుడు. పేరులోను విచిత్రాన్ని సాధించాడు. ఇంకొక సామెత శ్లోకం లోకంలో వాడుకలో ఉంది. "తావత్ భా భారవే: యావత్ మాఘస్య నోదయః" సూర్యకాంతి లేక వెలుగు లేక దీప్తి (భారవి) మాఘం (మాఘుడు) ప్రవేశించే వరకే. అంటే మాఘుడి రాకతో భారవి కవితా ప్రకాశం తగ్గిపోయిందని భావం. భారవి అర్ధ గౌరవాన్ని సాధించాడు. భారవిని అనుసరించిన మాఘుడు అంతటి ప్రతిభను చూపలేకపోయాడని విమర్శకాభిప్రాయం. మాఘుని కావ్యం కంటే అతని జీవిత చరిత్రకు ప్రాధాన్యత లభించింది. రత్నావళి రాసిన హర విజయం అనే యాభై సర్గల కావ్యంపై మాఘ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. హరిశ్చంద్రుడు పదిహేనవ జైన తీర్ధంకరుడు అయిన ధర్మనాధునిపై "ధర్మాశ్రమాభ్యుదయం" అనే కావ్యాన్ని ఇరవై ఒక్క సర్గలతో మాఘుడు రాసిన "శిశుపాల వధ" మార్గంలోనే రాశాడు. అంటే మాఘుడు హరిశ్చంద్రునిపై ప్రభావం చూపాడన్న మాట.

శిశుపాల వధ – కథ

మహాభారత, భాగవతాలలో ఉన్న కథనే శిశుపాల వధ కావ్యంగా మాఘ కవి రాశాడు. ధర్మరాజు చేసిన రాజ సూయ యాగంలో శిశుపాలుడు వచ్చి, ఆహ్వానిత రాజ మహారాజుల ముందు భగవానుడైన శ్రీకృష్ణుడిని అనేక మార్లు నిందించాడు. అగ్ర తాంబూలం కృష్ణుడికే ఇవ్వమని భీష్ముడు ధర్మరాజుకు హితవు చెప్పాడు. ఆ ప్రకారమే ఆయన సిద్ధపడ్డాడు. కృష్ణుడికి ఆ అర్హత లేదని నిందమీద నింద మోపుతూ చాలా నీచంగా నిండు కొలువులో ప్రవర్తించాడు. అందరికి అసహ్యం వేసింది. శ్రీకృష్ణుడు చాలా ఓపిక పట్టాడు మేనత్తకిచ్చిన మాట కోసం.

చివరికి అలసత్వం పనికి రాదనీ నిర్ణయించి, చక్రాన్ని చేబట్టి శిశు ప్రవర్తకుడైన శిశుపాలుడి శిరస్సు ఖండించాడు. రాజసూయ యాగంలో రక్త తర్పణం తప్పలేదు. దాదాపు భారవి కిరాతార్జునీయాన్ని అనుసరించే రాశాడు. వర్ణనల అనుసరణలతో సహా అన్నీ డిట్టోకు డిట్టో. ఒక్కోసారి భావవిని మించిపోవాలనే తపనతో పప్పులో కాలూ వేశాడు. ఒక శతాబ్ద భేదంతో భారవి మాఘుడు మసిలారు. భారవిపై మనసు పొరల్లో మాఘునికి కవితా స్పర్ధ ఉండి ఉంటుంది.

కవితా గీర్వాణం

భారవితో ప్రారంభమైన అలంకార శైలి మాఘునిలో పరిపక్వం పొందింది. భారవి వంశస్థ వృత్తానికి పట్టం కడితే, మాఘుడు మాలినీ వృత్తానికి పట్టాభిషేకం చేశాడు. దీర్ఘ సమాసాల్ని మాఘుడు రాశాడు. మాఘునిలో శబ్ద మాధుర్యం భారవి కంటే ఎక్కువ. సజీవ వర్ణనలు మాఘుని ప్రత్యేకత. రమ్యమైన అలంకారాలను ప్రయోగించి కావ్యాన్ని తీర్చిదిద్దాడు. వ్యంగ్య వైభవమూ చూపాడు. మాఘుడి కవిత్వాన్ని “నవ సర్గ గతేమాఘే నవ శబ్దో న విద్యతే” అంటే మాఘ కావ్యంలోని తొమ్మిది సర్గలు చదివిన తర్వాత సంస్కృతంలో కొత్త శబ్దం ఏదీ ఉండదు అని అర్థం. అంతటి శబ్ద జ్ఞానం ఉన్నవాడు. కాళిదాస, భారవులు ఉపయోగించిన శబ్దాలను అదే అర్థంలో కాక గౌణార్థంలో ప్రయోగించాడు. చెట్టు అనే అర్థం ఇచ్చే భూరూహం అనే శబ్దాన్ని “ప్రాణులు” అనే అర్థంతో ప్రయోగించాడు. నరేంద్ర శబ్దాన్ని విష వైద్యుడనే అర్థంలో వాడాడు. ఇలా కొత్త అర్థాలతో శబ్ద ప్రయోగాలు చేశాడు. పాముకు ద్విజిహ్వ అనే పేరుంది దాన్ని నిందకుడు అనే అర్థంలో వాడాడు.

మాఘుని పదలాలిత్యమూ తక్కువదేమీ కాదు మ కార వృత్యను ప్రాసలో –

“మధురయా మధు బోధిత మాధవీ మధు సమృద్ధి సమేధిత మేధయా – మాధుకరాం గనయా ముహురున్మదధ్వాని భ్రుతా నిభ్రుతాక్షర ముజ్జగే”. మాఘు ప్రతిభను తెలియజేసే లోకోక్తి ఒకటి ప్రచారంలో ఉంది.

“మాఘేనా విఘ్నతో త్సాహా నోత్సంహంతే పదక్రమే – స్మరంతో భారవే రేవ కవయః కపయో యదా” అంటే “మాఘ మాసపు చలిలో సూర్యుడి వేడిని

అనుభవించిన కోతులకు కాళ్ళు వంకర్లుపోయి నడవలేకపోతున్నాయి. అలాగే మాఘకవి పద రచన చూసి భారవి పదాలను యెంత అనుకరించినా కవి కానివాళ్ళు కవిత్వంలో అసమర్ధులుగానే ఉండిపోతారు. అంటే భారవి మాఘుడిని అనుసరించినా, అనుకరించినా శ్రేష్ఠకవి అనిపించుకొన్నాడు అని భావన, అదీ మాఘుని ప్రత్యేకత. హరిదాసు రాసిన సుభాషిత రత్నావళిలో "నైతచ్చిత్ర మహం మన్యే మాఘ మాసాద్య యన్మహుః - ప్రౌఢ తాతి ప్రసిద్ధాపి భారవే రవ సీదతి" అనే శ్లోకం కనిపిస్తుంది - దీని భావం - మాఘ మాసం రావటంతో సూర్య తేజస్సు సన్నగిల్లినట్లు అదే రకంగా మాఘ కవిత్వం ముందు భారవి కవిత్వ ప్రౌఢిమ తగ్గింది.

సుదీర్ఘ ఋతు సూర్యాస్తమయ ఉదయాలను వర్ణన చేశాడు. మాఘకవి చమత్కార వైభవమూ ఎక్కువే. శబ్ద మాధుర్యంతో బాటు ఓజో గుణంతో గాలిని వర్ణించాడు. ఆస్వాదిద్దాం -

"విచక కమల గాంధి రంధయన్ భ్రున్గా మాలాః సురభిత మకరందం మంద మావాతివాతః

ప్రమద మదన మాద్యద్యౌవనో ద్దామ రామా రమణ రభస ఖేద స్వేద విచ్ఛేద దక్షః"

మాఘునిలో శాస్త్రజ్ఞానం ఎక్కువ. వేద వేదాంగాలను ఔపోసన పట్టాడు. వ్యాకరణ పండితుడు. రాజనీతి ధర్మ శాస్త్రాలను చదివినవాడు. జ్యోతిష శాస్త్రంలోను దిట్ట. కామ, ఆయుర్వేద, సంగీత, సాముద్రిక, హయ, గజ శాస్త్రాల పారం ఎరిగినవాడు. నాస్తిక దర్శనాలనూ తరచి చూశాడు. సూక్ష్మ తీక్షణ దృష్టి ఉన్నవాడు. క్లిష్టంగా సంక్లిష్టంగా సరళంగా చెప్పగలడు సందర్భాన్ని బట్టి. రెండవ సర్గలో బాలరామ ఉద్ధవుల సంభాషణల్లో రాజనీతి కట్టలు తెంచుకొని ప్రవహించిందని విశ్లేషకాభిప్రాయం. శార్దూల ఛందస్సులో "షడరర" చక్రబంధంలో రాసిన శ్లోకం చూద్దాం -

సత్త్వం మానవిశిష్టమాజిరభసాదాలంబ్య భవ్యః పురో
లబ్ధాఘక్షయశుద్ధిరుద్ధరతర శ్రీవత్సభూమిర్ముదా।

ముక్త్వా కామమపాస్తభీః పరమృగవ్యాధః సనాదం హరే:

ఏకౌఘై: సమకాలమభ్రముదయీ రోపైస్తదా తస్తరే॥ (19-120)

మాఘుడు శిశుపాల వధ కావ్యంలో చిత్ర బంధాలనూ గర్భ కవిత్వాన్ని బాగా చొప్పించాడు. "ద" అనే ఏకాక్షరంతో శ్లోకం రాశాదు. "దాదదో దుద్దా దుద్దాది దాదదో దూదాది దధొః - దుద్దాదం దాదదే దుద్దే దాదా దదదాదదో దదాః" అర్ధం శ్రీకృష్ణుడు వర ప్రదాయి దుష్ట సంహారి. పాపహారి. ఇతరులకు ద్రోహం చేసేవారి చేతులను నరికేసేవాడు. శతృవుపై బాణం వేసి నొప్పించేవాడు.

మురజ చిత్ర అంటే "డ్రం" ఆకారంలో రాసిన శ్లోకం చూద్దాం -

"సాసే నాగమ నా రంభే

రాసే నాసిద నా రత

తర నా జ ద నా మత్తా

దిర నాగమ నామాయా

దీని భావం - సైన్యం చాలా బలీయమైనది. అది ముందుకు సాగుతుంటే అప్రమత్తంగా ఉంటూ ఏకాగ్రతతో విధులు నిర్వహిస్తున్నారు. సైనికులు భీకర శబ్దాలు చేస్తున్నారు. సైనికులకు మదగజాలు సహకరిస్తున్నాయి. అక్కడున్న వారెవ్వరికి బాధ అనేది లేనేలేదు. నాలుగు పాదాలు భేరీ నినాదంతో ఒకే అర్థాన్ని ఇవ్వటం ఇందులో ఉన్న రహస్యం.

శిశుపాల వధపై వల్లభ దేవునిదే ప్రాచీన విమర్శ గ్రంథం. దీనిపేరు "సందేహ విషౌదధి". మల్లినాద సూరి "సర్వం కష" అనే వ్యాఖ్య రాశాడు. ఇంకా ఎందెరెందరో వ్యాఖ్యానాలు రాశారు. 1308లో భాస్కర భట్ట బోరికర్ మరాటీ భాషలోకి అనువదించాడు. అనేక విదేశీ భాషల్లోకి అనువాదం పొందింది. ❀

26. తొలిశాస్త్ర కావ్య కవి - భట్టి (700 ad)

"రావణ వధ" అనే మహా కావ్యాన్ని రాసిన కవి భట్టి. దీనికి "భట్టి కావ్యం" అనే పేరుంది. భర్తృ కావ్యం, రామకావ్యం, రామచరిత్ర అనే పేర్లూ ఉన్నాయి. ఏడవ శతాబ్దానికి చెందిన కవి భట్టి. సంస్కృత శబ్దం "భర్త్రి" ప్రాకృతంలో "భట్టి" అయిందని అంటారు. భర్తృహరి కొడుకే భట్టి అనే ఒట్టి భ్రమా ఉంది. "పాణిని వ్యాకరణాన్ని రామాయణ కధకు జోడించి కవితామయం చేశాడు కావ్యాన్ని. ఒకరకంగా పాణినికి ఇది వ్యాఖ్యాన రామకథా రూపం అని చెప్పవచ్చు. శ్రీరాముని సకల సద్గుణాభిరామునిగా తీర్చి దిద్దాడు. అగ్ర కవుల సరసన చేర్చే కావ్యంగా రావణ వధ కావ్యాన్ని నిర్వహించాడు. ఈ కావ్యంలో రావణ వధ భాగం అతి చిన్నదే అయినా, మిగిలిన రామాయణ కావ్యాలకు భిన్నంగా ఉండాలని "రావణ వధ" అని టాగ్ తగిలించాడనిపిస్తుంది. సంస్కృత సాహిత్యంలో శాస్త్ర కావ్యాలలో ఇదే మొట్టమొదటిది. శ్లోకాలలో రాసి దాని గౌరవాన్ని మరీ పెంచాడు. ఈ కావ్యం పాఠ్య గ్రంథం అయింది అంటే దాని విశేషమేమిటో, కవి ప్రతిభ ఎలాంటిదో తెలుస్తుంది. భట్టిని భట్టి కవి, భట్టి పండిత, భట్టి బ్రాహ్మణ అని కూడా పిలుస్తారు. భామహుడి సమకాలికుడు.

భట్టి కవితా భట్టీయం

భట్టి రావణ వధా కావ్యంలో పూర్తిగా వాల్మీకినే అనుసరించాడు. యుద్ధకాండతో ఆపేశాడు. ఉత్తర రామచరిత్ర జోలికి పోలేదు. పాణిని వ్యాకరణాన్ని జన సామాన్యానికి అందించాలనే తపనతో రాసిన గొప్ప ప్రయోగ, ప్రయోజన కావ్యం. శబ్దాల వ్యుత్పత్తి, ప్రయోగ వైచిత్రీ వివరించిన కావ్యం ఇది. వ్యాకరణ అంశాలను కావ్యం ద్వారా బోధించాడు. కనుక "శాస్త్ర కావ్యం" అనే మాట సరిపోయింది. కావ్యంలోని సర్గలకూ వ్యాకరణ సంజ్ఞలను పెట్టటం మరో విశేషం. మొదటి అయిదు సర్గల వరకు "తిగంత" రూపాలు చెప్పాడు. వీటికే "ప్రకీర్ణ

కాండం" అనే పేరు. ఆరవ సర్గ నుంచి తొమ్మిది వరకు చాలా లక్ష్య రూపాలను తెలియజేశాడు. వీటికి "అధికార కాండం" అని పేరుంది. పదో సర్గ నుండి పదమూడవ సర్గ వరకు గుణాలంకార లక్ష్యాలు వివరించాడు. వీటినే "ప్రసన్న కాండం" అంటారు. పదకొండు నుంచి చివరి ఇరవై రెండవ సర్గ వరకు "లట్" మొదలైన తొమ్మిది లకారాల విశిష్ట రూపాలను తెలియజేశాడు. వీటిని తిఙ్గంత కాండమని పేరు. ఈ విధంగా పాణిని చెప్పిన వ్యాకరణ అంశాలను, అలంకారాలతో మిళితం చేసి రామకథా వస్తువును ఎన్నుకొని కావ్యాన్ని రాశాడు భట్టి. శాస్త్రం, కావ్యం అనే జోడు గుర్రాల స్వారీ చేశాడన్న మాట. వ్యాకరణ, ఉదాహరణలకు శ్లోకాలు రాశాడు. వర్ణనలు వర్ణనల కోసమే రాసినట్లు ఉండి, కృత్రిమత కనిపిస్తుంది.

కవిత్వం విషయం గురించి చెప్పాలంటే ధారా శుద్ధి బాగా ఉంటుంది. శైలి రమ్యంగా రసబంధురంగా ఉండటం మరీ కావ్య శోభను పెంచింది. యమకాలను విస్తృతంగా ప్రయోగించటంతో కర్ణ మాధుర్యం ప్రస్ఫుటమైంది. "ఇదేమి వ్యాకరణం రా బాబోయ్" అని అనిపించదు. ఆ ప్రవాహంలో అలా కొట్టుకుపోతాం. కథకు వ్యాకరణ బోధకు తగిన శబ్దాలను ఎంచుకొని ప్రయోగించటంలో భట్టి అసమానమైన గట్టి పాండిత్య ప్రతిభను ప్రదర్శించాడు. శబ్ద ప్రయోగం ఆశువుగా వచ్చి చేరి నిండుదనాన్ని, రమణీయతనూ చేకూర్చింది. నూతన శబ్దాలకు, సంధులకు భట్టి కావ్యం భాండాగారంగా నిలిచింది.

భాష మీద పట్టు ఉందని చూపటానికి భట్టి ప్రసిద్ధంలో లేని పదాలనూ ప్రయోగించి సత్తా చాటుకొన్నాడు. చిన్న చిన్న సమాసాలే వాడి చదువరులకు గొప్ప ఆసక్తిని కలిగించి వైదర్భీ రీతికి న్యాయం చేశాడు.

భట్టి కవి అలంకార, వ్యాకరణాలలోనే కాదు నాట్య, సంగీత, వేద, వేదాంగాలలోను అర్థ ధర్మ శాస్త్రాలలోను అసమాన పండితుడు. రాజనీతిని ఔపెసన పట్టినట్లు కావ్యం తెలియజేస్తుంది. సంభాషణా చతురుడనిపిస్తాడు. సామాన్యులు ఈ కావ్యాన్ని చూసి పారిపోరు. ఆప్యాయంగా చదివి ఆనందిస్తారు. అదీ భట్టీయం. చాలాచోట్ల భారవిని అనుకరించినట్లు తోస్తుంది. మాఘుడు భట్టిని అనుకరించాడు. అదీ భట్టికి ఉన్న ప్రత్యేకత. ఉచితమైన సందర్భ శుద్ధికల

వర్ణనలే భట్టి చేసి సెబాస్ అనిపించాడు. శరదృతువును వర్ణిస్తూ భట్టి చెప్పిన శ్లోకం మహా భేషుగ్గా ఉంటుంది. చూడండి –

"నతజ్జలంయన్న సుచారు పంకజం – న పంకజం తద్యదలీన షట్పదం – నషప్పదోసౌ నజుగుమ్జ యః కలం న గుంజితం తన్న జహార యన్మనః". భావం "కమలాలు వికసించని సరస్సులు సరసులే కావు. భ్రమరాలు మూగని కమలాలు కమలాలే కావు. ఝుంకారం చేయని తుమ్మెదలు తుమ్మెదలే కావు. మానవుల మనస్సులను ఆకర్షించని ఝుంకారాలు భ్రమర ఝుంకారాలే కావు."

ఉదయ సూర్యుని గురించి వర్ణిస్తూ "ప్రపంచం అంతా పెను చీకటి అనే బురదలో కూరుకుపోతే ఉదయాద్రి మీద ఉదయించే భాణుడు తన కిరణాలు అనే తాళ్ళ చేత ప్రాణులను పైకి లాగుతున్నట్లు ఉన్నాడు."

హనుమంతుడు లంకను కాలిస్తే అగ్నిజ్వాలలు వ్యాపించి లంక యెంత కల్లోలంగా ఉందో యమకంలో మహా గమకంగా చెప్పాడు భట్టి. అర్థం అక్కరలేదు శబ్ద సౌందర్యంతో ఆ విషయం అంతా అర్థమైపోతుంది. భట్టి ఈ కావ్యంలో పదమూడవ సర్గలో మరో గొప్ప ప్రయోగం చేశాడు. అదే "భాషాసమ" అంటే ఒకే శ్లోకంను సంస్కృతంలోను ప్రాకృతంలోను చదువుకోవచ్చు. సంధులు విడగొట్టుకొంటే అలా చదవటం సాధ్యమవుతుంది. మన ద్వర్థికావ్యాలలో లాగా. భట్టి కావ్యానికి విదేశీ ప్రాచుర్యమూ దక్కింది. జావా దేశంలో పురాతన "జావనీయ రామాయణానికి" "సోర్స్ బుక్"గా భట్టి కావ్యాన్ని ఉపయోగిస్తున్నారు. జావా రామాయణం అతిపురాతన కావ్యం దీన్ని "కాకావిన్" అని గౌరవంగా సంబోధిస్తారు. భట్టికావ్యం జావా ప్రజలకు ఆరాధనీయం. భట్టికావ్యంలోని యమకాలను, శ్లేషను వాళ్ళు బాగా ఉపయోగించుకొన్నారు.

భట్టి కావ్యం అనే రావణ వధ వీరకావ్యమని, చతుర్విధ పురుషార్ధ సాధన ధ్యేయంగా రాశాడని, నగర, పర్వత, సముద్ర, ఋతు, ఉదయాస్తమయ వర్ణనలు కలిగి ఉందని, ప్రేమ, శృంగార సమన్వితమని, సంస్కృత పంచకావ్యాల సరసన చేరి ఆరవ మహాకావ్యం అనిపించుకొన్నదని, "ఆలివర్ ఫాలన్" అనే విమర్శకుడు భట్టికావ్య ఆంగ్ల అనువాదానికి ఉపోద్ఘాతం రాస్తూ చెప్పాడు.❀

27. మొదటి శ్రవ్యకావ్య అలంకారికుడు - భామహుడు (700 ad)

భామహుడు ఏడవ శతాబ్దానికి చెందిన కాశ్మీర దేశపు కవి, అలంకారికుడు. దండి కవికి సమకాలీనుడు. "కావ్యాలంకారం" అనే అలంకార గ్రంధాన్ని రాశాడు. నాట్య శాస్త్రంలో భరతుడు రంగ ప్రదర్శనకు నోచుకొన్న నాట్య, రూపకల లక్షణాలు వివరించాడు. ఇవన్నీ దృశ్య రూపకాలు. కాని అప్పటికి శ్రవ్య కావ్యాలు అంతగా ప్రాచుర్యం పొందలేదు. కనుక వీటి సిద్ధాంతాలపై ఎవరి దృష్టీ పడలేదు. శ్రవ్య కావ్య లక్షణాలపై తొట్టతొలి రచన చేసినవాడు భామహుడు. అందుకే చరిత్ర ప్రసిద్ధి పొందాడు. కావ్యాలంకారంలో భామహుడు శ్రవ్య కావ్యాల్లో ఉన్న తేడాలు, వాటి స్వరూపాలు, మహా కావ్య లక్షణాలు, కావ్య గుణదోషాలు, కావ్య గతమైన అలంకారాలు మొదలైన వాటిని మొట్ట మొదటగా చర్చించిన వాడు భామహుడే. భరతుడి నాట్యశాస్త్రం తర్వాత అలంకార గ్రంథం భామహుడు రాసిన కావ్యాలంకారం. భామహుడి తండ్రి పేరు "రుక్రిల గోమిన్" ఇది బౌద్ధ నామం అని ఊహించి అతడు బౌద్ధుడన్నారు. కాని భామహుడు కావ్యారంభంలో "ప్రణమ్య సర్వం సర్వజ్ఞం మనోవాక్కాయ కర్మభి:" అని చెప్పటం వాళ్ళ అనుకొన్న పొరపాటు. ఇది సర్వజ్ఞ నామం శివుడికే ఉంది – "సర్వజ్ఞ నామము శర్వునికే గాక" అన్న పద్యం మనకు గుర్తు ఉంది. అదీ కాక రామాయణ మహాభారత ఉదాహరణలే భామహుడు ఇచ్చాడు. కనుక బౌద్ధుడు కాదు.

"కావ్యాలంకార" శోభ

భామహుడు రచించిన కావ్యాలంకారంలో ఆరు పరిచ్ఛేదాలున్నాయి. అలంకారం అనే శబ్దానికి "సౌందర్యం" అనే అర్థం కూడా ఉంది. వీటిని "కారికలు" అన్నాడు. మొదటి పరిచ్ఛేదంలో కావ్య ప్రయోజనాలు, కావ్యానికి హేతువులు, కావ్య లక్షణాలు, భేదాలు గురించి చెప్పాడు. రెండవ దానిలో కావ్య గుణాలు, మూడులో అలంకారాల చర్చ చేశాడు. చతుర్థ పరిచ్ఛేదంలో పూర్వ పరిచ్ఛేదాలలో వదిలేసిన వాటిని వివరించాడు. పంచమంలో తర్క శాస్త్రాధారంగా దోషాలను, ఆరులో వ్యాకరణ శాస్త్ర రీత్యా వచ్చే దోషాలను గురించి వివరణ ఉంది. అలంకారాలను, దోషాలను విపులంగా భామహుడు చర్చించటం వలన కావ్యం అనేది శబ్ద శుద్ధి కలిగి ఉండాలని, అలంకారాలతో శోభించాలని భావించాడు.

భరతుడు చెప్పిన రస సిద్ధాంతాన్ని భామహుడు చర్చించలేదు. అగ్నిపురాణ కర్త రసమే కావ్యానికి జీవం జవం అని అంగీకరించినట్లుగా భామహుడు అంగీకరించినట్లు కనిపించదు. భామహుడి దృష్టిలో శబ్దం, అర్థం ఉండేదే కావ్యం. కావ్య ప్రయోజనానికి వైచిత్రిచ వక్రోక్తితో కలిసి ఉన్న అర్థ సంయోజనం ముఖ్యమైన అవసరం అని చెప్పాడు. దీనితోబాటు క్యాం దోష రహితంగా ఉండటమే కాకుండా గుణ సహితంగా ఉండాలని కోరాడు. రసాన్ని "రసదలంకారాం"గా భావించి భామహుడు వివరించాడు. మొత్తం మీద భామహుని దృష్టిలో అలంకారమే కావ్యానికి ప్రధానం. దృశ్యకావ్యంలో రసానికి ప్రాధాన్యం ఉన్నట్లు శ్రవ్య కావ్యంలో రస ప్రాధాన్యత అంత అవసరం లేదని భావించాడు. ముప్పై ఆరు అలంకారాలను, రెండు శబ్దాలంకారాలను భామహుడు వివరించి చెప్పాడు. కావ్యం రాసేవారికి వ్యాకరణ పరిజ్ఞానంతో బాటు శబ్ద పరిచయం ఎక్కువగా ఉండాలని చెప్పాడు. ప్రసాదం మాధుర్యం ఓజో గుణాలను పేర్కొని భామహుడు ప్రసాద మాధుర్య గుణాలు శ్రేష్టమైనవి అని పేర్కొన్నాడు. "శబ్దార్థౌ సహితౌ కావ్యం" అనేది భామహుని నినాదం.

ఎనిమిదవ శతాబ్దికి చెందిన ఉద్భటుడు అనే అలంకార శాస్త్రవేత్త భామహుని కావ్యాలంకార శాస్త్రానికి "భామహ వివరణ" లేక "భామహ వృత్తి"

అనే చక్కని వ్యాఖ్య రాశాడు. కాని దురదృష్టవశాత్తు ఇది లభించటం లేదు. దీన్ని "ప్రతిహా రేందు రాజు, అభినవ గుప్తుడు, రుయ్యకుడు మాత్రం పేర్కొనటం వలన మాత్రమే తెలుస్తోంది. భామహుడు మరో రచన చేశాడని అదే వర రుచి రాసిన "ప్రాకృత ప్రకాశం"కు రాసిన "మనోరమ" అనే వ్యాఖ్యానం. నారాయణ భట్టు భామహుడు "ఛందో గ్రంథం" కూడా రాశాడని, అందులో అనేక చందో రీతులున్నాయని తెలిపాడు, కనుక రాసి ఉందచ్చు అని అనుకోవచ్చు. భామహుడు తరువాతి అలంకారికులపై గొప్ప ప్రభావాన్ని చూపాడు. ఆ ప్రభావం పొందిన వారిలో ఉద్భటుడు, ఆనంద వర్ధనుడు, అభినవ గుప్తుడు, ముమ్మటుడు మొదలైనవారున్నారు.

వైదర్భి, గౌడీ రీతులను పోలుస్తూ వైదర్భిని "అవక్రోక్తి" అన్నాడు భామహుడు. స్వభావోక్తిలో వైచిత్రి ఉండదు కనుక దాన్ని వదిలేశాడు. "యుక్తం లోక స్వభావేన రసిక శకలై: ప్రుధక్ కావ్యాలంకారా" అన్నాడు భామహుడు. దీని అర్థం మహాకావ్యంలో సందర్భాన్ని బట్టి అనేక రసాలు ఉండాలి. రసం కంటే అలంకారాలకే ప్రాధాన్యత నిచ్చాడు.

నాగనాథ శాస్త్రి, బటుక్‌నాథ శర్మలు ఆంగ్లంలో ఈ కావ్యాలంకారాన్ని వెలువరించారు. తాతాచారి 1934లో తెచ్చిన పుస్తకం ఈ రెండిటికన్న శ్రేష్టమైనది. ❀

28. ప్రాకృత కావ్య కవి రాజు - వాక్పతి రాజు (730 ad)

వాక్పతిరాజు భవభూతితో బాటు కనోజ్‌రాజు యశోవర్మ ఆస్థానకవి, క్షత్రియుడు. వర్మ మంచి కవి పండిత పోషకుడు. రాజు ఇతనికి "కవి రాజ" బిరుదునిచ్చాడు. "గౌడవహో" అనే మహారాష్ట్ర ప్రాకృత భాషలో కావ్యం రాశాడు. ఇందులో 1209 గాధలున్నాయి. ఇందులో యశోవర్మ జీవిత వృత్తాంతం కూడా ఉంది. అసంపూర్ణ కావ్యం. యశోవర్మ కాశ్మీరరాజు లలితాదిత్యుని చేతిలో 733లో ఓడిపోయాడు. కనుక వాక్పతి రాజు కావ్యం 740లో రాసి ఉంటాడని భావన.

వాక్పతి కవితా రాజం

ఈ కావ్యంలో యశోవర్మ గౌడరాజును జయించే కథ ఉంది. అందుకే "గౌడ వధ"(గౌడ వహో) అని సముచితమైన పేరు పెట్టాడు. చరిత్రకంటే కావ్య లక్షణాలే ఎక్కువగా ఉన్నాయి. గౌడవధతో బాటు రాజు దిగ్విజయాలూ ఉన్నాయి. శ్లేష చమత్కారాలు తక్కువగా సుందరమైన శైలిలో రాశాడు. ❁

29. శాంతాన్ని నవమ రసంగా చెప్పిన - ఉద్భటుడు (779-800 ad)

"కావ్యాలంకార సార సంగ్రహం" అనే అలంకార శాస్త్రాన్ని రాసిన ఉద్భట భట్టు కాశ్మీర దేశస్తుడు. కాశ్మీరరాజు జయాపీడుడి ఆస్థాన పండితుడు. కనుక ఇతనికాలం 779-813 అని నిర్ధారించారు. ఈ విషయాన్ని కల్హణుడు తన రాజ తరంగిణిలో పేర్కొన్నాడు. "విద్వాన్ దీనార లక్షేణ ప్రత్యహం కృత వేతన: - భట్టో భూ దుద్భటస్తస్య భూమి భర్తు: సభా పతి:"

కవితోద్భటం

ఉద్భటుని "కావ్యాలంకార సార సంగ్రహం" అలంకార రచన. ఇదికాక "భామ:హ వివరణ" అనే గ్రంథమూ రాశాడు. ఇది భామహుడు రాసిన కావ్యాలంకారానికి వ్యాఖ్యానమే. కాని ఇది లభించటం లేదని చెప్పుకొన్నాం. భరతుడి నాట్య శాస్త్రానికి ఉద్భటుడు టీక కూడా రాశాడు. ఇవికాక "కుమార సంభవం" అనే కావ్యం రాసినట్లుంది. ఈ కావ్య శ్లోకాలను తన అలంకార గ్రంథంలో ఉదాహరణలుగా ఇచ్చాడు.

కావ్యాలంకార సార సంగ్రహం కూడా ఆరు పరిచ్ఛేదాలతో ఉన్న గ్రంథం. మొత్తం 79 కారికలున్నాయి. భామహుడు నడిచిన బాటలోనే దీన్ని రాసినా అతనికంటే భిన్నమైన అలంకార వివేచన చేశాడు. భిన్నంగా అలంకార భేదాలనూ చెప్పాడు. మొత్తం మీద నలభై ఒక్క అలంకారాలను ఉద్భటుడు వివరించాడు. ఇతని ఉపమ, ఉత్ప్రేక్ష, అతిశయోక్తిలను తరువాత అలంకారికులైన ముమ్మటుడు, రుయ్యకుడు గ్రహించారు. కావ్య సౌందర్యానికి గుణాలతోబాటు అలంకారాలు అవసరమేనని ఉద్భటుడు చెప్పిన దానితో రుయ్యకుడు ఏకీభవించాడు. ఉద్భటుడు శాంత రసాన్ని తొమ్మిదవ రసంగా నాట్య శాస్త్రంలో చెప్పాడని పండితాభిప్రాయం.

రీతులను దేశపరంగా కాకుండా ఉపనాగరక, గ్రామ్య, పరుష అనే పేర్లతో పిలిచాడు. ఇది శబ్ద సంయోజనంపై ఆధారపడి ఉండేట్లు చెప్పాడు. ఉపనాగరిక రీతి పరిష్కృతం అయిన పద్ధతి. గ్రామ్య రీతి సాధారణమైంది. పరుష రీతి

అంటే కఠినమైనది. క్రీ.శ. తొమ్మిది వందల యాభై ప్రాంతం వాడైన "ప్రతిహారేందు రాజు" ఉద్భటుని కావ్యాలంకార సార సంగ్రహానికి విపులమైన వ్యాఖ్యానం రాశాడు. ఉద్భటుడు శిష్య పరంపర రాజశేఖరుడి వరకు వ్యాపించి ఉంది అని "ఇది ఔదంభరా: ఉద్భట మతానుయాయిన:" అని రాజశేఖరుడు చెప్పిన దాన్నిబట్టి తెలుస్తోంది. ఉద్భటుని సంప్రదాయం ''ఔద్భట సంప్రదాయం'' అని పిలువబడుతోంది. శ్రవ్య కావ్యంలో రసమే "జీవద్రూపం" అని ఉద్భటుడు అంగీకరించాడని తెలుస్తోంది. ప్రాచీన అలంకారుల్లో ఉద్భటునిది మూడవ స్థానం. మొదటివాడు భరతుడు. రెండవ వాడు భామహుడు. మూడవ వాడు ఉద్భటుడు. రసభావ అలంకార సంయోజనం గురించి చెప్పినవాడు ఉద్భటుడు.❁

30. దిగంబర జైనకవి - “అసగ” (800 ad)

క్రీ.శ. 800లో జన్మించిన అసగ కవి దిగంబర జైనుడు. సంస్కృత, కన్నడ భాషలలో గొప్ప కవి. సంస్కృతంలో అసగ రాసిన గ్రంథం “వర్ధమాన చరిత్ర”. ఇందులో పద్దెనిమిది సర్గలున్నాయి. ఈ కావ్యాన్ని 853లో రాశాడు. ఇదే చివరి జైన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు జీవితంపై వెలువడిన మొదటి గ్రంథం. అసగ సంస్కృతంలో ఎనిమిది రచనలు చేశాడు. కన్నడంలో కూడా చాలా రాశాడని అంటారు కాని కాళిదాసు “కుమార సంభవ” కావ్యానికి అసగ కన్నడంలో రాశాడని చెప్పబడే “కర్నాటక కుమార సంభవ కావ్యం” కూడా లభించటం లేదు. ఈ కావ్యాన్ని తరువాతి కవులు పేర్కొన్నా అసలు రచన అలభ్యం. రాష్ట్ర కూట రాజుల్లో మూడవ కృష్ణ పాలనలో ఉన్న కన్నడ కవి “శ్రీ పొన్న”పై అసగ ప్రభావం ఎక్కువ అంటారు. జైన తీర్థంకరుల చరిత్ర రాసిన తరువాతి కవులు అసగ ప్రభావము, స్ఫూర్తితోనే రాశారు. “శబ్ద మణి దర్పణం” రచించిన కేసిరాజు కవి 1260లో అసగ కన్నడ సాహిత్యంలో పేర్కొన్నికగన్న కవి అని, అతని సంస్కృత రచన ప్రశస్తి చెందిందని రాశాడు.

అసంగ లేక అశోక శబ్దానికి అపభ్రంశమే “అసగ” అన్నారు. క్రీ.శ. 800-878 కాలంలో పరిపాలించిన రాష్ట్ర కూట రాజు అమోఘ వర్షుని

సమకాలీనుడు. రాజాస్థానకవి గుణవర్మతో సరిసమానమైన కీర్తి ప్రతిష్టలను రాజాస్థాన ప్రవేశం లేకుండానే రచనల ద్వారా పొందాడు అసగ. వర్ధమాన చరిత్రలో తాను ఎనిమిది కావ్యాలు రాసినట్లు చెప్పుకొన్నాడు కానీ ఇది తప్ప ఏదీ మిగల్లేదు. విరాళా నగరంలోను చోడదేశంలోని చోడ విషయనగరంలోను ఉండి కవిత్వం రాశానని చెప్పుకొన్నాడు. అవి రాష్ట్ర కూట రాజు శ్రీనాధుని రాజ్యంలో ఉండి ఉంటాయి. శాంతి పురాణంలోని కవి ప్రశస్తి పద్యాలలో అసగ తాను జైన కుటుంబంలో జన్మించానని చెప్పి తన ముగ్గురు గురువులను పేర్కొన్నాడు. అందులో భావకీర్తి ఒకడు. ఇంతకుమించి అసగ ఏమీ చెప్పుకోలేదు.

అసగ అనంతరం 950 కాలంవాడైన కన్నడ కవి శ్రీపొన్న అసగ రాసిన వాటిని ఉపయోగించుకొని రచన చేశానని చెప్పుకొన్నాడు. తాను అసగ కంటే గొప్ప కవిననీ ప్రకటించుకొన్నాడు. చంద్రానుపాసన వంటి కావ్యాలు రాసిన జయకీర్తి, తరువాతి కాలపు కవులు అసగ పాండిత్యాన్ని, కవితా ప్రతిభను ప్రస్తుతించారు. అసగుని కర్నాట కుమార సంభవ కావ్యాన్ని ఉటంకించారు. దుర్గా సింహ, జయసేన, జయకీర్తి అసగను దేశి కన్నడంలో గొప్ప కవి అన్నారు. అంటే సాంప్రదాయ లేక ప్రాంతీయ భాషాకవి అని అర్థం. భాషా చరిత్రకారుడు ఏ.కే వార్డర్ మాత్రం అసగ మహా గొప్ప సంస్కృత కవి అన్నాడు. పదకొండవ శతాబ్దికి చెందిన కన్నడ వ్యాకరణ కర్త రెండవ నాగవర్మ మాత్రం అసగ పాండిత్యం పొన్న పాండిత్యానికి సరిపోలుతుందని తేల్చాడు. పన్నెండవ శతాబ్ది కన్నడ రచయిత బ్రహ్మ శివ అసగని "రాజక" అన్నాడు గౌరవంగా. అంటే కన్నడ సాహిత్యంలో సుప్రసిద్ధులలో అసగ ఒకడు అని అర్ధం. పదహారవ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్య పతనం వరకు అసగ సాహిత్యం కన్నడ దేశంలో గొప్ప ప్రచారం పొందింది. అసగ రాసిన కన్నడ గ్రంథాలు లభ్యం కాకపోయినా అతని పేరు కన్నడ సాహిత్యంలో దిగ్గజాలైన అగ్గల, మనసిజ, శ్రీ వరద దేవ, గుణానంది సరసనే ఉన్నది. పదవ శతాబ్ది వాడైన అపభ్రంశ కవి "ధవాల్" అసగుడు హరివంశ పురాణం రాశాడని పొగిడాడు❁



31. కరుణ రసానుభూతి - భవభూతి-1 (800 ad)

ఎనిమిదవ శతాబ్దానికి చెందిన భవభూతి కవి, నాటకకర్త. కాళిదాసు ప్రతిభకు సమానుడైనవాడు. విదర్భ గొండియా జిల్లాలోని పద్మపురంలో దేశస్థ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఇది మహారాష్ట్ర – మధ్య ప్రదేశ్ సరిహద్దులో ఉంది. భవభూతి అసలు పేరు శ్రీకంఠ నీలకంఠ. తండ్రి నీలకంఠుడు, తల్లి జాతకర్ణి. కృష్ణ యజుర్వేదీయ తైత్తిరీయ శాఖవాడు కాశ్యప గోత్రీకుడు. ఇతని పూర్వీకులలో “మహాకవి” అనే పేరు ఉన్నవాడున్నాడట. శివాభిమాని. గ్వాలియర్‌కు ఆగ్నేయంలో నలభై కిలో మీటర్ల దూరంలో ఉన్న పద్మ పావయ దగ్గర విద్యాభ్యాసం చేశాడు. గురువు పరమహంస జ్ఞాన నిధి. యమునా నది ఒడ్డున ఉన్న “కల్పి” గ్రామంలోనే రచనలు చేశాడు. కనోజ్‌ను పాలించిన రాజు యశోవర్మ ఆస్థాన కవి భవభూతి అని పన్నెండవ శతాబ్ది చరిత్రకారుడు కల్హణుడు రాజ తరంగిణిలో రాశాడు. కాశ్మీర్ రాజు లలితాదిత్య ముక్తాపీడుడు యశోవర్మను 736లో జయించాడని చెప్పాడు. భవభూతి మాలతీ మాధవం, ఉత్తర రామచరిత్ర మహావీర చరిత్ర రాశాడు. ఇందులో ఉత్తర రామచరిత్ర గొప్ప పేరు పొందింది.

యశోవర్మ కొడుకు ఆమరాజు భప్పట్టి చేత జైన దీక్ష పొందాడట. వాక్పతి భవ భూతిని – “భవ భూతి జలధి నిర్గత కావ్యామృత రస కణా ఇవ స్ఫురంతి –

యస్య విశేషా అద్యాపి వికటేశు కదా నివేశేషు" అని కీర్తించాడు. వాక్పతికంటే భవభూతి పెద్దవాడు అని తెలుస్తోంది. వామనుడు భవభూతి శ్లోకాలను ఉద్ధరించాడు. సోమదేవుడు వ్యాస, కాళిదాస భారవి భర్తృ మేంఠల సరసన భవభూతిని చేర్చి విశేష గౌరవాన్ని కల్పించాడు. భవభూతి కాలం క్రీ.శ.680-750 అని భావించవచ్చు.

కవిత్వాన్ని పడికట్టు పదాలతో విశ్లేషిస్తున్న కాలంలో భవభూతి విసిగి వేసారి తనదైన మార్గాన్ని ఎంచుకొని ధైర్యంగా ముందుకు సాగాడు. ఈ విషయాన్ని స్వయంగా మాలతీ మాధవంలో చెప్పాడు. ఈ మాట కొంత గర్వంతో చెప్పినట్లు ఉన్నా, అతని ధిషణాహంకారమే అది అని విశ్లేషకులన్నారు. ముందుమాటల్లో తాను వేదాలతో పాటు వ్యాకరణ, మీమాంస న్యాయ సాంఖ్య, యోగ శాస్త్రాలను తరచి చూశానని చెప్పుకొన్నాడు. ఉజ్జయినిలో ఉన్నత విద్యాభ్యాసం కోసం చేరాడు. "గౌడి" విధానంలో రాసిన సంస్కృత నాటకాలు ఉత్తమోత్తమంగా ఉన్నాయి. ముతక హాస్యం అంటే ఇష్టం లేక విదూషక పాత్రను దేనిలోనూ చిత్రించలేదు. తనను "శ్రీ కంఠ పద్మ లాంఛనుడు"గా చెప్పుకొన్నాడు అంటే "కంఠంలో సరస్వతీ దేవి కొలువై ఉన్న వాడు" అని అర్థం. "భవభూ - తిర్నమ" అంటే భవభూతి. మాలతిలోని మూడవ అంకంలో తన గురువు కుమారిలుడని నాలుగో అంకంలో కుమారిలుని శిష్యుడు కుంబెరకాచార్య అని రాశాడు. ఇదే భవభూతి అసలు పేరంటారు.

భవభూతి కవితా గీర్వాణం

"సర్వత ప్రచలిత పాఠ:" అని చెప్పుకొన్నాడు తన మహావీర చరితంను అంటే ప్రతి చోటా తన గ్రంథం దర్శనమిస్తుందని అర్థం. అంటే అంత పాప్యులర్ అని భావం. ఇందులో చివరి భాగాలను వినాయక భట్టు రాశాడని కాశ్మీర చరిత్ర చెప్పిందట. రామాయణ కథలో చాల మార్పులు చేశాడు. కైకను రాముడిని వనవాసానికి పంపే విలన్‌గా చిత్రించలేదు. శూర్పణఖ మంధర వేషంలో వచ్చి రాముడికి కైక రాసిన ఉత్తరాన్ని అందిస్తుంది. అప్పటికే రాముడు మహర్షుల యజ్ఞాలను తపస్సును సంరక్షించాలనే ఉద్దేశ్యంతో సీతా కల్యాణం అయిన వెంటనే

మిథిల నుంచే సరాసరి అరణ్యాలకు బయల్దేరటానికి సిద్ధంగా ఉంటాడు. మన రామాయణంలో ఉన్నట్లు అయోధ్య నుండి కాదు. ఇదొక కొత్త మార్పు. రాముడే మహావీరుడు. శూర విక్రమ పరాక్రముడు. పరశురామ గర్వ భంగం చేస్తాడు. "విరసత్రదానుడు(శౌర్యమే లక్షణంగా ఉన్నవాడు)" అంటాడు రాముడిని భవభూతి. మహావీర చరితం రచనా విధానాన్ని బట్టి కవి రాసిన మొదటి నాటకం ఇదే అనిపిస్తుంది. మైత్రేయి మాల్యవంత మొదలైన కొత్త పాత్రలు సృష్టించాడు. వీర రౌద్ర భీభత్స దృశ్యాలలో శార్దూలాన్ని స్రగ్ధరను వాడాడు. శృంగారంలో వసంత తిలక, మాలిని మందా క్రాంతాలను ఉపయోగించాడు. ఛందోభేదం బాగా పాటించాడు.

మాలతీ మాధవం పది అంకాల నాటకం. బృహత్కథలోని ఒక కథ ఆధారంగా రాసిన "ప్రకరణం" అనే నాటక శాఖకు చెందింది. భవభూతి ఊహాపోహలకు గొప్ప వేదికగా నిలిచింది. మాలతి – మాధవుల ప్రేమకథతో బాటు మకరండ మదయంతిక ప్రేమ కూడా సమాంతరంగా సాగుతుంది. భయానక దృశ్యాలను కూడా చేర్చి రాసిన ఏకైక నాటకం అంటారు. అయితే నాటకం "సుదీర్ఘ సుత్తి"లా సంక్లిష్టంగా ఉండి "బోర్" కొట్టిస్తుంది. హటాత్ సంఘటనలతో కథ మలుపులు తిరిగి సుఖాంతమౌతుంది.

ఉత్తర రామచరిత్ర భవభూతి "మేగ్నం ఓపస్" నాటకంగా నిలిచింది. కవిత్వం పరవళ్ళు తొక్కుతుంది. ఇందులోనూ వాల్మీకి రామాయణానికి విరుద్ధంగా కథలో అనేక మార్పులు చేశాడు. దీనికి ఆధారం ఏమిటో తెలియదు. కరుణ రసాత్మక నాటకంగా జగత్ ప్రసిద్ధి చెందింది. రాముడు కుశలవులతో యుద్ధం, అశ్వమేధ యాగం, సీతా రాముల పునస్సమాగం మొదలైనవి అవాల్మీకాలుగా భావిస్తారు. కరుణ రసాన్ని ధారాపాతంగా వర్షించటానికే ఇన్ని మార్పులు చేశాడని అంటారు. కథ దాదాపు ఉ్తర రామాయణ కథ మనకు తెలిసిందే. సీతాదేవి మనసును అత్యంత ప్రతిభావంతంగా ఆవిష్కరించాడు కవి. అన్ని రసాలు కరుణ రసానికి ఉపాంగాలు అని నిరూపించాడు భవభూతి. అదీ అతని ప్రత్యేకత. అలంకారికులు దీనినే సమర్ధించారు. ఇంతటి కరుణార్ద్ర పూర్వక నాటకం ప్రపంచ

నాటకాలలో లేనేలేదని నిర్ద్వందంగా చెప్పవచ్చు. భవభూతి ప్రేమ వివాహాలకు అత్యంత గౌరవం ఇచ్చాడు. తన కాలానికి తగిన భాషలో నాటకం చక్కగా ఒదిగిపోయింది. సౌరసేని ప్రకృతాన్ని ఒక్కదానినే ప్రయోగించాడు. భావాల కంటే భాషకు ఉన్నత స్థానాన్ని కల్పించటం భవభూతి ప్రత్యేకతగా పేర్కొంటారు. ప్రౌఢత, ఉదారత, వశిత్వం తన ప్రత్యేకతలు అని చెప్పుకొన్న మాట నూటికి నూరుపాళ్ళు సత్యం. భాషలో హిమాలయోత్తుంగ శిఖరాయమానంగా భాసించాడు భవభూతి. ఎవరికీ తలవంచని, ఎవరినీ అనుకరించని కవి భవిభూతి. గోవర్ధనాచార్య అన్నట్లు “సాహితీమూర్తి సరస్వతి మహోన్నత హిమ శృంగంగా భవభూతి సాహిత్య స్పర్శతో భాసించింది. లేకపోతే ఆ కసాయి రాతికొండ ఆ దు:ఖపు ఘట్టాలకు కరిగి నీరైపోయి ఉండేది” అన్న మాట నిజం నిజం. ఈ విషయాలన్నీ ప్రొఫెసర్ శ్రీ రామనాధన్ ఆంగ్లంలో ‘ఎ బ్రీఫ్ స్కెచ్ ఆఫ్ భవభూతి’లో రాశారు. ఈ నాటకంలో భవభూతి రచన అత్యంత పరిపుష్ట స్థితికి చేరింది.

వాల్మీకంలో సీత భూలోకం చేరి దు:ఖాంతమవుతుంది. కాని, భవభూతి తన నాటకంలో సుఖాంతం చేశాడు. పద్మ పురాణంలో ఇలానే ఉందని దాన్నే ఆధారంగా తీసుకొని ఉంటాడని డా. బెల్వార్ కర్ అభిప్రాయ పడ్డాడు. మిరాశి అభిప్రాయంలో పద్మ పురాణ కర్త భవభూతి కథను తీసుకొన్నాడని, కాళిదాసు అభిజ్ఞాన శాకుంతల స్ఫూర్తితో సుఖాంతం చేసి ఉంటాడు. కరుణ రస స్థాయీ భావం దు:ఖమే అయినా భవభూతి సీతారాముల దాంపత్య ప్రేమను శృంగార భావ స్పర్శ, కామ వాసనా లేనట్లు పోషించాడు. రాముని మాటల్లో కూడా ఎక్కడా కామ కోరిక లేనేలేదు. వారిది అలౌకిక ప్రేమ. రాముని స్నేహపూర్వక ప్రేమ, విరహ దు:ఖం మనకు శోకభావాన్నే కలిగిస్తుంది. రాముడు సీతకు ప్రాధాన్యం ఇస్తే, భవభూతి రాముడికి ప్రాధాన్యం ఇచ్చాడు. ఇందులో రాముడు ధర్మమూర్తిగా కంటే ప్రేమమూర్తి, స్నేహమూర్తిగా దర్శనమిస్తాడు. పరిణత మనస్కుడైనాడు. వాల్మీకంలో సీతకు వచ్చిన సానుభూతి ఇందులో రాముడు పొందటం విశేషం. మూర్తీభవించిన కరుణా రసమూర్తిగా కనిపిస్తాడు. కరుణ రసం పరాకాష్టకు తెచ్చాడు కవి ఇందులో.

ఆనంద వర్ధనుడు రసాలలో కరుణ రసం మధురతరమైనది. "మనసులో పైకి కనిపించని వ్యధతో ఉన్న రాముడిని పుటం పెట్టిన కరుణ రస పాకం" అన్నాడు భవభూతి.

"అవిర్భిన్నో గభీరత్వా ధంతర్గూఢఘన వ్యధ: - పుట పాక ప్రతీకాశో రామస్య కరుణో రస:" అన్నాడు. భవభూతి కరుణ రసంపై చెప్పిన శ్లోకం ఇంకా జనం నాలుకల మీద నర్తిస్తోంది -

"ఏకో రస: కరుణ ఏవ నిమిత్త భేదాత్ - భిన్న: ప్రుధక్ ప్రుధగి వాశ్రయతే వివర్తాన్

ఆవర్త బుద్బుద తరంగమయాన్ వికారాన్ - అంభో యదా సలిల మేవహి తస్సమగ్రం"

దీని భావం - కరుణ రసం ఒక్కటే రసం. మిగిలినవన్నీ దాని భేదాలే. ఒకే రూపం ఉన్న నీరు ఆవర్త బుద్బుద, తరంగ రూపాలను పొందుతూ మూల రూపం చెడకుండా ఉంటుంది. అదే రకంగా కరుణ రసం ఇతర విభాదుల వలన అనేక రూపాలు ధరిస్తుంది. అయినా మూలరూపం మాత్రం మారదు. ఇది గ్రీకు "ట్రాజెడీ"కి దగ్గరగా ఉందన్న వాళ్ళూ ఉన్నారు.

నిజమైన ప్రణయం ఎలా ఉంటుందో భవభూతి ఇలా చెప్పాడు -

"అద్వైత సుఖ దుఖయో రానుగతం సర్వాస్వవస్తాసు యత్ - విశ్రామో హృదయస్య యాత్ర జరసా యస్మిన్ని హార్యో రస:

కాలేనా వరణాత్య యాత్ పరిణతేయత్స్నే హ సారే స్థితం - భద్రం ప్రేమ సుమానుసస్య కదా మాపయేకం హిత త్ప్రాప్యతే" అంటే "నిజమైన ప్రేమ సుఖ దుఖాల్లో సమానంగా ఉంటుంది. ఆపద కష్టాలలో ఒకేరకంగా స్పందిస్తుంది. హృదయానికి అనిర్వచనీయ ఆనందాన్ని, శాంతిని కలిగిస్తుంది. వృద్ధాప్యంలోను సరసత లోపించదు. లజ్జా సంకోచం తగ్గిపోయి పరిపక్వమైన స్నేహం మాత్రమే మిగులుతుంది.". నిజంగా ఇది గొప్ప "కోటబుల్ కోట్". మాలతీ మాధవంలో ఇంకో శ్లోకంలో భార్యాభర్తలు ఒకరికొకరు మిత్రులు, బంధువులు ఒకరి కోసం ఒకరు కోరికల్ని, సంపదను, చివరికి ప్రాణాలు కూడా త్యాగం చేయటానికి

సిద్ధమౌతారు. స్వార్థం లేనిది స్థిరమైనది, రాను రాను పెరిగేది, ఇద్దరికీ ఆనందం కలిగించేది. ఆదర్శ దాంపత్య ప్రణయం. బాహ్య కారణాల వలన ప్రేమ పుట్టదు. సూర్యోదయానికి కమలాలు చంద్రోదయానికి చంద్ర కాంత శిలలు వికసించి కరిగినట్లు ప్రేమ సమస్త ప్రాణాల్లో అన్ని పదార్థాలలో ఒకే రకంగా ఉంటుంది అన్నాడు. ఇది స్వాభావికం. స్వయం ప్రేరకం.

సీతా విరహాన్ని రాముడు –

"హాహా దేవి స్ఫుతతి హృదయం (శంసాటే దేహ బంధః – శూన్యం మన్యే జగదవిరళజ్వాల మంతర్జ్వలామి

సీ ధన్నంధేత మసి విదురో మజ్జతీ వాస్తరాత్మా – విష్వంగ మోహః స్థగయతి కదం మందభాగ్యః కరోమి"

"రాముడు సామాన్య మానవుడిగా దుఃఖించాడు. సీతా విరహంతో హృదయం పగిలిపోతోందని, శరీరం శిథిలమౌతోందని ప్రపంచం శూన్యమైనదని గుండెలో జ్వాలలు రేగుతున్నాయని తన దుఖిత ఆత్మ గాడాంధకారంలో కూరుకుపోతోందని, అన్ని వైపులా చీకట్లు కమ్మేస్తున్నాయని, అలాంటి స్థితిలో ఉన్న మంద భాగ్యుడైన తాను ఏం చేయాలో ఎక్కడికి వెళ్ళాలో తెలియటం లేదు" అన్నాడు. సాధారణంగా స్త్రీల ఆవేదన ఇలా ఉంటుంది. కాని రాముడిలో చూపాడు కవి. అందుకే గోవర్ధనాచార్యుడు –

భవభూతేః ధాత్ భూధర భూరేవ భారతీ భాతి – ఏ తత్కృత కారుణ్యే కిమం యదా రోదతిగ్రావాః"

భవభూతి కవితా గీర్వాణం – ప్రకృతి వర్ణన

ప్రకృతిని వర్ణించటంలో కాళిదాస భావభూతులు భిన్న మార్గాలను అనుసరించారు. కాళిదాసుకు ప్రకృతి లలిత మనోహరంగా కన్పిస్తే భవభూతికి భయంకరంగా కనిపించింది. ఆ మనోభావాలనే వారు కవిత్వీకరించారు. విదర్భవాసి కనుక భవభూతికి దండకారణ్యంతో పరిచయం ఉండి ఉంటుంది. దాని భయంకర స్వరూపాన్ని బాగా వర్ణించాడు. ఈ మార్గంలో అరణ్య విశేషాలను అంతవరకూ ఏ కవీ రాయలేదు. కొత్తమార్గం తొక్కాడు. ఒకరకంగా దృశ్య

చిత్రాలుగా చూపించాడు కవిత్వంలో. "దండకం నిశ్శబ్దంతో, క్రూరమృగ గర్జనలతో ఉంది. నిద్రించే పాముల బుసలు అడవికి అగ్గిపెట్టినట్లుంది. గుంటల్లో నీళ్ళు మెరుస్తున్నాయి. దాహంతో తొండలు నీళ్ళు దొరక్క కొండ చిలువల చెమటని తాగుతున్నాయి" అంటాడు. అయితే మనోహరంగా దృశ్యమానమైన చోట అతిమనోహరంగానే సహజ రీతిలో వర్ణించాడు.

"గుంజత్కుంజ కుటీర కౌశిక ఘటా ఘుత్కార వత్కీచక – స్తం బాడంబర బద్ధ మౌళి కుల: రౌన్చాభి దోయం గిరి:

ఏతస్మిన్ ప్రచలాకినాం ప్రచలితా ముద్వేజితా: కూజితై: – ఉద్వేల్లంతి పురాణ రోహిణ తరుస్కందేషుకుమ్భీనసా:"

పొదరిళ్ళల్లో గుడ్ల గూబల ధ్వనులతో కూడిన కీచకాండాల శబ్దాలతో నిశ్శబ్దం తాండవిస్తోంది. కాకులతో గొడవలతో క్రౌంచ పర్వతమ్ నెమళ్ళ క్రేంకారాలతో సర్పాలు భయపడి రోహణ పర్వత వృక్ష కొమ్మలపై దిక్కుతోచక అటూ ఇటూ తిరుగుతున్నాయి.

వాసంతి, తమసా, మురళి అనే నదులను ప్రాణం ఉన్న పాత్రలుగా తీర్చిదిద్ది అసమాన ప్రతిభ చూపాడు. ఈ సందర్భంలో కోమల ప్రకృతి స్వరూపాన్ని అంతే లలితంగా వర్ణించాడు.

"ఇహ సమద శాకుంతా క్రాంత వానీర వీరుత్ – ప్రసవ సురభి శీత స్వచ్ఛ తోయావహంతి –

ఫలభర పరిణామ శ్యామ జంబూ నికుంజ – స్ఖలాన ముఖర భూరి స్రోతసో నిర్ఝరిన్య:"

నదులు ప్రవహిస్తున్నాయి. వాటి ఒడ్డున వానీర లతలు వ్యాపించి ఉన్నాయి. ఆ లతలపై మధుర కూజితాలతో పక్షులు విహరిస్తున్నాయి. పక్షుల కదలికలతో పూలు రాలి నదీ ప్రవాహంలో పడి సువాసనలతో జలాలు శోభిస్తున్నాయి. సహజ శీతలం స్వచ్ఛం అయిన పర్వత నిర్ఝరులు అంటే నదులు సువాసనలతో ఆహ్లాదాన్నిస్తున్నాయి. వాటి ధారలతో తడుపబడిన జంబూ వృక్ష నికుంజాలను తాకటం చేత కమ్మని ధ్వని చేస్తూ అనేక మార్గాలలో ప్రవహిస్తున్నాయి.

ఇలా దృశ్యాలకు అలంకారిక వన్నె తెస్తాడు.

భవభూతి నాటక కళా శిల్పం

భవభూతి కాళిదాసులాగా శ్రవ్య కావ్య రచన చేయలేదు. మూడూ నాటకాలే రాశాడు. రామ పరాక్రమానికి ఆయువు పట్టుగా మహావీర చరిత రాశాడు. ఇందులో వస్త్వైక్యం సాధించాడని విమర్శకులు మెచ్చుకొన్నారు. మొదటి నాటకం కనుక కళా కౌశలంలో వెనకపడ్డాడు. కల్పిత కథ మాలతీ మాధవం భాసకృత "అవిమారక" నాటక ప్రభావం ఉంది. ఇది ప్రకరణం ఇంతకుముందే ప్రకరణంగా శూద్రక కవి మృచ్ఛకటికం రాశాడని మనకు తెలుసు. హాస్యం లేకుండా రాశాడు భవభూతి. గంభీర రచన. శృంగార భీభత్సాలున్నాయి, పండాయి కూడా. ముందే చెప్పినట్లు లాగుడు ఎక్కువై విసుగు తెప్పిస్తుంది. రంగస్థల ప్రదర్శనకు పై రెండూ అనువైనవిగా లేవు.

ఉత్తమ రామచరితలో నాటకాలలో శిఖరాయమానం. ప్రదర్శన యోగ్యతా పొందింది. ప్రేక్షకులు చూసి రసప్లావితులౌతారు. దృశ్య విభజన రాణించింది. నాటకం మొదట్లోనే రాముడి చేత –

"స్నేహం దయం తదా సౌఖ్యం యదివా జానకీమపి – ఆరాధనాయ లోకస్య ముంచతోనాస్తి మే వ్యథా" అని చెప్పిస్తాడు కవి. ఇదే నాటక బీజం. ఇక్కడి నుంచి రామ కథ అంకురించి, పల్లవించి, కుసుమించి, ఫలిస్తుంది. సుఖాంతం చేయటానికి అన్నీ పకడ్బందీ ఏర్పాట్లు చేశాడు. రాముడికి సీతా విరహం పరమ అసహ్యం అనిపిస్తుంది –

"కిమ్మస్యా న ప్రేయో యది అసహ్యస్తు విరహః" అనిపిస్తాడు. విరహం అసహ్యం అనుకొన్న సందర్భంలో దుర్ముహుడు ప్రవేశించి లోకాపవాదు చెవిన వేస్తాడు. ఇదే "ఐరనీ". మొదటి రెండు అంకాల మధ్యకాలం పన్నెండేళ్ళు. దాన్ని సమర్ధవంతంగా చూపించాడు. ఈ నాటకంలో భారతీయమైన కర్తవ్య నిష్ట, త్యాగం దాంపత్య ప్రేమ, కులపాలికా ప్రణయం, గృహస్త జీవన మాధుర్యం, ధర్మాచరణ స్పష్టంగా నిరూపించాడు. మన సంస్కృతీ ధర్మాలకు ఆటపట్టుగా ఆదర్శంగా ఉత్తర రామచరితను భవభూతి నిర్మించి పరమ ప్రయోజనాన్ని

సాధించాడు. సంభాషణలు రసవత్తరంగా సంక్షిప్తంగా ఉంటాయి. పాత్రోచిత శైలీ చూపించాడు. కరుణ రస వర్షంలో మనల్ని తడిపేస్తాడు భవభూతి.

భాషలో ప్రౌఢత్వం, మాటలో ఉదారత, అర్ధ గాంభీర్యం అనే త్రివేణీ సంగమం భవభూతి కవిత్వంలో కనిపిస్తుంది. యుద్ధ వర్ణలలో దీర్ఘ సమాసాలతో "గౌడీ రీతి"లో వర్ణిస్తాడు. దీనివలన భీభత్స రసం వీరం పొంగి ప్రవహిస్తాయి. ప్రయోజనం సిద్ధిస్తుంది. అవసరమైనప్పుడు వచనాన్ని సమర్ధంగా రాశాడు. రసాలను, పాత్రానుకూల శైలి అనుసరించి నాటకాకినికి జీవం పోశాడు. దీనికి ముగ్ధుడైన తిలక మంజరి రాసిన ధనపాలుడు –

"స్పష్ట భావ రసా చిత్రై: పదన్యాసై: వర్తితా – నాటకేషు నట స్త్రీన భారతీ భావ భూతిన:" అని శ్లాఘించాడు. శ్మశాన వర్ణనాలోని గౌడీ రీతిలోని భీభత్స రసాన్ని చూద్దాం –

"ఉత్కృత్యోత్కృత్య కృత్తిం ప్రధమ మధ ప్రుథూ త్సేదభూయామ్సి మాంసా – న్యంస స్ఫిక్ స్పష్ట పిండాద్యవయవ సులభా న్యుగ్ర పూతీని జగ్ధ్వా –

ఆర్త: పర్యస్త నేత్ర: ప్రకటిత దశన: ప్రేతరం క: కరం తాత్ – అంక స్థా దస్తి సంస్థం స్థపుట గటమపిక్రవ్య మవ్యగ్ర మత్తి"

శ్మశానంలో ఒక దెయ్యం శవం తోలు వలిచింది. భుజాల వెనక ఉబ్బిపోయి దుర్గంధంతో ఉన్న మాంసాన్ని తింటోంది. కళ్ళు పెద్దవి చేసి పళ్ళను ఇకిలిస్తూ ఒడిలో ఉంచుకున్న శవం ఎముకలకు అంటుకొని ఉన్న మాంసాన్ని గీకి గీకి సంతోషంగా తింటోంది" యెంత భయంకరమైన వర్ణనో. కళ్ళకు కట్టినట్లు చూపాడు దృశ్యాన్ని. దీన్నే "పోట్టిగ్రాపు" అంటే ఫోటోగ్రఫీ వర్ణన అంటారు. అంటే ఉన్నది ఉన్నట్లుగా చిత్రీకరించి చూపిస్తాడు. దానికి కలర్ వేయడు.

భవభూతి ఛందో వైవిధ్యాన్ని బాగా పాటించాడని చెప్పుకొన్నాం. అతనికి ఇష్టమైనది "శిఖరిణీ వృత్తం" దాన్ని ఎంత బాగా ప్రయోగించాడో క్షేమేంద్రుడు "మాలినీ వృత్తం"లో మనోహరంగా చెప్పాడు –

"భవ భూతే: శిఖరిణీ నిరర్గళ తరం గిణీ – రుచిరా ఘన సందర్భే యా మయూరీ వ నృత్యతి"

మానవ హృదయపు లోతులను తడిమి ఆర్ద్రత కలిగిస్తాడు. సూక్ష్మ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి చెబుతాడు.

''భవభూతి కవేర్వాచ స్సదంతే రస రంజితా: - సుమనోభా స్సుదాస్యందిబంధ మాధుర్య బంధురా:" అని ఒక అజ్ఞాత కవి భవభూతి వివిధ రస పోషణలో సిద్ధ హస్తాన్ని గురించి చెప్పాడు.

కవితా గీర్వాణం

అనేక శాస్త్రాలతోబాటు నాట్య, అర్థ కామ, ఆయుర్వేద శాస్త్రాలలోను భవభూతికి మంచి ప్రవేశం ఉంది. భరతుని రస సిద్ధాంతాన్ని ఔదల దాల్చినవాడు. అసలే సదాచార సంపన్న వంశం. వారంతా "సోమ పీథులు", పంక్తి పావనులు, బ్రహ్మవాదులు. పంక్తి పావనులు అంటే చతుర్వేదాలను, ఆరు వేదాంగాలను చదివి వేద పఠనాన్ని పది తరాలుగా చేస్తున్న వారు అని అర్థం. తనను వశ్యవాక్కుగా, పరిణత ప్రజ్ఞా దురీణునిగా, శబ్ద బ్రహ్మగా చెప్పుకొన్నాడు. మాలతీ మాధవంలో అతని శివభక్తీ కనిపిస్తే, మహావీరంలో రామభక్తి సామ్రాజ్యాన్ని ఏలినట్లనిపిస్తుంది. తన ప్రతిభపై అపార నమ్మకం ఉన్నవాడు. అందుకే పండితులు మొదట నిరాకరించినా "కాలోహ్యయం నిరవధి ర్విపులాచ పృధ్వీ" అన్నాడు. "విపులాచ పృధ్వీ" అనేది ఒక పలుకుబడి దేశంలో బాగా ప్రచారమైంది. భార్య మరణ దుఖంతో ఉత్తర రామచరిత రాశాడని కొందరి ఊహాగానం. పవిత్ర ప్రేమకే పట్టం కట్టాడు. ఆంగ్లంలో "డివైన్ లవ్" అనేదానికి ఉదాహరణగా పాత్రల్ని చిత్రించాడు ఆనాడే. అలౌకిక ప్రేమ అతని ఆదర్శం. అదే భారతీయాదర్శం. దానినే ప్రతిబింబింపజేశాడు.

"వ్యతి ప్రతి పదార్థానంతర కోపి హేతుః - నఖలు బహిరుపాదీన్ప్రీతయ: సంశ్రయంతే" అన్నాడు. అంటే తెలియని కారణాలు యేవో మనుష్యులను ఒక్కటిగా కలిపి బంధిస్తాయి. ప్రేమకు బయటి కారణాలు ఉండవు. మన కవికి నాటక నటులతో సన్నిహిత సంబంధాలున్నట్లు గోచరిస్తుంది. నాటక లక్షణ శాస్త్రంలో ప్రతి అంకంలోను విదూషకుడు ఉండాలి. దీన్ని "తూ-నా బొడ్డూ" అని అసలా పాత్రనే తీసి పారేసి కొత్త ఆలోచన తెచ్చాడు. మన విశ్లేషకులు కాళిదాస

భవభూతులని తులనాత్మకంగా పరిశీలించి నిగ్గు తేల్చారు. అందులో కొన్ని కథలూ గాథలూ చేరాయి కూడా. అందులో నమ్మదగనివే ఎక్కువ. అయినా కొంత చూద్దాం.

కాళిదాస – భవభూతులు

ఇద్దరూ గీర్వాణ సాహిత్యంలో ఉద్దండ కవులే. మహాకవి అని కాళిదాసును అందరూ అంటున్నా భవభూతి ఫాన్స్ మాత్రం ఆయనే మహాకవిగా చెప్పుకొంటారు. కాళిదాస "విసనకర్రలు" స్వర్గంలో పారిజాతాది వృక్షాలు కేవలం వృక్షాలే. కాని "స్నుహీ వృక్షం" మాత్రం మహా వృక్షం అని గురువు గారిని సమర్థించాడు. కాని ఇది వైద్యానికి కూడా పనికి రాదట. అందుకే వైద్యశాస్త్రంలో వ్యంగ్యంగా దాన్ని "మహా వృక్షం" అన్నారట. ఇది లోక సహజం. ఇద్దరూ భోజరాజ ఆస్థానకవులే అని కథలల్లారు.

"కాళి" మృదు స్వభావి. "భవ" గంభీరుడు. "దాసుది" "వైదర్భీ రీతి" క్లిష్ట సమాస రచన ఉండదు. పదలాలిత్యం ఎక్కువ. కవిత్వంలో ప్రసాద మాధుర్యం ఉంటుంది. అయితే "భూతి" ది "గౌడీ రీతి". దీర్ఘ సమాస రచన ఇష్టం. క్లిష్ట పద ప్రయోగం ఇష్టంగా చేస్తాడు. అప్రసిద్ధ ప్రయోగాలూ చేశాడు. దాసు కవిత్వం వ్యంగ్య ప్రధానం, రమణీయార్థాలను ప్రతిపాదిస్తాడు. వ్యంజనా రీతికి పట్టం కట్టాడు. భూతి మాత్రం వాచ్యార్థానికే ప్రదాన్యమిచ్చాడు. శబ్దాలపై ఎక్కువగా ఆధారపడ్డాడు. సంక్లిష్ట భావాలే ఎక్కువ. అన్నీ అరటిపండు ఒలిచినట్లు చెబితేనే తృప్తి. నాటక సంవాదాలు ఎక్కువగా చేశాడు.

గురువులిద్దరూ ప్రకృతి ప్రేమికులే. ముందే మనం చెప్పుకొన్నట్లు కాళిదాసు లలిత కోమల సౌందర్యాన్ని ప్రకృతిలో దర్శించాడు. భవ ప్రకృతిలోని భీభత్సాన్ని, భయంకరాన్ని చూపించాడు. దాసు వర్ణనలు మనసుకు చల్లగా ఉంటే, భూతి వర్ణనలు భయపెడతాయి. శక్తివంతమైన పదాలను కూరుస్తాడు సందర్భాన్ని బట్టి. దాసుడి సరళ మధుర స్వభావం, భవ ది ప్రౌఢ తీక్షణ, గంభీర స్వభావం, ఇద్దరూ పరిమితంగానే అలంకారాలు వాడారు. నిత్య జీవితంలోని ఉపమలు దాసు వాడితే భూతి అమూర్త ఉపమలు తీసుకొన్నాడు. అలంకార చమత్కారాలు

ఇష్టం లేనివాడు.

భవభూతి మనుషుల అంతర్ సౌందర్యాన్ని అన్వేషించి వివరిస్తాడు. కాళిదాసు బాహ్య సౌందర్యాన్ని అద్భుతంగా చిత్రించాడు. భవ బాహ్య సౌందర్యం జోలికి పోనేలేదు. శకుంతలను దాసు ప్రకృతి కన్యలాగా వర్ణిస్తాడు –

"ఆధర: కిసలయ రాగ: కోమల విటపాను కారిణౌ బాహూ – కుసుమమివ లోభ నీయం యౌవన మంగేషు సన్నద్ధం" అన్నాడు. కపోల కచాల మీదనే దాసు దృష్టి. భూతికి ఈ దృష్టేలేదు. అందుకే సీత శకుంతల కన్నా పవిత్ర మూర్తిగా అనిపిస్తుంది.

కాళిదాసు ప్రణయం కామ వాసన వేస్తుంది. భవభూతి ప్రణయం ఆత్మలకు సంబంధించింది. స్నేహ పూర్వకమైంది. వివాహబంధం చేత స్థిరపడేది. శకుంతలా దుష్యంతులది అతిలోక ప్రేమయే కాని సీతారాముల ప్రణయం అంతా గంభీరం, స్థిరం, పవిత్రమైనది. యవ్వన ఉద్రికంతతతో కాళిదాసు చిత్రించిన ప్రేమకాదు, కాలంతో పరిపక్వమైంది. ఇద్దరూ మహా కవులే. సందేహం లేదు. దాసు కల్పనకు గొప్ప కవి. భూతి సహజ చిత్రకవి భావనాలోక సంచారికుడు.

కాళిదాసు నాటలకాలను లాక్షిణికుల ఆమోదం పొందేట్లు రాశాడు. భవభూతి స్వేచ్ఛతో కొత్త దారులు తొక్కాడు. రంగస్థలం మీద అన్నీ చూపించేశాడు. మనుష్య మాంసాన్నీ అమ్మించాడు. ఉత్తర రామచరిత్రలో చిత్రపటాల దర్శనం ఒక దివ్యానుభూతి. గర్భంక నాటకం అతని ప్రతిభకు నిదర్శనం. దాసు ప్రకృతి చిత్రణ చేసినా హృదయపు లోతుల్ని తరచలేకపోయాడు. భూతి సూక్ష్మ పరిశీలనతో హృదయపు లోపలి పొరల్ని ఆవిష్కరించాడు. కరుణకు భవభూతి పట్టంకడితే కాళిదాసు శృంగారానికి పట్టాభిషేకం చేశాడు. సంభోగ శృంగారాన్ని దాసు, వియోగ శృంగారానుభూతిని భవుడు చిత్రించారు. కరుణతోబాటు వీర, రౌద్ర, భయానక, భీభత్సాలను సమర్ధంగా చిత్రించాడు.

కాళిదాసుది కళాత్మకత. భవభూతిది భావతీవ్రత. భవభూతికి కాళిదాసు అభిమాన కవే. వాల్మీకం అంటే భవభూతి అమిత గౌరవం. మార్పులు చేసినా సమర్ధన కనిపిస్తుంది. దుష్యంతుడు శకుంతల చిత్రపటం దగ్గర పెట్టుకొని

దు:ఖిస్తాడు. రాముడు పంచవటికి వెళ్లి విరహాన్ని పొందుతాడు. ఇద్దరికీ పుత్రులు జన్మించారు. వారే విడిపోయిన నాయికా నాయకుల్ని కలపటం విశేషం. భారత ఇతి వృత్తాంతం తీసుకొని కాళిదాసు శాకుంతలాన్ని దివి భువిలను అనుసంధానం చేస్తూ నభూతోగా రాశాడు. భవభూతి ఉత్తర రామాయణంలోని సీత కథను తీసుకొని రామ దృష్టితో అతి కరుణ రసాత్మకంగా చిత్రించాడు. దుష్యంతుడు లంపటుడు, చంచలుడుగా కనిపిస్తే రాముడు దీరోదాత్తుడుగా నిష్కామ స్నేహశీలిగా దర్శనమిస్తాడు. ఇద్దరూ పాత్రలను అతిలోక సుందరంగానే చిత్రించి చరితార్ధులైనారు. దియోకాంత రాయ్ ఆంగ్లంలో వీరిద్దరిని తులనాత్మకంగా పరిశీలించి గొప్ప పుస్తకం రాశాడు. దీనికి తెలుగు అనువాదమూ వచ్చింది. మా నాన్నగారి దగ్గర ఉండేది. నేను రెండు మూడు సార్లు చదివిన జ్ఞాపకం. ఇద్దరు కవులు రచనలు అన్ని భాషల్లోకి అనువాదం పొందాయి.

భవభూతిని కాళిదాసు ప్రశంసించితే భవభూతి కాళిదాసు నాయికా నాయకులను వీలైనప్పుడల్లా స్తుతించాడు. కాళిదాసు ప్రభావం భవభూతిపై ఉంది. ఉత్తర రామ చరితలో శాకుంతలం ప్రభావం కనిపిస్తుంది. ఒకరికొకరు వీరాభిమానులు మధ్య మనమే బుజాలు కాసి దెబ్బతింటున్నాం. కాళిదాస భవభూతులు సాహిత్యాకాశంలో సూర్యచంద్రులు, కమనీయ దీప్తులు.❁



32. తృతీయ పంథా తొక్కిన - మురారి (800 ad)

"అనర్ఘ రాఘవ" నాటకంతో అందరిని ఆకట్టుకొన్న మహా రచయిత మురారి. చాలా రాశాడని అంటున్నా మిగిలింది ఈ నాటకం ఒక్కటే. "గరిటడైన చాలు గంగి గోవు పాలు" అన్నదానికి ఉదాహరణగా సంస్కృత సాహిత్యంలో నిలిచిన కవి మురారి. ఎనిమిది, పది శతాబ్దాల కాలంవాడిగా మురారిని అంచనా వేస్తారు. ఒరిస్సాకు కాని దక్షిణ భారత దేశానికి కాని చెందిన బ్రాహ్మణుడిగా భావిస్తారు. అత్యద్భుతమైన భావాలకు ఆలవాలం మురారి. పండితకవి. తండ్రి శ్రీ వర్ధమానకుడు. తల్లి తంతుమతి. విమర్శకుల మనస్సులను దోచుకొన్న కవి. "మురారే తృతీయ పంథా" అని మెచ్చుకొంటారు. బాల వాల్మీకి, మహాకవి బిరుదాంకితుడు. రామాయణ కథను నాటకంగా రాయటం వలన ఆ పేరు వచ్చి ఉండచ్చు. రామాయణంలోని రసవద్ ఘట్టాలను నాటకీకరించి, యుద్ధాలనూ జోడించి శోభ చేకూర్చాడు. బహువిధ ఛందో వైవిధ్యంతో ఆకర్షించాడు. ప్రాచీన భారత దేశ నగర, పట్టణాలను, అరణ్య నదీ అందాలను, దేవతలా దెయ్యాల మంత్రం తంత్రాలను కలిపి ఉత్సుకతను పెంచాడు.

అనర్ఘ రాఘవ నాటకంలో నటనకు ప్రాధాన్యత తక్కువే ఉంటుంది.

అడపా దడపా యుద్ధాలు, యుద్ధాల మధ్య కథ జరిగిపోతూ ఉంటుంది. భయానక, భీభత్స దృశ్యాలు ఒళ్ళు గగుర్పొడుస్తాయి. నాటకాన్ని గమనిస్తే కేరళలోని "కుట్టియాట్టం" విధానం గుర్తుకొస్తుంది. కాని మురారి నాటకంలో కంటే కుట్టియాట్టంలో నటనకు ఎక్కువ అవకాశం ఉంటుంది. మురారి కవిత్వం మోహనంగా ఉండటంతో నాటకం బాగా రక్తికడుతుంది. నాలుగవ అంకంలో ప్రాకృత భాషను ఉపయోగించాడు. దీన్ని మిశ్రవిష్కంభ అన్నారు. రావణ మంత్రి మాల్యవంతుడు సరైన నాటకాన్ని ఆడించటం లేదని విశ్వామిత్రుడిని నిందిస్తాడు. "ఇది దుర్నాటకం"గా ఉందని తన మనస్సుకు తృప్తినివ్వటం లేదనీ అంటాడు. విష్ణు భట్ట అనేవాడు విశ్వామిత్రుడే అన్నీ తానే సూత్రధారుడిగా అయి చేస్తున్నాడని "స్వయం సూత్ర వత్ ప్రేరక ఇతి భావా" అని అంటాడు. నాటకంలో రామకథ మధ్య మాత్రమే వస్తుంది. ఇలా మురారి రాయటానికి కారణం భవభూతి రచించిన ఉత్తర రామ చరితను అనుసరించటమేనంటారు విమర్శకులు. "రామా బియాండ్ ప్రైస్" అని ఆంగ్లంలోకి ఈ నాటకాన్ని అనువదించారు. కాని భవభూతి మీద స్పర్ధతో రాశాడనే వారూ ఉన్నారు. మురారికి మాఘ భావభూతులకున్న సరుకు లేదనిపిస్తుంది.

కవితా గీర్వాణం

అనర్ఘ రాఘవం ఏడు అంకాల నాటకం. మొదటి అంకంలో దశరథ విశ్వామిత్రుల సంభాషణ, యాగ రక్షణకు రామ లక్ష్మణులను విశ్వామిత్రుడు తీసుకు వెళ్ళటం ఉంటుంది. రెండవ అంకంలో రావణ పరిచయం విష్కంభం ద్వారా చూపాడు. ముని, సోదరులతో మిథిల చేరుతారు. మూడవ అంకంలో రావణుడు సీతను పెళ్లి చేసుకొంటానని విష్కంభం ద్వారా చెప్పిస్తాడు మురారి. రాముడు శివ ధనుర్భంగం చేయగానే రావణ పురోహితుడు శేష్కలుడు దీనికి ప్రతీకారం జరుగుతుందంటాడు. నాలుగులో శూర్పణఖ తనకు జరిగిన అవమానాన్ని అన్న రావణునకు తెలియజేస్తుంది. మాల్యవంతుడు రాముడిని వనవాసం చేయటానికి కైకేయిని ప్రేరేపించమని శూర్పణఖకు బోధిస్తాడు. పరశురాముడు మిథిలకు చేరినట్లు మొదలైనవి విష్కంభం ద్వారా

తెలియజేయబడుతాయి. రామ వనవాసం ప్రారంభమౌతుంది. పంచమాంకంలో జాంబవంతుడికి శ్రవణుడికి మధ్య సంభాషణ విష్కంభం ద్వారా తెలుస్తుంది. సీతాపహరణం జరుగుతుంది. వాలి వధ, సుగ్రీవ పట్టాభిషేకం జరిగిపోతాయి. ఆరులో రాముడు సేతుబంధనం, రాముడు లంకా ప్రవేశంలను శుక శారణులు రావణుడికి తెలియజేస్తారు. రామ రావణ యుద్ధాన్ని విద్యాధరులు వివరిస్తారు. సప్తమాంకంలో రామాదులు అయోధ్యకు చేరటం అంతా రామాయణం పదమూడవ సర్గలో చెప్పినట్లు జరుగుతుంది. నగర, పర్వత పట్న వర్ణనలుంటాయి. భరతుడు రాముడికి స్వాగతం చెబుతాడు. శ్రీరామ పట్టాభిషేకంతో అనర్ఘ రాఘవ నాటకం పరిసమాప్తమౌతుంది.

మురారి పాత్ర చిత్రణ ఆకర్షణీయంగా ఉండదు. రామాయణ కథలో మార్పులు చేశాడు. విష్కంభాలతో కథ ఎక్కువ భాగం చెప్పటం ఒక గొప్ప ముందడుగు. రక్తి కట్టించటానికి బదులులు బోరు కొట్టిస్తుంది. కథాగమనం కుంటి నడక నడుస్తుంది. వస్త్వైక్యం కొరవడి ఇబ్బంది కలిగిస్తుంది. చదువుకోవటానికే కాని ప్రదర్శనకు అనుకూలించని నాటకం. దీనికి తోడూ ప్రసిద్ధాలు కాని పదాలు చాలా వాడటం వలన మనకు అర్థం కావు. పండిత కవి అని ముందే చెప్పుకొన్నాం. “చిత్తం అనే శుక్తి (ముత్యపు చిప్ప)తో అనేక స్వాతి బిందువుల రూపంలో ఉన్న శాస్త్రాలను తాగేసి అక్షర రూపం అయిన ముత్యాల హారాన్ని రాశాను” అని చాటింపు వేసుకొన్నాడు మురారి. కాని అంత “సీను” మనకు దృశ్యమానం కాదు. లాక్షణికులు మురారి ప్రౌఢ కవిత్వాన్ని శ్లాఘించారు. అందుకే వారు –

“దేవీ వాచం ఉపాసతేహి బహావస్సారంతు సారస్వతం – జానీతే నితరా మాసౌ గురుకుల క్లిస్టో మురారిః కవిః” అన్నారు అంటే సరస్వతీ దేవిని చాలామంది ఉపాసిస్తారు కానీ సారస్వత సారం, క్లిష్టమైన గురుకుల వాసం చేసిన మురారికే తెలుస్తుంది.”

ఆధునికులు కూడా మురారి పాండిత్యాన్ని, కవిత్వాన్ని మెచ్చుకోలేదు. వీర రసం కోసం దీర్ఘ సమాసాలు రాశాడు. అవి ఓజో గుణాన్ని కలిగించాయి

శైలికి తోడ్పడ్డాయి. శార్దూల విక్రీడితాలనే ఎక్కువగా వాడాడు. పరిసర పరిజ్ఞానం బాగా తక్కువ అనిపిస్తాయి అతని నగర వర్ణనలు. శ్రీశ్రీ "పొడిచేస్తానన్నవాడు పొడి పొడి చేశాడు" అని ఎప్పుడో అన్నట్లు తన నాటకంలో "గంభీరత" ఉంటుందని మురారి చెప్పుకొన్నా పేలవంగా నడిచింది. పాత్రలన్నీ "స్టీరియో టైప్‌గా టైలర్ మేడ్ షర్ట్‌లు"గా ఉన్నాయి. ఉబ్బెయ్యటం ఉత్ప్రేక్షల్తో ఆకాశానికి ఎగరేయటంతో నేలవిడిచిన సాము అయింది. జాంబవంత, జటాయువుల మధ్య జరిగిన సంభాషణలు మరీ చౌకబారు. రసవంతమైన, అర్ధవంతమైన, ఆలోచనాత్మకమైన సంభాషణలు కాగడా వేసి వెతికినా కనిపించటం కష్టం. కాని మురారి సంస్కృత భాషను వాడుకొన్న తీరు అద్భుతం అన్నారు. చెవికి ఇంపైన శబ్ద ప్రయోగాలు, తగిన ఛందో రీతులను వాడి మనసులనూ ఆకర్షిస్తాయి. ఈ నవ్యతకు అబ్బురపడ్డారు.

"అనేన రంభోరు భవన్ముఖేన తుషారా భానోస్ తులయా ధ్రతస్య – ఊనస్య నూనం ప్రతిపూర న్యాయ – తారా స్ఫురంతీప్రతిమాన ఖండా:" భావం – "త్రాసులో చంద్రుడిని పెట్టి తూస్తే, అందమైన ముఖం కల ఓ అమ్మాయీ! నీకు సాటిరాక తారల భారాన్నీ కలుపుకోవాల్సి వస్తోంది చంద్రుడికి". ఇలా కొన్ని మెరుపులు మెరిపిస్తాడు. మొత్తం మీద చూస్తే ఆహా అనలేం ఓహో అనలేం. కాళిదాస భవభూతుల కంటే మధ్యే మార్గం తృతీయ పంథా తొక్కి "అనర్ఘ రాఘవం" అంటే అతి విలువైన లేక విలువే కట్టలేనంత వీర శూర పరాక్రమ శీలుడైన శ్రీరాముని చరిత్రను నాటకంగా మలచిన మురారి మాత్రం కవిగా "అనర్ఘం" అనిపించుకోలేకపోయాడు.❀

33. వసంత తిలక వృత్త - రత్నాకరుడు (800 ad)

హర విజయం అనే మహాకావ్యం రాసిన రత్నాకరుడు కాశ్మీర దేశం కవి. బిప్పట జయాపీడుని ఆస్థానంలో ఉన్నాడు. తర్వాత అవంతి వర్మ రాజ్యంలోను ప్రసిద్ధి పొందాడు. కనుక కాలం క్రీ.శ.ఎనిమిది వందలుగా నిర్ణయించారు. 850-894 అనుకోవచ్చు. హర విజయంలో శివుడు అంధకాసురుడిని సంహరిచటం అనే కథ ఉంది ఇది యాభై సర్గల బృహత్ కావ్యం. శ్లోకాల సంఖ్య 4320.

కవితా రత్నాకరుడు (కవి సముద్రుడు)

రాజానక, వాగీశ్వర, విద్యాధిపతి బిరుదులున్న రత్నాకరుడు వసంత తిలక వృత్తానికి సృష్టికర్త. దీనిని క్షేమేంద్రుడు రాజశేఖరుడూ పేర్కొని మెచ్చారు. హర విజయంలో శివ పార్వతులు కామ కళాకేళిలో ఉండగా అంధుడైన అంధకాసురుడు జన్మించాడు. శివుడిని స్తుతించి కనుచూపు తెచ్చుకొన్నాడు. వరగర్వంతో విర్రవీగి మూడు లోకాలను కల్లోలపరచాడు. దేవతలు అందకుని ఆగడాలు భరించలేక, ఈశ్వరుని ప్రార్థిస్తే వాడిని సంహరించటమే కథ. యాభై సర్గలున్న ఈ కావ్యంలో మొదటి పదమూడు సర్గలలో శివుడు అంధకాసురుడిని సంహారం చేయటానికే చేసే మంత్రాంగమే వర్ణించాడు కవి. తర్వాత ఏడు సర్గలలో శివుడికి అంధకాసురుడికి మధ్య సంవాదం ఉంటుంది. సన్నివేశాలు సంవాదాలు బాగా పెంచి రాసిన కావ్యం ఇది.

రత్నాకరుడు సకల శాస్త్ర రత్నాకరుడు. అతనికి ప్రవేశం లేని విద్య లేదు. పురాణ, ఇతిహాస, నాట్య, సంగీత, నీతి, వేదాంత, కామశాస్త్ర, అలంకారాది శాస్త్రాలలో నిష్ణాతుడు. దీనికి మించి చిత్రకావ్య రచనా సమర్థుడు. మహా కావ్య లక్షణాలన్నీ హర విజయంలో చొప్పించాడు. తన కావ్య మర్మాన్ని రత్నాకరుడే - "లలిత మధురాః సాలంకారాః ప్రసాద మనోహరాః - వికట యమక శ్లేషోద్గార ప్రబంధ నిరర్గలా:" ఇన్ని కవితా లక్షణాలతో తన హర విజయం మనోహర

విజయం సాధించిందని చెప్పాడన్న మాట. ప్రతి సర్గ చివర "రత్న" అనే శబ్దాన్ని వాడాడు. దీనికి స్ఫూర్తి భారవి వాడుకొన్న "లక్ష్మి, మాఘుడు ప్రయోగించిన శ్రీహర్షుడు ఉపయోగించిన "ఆనంద" శబ్దాలే రత్నాకరుడి కావ్య "చంద్రార్ధ చూడ చరితాశ్రయ చారు" సుందరం అని తానే చెప్పుకొన్నాడు.

డేవిడ్ స్మిత్ ఈ కావ్యంలో మత విషయాలతో బాటు సింబాలిజం కూడా ఉందన్నాడు. భారతీయ సంస్కృతిని కావ్యంలో ప్రతిబింబింపజేశాడనీ చెప్పాడు. సంప్రదాయ అలంకారికులను విమర్శస్తూ చెప్పిన గ్రంధమనీ అన్నాడు. రాజాస్థాన విధానాలు, సమాజ వ్యవహారాలూ ఇందులో పొందుపరచాడని తెలియజేశాడు. హర విజయాన్ని పండిట్ దుర్గాప్రసాద్, కాశీనాథ్ పాండురంగ పరబ్‌లు ఆంగ్లంలోకి అనువదించి ప్రచురించారు. పుర, నగర, పర్వత, సముద్ర, వన, సూర్యాస్తమయ, అస్తమయ యుద్ధ, ఋతు వర్ణాలతో కావ్యం సర్వాంగ సుందరంగా ఉంటుంది. కధ కంటే కధన వర్ణన విధానం బాగా ఆకర్షిస్తుంది. భారవి కిరాతార్జునీయాన్ని మాఘుడి శిశుపాల వధ కావ్యాలను మించిన కవితా సౌందర్యం ఇందులో ఉన్నది. ❁

34. ఆశ్చర్య చూడామణి నాటకకర్త - శక్తి భద్రుడు (800 ad)

క్రీ.శ. ఎనిమిది వందల వాడైన శక్తి భద్రుడు శంకరాచార్యుల వారి శిష్యుడంటారు. భద్రుడు రాసిన "ఆశ్చర్య చూడామణి" సంస్కృత నాటకం విస్తృత ప్రచారమైనది. అవి తాను దక్షిణా పథం వాడినని చెప్పుకొన్నాడు. కేరళ దేశం వాడేమోనని అనుమానం.

భద్రుడి కవితా శక్తి

ఆశ్చర్య చూడామణి ఏడు అంకాలున్న నాటకం. రామాయణ కథ ఇతివృత్తం. వాల్మీక కథలో ఆశ్చర్యకర సంఘటనలను చేర్చి పరమాశ్చర్యం కలిగించే నాటకం రాశాడు. అద్భుత రసానికి ఆలవాలంగా ఉన్న నాటకం. రాముడు లంకలో ఉన్న సీతకు హనుమంతుని ద్వారా పంపిన అంగుళీయకం, సీత రామునికి మారుతి ద్వారా పంపించ చూడామణి రెండు అద్భుత మహిమలు కలవిగా ఇందులో కనిపిస్తాయి. రావణుడు రాముని వేషం వేసుకొని వచ్చి సీతను ఎత్తుకొని పోయినట్లుగా కల్పనా చేశాడు. పంచవటితో నాటక కథ మొదలవుతుంది. సీత అగ్ని పరీక్షతో ముగుస్తుంది.

మహర్షులు సీత దేవికి ఒక చూడామణిని కానుకగా ఇస్తారు. మాయలేడి రూపంలో వచ్చిన మారీచుడిని తరుముతూ రాముడు వెళ్ళగా ఇక్కడ పంచవటిలో శూర్పణఖ సీత వేషంలో ఉంటుంది. గాయపడ్డ మారీచుడు రాముడి వేషంలో

వస్తాడు. నిజమైన రాముడు వాడిని కాలితో తనంగా మారీచుడు మరణిస్తాడు. అప్పుడు శూర్పణఖ నిజ రాక్షస రూపం పొందుతుంది. ఈ నాటకంలో చూడామణి అన్ని అద్భుతాలూ చేయటం విశేషం. చూడామణియే హీరో లేక హీరోయిన్.

శక్తి భద్రుడి కవిత్వం సరళంగా సుబోధకంగా ఉంటుంది. ప్రసాద మాధుర్యంతో వైదర్భీ రీతిలో శక్తి భద్రుడు రాశాడు. భవభూతి రామనాటకం తర్వాత ఆశ్చర్య చూడామణి ప్రదర్శన యోగ్యంగా ఉంది. భద్రుడు ఉన్మాద వాసవదత్త, వీణా వాసవదత్త నాటకాలు రాశాడని అంటారు కాని అలభ్యాలు. కేరళ సంస్కృత నాటకకర్తలలో శక్తి భద్రుడు మొట్ట మొదటివాడు.

భాసుడి ప్రతిమా, అభిషేక నాటకాలు శక్తి భద్రుడే రాశాడని కొందరు, ప్రతిజ్ఞా యౌగంధ రాయణం నాటకమూ శక్తి భద్రుడిదే అని మరికొందరు అంటారు. అంతటి కవితా శక్తి ఉన్నవాడన్న మాట. ఆశ్చర్య చూడామణి నాటకం ఆధారంగా కేరళలో కావాలం నారాయణ ఫణిక్కర్ “మాయా” అనే నాటకం రాశాడు. ఇందులో రావణుడు సీతను మాయా వేషంలో ఎత్తుకుపోవటమే ప్రధానంగా ఉంది. శ్రీరామునిలోని మానవత్వాన్ని వెలికి తీయటమే తన నాటక ముఖ్యోద్దేశం అన్నాడు పణిక్కర్.

ఈ నాటకంలోని అంకాలను శక్తి భద్రుడు శూర్పణఖాంకం, జటాయు వధం, అశోక వనికాంకం, అంగుళీయకాంకం మొదలైన పేర్లు పెట్టాడు. కేరళలో “మార్గి”కు మార్గదర్శకుడైన డి. అప్ప కూటనాయర్ గురు అమ్మన్నూర్ మాధవ చక్యార్‌ను ఒప్పించి ఆశ్చర్య చూడామణికి కేరళ సంప్రదాయంలో మూడు అంకాల నాటకంగా మలిచి అనేక ప్రదర్శనలిచ్చాడు.❀

35. సూత్ర పద్ధతిలో అలంకార గ్రంథం రాసి కావ్యాత్మను చెప్పిన - వామనుడు (700–800 ad)

ఇప్పటి వరకు మనం చెప్పుకొన్న అలంకారికులు తమ గ్రంథాలను పద్యాలకారికల్లో రాస్తే వామనుడు మాత్రం సూత్ర పద్ధతిలో అలంకార గ్రంథం రాశాడు. ఈయనా ఉద్భటుడిలాగే కాశ్మీర రాజు జయాపీడుని ఆస్థాన కవే కాకుండా మంత్రి కూడా. ఇతని అలంకార గ్రంథం పేరు "కావ్యాలంకార సూత్ర వృత్తి". ఏదైనా సూత్రాలుగా చెబితేనే అది శాస్త్రం అవుతుందని నమ్మి అలా రాశాడని భావిస్తారు. ఈ గ్రంథంలో మూడు వందల పందొమ్మిది సూత్రాలు ఉన్నాయి. అయిదు అధికరణాల్లో, పన్నెండు అధ్యాయాలుగా రచించాడు. తన సూత్రాలకు అర్థాలను కూడా వామనుడే రాసుకొన్నాడు. అదొక ప్రత్యేకత. సూత్రాలను వివరించే వాటికి "వృత్తి" అని పేరు పెట్టాడు. ఇతనికి ముందున్న అలంకారికులు లక్షణాలకు ఉదాహరణలను తమ స్వంత కావ్యాల నుంచే ఇచ్చారు. కాని దీనికి భిన్నంగా వామనుడు ఇతర కవుల కావ్యాల నుంచి ఉదాహరణలు సేకరించి అందజేసి, తన సిద్ధాంత వ్యాప్తి చేసుకొన్నాడు. ఇదీ రెండో ప్రత్యేకత.

వామన విశ్వరూపం

వామనుడు రాసిన కావ్యాలంకార సూత్ర వృత్తిలో కావ్య పరిభాష, కావ్య

ప్రయోజనం, కావ్య హేతువులు, కావ్య రీతులు, కావ్య అంగాల నిరూపణ చేశాడు. రెండు మూడు నాలుగుల్లో దోష, గుణ, అలంకార నిరూపణ చేశాడు. అయిదులో శబ్ద శుద్ధి గురించి చెప్పాడు. ఇది భామహహుని కావ్యాలంకారంలోని చివరి పరిచ్ఛేదాన్ని తలపింపజేస్తుంది. ముప్ఫై మూడు అలంకారాలను వామనుడు చెప్పాడు. అందులో వక్రోక్తికి, వ్యాజోక్తికి ఎక్కువ ప్రాముఖ్యాన్నిచ్చాడు.

కావ్యం యొక్క "ఆత్మ"ను గురించి మొదట చెప్పినవాడు వామనుడే. అతను అన్నమాట "రీతి రాత్మా కావ్యస్య" అనేది అందరికి నోట నానిన సూత్రమే. అంటే కావ్యానికి ప్రాణం రీతి. అది ఆత్మవంటిది అన్నాడు. "కావ్య శోభాకరాన్ ధర్మాలంకారాన్ ప్రచక్షతే" అని దండి అభిప్రాయపడ్డాడు. కాని వామనుడు కావ్య శోభ గుణాల వలననే కలుగుతుందని చెప్పాడు. అదే "కావ్య శోభాయాః కర్తారో ధర్మా గుణాః" అని సూత్రీకరించాడు ఖచ్చితంగా. గుణాల వలననే కావ్యానికి సౌందర్యం కలుగుతుందని, ఆ సౌందర్యాన్ని ఇనుమడింపజేసేది అలంకారం అని స్పష్టంగా చెప్పాడు. అలంకారాలు లేకపోయినా కావ్యం యొక్క సహజ సౌందర్యానికి ఏ విధమైన లోపమూ రాదనీ వామన మతం. వ్యక్తి గుణాల వల్ల ఆత్మ సౌందర్యం పొందినట్లుగానే, కావ్యానికి కూడా సౌందర్యం గుణాల వల్ల ఏర్పడుతుంది అన్నాడు. కనుక వామనుడు "సౌందర్య వాది" అని పిలవబడ్డాడు.

వామన, ఉద్భట అలంకారికులిద్దరూ ఒకే రాజాస్థానంలో ఉన్నారు. కాని ఒకరు రాసిన దానిలో రెండవ వారిని పేర్కొనకపోవటమే అమిత ఆశ్చర్యం కలిగిస్తోందని విశ్లేషకులు అంటారు. ఇద్దరివి భిన్న మార్గాలు అని కూడా మనకు తెలిసిన విషయమే. ఉద్భటుడు భామహుని అనుసరిస్తే, వామనుడు దండిని అనుసరించి రీతి సిద్ధాంత కర్త అయ్యాడు. దండి కావ్యాన్ని వ్యక్తితో పోల్చగా వామనుడు వ్యక్తికి ఆత్మ ఉన్నట్లు కావ్యానికీ ఆత్మ ఉంటుంది అన్నాడు. కాశిక రాసిన వామనుడు, కావ్యాలంకార సూత్ర వృత్తికర్త వామనుడు ఒకరే అని పండితుడు పి.వి.కాణే నిర్ణయిస్తే, బూల్హర్ పరిశోధకుడూ దాన్ని సమర్ధించాడు. వామనుడు రీతి అంటే శైలి కావ్యానికి ఆత్మ అన్నాడు. పాంచాలి రీతి మాధుర్యంగా ఉంటుందని, గౌడీ రీతిలో వేగం, శక్తి ఉంటాయని వైదర్భీ రీతిలో ఇవన్నీ సమపాళ్ళలో కలిసి

ఉంటాయని చెప్పాడు.

వామనుడు మహా మేధావిగా పరిగణింపబడ్డాడు. "కావ్యం గ్రాహ్యా మాలాన్కారాత్ - సౌందర్య మాలకారః" అని తన గ్రంధాన్ని ప్రారంభించాడు. అలంకారం అంటే సౌందర్యమేనన్నాడు. "కావ్య శోభాకారాణ్ ధర్మన్ అలంకారాన్ ప్రచక్షతే" అని దండి అంటే-వామనుడు "కావ్యా శోభయా కర్తారో ధార్మః గుణాః - తదతిస్య హీత్వా: - అలంకారః" అన్నాడు. సహజ సౌందర్యం గుణాల వలన, కృత్రిమ సౌందర్యం అలంకారాల వలన లభిస్తుందని గుణాలకే ఎక్కువ మార్కులు వేశాడు. గుణాలు చక్కని బంధాన్ని ఏర్పరుస్తాయన్నాడు. "ఓజః ప్రసాద శ్లేష సమతా సమాధి మాధుర్య సౌకుమార్య క్ష ఉదారతా అర్ధ వ్యక్తీ కాంతయో బంధుగుణాః" అలాగే "విశిష్ట పద రచన రీతి - విశిష్ట గుణాత్మా" అని అన్నాడు. పదరచన విశిష్టంగా ఉంటే నిర్మాణం బాగుంటుంది. కానీ రీతి ఆత్మ విశిష్ట పద రచన వ్యంజకం అయితే రీతి వ్యంగ్యం అని వివరించాడు. విశిష్ట పదరచనతో రీతి పుష్టి చెంది అలౌకిక సౌందర్యాన్నిస్తుందని భావం. పాకం క్వాపి వైదర్భ రీతౌ సహృదయ హృదయాననం - రంజకః కూపీ పాకః" అని అన్నాడు రీతిని పాకాన్ని ఎలా సరిగ్గా నిర్వచింపలేమో అలానే కూపీ పాకం కూడా అనిర్వచనీయం అన్నారు. శబ్ద పాకం, అర్ధ పాకం సమపాళ్ళలో సంయోజనం చెందితే సహృదయ రంజకం జరుగుతుందని భావం.❁



36. ధ్వన్యాలోక కర్త - ఆనంద వర్ధనుడు (855 ad)

ఆనంద వర్ధనుడు అనగానే "ధ్వని సిద్ధాంతం" జ్ఞాపకం వస్తుంది. ధ్వని సిద్ధాంతంపై విపులమైన చర్చ చేసి ధ్వన్యాలోకం లేక "కావ్యాలోకం" అనే అలంకార శాస్త్రాన్ని రాసిన వాడు ఆనందవర్ధనుడు. ఇది అలంకార శాస్త్రంలో ఒక కుదుపు కుదిపి కొత్త మలుపుకు తిప్పింది. క్రీ.శ.8585-883 వాడిన ఈ అలంకారికుడు కాశ్మీర రాజు అవంతివర్మ ఆస్థానపండితుడు. ఆనంద వర్ధనుడు ఒక యుగకర్త అయ్యాడు. ధ్వని యొక్క ప్రకాశమే ధ్వన్యాలోకం. ధ్వని అనే కాంతి దర్శనమే ధ్వన్యాలోకం. సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు దీనికి తెలుగులో విపులమైన వ్యాఖ్య రాశారు. ఆంగ్లంలో జెఫ్రీ మౌసఫ్, మాసన్ పట్వర్ధన్‌లు అభినవ గుప్తుని లోచన వ్యాఖ్య ఆధారంగా అనువదిస్తే హార్వర్డ్ యూనివర్సిటి ప్రెస్ 1990లో ప్రచురించింది. బిద్యుత్ భరన్ ఘోష్ చేసిన వ్యాఖ్యానాన్నా సాంస్క్రిట్ పుస్తక భాండార్ వారు ముద్రించారు.

ఆనంద వర్ధనీయం

ధ్వన్యాలోకంలో నూట ఇరవై తొమ్మిది కారికలున్నాయి. వీటిని ధ్వని కారికలు అన్నాడు. ఈ కారికలకు రాసిన వృత్తినే ధ్వన్యాలోకం అంటారు. ధ్వని యొక్క ఆలోకనం అన్న మాట. దీనికి నూటయాభై ఏళ్ళ తర్వాత అభినవ గుప్తుడు

"లోచనం" అనే మహా గొప్ప వ్యాఖ్య రాశాడు. కావ్య ప్రారంభంలో ఆనంద వర్ధనుడు పూర్వ అలంకారికులు కావ్యాత్మనే ధ్వని అన్నారు. కొందరు కాదన్నారు. కొందరు లక్షణాంతర్గతం అన్నారు. కొందరు అది గోచరించదు అన్నారు. "నేను ఇప్పుడు సహృదయుల సంతృప్తి కోసం ధ్వని తత్వాన్ని వివరిస్తున్నాను" అని చెప్పుకొన్నాడు. కాని కొందరు దేశీయ కొందరు విదేశీయ పండితులు ధ్వన్యాలోకం ఆనంద వర్ధనుడు రాయలేదన్నారు. అంతకు ముందే ధ్వని ఉందన్నారు.

"ధ్వనినా గతి గభీరేణ కావ్య నివేశినా – ఆనందర్ధన: కస్య నాసీ దానంద వర్ధన:" అన్నదాన్ని బట్టి సందేహ నివృత్తి కలుగుతోంది. దీని భావం – "అతి గంభీరమైన కావ్య తత్వ పరిపుష్టమైన ధ్వని యొక్క స్వరూప స్వభావాలను నిరూపించటం చేత ఆనంద వర్ధనుడు ఎవరికి ఆనంద వర్ధనుడు కాదు?" అలాగే ఇంకొక శ్లోకంలో ఉన్నదాన్ని బట్టి –

"సత్కావ్య తత్వ విషయం స్ఫురిత ప్రసుప్త – కల్పం మనస్సు పరిపక్వ దియాం యదాసీత్

తద్వ్యాకరో త్సహృదాయో దయ లాభ హేతో – రానంద వర్ధన ఇతి ప్రథితాభి దానః" – అంటే "పరిపక్వమైన బుద్ధి కల విపశ్చిత్తుల మనస్సులలో స్ఫురించి, సుప్తావస్తలో ఉన్న కావ్య తత్వాన్ని సహృదయుల ఆనందానికి సహృదయుడు వ్యాఖ్యానించి చెప్పాడు". కనుక ఆనంద వర్ధనుడికి పూర్వమే "కావ్యాత్మ ధ్వని" అని ఉన్నాదని, దాన్ని నిరూపించి పండితులను అంగీకరించేట్లు వ్యాఖ్యానించాడని భావం. కాణే, ఎస్.కే.డే, వింటర్ నిత్స్ పండితులు కారికలు రాసింది "సహృదయ" అనే పేరుగల వాడన్నారు. ఈ కారికలు ఆనంద వర్ధనుడికి పూర్వమే నూట యాభై ఏళ్ళ కిందటనే ఉన్నాయన్నాడు డే. మొత్తం మీద మనకు తెలిసింది ఏమిటి అంటే అప్పటికే వ్యాప్తిలో ఉన్న ధ్వనిని సిద్ధాంతీకరించి వృత్తి రాసి ప్రచారంలోకి తెచ్చినవాడు ఆనంద వర్ధనుడు అనుకొంటే ఏ ఇబ్బందీ ఉండదు ఎవరితోనూ.

ధ్వన్యాలోక అవ్యక్త ధ్వని

ధ్వన్యాలోకంలో నాలుగు ఉద్యోతాలున్నాయి. మొదటి దానిలో ప్రాచీన

అలంకారికులు ధ్వనిని గురించి ఏమేమి చెప్పారో వాటిని గురించి వాటిపై వచ్చిన ఖండనల గురించి చెప్పి ధ్వని స్వరూపాన్ని ధ్వని భేదాలను, గుణీ భూత వ్యంగ్యాన్ని తర్క భూమికపై వ్యాఖ్యానించాడు. తర్వాత ధ్వని నిరూపణ ప్రయోజనాన్ని వివరించాడు. అభినవ గుప్తుడు లోచన వ్యాఖ్యానం రాశాడని చెప్పుకొన్నాం. అతడు "చంద్రిక" అనే వ్యాఖ్యానాన్ని గురించి చెప్పి లోచనం లేకపోతే చంద్రిక ఉన్నా "ఆలోకం" కనపడదని చమత్కరించాడు. వర్ధనుడు తన రచనలైన దేవీశతకం, అర్జున చరిత్ర మహాకావ్యం, విషమ బాణ లీల, హర విజయం నుంచే లక్షణాలకు ఉదాహరణలు ఇచ్చాడు. ఇందులో దేవీ శతకం ఒక్కటే లభ్యం. విషమ బాణ లీల, హర విజయాలు ప్రాకృత భాషలో రాశాడు.

ఇంతకీ ధ్వని అంటే ఏమిటి? కావ్యంలో వాచ్య లక్ష్యార్ధాలకంటే వేరైనది. ఒకటి అంతరార్ధంగా భాసిస్తుంది. దాన్ని వ్యంగ్యార్ధం అని అంటారని అదే ధ్వని అని ఆనంద వర్ధనుడు నిర్వచించాడు. ధ్వని వాచ్య, లక్షణార్ధాలకంటే చమత్కార రంజకమై ఆనందాన్నిస్తుంది. ధ్వని రమణీయకత్వం సహృదయ వేద్యం. ఇది స్త్రీల అలంకారాల కంటే భిన్నంగా ఉండే లావణ్యం లాంటిది.

"ప్రతీయమాన పునరన్య దేవా – వస్త్వ్యస్తి వాణీషు మహా కవీనాం
యత్తత్ ప్రసిద్ధావయ వతి రిక్తం – విభాతి లావణ్య మివ అంగనాసు"

"గంట కొడితే వచ్చే చెవులు భరించలేని టంకార ధ్వనికంటే దాని ఝుంకార ప్రతిధ్వని ఆహ్లాదం కలిగించినట్లుగా, గుణ, అలంకారాదుల కంటే రమణీయమైన ప్రతీయమానమైన అర్ధం సహృదయ జనాలకు ఆకర్షణీయం అవుతుంది. అదే ధ్వని" అని గంటకొట్టి ధ్వని సిద్ధాంతంలోని రహస్యాన్ని చెప్పాడు. ధ్వనియే కావ్యాత్మ అన్నాడు. ధ్వని లక్ష్య అర్ధాలలో దొరకని, దాన్ని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదని వారి అభిప్రాయాలను ఖండించాడు. తర్క, పాండిత్య ఆధారాలుగా ధ్వని సిద్ధాంతాన్ని స్థాపించాడు. ధ్వనిలో ఉన్న అతి సూక్ష్మమైన భేదాలను వివరించటంలో అతను తీసుకొన్న మార్గం మహా విశిష్టమైంది. ఉదాహరణలు లేకుండా ఏదీ చెప్పలేదు. ధ్వనిలో అభిదా మూల ధ్వని, లక్షణామూల ధ్వని అని ధ్వనిలో రెండు భేదాలను వివరించాడు. భరతుని రస సిద్ధాంతమే రస ధ్వని

శ్రవ్య కావ్యాలకు అన్వయించబడింది. వ్యంగ్యార్థం అనే ముసుగు వేసుకొన్న రస సిద్ధాంతమే ధ్వని సిద్ధాంతం అనిపిస్తుంది. రసభావ సమన్వితమైన కావ్యాన్నే ఉత్తమ కావ్యం అన్నాడు. అలంకార రచన ఉత్తమ కావ్యం అనిపించుకోదు అని స్పష్టంగా చెప్పాడు ఆనందవర్ధనుడు.

ఎంతటి వాడికైనా సమకాలీనులు అడ్డు తగలటం సర్వ సామాన్యం. ఇది ఆనందవర్ధనుడికీ తప్పలేదు. మొదట్లో పండితులు ధ్వని సిద్ధాంతాన్ని చూసి పెదవి విరిచారు. కాని కాలం గడిచిన కొద్దీ కావ్య సిద్ధాంతాలలో ధ్వని సిద్ధాంతమే ఉత్తమోత్తమైందని తెలుసుకొన్నారు. వ్యాప్తి, ప్రచారమూ చేసి నెత్తి కెత్తుకొన్నారు అందరూ. ఒక రకంగా అప్పటి వరకు ఉన్న భామ:హ దండిల అలంకార వాదం, వామనుడి రీతి వాదం వరకు అన్నిటి సమన్వయ పరచిన గొప్ప అలంకారికుడు ఆనందవర్ధనుడు. మౌలిక త్క సిద్ధాంత శైలిని ఎన్నుకొని ఎదురు లేని మొనగాడు అనిపించుకొన్నాడు. "ధ్వని ధ్వని అని లోకం చెవుల్లో మారుమోగేట్లు" చేసిన వాడు ఆనంద వర్ధనాచార్యుడు.

"కావ్యాత్మ స ఏవార్థః తథాచాది కవేః పురా – క్రౌంచ ద్వంద్వ వియోగోత్థః శోక శ్లోకత్వ మాగతః" అని మొదటోల్నఏ ఆనంద వర్ధనుడు అన్నాడు. కావ్య సృష్టి ఎలాంటిదో కావ్యాన్ని అర్థం చేసుకొని అభినందించటమూ అంత గొప్ప అన్నాడు ఆనందవర్ధనుడు. "The unexpressed is not understood by those who only know grammar and lexicon but only by men of taste and literary instinct who know the essence of poetry. It is the province of the sahridaya, the connosseur who is expert in discerning through the intricate meshes of veiled word and sense into the aesthetic relish of deeper significance. The aesthetic emotion is transfered only when there is ideal re-awakening of it in the reader. Ananda vardhana clearly states that appreciation of poetry is essentially the same as the creation of it. "Aesthetic consciousness has no end outside of itself. Aesthetics experience charactarised by the immersion of the subject in the aesthetic object is akin to the be atitude of ecstacy or the Brahman or Self" అని డా. కే. సుబ్రహ్మణ్యం ధ్వని సిద్ధాంతంపై చక్కని వ్యాఖ్య చేశారు.❁

37. బాల కవి - రాజశేఖరుడు (860-940 ad)

బాల్యంలోనే కవిత్వంలో అమోఘమైన ప్రతిభ చూపి "బాలకవి" అనే బిరుదు పొందిన రాజశేఖరుడు కనోజు పాలకుడు ఘూర్జర రాజు ప్రతీహార వంశస్తుడు మహేంద్ర పాలరాజు ఆస్థానంలో విద్యా గురువు. అతని కొడుకు మహీపాలుని వద్ద, కేయూర వర్షుని ఆస్థానంలోను గౌరవ పదవులలో రాణించాడు. కనుక కాలం క్రీ.శ.860-940గా నిర్ణయించారు. పండిత వంశంలో జన్మించిన ఇతని తండ్రి దుర్దకుడు స్వీయ ప్రతిభతో మంత్రి అయ్యాడు. తల్లి శీలవతి. ముత్తాత అకాల జలదుడు కూడా గొప్ప కవి. ఇతన్ని మాయవర కుల సంజాతుడని అంటారు. ఈ కులం బ్రాహ్మణ క్షత్రియ రెండు కులాల్లోనూ ఉందట. క్షత్రియుడేనని అందుకే చౌహాన్ క్షత్రియ కులానికి చెందిన అవంతీ సుందరిని పెళ్లి చేసుకొన్నాడని వాదించేవారూ ఉన్నారు. ఇది నిజం కాదని బ్రాహ్మణ కుల సంజాతుడేనని మెజార్టీ నమ్మకం. అవంతీ సుందరి గొప్ప పండితురాలు, విదుషీమణి కాబట్టే, రాజశేఖరుడు కులాంతర వివాహం చేసుకొన్నాడని అది ఆనాటి సంఘంలో ఉన్న ఆచారమేనని సమర్ధిస్తారు. ఆమె ప్రేరణ అతనికి బహువిధాల తోడ్పడిందని అనుకోవచ్చు. ఆనాటి చాలా రాజ్యాలతో రాజులతో అతనికి పరిచయాలున్నాయి. జీవిత చరమాంకాన్ని కాశీలో గడిపినట్లు తెలుస్తోంది. ప్రతీహార వంశం రాష్ట్రకూట రాజు ఇంద్రుని చేతిలో నశించింది. అప్పుడు రాజశేఖరుడు త్రిపురకు వెళ్లి అక్కడ కాలచూరి రాజు కేయూర వర్షుని ఆస్థానం చేరాడు. శేఖరుడు పండిత కవి. అనేక రచనలు చేశాడు.

కవితా రాజశేఖరం

త్రిపురలో "విద్ధసాల భంజిక" నాటకాన్ని రాజశేఖరుడు రాశాడు. అక్కడే "కావ్య మీమాంస" అనే అలంకార గ్రంధాన్నీ రచించాడు. పాండిత్యం కవిత్వాలతో రాజుల మెప్పు పొంది అనేక ఘన సన్మానాలు అందుకొన్నాడు. అతని సమకాలీన కవుల కృష్ణ శంకర వర్మ, అపరాజితుడు మొదలైన వారు శేఖరుని గొప్పతనాన్ని గుర్తించి కొనియాడారు. సాహిత్య కళలతోబాటు సాంస్కృతిక, ధార్మిక విషయాలూ బాగా తెలిసినవాడు. ఆకాలంలో మహిళా కవులైన భట్టారిక, సుభద్రలను మెచ్చుకొన్నాడు. స్త్రీ వలన సాహిత్య ప్రాచుర్యం పొందిన మొదటికవి రాజశేఖరుడు. ఎంత పాండిత్యం ఉన్నా హద్దుల్లో ఉండి సాటివారి యెడ గౌరవాదరాలు కలిగి ఉన్న సంస్కారి. ఇతరుల అభిప్రాయాలకు విలువ నిచ్చిన ప్రజాస్వామ్యవాది.

రాజశేఖరుడు ఆరు కృతులను రచించాడని "నః షట్ ప్రబంధాన్" అని తన రామాయణ నాటక ప్రస్తావనలో తెలిపిన దాన్నిబట్టి తెలుస్తోంది. కాని అయిదు రచనలే లభ్యం. అందులో నాలుగు నాటకాలు – అవి బాల రామాయణం, బాల మహాభారతం, కర్పూర మంజరి, విద్ధసాల భంజిక. అయిదవది అలవకార గ్రంధం అయిన "కావ్య మీమాంస". భువన కోశం కూడా రాశానని చెప్పాడు కాని దొరకలేదు.

బాల రామాయణ నాటకంలో "తాను వాల్మీకి అవతారాన్ని" అని రాజశేఖరుడు చెప్పుకొన్నాడు. సీతా స్వయంవరంతో ప్రారంభమై రాముడు అయోధ్యకు తిరిగి వచ్చేదాకా కధ నడుస్తుంది. పది అంకాలున్న నాటకం. కనుకనే మహా నాటకం అన్నారు. ప్రతి అంకానికి ప్రత్యేకమైన పేరు పెట్టి కొత్త దారి చూపాడు. అవే – ప్రతిజ్ఞా పౌలస్త్యం, రామ రావణీయం, విలక్ష లంకేశ్వరం, భార్గవ భంగం, ఉన్మత్త దశాననం, నిర్దోష దశరధం, అసమా పరాక్రమం, వీర విలాసం, రావణ వధ, సానంద రాఘవం" ఈ పేర్లు చక్కగా ఆ అంకంలోని కధకు గొప్ప వివరణగా ఉంది. నాటకానికి అవసరమైన మార్పులు చేశాడు. రావణ విరహానికి ప్రాముఖ్యం ఇచ్చాడు. మన యెన్.టి.రామారావు లాగా రావణుడి మీద సానుభూతి పెరిగేట్లు చేశాడు. కధలో గమనంలో సన్నివేశాలలో. నాటకంలో

కళా దృష్టి పూజ్యం. బాపుగారి శ్రీరామ రాజ్యంలాగా సర్వం పూజ్యం అనిపిస్తుంది. కల్పనలకు ఎక్కువ విలువ పొందాడు.

బాల భారత నాటకంకు "ప్రచండ పాండవం" అనే పేరు కూడా ఉంది. రెండు అంకాలే లభించిన అసంపూర్తి నాటకం. ఇందులో ద్రౌపదీ స్వయంవరం, జూదం, వస్త్రాపహరణం ఉన్నాయి. కర్పూర మంజరి నాటకం "సట్టకం" అనే రూపక భేదానికి చెందింది. నృత్య ప్రధానమైంది. భార్య అవంతీ సుందరి ముద్దు కోరిక తీర్చటానికే రాశాడు. మొదటి అంకంలో వసంతోత్సవ వేడుకలు, చంద్రపాల రాజు, రాణి విభ్రమ లేఖ, విదూషక రంగ ప్రవేశం ఉంటాయి. విదూషకుడికి పనిచారిక విచక్షణకు వసంత వర్ణనలో పోటీ ఏర్పడి కోపం వచ్చి భైరవానందుడు అనే సిద్ధుని తెస్తాడు విదూషకుడు. సిద్ధుడు మాయాజాలాన్ని చూపించి కర్పూర మంజరిని పరిచయం చేస్తాడు. రాజు ఆమెపై మరులుగొంటాడు. ఆమె రాణికి పిన్ని కూతురే. రెండవ రంగంలో మంజరి రాజును ప్రేమిస్తుంది. దూతిక ద్వారా తెలియజేస్తుంది. రాజు మంజరిని చూస్తాడు. మూడవ అంకంలో మంజరి రాజుకు కలలో కన్పించిన విషయాన్ని విదూషకుడికి చెప్పటం విరహ వేదనతో మంజరి వచ్చి రాజును కలవటం, ఈ వార్తా రాణి చెవిన పడటం వున్నాయి. నాలుగులో రాణి మంజరిని నిర్బంధంలో ఉంచటం సిద్ధుడికి కానుకగా ధనసార మంజరితో పెళ్లి చేయిస్తాననటం వార్త రాజుకు చేరవేయటం చివరికి ధనసార మంజరే కర్పూర మంజరి అని తేలటం ఇద్దరికీ వివాహం జరగటంతో సమాప్తం. ఈ నాటకం రాజశేఖరుని నాటకాలలో గొప్పదని అభిప్రాయం. నాటక కళకు కవితా శోభ అద్దాడు. రీతి భేదం చూపి రక్తి కట్టించాడు. విదూషకుడు హుందాగా మాట్లాడటం ప్రత్యేకత. "శౌరసేని ప్రాకృతాన్ని" వాడి, కొత్తదారి తొక్కాడు.

విద్ధ సాల భంజిక కూడా పై నాటకం లాంటిదే. "నాటిక" అనే రూపక భేదానికి చెందింది. మొదటి అంకంలో రాజా చంద్రవర్మ కూతురు "మృగాంక వతి"ని "మృగాంక వర్మ" అనే పేరుతో "కొడుకుగా" ప్రకటించటం, ఆ వేషంలో ఆమె విద్యాధర మల్లుని రాణి దగ్గరకు చేరటం అతని మంత్రికి ఈ రహస్యం తెలిసిపోవటం, ఆమెను పెళ్లి చేసుకొన్న వాడు చక్రవర్తి అవుతాడని జ్యోతిష్కులు

చెప్పటం, రాజు దగ్గరే ఆమెను ఉంచటం. ఒకసారి విద్యాధర మల్లుడికి ఆమె ముక్తాహారాన్ని విసిరిపోయినట్లు కల వచ్చి విదూషకుడికి చెబితే స్వప్నంలో చూసిన సుందరి బొమ్మను (విద్ధ సాల భంజిక) చిత్రశాలలో ప్రతిష్టించటం అప్పుడు మృగాంక వర్మ రావటం, రాజుకు ఆమె స్త్రీ అని తెలియకపోవటంతో మొదటి అంకం పూర్తి. రెండవ అంకంలో కుంతల రాకుమారి కువలయ మాలతో మృగాంక వర్మ వివాహం జరిపించటానికి రాణి ఆలోచించటం. ఒకరోజు నిజరూపంలో ఉద్యానవనంలో విహరిస్తున్న ఆమెను రాజు చూడటం ఉంటుంది. మూడులో రాజు మృగాంకవతిని కలుసుకొంటాడు. ఇద్దరూ ప్రేమ బద్ధులౌతారు. నాలుగవ అంకంలో రాణికి ఈర్ష్య ఏర్పడి మృగాంక వర్మ పెళ్లి చేసేస్తుంది. ఇంతలో చంద్రవర్మకు కొడుకు పుడతాడు. పుత్రవేషంలో ఉన్న కూతురును రాజుకిచ్చి పెళ్లి చేయాలనుకొంటాడు. చివరికి రాణి ఏమీ చేయలేక మృగాంకవతి బాటు కువలయ మాలను కూడా రాజుకిచ్చి పెళ్లి చేస్తుంది.

కథా సన్నివేశాలు బహు చమత్కారంగా తీర్చాడు. నాటకీయత లోపించి రక్తి కట్టలేదు. దీనిపై మాళవికాగ్ని మిత్ర, రత్నావళి నాటక ప్రభావం బాగా ఉందనిపిస్తుంది. కవిత్వపరంగా హిట్టే, నాటక కళ పరంగా ఫట్టే. ఇందులో సమకాలీన సామాజిక చరిత్ర ఉందని ఆనాటి ప్రజల మనోభావాలకు నిలువుటద్దమనీ భావిస్తారు. తన నాటకాలలో నాటక కళ తక్కువే అని ఆయనే చెప్పుకొన్నాడు. రసభావ అనుకూల భాషను ప్రయోగించటంలో రాజశేఖరుడి నేర్పు కన్పిస్తుంది. మాధుర్య గుణంతో ఉన్న సంగీత గుణం అతని కవిత్వంలో ఉంది. శబ్ద విన్యాస చతురుడు. పదలాలిత్యానికీ శేఖరుని ఉదహరిస్తారు. రాజశేఖరుని రచనలు మునుల మనస్సుల్లాగా సమాధి గుణం కలవి, ప్రసన్నం చేసేవి అని తిలక మంజరిలో ధనపాలుడు ప్రశంసించాడు – "సమాధి గుణ శాలిన్య: ప్రసన్న పరి పక్త్రియా – యాయా వర కవేర్వాచో మునీనామివ వృత్తయ:"

సంస్కృతంలోనే కాక ప్రాకృత భాషలైన శౌరసేని, ప్రాకృత అపభ్రంసః భాషల మీదా అధారిటీ ఉన్నవాడు. బాల రామాయణంలో "ప్రాకృతం సంస్కృతానికి జనని" అని స్పష్టంగా చెప్పాడు. ప్రాకృత భాషలు చెవికి సోకితే ఇతర భాషలు

ఇతోధికంగా తోడ్పడ్డాయి అన్నాడు. భూత భాషను "సరస రచనం భూత వచనం" అని కీర్తించాడు. ఈ విధంగా అంతకుముందు ఏ కవీ చేయని సాహసం చేసి, ఆనాడు జన సామాన్యంలో వాడుకలో ఉన్న భాషలను సమాదరించి, వాటికీ కావ్య గౌరవం ఉంది అని నిర్ద్వంద్వంగా తెలియజెప్పిన వాడు రాజశేఖరుడే.

కావ్య మీమాంస

రాజశేఖరుడు రచించిన అలంకార శాస్త్రం "కావ్య మీమాంస". ఇది క్షేమేంద్ర, భోజ హేమచంద్రాదులకు ప్రేరణ గ్రంధం. ఇందులో పద్ధెనిమిది అధ్యాయాలున్నాయి. కావ్య పురుషుడి ఉత్పత్తితో ప్రారంభించి, అతడు అష్టాదశ శిష్యులకు కావ్య విద్యలు నేర్పటం శిష్యులు వాటిపై గ్రంధ రచన చేయటం, కావ్య భేదాలు, సాహిత్య విద్యా కన్యను కావ్య పురుషుడు వివాహమాడటం, కవి భేదాలు, భాష, శైలి వగైరాలు కవి సమయాలు, కవి రహస్యాలు, అలంకార సిద్ధాంత సమీక్ష మొదలైనవన్నీ శాస్త్రీయంగా రాశాడు. ఇలాంటి విషయ చర్చలు ఇంతకూ పూర్వం ఎవరూ చేయలేదు. అందుకే అపూర్వం అనిపిస్తాయి. కావ్యార్ధాపహరణలో ముప్ఫై రెండు రకాలను తెలియజేసి, చర్చించాడు. కవులకు దినచర్యలు రాజ సభల్లో గోష్టి విధానం గొప్పగా చిత్రించాడు. రుద్రటుడి ప్రభావం ఇతనిపై ఎక్కువ అంటారు. అలంకారాలు, రీతులు కావ్యానికి ఉపయోగ సామగ్రి అన్నాడు. ఇవేవీ కావ్యాత్మకాదన్నాడు. ధ్వనిని గురించి ఎక్కడా స్పష్టంగా చెప్పలేదంటారు. అంటే అప్పటికి ధ్వని సిద్ధాంత వ్యాప్తి బాగా ఉండి ఉండకపోవచ్చు. ఉక్తి వైచిత్రి అవసరం అన్నాడు.

భార్య అవంతీ సుందరి కూడా సంస్కృత ప్రాకృత పండితురాలు. ఆమె అభిప్రాయాలకు విలువనిస్తూ చాలాసార్లు పేర్కొన్నాడు. "రసోచిత శబ్దార్ధ సూక్తులను కావ్యంగా పరిగ్రహించాలి" అని అవంతీ సుందరి చెప్పిన దానితో తానూ ఏకీభవిస్తున్నట్లు రాజశేఖరుడు చెప్పాడు. "రస కవి యే ఉత్తమ కవి" అన్నాడు. కనుక రస సంప్రదాయానికి చెందిన వాడుగా రాజశేఖరుని గుర్తించారు. కావ్య మీమాంసను ఆంగ్లంలో సి.ఎస్.వెంకటేశ్వరన్ అనువదించి విపులమైన వివరణ చేశాడు. ❀



38. భల్లట కవి (889 ad)

కాశ్మీర దేశీయుడైన ఈ కవి 883-902 కాలంలో రాజు శంకర వర్మ ఆస్థానంలో ఉన్నాడు. "భల్లట శతకం" రాశాడు. నీతి, ధర్మ బోధనా ఇందులో ఉన్నాయి. అనేక వృత్తాలను ప్రయోగించాడు. భల్లట శతకం బాగా ప్రాచుర్యం పొందింది. దీన్ని ముమ్మటుడు ఆనంద వర్ధనుడు ఉదాహరించారు. 750 ప్రాంతంవాడై ఉండాలి.

కవిత్వ భల్లటీయం

ధ్వని ప్రధాన కవిత్వం చెప్పాడు. ప్రసాద మాధుర్యంతో వైదర్భీ రీతిలో ఉంటుంది. కాళిదాస, భారవి మాఘ, చౌర, భవభూతి, మురారి మొదలైన గొప్ప కవుల స్థాయికి చెందినవాడు భల్లటుడు.

"శ్రీ దండీ దండిమాఖ్య: శృతి ముకుట గురుర్భల్ల టో భట్ట బాణ: -
ఖ్యాతాశ్చాన్యే సుబంధ్వాదయ ఇహ కృతి భిర్విశ్వ మాహ్లోదయంతి"

ఏ విషయాన్నైనా సూటిగా మనోహరంగా చెప్పాడు అందుకే లోక ప్రియ కావ్యంగా గుర్తింపు పొందింది. మచ్చుకి ఒకటి

"పరార్థేయః పీడామను భవతి భంగే పి మధురో - యదీయా సర్వేషా మిహ ఖలు వికారో ప్యాభిమతః

న సంప్రాప్తో వృదిం యదిస భ్రుశమ క్షేత్ర పతితః - కిమిక్షోర్దోషో యం

న పునర గుణాయామ మరుభువః" ఇది అప్రస్తుత ప్రశంస. విరహంతో ఉన్న నాయిక బాధ –

"వాతా వాంతు కదంబ రేణు వాహలా నృత్యంతు సర్పద్విషః – సోత్సాహ నవ తోయ దాన గురవో ముంచంతు నాదం ఘనాః

మగ్నాం కాంత వియోగ దుఃఖ దహనే మాం వీక్ష్య దీనానాం – విద్యుత్ భో స్ఫురపి త్వమస్య కరుణే స్త్రీ త్రేపి తుల్యే సతిః". దీని భావం – వాయువు, మయూరుడు, మేఘాలు, పుంలింగాలు కాబట్టి నిర్దయతో నన్ను బాధపెడుతున్నాయి. ఎంతయినా మగాళ్ళు మగాళ్ళే కదా. ఓ దామినీ నీవు స్త్రీ అయి ఉండి కూడా ఎందుకు ఇంత నిర్దయ చూపిస్తున్నావో అర్థం కావటం లేదు.

అన్యాపదేశ శైలిలో భల్లటుడు శతకం రాశాడు. ఇందులో నూట ఎనిమిది శ్లోకాలున్నాయి. వ్యంగ్య వైభవం ఇందులో పూర్తిగా ఉంటుంది. రాజు శంకర వర్మ క్రూరుడై నియంతగా మారుతాడు. అధిక పన్నులు వేసి ప్రజల్ని పీడిస్తాడు. దీన్ని చూడలేక బాధ పడుతాడు భల్లుటుడు. అతని జీవనాధారమూ పోయింది. బీదరికం ఆవరించింది. లావట్టుడు అనే కూలివాడి జీతం రెండు వందల దీనార్లు. తన దీన స్థితిని గురించి గాలిని అన్యాపదేశంగా నిందిస్తూ శ్లోకం చెప్పాడు. "ఓ గాలీ! ఎందుకు ఈ రకమైన ప్రవర్తన? కాలికింద ధూళిని ఎగరేసి ఆకాశానికి తీసుకొని వెగతావు. ఎన్ని అడ్డంకులున్నా అధిగమిస్తావు. కాని ఆ దుమ్ముతో నీ ఒళ్ళు దుమ్ము కొట్టుకుపోయిందని తెలుసుకోలేకపోతున్నాదు" అంటాడు.

రాజు క్రూరత్వాన్ని అడవి వేటకాడులతో అన్యోక్తిగా పోల్చి చెప్పాడు. "ఈ ధనుస్సు చావు నోరు తెరచినట్లు ఉంది. బాణాలు విషంతో ఉన్నాయి. అర్జున పరాక్రమం కంటే ఎక్కువగా ఉంది. ఈ పువ్వు లోపల విషం చిమ్ముతూ బయటికి వెకిలిగా నవ్వుతూ పాడుతోంది. అడవి జంతువులన్నీ పారిపోతాయేమో?"❀

39. ప్రేయోరస ప్రతిపాదకుడు - రుద్రటుడు (900 ad)

రుద్రటుడు తొమ్మిదవ శతాబ్దానికి చెందిన కాశ్మీర పండిత కవి, అలంకార శాస్త్రవేత్త. తొమ్మిదవ శతాబ్ద మొదటిభాగంలో "కావ్యాలంకార" అనే అలంకార గ్రంధాన్ని రాశాడు. అతని గురించి పెద్దగా వివరాలు తెలియరాలేదు. కాని అతని గ్రంధంలోని అయిదవ అధ్యాయంలోని పన్నెండు నుండి పద్నాలుగు వరకు ఉన్న శ్లోకాలపై "నమి సాధు" రాసిన వ్యాఖ్యానం వలన రుద్రటుడికి "సదానంద" అనే మరో పేరు ఉన్నట్లు, తండ్రి పేరు భాముకుడు అన్నట్లు తెలుస్తోంది. రుద్రటుడు తనకు పూర్వం ఉన్న అలంకారికుల మార్గంలోనే కావ్యాలంకారం రాశాడు. అందులో పదహారు అధ్యాయాలు, 734 శ్లోకాలున్నాయి. రుద్రటుడు తొమ్మిదో శతాబ్దానికి పూర్వార్ధంలో ఉండినట్లు భావిస్తారు. పద్నాలుగు ప్రక్షిప్త శ్లోకాలున్నాయి.

రుద్రట ప్రతిభా రౌద్రం

కావ్యాలంకారంలో అష్టవిధ నాయికల గురించి రుద్రటుడు పేర్కొన్నాడు. శ్లోకాలను ఎక్కువ భాగం "ఆర్యా వృత్తం"లో రాశాడు. పదమూడవ అధ్యాయంలో కేవలం పదిహేడు శ్లోకాలు మాత్రమే ఉండి అతిచిన్న అధ్యాయంగా కనిపిస్తుంది. కాని ఎనిమిది తొమ్మిది అధ్యాయాలలో వరుసగా 111, మరియు 110 శ్లోకాలు ఉండి పెద్ద అధ్యాయాలుగా ఉంటాయి. మొదటి అధ్యాయంలో గణేశ, గౌరీ స్తుతి చేసి కావ్యారంభం చేశాడు. చదరంగం ఆట గురించి దానిలో నిష్ణాతులైన వారి గురించి, దాని చరిత్రను గురించి కూడా రుద్రటుడు రాయటం విశేషం. వీరుల

పర్యటన (Nights 1, Towr) చిత్రాలంకారం అంటే "తురగ పద బంధం" కూడా ఉండి వాటి విశేషాలు తెలుస్తాయి. ఔచిత్య చర్చ విశేషంగా చేశాడు. రుద్రట కృతిపై మూడు వ్యాఖ్యానాలున్నాయి. అందులో ముఖ్యమైనది శ్వేతాంబర జైనుడైన "నమిషాదు" రాసినది. పదకొండవ శతాబ్దం వాడైన శైల భద్రుడు రాసినవి ముఖ్యమైనవి. గోపాల దేవుడు కూడా రాశాడు. గోపాల భట్టు "రస తరంగిణి" పేరిట వ్యాఖ్యానం రాశాడు.

రుద్రటుడు కావ్యాలంకారంలో 495 కారికలున్నాయి. మిగిలినవి శ్లోకాలే. ప్రౌఢమైన అలంకార గ్రంధంగా పరిగణింపబడింది. రుద్రటుడు ఏ కొత్త సిద్ధాంత ప్రతిపాదనా చేయలేదు. చర్చ అంతా పరమ శాస్త్రీయ విధానంలో నిర్వహించి మెప్పు పొందాడు. అలంకారాలను శబ్దాలంకారాలుగా అర్థాలంకారాలుగా విభజించి కొత్త దారి తొక్కి, తరువాతి వారికి మార్గదర్శి అయ్యాడు. మొత్తం యాభై ఏడు అలంకారాల గురించి వివరించాడు. అలంకారాన్ని సమర్ధించినా రస నిష్పత్తికి విలువనిచ్చాడు. అందరికంటే ఇంకొక అడుగు ముందుకు వేసి ప్రేయో రసాన్ని "పదవ రసం"గా ప్రతిపాదించాడు. దీనికి స్నేహం స్థాయీభావంగా చెప్పాడు. స్నేహాన్ని చక్కగా నిర్వచించాడు – "సహృదయ వ్యవహారంతో కూడిన నిశ్చలమైన, నిర్వ్యాజమైన మనో వృత్తియే స్నేహం" అని రుద్రటుడు నిర్వచించాడు. స్నేహం వలన ఏర్పడిన ప్రేమ, విశ్వాసంతో సద్భావంతో కోమలంగా పరస్పర స్పందనలుగా ఉంటుంది. మనసు ఆర్ద్రం అవటం, ఆహ్లాదంతో కళ్ళవెంట అశ్రుజలాలు కారటం, స్నిగ్ధ భావంతో ఒకరినొకరు ఆపేక్షగా చూసుకోవటం ఇందులో అనుభవానికి వచ్చే విషయాలు. స్నేహంలో కామం, రతి ప్రస్తావన ఉండదు. మానసిక రతి ఉంటుంది. అందువలన పుత్రప్రేమ, దాస్య ప్రేమ, దాంపత్య ప్రేమ (కులపాలికా ప్రేమ), ప్రకృతి ప్రేమ, దేశభక్తీ, గొప్ప వారియెడ గౌరవ భావం మొదలైనవన్నీ ప్రేయో రసానికి అంతర్గతంగా ఉంటాయి. తరువాత కాలం వారైన భోజుడు మొదలైనవారు ప్రేయోరసాన్ని బాగా ఆదరించారు. ప్రేయోరసం అంటే "అమలిన శృంగారం" మన రాయప్రోలు సుబ్బారావుగారు దీనిపైనే "తృణ కంకణం" అనే ఖండ కావ్యం రాశారని మనకు తెలిసిన విషయమే. రుద్రటుడు పూర్వం ఉన్న

వైదర్భి, పాంచాలీ, గౌడీ రీతులతో బాటు కొత్తగా "లాటి" అనే రీతిని గుర్తించాడు. ఉపమ రూపక ఉత్ప్రేక్షాలంకారాలనుచక్కగా వివరించాడు. సరిగ్గా నిర్వచనం లేని వాటిని వాస్తవాలంకారాలన్నాడు. వాస్తవ అంటే వస్తు సంబంధమైనవి అనే అర్థంలో చెప్పాడు. శ్లేషను అర్థాలంకారంగా ఒప్పుకోలేదు. అదొక విచిత్రాలంకారం అన్నాడు.

రుద్రటుడి తురగ పద బంధం

తురగ పద బంధంను మొదటిసారిగా అలంకార శాస్త్రంలో చెప్పినవాడు రుద్రటుడు. ఇది గుర్రపు నడకను పోలి ఉండటం చేత ఆ పేరు వచ్చింది. ఇందులో ఒక్కొక్క పంక్తికి ఎనిమిదేసి అక్షరాల వంతున నాలుగు పంక్తులుంటాయి. వీటిని ఎడమ నుంచి కుడికి చదవవచ్చు. లేక అశ్వ పద మార్గంలోనూ చదవవచ్చు. అదీ ఇందులో విశేషం. ఇందులోని ప్రతి అక్షరం చెస్ బోర్డ్‌లోని ఒక చదరానికి సంకేతం. రుద్రకుడు ఇచ్చిన ఒక ఉదాహరణను గమనిద్దాం.

"సే నా లీ లీ లీ నా నా నా లీ
లీ నా నా నా నా లీ లీ లీ లీ
న లీ నా లీ లీ లే నా లీ నా
లీ లీ లీ నా నా నా నా నా లీ"

మొదటి పంక్తిని ఎడమ నుండి కుడికి మామూలుగా చదవవచ్చు. లేకపోతే మొదటి చదరం నుండి రెండవ పంక్తికి వెళ్లి మూడవ అక్షరాన్ని తురగ బంధంలో ఒకటికి చేరి చదవవచ్చు. లెక్కల రూపంలో చెప్పాలంటే – 5–2, 7–4, 8–3, 6–4, 4–3, 2.

ఈ తురగ పదబంధాన్ని చేదించిన మొదటి గణిత శాస్త్రజ్ఞుడు "లియోన్ హార్డ్ యూలర్" దీనికి విధానాన్ని "వారంస్ డార్ఫ్ రూల్"గా వివరించినవాడు 1803 కాలపు వాడైన H.C.Von Warns dorff. వీటినే "ఆల్గారిదం" అంటున్నారు. వీటికే "Rudraka cycles" అని పేరుపెట్టి అందులో ప్రవేశించటానికి చాలా ప్రయాసపడ్డారు. అంతటి మేధావి రుద్రకుడు.❀

40. వికట నితంబ (900 ad)

తొమ్మిదవ శతాబ్దానికి చెందిన ఈ మహిళా కవి సంస్కృతంలో సరళ విలక్షణ రచన చేసింది. "భయంకరమైన పిరుదులు కలది" అని వికట నితంబ అనే మాటకు అర్ధం బహుశా నిక్‌నేమ్ అయి ఉండచ్చు. తన కవిత్వంలో వీటిని మెచ్చుకుంటూ రాసుకున్నది. ఆ కాలంలో ఇలాంటి పేర్లు ఉండేవి. జఘన చపాల అలాంటి పేర్లలో ఒకటి. వికట నితంబ రాసిన వానిని తరువాతి కాలపు కవులు పేర్కొన్నారు. ముఖ్యంగా 1363 వాడైన సారంగధరుడు ఆమె కవిత్వాన్ని సుభాషిత రత్న కోశంలో ఉదాహరించాడు. విద్యాకారుడు సదుక్తి కర్ణామృతం, సుభాషితావళిలో పేర్కొన్నాడు. శృంగార రసంలో కవిత్వాన్ని ముంచి తేల్చింది వికట నతంబ. ఆమె కవిత్వాన్ని రాజశేఖరుడు, ఆనందవర్ధనాచార్యుడు ఉదాహరించారు. భోజదేవుడు శృంగార ప్రకాశలో ఆమె కవిత్వాన్ని మెచ్చాడు.

"పృధా కాలే వదతి సభాషం - తద్విపరీతం యస్య హిరన్యే - లుమ్పతి చాస్త్రిత్రే రం వా షం వా - తస్మై దత్త వికట నితంబా" దీని అర్ధం చదువురాని మూర్ఖ శిఖామణికి, ఉష్ట్ర అనే మాటనే పలకలేని సన్యాసికి వికట నితంబను కట్టబెట్టారు. ఇది ఒక చాటువు. రుద్రకుడు దీన్ని ఉదాహరించాడు.❁

41. వక్రోక్తి విన్యాసి - రాజానక కుంతక కవి (950-1000 ad)

కుంతకుడు అభినవ గుప్తుని తర్వాత వాడని చారిత్రకుల భావన. వింటర్ నిత్స్ మాత్రం అభినవ గుప్తుని సమకాలికుడన్నాడు. క్రీ.శ.950-1050 వాడుగా అందరి అభిప్రాయం. ఆనంద వర్ధనుడి ధ్వని సిద్ధాంతాన్ని ఖండించినవారు ఉన్నారు, కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించిన వారూ ఉన్నారు. అందులో కుంతకుడు వక్రోక్తి సిద్ధాంత ప్రతిపాదకుడు. ఆయన రాసిన గ్రంధమే "వక్రోక్తి జీవితం". వక్రోక్తి ప్రాభవాన్ని బామహుడు అంగీకరించాడు. వక్రోక్తి కావ్య రచనకు అవసరమనీ చెప్పాడు. భామహుడి వక్రోక్తి దండి చెప్పిన గుణాలంకార సంప్రదాయమే కాకుండా వామనుడు చెప్పిన రీతి సంప్రదాయమూ కలిసి ఉంది. కానీ కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని శాస్త్రీయ పద్ధతిలో వివరించాడు. ఈ ప్రాతిపాదనలో అతని ప్రతిభ అనితర సాధ్యంగా ఉంటుంది. వక్రోక్తిలో ధ్వని సంప్రదాయం కలిసి ఉండక తప్పని పరిస్థితి ఉంది. కుంతకుడు ధ్వని సిద్ధాంతానికి విరోధి కాడు. కాని కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించి నూత్న మార్గాన్ని అవలంబించాడు. అందుకే "ముసుగు వేసుకొన్న ధ్వనియే వక్రోక్తి" అని చెప్పారు కూడా.

వక్రోక్తి సిద్ధాంతాలలో నాలుగు ఉన్మేషాలున్నాయి. కారికలు, వృత్తి అని రెండు భాగాలు చేశాడు. కారికలను వృత్తిని కుంతకుడే రాశాడు. మూల కారిక పేరు "కావ్యాలంకారం", వృత్తిని "వక్రోక్తి జీవితం" అన్నాడు. మనకు లభించే గ్రంధం సంపూర్ణమైనది కాదని అభిప్రాయ పడుతున్నారు. వక్రోక్తి జీవితంలో రీతి గుణ, రస, అలంకారాల వివరాలుంటాయి. స్వభావోక్తిని అలంకారం అని, వక్రోక్తి ఆలంకృతి అనీ అన్నాడు. కావ్యానికి శోభ చేకూర్చేది వక్రోక్తి అని దృఢంగా నమ్మాడు కుంతకుడు. అందరూ అనే కావ్యాత్మ అనకుండా కుంతకుడు "కావ్య జీవితం" అన్నాడు ప్రత్యేకంగా. రసాన్ని అలంకారంగా ఒప్పుకోలేదు. రసయోగం చేత అలంకార విశేషమైన ఆహ్లాదాన్ని కలిగించి చమత్కారం చూపిస్తే అది "రసవదలంకారం" అన్నాడు.

వక్రోక్తిలో ఆరు భాగాలు. వాక్య వక్రత, ప్రకరణ వక్రత, ప్రబంధ వక్రత భేదాలు చెప్పాడు కుంతకుడు. వర్ణ విన్యాస వక్రత, పద పూర్వార్ధ వక్రత, పద పదార్ధ వక్రత, పూర్వాలంకారులు చెప్పిన వైదర్భి గౌడి పాంచాలీ రీతులను పేరు మార్చి సుకుమార, విచిత్ర, మధ్యమ మార్గాలుగా పేర్కొన్నాడు. రీతికి మార్గం అని పేరు పెట్టాడన్న మాట. కాళిదాసాదులు సుకుమార మార్గానికి, బాణ భవభూతులు విచిత్ర మార్గానికి, మయూరుడు మార్గ, గుప్తాదులు మధ్యమ మార్గానికి చెందినవారని విశ్లేషించాడు కుంతకుడు. ప్రతి కవికి భిన్నమైన శైలి ఉంటుందన్నాడు. కవి వ్యక్తిత్వం శైలిలో ప్రతిబింబిస్తుంది అన్నాడు. సోమేశ్వర, మాణిక్యచంద్ర వంటివారు కుంతకుని వక్రోక్తిని పూర్తిగా సమర్ధించారు. పాశ్చాత్య అలంకారిక భావాలకు ఆలోచనలు దగ్గరలో ఉన్నట్లు కనిపిస్తాయి. కావ్య నిర్వచనం అలంకార నిర్ణయం, రీతి వివరణలలో కుంతకుడు ఆధునిక మార్గమే తొక్కాడు.❀



42. అభివ్యక్తివాద వ్యాపకుడు - అభినవ గుప్తుడు (950-1000 ad)

అభినవ గుప్తుడు మహా మేధావి, గొప్ప దార్శనికుడుగా, ఆలంకారికుడుగా ప్రసిద్ధుడు. కొత్త గ్రంధాన్ని రాయలేదు కాని ఇతర గ్రంధాలకు గొప్ప వ్యాఖ్యలు రాశాడు. భరతుని నాట్య శాస్త్రానికి "అభినవ భారతి" వ్యాఖ్యానాన్ని, ఆనందవర్ధనుడి "ధ్వన్యా లోకం"కు "లోచన" వ్యాఖ్యను రాసిన మహా పండితుడు. స్వతంత్ర ఆలోచనలున్న వాడుగా సుప్రసిద్ధుడు.

అభినవ గుప్తీయం

ధ్వన్యాలోకంలో అస్పష్టంగా ఉన్న సిద్ధాంతాలను స్పష్టపరచి పుష్టి కల్గించాడు. రస ధ్వనికి అతను చేసిన వివరణ చిరస్థాయిగా నిలిచిపోయి, ఆనంద వర్ధనుడిని చిరంజీవిని చేసింది. అభినవ గుప్తుడు "అభివ్యక్తి వాదం" అనే దాన్ని సిద్ధాంతీకరించాడు. శైవ అద్వైతంలో ఉన్న ఆనంద వాదం భూమికగా అభినవ గుప్తుడు రసాన్ని చర్చించాడు. విభావ, అనుభావ మొదలైన వాటి ద్వారా సామాజికులలో ఉన్న వాసనా రూపంలో రసం అభివ్యక్తం అవుతుందని, రసం వలన కలిగే ఆనందం బ్రహ్మానంద సహోదరమైనదని తిరుగులేని తీర్పు నిచ్చాడు. ఇతడు రాసిన "ధ్వన్యాలోకం" చాలా ప్రౌఢ రచన. ఈ వ్యాఖ్యానమే తర్వాతి ఆలంకారులకు మార్గదర్శనం చేసింది.

పందొమ్మిది మంది మహాపండితుల వద్ద అభినవ గుప్తుడు శాస్త్ర విద్యలను నేర్చాడు. భట్ట ఇందురాజు దగ్గర ధ్వని సిద్ధాంతాన్ని, భట్ట తౌతుడి వద్ద నాట్య శాస్త్రాన్ని అభ్యసించాడు. శైవ సంప్రదాయంలో "ప్రత్య భిజ్ఞ" గ్రంధం రాశాడు. గుప్తుడికి తండ్రియే గురువు. తల్లి విమల, తండ్రి నరసింహ గుప్తుడు. తాత వరాహగుప్తుడు. ఈతని పూర్వులు పంజాబ్‌లోని "దో ఆబ్" ప్రాంతం వారు. తర్వాత కాశ్మీరం చేరుకున్నారు. గుప్తుడు శైవ ఆగమాలలో నిష్ణాతుడు. తంత్ర శాస్త్రంలోనూ దిట్టయే. శైవానికి చెందిన నలభై ఒక్క గ్రంధాలను రాశాడు. ఇందులో పదకొండు మాత్రమే లభ్యం. శైవ ఆగమాల మీద, స్తోత్రాల మీద అనేక వ్యాఖ్యలు రాశాడు. భట్ట తౌతుడు రాసిన "కావ్య కౌతుకం"కు "వివరణ" రాశాడు అభినవుడు.

అభినవ గుప్తుడికి పూర్వం ధ్వన్యాలోకానికి "చంద్రిక" అనే వ్యాఖ్యానం ఉండేదని, దాన్ని అభినవ గుప్తుని అన్న రాశాడని వారి వంశంలో దాన్ని పారంపర్యంగా అధ్యయనం చేసేవారని ప్రచారంలో ఉంది. చంద్రిక చాలదని లోచన వ్యాఖ్య రాశానని అభి చెప్పాడు. ముమ్మటుడు అభినవ గుప్తుని "ఆచార్య పాదుడు" అని కీర్తించటాన్ని బట్టి శిష్యుడే అని నిర్ధారించారు. క్షేమేంద్రుడు కూడా అభినవుడు తన గురువు అన్నాడు. శిష్య బృందంతో అభినవ గుప్తాచార్య పరంపర అభివృద్ధి చెందింది.❁



43. ఔచిత్య సిద్ధాంతకర్త, నాటక కర్త - క్షేమేంద్రుడు (990-1050 ad)

990-1070 కాలానికి చెందినవాడుగా భావిస్తున్న క్షేమేంద్రుడు కాశ్మీర దేశ కవి. శైవ సిద్ధాంతాన్ని మదించిన అతిగొప్ప జ్ఞాని అయిన అభినవ గుప్తునికి శిష్యుడు. కాశ్మీర రాజు అనంతుని ఆస్థానంలో క్షేమేంద్రుడు ప్రసిద్ధ పండితుడుగా ఉండేవాడు. అయితే వైష్ణవం పైనా, బౌద్ధం పైన రచనలు చేసి సమర్ధతను చాటుకొన్నాడు. 1037 వరకు నిరంతర రచన ప్రవాహాన్ని పారించాడు. అతని "బృహత్కధా మంజరి" పేరెన్నిక గన్న బృహత్ కావ్యం. ఇది గుణాఢ్యుడు రాసి కాలగర్భంలో కలిసిపోయిన "బృహత్ కథ"కు మరో సంక్షిప్త రూపం. శ్రీ మహావిష్ణువు దశావతారాల గురించి "దశావతార చరిత్ర" రాశాడు క్షేమేంద్రుడు. కొన్ని నాటకాలు, వర్ణనాత్మక కవిత్వంతో బాటు అధిక్షేప నవల, కామ సూత్రాలపై విపులమైన వ్యాఖ్యానమూ రాశాడు. క్షేమేంద్రుని రచనలను కవులు వ్యాఖ్యాన కర్తలు తమ గ్రంథాలలో పలు చోట్ల పేర్కొనటం వలన అతని గురించి జనాలకు పరిచయం కలిగింది. ముఖ్యంగా రాజతరంగిణిలో అనేకమార్లు ఉదాహరింపబడిన కవి క్షేమేంద్రుడు.

క్షేమేంద్రుని కవితా గీర్వాణం

1871లో మాత్రమే క్షేమేంద్రుని రచనలు సుమారు ముప్ఫై నాలుగు

వెలుగు చూశాయి. ఏ.సి బర్నేల్ తంజావూరు సరస్వతి మహల్ నుండి బృహత్కథా మంజరిని మొదట చూసి వెలువరించాడు. బహ్లేర్, స్టీల్, పీటర్సన్, దాస్, కౌల్ వంటి చారిత్రక పరిశోధకులు క్షేమేంద్రుని రాత ప్రతులను సేకరించి వెలువరించారు. అందులో మూడు వ్యంగ్యాత్మకమైన భాణాలు – సమయ మాత్రిక, నర్మ మాల, కలావిలాసలను హక్సర్ ఆంగ్లంలోకి అనువదించాడు. వీటిల్లో ఎవర్నీ వదిలిపెట్టలేదు. బౌద్ధ గురువుల్ని, సన్యాసులను, సన్యాసినులను ఉతికి ఆరేశాడు. వ్యవస్థలోని కుళ్ళును కడిగిపారేశాడు. ఉజ్జయిని నగర సాయం సమయ అందాలను మహాద్భుతంగా కవిత్వీకరించాడు. ఉజ్జయినిలో పదకొండవ శతాబ్ది వివరాలు ఈ నాటికీ అలానే ఉన్నాయని మనకు తెలుస్తుంది. మనుషుల స్వభావాలను ఆకృతులను తీర్చిదిద్దాడు. దెయ్యాలతో డాన్స్ చేయించాడు. ముఖ్యంగా సభ్య మగవారిని చిత్రించిన తీరు ఇప్పటికీ మనకు దృశ్య గోచరమౌతుంది. స్త్రీల గురించి కొంత అతిగా రాశాడనిపిస్తుంది. అప్పటి స్త్రీకి ఇప్పటి స్త్రీకి సహస్ర భేదం కనిపిస్తుంది. అందుకే అతను వర్ణించిన స్త్రీ మూర్తులను నేడు ఉదాహరించటానికి ఇబ్బంది పడతారు.

క్షేమేంద్రుని కావ్యాలు – రామాయణ మంజరి, భారత మంజరి (చిత్ర భారతం), బృహత్కథా మంజరి అనే సంక్షిప్త రామాయణ, మహాభారత, బృహత్కథా రూపాలు, అలంకార గ్రంథాలుగా ఔచిత్య చర్చ, కవి కంఠాభరణ, సువృత్త తిలక, వ్యంగ్య అధిక్షేపక నాటకాలు – కళా విలాస, సమయ మాత్రిక, నారీలలామ, దేశోపదేశ, నీతిబోధక కావ్యాలు – నీతి కల్ప తరువు, దర్ప దలన, చతుర్వర్గ సంగ్రహ, చారు చర్య, సేవ్య సేవకోపదేశ, లోక ప్రకాశ, స్తూపావదాన, పౌరాణికాలు – అవధాన కల్ప లతా, దశావతార చరిత్ర.

క్షేమేంద్రుడు “కవి నృపావళి” అనే చారిత్రక కావ్యం రాసినట్లు కల్హణుడు చెప్పాడు. కాని లభ్యం కాలేదు. క్షేమేంద్రుని అలంకార గ్రంథం “కవి కంఠాభరణం”లో కవిత్వ ప్రాప్తి, కావ్య వైచిత్రి, అర్థ, శబ్ద రసాలలోని దోషాలు, గుణాలు వివరించాడు. ఇది అయిదధ్యాయాల గ్రంథం. ఔచిత్య ప్రాధాన్యాన్ని వివరించాడు. ఔచిత్యాన్ని ఒక కావ్య సిద్ధాంతంగా ప్రతిపాదించాడు. శబ్ద, అర్థ,

గుణ, అలంకార, రస సంబంధ ఔచిత్యాలను ప్రముఖంగా సోదాహరణంగా చర్చించాడు. అనౌచిత్య దోషాలను ప్రముఖ కవుల రచనల నుంచి నిర్భయంగా ఎత్తి చూపాడు. ధ్వని సిద్ధాంతం క్షేమేంద్రుడికి ఇష్టమైందే. అనేక రకాల తత్వాలన మిశ్రమాన్ని ఔచిత్య సిద్ధాంతంలో ప్రతిపాదించాడు. ఔచిత్య సిద్ధాంతం అత్యవసరమైన కావ్య తత్త్వంగా అందరూ భావించారు. ఔచిత్యం చివరికి ధ్వని సిద్ధాంతంలో అంతర్భవిస్తుందని విశ్లేషకులు తేల్చారు. సువృత్తి తిలక అనే మరో అలంకార గ్రంధాన్ని కూడా క్షేమేంద్రుడు రాసినట్లు తెలుస్తోంది.

చారుచర్య అనే నీతిశాస్త్ర గ్రంథంలో నిత్య జీవితంలో మనం అనుసరించాల్సిన విషయాలను చెప్పాడు. ఇది ఒక మార్గదర్శిగా ఉపయోగ పడుతుంది.❁



44. కవి శిక్ష రాసిన - మొదటి వాగ్భటుడు (911-1150 ad)

జైన కవి వాగ్భటుడు 1121-1156 కాలానికి చెందినవాడు. "వాగ్భటాలంకారం" రాశాడు. ఇందులో అయిదు పరిచ్ఛేదాలుంటాయి. కావ్య లక్షణాలు, హేతువులు, ప్రయోజనాలు, కవి శిక్ష, కవి సమయాలు, కావ్య భేదాలు, దోషాలు, గుణాలు, భాష, అలంకారం, రీతులు, చిత్రబంధ కవిత్వం, నాయికా నాయక భేదాలు, రసం మొదలైనవన్నీ చర్చించాడు. కావ్యాలను మూడు రకాలుగా చెప్పాడు. ఛందస్సుతో ఉన్నవి ఛందస్సులేనివి, మిశ్రమాలు. రీతులలో గౌడీ. వైదర్భిలనే గ్రహించాడు. లక్షణాలకు ఉదాహరణలు తానే స్వయంగా రాయటం వాగ్భటుని ప్రత్యేకత. "నేమి నిర్వాణం" అనే మహా కావ్యాన్ని రాశాడు. ఇతని అలంకార గ్రంధానికి సింహదేవ గని వ్యాఖ్య రాశాడు. ఇదో గమ్మత్తైన విషయం. తన అలంకార గ్రంధానికి తానే వ్యాఖ్యానం రాసుకోవటం.❁

45. యశస్తిలక కర్త - సోమప్రభ సూరి (995 ad)

ఆంధ్ర ప్రదేశ్‌లో కరీంనగర్ జిల్లా వేములవాడ రాజధానిగా చాళుక్యరాజు రెండవ అరికేసరి పెద్దకొడుకు నాగరాజు ఆస్థానంలో సోమప్రభ సూరి కవి ఉన్నాడు. "యశస్తిలక" అనే చంపూ కావ్యం రాశాడు. ఈ రాజు ఆస్థానంలోనే కన్నడ భారతం రాసిన పంపకవి కూడా ఉండేవాడు. ఈ చాళుక్య రాజులు జైన అభిమానులు. సూరి మాత్రం ఉత్తర దేశంవాడు. ఇక్కడికొచ్చి ఈ కావ్యం రాశాడు. ఇతని కాలం 995 అయి ఉండాలి.

సోమప్రభ యశస్తిలకం

సూరి రాసిన పై కావ్యంలో యశోధర, మారి దత్తుడు అనే రాజుల కథ ఉంది. మారిదత్తుడు యజ్ఞం చేయాలనుకొని బలికోసం పశువులతో బాటు ఒక బాలుడు బాలికలను కూడా సిద్ధం చేసుకొంటాడు. సుదత్తుడనే ముని వచ్చి ఇలాంటి యజ్ఞం కూడదు అంటాడు. ఆ ముని బోధ వలన మారి, దత్తుడు జైన మతం స్వీకరిస్తాడు. సమకాలిక జీవిత ప్రతిబింబంగా చిత్రణ బాగా చేశాడు. రాజ్య వ్యవహారాలూ, దురాచారాలు వాస్తవంగా రాశాడు. కాదంబరి లాగానే నడిపించాడు కావ్యాన్ని.

సూరికి ఆదర్శం బాణుడే. అదే దారిలో నడిచాడు. పాండిత్యంతో శ్లేషలతో కవిత్వాన్ని రక్తి కట్టించాడు. సూక్తులను సందర్భోచితంగా ప్రయోగించి సార్ధకత తెచ్చాడు. సోమప్రభను అనంతర కవులు చాలామంది అనుకరించారు. ❋

46. మహారాజ కవి - భోజుడు (1000 ad)

భోజరాజు వేదాంతి, బహుశాస్త్రవేత్త. మధ్య భారతంలో మాల్వా సంస్థాన రాజు. పారమార్ వంశానికి చెందినవాడు. 1055 వరకు రాజ్యపాలన చేశాడు. "రాజా భోజా ఆఫ్ ధార్" అని ఆప్యాయంగా పిలుస్తారు. భోజ అంటే సంపూర్ణమైన సర్వ సంపన్నమై సరళమైన వాడని అర్థం. మహాభారత యుద్ధంలో భోజ వంశీయ రాజులు పాల్గొన్నారు. భోజుడు అనేక దేవాలయాలు నిర్మించాడు. అందులో ముఖ్యమైనది భోపాల్‌లో కట్టించిన "భోజేశ్వర దేవాలయం". భోజేశ్వర పట్టణంను భోపాలకు ముప్పై కిలో మీటర్ల దూరంలో బెట్వా నదీ తీరంలో నిర్మించాడు. భోజశాల నిర్మించి అందులో అతిపురాతన తాళపత్ర గ్రంధాలను సేకరించి ఉంచాడు. ఇది గొప్ప విద్యాకేంద్రంగా విలసిల్లింది. ఈనాటి ధార్‌లో భోజుడు నిర్మించిన సరస్వతీ దేవాలయం ఉన్నది.

భోజ రాజీయం

భోజుడు ఘూర్జర రాజవంశానికి చెందిన వాడు. వేదాంతం, కవిత్వం, జంతుశాస్త్రం, యోగ శాస్త్రం, భాషా శాస్త్రం, ధనుర్ శాస్త్రాలలో గొప్ప గ్రంధాలు రచించాడు. భోజుడి కాలంలో మధ్య భారతం సువర్ణ యుగంగా పేరు పొందింది.

గుజరాత్ రాజు సోలంకితో కలిసి సోమనాధాలయాన్ని నిర్మించాడు. 1026–1042కాలంలో ఈ బృహత్ నిర్మాణం జరిగింది. భోజపురం నిర్మించాడు ఈనాటి భోపాల్ కూడా ఆయన కట్టించినదే. భోజపట్నంలో ధనపాలుడు అనే జైన పరివ్రాజకుడు ఉండేవాడు. ఈయన బోధనలతో యజ్ఞ యాగాదులలో పశు హింసను ఆపేయించాడు. అంతేకాదు భోజుడు వేటాడటానికీ ఫుల్‌స్టాప్ పెట్టాడు. సైనిక బలాన్ని బాగా వృద్ధి చేసుకొని చాళక్య రాజుపై దండయాత్ర చేసి ఓడించి రాజ్యవ్యాప్తి చేశాడు. సుల్తాన్ మహమ్మద్ గజనీతో సౌరాష్ట్రలోని సోమనాధ దేవాలయం వద్ద భీకర పోరాటాలు చేశాడు. భోజ సైన్య ప్రతాపానికి గజని పలాయనం చిత్తగించాడు. శాకంబరి రాజు “చ: మానస్”ను ఓడించాడు. తర్వాత చండేలా రాజులు, రాష్ట్ర కూటులు మొదలైన వారంతా కలిసి భోజునిపై దండెత్తారు. సోలంకి రాజు భీమదేవుడి రాజ్యాన్ని ఆక్రమించాడు భోజుడు. భీముడు హయహయులతో చేతులు కలిపి భోజుని ఎదిరించాడు. హయహాయ రాజు కర్నాను సోలంకిని ధైర్యంగా ఎదుర్కొని భోజుడు పోరాడాడు. కాని ఒక బాణం వచ్చి తగిలి భోజుడు వీరమరణం పొందాడు. గజనీ ముతాను సోమనాధ దేవాల సమీపానికి రానీకుండా తీవ్రంగా అడ్డుపడ్డాడు భోజమహారాజు. భోజునిపై ఒక చాటువు ప్రచారంలో ఉంది –

“అద్య ధారా సదా ధారా సదాలంబ సరస్వతీ – పండితా: మండి తా: సర్వే భోజ భువనం గథే:”. దీని అర్థం – “ఇవాళ ధారా రాజ్యం ఎల్లప్పుడూ అండగా ఉంది. సరస్వతీ దేవి భూమిమీద కవులందరినీ సత్కరించే భోజుని కోసం ఎదురు చూస్తోంది.

భోజుడు ఓడిపోయిన తర్వాత కవులు –

“అద్య ధారా నిరాధారా నిరాలంబ సరస్వతీ – పండితా: ఖండితా: భోజ రాజే దివంగతే”. దీని భావం – “ఈనాడు ధారా రాజ్యానికి రక్షకులే లేరు. సరస్వతీ దేవికే సంరక్షణ లేదు. పండితులందరూ భోజుడు దివికి చేరగానే ఎక్కడివారు అక్కడే పారిపోయారు”. భోజుడు మొత్తం 84 గ్రంధాలు రచించాడు. పరిపూర్ణమైన కవిత్వ గ్రంధాలు రాశాడు. భోజునిది గొప్ప కవిత్వంగా పేరు

తెచ్చుకొన్నది. పతంజలి యోగ శాస్త్రానికి భాష్యం రాశాడు. సివిల్ ఇంజనీరింగ్ గురించి "సమరాంగణ సూత్రధారి" రాశాడు. ఇందులో దేవాలయ నిర్మాణం, కోటల నిర్మాణం, విగ్రహ నిర్మాణం, ఇళ్ళ నిర్మాణం మొదలైన సమస్త విషయాలున్నాయి. తత్వ ప్రకాశ అనే తాంత్రిక గ్రంథం, రసరాజ మృగాంకం అనే లోహశాస్త్ర గ్రంథం, యుక్తి కల్పతరు అనే నౌకానిర్మాణ శాస్త్రం, న్యాయశాస్త్రంపై ధర్మశాస్త్ర వృత్తి, చంపూ రామాయణం మొదలైనవి భోజ రచనలు. అన్నీ సుప్రసిద్ధాలే. బహుశాస్త్ర కోవిదుడు అయి నందు వల్లనే ఇలాంటి గ్రంథాలూ రాయగలిగాడు.

కవి పండిత పోషకుడై సాహిత్య ప్రేమికుడై నిరతాన్నదాత అయి ఆశ్రయించిన వారి కొంగు బంగారమై వర్ధిల్లిన రాజు భోజుడు. మన కృష్ణదేవరాయల ఆస్థానంలో కవి పండితులున్నట్లే భోజాస్థానంలోను కాళిదాసాది కవులుండేవారు రాయలూ కవే. భోజుడూ కవే. అందుకే రాయలను ఆంధ్రభోజుడు అన్నారు. భోజుని చంపూ రామాయణం వాల్మీకమే. దానిపై తన భక్తిని చాటుకొంటూ భోజుడు "వాల్మీకి గీత రఘుపుంగవ కీర్తి లేశైః – తృప్తిం కరోమి కధమప్యాదునా బుధానాం – గంగా జలైర్భువిని భాగీరధ యత్న లబ్ధైః – కిం తర్పణం నవిదధాతి నరః పిత్రూణాంః" అన్నాడు. అంటే "భగీరధుడు తన పితృదేవతలకు గంగాజలంతో తర్పణలిచ్చి తరింపజేసినట్లు వాల్మీకి మహర్షి రాసిన రామచరిత్రనే ఆధారంగా సజ్జనులకు తృప్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నాను".

భోజుని కవిత్వం రస రమ్యమైనది. వర్ణనలను అద్భుతంగా చేశాడు. రుతువర్ణనలు గొప్పగా ఉంటాయి. అనుప్రాస యమకాలంకారాలను బాగా ఉపయోగించుకొన్నాడు. ఆ పాత మధురమైన కవిత్వంతో విందు చేస్తాడు. గద్యమూ హృద్యంగా రాశాడు. లలితంగా, కర్ణపేయంగా కవిత్వం ఉంటుంది. అలాంటి శబ్దాలనే ఎన్నుకొంటాడు. వైదర్భీ శైలికే ఎక్కువ విలువ నిచ్చాడు. శ్లేషనూ సమాదరించాడు. అంత్యప్రాసలతో అలరిస్తాడు –

"ఏనాం పురాణ నగరీం నగరీతి సాలాం – సాలాభి రామ భుజ నిర్జిత యక్ష రాజః – హేలాభి భూత జగతాం రజనీ చరా – ణాంరాజా చిరాదయితి రావణ నామ ధేయః". వాలి వధ తర్వాత తార విలాపంలో శోకాన్ని బాగా

ప్రదర్శింపజేశాడు –

"నాహం సుకేతు తనయా నచ సప్త పాళీ – వాలీ నచ త్రిభువన ప్రదిత ప్రభావః

తారాస్మి వజ్ర హృదయా విశిఖర భేద్యా – ధన్వీ కదం భవసి రాఘవ మామ విధ్వా". రాముడితో తార అన్న మాటలివి – "రామా నేను తాటకను కాను. సప్త తాళ వృక్షాలనూ అంతకంటే కాను. త్రిభువన పరాక్రమ శీలి వాలినీ కాను. వజ్ర హృదయం ఉన్న తారను. నన్ను నువ్వు ఏమీ చెయ్యలేవు. నన్ను చంపే వరకు ధన్వి అనే పేరు నీకు సార్ధకం కాదు"

రామాయణ చంపువును "భోజ చంపు" అంటారు. చంపు అంటే పద్యం, వచనం కలిసి ఉన్న కావ్యం అని తెలిసిందే కదా. ఆంధ్ర దేశంలో పూర్వం గురుకుల విద్యలో రామాయణ చంపుతోనే విద్యార్థి మొదలు పెట్టేవాడట. అంతటి ప్రశస్తి భోజుని చంపువుకున్నది. ద్రావిడ కర్నాటకాలలో కూడా దీనికి వ్యాప్తి, ఆసక్తి ఎక్కువ. దీనికి నారాయణ, రామచంద్ర కామేశ్వర ఘనశ్యామలు రాసిన టీకాలు ఉన్నాయి.❁



47. ప్రబోధ చంద్రోదయ నాటకకర్త - కృష్ణ మిశ్రుడు (1050-1116 ad)

మధ్య భారతంలోని ఖజురాహో దేవాలయ నిర్మాతలైన చందేలా రాజులలో ఒకడైన కీర్తి వర్మ ఆస్థానకవి కృష్ణ మిశ్రుడు. కాలం 1050-1116. రాజు కోరికపై చంద్రోదయం నాటకం రాశాడు. దీని అర్థం ఏమిటి అంటే "బుద్ధి అనే చంద్రుని పుట్టుక". బుద్ధికి సంబంధించిన ఇతివృత్తం. మాయ, ప్రవృత్తి, మనస్సు, వివేకం, విద్య, శాంతి, లోభం మొదలైన పాత్రలున్నాయి. గౌడ దేశమైన బీహార్ బ్రాహ్మణుడు కృష్ణమిశ్రుడు.

మిశ్రు కవితా క్రిష్ణాయం

ఇదే విధంగా పూర్వం అశ్వ ఘోషుడు ప్రతీకలతో బుద్ధి కీర్తి మొదలైన పాత్రలతో ఒక నాటకం రాసినట్లు తెలుస్తోంది. కాని పూర్తి ప్రతి అలభ్యం. ఈ నాటకం ప్రేరణతోనే కృష్ణ మిశ్రుడు ప్రబోధ చంద్రోదయ నాటకం రాశాడు. ఇది రాజాస్థానంలో ప్రదర్శింపబడింది కూడా. కథ గురించి ఆలోచిస్తే కీర్తివర్మ అనే చేది రాజు కర్ణుడితో యుద్ధం చేసి విజయం సాధిస్తాడు. యుద్ధంలో జరిగిన రక్త పాతానికి వికల మనస్కుడౌతాడు. రాజు దు:ఖాన్ని పోగొట్టటానికే ఈ నాటకాన్ని కృష్ణ మిశ్రుడు రాశాడు. దీని తర్వాత ఇలాంటివి నాటకాలు చాలా వచ్చాయి.

ప్రబోధ చంద్రోదయం అద్వైతాన్ని బోధిస్తుంది. మోహరాజు ముందుగా పురుషుడిని తన వలలో వేసుకొంటాడు. వివేకుడు రాజును ఓడిస్తాడు. అప్పుడు పురుషుడికి ఆత్మ సాక్షాత్కారం అవుతుంది. దానితో శాశ్వత జ్ఞానం లభిస్తుంది. అద్వైతంతోపాటు విష్ణుభక్తిని జోడించాడు కవి. ఉపనిషత్ విద్య, విష్ణుభక్తీ "జ్ఞానరూప చంద్రుని ఉదయానికి" కారణాలు అని ఈ నాటకం ద్వారా కృష్ణ మిశ్రుడు చెప్పాడు. విషయం చాలా గంభీరం. ఈ కథ ఉత్కంఠ ఉందని నీరస కథ అయినా అవి నాటకాన్ని సరసంగా సరళంగా మనస్సుకు హత్తుకొనేట్లు చేసి విజయం సాధించాడు. జైన, బౌద్ధ సంప్రదాయాల సంభాషణలనూ రసవత్తరంగా రాశాడు. ఇందులో వచ్చే దంభం అలంకారం పాత్రల ద్వారా హాస్యాన్ని పిండాడు. నాటక శైలి ప్రసాద గుణ భరితం. ధర్మ మయమైన కవిత్వంతో గొప్ప న్యాయం చేకూర్చాడు. ప్రతీకాత్మ నాటకాలలో ప్రబోధ చంద్రోదయం సర్వ శ్రేష్ట నాటకం. ఈ ధోరణిలో విశిష్టాద్వైతంలో "సంకల్ప సూర్యోదయం" వచ్చింది. ❁



48. వ్యంజనా వృత్తి కారుదు - ముమ్మటుడు (1050-1100 ad)

ముమ్మటుడు 1050-1100వాడు. అభినవ గుప్తుడి శిష్యుడినని తానే చెప్పుకున్నాడు. "కావ్య ప్రకాశం" అనే అలంకార గ్రంథం రాశాడు. సాహిత్య శాస్త్రములో ముమ్మటుడి కావ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇతని జన్మస్థలం తల్లిదండ్రుల గురించి తెలియదు.

ముమ్మట సమ్మత కావ్యత్వం

కావ్య ప్రకాశంలో ముమ్మటుడు పూర్వ అలంకార వాదుల మార్గాన్నే అనుసరించాడు. కాని ధ్వని సిద్ధాంతాన్ని బాగా సమర్థించాడు. ఈ సిద్ధాంతాన్ని ఎదిరించిన వారికి దిమ్మ తిరిగే సమాధానాలు చెప్పి యుక్తులతో ధ్వనికి అశేష ప్రాచుర్యం సాధించాడు. ఆనంద వర్ధనుడి ధ్వని సిద్ధాంతానికి తిరుగులేని ప్రచారం ముమ్మటుని వల్లనే సాధ్యమైంది. భామహుడు కూడా ధ్వని వాదియే అని నిరూపించాడు. కావ్య ప్రకాశంలోని భాగాలను "ఉల్లాసాలు" అన్నాడు. ఇందులో నూట నలభై కారికలున్నాయి. మొదటి ఉల్లాసంలో మామూలుగానే కావ్య ప్రయోజనాలు, కావ్య హేతువులు, భేదాలు, కావ్య భేదాలు చెప్పాడు. రెండులో శబ్ద వ్యంజనం గురించి చెప్పాడు. మూడులో అర్ధ వ్యంజన గురించి చెప్పాడు.

నాలుగులో రసాది ధ్వని చర్చ చేశాడు. అయిదులో వ్యంజన యొక్క శక్తిని వివరించాడు. ఆరవ ఉల్లాసంలో చిత్రకావ్య ప్రస్తావన చేశాడు. ఏడులో గుణదోష చర్చ చేశాడు. ఎనిమిదిలో గుణం అంటే ఏమిటో తెలియజేశాడు. తొమ్మిదో ఉల్లాసంలో శబ్దాలంకారాలను వివరించాడు. పదిలో అర్థాలంకార వివరణ ఉంది. “తద దోషౌ శబ్దార్థౌ సగుణా నవలం కృతీ పునః క్వాపి” అని గుణాన్ని నిర్వచించాడు. దోషాలు లేకుండా గుణ సహితంగా కావ్యం ఉండాలని దండి చెప్పినదాన్ని దండిగా సమర్థించాడు. దీనికి బలీయంగా దోష చర్చను చాలా విపులంగా చేసి ఆ దారి పట్టవద్దని హెచ్చరించాడు. ఎక్కువగా అలంకారం మీద ఆధారపడలేదు. అందుకే “అనలం కృతీ పునః క్వాపి” అని సమర్థించుకొన్నాడు. కాని అలంకార భేదాలను మాత్రం విపులంగా చర్చించాడు. ముమ్మటుడి కావ్య ప్రయోజనాల, కావ్య హేతువుల గురించి చేసిన చర్చ అందరినీ ఆకర్షించింది. అతని శబ్ద శక్తుల వివరణ ప్రాచుర్యం పొందింది.

ముమ్మటుడి కావ్య ప్రాకాశానికి మొట్టమొదటి వ్యాఖ్యానం మాణిక్య చంద్రుడు అనే జైన మతాచార్యుడు 1159లో రాశాడు. తర్వాత చాలామంది రాశారు. దాదాపు యాభై టీకలు రాశారు. భగవద్గీతకు తప్ప ఇన్ని టీకాలు మరి ఏ ఇతర గ్రంథానికీ లేదని అంటారు. టీకలకు వివరణలు, వివరణలకు మళ్ళీ టీకలు రాస్తూనే ఉన్నారు. ప్రతి ఇంటిలో ముమ్మటుడి “కావ్య ప్రకాశం” ఆవరించి ఉంది అని ఒక శ్లోకం ప్రచారంలో ఉంది – “కావ్య ప్రకాశస్య కృతాగృహే గృహే టీకా తదాప్యేష తథైవ దుర్గమ:”❁

49. కుందమాల నాటక రచయిత దిజ్ఞాగుడు (1100 ad)

కుందమాల (జాతిమల్లె పూదండ) అనే నాటకాన్ని రచించిన దిజ్ఞాగ కవి క్రీ.శ.1100వాడు. బౌద్ధ దార్శనికుడైన ఇంకొక దిగ్నాగుడు ఉన్నాడు. వీరిద్దరూ వేరే అని గ్రహించాలి. ఉత్తర రామాయణ కధను తీసుకొని భవభూతిలాగా అనేకానేక మార్పులు చేసి ముకుందమాల నాటకం రాశాడు. సీతా పరిత్యాగంతో నాటకం మొదలౌతుంది. మళ్ళీ జానకీరాముల సమాగమంతో నాటకం పరిపూర్తి అవుతుంది. భవభూతి ఛాయలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆయనలాగానే కరుణ రస పోషకంగా ముకుందమాలను తీర్చిదిద్దాడు.

దిజ్ఞాగుని కవితా విశేషాలు

ఆరు అంకాలున్న నాటకం ముకుంద మాల. రాముడు సీతాపవాద వార్త విని లక్ష్మణుడిని గర్భిణి అయిన సీతను అరణ్యంలో గంగానది ఒడ్డున విడిచిపెట్టి రమ్మంటాడు. అక్కడ మహర్షి వాల్మీకి ఆమెను చూసి తన ఆశ్రమానికి తీసుకు వెడతాడు. కుశలవులను సీత ప్రసవిస్తుంది. మహర్షి వారికి రామకధను గాన రూపంలో నేర్పిస్తాడు. రాముడు అశ్వమేధ యాగం చేస్తూ వాల్మీకి మహర్షిని ఆహ్వానించటానికి ఇక్కడికి వస్తాడు. అప్పుడు రాముడు గోమతీ నదిలో

కొట్టుకుపోతున్న "కుందమాల" పుష్పహారాన్ని చూస్తాడు. అది సీత కట్టే మాలలాగా ఉందనిపిస్తుంది. సీతా వియోగంతో దుఖం పెల్లుబికి వస్తుంది. చాటుగా ఉన్న సీత కూడా భర్త దుఖాన్ని చూసి కరిగిపోతుంది. ఇద్దరి మనోబాధను కవి చాలా కరుణరసాత్మకంగా చిత్రించాడు. ఇంతలో కుశలవులు రామాయణ గానం చేస్తూ అక్కడికి చేరుకొంటారు. సీతారామ లవకుశ సమాగమంతో నాటకం పూర్తి అవుతుంది.

కవి గొప్ప నాటకీయతను ప్రవేశపెట్టి ప్రతి అంకాన్ని రసభరితం చేశాడు. భవభూతి లాగానే. కవిత్వమూ సులభ బోధకంగా ఉండి మనసుకు హత్తుకుంటుంది. భవభూతిని అనుకరించినా తన ప్రత్యేకతలను కొన్నికొన్ని సందర్భాలలో చాటుకొన్నాడు. విశ్వనాథ సత్యనారాయణ గారు తన రామాయణ కల్పవృక్షం అవతారికలో "భాస కాళిదాస భవభూతి దిఙ్నాగులకు, ప్రశస్త వాగ్వి లక్ష్మణుడు మురారి భట్టునకును, రామ కథా భాష్య కారుకులకు కైమోడ్పు ఘటించి" అని ప్రస్తుతించారు. అందులో దిఙ్నాగునికీ స్థానం లభించింది. కుందమాలను మానవల్లి రామకృష్ణయ్య పంతులుగారు తెలుగులోకి అనువదించారు. దిఙ్నాగుడు ఆంధ్రుడే అని ఆచార్య తిరుమల రామచంద్ర రాశారు. తక్షశిల విశ్వవిద్యాలయంలో దిగ్నాగుడు తర్కాన్ని బోధించే ఉపన్యాసకుడుగా ఉన్నాడు. ఇతని గురువు భగంత వసు బంధువు కూడా కవే. కాళిదాసు మేఘ సందేశంలో దిఙ్నాగుని గురించి ప్రస్తావించాడు. ఈయనకు మరోపేరు భదంత దీరనాధుడు.

బౌద్ధదార్శనికుడు - దిఙ్నాగుడు

బౌద్ధ దార్శనికుడైన దిఙ్నాగుడు తెలంగాణాలోని కరీంనగర్ జిల్లా కోటిపల్లి గ్రామనివాసి. ఈయన జీవితంలో చివరి కాలాన్ని వేంగిలో గడిపాడని తెలుస్తోంది. ఇది చూస్తే ఇద్దరూ ఒకరేనేమో అని అనుమానం రావటం ఖాయమే. చరిత్ర తేల్చాల్సిన విషయమే. ప్రమాణ సముచ్చయ పరీక్ష, హేతు చక్ర డమరుకం, న్యాయావయవం మొదలైన తర్క శాస్త్ర గ్రంధాలు రాశాడు. వేంగిలో (తెలంగాణు) ఒక కొండమీద ఒంటరిగా ఉండి ప్రమాణ సముచ్చయం రాశాడు. అనుష్టుప్ ఛందస్సులో ఉన్న ఈ గ్రంధం అలభ్యం. టిబెట్ లిపిలో దొరికింది. ఇది ఆరు

భాగాల రచన. వాత్సాయనుడు తన సూత్రాలను వాడుకొన్నాడని దిజ్ఞాగుడు చెప్పాడు. ప్రత్యక్ష, అనుమాన మొదలైన ప్రమాణాలను విపులంగా ఇందులో చర్చించాడు.

న్యాయ ప్రవేశిక లేక న్యాయావయవం తర్కశాస్త్రంలో కరదీపిక. దీని సంస్కృత ప్రతికూడా దొరకలేదు. టిబెటన్ అనువాదమే ఆధారం. ఇది తర్కానికి ప్రవేశ ద్వారం అంటారు. సధర్మ విధర్మ హేతువు మొదలైన వాటిని వివరించే గ్రంథం. హేతు చక్ర డమరువు అసలు సంస్కృత ప్రతికాల గర్భంలో కలిసిపోతే టిబెటన్ అనువాదమే ఆధారమైంది. ఆలంబన పరీక్షకు ఆలంబన పరీక్షా వృత్తిని దిజ్ఞాగుడు రాశాడు. త్రికాల పరీక్ష అనే మరో రచనా ఆయనదే. దిజ్ఞాగుని శిష్యుడు శంకరస్వామి అని చైనా అనువాదాల్లో కనిపిస్తుంది.❁

50. లీలాశుకుడనే - బిల్వ మంగళుడు (1100 ad)

పదకొండవ శతాబ్దానికి చెందిన బిల్వ మంగళుడు శ్రీకృష్ణ కర్ణామృతం రాశాడు. శ్రీకృష్ణ గానం చేసిన చిలుక కనుక లీలా శుకుడు అయ్యాడు. ఇందులో మూడు వందల పది శ్లోకాలున్నాయి. భక్తిరసం పొంగిపొరలేట్లు రాసిన కావ్యం ఇది. శ్రీకృష్ణ భక్తి పరాకాష్టగా చెప్పాడు లీలాశుకుడు. మూడు ఆశ్వాసాలున్నాయి. ఒక్కోదానిలో నూట పది శ్లోకాలున్నాయి. మొదటి దానిలో శ్రీకృష్ణ సాక్షాత్కారం, రెండవ దానిలో కృష్ణ లీలలు, మూడు కృష్ణుని జీవితంలో అనేక మధుర ఘట్టాలున్నాయి. నిత్య పారాయణ గ్రంథంగా గొప్ప వ్యాప్తి ఉన్నది. భక్తి తప్ప శృంగారానికి చోటు కల్పించలేదు. జయదేవుడే లీలాశుకుడు అయ్యాడనే ప్రచారం ఉంది. చింతామణి అనే వేశ్యతో బిల్వ మంగళుడు ఉండేవాడు. ఒకసారి పెద్ద గాలివానలో ఆమెను కలుసుకోవటానికి పెరటి గోడ ఎక్కుతూ తాడు అనుకోని పామును పట్టుకొన్నాడు. జ్ఞానోదయమై లీలాశుకుడుగా మారాడు. “కస్తూరీ తిలకం లలాట ఫాలకే” శ్లోకం రాని వారుండరు. అది లీలాశుకుని శ్లోకమే. కర్ణామృతాన్ని రాగమాలికలలో సభల్లో గానం చేస్తారు. ఈయన కృష్ణాజిల్లాకు చెందినవాడే అంటారు. శ్లోకాలన్నీ ముక్తక రూపంలో ఉండటం ప్రత్యేకత. దేనికదే ప్రత్యేకత కలిగి ఉంటుంది. కృష్ణుడు గోప బాలకుడుగా, గోప బాలకుల స్నేహితుడుగా, లోకోత్తర శృంగార పురుషోత్తముడుగా ఇందులో దర్శనమిస్తాడు.

“చింతా మణిర్జయతి సోమ గురుర్మే - శిక్షా గురుశ్చ భగవాన్ శిఖి పింఛమౌళిః

యత్పాదకల్ప తరు పల్లవ శేఖ రేషు - లీలాస్వయం వర రసం లభతే జయశ్రీ”

గబ్బిట దుర్గాప్రసాద్

అనంత పద్మనాభ స్వామిని మొదట దర్శించినవాడు బిల్వ మంగళ రుషియే. కర్ణామృతం కాక శ్రీ చిహ్నం, పురుష కారం, అభినవ కౌస్తుభ మాల, దక్షిణామూర్తి స్తవం, కాలవధ కావ్యం, దుర్గా స్తుతి, బాలకృష్ణ స్తోత్రం, బాల గోపాల స్తుతి, శ్రీకృష్ణ వరదాష్టకం, బృందావన స్తోత్రం, భావన్నాముకురం, రామ చంద్రాష్టకం, గణపతి స్తోత్రం, అనుభవాష్టకం, మహా కాలాష్టకం, మహాలక్ష్మి స్తోత్రం, కర్కోటక స్తోత్రం, కృష్ణలీలా వినోదం, సాకార హృదయంగమం సుబంధ సామ్రాజ్యం, తిన్ గంధ సామ్రాజ్యం, క్రమ దీపిక మొదలైన ఇరవై రెండు గ్రంధాలు రచించాడు. కర్ణామృతం వింటూ శ్రీకృష్ణుడు తల ఊపేవాడని అంటారు.❁

51. ఆర్యా సప్తశతి కర్త - గోవర్ధనాచార్యుడు (1116 ad)

క్రీ.శ.1116 వాడైన గోదర్ధనా చార్యుడు లక్ష్మణ సేన మహారాజు ఆస్థాన కవి. ప్రాకృత గాథా సప్తశతిని అనుకరిస్తూ "ఆర్యా సప్తశతి"ని సంస్కృతంలో రాశాడు. ఇందులోనూ ఏడు వందల శ్లోకాలున్నాయి. ఇది కూడా ముక్తక కావ్యం. ప్రతి శ్లోకానికి ఒక కథ ఉంటుంది. ముక్తకాలలో గొప్ప పేరు పొందినదిది. జయదేవుడి ప్రస్తుతి పొందిన కవి గోవర్ధనుడు. "శృంగారోత్తర సత్ప్రమేయ రచనా నైరాచార్య గోవర్ధన - స్పర్ధికో పి న విశ్రుత: శృతి దారో ధోయీ కవిక్ష్మా పతి:" అంటూ జయదేవుడు ధోయీని గోవర్ధనుడిని పొగిడాడు. దోయి ఏక సంతాగ్రాహి గోవర్ధన్ శృంగార రసపట్లు తెలిసినవాడు. ఇద్దరూ లక్ష్మణసేనుని ఆస్థాన కవులే.

కవితా గోవర్ధనం

అప్పటిదాకా ప్రాకృతంలోనే ఉన్న ముక్తక సాహిత్యాన్ని సంస్కృతంలోకి ప్రవేశపెట్టిన మొదటివాడను తానేనని గోవర్ధనుడు చెప్పుకొన్నాడు. "వాణీ ప్రాకృత సముచిత రాసా బలేనైవ సంస్కృతం నీతా - నిమ్నాను రూప నీరా కాళింద కన్యేవ గగన తలం". దీని భావం - "లోతులో ప్రవహిస్తున్న యమునా నదిని బలరాముడు గగన తలానికి చేర్చినట్లు ప్రాకృత పాతాళంలో ఉన్న రసమయ వాణిని సంస్కృతంలో ప్రవేశపెట్టాను అని కావ్యం మొదట్లో చెప్పాడు.. ఈ కావ్యం రాసి తన సోదరులిద్దరికీ నేర్పాడు. వారు దీన్ని గొప్పగా ప్రచారం చేశారు. అమూల్యపద విన్యాసంతో ఈ ముక్తకాలు ముత్యాల సొగసును వెదజల్లుతాయి. మనసుకు బాగా పట్టుకొనే సులభ సుందర ఆర్యా వృత్తాలలో వీటిని రాసి విపరీతమైన క్రేజ్ తెచ్చాడు. సజ్జన హృదయాలను అయస్కాంతంలాగా ఆకర్షిస్తాయి. మదన

రూప బ్రహ్మ జ్ఞానానికి ఉపనిష్టుల లాంటివి అన్నారు వీటిని.

ఇందులో వివిధ రకాల నాయికల వర్ణన ఉంది. ప్రేమ సంయోగం వియోగం, ఈర్ష్య, అసూయ, శృంగారం అనునయం యథా ప్రకారం ఉన్నాయి. రసవాది అనిపిస్తాడు. "రాతిరేవ వీత వాసనా ప్రివేవ శుద్ధాపి వాఙ్మదే సరసా - అరసా సాలంకృతి రాపి న రోచతే శాల భంజీవ" భావం "రాతిలో వస్త్రాలను వదిలేసిన నాయిక, నాయకుని అనన్య రతి భావం కల ప్రియురాలులాగా అలంకారం లేని సరస వాణి ఆనంద ప్రదంగా ఉంటుంది. అలంకారాలతో ఉన్నా రస శూన్యంగా ఉన్న వాణి అలంకారాలతో నిండిన సాలభంజిక లాగా రుచికరంగా ఉండదు". అనుప్రసాద్యలంకారం అంటే గోవర్ధనుడికి మహా ఇష్టం. దీనితో కావ్యాన్ని రస మగ్నం చేసి మానసికానందాన్ని కల్గిస్తాడు. అలంకారం అంటే చాలు పులకించిపోతాడు. అన్యోక్తి అలంకారమూ చాలా ఇష్టమైనదే. వ్యంగ్యార్ధంతో కావ్యాన్ని రస శోభా భరితం చేశాడు.

గోవర్ధనుడి లోక పరిశీలనా శక్తి గొప్పది. మంచి లోకజ్ఞానం ఉన్నవాడు. అతని శాస్త్ర పరిచయ జ్ఞానం దొడ్డది. రెండే పాదాలు ఉండే ఆర్యా ఛందస్సులో ఒక్కొక్కటి ఒక్కో కావ్య ఖండంగా తీర్చిదిద్దిన గొప్ప కవితా ప్రతిభ గోవర్ధనుడిది. రామణీయమైన వ్యంగ్యార్ధాలతో ప్రతి ముక్తకాన్ని ఒక మహా ముత్యంలా మెరుగులు దిద్ది ప్రకాశమానం చేశాడు. ప్రాకృతం మీద మంచి గౌరవం కలిగినవాడు. అందుకే గుణాఢ్యుడు యితనిని వ్యాస వాల్మీకి అంతటివాడు అని కీర్తించాడు.

ఒక సఖిని చెలులు యెంత నచ్చచెప్పినా ప్రియుడిని చేరలేదు. విసుగెత్తి వాళ్ళు వెళ్ళిపోగా ప్రియుడు ఆమె చెంత చేరగా ఆమె అతనితో "నా సఖులు చెప్పింది నేను వినలేదు. వాళ్ళు నన్నొదిలి వెళ్ళిపోయారు. ఇప్పుడు నేను ఒంటరిని. నువ్వు నన్ను బలాత్కరించాలి అనుకొంటే నా సర్వస్వం సమర్పించటానికి సిద్ధంగా ఉన్నాను" అంటుంది మరో శ్లోకంలో "అగ్రుహీతానునయాం మా ముపేక్ష్య సఖ్యోగతా బతైకాహం - ప్రసభం కరోపిమయి చేత్వదుపరి వపురద్య మోక్షామి" ఇదొక సాంపిల్ మాత్రమే. కావ్యంలో అడుగడుగునా యిలాటివి కోకొల్లలు. జుర్రుకొనే ఓపిక ఉండాలికాని కావ్యం ఆపాత మధురమే.❀

52. కావ్యశాస్త్ర కర్త - హేమ చంద్రాచార్యుడు (1100 ad)

పదకొండవ శతాబ్దికి చెందినవాడు హేమచంద్రుడు. కవి, వ్యాకరణవేత్త, అలంకారికుడు. గుజరాతు రాజు "అన్హిల వాడ చాళుక్య రాజు కుమార పాలుడి చరిత్రను" కుమార పాల చరిత్ర కావ్యంగా రాశాడు. సంస్కృత, ప్రాకృత, వ్యాకరణాలను రచించాడు. కుమార చరిత్ర ఇరవై ఎనిమిది సర్గల కావ్యం. మొదటి ఇరవై సంస్కృతంలో, మిగిలిన ఎనిమిది సర్గలు ప్రాకృతంలో రాసిన సవ్యసాచి. ఇందులో తన వ్యాకరణ పాండిత్యాన్ని అంతా గుప్పించాడు. అందుకే ఇది కావ్య శాస్త్రం అయింది. ద్వాశ్రయం అన్నారు. ఈ కావ్యంలో సంస్కృత భాగానికి "అభయ తిలక గణి" వ్యాఖ్యానం చేశాడు. కావ్యం వీర రస ప్రధానం. ఒక సర్గ అంతా రాత్రినే వర్ణించటం విశేషం. సోమనాధ జ్యోతిర్లింగ మహా భక్తుడు కవి. జైన హిందూమత సామరస్యాన్ని గుజరాత్‌లో సాధించిన ఘనత హేమచంద్రుడిది.

హేమ చంద్రుని విజ్ఞానం అపారమైనది. అతని శబ్ద భాండారం అంతులేనిది. కొత్త కొత్త శబ్దాలను సృష్టించి ప్రయోగించి గౌడీ రీతిలో కావ్యాన్ని రాశాడు. వ్యాకరణాన్ని కావ్య లక్షణాలపై జోడు గుర్రాల సవారీని సమర్ధవంతంగా చేసి సుభాష్ అనిపించుకొన్నాడు. అన్ని రకాల అలంకారాలు వాడాడు. చాళుక్యులు మూడు వందల ఏళ్ళు గుజరాతులోని కథియ వాడును పాలించారు. చాళుక్య మూల పురుషుడితో ప్రారంభించి కుమార పాలుని చరిత్రతో ముగించాడు. కుమారుడు ముసలితనంలో హేమ చంద్రుని ప్రోద్బలంతో జైన మతాన్ని స్వీకరించటంతో ముగింపు పలికాడు. రాజు జీవించి ఉండగానే హేమచంద్రా చార్యుడు 1172లో మరణించాడు.❀

53. పృథ్వీ రాజ చరిత్ర కర్త - జయాంకుడు (1100 ad)

అజ్మీరు ఢిల్లీ రాజ్యాలను పరిపాలించిన పృథ్వీరాజ్ చోహాన్ చరిత్రను కావ్యం రాసినవాడు జయాంకుడు. కాశ్మీర దేశంలో శిధిలావస్థలో ఉన్న ఈ కావ్యాన్ని "బ్యూలర్" కనుగొన్నాడు. అసంపూర్తి కావ్యమే. పన్నెండు సర్గలున్నాయి. పృధ్వీరాజు మహమ్మదీయ రాజులను జయించే వృత్తాంతంతో బాటు ఆయన పట్టాభిషేకం ఉంటుంది. జయాంకుడు పృధ్వీరాజు ఆస్థాన కవి. కనుక కాశ్మీరీ అని అనుకోవచ్చు. బిల్హణుడి శైలితో రాసిన కావ్యం. జానరాజు అనే కాశ్మీర కవి దీనికి వ్యాఖ్యానం రాశాడు. 1193కు పూర్వమే కావ్యాన్ని రాశాడు. కారణం 1191లో పృధ్వీరాజు షహబుద్దీన్ ఘోరిని ఓడిస్తే 1193లో గోరీ ఇతన్ని ఓడించి చంపాడు.

కవితా జయాంకం

జయాంకుడికి వేద, పురాణ, మహాకావ్య, న్యాయ, వ్యాకరణ, జ్యోతి శాస్త్రాలలో నిష్ణాతుడు. కావ్యంలో రామాయణ మహాభారత గాధలను ఉటంకించాడు. పూర్వ కవుల ప్రభావం బాగా ఉన్నవాడు. పాంచాలీ, గౌడీ రీతుల్లో అలంకార యుక్తంగా కావ్యం రాశాడు. చౌహాన్ రాజవంశ చరిత్ర గురించి తెలియజెప్పే చారిత్రక కావ్యం ఇది. ఈ వంశంలో పృధ్వీరాజు మూడవ రాజు. కవి ఇతన్ని విష్ణువు అంశంగా భావించాడు. చివరీ ఘోరీతో జరిగిన యుద్ధ ప్రస్తావన ఇందులో లేకపోవటం ఆశ్చర్యమే.❁

54. నవ సాహసాంక చరిత్రకర్త - పరిమళ పద్మ గుప్తుడు (1000-1100 ad)

కాళిదాస మహాకవి మీద గౌరవంతో "పరిమళ కాళిదాసు" అనే బిరుదు పొందాడు పరిమళగుప్తుడు. ధారానగర రాజు సాహసాంక అనే బిరుదు పొందిన సింధురాజు ఆస్థానకవిగా ఉన్నాడు పద్మగుప్తుడు. కవి పండిత పోషకుడు రెండవ వాక్పతి రాజు తమ్ముడే సింధురాజు. భోజరాజు తండ్రి. సింధు కూడా కవి పండిత పోషకుడు. వాక్పతి కర్నాటక రాజు తైలపూడి చేతిలో మరణించాడు. సింధురాజు రాజయ్యాడు. పద్మగుప్తుడి తండ్రి మృగాంక గుప్తుడు. సింధురాజు ప్రోత్సాహంతో ఈ కవ్యం రాశాడు. ఇతని తర్వాత ముంజరాజు, ఆ తర్వాత భోజుడు రాజులయ్యారు. ఈ ఇద్దరి ఆస్థానాల్లోను పద్మగుప్తుడు కవి. భోజుడు ఎక్కడా ఇతని విషయం ప్రస్తావించలేదు. కనుక పద్మగుప్తుడు పదవ శతాబ్దం చివరినుండి పదకొండవ శతాబ్దంలోపు వాడు. గుప్తుడు కాశ్మీర దేశపు శైవుడు.

గుప్తుని కవితా పద్మ పరిమళం

"నవ సాహసాంక చరిత్ర" పద్ధెనిమిది సర్గల కావ్యం. క్షేమేంద్రుడు ఇతని శ్లోకాలను ఉదాహరించాడు. ఇందులో సింధురాజు నాగరాజు కూతురు శశిప్రభను పెళ్లి చేసుకోవటం ఇతివృత్తం. వజ్రాంకుడు అనే నాగుల శతృవును చంపి, వాడి సరస్సులో ఉన్న బంగారు కమలం తెచ్చి నాగరాజు కిచ్చి అతని కూతురు శశిప్రభను పెళ్ళాడతాడు. రమ్యమైన శైలిలో కావ్యం నడిపాడు. అనుప్రాసలతో కవిత్వం పారించాడు. ఓజోగుణశైలి ఎక్కువ. సహజ వర్ణనలు చేశాడు. అలంకార పుష్టిని కావ్యానికి చేకూర్చాడు. తన అభిమాన కవి మహా కవి కాళిదాసును అన్నిటా అనుకరించాడు అనుసరించాడు.

సింధురాజు పరమార వంశానికి చెందినవాడు. క్షత్రియులని, బ్రహ్మక్షాత్ర కులం వారమని చెప్పుకొన్నారు. పదకొండవ సర్గలో పరమార వంశ చరిత్ర చెప్పాడు. విశ్వామిత్రుడు వశిష్టుడి కామధేనువును ఎత్తుకుపోగా అరుంధతి దేవి మొదలైన రుషిపత్నులు తీవ్రంగా విచారించారు. వశిష్ట మహర్షి యజ్ఞం చేస్తాడు అందులో నుంచి ఒక దివ్య పురుషుడు ఉద్భవించి విశ్వామిత్రుడి దగ్గర ఉన్న కామధేనువు తెచ్చి ఇస్తాడు. ఆ పురుషుడికి "పరమారుడు" అనే పేరు పెట్టాడు వశిష్టుడు. అతని నుంచి పరమార వంశం ఏర్పడింది. శాసనాలలో దీన్నే రాసుకొన్నారు.

పదవ సర్గలో సింధురాజు వాగడ, మురళ, లాబా, హూణ దేశాలను జయించినట్లు రాశాడు. ఇవన్నీ చారిత్రక సత్యాలే. విద్యాధరుల సాయంతో సింధురాజు వజ్రాంకశ రాజును జయించి నాగరాజు కూతురు శశిప్రభను వివాహం చేసుకోవటం చారిత్రక సత్యమే అన్నారు. వజ్రాంకుడి రాజధాని రత్నావతి నర్మదా నదికి దక్షిణాన ఉంది. వీరు జీమూత వాహనుడిని తమ వంశమూల పురుషుడిగా చెప్పుకొంటారు. బహుశా వీరి రాజ్యం కొంకణ ప్రాంతం అయి ఉండాలి.❁

55. ద్వ్యర్ధికవి రాజు - కవిరాజు (1182-1197 ad)

మాధవ భట్టు అసలు పేరున్న కవిరాజు 1182-1197 కాలపు జయంతి పురాధీశ్వరుడు కదంబ వంశరాజు కామదేవుడి ఆస్థానకవి. “రాఘవ పాండవీయం” అనే ద్వార్ధికావ్యాన్ని సంస్కృతంలో రాశాడు. పదమూడు సర్గలతో ఆరు వందల అరవై ఎనిమిది శ్లోకాలతో వర్ధిల్లిన రామాయణ, మహాభారత కధలు జమిలిగా ఉన్న కావ్యం ఇది. ప్రతి సర్గ చివర రాజు పేరు చేర్చటం విశేషం. కనుక దీనికి “కామ దేవాంకం” అనే పేరు కూడా ఉంది.

కవిరాజీయం

తనకంటే ముందు ధనుంజయుడు రాసిన రాఘవ పాండవీయకర్త ధనుంజయుడికి ఆశ్రయమిచ్చిన “ముంజ రాజు” కంటే తనకు ఆశ్రయమిచ్చిన కామదేవుడు గొప్పవాడని చమత్కరించాడు -

“శ్రీ విద్యా శోభినో యస్య శ్రీ ముంజా దియతీభిదా - ధారాపతి రసావాదీయం తావ ద్ధరా పతి:” భావం - శ్రీ విద్య అనే తాంత్రిక సిద్ధిగల ముంజరాజుకు లక్ష్మీ సరస్వతుల చేత శోభిల్లే కామదేవుడికి భేదం ఏమిటి అంటే - అతడు ధారాపతి అంటే ధారానగర రాజు, యితడు ధారాపతి అంటే భూమిపాలకుడు. ధనుంజయుని కావ్యం కంటే తన కావ్యం గొప్పదని భావించాడు. వక్రోక్తికి మహా వైభవాన్ని తెచ్చాడు. రామాయణ భారత కధలను జోడించిన తీరు ముచ్చటగా ఉంది. ద్వర్ధికావ్య రచన అసిధారా వ్రతం. దాన్ని అనాయాసంగా నిర్వహించి ద్వర్ధికావ్యానికి మహాకావ్య గౌరవాన్ని చేకూర్చాడు. ఒకే సర్గలో వివిధ

వృత్తాలను ఉపయోగించాడు. వీర రస ప్రధానమైనా, అన్ని రసాలను పోషించాడు. భావ ప్రకటనలో అద్వితీయుడనిపిస్తాడు –

"వికీర్ణ సంక్రందన చాప లేశాచ్చ వీనికీర్ణాని వనస్తలీషు – సలీల మాదాయ మయూర బర్హాన్యుత్తంస యంతిస్మకిరాతనార్య" భావం "విరిగిపడిన ఇంద్ర ధనుస్సు ముక్కలాగా ఉన్న అడవిలో చెల్లాచెదురుగా పడి ఉన్న నెమలి పింఛాలను ఏరుకొని కిరాత స్త్రీలు విలాసంగా తమ చెవులలో అలంకరించుకొంటున్నారు. నెమలి ఈకలను ఇంద్రధనుస్సు ముక్కలుగా పోల్చటం రమణీయ భావన.

రామాయణం పవిత్రమైన గంగానది. భారతం విశాల సముద్రం లాంటిది. ఈ రెండిటిని కలిపిన కవిరాజు భగీరథుడి వంటివాడు అని చమత్కరించాడు.

"శ్రీమద్రామాయణం గంగా, భారతం సాగరోపమన్ – తత్సంయోజన కార్యజ్ఞః కవిరాజో భగీరథః"❁

56. అలంకార సర్వస్వం కర్త - రుయ్యకుడు (1129-1149 ad)

రాజానక రుయ్యకుడు అని పిలువబడే అలంకారికుడు "అలంకార సర్వస్వం" రచయిత. 1129-1149 కాలంవాడు రాజానక అనేది ఒక పదవి అని అంటారు. రుచకుడనే పేరు కూడా ఉన్నవాడు. పాండిత్యంలో మేరు నగధీరుడు తన అలంకార శాస్త్రాన్ని సూత్ర రూపంలో రాశాడు. దీనికి వృత్తి కూడా ఉంది. ఇతని శిష్యుడే మంఖకుడు. శ్రీకంఠ కావ్యాన్ని రాశాడు. సూత్రాలను రుయ్యకుడు రాస్తే వృత్తి మంఖకుడు రాశాడని ప్రచారంలో ఉంది. అలంకార సర్వస్వానికి జయరధుడు టీక రాశాడు.

రుయ్యక పాండితీ గరిమ

అలంకార లక్షణాలను సూత్రాలలో చెప్పి వృత్తిలో ఉదాహరణలతో వివరించాడు. విశ్లేషణ పద్ధతి శాస్త్రీయ విధానంలో ఉంటుంది. ఇతర కావ్యాల విషయం ఎత్తుకోలేదు. కొత్త అలంకారాలను చేర్చాడు. ధ్వనివాదిగా రుజువు చేసుకొన్నాడు. ధ్వని సిద్ధాంతాన్ని ఖండించినవారిని ఖండించాడు. కావ్య ప్రకాశంకు "సంకేతం" అనే టీకా రాశాడు. మహిమ భట్టు రాసిన "వ్యక్తీ వివేకం"కు విచార విమర్శ చేశాడు. సాహిత్య మీమాంస, నాటక మీమాంస, అలంకారాల సరణి, సహృదయ లీల అనే గ్రంధాలను కూడా రుయ్యకుడు రచించాడు. రుద్రటుడు రుయ్యకునిపై విపులమైన చర్చ చేశాడు.❀



57. రాజ తరంగిణి కర్త - కల్హణుడు (1127-1149 ad)

కాశ్మీర రాజుల చరిత్ర "రాజ తరంగిణి" రాసిన కల్హణుడు కాశ్మీర రాజు జయ చంద్రుని ఆస్థాన కవి. కాలం 1127-1149. ఎంతో శ్రమించి రాజుల చరిత్రలను సేకరించి అధారిటేటివ్‌గా రాజ తరంగిణి రాశాడు. ఇందులో ఎనిమిది తరంగాలున్నాయి. మొదటి మూడు తరంగాలలో ఊహలు, అపోహలు కలగాపులగంగా ఉంటాయి. మిగిలినవి పూర్తి చారిత్రక సత్యాలే. తండ్రి అమాత్య చంపకుడు. 1148-49 మధ్య రాజ తరంగిణి రాశాడు. తండ్రి కాశ్మీర రాజు హర్షుడి ఆస్థానంలో ద్వారపతి. తర్వాత మంత్రి అయ్యాడు. శైవ మతావలంబ కుటుంబం. అయినా బౌద్ధం అంటే అభిమానం. హర్ష రాజు దుర్మార్గుడు. తిరుగుబాటు జరిగి దేశం అల్లకల్లోలమైంది. హర్ష వధ తర్వాత తండ్రి పదవి ఊడింది. కల్హణుడు ఎక్కడా రాజాస్థానంలో ఉన్న దాఖలాలు లేవు.

రాజ తరంగణీయం

ఇందులో 7826 శ్లోకాలున్నాయి. శాంతరస ప్రధానంగా కల్హణుడు రాశాడు. తాను కొత్తగా చెప్పింది ఏదీ లేదని పూర్వపు వాటినే గుర్తుకు తెస్తున్నానని చెప్పాడు. తనకు ముందున్న పదకొండు రచనలే రాజ తరంగిణికి ఆధారం అన్నాడు. ఇందులో నీలమత పురాణం, క్షేమేంద్రుని నృపావళి, హేల రాజు రాసిన పార్థివావళి మొదలైనవి. ఎన్నో శాసనాలను పత్రాలను పరిశోధించి రాసిన ఉద్గ్రంథం ఇది. మొదటి నుంచి తన కాలం వరకు ఉన్న రాజుల చరిత్రలన్నీ

సేకరించి రాశాడు. ఏది చెప్పినా నిష్పక్షపాతంగా చెప్పాడు. ఆనాటి రాజకీయాలను ఉద్యోగులను వారి పాలనలో డొల్లతనాన్ని బయటికి తీసి నిర్భయంగా చెప్పాడు. రాజకీయ, ఆర్ధిక, సామాజిక, నైతిక, ధార్మిక, న్యాయ విషయాలన్నీ చర్చించాడు. యూరపు దేశంలోని మధ్య యుగ చరిత్ర ఉన్నట్లే రాశాడని అభినందించారు. స్టెయిన్ అనే ఆంగ్లేయుడు 1900లో ఇంగ్లీష్‌లోకి అనువదించి ప్రచురించాడు. 1617లో జహంగీర్ కాలంలో హైదర్ మాలిక్ పర్షియన్ భాషలోకి పాక్షికంగా అనువాదం చేశాడు. ఆధునిక యుగంలో రంజిత సీతారామ పండితుడు పూర్తిగా అనువాదం చేశాడు. పిరదౌసి రాసిన షానామా కంటే రాజ తరంగిణిలో వాస్తవం పాలు ఎక్కువ.

కల్హణుడు వ్యాకరణ పారంగతుడు. ఇతని గొప్పతనాన్ని “మంఖ పండితుడు” మెచ్చాడు. అర్ధ, రాజనీతి, బౌద్ధ శాస్త్రాలను ఆకళింపు చేసుకొన్నాడు. చక్కని కధనాన్విత శైలిలో రాశాడు. కధనాలను కావ్య పద్ధతిలో రాశాడు. రసాన్ని ప్రకటించేటప్పుడు నేల విడిచి సాము చేయలేదు. వైదర్భీ రీతిలో నూత్న శబ్ద భాండారంతో రసజ్ఞులను మెప్పించాడు. కాశ్మీర పదజాలం సంస్కృతంలో ఎక్కువగా చేరింది.

అశోకుడి ముందు యాభై రెండు రాజుల చరిత్ర గురించి వివరించాడు. ఒక్కో రాజు పాలనా కాలం సుమారు యాభై ఏళ్ళుగా గ్రహించాడు. అశోకుడిని వెయ్యేళ్ళు ముందుకు నెట్టాడు. కాని మౌర్య వంశస్తుడే అన్నాడు. కుషాన్ రాజుల చరిత్రనూ సాధికారంగా రాశాడు. మిహిరకులుడు శివాలయం నిర్మించాడని బ్రాహ్మణులకు భూరి దానాలిచ్చాడని కనిష్కుడి కాలంలో ఆచార్య నాగార్జునుడు ఉన్నాడని, మాతృగుప్త రాజు కళా పోషకుడు, కవి అని అతని ఆస్థానంలో “మేంఠ కవి” ఉండేవాడని, ఆయన హయగ్రీవ వధ రాశాడని చెప్పాడు. ఉత్పల వంశ రాజులలో అవంతి వర్మ మొదటి రాజు అని అతని కాలంలోనే కాశ్మీర దేశ చరిత్ర ఐతిహాసిక సత్య సమన్వితంగా రచించాడు. కాశ్మీర రాజు హర్షుడు నాలుగు వేల బుద్ధ దేవాలయాలను విగ్రహాలను ధ్వంసం చేసినట్లు చెప్పుకొన్నాడు. కాశ్మీర రాజుల చరిత్రను సాధికారంగా రాసిన మొదటి కవి కల్హణుడు.❀

58. వీరశైవ కవి - ఉదాహరణ కావ్య నిర్మాత - పాల్కురికి సోమనాధుడు (1160-1260 ad)

శివకవులలో ముఖ్యుడైన పాల్కురికి సోమనాధుడు సంస్కృతం, కన్నడం, తెలుగులో అనేక గ్రంధాలు రచించిన మహా పండిత కవి. శివకవి త్రయంలో సోమనాధుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, ననేన్నచోడ కవిరాజు ఉన్నారు. సోమనాధుడు వరంగల్లు జిల్లాలోని పాల్కురికి గ్రామంలో జన్మించాడు. తండ్రి విష్ణు రామ దేవుడు. తల్లి శ్రియా దేవి. 1160-1240 కాలంవాడు. శివుడి ప్రధమ గణాలలో "భ్రుంగి" అవతారం అని వీరశైవుల విపరీత నమ్మకం. బ్రాహ్మణుడే అయినా, ఇతర బ్రాహ్మణ శివకవులు బ్రాహ్మణులను విమర్శింపకపోయినా సోమన బ్రాహ్మణులను విపరీతంగా విమర్శించాడు. వీరశైవ వ్యాప్తికి ఇది బాగా దోహద పడింది. వీరశైవ మతదీక్ష తీసుకొని గురువు కట్టకూరి పోటి దేవర వద్ద శైవ ఆగమాలను అధ్యయనం చేశాడు. వీరశైవులకు కుల గోత్ర పట్టింపు ఉండదు. వీరిని వీర మహేశ్వర వ్రతులు అంటారు. జంగమ దేవరలుగా వీరిని ఆరాధిస్తారు. వీరికి తలిదండ్రులు పార్వతీ పరమేశ్వరులేనంటారు.

తెలుగు, కన్నడ కవితా గీర్వాణం

సోమన లేక సోమనాధుడుగా ప్రసిద్ధి చెందిన పాల్కురికి సోమనాధుడు తెలుగులో బసవ పురాణం, వృషాధిప శతకం, చతుర్వేద సారం, పండితారాధ్య చరిత్ర రాశాడు. కన్నడంలో సద్గురు రగడ, చెన్న బసవ రగడ, బసవ లింగ నామావళి రచించాడు. అచ్చ తెలుగు పదాలను తెలుగు ఛందస్సులను విరివిగా ఉపయోగించాడు. "రగడ" అనే కొత్త ఛందస్సు సృష్టికర్త సోమనాధుడే దీనిని "బసవ రగడ" అంటారు. ద్విపదకు పద సంపద జోడించి బహు విధ విన్యాసాలు చేయించాడు. సీస పద్యాలూ రాశాడు. త్రిభంగి తరువోజ, క్రౌంచ పధం, వన మయూరి, చతుర్విధ కందం, త్రిపాద కందం అనే వివిధ ఛందో రీతుల్ని సాహిత్యంలో ప్రచారం చేశాడు. కాకతీయుల కాలపు విప్లవ కవిగా గుర్తింపు

పొందాడు. ఆనాటి సమాజంలో ఉండే సాంఘిక స్థితి గతులను రచనలలో స్థానం కల్పించి వాటి విశిష్టతలను జనాలకు తెలియజెప్పాడు. జానపద కళా రూపాలకు, యక్షగానాలకు, ఆటలకు, పాటలకు తన గ్రంధాలలో చోటు కల్పించాడు. తోలుబొమ్మలాటలు, జంతు విన్యాసాలు, నట్టువ కత్తేల నాట్య విలాసాలు గురించి మనకు తెలియజెప్పాడు. శ్రీశ్రీ కంటే ముందే ఛందస్సు వ్యాకరణాలను శివకవులు అధిగమించారు. భాషలో నిరంకుశులై వర్ధిల్లారు. ఇతర భాషా పదాలను యధేచ్ఛగా చేర్చివాడారు. జాను తెలుగుకు పట్టాభిషేకం చేసింది శివకవులే. దేశి కవితకు మార్గ దర్శకులుగా నిలిచారు.

అన్నిటా ప్రధముడు సోమనాధుడు

సోమన అన్నిటా ప్రధముడుగా నిలిచాడు. "వీర శైవాగ్రేసరుగు" అంటారు సోమనాధుని. బసవేశ్వరుని చరిత్రను పురాణంగా రాసి కొత్త దారి తీశాడు. చరిత్రకు పురాణ వైశిష్ట్యాన్ని సంతరించిన మొదటికవి పురాణకర్త. జైన భాషా లక్షణాలతో తెలుగులో దేశి పురాణాన్ని రాసిన తొలి తెలుగు కవి అనిపించుకొన్నాడు. అచ్చ తెలుగు ఛందస్సు అయిన ద్విపదకు కావ్య గౌరవాన్ని, పురాణ గౌరవాన్ని కలిగించిన ప్రధమాంధ్ర కవి. మత విజ్ఞానానికి, ప్రచారానికి కావలసిన ప్రక్రియలన్నిటిని సంతరించి, ఉపయోగించి సఫలుడై తన సర్వజ్ఞాత్వాన్ని లోకంలో చాటిన మొదటికవి సోమనాధుడు. లిఖిత, మౌఖిక సంప్రదాయానికి వారధి నిర్మించిన తొలి తెలుగుకవి. మూల రసవాదానికి తెలుగులో ప్రచారం తెచ్చిన ప్రధమ కవి. భక్తిరసాన్ని తెలుగు దేశంలో పార మెరుగకుండా పారించిన తొలి భక్తకవి. సంస్కృతాంధ్రాలలోనేకాక ప్రక్క భాష కన్నడంలోను కవిత్వం చెప్పిన మొదటికవి. తనను గురించి కావ్యాలలో అతి తక్కువగా చెప్పుకొన్నాడు. ఇతర రచనలలో సోమన గురించి చెప్పబడిన వాటివలననే ఆయన చరిత్ర కొంతవరకు తెలుస్తోంది. కన్నడంలో "తోంతాడ సిద్ధ కవి" సోమనపై "పాలకూరికి సోమేశ్వర పురాణం" రాశాడు. పన్నెండవ శతాబ్దంలో తెలుగు దేశం "తొమ్మిది లక్షల గ్రామాల విస్తీర్ణం కలది –"నవ లక్ష తెలుంగు" అని వర్ణించాడు. తెలుగులో జాతీయ సాంస్కృతిక ఉద్యమ ఆరంభకుడు సోమనాధుడు అన్నారు డా.జి.వి.పూర్ణచంద్.

సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా నడిపిన మొదటి తెలుగు కవి సోమన అనటానికి సందేహమే లేదు. ప్రథమ తెలుగు కవి సంస్కర్త కూడా సోమనాధుడే. నిమ్న కులాల వారిని దగ్గర చేర్చిన కవి. వారి గురించి రాసిన కవి కూడా. బసవ పురాణాన్ని తొలి తెలుగు సాంఘిక కావ్యంగా గుర్తించారు. మల్లమ దేవి పురాణం, సోమనాథ స్తవం, అనుభవ సారం, చెన్నమల్లు సీసాలు, చతుర్వేద సారం సోమన రచనలలో ప్రముఖాలు.

గీర్వాణ కవితా గీర్వాణం

గీర్వాణ భాషలో అంటే సంస్కృతంలో "సోమనాధ భాష్యం", "రుద్ర భాష్యం", "సంస్కృత బసవోదాహరణలు, వృషభాష్టకం, త్రిలింగాష్టకం" రాశాడు.

వృషభాష్టకం

వృషభాష్టకం లేక వృషాధిప శతకం చాలా ప్రసిద్ధి చెందింది. ఇందులో మొదటి నలభై శ్లోకాలు బసవేశ్వరుని గురించి చెప్పాడు. ఇతర శివ భక్తులైన శివనాగమయ్య, చెన్న బసవయ్య, మాచయ్యలనూ ఇందులో స్తుతించాడు. ఇది అనేక భాషలలోకి అనువాదం పొందింది. 1884లో మద్రాస్‌లో ఇది మొదటిసారిగా ప్రచురింపబడింది. సోమన మొదటి ఎనభై తెలుగులో రాశాడు. ఇదొక వింత. ఒకటి నుంచి నలభై తొమ్మిది వరకు తెలుగు పద్యాలే. ఆ తర్వాత కొన్ని ఇతర భాషలైన మరాటీ, కన్నడ, మణిప్రవాళ శ్లోకాలు రాసి మళ్ళీ తెలుగులో పద్యాలు చెప్పాడు. పద్యం అంతా సంస్కృతంలో ఉన్నట్లు అనిపించినా చివరి మాటలు తెలుగులో చెప్పటం విశేషం – "ఎంచు సంస్కృత భాష నుతింతు నిన్ను విద్వన్నుత నామధేయ బసవా" అంటాడు. వీటిలో యాభై నుంచి యాభై నాలుగు వరకు పూర్తి స్వేచ్ఛ సంస్కృత శ్లోకాలున్నాయి. చివరి పంక్తి అయిన ముక్తకం సంస్కృతం, ఇతర భాషా మిశ్రమంలో ఉంటుంది. 59 శ్లోకాలు సంస్కృత తెలుగు కలగా పులగం. అరవయ్యవ శ్లోకంలో ద్రావిడ సంస్కృత తెలుగు మిశ్రమం ఉంటుంది. అరవై నాలుగులో సంస్కృత కన్నడ మిశ్రమం ఉంది. మిగిలినవన్నీ తెలుగు పద్యాలే. ఇది స్తుతి శతకమే. వసంత తిలక ఛందస్సులో రాశాడు ఈ శతకాన్ని. ఒక శ్లోకం చూద్దాం.

"శ్రోత్రం శ్రుణోతిపతతి వినిశ్చితార్థం - సోదాతు యాతి వృషభాద్రి పతే ప్రసాద ఇలా భావత్ విశుద్ధ పద భక్తీ - ఫతదాభి లస్టకం"

రుద్ర భాష్యం

రుద్ర భాష్యం దొరకలేదు. కాని దీనిని పిడపర్తి సోమనాధుడు ఉదాహరించాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత భాండారంలో ఒక ప్రతి కనిపిస్తోంది. ఇది సోమనాధ కృతం కాదు. బ్రహ్మ విద్యా తీర్థ రాసింది. తాటాకు గ్రంధమూ కాదు. విడివిడి కాగితాలపై రాసింది. ఇరవై తొమ్మిది పేజీలే ఉన్నాయి. కనుక ఇది సోమన రాసినది కాదని తేలింది. రుద్రభాష్యం యజుర్వేదంలో ఉంది. దీన్ని శ్రీ రుద్రం అంటారు. శతురుద్రీయం అనే పేరు కూడా ఉంది. ఇందులో కొన్ని సూక్తాలు సోమన రాసిన పండితారాధ్య చరిత్రలో కనిపిస్తాయి. కనుక రుద్ర భాష్యం ఒక వ్యాఖ్యానం మాత్రమే అని భావిస్తున్నారు.

సంస్కృత బసవోదాహరణ

ఇది కన్నడ మండలేశ్వరుడైన బిజ్జలుని ముఖ్యమంత్రి, వీరశైవ మత ప్రాపకుడు బసవేశ్వరుని చరిత్ర. బసవడు మాదిరాజ, మదలంబ అనే శుద్ధ బ్రాహ్మణుల తనయుడు. వీరు నందీశ్వరుని పరమ భక్తులు. నంది అనుగ్రహంతో పరమ భక్తాగ్రేసరుడైన బసవడు జన్మించాడు. ఆయన నందీశ్వరుని అవతారంగా భావిస్తారు. కనుక బసవ అని పేరు పెట్టారు. వైశాఖ శుద్ధ తదియనాడు 1131లో జన్మించాడు. ఎనిమిదవ ఏట ఉపనయనం చేస్తుండగా ఇష్టపడక ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. కూడల సంగమేశ్వరం చేరి ఏకాంతంలో ఆత్మ జ్ఞానాన్ని పొందాడు. అతని వీరశైవభావాలను గమనించి మేనమామ కూతురు గంగమ్మ నిచ్చి వివాహం చేశాడు. తర్వాత బిజ్జలుని మహామంత్రి అయ్యాడు. వీరశైవ మతాన్ని స్థాపించి వ్యాపింపజేశాడు. సంఘ సంస్కరణలు చేబట్టి అస్పృశ్యతను నివారించే ప్రయత్నం చేశాడు. ఇది చాందస బ్రాహ్మణులకు బాధకలిగిస్తే రాజుకు చెప్పారు. రాజు వీరివలన ఏదైనా ప్రమాదం వస్తుందేమోనని భయపడ్డాడు. బ్రాహ్మణులకు అస్పృశ్యతలకు బసవడు వివాహాలు జరిపించాడు. "శైవ శరణులను" రాజు నిషేధించాడు. అహింసా వలంబి అయిన బసవడు హింసా ప్రజ్వలనంతో

బాధపడ్డాడు. కళ్యాణ్‌లో తాను చేయాల్సిన పని పూర్తి అయిందని భావించి కూడల సంగమేశ్వరం వెళ్ళిపోయాడు. అక్కడ ఏకాంతంగా శివారాధన చేస్తూ సంగమేశ్వరునిలో 1167లో బసవేశ్వరుడు ఐక్యమయ్యాడు. సంస్కర్తగా, వీరశైవ మత స్థాపకుడిగా బసవేశ్వరుడు చిరకీర్తి పొందాడు. ఎన్నో తరాలను ప్రభావితం చేశాడు.

ఇది ఉదాహరణ కావ్యం. ఎనిమిది విభక్తులతో సోమన రాశాడు. ప్రతి విభక్తిలో ఒకటి రెండు శ్లోకాలు ఆ తర్వాత కళిక, ఉత్కళికలు రాశాడు. మొదటి విభక్తిలో ప్రాణ లింగాన్ని ఆరాధించే బసవేశ్వరునికి వందనం చెప్పాడు. రెండవ విభక్తిలో బసవని జ్ఞాన ప్రభావాన్ని ఆవిష్కరించాడు. వేద పరమార్ధ రహస్య భేది, పిశున వ్యాపాన పారంగతుడని పొగిడాడు. వేదాంతంలో అసామాన్యుడే కాక బసవ వచనాలు రాసిన కవి అన్నాడు. మూడవ విభక్తిలో బసవేశ్వరుని మహిమలను వర్ణించాడు. బసవని సుమేరు పర్వతంతో పోల్చాడు. తరువాత వీరశైవ దీక్షావిదానాలను ఆచరణలను, శాస్త్ర గ్రంధాల గురించి రాశాడు. తెలుగులో బసవ పురాణమూ రాశాడని ముందే చెప్పుకొన్నాం. బసవడు వీరశైవ ప్రచారకుడిగా చేసిన పనులు వివరించాడు. ప్రకృతిలో బసవానికి ప్రతిది శివరూపంగా దర్శనమిస్తుందన్నాడు.

ఉదాహరణ కావ్యాలు సంస్కృతంలో నుంచి తెలుగులోకి వచ్చాయి. ఇదొక రకమైన సాహిత్య ప్రక్రియ. సంస్కృతంలో మొదటి ఉదాహరణ కావ్యం రాసినవాడు పాల్కురికి సోమనాధుడే. ఆ తర్వాత ఓరుగల్లు కవి విద్యానాధుడు రాశాడు. ఆ తర్వాత తెలుగులోనే ఉదాహరణ కావ్యాలు వచ్చాయి. ఉదాహరణ అనేది 26 శ్లోకాలుండే లఘుకావ్యం. ఏడు విభక్తులతోపాటు సంబోధన ప్రధమా విభక్తిలో కావ్యం ఉంటుంది. ఒక్కో విభక్తిలో మూడేసి పద్యాలు ఉంటాయి. మొదటి పద్యం ఒక ఛందస్సులో, రెండవ పద్యం రగడగా, మూడవ పద్యం అర్ధ రగడగా ఉండాలి అనే నియమం ఉంది. రగడకు ఎనిమిది పాదాలు ఉంటాయి కనుక అర్ధ రగడలో నాలుగే పాదాలుంటాయి. వీటినే కళిక అని ఉత్కళిక అనీ అంటారు. వీటి తర్వాత సర్వ విభక్తి శ్లోకం ఉండాలి. సంస్కృత ఉదాహరణ కావ్యాలన్నీ

తెలుగు ఉదాహరణ కావ్యాలనే పోలి ఉంటాయి. అసలు సంస్కృత ఉదాహరణలు రాసింది తెలుగు కవులే. అందుకే సోమనాధుడు మొదటి సంస్కృత ఉదాహరణ కావ్య కవి అనిపించుకొన్నాడు. విద్యానాథ కవి తన ప్రతాప రుద్రీయ కావ్యంలో ఉదాహరణ కావ్య లక్షణాలు వివరించాడు. ఋగ్వేద కుంతక సూక్తాలలో ఉదాహరణ కావ్య ఛాయలున్నాయని అంటారు. ఇవన్నీ క్రియా విభక్తులు. కనుక సకల క్రియలూ ఆ పరమేశ్వరునికి చెందినవే అని ఈ ఉదాహరణ కావ్యాలలో ఉన్న అంతరార్ధం. దీనినే కవిసామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ "ప్రపంచమంతా క్రియా జన్యం. ఈ క్రియలతో భగవంతుని చేరవచ్చు. ఈ విభక్తులతో పరమాత్మను కీర్తించటం అంటే ఈ క్రియలకు మూల పురుషుడు ఆద్యుడు పరమేశ్వరుడు అని తెలుసుకోవటమే. ఇదే ఉదాహరణ కావ్య పరమార్ధం" అని చక్కగా విశ్లేషించారు.

త్రిలింగాష్టకం

సోమనాధుడు మూడు లింగాలపై సంస్కృతంలో చెప్పిన ఎనిమిదేసి శ్లోకాలున్న కావ్యం. స్వస్థలింగం, ప్రాణ లింగం, భావ లింగం అనేవి మూడు లింగాలు. ఈ శ్లోకాలను అనుష్టుప్ చందసులో చెప్పటం విశేషం. ఉదాహరణకు

"పంచాకాశం మహాకాశం పంచాకరం ప్రకాశితం – ప్రణవోక్షరం మాయాకారం స్వేస్త లింగమహం భజే"

జీవాధారం శివాధారం నానాధారం పరాత్పరం – సర్వ వ్యాపక మంత్రార్థ ప్రాణ లింగమహం భజే"

చివరలో ఒక శ్లోకంలో ఫలశృతి చెప్పాడు. "పండిత సోమనాదేన కృత లింగాష్టక త్రయం – యః పఠేత్ సతతం విద్వాన్ ముక్తి ఫలప్రదం" అని చెప్పాడు.

తెలుగువాడైన సోమనాధుడు చతుర్భాషా కవిగా గుర్తింపు పొంది తెలుగువారి కీర్తి పతాకను ఎగర వేశాడు. ఎన్నిటికో ఆద్యుడై, సాహిత్యారాధకుడై తరాలను ప్రభావితం చేశాడు. ❁

59. అష్టపదుల - జయదేవుడు (1200 ad)

"గీత గోవిందం" అనే మహాకావ్యం రాసిన భక్త కవి జయదేవుడు పన్నెండవ శతాబ్దానికి చెందినవాడు. రాధాకృష్ణుల అపూర్వ ప్రణయానికి ప్రతీకగా ఉంది. హరి కంటే రాధ ఆధిక్యాన్ని వివరించిన కావ్యం. భక్తి ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చిన వాడు జయదేవుడు. జయదేవుని పుట్టిన ప్రదేశంపై సందేహాలున్నాయి. కొందరు పశ్చిమ బెంగాల్‌లోని జయదేవ కెందూలిలో జన్మించాడని అన్నారు. కాదు ఒరిస్సాలోని కెందూలి ససాన్‌లో పుట్టాడని అన్నారు. ఈ రెండూ కాదు మిథిలలోని ఎందూలిలో జన్మించాడని నమ్మేవారూ ఉన్నారు. బ్రాహ్మణుడు అయిన జయదేవుడు ఒరిస్సాలోని పూరీక్షేత్రంకు ఎప్పుడో చేరి అక్కడి నాట్య కళాకారిణి పద్మావతిని వలచి వలపింపజేసుకొని వివాహమాడాడు. జయదేవుని తండ్రి భోజ దేవుడు. తల్లి రమాదేవి. ఒరిస్సాలోని సూర్య క్షేత్రమైన కోణార్క వద్ద "కూర్మ పాటక" అనే చోట సంస్కృత విద్య నేర్చాడని అంటారు. 1116 ప్రాంతపు రాజు లక్ష్మణ సేనుడి ఆస్థానంలో జయదేవుడున్నాడు. గొప్ప శ్రీకృష్ణ భక్తుడు. యవ్వనంలో తిరుగుబాటుగా ఉండగా ఒక బ్రాహ్మణుడు తన కూతురునిచ్చి వివాహం చేశాడు. ఆమె మరణించగా పద్మావతిని పరిణయమాడి "పద్మావతీ చరణ చారణ చక్రవర్తి" అయ్యాడు.

భక్త జయదేవం

ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో ఉన్న లింగరాజు దేవాలయ సముదాయంలో

ఇటీవలి త్రవ్వకాలలో బయటపడ్డ మధుకేశ్వరా, సింహాచల దేవాలయాలను పరిశీలించిన డా. సత్యనారాయణ రాజుగారు జయదేవుని ముందు జీవితంపై కొత్త విషయాలు ఆవిష్కరించారు. అక్కడ కూర్మ పతాకలోని విద్యావేత్తలలో విద్యా ప్రముఖులలో ఒకరుగా జయదేవుడు ఉండేవాడని తేలింది. ఇక్కడ జయదేవుని విద్య సాగిందని, ఇక్కడే కవిత్వ రచన ప్రారంభించాడని అర్ధమవుతోంది. దశావతారాలను పరమ మనోహరంగా అష్టపదులలో జయదేవుడు వర్ణించాడు. ప్రతిచోటా వీటిని గానం చేసి పరవశిస్తారు. అలాగే ఆయన రాసిన "దశకృతి"కి ప్రాచుర్యం బాగా ఉంది. కృష్ణుని వేణుగాన ప్రభావాన్ని "త్రిపుట"లో వర్ణించాడు.

గీత గోవిందంలోని రెండు అష్టపదులు సిక్కుల మత గ్రంధం గురు గ్రంధ సాహెబ్‌లో కూడా చోటు చేసుకోవటం గమనించదగిన విషయం. సంస్కృతం దాని అపభ్రంశ భాషతో అలిపి అపూర్వ సృష్టి చేశాడు జయదేవుడు. గురునానక్ పూరీ సందర్శించినప్పుడు జయదేవుని ప్రభావానికి లోనయ్యాడు. ఆలయాలలో దేవ దాసీ వ్యవస్తను ప్రోత్సహించాడు జయదేవుడు. అందుకనే ఒరిస్సా దేవాలయాలలో నాట్యం కోసం ప్రత్యేక మందిరాలేర్పడ్డాయి. దేవదాసీలు స్థానిక దేవుళ్ళకు సర్వ సమర్పణ చేసి భక్తితో సంగీత నృత్యాలతో స్వామిని సేవించేవారు.

గీత గోవిందం మధుర భక్తీ గీతాల కావ్యం. గీతి కావ్యానికి చెందింది సంగీత రూపకం అన్నారు. పిశేల్, లాసేన్ పండితులు శ్రాయిడర్ "రిఫైండ్ జాతర" అని పిలిచాడు. జాతర అనేది బెంగాలీ గ్రామ్య పదం. అంటే "సంస్కృత గ్రామ్య రూపకం" అనచ్చు. ఇవి ఎనిమిది పదాలున్న గీతాలు కనుక అష్టపదులనే పేరు. రాగ యుక్తంగా పాడుతూ అభినయించేవారు. గానంతోపాటు అభినయానికీ ప్రాధాన్యత పొందింది. ఆధునిక పరిభాషలో సంగీత రూపకం పాశ్చాత్యుల "ఒపేరా".

బెంగాల్‌లో శ్రీకృష్ణ లీలలను, రాస క్రీడలను, మహిమలను గానం చేస్తూ నృత్యం చేస్తూ ప్రచారం చేసే ఆచారం ఉండేది. స్వయంగా కృష్ణ భక్తుడైన జయదేవుడు ఆ ప్రభావంతో రాసిన కావ్యమిది. ప్రణయిని అయిన రాధ ప్రేమ

విరహం అద్భుతంగా ముగ్ధ మనోహరంగా వర్ణించాడు. ఆ పదాల కూర్పు పరవశాన్ని కల్గిస్తాయి. మాధుర్యానికి మేను మరచిపోయి తన్మయులమై ఊగిపోతాం. రాధకు కృష్ణునిపై తాత్కాలిక కోపం వచ్చినా ఆయన కనపడగానే ప్రేమ పొంగి ప్రవహిస్తుంది. కృష్ణుడు ఆమె ప్రేమను యాచిస్తూ అనునయిస్తాడు, కరగిస్తాడు. కృష్ణుడు వెళ్ళిపోయినా తర్వాత విరహంతో రాధ వేగిపోతుంది. ఇద్దరి ప్రేమ, ప్రణయం, కోపం, విరహం, తాపం, ప్రేమ, యాచనలతో కావ్యం నడుస్తుంది. రతి క్రీడలూ బాహాటంగానే వర్ణించాడు జయదేవుడు. ఇది ఆత్మ రతికి పరాకాష్ట. భక్తులకు ఇందులో జీవాత్మ పరమాత్మ సంబంధమే గోచరిస్తుంది. పరమాత్మ కృష్ణుడు జీవాత్మ రాధ. జీవ పరమాత్మ ఐక్యతే గీత గోవిందం అని వ్యాఖ్యానిస్తారు. అందుకే ఉత్తమ కావ్యం అయింది. సభ్య సమాజం సమాదరించింది. సుకుమారమైన, సుగంధ భరిత లలిత పదజాలం, కోమల భావ సంపద, శృతి మాధుర్యం ఉంది. లోకాతీత అనుభవాన్ని కల్గిస్తుంది.

గీత గోవిందంపై ముప్పై అయిదు వ్యాఖ్యానాలున్నాయి. ఒరిస్సా నీలాచలం రాజు కూడా గీత గోవిందం రాశాడట. పండితులు మెచ్చలేదట. ఈ రెండు కావ్యాలను పూరీ జగన్నాథ స్వామి దగ్గర ఉంచితే జయదేవుని గీత గోవిందాన్నే కంఠహారంగా గ్రహించాడట స్వామి. ఈ కథ పదహారవ శతాబ్దపు కవి నాభాజీ రాసిన "భక్తిమాల"లో ఉంది. తర్వాత చాలామంది కవులు గీత గోవిందం మార్గంలో సీతారామ, శివ పార్వతి ప్రణయాలను కావ్యాలుగా రాసినా దీనికి వచ్చినంత పేరు రాలేదు. ఆనాటి నుంచి ఈనాటి వరకు జయదేవుని గీత గోవిందానికే హారతి పడుతున్నారు. గీత గోవింద అనుకరణ కావ్యాలు దాదాపు నూట నలభై ఉన్నాయి. దీనికున్న వ్యాప్తి ప్రచారం దేనికీ లేదు.

గీత గోవిందంలోని అందరూ పాడుకొనే గీతం "ధీర సమీరే యమునా తీరే లలిత లవంగ లతా పరిశీలన కోమలమలయ సమీరే – మధుకర నికర కరంబిత కోకిల ఊజిత కుంజ కుటీరే" శ్రీకృష్ణుడు పడిన రాధా విరహంనూ మధురంగా వర్ణించాడు –

"వహతి మలయా సమీరే మదన మప విధాయ – స్పుతటి కుసుమ

నికరే విరహి హృదయ దశనాయ - తవ విరహే వానమాలీ సఖి సీదతి - దహతి శిశిర మయూఖే మరణ మను కరోతి - పత్తి మదన విశిఖే విలపతి వికల తరాతి".

గీత గోవిందం అనేక భాషల్లో అనువాదం పొందినా ఏదీ జయదేవుని మాధుర్యాన్ని సాధించలేదు. విలియం జోన్స్ ఆంగ్లానువాదాన్ని చేసినా రాణించలేకపోయింది. జర్మన్ కవి గోతే సంస్కృత కావ్యాన్ని చదివి అద్భుతంగా స్పందించాడట. లాస్సన్ లాటిన్‌లోకి తర్జుమా చేశాడు. ఆర్నాల్డ్ ఇంగ్లీష్‌లోకి అనువదించారు. జయదేవుని జన్మస్థలం "కెందూలి" లేక కిందు బిల్వలో ప్రతి ఏడాది పుష్య శుక్ల సప్తమి రోజున జయదేవుని పదాలను పాడి అభినయిస్తూ సంస్మరిస్తారు. ఇక్కడే జయదేవుని సమాధి ఉందట.

జయదేవుడు గీత గోవిందంతో బాటు "గంగా స్తుతి" కూడా రాశాడట. "రతి మంజరి" కూడా జయదేవుని కృతి అంటారు. జయదేవుడు ప్రసన్న రాఘవం, చంద్రాలోకం కూడా రాశాడంటారు. వీటిని రాసింది గీత గోవిందకారుడు కాదని అదే పేరున్న వేరొక కవి అన్నారు. పీయూష లహరి జయదేవుని సంస్కృత గోష్ఠి రూపకం. జయదేవుడు గోష్టిలో పదిమంది ప్రాకృత పురుషులు అయిదుగురు స్త్రీలు ఉంటారు. ఒకటే అంకం ఉంటుంది. సంధులు ఉండవు. కైశికీ వృత్తిలో ఉంటుంది. కామ, శృంగార ప్రధానంగా ఉంటుంది. పీయూష లహరిపై మొదటిసారిగా వావిలాల సోమయాజులుగారు భారతిలో వ్యాసం రాశారు. తర్వాత సంస్కృత మూలంతో తెలుగు అనువాదాన్ని 1990లో తెలుగు విశ్వవిద్యాలయం ముద్రించింది. 1153 డిసెంబర్ 28 శ్రీముఖ నామ సంవత్సర మార్గశిర బహుళ ఏకాదశి నాడు జయదేవుడు రాధాకృష్ణుల గోలోకం చేరుకొన్నాడు.❁

60. జైన కవి రుషి - జిన రత్న (1200 ad)

లీలావతి సార అనే కావ్యాన్ని రాసిన జిన రత్న జైన పండితుడు రుషి. ఇప్పటి రాజస్థాన్‌లోని ఝాలార్ అంటే అప్పటి జాబాలి పుత్రాలో దీన్ని రాశాడు. మహారాష్ట్ర జైన అనే ప్రాకృత భాషలో జినేశ్వరుడు అనే బౌద్ధ ఆచార్యుడు రాసిన "నివ్వాన ఇలావైకహా" పెద్ద ఉద్గ్రంధానికి ఇది సంక్షిప్త వివరణ. జిన రత్న తన జీవితం గురించి ఎక్కడా చెప్పుకోలేదు. తన గురువులను మాత్రం మనస్ఫూర్తిగా అశ్వా సాంతాలలో స్మరించాడు. జినేశ్వరుని గురువైన వర్ధమానుడి నుండి అందరిని పేర్కొన్నాడు. తన గురువైన మరో జినేశ్వరునీ కీర్తించాడు. దీనిని 1285లో రాశాడు.

కవిత్వంలో గీర్వాణం

జినరత్న సాహిత్యాన్ని, సాహిత్య శాస్త్రాన్ని శ్వేతాంబర జైన గ్రంధాలను గురువు జినేశ్వరుని వద్ద అభ్యసించాడు. మిగిలిన గురువలు వద్ద అవసరమైనవి అన్నీ నేర్చాడు. వారితో తన లీలావతీ సార గ్రంధానికి మెరుగులు దిద్దించుకొన్నాడు. మొదటి అధ్యాయంలో జినేశ్వరుడు రాసిన మహా గ్రంధంలోని శ్లోకాలు తనకు ఎలా ఆదర్శమైనాయో వివరించాడు. కధనాన్ని పూర్తిగా అనుకరించి సంక్షిప్తతకు వన్నె తెచ్చానని చెప్పాడు. అందుకే జినేశ్వరుడి "నివ్వాన గ్రంధ" కంటే జినరత్న రాసిన లీలావతారికకే అధిక ప్రాచుర్యం లభించి, ఇంటింటా పారాయణ

గ్రంథమైంది. మహారాష్ట్ర జైన ప్రాకృతంలో రాయబడటం వలన ప్రజలకి మరీ చేరువైంది. ఇది దాదాపు సంస్కృతానికి దగ్గరగా ఉండటం మరొక గొప్ప లాభం చేకూర్చింది. అనువైన ఛందస్సును, అలంకారాలను ఉపయోగించి కావ్యానికి వన్నె తెచ్చాడు. సంస్కృత వ్యాకరణాన్ని అనుసరించి రాసినా సంస్కృత పదాలను గ్రహించినా జన జీవితంలో వాడుకలో ఉన్నవాటినీ తీసుకొని భాషను పరిపుష్టి చేశాడు.

సులభమైన శైలితో, ప్రవాహ వేగంతో కావ్యాన్ని మాధుర్య విలసితంగా తీర్చిదిద్దాడు. సూటిగా హృదయానికి తాకేట్లు డొంక తిరుగుడు లేకుండా రాయటం వలన కావ్యం జనంలోకి చొచ్చుకుపోయింది. నగర, అరణ్య తటాక, ప్రకృతి, యుద్ధ వర్ణనలు సంస్కృత మహాకావ్యాన్ని తలపింపజేస్తాయి. భాష వీటిలో చాలా సాంద్రమై ఆకట్టుకొంటుంది. క్లే సాంస్క్రిట్ లైబ్రరివారు దీన్ని ఆంగ్లంలో రిచార్డ్ ఫైన్స్ చేత అనువాదం చేయించి "ఎపిటోం ఆఫ్ క్వీన్ లీలావతి" అని పేరు పెట్టారు.

ఇందులో అనేక కథలున్నాయి. అనుష్టుప్ ఛందస్సును కవి బాగా ఉపయోగించుకొన్నాడు. చెవులకు ఇంపుగా ఉంటే వినేవారికి ఆసక్తి కలుగుతుంది. కనుక అలా రాశాను అని చెప్పుకొన్నాడు. ప్రతిపాత్రా ప్రయోజనం కలిగి ఉంటుంది. కథలలో నాటకీయత బాగా ఆకర్షిస్తుంది. అదే గొప్ప ప్లస్ పాయింట్ అయింది. మంచి చెడుల మధ్య ఉన్న అతి సూక్ష్మ భేదాన్ని చక్కగా వివరించాడు. రాజు, రాణి ప్రేమకథ అనేక ఒడిదుడుకులకు లోనై చివరికి సుఖాంతం అవుతుంది. కథలో కథ మిళితమై గొలుసుల్లా బంధాన్ని కలిగి ఉంటాయి ఇందులో. కర్మకు ప్రాధాన్యం ఉంటుంది. పునర్జన్మ ఉంటుంది. సంసార జలధిలో బతుకు నావ నడుపుకొంటూ తీరం చేరాలి అనేది ఇందులో ఉన్న సారాంశం.❀

61. నృత్త రత్నావళి రాసిన జాయపసేనాని (1213 ad)

జాయప సేనాని కృష్ణాజిల్లా దివిసీమకు చెందినవాడు. కాకతీయ గజ సైన్యాధ్యక్షుడు. నాట్యకళా మర్మజ్ఞుడు. వెలనాటి క్రోయ్యూరు రాజు అయ్య వంశం వాడు భీమయ్యకు ప్రప్రౌతుడు. దుర్జయ సైన్యాధిపతి నారప నాయకుని పౌత్రుడు. పిన్న చోడుని కుమారుడు. తల్లి దానమ్మ. ఇతని సోదరులు పృధ్వీ, నారప నాయకులు. నారమ్మ, పేరమ్మ సోదరిలు. ఈ అయ్య వంశం వారందరూ సామంత రాజులే. సేనాధిపతులే. వెలనాటి చోళభూపతికి సామంత రాజులుగా ఉండేవారు.

దివాసీమ నుండి - ఓరుగల్లుకు

1213లో కాకతీయ గణపతి మహారాజు తూర్పు ఆంధ్రపై దాడికి వచ్చి వెలనాటిని జయించాడు. జాయప సోదరీమణులైన నారమ్మ పేరమ్మలను పెళ్లి చేసుకొన్నాడు. జాయప శౌర్య పరాక్రమాలకు ఆకర్షితుడై తనతో ఓరుగల్లు తీసుకొని వెళ్లి గజసేనాధిపతిని చేశాడు. అతనికి "వైరి గోదూమఘ రట్ట" అంటే శతృవుల్ని తిరగలిలో గోధుమలను పిండి చేసినట్లు చేసేవాడు అనే బిరుదునిచ్చి సత్కరించాడు. జాయప కృతజ్ఞతాపూర్వకంగా "గణపతీశ్వరాలయం" నిర్మించాడు. అనేక గ్రామాలను ఈ ఆలయానికి దానం చేసి స్వామి భోగాలకు ఉపయోగపడేట్లు చేశాడు. ఈనాటి చేబ్రోలు ఆనాటి తామ్రపురంలో తండ్రి పేరిట చౌడేశ్వరాలయం నిర్మించాడు.

ఆలయానికి ఎదుట దేవదాసీలు ఉండటానికి రెండేసి అంతస్తుల భవనాలు

కట్టించాడు.

జాయప సేనానీయం

కాకతి ప్రభువు గణపతి దేవుడికి సంగీత, నాట్య శాస్త్రాలపై అపారమైన అభిరుచి ఉండేది. జాయపకు కూడా యవ్వనం నుండి వీటిపై గొప్ప ఆరాధన ఉంది. జాయప భరతుని నాట్య శాస్త్రం, సోమేశ్వర దేవుని మానసోల్లాసం అప్పటికే చదివి లోతైన పాండిత్యాన్ని సంపాదించాడు. ఇవికాక అనేక ఆధునిక ప్రాచీన గ్రంథాలను చదివి జీర్ణం చేసుకొన్నాడు. జీయపలో ఉన్న ఈ ప్రతిభను గుర్తించిన చక్రవర్తి ఆయనను "నృత్త రత్నావళి" గ్రంథాన్ని రాయమని కోరాడు కాదు కాదు శాసించాడు. వెంటనే మొదలుపెట్టి రాశాడు జాయప. దీని తాళపత్ర ప్రతులు రెండు తంజావూర్ సరస్వతీ మహల్‌లో ఉన్నాయి. ఇందులో మొత్తం ఎనిమిది అధ్యాయాలు. అయిదవ అధ్యాయం లేదు. చివరి మూడు అధ్యాయాలను దేసీ నృత్యానికి కేటాయించాడు. అయినా చాలా లోతైన అధ్యయనంతో రాసిన గ్రంథం అనిపిస్తుంది. నృత్త గీతాలలో ఉండే మార్గ దేశిలపై చర్చ చేశాడు. మార్గ విభాగానికి భరతుని గ్రంథం, దేశీయ విధానానికి సోమేశ్వర గ్రంథంలను ఆధారం చేసుకొని రాశాడు. కీర్తిధర, భట్ట తండు రాసిన వాటినీ చర్చించాడు. నృత్త గీతాలలో జరిగిన పరిశోధన అంతా తెలియజేశాడు. సిద్ధాంత రహస్యాలను సంస్కృతీ వైభవాన్ని గొప్పగా నిరూపించాడు. దేశి నృత్యాలలో పేరిణి, ప్రేకనం రాసకం, చర్చరి, నాట్య రాసకం, దండ రాసకం, శివప్రియం, చిందు, కంచుకం, భాండికం, ఘంటసరి, చరణం బహురూపం కోలాటం మొదలైన జానపద నృత్య రీతులపై కూడా రాశాడు. వీటిలో పేరిణి శివ తాండవాన్ని అత్యధిక ప్రచారం చేసినవారు నటరాజ రామకృష్ణగారు. వారికి ఏమిచ్చినా ఆంధ్రజాతి ఋణం తీర్చుకోలేదు. జాయప "గీత రత్నావళి" అనే సంగీత గ్రంథాన్ని కూడా రాశాడు. నృత్త రత్నావళిలోని నృత్యాలకు ఇందులోని సంగీతాన్ని ఉపాంగంగా ఉండేట్లు రాశాడు కాని ఏ గ్రంథం శిధిలమైంది. జాయప సేనుని నృత్త రత్నావళిని 1254లో రాసినట్లు భావిస్తున్నారు.

62. వేదాంత దేశికులు (1286-1369ad)

1268-1369 కాలానికి సంబంధించిన వేదాంత దేశికుల వారు అపర రామానుజావతారం అంటారు. నూటపాతిక దాకా సంస్కృతంలో వివిధ ప్రక్రియలలో రచనలు చేసిన అపర సరస్వతీ స్వరూపులు. వైష్ణవ మత వ్యాప్తికి ఇతోధికంగా తోడ్పడ్డారు. అసలు పేరు వేంకటనాధుడు. తమిళంలోను గొప్ప పండితులు. గొప్ప దార్శనికులుగా సుప్రసిద్ధులు. వేదాంతాచార్య, కవితార్కిక, సింహ, సర్వ తంత్ర, స్వతంత్ర బిరుదాంకితులు దేశికులు. ఇరవై ఏడేళ్ళ వయసులోనే దేశిక, ఆచార్య సరన్వతంత్ర స్వతంత్ర బిరుదులందుకొన్నారు. శ్రీరంగ స్వామి రంగనాధుడు దేవి రంగనాయకి స్వయంగా దేశికుల భక్తికి కవితా శక్తికి, పాండిత్యానికి మెచ్చి వేదాంతాచార్య బిరుదు ప్రదానం చేశారని అంటారు. తమిళనాడులోని తిరువహిందిపురంలో గురువు ఆజ్ఞతో గడిపి గరుడాళ్వర్‌ను సువించి అనుగ్రహం పొంది, హయగ్రీవ మంత్రాన్ని ఉపాసించి అనుగ్రహానికి పాత్రుడైనారు. అప్పటి నుంచి లక్ష్మీహయగ్రీవ భక్తులై జీవితాన్ని చరితార్థం చేసుకొన్నారు. ఆసేతు హిమాచల పర్యంతం తీర్థయాత్రలు చేసి విశిష్టాద్వైత మత ప్రచారం చేశారు. యెంత ఎదిగినా ఒదిగి ఉన్నారు దేశికులు. "వేదాంత దేశిక పధేవిని వేశ్య బాలాం" అని అతి వినయంగా చెప్పుకొన్నారు. "భగవానుడు ఒక బాలకుడికి ఆచార్య స్థాయిని కల్పించాడు. యెంత దయామయుడో" అన్నారు. శ్రీరంగాన్ని మధురై సుల్తాన్ ఆక్రమించగా విజయనగర రాజ్య స్థాపకులు దేశికుల సహా విద్యార్థి అయిన విద్యారణ్య స్వామి శ్రీరంగం వచ్చి ఇక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి గోపనార్యుడు అనే బ్రాహ్మణ సైన్యాధ్యక్షునికి దక్షిణ భారత దేశాన్ని ముస్లిం పాలన నుండి విముక్తి కలిగించమని ఆదేశించారు. ముందుగా జెంజిని జయించి స్వాధీనపరచుకొని, తిరుపతిలో ఉన్న శ్రీరంగాని విగ్రహాన్ని అక్కడికి

తాత్కాలికంగా తెప్పించాడు. వెంటనే శ్రీరంగంలోని సుల్తాన్ సైన్యంపై విజృంభించి ఓడించి, శ్రీరంగనాధుడిని మరల శ్రీరంగంలో ప్రతిష్టించాడు. గోపనార్యుడిని సాక్షాత్తు విష్ణు అవతారం అని భావిస్తారు.

దేశికీయ కవిత్వం

వేదాంత దేశికులు సర్వార్ధ సిద్ధి, న్యాయ పరిశుద్ధి, న్యాయ సిద్ధాంజన, మీమాంసా పాదుక, అధికరణ సారావళి, శత దూషిణి, సచ్చరిత్ర రక్ష, నిషేపరాక్ష, పంచ రాత్ర రక్ష మొదలైన సంస్కృత గ్రంథాలను దార్శనిక సంబంధమైనవిగా లెక్కిస్తారు. రామానుజుల "శ్రీ భాష్యం"కు తత్వ టీకను, తాత్పర్య చంద్రికలను, యమునా చార్యుల గీతార్ధ సంగ్రహ రక్షను, రామానుజుల గద్య త్రయానికి రహస్య రక్షను, ఈశావాస్యోపనిషత్ భాష్యం అనే వ్యాఖ్యానాన్ని రాశారు. ద్రావిడ ప్రబంధమైన "తిరువాయి మొలి"ని సంస్కృతీకరించారు.

యాదవాభ్యుదయం అనే మహా కావ్యాన్ని, సంకల్ప సూర్యోదయం అనే నాటకాన్ని, హంస సందేశం అనే లఘు కావ్యాన్ని, పాదుకా సహస్రం, వరద రాజ పంచాశతి, గరుడ దండకం అనే ముక్తక కావ్యాలను రాశారు. దేశికులు రామాయణ కధా సారాన్ని "రఘువీర గద్య"గా సంస్కృతంలో రాశారు. అచ్యుత శతకాన్ని ప్రాకృతంలో రాశారు. వేదాంత దేశికులు దార్శనికులు గానేకాక మహా పండిత ప్రకాండులుగా, మహా వ్యాఖ్యాతగా, మహోన్నత కవిగా రాణకెక్కారు.

దేశికుల యాదవాభ్యుదయంలో ఇరవై నాలుగు సర్గలున్నాయి. శ్రీకృష్ణ చరిత్ర కావ్యం ఇది. కృష్ణుని జీవితంలోని ప్రతి సంఘటన వెనుక ఉన్న దార్శనికార్ధాన్ని కమ్మని శైలిలో వర్ణించారు. ఈ కావ్యానికి అప్పయ్య దీక్షితులు వ్యాఖ్యానం రాయటం మరో విశేషం వర్ననలలో వేదాంత పరమైన ఉపమానాలను వాడటం దేశికుల ప్రత్యేకత.

"వివిధ ముని గణోప జీవయా తీరదా విగామిత సర్పగణా పరేణ పుంసా – అభిజిత యమునా విశుద్ధ ముగ్ర్యాం శమిత మహిర్మాట సంప్లవా త్రయీవ" అర్ధం – మూడు వేదాలని చదువుకొన్న వాడి చేత ఇతర మతాలూ ఏ విధంగా శమింపచేయబడతాయో అదే విధంగా యమునా నది సర్పాల నన్నిటిని పారద్రోలిన

తర్వాత పరిశుద్ధమై విశుద్ధంగా ప్రకాశిస్తోంది.

దేశికులు సంకల్ప సూర్యోదయం అనే నాటకం రాశారు. ఇందులో మోహ పరాజయం, వివేకోదయంలను చెప్పారు. శాంతరసం వలన మనో వికారాలు శమించి ఆనందానుభూతి కలిగిస్తుందని వివరించారు. ఇది దార్శనికతకు ప్రతీకాత్మక నాటకం.

దేశికులు రహస్య గ్రంథాలైన "తత్వ పదవి, రహస్య పదవి, తత్వ నవనీతం, రహస్య నవనీతం, తత్వ మాతృక, రహస్య మాతృక, తత్వ సందేశం, రహస్య సందేశ వివరణం, తత్వ రత్నావళి, తత్వ రత్నావళి ప్రతిపాద్య సంగ్రహం, రహస్య రత్నావళి, రహస్య రత్నావళి హృదయం, తత్వ త్రయ చూలకం, రహస్య త్రయ చూలకం, అభయ ప్రదానసారం, రహస్య శిఖామణి, అంజలి వైభవం, ప్రదాన శతకం, ఉపహార సంగ్రహం, సార సంగ్రహం, మునివాహన భోగం, మధుర కవి హృదయం, పరమ పద సోపానం, పరమత భంగం, హస్తిగిరి మహాత్మ్యం, శ్రీమత్ రహస్య త్రయ సారం, సారసారం, పరిహారం.

దేశికులు హంస సందేశం అనే కావ్యం రాశారు. రాముడు హంస ద్వారా సీతాదేవికి సందేశం పంపటం ఇందులోని వృత్తాంతం. దక్షిణ దేశం గుండా హంస పర్యటించి, సముద్రం మీద రామబాణంలాగా దూసుకు వెళ్లి యెగిరి లంక చేరి రామ సందేశాన్ని సీతకు సందేశం అందజేస్తుంది. దేశికుల "పాదుకా సహస్రం"ను "మాగ్నం ఓపస్"గా భావిస్తారు. ఇది 1008 శ్లోకాల భక్తిమాల. ఇందులో ముప్పై రెండు పదాదిలు ఉన్నాయి. రోజుకు ఒకటి చొప్పున ముప్పై రెండు రోజులలో దీన్ని భక్తితో పఠిస్తే కోరికలు తీరి మోక్షం లభిస్తుంది అని నమ్మకం. చిత్ర పదాలతో లలిత సుందరంగా రాసిన భక్తి కుసుమమాల ఇది. ముఖ్యంగా శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీరంగనాథ స్వామి పాదపద్మాలపై రాసిన శ్లోక సముదాయం. ఇది చదివితే ఆత్మజ్ఞానం లభించటం ఖాయం. వేదాంత దేశికులు ఎక్కని సోపానాలు లేవు. అందని పురస్కారాలు లేవు. కదిలించని రచనలు లేవు. అన్నిటా దేశికులు మహా మార్గదర్శులే. ❀

63. ప్రతాప రుద్ర యశోభూషణ కర్త - విద్యానాధుడు (1292-1320 ad)

విద్యానాధుడు అసలు పేరు కాదని, అది అతని విద్వత్తుకు పొందిన బిరుదని తెలుస్తోంది. విద్యానాధుడు అనగానే గుర్తుకు వచ్చేది ఆయన రాసిన ప్రతిపరుద్ర యశోభూషణం అనబడే "ప్రతాపరుద్రీయం" అనే అలంకార శాస్త్రం. ఈయన అసలు పేరు "అగస్త్యుడు"గా భావిస్తున్నారు. విద్యానాధుడు కాకతీయ చక్రవర్తి ప్రతాప రుద్రుని ఆస్థాన కవి. జీవిత కాలము క్రీ.శ.1292 నుంచి 1323 వరకుగా తెలుస్తోంది. ప్రతాప రుద్రీయంలో "ఔన్నత్యం యది వర్ణ్యతే, తత్వం వర్ణ ఇతుం బిభేమి యదివా - జాహోస్త్య గస్త్య స్తితిస్త్వత్సా, ర్థ్యే గుణ రత్న రోహిణి గిరే శ్రీ వీర భద్ర ప్రభో" అని తాను అగస్త్యుడనే భావాన్ని తెలియజేశాడు విద్యానాధుడు. ఈ అద్భుత అలంకార గ్రంధాన్ని ప్రతాప రుద్ర మహారాజుకు అంకితం ఇచ్చాడు. పాండిత్యం వల్లనే అగస్త్యుడికి విద్యానాధుడు అనే పేరు వచ్చిందని చాలామంది భావిస్తున్నారు. అయితే ఆంధ్రదేశంలో విద్యానాధుడుగానే చలామణి అయ్యాడు. "సౌగంధికాపహరణం" రాశాడు. ఇందులో అగస్త్యుడు తన మేనమామ అని చెప్పుకొన్నాడు. విద్యానాధుని శిష్యురాలు గంగాదేవి అనే కవయిత్రి. "మధురా విజయం" అనే "వీర కంప రాయల" చరిత్రను రాసింది. ఇందులో ఈమె అగస్త్యుడు గొప్ప కవి అనీ 74 గ్రంధాలు రాశాడని చెప్పింది. దీన్ని ఆధారంగా చేసుకొని తమిళ కవి "విల్లి పుత్తురాన్" తమిళ భారతం రాశాడు తెలిపింది.

విద్యానాధుని రెండో రచన "కృష్ణ చరిత్ర" అనే గద్య కావ్యం. మూడవ

రచన "నల కీర్తి కౌముది" అనే 24 సర్గల కావ్యం. ఇందులో రెండు సర్గలు మాత్రమే లభించటం దురదృష్టం.

విద్యానాధుడు చాలా స్తోత్రాలు రాసినట్లు తెలుస్తోంది. దశావతార స్తోత్రం అందులో ముఖ్యమైనవి. తార స్తోత్రం, లక్ష్మీ స్తోత్రం, శివ స్తవం, శివ సంహిత, లలితా సహస్ర నామం, మణి పరీక్ష సకలాధి కారం విశ్వనాధకృతులుగా ప్రచారంలో వున్నాయి. ప్రతాప రుద్ర మహారాజు మణి మాణిక్య, వజ్రాలను పరీక్షించటంలో గొప్ప నేర్పున్నవాడు అని చరిత్ర చెబుతోంది. వేదం వెంకటరాయశాస్త్రిగారు రాసిన "ప్రతాప రుద్రీయ నాటకం"లో ఈ విషయం వుంది. అంతే కాదు శాస్త్రిగారు, ఆ నాటకంలో "విద్యానాధుడిని" ఒక పాత్ర చేసి మంచి ప్రాముఖ్యాన్నిచ్చారు. రుద్రుడిని బందీ చేసి ఢిల్లీ తీసుకొని పోతున్నప్పుడు ముందుగా బ్రాహ్మణ వేషంలో నదిలో మునిగిపోతున్నట్లు నటించి, ముస్లిం పాలకుల సానుభూతి చూరగొని, వారి కోరిక మీద ప్రతాప రుద్రుణ్ణి తీసుకువెళ్తున్న ఓడలో ఎక్కాడు. రాజుతో పరిచయం చేసుకొన్నాడు. రాజు బందీ అయిన సమాచారాన్ని యుగంధర మంత్రికి, జనార్ధన మంత్రికి తెలియజేశాడు చాకలి పేరిగాడికి సభా మర్యాదలను నేర్చినట్లు వేదం వారు నాటకంలో చూపించారు. ఉదాత్తంగా చూపించటమే కాదు, అతనిలోని దేశ, రాజభక్తికి పట్టం కట్టారు వేదంవారు.

విద్యానాధుడు "అగస్త్య నిఘంటువు" రాశాడని "ఘన శ్యాముడు" అనే కవి తన "ఉత్తర రామచరిత్ర వ్యాఖ్యానం"లో చాలాసార్లు ఈ నిఘంటువు గురించిన ప్రస్తావన చేశాడు. చాలా శబ్దాలను ఘనశ్యామ కవి ఇందులో నుంచి ఉదహరించినట్లు తెలుస్తోంది. అయితే ఇది అలభ్యం అవటం ఆంధ్ర సరస్వతి చేసుకొన్న దురదృష్టం. అగస్త్యుడయితేనేమి, విద్యానాధుడయితేనేమి మహా ఆలంకారికుడు, ప్రతాపరుద్ర యశోభూషణ కర్త విద్యానాధుడు అతని పూర్తి చరిత్ర కూడా లభ్యం కాకపోవటమూ బాధగానే వుంది.

ప్రతాప రుద్ర యశో భూషణంలో తొమ్మిది ప్రకరణాలున్నాయి. వీటిలో దృశ్య కావ్యాల గురించి శ్రవ్య కావ్యాల గురించి వివరించాడు. విద్యానాధుని అలంకార వివరాలను మల్లినాధ సూరి చాలాచోట్ల ఉదాహరించాడు. అప్పయ్య

దీక్షితులు విద్యానాధుడు చెప్పిన ఉపమాలంకార లక్షణాలతో ఏకీభవించలేదు. మల్లినాధుడు విద్యాధరుడు అనే అలంకార శాస్త్రవేత్త రాసిన "ఏకావళి"కి వ్యాఖ్య రాస్తే, అతని కుమారుడు "ప్రతాప రుద్రీయం"కు "రాత్నాపనం" అనే విపుల వ్యాఖ్యానం రాశాడు. విద్యాధరుడు కాని, విద్యానాధుడు కాని కొత్త కావ్య సిద్ధాంతాలను వేటినీ ప్రతిపాదించలేదు. ఉన్నవాటినే సులభంగా అర్ధమయ్యే రీతిలో రాశారు అంతే.

గంగా దేవి అనే కవయిత్రి విద్యానాధుడిని తన మధురా విజయంలో గురువుగా చెప్పుకొన్నది. విద్యానాధుడు "సౌగంధికాపహరణం" అనే వ్యాయోగంను రచించాడు. ఇది ఒకే అంకం కలిగి ఉన్నది. భీముడు ద్రౌపది కోరిక తీర్చటానికి సౌగంధిక పుష్పాన్ని అపహరించి తీసుకువచ్చే కథ ఇందులో ఉంటుంది. మహాభారత కథ ఇది. ఇందులో భీముడు హనుమంతుని ఎదిరించటం ఉంది. ఇద్దరి మధ్య రసవత్తర సంభాషణలు నడుస్తాయి. వీర శౌర్య ప్రధానం. ఈ వ్యాయోగాన్ని "ప్రేక్షణకం" అన్నాడు విద్యానాధుడు. క్షేమేంద్రుడు ప్రేక్షణకంను ఉపరూపకంలో ఒక భేదంగా చెప్పాడు. సహజంగా ప్రేక్షణకంలో ప్రాకృత భాషల ప్రయోగం ఉంటుంది. అందులోనూ శౌరసేనికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. ముఖ సంధి, నిర్వహణ సంధి రెండే ఉంటాయి. సూత్రధారుడితో పని ఉండదు. ప్రవేశిక, విష్కంభాలు కూడా ఉండవు. నాయకుడు ఉత్తమ వంశ సంజాతుడుగా ఉండాలనే నియమం లేదని సాహిత్య దర్పణంలో ఉంది. ఇవన్నీ పరిశీలిస్తే విద్యానాధుడు రాసిన దానిలో ఇవేమీ లేవు. అంటే ప్రేక్షణక ధర్మాలేవీ లేవు. కనుక సౌగంధికాపహరణం వ్యాయోగ లక్షణాలు సంపూర్ణంగా ఉన్న "వ్యాయోగమే" సందేహం లేదు.

విద్యానాధుడే మొట్టమొదటిసారిగా "త్రిలింగ" శబ్దాన్ని వాడాడు. "త్రికళింగ" నుంచి తెలుగు శబ్దం ఏర్పడిందని చిలుకూరి నారాయణరావుగారన్నారు. తేనె+అగు=తెనుగు అయిందని గ్రియర్సన్ చెప్పాడు. విద్యానాధుని అలంకార శాస్త్రం అయిన ప్రతాప రుద్ర యశో భూషణంను తెలుగులోకి మహోపాధ్యాయ శ్రీజమ్మల మడక మాధవ రామశర్మ గారు అనువదించారు. ❁

64. సాహిత్యాంబుధిని ఆపోశన పట్టిన - అగస్త్యుడు (1294-1325 ad)

ఉత్తర భారతం అంతా మహమ్మదీయ పాలనలో ఉండగా సంస్కృత భాషకు స్థానం లేకుండా పోయింది. దక్షిణాంధ్రలో తెలుగు కాకతి రాజులు రాజ్యం స్థాపించిన తర్వాతే సంస్కృతానికి ఆదరణ కలిగింది. రెండవ ప్రతాప రుద్రుడు గొప్ప పండిత, కవిపోషకుడు. విద్యానాధుడు ఆస్థానకవి. అగస్త్యుడు కూడా అప్పుడే అక్కడ ఉన్నాడు. కనుక కాలం 1294-1325గా భావిస్తారు. కాకతి రాజుల కాలంలో నాటకాలు అలంకార శాస్త్రాలు, నాట్య శాస్త్రాలు, చారిత్రక కావ్యాలు ఎన్నో సంస్కృత భాషలో వెలువడ్డాయి. అగస్త్య కవి ఒక వ్యక్తి కాదు. ఒక సాహిత్య సంస్థ అనిపించాడు. అగస్త్య మహర్షి సప్త సముద్రాలను ఆపోసన పట్టినట్లు ఈ అగస్త్య కవి సాహిత్య సముద్రాన్ని ఆపోసన పట్టి అపర అగస్త్యుడనిపించుకొన్నాడు. అతని సమర్ధతకు నిదర్శనంగా ఆయన రాసిన 74 గ్రంథాలే సాక్ష్యం.

సాహితీ అగస్త్యం

అగస్త్యుడు సంస్కృతంలో సంక్షిప్తంగా భారతం రాసి బాల భారతం అని పేరు పెట్టాడు. ఇరవై సర్గలున్న ఈ కావ్యం వైదర్భీ రీతిలో రాయబడింది. చక్కని కావ్య వర్ణనలు చేశాడు. ఋతు వర్ణన అమోఘంగా చేశాడు. వసంత ఋతు

వర్ణనలో "పుష్ప పరాగం" వసంత లక్ష్మి చల్లిన రంగుల్లాగా ఉన్నదట. క్లిష్టత లేక స్పష్ట సుందరంగా చెప్పటం అతని ప్రత్యేకత. కాళిదాసును జ్ఞప్తికి తెస్తాడు. భారత యుద్ధంలో చంద్రుడు తన వంశం అంతరించిపోతోందని తెలిసి చూడలేక త్వరగా అస్తమించాడని వర్ణించాడు –

"శీతాంశుర్నిజ జల జన్మనాం నృపాణాం సంగ్రామే నిధాన మపెక్షితుం – శృంగాణి క్షణ మవలంబ్య రశ్మి హస్తై రస్తాద్రే: పయసాంనిధిం ప్రపేదే". ఈ కావ్యానికి విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయల ముఖ్యమంత్రి అప్పాజీ అనే తిమ్మరుసు "మనోహర" అనే వ్యాఖ్యానం రాశాడు. దీని ఆధారంగా తమిళంలో "విల్లి భారతం" రాయబడిందట.

నలకీర్తి కౌముది అనే రెండవ కావ్యాన్ని అగస్త్యుడు రాశాడు. ఇందులో రెండు, నాలుగు సర్గలు మాత్రమే దొరికాయి శ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి దీని లిఖిత ప్రతిని సంపాదించి తెలుగు అకాడెమి జర్నల్లో ప్రచురించారని తెలుస్తోంది. రెండు సర్గల సరళిని చూస్తే ఇది మహాకావ్యం అనిపిస్తుంది. రెండవ సర్గలో నలుడు విదర్భలో దేవతా దూతగా ప్రవేశించటం ఉంది. నాలుగవ సర్గలో నల దమయంతుల వివాహం తర్వాత నలుడు మామగారింట్లో ఒక నెల గడిపి తన నిషాద నగరానికి వచ్చినట్లుంది. నలుడు దమయంతితో నిషాద నగరానికి వస్తూ ఉంటే పురజనులు వేడుకతో చూసే వర్ణనను రఘువంశంలో కాళిదాసు వర్ణించిన తీరుగా ఉంటుంది. తెలుగు కవులు కూడా ఈ విషయాన్ని అందంగా తమ కావ్యాలలో వర్ణించారు. అంతటి ప్రేరణ కల్గించి అగస్త్యుని రచన. ఈ సర్గలోనే వసంత, వర్షరుతు వర్ణన, జలక్రీడలు వర్ణింపబడ్డాయి. ప్రతి సర్గ చివర "శ్రీ" శబ్దాన్ని భారవిలాగా ప్రయోగించాడు. రెండవ సర్గలో డెబ్భై నాలుగవ శ్లోకాన్ని వసు చరిత్రకారుడు రామరాజ భూషణుడు అనువాదం చేసి పొందుపరచాడు. ఆ పద్యమే "నానా సూన వితాన వాసనలు". పన్నెండవ శతాబ్దం తర్వాత వచ్చిన కవుల్లో అగస్త్యుడే ప్రతిభాశాలి అంటారు. ❀

65. ప్రతాప రుద్రరాజ కవి (1296-1323 ad)

ఓరుగల్లు రాజధానిగా పరిపాలించిన కాకతి రాజులో గణపతి దేవుడు, ఆయన కుమార్తె రాణి రుద్రమ దేవి తర్వాత ప్రముఖ రాజు రెండవ ప్రతాప రుద్ర మహారాజు. రుద్రమదేవి మనుమడు. కూతురు ముమ్మడాంబ కొడుకు. రుద్రమ దత్తత తీసుకొన్నది. 1296-1323 కాలంవాడు. రుద్రమ దేవి తర్వాత రాజైనవాడు. గొప్ప సాహిత్య ప్రియుడు. స్వయానా రచయితా. సాహిత్య పోషకుడు. విద్యానాధుడు ఈయన ఆస్థానకవి. ప్రతాప రుద్ర యశో భూషణం లేక ప్రతాప రుద్రీయం అనే అలంకార శాస్త్రం రాసి రాజుకు అంకితమిచ్చాడు.

రుద్రరాజ కవి ప్రతాపం

స్వయంగా కవి అయిన ప్రతాప రుద్రుడు "యయాతి చరిత్ర" అనే సంస్కృత నాటకం రాశాడు. రాజు కావటానికి ముందే "కుమారు రుద్రుడు" అనే పేరుతో అమరుక రాజు రాసిన "శృంగార శతకానికి" వ్యాఖ్యానం రాశాడు. తెలుగులో భాస్కర రామాయణం కూడా కొంత భాగం రాశాడు. అసలు కవి భాస్కరుడికి రుద్ర దేవుడు శిష్యుడు. దీన్నిబట్టి రెండవ ప్రతాప రుద్ర చక్రవర్తి సంస్కృతంలోను తెలుగులోనూ కవిత్వం రాశాడని అర్ధమవుతోంది.

యయాతి చరిత్ర నాటకంలో ఏడు అంకాలున్నాయి. ఇది భారత కథ. యయాతి రాజు తన భార్య దేవయాని దగ్గర దాసిగా ఉన్న వృషపర్వ రాజు కూతురైన శర్మిష్టను ప్రేమించి పెళ్లి చేసుకొనే కథ. ఏ రకమైన మార్పులూ లేకుండా ప్రతాప రుద్రరాజు నాటకం రాశాడు. చక్కని సంవిధానంతో నాటకం రాశాడు. నాటకంపై హర్షదేవ, కాళిదాసుల ప్రభావం ఉంది. సరళమైన కవిత్వలో నాటకాన్ని తీర్చిదిద్దాడు. అప్పయ్య దీక్షితులు ఇందులోని శ్లోకాలను ఉదాహరించాడు. పొన్నగంటి తెలగానార్యుడు ఆంధ్రీకరించాడు. ❀

66. నల చంపువును రాసిన - త్రివిక్రమ భట్టు (1300 ad)

నల చంపువును రాసిన త్రివిక్రమ భట్టు పదవ శతాబ్ది కవి. తండ్రి దేవా(నేమా)దిత్యుడు. తాత శ్రీధరుడు భోజుడు త్రివిక్రముడిని ఉదాహరించాడు. మాన్య ఖేటాధిపతి అయిన మూడవ ఇంద్రుడు అనే రాష్ట్రకూట రాజు ఆస్థాన కవిగా ఉన్నాడు.

భట్టు కవితా త్రివిక్రమం

భట్టు తండ్రి నేమాదిత్యుడు రాజాస్థాన పండితుడు. భట్టు చదువు వదిలేసి తిరుగుబోతుగా ఉండేవాడు. తండ్రి పక్క ఊరు వెళ్ళినప్పుడు రాజాస్థానానికి శాస్త్రవాదం చేయటానికి ఒక పండితుడు వచ్చాడట. రాజు ఇంటికి కబురు చేశాడు ఏమి చేయాలో తోచని త్రివిక్రముడు సరస్వతీదేవిని ప్రార్థించాడట. అతని తండ్రి తిరిగి వచ్చేదాకా తానూ భట్టు నాలుక మీద ఉంటానని వాణి వాగ్దానం చేసి అలానే చేసింది. అమ్మ బలంతో శాస్త్రవాదానికి వచ్చిన పండితుడిని తానే ఓడించి రాజ సత్కారం పొందాడు. సరాసరి ఇంటికి వచ్చి “నల చంపువు” రాయటం ప్రారంభించాడు. ఏడవ ఉచ్వాసం పూర్తి అయ్యేసరికి తండ్రి ఇంటికి తిరిగి వచ్చాడు. సరస్వతి ఇచ్చిన మాట ప్రకారం నాలుకమీద నుంచి వైదొలగింది. తర్వాత కావ్యాన్ని పూర్తి చేయలేకపోయాడట అని కథ ప్రచారంలో ఉంది.

భారతంలోని అరణ్య పర్వ కథ. అందరికీ తెలిసిందే. నలుడు హంసను చూసి పట్టుకోవటం దానితో సంభాషించటం, అది దమయంతికి నలునిపై ప్రేమ ఉందని చెప్పటం, దమయంతి వృత్తాంతం అంతా వివరంగా రాశాడు. హంస దమయంతిని చేరి నలుని ప్రేమ విషయం తెలియజేయటం, దమయంతీ స్వయంవరం, దిక్పాలకుల తరపు రాయబారం దమయంతీ విరహంతో నలుగు పడే బాధ. త్రివిక్రముడు చంపువును ఆధారంగా చేసుకొనే శ్రీహర్షుడు నైషధ కావ్యం రాశాడంటారు. ఇందులోని భాగాలను ఉచ్ఛ్వాసాలు అని పేరు పెట్టాడు.

ప్రతి ఉచ్ఛ్వాసం చివర్లో “హర చరణ సరోజ” అనే పదాన్ని వాడాడు. ఈ చంపూ కావ్యానికి చాలా టీకాలున్నాయి. కనుక అందరిని అలరించిన కావ్యం అనుకోవచ్చు. త్రివిక్రముని బాటలో హర్షుడు, లక్ష్మీధరుడు, శ్రీనివాస దీక్షితుల నల దమయంతుల కావ్యాలు రాశారు. ఇందరికి ప్రేరణనిచ్చినవాడు త్రివిక్రముడు.

త్రివిక్రముడు మదాలస చంపువు కూడా రాశాడు. మార్కండేయ పురాణంలోని “కువలయాశ్వుడు – మదాలస”ల చరిత్ర. కువలయాశ్వుడు పాతాళ కేతువును చంపి మదాలసను పెళ్ళాడటమే ఇతివృత్తం. బహుశా దీన్నే ముందుగా రాసి ఉంటాడు. అంత పరిపక్వమైన రచన అనిపించదు. కథా విషయంలో ఉత్కృష్ట కావ్యం అనిపించుకొన్నది. దీని ఆధారంగా కృష్ణదేవరాయలుతో సహా చాలామంది మదాలస చరిత్ర కావ్యాలు రాశారు. ఇందరికి స్ఫూర్తి కల్గించాడు. చంపువు అంటే పద్యంతో బాటు గద్యమూ ఉన్న రచన అని మనకు తెలిసిన విషయమే. త్రివిక్రముడు సవ్యసాచిగా రెండిటిని పండించాడు. మధురమైన శైలి ఆకర్షిస్తుంది. సభంగ శ్లేషను బాగా ప్రయోగించాడు.

“ఉదయగ్రి గతాయాం ప్రాక్ప్రాభా పాండుతాయా – మనుసరతి నిశీదే శ్రుంగా మస్తాచలస్య

జయతి కిమపి తేజ: సాంప్రతం వ్యోమ మధ్యే – సలిలమివ విభిన్నం జాహ్నవం యామునం చ” అంటే “ఉదయ కాంతి ఉవయ గిరి కొండమీద ప్రకాశిస్తోంది. రాత్రి హస్తగిరి శిఖరాల మీద నుంచి జారుతోంది. అప్పుడు గంగా యమునా జలాలు కలిసిపోయినట్లు ఒక అలౌకిక తేజస్సు అంతటా ప్రకాశిస్తోంది” అన్నాడు త్రివిక్రముడు.

కవి పద ప్రయోగంలో నిపుణుడుగా ఉండాలి. కాకపోతే తప్పటడుగులు వేసి అర్థం కాని బాలుడి మాటలవాడు అంటారు త్రివిక్రముడు. “కిం కవేస్తేన కిం కాండేన ధనుష్మత: – పరస్య హృదయే లగ్నం న ఘూర్ణ యతి యచ్ఛిరః” అని మరొక చోట అంటాడు. దీని అర్థం “ప్రయోగించిన పదం ధనుర్ధారి ప్రయోగించిన బాణం హృదయాన్ని తాకి వ్యామోహితుడిని చేయకపోతే లాభం లేదు. ఇదీ త్రివిక్రమ భట్టు కవితా ప్రాభవం.❀

67. రస తరంగిణి కర్త, మాయా రస ప్రతిపాదకుడు - భానుదత్తుడు (1300 ad)

పదమూడవ శతాబ్దివాడైన భానుదత్తుడు రస తరంగిణి, రస మంజరి అనే అలంకార శాస్త్రాలు రాశాడు. మిధిలా గణనాధుని కొడుకు.

దత్తుని కవితా భానుప్రతాపం

రస మంజరిలో శ్లోకాలతోబాటు టీకా కూడా ఉండటం విశేషం. నాయికా నాయకుల భేదాలను వివరించాడు. రసమంజరి తర్వాత రస తరంగిణి రాశాడు. ఇది భరతుని నాట్యశాస్త్రంలోని ఆరు ఏడు అధ్యాయాలకు వ్యాఖ్యానంగా భావిస్తారు. గద్య రూప రచన. రాముడికి కృష్ణుడికి సంబంధించిన శ్లోకాలు రాసి ఉదాహరణలుగా ఇచ్చాడు. ఎనిమిది తరంగాల కావ్యం. శృంగార రసం ప్రాధాన్యతను తెలియబరచాడు. "మాయా రసం" అనే దాన్ని ప్రతిపాదించి దాన్ని పదవ రసంగా చెప్పాడు. చిత్తవృత్తి అనేది ప్రవృత్తి, నివృత్తి అనే రెండు రూపాలలో ఉంటుందని, నివృత్తిలో శాంతరసం, ప్రవృత్తిలో మాయారసం ఉంటాయన్నాడు. రతి, హాస, శోక, క్రోధ, ఉత్సాహ, భయ, జుగుప్స, విస్మయాలు ప్రవృత్తిలో పుట్టి అక్కడే అణగిపోతాయన్నాడు. ఇవన్నీ స్థాయీ భావాలని, ఇవి మాయా రసానికి వ్యభిచారీ భావాలు అవుతాయని చెప్పాడు. మాయారసానికి స్థాయీ భావంగా మిధ్యాజ్ఞానం, ధార్మధర్మాలు, సంతానం, విజయాలు, అనుభవాలు అన్నాడు. మాయ అనాది అని, ఏదో ఒక దాని వల్లమాయ పుట్టదని అది రసమే కాదు పొమ్మన్నాడు చిరంజీవి భట్టాచార్యుడు. జ్రుమ్భ అనే తొమ్మిదవ సాత్విక భావాన్ని భానుదత్తుడు చెప్పాడు. "ఛలం" అనే ముప్పై నాలుగవ సంచారీ భావాన్ని కూడా చెప్పాడు. ❁

68. మహా వ్యాఖ్యాన పండితుడు - కోలాచలం మల్లినాధసూరి (1350-1400 ad)

ఎవరైనా ఏ పుస్తకం మీదనైనా మంచి వ్యాఖ్యానం రాస్తే మల్లినాధసూరి వ్యాఖ్యానం లాగా వుంది అనటం లోకంలో రివాజు. అన్నం మెతుకు పెట్టె మెదక్ జిల్లాలో జన్మించాడు. కాళిదాసాది మహాకవుల సంస్కృత సాహిత్యపు ఓగిరాన్ని ఆంధ్రులకు అన్న ప్రాసనగా పెట్టిన మహానుభావుడు. ఆయన గురించి తెలుసుకోకపోతే తెలుగు తల్లి మనల్ని క్షమించదు. ఆంధ్రుల కీర్తిని ఖండంతరాలు దాటించిన వాడు "కోలాచలం మల్లినాధసూరి". మల్లినాధసూరి అనే మాట వ్యాఖ్యాతకు పర్యాయపదమైపోయింది. క్రీ.శ.1350-1450 కాలంవాడు. మహామహోపాధ్యాయ, వ్యాఖ్యాన చక్రవర్తి, అపరకాళిదాస బిరుదాంకితుడు.

ఆయన పద వాక్య ప్రమాణ పారావార పారాయణుడు, మహా మహోపాధ్యాయుడు. ఆయనది హృదయోల్లాస వ్యాఖ్య. మూల గ్రంధానికి పూర్తి న్యాయం చేసే వ్యాఖ్యానం చేయటం ఆయన ప్రత్యేకత. వ్యాఖ్యలో తర్కం, వ్యాకరణం మిళితమై ఉంటాయి. కాళిదాసు కవిత్వం కొంత మనపైత్యం కొంత లాగా ఉండదు. కవి హృదయాన్ని చక్కగా ఆవిష్కరిస్తాడు. లయకు స్థానం కల్పించాడు. "జ్ఞానసింధు" అనిపించుకొన్నాడు. కాళిదాసు, మాఘుడు, భారవి, హర్షుడు రాసిన కావ్యాలకు ఆయన వ్యాఖ్యలు లేకపోతే చదివేవారు కాదని అందరి నమ్మకం. ఆయన లేకపోతే

ఆంధ్ర సంస్కృతి లేదంటారు చాలామంది. మల్లినాధుని వాక్యం, మెదక్‌జిల్లా సంస్కృతికి పలుకుబడికి ప్రతీక.

కోలాచలం అన్న ఇంటి పేరున్న వారు ఇప్పటికీ మెదక్‌జిల్లాలో వున్నారు. పటాన్ చెరువు వద్ద ఈ పేరుగల కుటుంబాలున్నాయి. 14వ శతాబ్దం ఉత్తరార్ధంలోనివాడు సూరి. రాజుల ఆదరణతో కాకతీయ, ఓరుగల్లు చేరాడు వీరి పతనం తర్వాత. రాచకొండ రాజుల ఆస్థానానికి వచ్చాడు. ఆపస్థంభ సూత్రం. యజుస్శాఖ – వీరిది కాశ్యపస గోత్రం. వైదిక బ్రాహ్మణులు – రాచకొండ రాజు సర్వజ్ఞ సింగ భూపాలుడు, విజయనగర రాజు మొదటి దేవరాయల ఆస్థానంలో ఉండేవాడు. తెలంగాణాలోని కొలచేలమ వీరి స్వగ్రామం. కాకతీయ రాజ్య పతనం తర్వాత కుటుంబం సింగ భూపాలుని రాజధాని అయిన రాచకొండకు చేరింది.

తాత పేరు మల్లినాధుడే. శ్రీశైల మల్లన్న వీరి ఇలవేలుపు. తాత కాకతి ప్రతాప రుద్ర మహారాజ ఆస్థాన కవి. కనకాభిషేకం పొందిన శతావధాని సూరి తండ్రి. "కపర్థి" పండితుడు శ్రౌత కల్పానికి "వృత్తి" రాశాడు. విద్యా సంపన్నమైన కుటుంబంలో పుట్టటం, రాజ పూజితం వుండటం, శిష్టాచార వంశం అవటంతో సూరికి బాగా కలిసి వచ్చింది. మల్లినాధుడు సర్వశాస్త్ర మల్లుడు అయ్యాడు. శాస్త్రాలన్నీ ఆపోసన పట్టి, "చుళికీ కృత సర్వశాస్త్ర పాథోధి" అనిపించుకున్నాడు. తనది సౌజన్యమైన విదుషీత్వం అని నిగర్వంగా చెప్పుకొన్నాడు న్యాయ వైశాషిక. మీమాంసాల లోతులు చూశాడు. ఈయన పెద్ద కొడుకు పెద్దయ్య, చిన్నకొడుకు కుమారస్వామి. ఇద్దరు ఉద్దండ పండితులే. పెద్దయ్యనే పెద్దిభట్టు అంటారు. ఇతను రాచకొండ రాజు సర్వజ్ఞ సింగ భూపాలునిచే కనకాభిషేకం పొందాడు. అయితే ఇతను రాసినవేవీ లభ్యం కావటం లేదు. కుమారస్వామి తన అన్నను గురించి "ప్రతాప రుద్రీయం"పై రాసిన వ్యాఖ్యానంలో ఈ విషయాన్ని చెప్పాడు. తమ్ముడికి అన్నగారే గురువు.

కవితా గీర్వాణం

మల్లినాధుడు మందబుద్ధి ఉన్నవారికి కూడా సులభంగా అర్ధమయేట్లు

వ్యాఖ్యానం చేస్తాను అన్నాడు. "సంస్కృత వాఙ్మయ ప్రచారం తన విధి" అన్నాడు. విశ్వ శ్రేయస్సు తన ఆకాంక్ష అన్నాడు. మహా కవుల కావ్యాల్ని విపరీత వ్యాఖ్యానాలు పాడుచేస్తున్నాయనీ, విషంతో మూర్ఛపోయిన వాటిని ఉజ్జీవింపజేయటానికి తాను "సంజీవిని" అనే పేర వ్యాఖ్యానం రాస్తున్నట్లు తెలియజేశాడు అన్వయం ప్రకారం. అర్థాలు వివరించటం, ప్రమాణాలు చూపటం, అవసరమయినంత వరకే చెప్పటం సూరి వ్యాఖ్యానంలో విశేషం.

సూరి మొదట కాళిదాసు రచించిన "కుమార సంభవం" కావ్యానికి వ్యాఖ్య రాశాడు. అంతకుముందు దీనిపై 37 వ్యాఖ్యానాలున్నాయి. "రఘువంశ సంజీవిని" సూరి మొదటి వ్యాఖ్యానం. దీని ముందు అవన్నీ వెలవెలబోయాయి. ప్రతి సర్గ వ్యాఖ్యానికి ముందు అద్భుతమైన శ్లోకం రాసి కొత్త దారి తొక్కాడు. కుమార సంభవానికి అంతకుముందున్న 25 వ్యాఖ్యానాలు సూరి వ్యాఖ్యానం ముందు తల వంచాయి. అయితే ఉన్న పదిహేడు సర్గలలో ఏడు సర్గల వ్యాఖ్యానమే లభిస్తోంది. అంటే శివ పార్వతుల సంభోగ శృంగారం వరకే. ఎనిమిదో దానికి సీతారామ పండితుడు వ్యాఖ్య రాశాడు. మేఘదూతానికి సూరి వ్యాఖ్య మాత్రమే బహుళ ప్రచారం పొందింది. "మాఘే మేఘే, గతం వయ:" అంటే దీనకి వ్యాఖ్యానం రాయటానికి చాలా శ్రమపడ్డాడని తెలుస్తోంది.

భారవి రాసిన "కిరాతార్జునీయం" నారికేళ పాకం. దాన్ని తాను పగలకొడ్తున్నానని అందులోని రసాన్ని ఆస్వాదించమని చెప్పి వ్యాఖ్యానించాడు. వ్యాఖ్యానం లేకపోతే ఈ కావ్య సౌధంలోకి ప్రవేశం దుర్లభం అంటారు విజ్ఞులు. మాఘ కవి రాసిన "శిశుపాల వధ"ను అద్భుతంగా వ్యాఖ్యానించి, కవి హృదయాన్ని వెలువరించాడు. కాళిదాసు, భారవి, దండి కలిస్తే మాఘుడు అన్నాడు మాఘంపై సూరి వ్యాఖ్యాన రీతి, వ్యాఖ్యానం రాసి ఆ కవిత్వ సౌందర్యానికి ముగ్ధుడై పరవశించాడు. దీని గురించి "సంజీవినిలో తూలికగా, ఘంటా పథంలో శానశిలగా, విలసిల్లిన సూరి లేఖిని, ఈ సర్వంకషలో సంశయచ్ఛేదంలో "అసిలత"గా గుణ ప్రకాశంలో విద్యుత్ లతగా, రస భావావిష్కరణలో కల్పలతగా భాసించింది" అన్నారు సూరిని సమగ్రంగా ఆవిష్కరించిన మహా పండిత విశ్లేషకులు చలమచర్ల

రంగాచార్యులవారు. మాఘ వ్యాఖ్యానం రాసి తాను ధన్యుడనయానని ఆనందంగా చెప్పాడు. విద్వ దౌషధం అనిపించుకొన్న "నైషధ" కావ్యానికి కర్త మహాపండితుడు, చింతామణి మంత్రో పాసకుడు, శ్రీహర్షుడు. అందులోని రసభావ గుణ అర్ధ దోషాలను ధ్వనిని, అలంకారాలను, రహస్యాలను వెలికితీసి రసజ్ఞులకు అందజేస్తున్నట్లు సూరి ప్రకటించి అన్నంత పనీ అద్భుతంగా చేశాడు.

వ్యాకరణ కీకారణ్యంగా వుండే భట్టు కావ్యానికి సులభ వ్యాఖ్యానం చేశాడు మల్లినాధసూరి. ప్రౌఢ దేవరాయల కోరికపై వైశ్యవంశం వారి గురించి "వైశ్య వంశ సుధాకరం" రాశాడు అమర కోశానికి అమర పద పారిజాతం అనే వ్యాఖ్యానాన్ని, వైశేషికానికి "భాష్య నికరం"ను, పాణినీయానికి కాశికా వృత్తి అనే ఉద్యోగ టీకా వ్యాఖ్యను విద్యాధరుని, అలంకార శాస్త్రం ఏకావలికి "తరళ వ్యాఖ్య", కావ్యాదర్శానికి కూడా వ్యాఖ్య రాశాడు. సూరి శిష్యులు రత్న. సూరి కొడుకులిద్దరూ మహా పండితులు.

కవి మాణిక్యాలు

దాదాపు తొంభై ఏళ్ళు జీవించాడు సూరి. కళ్ళు తెరిచే ఓపిక లేకపోతే కిందిరెప్పకు, పై రెప్పకు కూడా తలపై నుంచి రాయి కట్టుకోని దీపం ముందు కూచుని కావ్యాలు చదువుతూ, వ్యాఖ్యానాలు రాశాడని అంటారు. జీవితమంతా వ్యాఖ్యానాలకే అంకితం. సూరి లేకపోతే సంస్కృత కవి సూర్యుల కవితా వెలుగు మనకు తెలిసేది కాదు. కనుక వ్యాఖ్యాన సూర్యుడు అన్నారు ధన్యజీవి. సూరి పేరుకు సార్ధకత తెచ్చిన మహానుభావుడు. అందుకే ఆయన్ను "వ్యాఖ్యాత' చక్రవర్తి" అని సగౌరవంగా ఆంధ్ర దేశం పిలుచుకొంటుంది.

తాను రాసిన వ్యాఖ్యానాలకు భలే తమాషాగా సరియైన పేరు పెట్టటం మల్లినాధుని ప్రత్యేకత. మహాకవి కాళిదాసు రాసిన రఘువంశ, కుమార సంభవ, మేఘదూత కావ్య వ్యాఖ్యానకు "సంజీవని వ్యాఖ్య" అని తగిన నామకరణం చేశాడు. భారవి కిరాతార్జునీయానికి రాసిన వ్యాఖ్యను "ఘన పాఠ" అన్నాడు. మాఘ కవి రాసిన శిశుపాల వధ కావ్య వ్యాఖ్యానికి "సర్వంకష" అని పేరు పెడితే, శ్రీహర్షుడు రాసిన నైషధ కావ్య వ్యాఖ్యానానికి "జీవాతువు" అని గొప్ప పేరు పెట్టాడు. భట్టికావ్య

వ్యాఖ్యానాన్ని "సర్వ పాఠినా" అన్నాడు.

విద్యాధరుడు రాసిన అలంకార శాస్త్రం "ఏకావళి"కి చేసిన వ్యాఖ్యానాన్ని "తరళ" అని పిలువగా, వరద రాజు రాసిన తార్కిక రాక్షతికకు రాసిన వ్యాఖ్యానాన్ని "నిష్కంటక" అన్నాడు. అన్నీ సార్ధక నామాలే. అన్నీ అంత అద్భుతంగా రాసినవే.

కావ్యాలకు, అలంకారాలకు సమర్ధవంతమైన వ్యాఖ్యానాలు రాయటంతో సరిపుచ్చుకోలేదు. సృజనాత్మక రచనలూ చేసి మెప్పించాడు. రఘువీర చరిత, వైశ్య వంశ సుధాకర, ఉదార కావ్య అనే రచనలు చేసి తన ప్రతిభను నిరూపించుకొన్నాడు. తమాషా ఏమిటంటే మరాఠీ భాషలో "మల్లినాధి" అనే మాట చేరింది. దీని అర్ధం వ్యాఖ్యానం లేక విమర్శ. అంటే విమర్శ వ్యాఖ్యానాలకు మల్లినాధ సూరి పర్యాయ పదం అయ్యాడన్న మాట. సంస్కృత పంచ మహాకావ్యాలకు అన్నిటికి సంస్కృతంలో వ్యాఖ్యానం రాసిన తెలుగు బిడ్డ మల్లినాధ సూరి అవటం మనందరికి గర్వకారణం. దీన్ని పురస్కరించుకొని దాదాపు అయిదు శతాబ్దాల తర్వాత సూరి మహా పాండిత్యాన్ని జ్ఞాపకం చేసుకోవటానికి 1981 నవంబర్ 21న మొట్టమొదటిసారిగా మెదక్‌లో మహా సభ నిర్వహించారు. ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖామాత్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి, ఆచార్య శిరోమణి శాస్త్రులు, శ్రీ విశ్వనాధ శర్మ, మెదక్ కలెక్టర్ శ్రీమతి గాయత్రి రామచంద్రన్‌లు పాల్గొని మల్లినాధుని బహుముఖ ప్రజ్ఞా విశేషాలను ప్రస్తుతించారు. ఇంతటితో ఆగిపోకుండా మెదక్‌లో మల్లినాధ సూరి కుటుంబం నివసించిన గృహాన్ని వేద పాఠశాల నెలకొల్పాలనుకొని చివరకు వర్గల్‌కు మార్చారు. ప్రభుత్వం ఏ పని చేసినా ఆరంభ శూరత్వమేనని మరొకసారి రుజువైంది. ఆ ఇల్లు శిథిలావస్తకు చేరి స్థలం కొద్ది కొద్దిగా అన్యాక్రంతమైంది. ఎస్. జగదీశ చంద్ర ఆధ్వర్యంలో "కోలాచలం మల్లినాధ సూరి సాహితీ పీఠం" ఏర్పడి సూరి రచనలను అందుబాటులోకి తెచ్చే కృషి చేస్తోంది. కోలాచల కుటుంబం అక్కడ ఒక గ్రంథాలయాన్ని వేదం విద్యాలయాన్ని ఏర్పరచే ప్రయత్నంలో ఉంది. నలభై ఆరు గ్రంథాలను సేకరించి భద్రపరచారు. "స్వస్త్యస్తు వాఙ్మయోద్యానే మహసే భూయసే సదా – యశసే మల్లి నాధస్య కల్ప వల్లీ సుమత్విషే".❀

69. సాహిత్య దర్పణ రచయిత - విశ్వనాధుడు (1378 ad)

ఒరిస్సాకు చెందిన విశ్వనాథ మహా పాత్రుడు పద్నాలుగవ శతాబ్దికి చెందినవాడు. ఒరిస్సా రాజాస్థాన కవి తండ్రి చంద్రశేఖరుడు కూడా అదే ఆస్థానంలో మహా కవీశ్వరుడు.

కవితా విశ్వనాధం

"సంధి - విగ్రహ మహాపాత్రుడు" అనే బిరుదున్న వాడు విశ్వనాధుడు, ముమ్మటుడి కావ్య ప్రశంసకు "కావ్య ప్రకాశ దర్పణం" అనే టీకా రాశాడు. విశ్వనాధుని "సాహిత్య దర్పణం" బాగా ప్రచారమైన అలంకార శాస్త్రం. ఇందులో పది పరిచ్ఛేదాలున్నాయి. దృశ్య, శ్రవ్య, కావ్య చర్చ చేశాడు. "వాక్యం రసాత్మకం కావ్యం" అని సిద్ధాంతీకరించినవాడు విశ్వనాధుడు. ధ్వని వాది కాదు, రసవాది. రసమే కావ్యానికి ఆత్మ అని భరతుడిని సమర్ధించాడు. రూపక భేదాలను వివరంగా వివరించాడు. దశ రూపకం తర్వాత ఇదే ప్రామాణికం. అలంకార రీతులనూ విశదీకరించాడు. తాను స్వయంగా కవి కనక తన గ్రంధాల నుంచే ఉదాహరణలిచ్చాడు. రఘు విలాస మహాకావ్యం, కువలయాశ్వ చరిత్ర అనే ప్రాకృత కావ్యం ప్రభావతి, చంద్రకళ అనే నాటకాలు కూడా రాశాడు విశ్వనాధుడు. విశ్వనాధుని సాహిత్య దర్పణం నిజంగానే సాహిత్యానికి దర్పణం లాంటిదే. అందరి ప్రశంసలను అందుకొన్నది. ముమ్మటుని గ్రంధం తర్వాత దీనికే ప్రాచుర్యం ఎక్కువ. దర్పణానికి అనేకమంది టీకలు రాశారు. విశ్వనాధుడి కొడుకు అనంతదాసు కూడా ఒక టీకా రాసి తండ్రి ఋణం తీర్చుకొన్నాడు.

70. విద్యారణ్యుల శిష్యుడు, గద్య కవి - వామన భట్ట బాణుడు (1350-1420 ad)

పెదకోమటి వేమిరెడ్డి ఆస్థాన కవి వామన భట్ట బాణుడు. విజయనగర సామ్రాజ్య నిర్మాత విద్యారణ్య స్వామి వారి శిష్యుడు. ఇతని కాలం 1350-1420. శృంగార భూషణం అనే "బాణం" అనబడే రూపక భేదాన్ని రాశాడు. దీన్ని పంపా క్షేత్రంలో విరూపాక్ష స్వామి వసంతోత్సవాలలో ప్రదర్శించినట్లు తెలుస్తోంది. 1380లో విజయనగర రాజు మొదటి దేవరాయల శాసనాన్ని వామన భట్టు రచించాడు. అందులో తాను కవీశ్వరుడనని, వ్యాకరణ మీమాంసా శాస్త్రాలలో పండితుడనని చెప్పుకొన్నాడు.

భట్ట బాణ కవితా త్రివిక్రమం

వేమారెడ్డి ప్రభు జీవిత చరిత్రను "వేమ భూపాల చరిత్ర"గా వామన భట్టు రాశాడు. ఇదికాక "హంస సందేశం" అనే లఘు కావ్యం రాశాడు. ఇందులో రెండు భాగాలున్నాయి. నూట ముప్పై ఒక్క శ్లోకాల గ్రంథం. కావ్యం అంతా క్రాంత వృత్తంలోనే రాశాడు. కాళిదాసు మేఘ సందేశ చాయలు ఎక్కువగా ఇందులో గోచరిస్తాయి. ఇందులో వార్తాహరత్వం చేసింది హంస. దక్షుడు అనే యక్షుడు ప్రియురాలిన కందర్ప లేఖకు హంసద్వారా సందేశం పంపటమే కథ. యక్షుడు నేరం చేయటం వలన కైలాసం నుండి పంపించి వేయబడ్డాడు. మలయ పర్వతం మీద ఉంటున్నాడు. అతని ప్రవాస శిక్ష ఒక ఏడాది మాత్రమే. అలకా

నగరంలో ఉన్న తన ప్రియురాలికి ఇక్కడి నుండి సందేశం పంపుతాడు. యక్షుడు హంసకు అలకానగరం ఎలా వెళ్ళాలో రూట్ మాప్ తెలియజేస్తాడు. తామ్రపర్ణి, మధుర, కావేరి, శ్రీరంగం, చిదంబరం, కంచి, కాళహస్తి, కృష్ణా, గోదావరి, తుంగభద్రా నదులు దాటి వింధ్యను చుట్టి నర్మదా, యమునా, గంగా, వారణాసి, అయోధ్య, సరయు, గండకి నదులు చూసి కురుక్షేత్రం హిమాలయాలను క్రౌంచ పర్వతాన్ని దర్శించి కైలాసం మీదుగా అలకా నగరం వెళ్ళమని చెబుతాడు. పర్వత నగర నదీ వర్ణనలను కాళిదాసు బాటలోనే చేశాడు. ఇదంతా మొదటి భాగంలో ఉన్నాయి. రెండవ భాగంలో హంస అలకా నగరం చేరిన తర్వాత తన ఇంటి జాడలను గురించి చెబుతాడు. ప్రియురాలి వర్ణన, ఆమె విరహ వేదన, తర్వాత దక్ష యక్ష సందేశాన్ని హంస అతని ప్రియురాలు కందర్ప లేఖకు తెలియజేయటంతో కావ్యం అయిపోతుంది. వర్ణనలు స్వారస్యంగా చేశాడు వామనభట్ట. భార్య విరహాన్ని వర్ణిస్తూ –

"చిత్రే కర్తుం వ్యవసితా మతిస్తూలికాయాం ద్రుతాయాం – భగ్నా రంభో. నయన సలిలై స్చేతసి త్వాం లిఖామి తత్రాపి ద్రాగరతి రధికోల్లాసినీ మే విహంత్రీ – యత్ సత్యం నోవరతను విధి: సంగామే సాభయ సూయ:"

వామనుడు "నలాభ్యుదయం", "రఘు వీర చరిత్ర" అనే రెండు మహాకావ్యాలు రాశాడు. ఇవి కాక పార్వతీ పరిణయం, కనక లేఖా కల్యాణం, బాణాసుర విజయం అనే నాటక రచనా చేశాడు. ఉషాపరిణయం అనే నాటకాన్ని వామనుడు రాశాడని మల్లంపల్లి వారు చెప్పారు. బహుశా బాణాసుర విజయం ఉషాపరిణయం ఒకటే కావచ్చు.

వామన భట్ట ముఖ్యంగా గద్య కవి. బాణుడు లాగానే చక్కని గద్య రచనా చేశాడు. ఇతని శృంగార భూషణం అనే భాణంలో ఒకేఒక్క అంకం ఉంటుంది. విలాస శేఖరుడు అనే విటుడు అనంగ మంజరి ఇంటికి వెడుతూ ఉంటే దారిలో అతడు చూసిన వింతలు, విశేషాల వర్ణనే ఈ రూపకం. అందులో పేద, ధనిక వర్గాల వారు, విటులు, వేశ్యలు, శృంగార కార్యకలాపాలు, గొర్రె పొట్టేళ్ల పోట్లాటలు, కోడి పందాలు, జూదం, మల్లయుద్ధం, ఖడ్గ యుద్ధం, స్త్రీల

బంతులాట, ఉయ్యాల లూగటం మొదలైనవి అన్నిటిని వామనభట్ట బాణుడు వర్ణిస్తాడు.

పార్వతీ పరిణయము అయిదు అంకాల నాటకం. ఇందులో శివపార్వతుల కల్యాణం వర్ణించాడు. కుమార సంభవ కధను చేర్చాడు. కవిత్వం గొప్పగా, మధురంగా, సరసంగా ఉంటుంది. కనక లేఖా పరిణయం నాలుగు అంకాలున్న నాటకం. విజయవర్మ అనే రాకుమారుడు వీరవర్మ కూతురు కనక లేఖను ప్రేమించి పెళ్ళాడే కథ. మధ్యలో అనేక చిక్కులు వాటిని అధిగమించటం చివరికి పెళ్ళితో తెర పడి సుఖాంతమవుతుంది. కొత్తదనం లేక పూర్వపు నాటకాల ధోరణిలోనే సాగింది. ఏనుగుల వేట, ప్రియురాలి చిత్రపటంతో రాజు వినోదించటం నాయకురాలి ముగ్ధత్వం ఉంటాయి. శృంగార రస ప్రధాన నాటకం. హాస్యం అద్భుత రసాలు కూడా ఉండి కాలక్షేపానికి పనికొస్తాయి.❀

71. రాణి కవయిత్రి - గంగా దేవి (1360 ad)

విజయనగర రాజు రెండవ బుక్క రాయల రెండవ కొడుకు కంపరాయల భార్య గంగా దేవి. 1361-1374లో యువరాజుగా ఉన్నాడు. మధురమీద దాడి చేసి తురుష్కులను ఓడించి 1371లో విజయం సాధించాడు. ఈ ఇతివృత్తాన్ని తీసుకుని గంగాదేవి "మధురా విజయం" కావ్యం సంస్కృతంలో రాసింది. దీనికి "వీరకంప రాయచరిత్ర" అనే పేరూ ఉంది. ఏడవ సర్గలో తానూ కంపరాయల భార్యనని చెప్పుకొన్నది.

కవితా గంగా లహరి

విదుషీమణి అయిన గంగాదేవి కావ్యాల అధ్యాయాన్ని క్షుణ్ణంగా చేసింది. ఆ ప్రభావం కావ్యం మీద ప్రసరించింది. తెలుగు సాహిత్యంతో పరిచయం కూడా బాగా ఉన్నట్లు గోచరిస్తుంది. ఇది కూడా వీర రస కావ్యం. పుర ఋతు, జలక్రీడ, సూర్యాస్తమయ, చంద్రోదయాలను కావ్యరీతిలో వర్ణించింది. అయిదవ సర్గ వర్ణనామయం. గణేశ ప్రార్ధన చేసి కావ్యం ప్రారంభించి మిగిలిన దేవతలనూ స్తుతించింది. ముఖ్యంగా "క్రియా శక్తి"ని వర్ణించటం విశేషం. ప్రతి సర్గలో రాబోయే సర్గలోని విషయాలను చెప్పింది.

మొదటి సర్గలో విజయనగర వర్ణనను సహజ సుందరంగా చేసింది. కావ్యంలో వైదర్భీరీతి కనిపిస్తుంది. భాష పరిపక్వంగా ఉంటుంది.

"హిమ భర విహతః కమలా కరో య్యుదిత కాంతి రభూన్మృగ లాంఛనః - వాదన మేవ నరేంద్ర నాథ భ్రువాను భజత శ్రియమ ప్రతి శాసనః" అని వసంత రుతువును గంగాదేవి వర్ణించింది - భావం - కమలాలు మంచుతో

కప్పుబడ్డాయి. చంద్రుడుకాంతి పోగొట్టుకొన్నాడు. రాజుగారి ప్రియురాలు మొహం ఒక్కటే కాంతితో ఉంది. అలాగే సూర్యాస్తమయాన్నీ మనోహరంగా వర్ణిస్తుంది –

"ప్రతిబింబ పరం పరాంబుదే పవనోద్భూత తరంగ సంగిన: – నభాసో వాతారిప్యతో రవేర్మణిసోపాన ధియం వ్యభావయత్" అంటే "ఆకాశం నుంచి దిగుతూ ఉన్న సూర్యుడి నిశ్చలమైన బింబం కదిలే అలల్లో ప్రతిబింబించే రత్నాల మెట్లులాగా ఉంది" క్లిష్టం అనేది లేని కవిత్వం రాసింది.

కంపరాయలు ఉదయగిరికి రాజుగా ఉండేవాడు. తండ్రి బుక్కరాయల కంటే ముందే కంపరాయలు చనిపోవటంతో విజయనగర ప్రభువు కాలేకపోయాడు. బుక్కకు చాలామంది రాణులు ఉన్నా గంగాదేవి కంపరాయల తల్లిని మాత్రమే పేర్కొంది. కంపరాయలు రెండవ కంపరాయలుగా పేరొందాడు. మహా మండలేశ్వరుడు అనే బిరుదు ఉంది. యుద్ధ కళలలోనే కాదు లలిత కళల్లోనూ మంచి ప్రవేశం ఉన్నవాడు. తండ్రి బుక్కరాయల అనుమతితో మధుర, తుండీర రాజ్యాలను జయించి వాటిని తురుష్కుల అధీనం నుండి విముక్తి చేసిన శౌర్యశాలి. ఇక్కడే కొంతకాలం "మరకత నగరం" రాజధానిగా చేసుకుని మూడేళ్ళు పరిపాలన చేస్తూ పరిస్థితుల్ని చక్కబరచాడు. 1374లో అతడొక్కడే పాలన చేసినట్లు శాసన ఆధారాలున్నాయి. హిందూమత పునరుద్ధరణకు కంపరాయలు చేసిన సేవలు చరిత్ర ప్రసిద్ధాలు. 1371లో కంపరాయలు మధుర, శ్రీరంగ పట్నాలను లోబరచుకుని తురుష్కులనుపారద్రోలాడు. ఈ చారిత్రక సంఘటనలను గంగాదేవి తన మధురా విజయం కావ్యంలో కమనీయంగా ఆవిష్కరించింది. కనుక ఈ కావ్యకాలం 1371–1374 అని భావింపవచ్చు. ❁

72. వసంత రాజీయం రచించిన - కుమారగిరి రెడ్డి (1386-1402 ad)

కొండవీటి సామ్రాజ్య ప్రభువు కుమారగిరి రెడ్డి "వసంత రాజీవం" అనే అలంకార గ్రంధాన్ని రాశాడు. కాలం 1386-1402. ఇందులో ముఖ్యంగా రూపకాల భేదాలను విపులంగా వివరించాడు. కుమార గిరి రెడ్డి బావమరిది కాటయ వేమారెడ్డి కాళిదాసు రాసిన మూడు నాటకాలను బావగారి పేర "కుమార గిరి రాజీయం" వ్యాఖ్యానం రాశాడు. ఇవి చాలా ప్రఖ్యాతమైన వ్యాఖ్యానాలుగా గుర్తింపు పొందాయి. వసంత రాజీయంలోని వ్యాక్యానాలకు అనుగుణంగా కాటయ వేముడు ఈ వ్యాఖ్యానాలు రాశాడు. మల్లినాధుడు, కుమారస్వామి నాదెండ్ల గోపయ్య మంత్రి తమ వ్యాఖ్యానాలలో వసంత రాజీవాన్ని బాగా ఉదాహరించారు. కుమారగిరిని "వసంత రాయలు" అంటారు. వసంతోత్సవాలను గొప్పగా నిర్వహించేవాడు. ❀

73. సాహిత్య చింతామణి కర్త - పెదకోమటి వేమభూపాలుడు (1403-1420 ad)

కొండవీటి రాజు పెదకోమటి వేమారెడ్డి కుమారగిరి రెడ్డి తర్వాత రాజయ్యాడు. సాహిత్యప్రియుడు. అనేక వ్యాఖ్యానాలతో బాటు సాహిత్య చింతామణి అనే అలంకార గ్రంధాన్ని కూడా రాశాడు. కాలం 1403-1420. ముమ్మటుడి కావ్య ప్రకాశ ధోరణిలో వేమారెడ్డి “సాహిత్య చింతామణి” కూర్చాడు. పదమూడు పరిచ్ఛేదాలున్న కావ్యం. కావ్యం, ఉత్పత్తి లక్షణాలు, గుణ దోషాలు, అలంకారాలు, రీతులు, కావ్య వస్తువు, దృశ్యకావ్య లక్షణాలు మొదలైనవన్నీ వివరించాడు. ధ్వనికి లోబడే రసాన్ని ఒప్పుకొన్నాడు. తన రచనల నుంచే ఉదాహరణలిచ్చాడు. వేముడికి సంగీతంలోను గొప్ప ప్రతిభ ఉంది. “సంగీత చింతామణి” రాశాడు. “సర్వజ్ఞ చక్రవర్తి” బిరుదున్నవాడు. ❁

74. సంగీత సాహిత్యాలలో కూడా రాజు - సింగ భూపాలుడు (1386-1412 ad)

సింగ భూపాలరాజు రాచకొండ ప్రభువు అనపోతనాయకుని కుమారుడు. రెండవ సింగ భూపాలుడు అంటారు. 1386-1412 కాలంలో రాజ్యపాలన చేశాడు.

సింగ రాజీయం

సింగ భూపాలుడు "రసార్ణవ సుధాకరం" అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రాశాడు. సంగీత రత్నాకరం అనే సంగీత శాస్త్ర గ్రంథానికి "సుధాకరం" అనే వ్యాఖ్యానాన్ని రాశాడు. రాజు గొప్ప సంగీత, సాహిత్య ప్రియుడు. ఈయన ఆస్థానంలో చమత్కార చంద్రిక రాసిన విశ్వేశ్వర కవి ఉండేవాడు. కవి, పండిత పోషకుడే కాక స్వయానా కవి సింగ భూపాలుడు. నాటక రచయిత కూడా. కువలయావలి అనే నాలుగు అంకాల నాటకం రాశాడు. దీనికే రత్న పాంచాలిక అనే పేరు కూడా ఉంది. శ్రీకృష్ణుడు కువలయావలి అనే లలనామణిని వివాహమాడటం ఇతివృత్తం. రాచకొండ ప్రసన్న గోపాలస్వామి ఆలయ వసంతోత్సవాలలో దీన్ని ప్రదర్శించేవారు. కాలం 1386-1412.

బ్రహ్మదేవుని ఆదేశానుసారం కువలయావలి అనే అమ్మాయి భూమిమీద పుడుతుంది. ఆమె పెంపుడు తండ్రి నారదుడు. తగిన వరుడికోసం వెతుకుతూ ఉన్నట్లు నటిస్తూ ద్వారకలో రుక్మిణీదేవి సంరక్షణలో ఉంచుతాడు. ఆమెకు నారదుడు ఒక ఉంగరాన్నిస్తాడు. దాన్ని ధరిస్తే మగవారికి "రత్న పాంచాలిక"గా కనిపిస్తుంది. ఒకసారి ఆమె ఉద్యానవనంలో క్రీడిస్తుంటే నారదుడు ఇచ్చిన ఉంగరం జారి ఎక్కడో పడిపోతుంది. శ్రీకృష్ణుడు ఆ సమయంలో వచ్చి ఆమెను చూసి ఉంగరం

వెతికి అందజేస్తాడు. ఇద్దరూ ప్రేమించుకొంటారు. విషయం సత్యభామకు తెలిసిపోతుంది. ఆమె రుక్మిణికి చెబితే కువలయావలిని రుక్మిణి దాచేస్తుంది. ఒక రాక్షసుడు ఆమెను ఎత్తుకుపోతాడు. ఆమెను రక్షించమని కృష్ణుని రుక్మిణి కోరుతుంది. ఇంతలో నారదుడు వచ్చి బ్రహ్మ ఆదేశం తెలియజేస్తాడు. కువలయావలిని శ్రీకృష్ణుడికి ఇచ్చి రుక్మిణి పెళ్లి చేస్తుంది. ఈ నాటకంపై స్వప్న వాసవదత్త మాలవికాగ్ని మిత్ర నాటకాల ప్రభావం కనిపిస్తుంది.

రసార్ణవ సుధాకరంకు ఆంగ్లంలో అమెరికాలోని టొరంటో యూనివర్సిటి సంస్కృత ప్రొఫెసర్ శ్రీ టి.వేంకటాచార్య మంచి వ్యాక్యానం రాశారు. ఇది తిరువనంతపురం సంస్కృత లైబ్రరీలో లభ్యం.❁

75. ఛందో శాస్త్రం రాసిన - రెండవ వాగ్భటుడు (1400 ad)

పద్నాలుగవ శతాబ్దికి చెందిన మరొక వాగ్భటుడు ఉన్నాడు. ఇతనిని రెండవ వాగ్భటుడు అంటారు. ఈయనా ఆలంకారికుడే. "కావ్యాను శాసనం" రాశాడు. ఇది సూత్ర పద్ధతిలో సాగిన రచన. తానే స్వయంగా "అలంకార తిలకం" అనే వ్యాఖ్యానాన్ని రాసుకొన్నాడు. ఇది కాక చందోసాసనం అనే ఛందస్సాశాస్త్రాన్ని కూడా రాశాడు. ఋషభ దేవక చరిత్ర అనే మహాకావ్యాన్నీ రాశాడు.

అష్టాంగ సంగ్రహ అష్టాంగ హృదయ అనే ఆయుర్వేద గ్రంధాలను రాశాడు వాగ్భటుడు. యితడు బౌద్ధుడు. చరక, శుశ్రుత సింహితలలో వాగ్భటుని గురించి ఉంది. ఆనాటి సింధు ఈనాటి పాకిస్తాన్‌లో ఉండేవాడు. సింహగుప్తుని కుమారుడు. అవలోకితుని శిష్యుడు. ప్రఖ్యాత ఆయుర్వేద శాస్త్రకర్త చరకుని శిష్యుడు. మూడు వేల సూత్రాలను రాశాడు. ఎనభై అయిదు శాతం వ్యాధులు ఆయుర్వేద సూత్రాలను పాటిస్తే డాక్టర్‌తో పనిలేకుండా నయమవుతాయని మిగిలిన పదిహేను శాతం వాటికే మందులు వాడాల్సి వస్తుందని తెలియజేశాడు. శుశ్రుతుడు శస్త్ర వైద్యంలో దిట్ట. చరకుడు ఆయుర్వేద మేధావి. వాగ్భటుడు ఆయుర్వేద సార సంగ్రహం చేసినవాడు. ఈ ముగ్గురిని ఆయుర్వేద త్రయం అంటారు.

అష్టాంగ హృదయ సంహితను వాగ్భటుడు కమ్మని కవిత్వంలో రాశాడు. ఇందులో ఏడువేల నూట ఇరవై శ్లోకాలున్నాయి. ఎనిమిది విధాల వైద్యం గూర్చి చెప్పాడు. అష్టాంగ హృదయ సంహిత ఆయుర్వేదంలో వచ్చిన మాస్టర్ పీస్ గ్రంథం. ఇది అనేక దేశాలలో ఆయా భాషలలో అనువాదం పొందింది. అష్టాంగ నిఘంటు, అష్టాంగ సార, భావ ప్రకాశ, ద్వాదసార్ధ నిరూపణ, కాలజ్ఞాన, పదార్ధ చంద్రిక, శాస్త్ర దర్పణ, శత శ్లోకి, వాగ్భటీయ, వామన కల్ప మొదలైనవి రాసినట్లు తెలుస్తోంది. ❁

76. హమ్మీర చరిత్ర కర్త - నయ చంద్రసూరి (1440 ad)

చౌహాన్ రాజు "హమ్మీరు"ని చరిత్రను "హమ్మీర కావ్యం" రాశాడు సూరి. జయసింహ సూరి మనవడు. ఇది 1456లో రాసిన కావ్యం. తండ్రి జయసింహ సూరి "హమ్మీరమద మర్దనం" అనే నాటకాన్ని రాశాడు. దీనిలో వస్తుపాల, తేజపాల చరిత్రలున్నాయి. పద్నాలుగు సర్గల కావ్యం. అవి మహా పండితుడు. శాస్త్రాలన్నీ నేర్చి పండిపోయి సూరి అయ్యాడు. రాజనీతి యుద్ధ నీతి తెలిసినవాడు. వైదర్భీ రీతిలో ప్రసన్న మాధుర్యంగా రాశాడు. జలక్రీడలు, యుద్ధాలు, ఋతువులు వర్ణించాడు. అపహ్నుతి, యమా అలంకారాలను సందర్భాన్ని బట్టి వాడాడు. వీర రస ప్రధాన కావ్యం. అల్లా ఉద్దీన్ తన సైన్యాలను హమ్మీరుడి సోదరుడి మీదకు పంపితే వారు అతన్ని ఓడిస్తే రాజు స్వయంగా యుద్ధానికి దిగాడు. అతని సైనికులే నమ్మక ద్రోహం చేశారు. తెలిసిన హమ్మీరుడు రాణివాస స్త్రీలను అగ్ని ప్రవేశం చేయమని కబురు చేసి ఘోర యుద్ధంలో పాల్గొని ప్రాణాలు వదిలి వీర మరణం పొందాడు. ఇది పదమూడవ సర్గలో వర్ణించాడు. పద్నాలుగవ సర్గలో హమ్మీర పరాక్రమాన్ని వంశ చరిత్రను రాసి కావ్యాన్ని ముగించాడు. ❀

77. కంచు ఢక్కల - గౌడ డిండిమ భట్ట కవి సార్వభౌముడు (1450 ad)

విజయనగర రాజు రెండవ ప్రౌఢ దేవరాయల ఆస్థానంలో డిండిమ భట్టు ఆస్థానకవి. అరుణ గిరి కుమారుడు. ఈ డిండిమ పండితుడినే శ్రీనాధుడు వాదంలో ఓడించి అతని కంచు ఢక్కను పగులగొట్టించాడు. దీనితో కవిసార్వభౌముడు అనే తనకున్న బిరుదాన్ని కోల్పోయి శ్రీనాధుడికి అప్పగించాడు. డిండిమ వంశంలో వారందరికీ కవి సార్వభౌమ, డిండిమ బిరుదు ఉండేది. సాల్వ నరసింహ రాయలు చరిత్రను రాజనాధుడు అనే కవి "సాళువాభ్యుదయం" అనే కావ్యంగా రాశాడు. సాల్వ నరసింహ రాయలు 1486లో విజయనగర రాజు. కాని సాల్వాభ్యుదయంలో ఎక్కడా ఈ మాట చెప్పబడలేదు. చంద్రగిరి రాజు అనే ఉంది. కనుక ఈ కావ్యం అతడు మహా మండలేశ్వరుడుగా ఉన్నప్పుడే 1486లో రాయబడింది. ఈ కావ్యం ప్రచురితం కాలేదు. ఇందులో పదమూడు సర్గలున్నాయి.

ఈ కావ్యంలో నరసింహ దేవరాయల యుద్ధాలు ధర్మ కార్యాలూ ఉదాత్తంగా వర్ణించబడ్డాయి. సుందర కావ్యశైలి ఉంది. నరసింహ రాయలు సంస్కృతాంధ్రాలను పోషించాడు. మూడు నుంచి ఏడు సర్గల దాకా అతని విజయాలు, ఎనిమిదిలో వేట, పదిలో ఋతు వర్ణనలు, పదకొండులో శివరాత్రి ఉత్సవాలు పన్నెండులో రాజధానికి రావటం, పదమూడవ సర్గలో దానధర్మాలు, సాహిత్య పోషణ ఉన్నాయి.❁

78. భక్తిరస స్థాపకుడు - రూప గోస్వామి (1494-1560 ad)

గౌడీయ వైష్ణవ మతానికి చెందిన రూప గోస్వామి 1489-1564 కాలానికి చెందినవాడు. ఆరుగురు గోస్వాములలో పెద్దవాడు. సోదరుడు సనాతన గోస్వామి. వీరందరూ బృందావనం కేంద్రంగా ఉన్న శ్రీకృష్ణ చైతన్య ప్రభువు శిష్యులు. కలియుగంలో శ్రీకృష్ణుని అవతారమే చైతన్య ప్రభువు అని వీరందరి నమ్మకం. రూప గోస్వామి పూర్వీకులు కన్నడ దేశానికి చెందిన సారస్వత బ్రాహ్మణులు. లఘు తోషిని రాసిన జీవ గోస్వామి మాటలను బట్టి రూప గోస్వామి యజుర్వేద శాఖకు చెందినవారు. భారద్వాజ గోత్రీకులు. ఈ వంశంలోని పూర్వీకుడే సర్వజ్ఞ రాజు విద్యావేత్త. జగద్గురు బిరుతాంకితుడు. ఈయన కుమారుడు అనిరుద్ధుడు. ఈయనకు హరిహార, రూపేశ్వరులు కుమారులు. రూపేశ్వరుడు వేద వేదాంగాలలో నిష్ణాతుడు. హరిహరుడు ధనుర్విద్యలో, రాజకీయాలలో ఆరితేరిన వాడు. తండ్రి మరణం తర్వాత రాజ్యం వీరిద్దరికీ విభజింపబడింది. కాని దుర్మార్గుడైన హరిహరుడు రూపుశ్వరుడు రాజ్యాన్ని లాక్కొని అతన్ని దేశ బహిష్కారం చేస్తే దేశాటనం చేస్తూ గంగాతీరం చేరాడు. పద్మనాభుడు ఈయనను ఆదరించాడు. పద్మనాభుడికి పద్ధెనిమిది మంది కుమార్తెలు, అయిదుగురు కుమారులు. చివరి కొడుకు ముకుందుడు.

ఆ ప్రాంతంలో మత సంఘర్షణలు చోటు చేసుకొంటే ముకుందుని కుమారుడు కుమార దేవుడు జెస్సూర్ చేరాడు. కుమార దేవుని కుమారులే రూప, అమర (సనాతన), శ్రీవల్లభ (అనుపమ). కుమారదేవుని మరణం తర్వాత అన్నదమ్ములు ముగ్గురు గౌడ దేశం అని పిలువబడే బెంగాల్ చేరి విద్యాభ్యాసం చేశారు. న్యాయశాస్త్రాన్ని సార్వభౌమ భట్టాచార్య వద్ద నేర్చారు. సంస్కృతంతో బాటు అరబిక్, పర్షియన్ భాషలనూ నేర్చుకొన్నారు. వీరి తెలివితేటలకు, విద్యా గరిమకు మెచ్చి అప్పటి బెంగాల్ పాలకుడు అల్లా ఉద్దీన్ హుస్సేన్ షా వీరిని బలవంతంగా ప్రభుత్వాధికారులను చేశాడు. రూపను ముఖ్య కార్యదర్శిగా,

సనాతనుడిని రెవిన్యు మంత్రిగా చేశాడు సుల్తాన్.

సుల్తాన్ రాజధాని రామకేళిలో మీరు ఉన్నారు. అప్పుడు చైతన్య మహా ప్రభువు 1514లో అక్కడికి వచ్చినప్పుడు మొదటిసారిగా దర్శించారు. చైతన్య ప్రభావంతో సన్యసించి రాజీనామా చేసి స్వంత గ్రామం జేస్సూర్‌లోని ఫతియాబాద్ చేరుకొన్నారు. రూప, అనుపమలు చైతన్యుని కోసం పూరీకి పంపగా ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిసి బృందావనం చేరటానికి ప్రయత్నించి తమ వద్ద ఉన్న పదివేల బంగారు నాణాలు సనాతనుని కోసం అక్కడ ఉంచామని తెలియజేసి బృందావనం చేరుకొన్నారు.

సోదరులు బృందావనంలో చైతన్యుడు కనిపించకపోయేసరికి ప్రయాగలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళ్లి దర్శించారు. చైతన్యుడు వీరిద్దరికీ గౌడీయ వైష్ణవ ధర్మాలన్నీ బోధించాడు. బృందావనంలోని సనాతన ప్రదేశాలను గుర్తించి, వైష్ణవ మత వ్యాప్తి చేసే బాధ్యతను చైతన్యుడు రూప గోస్వామిపై పెట్టాడు. బృందావనంలోనే జీవితాలను గడిపారు సోదరులు. శ్రీకృష్ణుని ముని మనవడు వజ్రనాభ మహారాజు స్థాపించి అర్చించిన భగవాన్ శ్రీకృష్ణుని విగ్రహాన్ని శోధించి కనుగొని బృందావనంలో రూప గోస్వామి ప్రతిష్టించాడు. వీరికి శిష్య పరంపర పెరిగింది. అందులో లోకనాధ, భూగర్భ, గోపాల భట్ట, రఘునాధ భట్ట, రఘునాధ దాస గోస్వాములు. రూప గోస్వామి కూడా ఇక్కడికి చేరి వైష్ణవాన్ని పొందాడు. లలితా దేవి ఆధ్వర్యంలో రాధా కృష్ణులను భక్తితో సేవించిన చిన్న గోపిక “రూప మంజరి” యే రూప గోస్వామిగా మరల అవతరించారని వారి నమ్మకం. నిత్యం శ్రీకృష్ణ భజనలతో బృందావనం మారు మోగింది. అప్పటినుండి ఇప్పటికీ అలానే జరుగుతోంది.

రూప గోస్వామీయం

రూప గోస్వామి సంస్కృతంలో అనేక గ్రంధాలు రచించాడు. అందులో వేదాంతం అలంకార శాస్త్రం, నాటక శాస్త్రాలున్నాయి. రూప గోస్వామి రాసిన భక్తీ రసామృత సింధు గ్రంధం గౌడీయ వైష్ణవానికి ప్రామాణికం. ఉజ్వల నీలమణి అనేది మాధుర్య రసాన్ని గూర్చి తెలిపేది. లఘు భావామృత అనేది సనాతన

గోస్వామి రాసిన బృమత్ భాగవతామృతంకు సంక్షిప్తం. విదగ్ధ మాధవ అనేది రెండు కృష్ణ నాటకాల సంపుటి. రెండుగా చేయమని సత్యభామ కలలో కన్పించి చెప్పిందట. ఇవే లలితా మాధవ, విదగ్ధ మాధవ నాటకాలు. సప్తమాలలో అనేక స్తోత్రాలున్నాయి. దానకేళి కౌముదిలో ఏకాంకిక ఉన్న భాణం. శ్రీరాధాకృష్ణ గణోద్దీపికలో రాధాకృష్ణుల పాత్ర స్వరూప స్వభావాలను వర్ణించాడు. మధుర మహాత్మ్యంలో మధురా నగర విశేషాలున్నాయి. ఉద్దవ సందేశం భాగవతం ఆధారంగా రాసింది. ఇందులో కృష్ణుని ఆదేశంపై ఉద్ధవుడు బృందావనానికి రావటం తెలియజేయబడింది. హంస దూతం అనేది రాధాకృష్ణునికి హంస ద్వారా సందేశాన్ని పంపటం వృత్తాంతం. శ్రీకృష్ణ జన్మ తిధి విధిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వివరణ చేయాల్సిన విధి విధానాలన్నీ వివరించాడు. నాటక చంద్రికలో గౌడీయ వైష్ణవ నాటక విధానాలను వివరించాడు. ఉపదేశామృతంలో శ్రీకృష్ణుని చేరుకోవటానికి తేలికైన పదకొండు పద్ధతులను పదకొండు శ్లోకాలలో చెప్పాడు.

భక్తిరస స్థాపకుడుగా రూప గోస్వామి నిలిచాడు. ఉజ్వల నీలమణి, భక్తి రసామృత సింధు అనే అలంకార శాస్త్రాలలో రస చర్చ చేశాడు. శృంగార రసాన్ని విపులంగా వివరించాడు. భక్తిలో ఉండే విభావ, అనుభవాలను వివరిస్తూ వాటినీ రసంగానే చెప్పాడు. భగవంతునిపై ప్రీతిని ప్రేయోరసంగా చెప్పాడు. దీన్ని మధుసూదన సరస్వతి సమర్ధించాడు. భక్తి మధురం ఉజ్వలం అని రెండు రకాలన్నాడు. శ్రీకృష్ణ గోపికల మధ్య ఉన్నది శృంగార రసమన్నాడు. దీనికి చిత్తద్రవం స్థాయీ భావంగా చెప్పాడు. కృష్ణ గోపీ విషయకమైన రతి ఉపాదేయం అని అదే భక్తి రసమని వివరించాడు. శృంగారం మొదలైన రసాలు క్షుద్రమైనవని, భక్తిరసం ఒక్కటే సర్వ శ్రేష్టమైనదని స్థాపించాడు. భగవద్భక్తి రసాయనం అనే గ్రంధంలో భక్తికి సంపూర్ణంగా రసత్వాన్నిచ్చి ఉదాత్తత కల్పించాడు. భగవంతుడు ఆలంబన విధానం, ఆయన చరిత్రలు విభావాలు, భగవద్రతి స్థాయి భావం, నేత్ర వికారం మొదలైనవి అనుభవాలు, నిర్వేదం, శంక, హర్షం మొదలైనవి వ్యభిచారీ భావాలు అని రూప గోస్వామి వివరించాడు. భక్తిరసం అందరి ఆమోదాన్ని పొందింది. నాటక చంద్రికలో నాటక లక్షణాలు వివరణలిచ్చాడు.❀

79. స్వభావోక్తి కవయిత్రి మురళ (1500 ad)

మురళ అనే కవయిత్రి పేరు బిల్హనుడి సూక్తి ముక్తావళిలో, శార్ఙ్ణ రాసిన పద్ధతిలో చోటు చేసుకొన్నది. ఒక శ్లోకంలో విరహం, మరో శ్లోకంలో కలయిక వర్ణించింది. సుందర సరళ సులభ శైలిలో కవిత్వం రాసింది. స్వభావోక్తికి పట్టంకట్టింది. ఈ శ్లోకాలను బట్టి ఆమె ప్రసిద్ధ కవయిత్రి అనే అభిప్రాయం కలుగుతుంది. ప్రసిద్ధ కవయిత్రుల పేర్లలో మురళ పేరును ధనాద దేవుడు పేర్కొనటం గమనార్హం. కాలం సుమారు పదిహేను వందలు.

"శీలా విజ్ఞామారుళా మోరికాద్యాః – కావ్యం కర్తుం శాంతి విజ్ఞాః ప్రియ్యోసి
విద్యాం వేత్తుం వాదినో జేతుం – దాతుం వక్తుం యః ప్రవీణః నవంద్య"❁

80. ప్రణయ కవయిత్రి - మోరిక (1500 ad)

ధన దేవుడు మెచ్చిన మరో కవయిత్రి మోరిక. ఈమె శ్లోకాలలో ప్రణయం ముఖ్య ఇతివృత్తం. పైన తెలుసుకొన్న కవయిత్రి మురళతో సమానమైన పాండిత్యం కవిత్వం ఉన్న మహిళ. పదిహేను వందలు కాలానికే చెందింది.

81. అభినవ కాళిదాసు (1500 ad)

అసలు పేరు వెల్లాల ఉమా మహేశ్వరుడు. అభినవ కాళిదాస బిరుదాంకితుడు. "భాగవత చంపువు" రాశాడు. కాలం పదిహేన శతాబ్ది.

కొత్త దాసు గారి కవిత్వం

భాగవతంలోని దశమస్కంశం ఆధారంగా ఇతను ఈ చంపువు రాశాడు. రాధా కృష్ణుల ప్రేమ వృత్తాంతం హైలైట్ చేశాడు. రాధను నాయకిని చేసి కృష్ణుడితో పెళ్లి జరిపించి ఒక అడుగు ముందుకే వేశాడు. ఈ దంపతుల ప్రణయాన్ని మధురంగా వర్ణించాడు. భక్తికంటే రక్తికే ప్రాధాన్యతనిచ్చి రాశాడు. శ్లేషకు ప్రాధాన్యం ఇచ్చాడు. గద్యలో సమాస బంధం ముచ్చటగా ఉంటుంది. దీనికి అక్కయ సూరి వ్యాఖ్య రాశాడు. కొత్త కాళిదాసు "భారత చంపువు" కూడా రాశాడు. ముద్రితం కాలేదు.



82. చంపూ భారత కర్త - అనంత భట్టు (1500 ad)

క్రీ.శ. పదిహేను వందల వాడైన అనంతభట్టు చంపూ భారతం రాశాడు. అభినవ కాళిదాసుతో విభేదం ఉండేదట. 1041 శ్లోకాలు, 200 గద్యాలున్నాయి. విభాగాలకు "స్తబకాలు" అని పేరు పెట్టాడు. పన్నెండు స్తబకాల కావ్యం ఇది.

భట్టు కవితా అనంతత్వం

ఉపాఖ్యానాలు తప్ప తక్కిన భారత ఘట్టాలన్నిటిని ఇందులో చేర్చి రాశాడు. పాండురాజు పుట్టుకతో కావ్యాన్ని ప్రారంభించి అతని వేటకు ప్రాధాన్యమిచ్చి "కిందమ ముని" శాప వృత్తాంతం హైలైట్ చేశాడు. వర్ణనలను బాగా చేశాడు. ప్రతి పదాన్ని సమర్ధంగా ప్రయోగించి "పద లాలిత్య పారీణుడు" అనిపించాడు. ఉదాహరణకు ఒకటి చూద్దాం -

"కిం శుకస్య వాదనే రుచిరత్వం కిం శుకస్య హృదయే పి వశిత్వం - కిం శుకస్య కుసుమేఘ నదంతీ శంసతిస్మ మధుపాలి రితీవ"

అనుప్రాసతో పాటు యమక ఉత్ప్రేక్షాలంకారాలనూ సమర్ధంగా ప్రయోగించాడు. వీర రస కావ్యమైన దీనిలో యుద్ధ వర్ణనలూ బాగా ఉన్నాయి.

నర్తనశాలలో భీముడు కీచకుడు రాత్రివేళ నిశ్శబ్ద వాతావరణంలో చేసే చాటు యుద్ధాన్ని మనోహరంగా వర్ణించాడు –

"అక్ష్వేలితా రావమ వీర వాదం అవీక్ష్యో ఖ్లాఘన చాటు గం ఘనం – అనుచ్ఛ నిశ్శ్వాస ముహుం క్రియాకం అభూత పూర్వం తభూన్ని యుద్ధం

శిలీ ముఖైస్చిత్తజ చాపజు స్తైర్దత్తా నిరంధ్రాణిదధన్ని జాంగే – సమీర జాతేన విదూని తోసి సకీచాకోనైవ చుకూజ కించిత్"

కురుక్షేత్ర యుద్ధాన్ని అదే స్థాయిలో వర్ణించి దృశ్యమానం చేశాడు. "అలాంటి వాడి కడుపులో ఎలా పుట్టావు?" అనే తెలుగు పలుకుబడికి సంస్కృతం చేసి భట్టు ప్రయోగించాడు. అర్జునుడు ఉత్తర కుమారుడితో అన్న సందర్భంలో –

"ఉదితోసి విరాట భూపతేః ఉదరాత్ భద్ర కధంత్వ మీద్రుశః" అదీ ప్రయోగం. అలాగే మంగళ సూత్ర విధానమైన తెలుగు సంప్రదాయాన్ని సంస్కృతంలోకి లాక్కెల్లాడు. ఈ చంపువుకు కురవి రామచంద్ర, మల్లాది లక్ష్మణ స్వామి, నారాయణ స్వామి, కుమారా తాతాచార్య, నరసింహాచార్య వగైరా వ్యాఖ్యానాలు రాశారు. ❁

83. సాహితీ సమరాంగణ సార్వభౌముడు - శ్రీకృష్ణదేవరాయలు (1509-1529 ad)

విజయనగర రాజులలో ప్రసిద్ధుడు శ్రీకృష్ణ దేవరాయలు స్వయానా కవియే కాక కవిపోషకుడు. భువన విజయంలో కవి పండిత గోష్టి నిర్వహించేవాడు. 1509-1529 కాలం. విక్రమాదిత్య, హర్షవర్ధన, భోజరాజులతో సమానుడైన ఆంధ్రభోజ బిరుదు పొందాడు. ఆముక్తమాల్యద అనే గొప్ప ప్రబంధాన్ని ఆంధ్ర నాయకుడి దేవాలయమైన శ్రీకాకుళంలో శ్రీకారం చుట్టాడు.

ఆంధ్ర భోజ రాజీయం

కృష్ణదేవరాయలు సంస్కృతంలోను గొప్ప పండితుడే కాక మహాకవి అనిపించుకొన్నాడు. మదాలస చరిత్ర, సత్యవధూ ప్రీణనం, సకల కథాసార సంగ్రహం, పురాణ కథా సంగ్రహం రాశాడు. జాంబవతీ కల్యాణం అనే సంస్కృత నాటకాన్ని రాయలు రాశాడు. దీనికి ప్రేరణ గురువైన వ్యాస తీర్థులవారు. ఇది అయిదు అంకాల నాటకం. శ్యమంతక మణి కథ. శ్రీకృష్ణుడు జాంబవతి దగ్గర నుండి శ్యమంతక మణిని ఆమె తండ్రి జాంబవంతుని నుండి జాంబవతిని పొందటమే కథ. శాకుంతల నాటక పోలికలు ఎక్కువ. హంపీలోని విరూపాక్ష దేవాలయంలో వసంతోత్సవాలలో చాలాసార్లు ప్రదర్శింపబడిన నాటకం ఇది.❋

84. సిద్ధయోగి పుంగవుడు - అప్పయ్య దీక్షితులు (1520-1593 ad)

పౌండరీక, వాసుదేవాది యజ్ఞయాగాదులను నిరంతరం చేస్తూ వైదిక ధర్మాన్ని అద్వైత మత ప్రచార దీక్షగా జీవితాన్ని గడిపి మూడు అలంకార శాస్త్రాలను రాసి, బహుముఖ ప్రజ్ఞాశీలి, అపర శివావతారం అనిపించుకొన్న అప్పయ్య దీక్షితులు 1520-1593 కాలంవాడు. తమిళనాడులోని తిరువన్నామలై జిల్లా (ఉత్తర ఆర్కాడు) ఆరణి దగ్గర ఆడయ పాలెంలో గణపతి సుబ్రహ్మణ్యశర్మగా ప్రమాదీచ సంవత్సరం కన్యామాసం కృష్ణ పక్షంలో ఉత్తరా నక్షత్రంలో జన్మించాడు. తండ్రి రంగ రాజాధ్వరి. భరద్వాజ గోత్రీకుడు. గణపతికి అప్ప అనే పేరు వుంది కనుక నామకరణ మహోత్సవంలో అప్పయ్య దీక్షితులు అని పేరు పెట్టారు. తమ్ముడు అచ్చన్ దీక్షితులు. రామకవి అనే గురువు వద్ద అప్పయ్య వేద, వేదాంగాలు అభ్యసించాడు. చాలా చిన్నతనంలోనే పద్నాలుగు విద్యలలో అపార పాండిత్యాన్ని సంపాదించాడు. కృష్ణదేవ రాయల గురువు తాతాచార్యులు వైష్ణవాన్ని బాగా ప్రచారం చేస్తున్న సమయంలో కాశీలో ఉన్న అప్పయ్య దీక్షితులకు తెలిసి విజయనగరం చేరి ఆచార్యులను వాదానికి దిగవద్దన్నాడు. కానీ రెచ్చిపోయిన తాతాచార్యులు వాదానికి దిగి ఓడిపోయి చేసుకొన్న ఒప్పందం ప్రకారం శైవాన్ని స్వీకరించేందుకు సిద్ధపడ్డాడట. అప్పయ్య లేకపోతే అందరూ నిలువు బొట్టు వాళ్ళే అయ్యేవారన్న మాట. ఆ ప్రమాదాన్ని తప్పించిన వాడు అప్పయ్య దీక్షితులు.

దేశాటన చేస్తూ వేద విరోధులను వాదంలో ఓడిస్తూ వైదిక మత ప్రచారం చేశాడు. వెల్లూరు, తంజావూరు, విజయనగర, వెంకట గిరి రాజుల ఆస్థానాలలో

పండిత స్థానాన్ని అలంకరించి గౌరవ సన్మానాలు అందుకొన్న విదుషి అప్పయ్య దీక్షితులు. వాదనలో అపర రుద్రుడిలా విజృంభించి ప్రతిపక్షులను గడగడలాడించేవాడు. దీనితో అతనిని ఎలాగైనా దెబ్బతీయాలనే కుట్రలు కూడా తెరవెనుక జరిగినా మొక్క వోని ఆత్మ విశ్వాసంతో అప్రతిహతంగా ముందుకు సాగాడు దీక్షితార్. రాజులు మహారాజులు ఎందరో అప్పయ్య అప్రతిహత విద్యా నైపుణ్యానికి దాసోహం అన్నారు. వారికి ధర్మ ప్రబోధం చేసి ఆత్మ మార్గాన్ని తెలియజేశాడు. ఆశువుగా శ్లోకాలు గంగా ప్రవాహంగా చెప్పి అప్రతిభులను చేసే నేర్పు అప్పయ్య దీక్షితుల సొమ్ము. తన వాక్ చాతుర్యంతో యుక్తితో, సంయమనంతో, విశాల హృదయంతో, అల్ప మనస్కులను ఎదిరించి పరివర్తన తెచ్చిన ఘనత అప్పయ్య దీక్షితులది.

అప్పయ్య కవితా దీ(ద)క్షితీయం

కవిత్వం, శైవాద్వైత ప్రచారం, యజ్ఞ యాగాదులతో క్షణం తీరిక లేని జీవితం గడుపుతూ ఒక “సిద్ధ యోగి పుంగవుడు”గా గడిపాడు. సాధించిన ఎన్నో మంత్ర విద్యలను ప్రదర్శించాడు. చివరికి వాటివల్ల ఆరోగ్యానికి భంగం కూడా కలిగింది. కొందరు ఆయనపై ప్రయోగాలు చేసి దుష్టశక్తులను ఆయనపైకి పంపేవారు. ధ్యానంలో మునిగి ఉన్నప్పుడు సమాధి స్థితిలోకి చేరేటప్పుడు తన ముందు కొన్ని తువ్వాళ్ళను ఉంచేవాడు. ఆ యోగ శక్తితో ఆయనలోని దుష్టశక్తులు, వ్యాధులు, తువ్వాళ్ళలో చేరేవి. అప్పుడు అవి పిచ్చెక్కినట్లు నాట్యం చేయటం శిష్యులు గమనించేవారు. సమాధినుండి బయటికి రాగానే ఆ తువ్వాళ్ళను మళ్ళీ మీద వేసుకొనేవాడు.

“ఆత్మార్పణ స్తుతి” కావ్యం చేశాడు. దీనికి ఒక కథ ప్రచారంలో ఉంది. ఇది యాభై శ్లోకాల కావ్యం. ఒక్కొక్క శ్లోకంతో లోపలి ఆత్మను కరగించి వేశాడు. మరి ఈ కావ్యం ఎలా రాశాడు? తన ఆత్మశక్తిని భగవంతునిపై తనకున్న వీరభక్తిని పరీక్షించుకోవాలనే కోరిక కలిగిందట. అందుకని “దాతుర ఫల రసం” (ఉమ్మెత్త కాయల రసం) తాగాడు. అది తీవ్రమైన మత్తు, పిచ్చి ఎక్కిస్తుంది. పిచ్చి ఎక్కి మత్తులో తన నోట వచ్చిన ప్రతి వాక్యమూ రాయమని శిష్యులకు ముందే చెప్పాడు.

ఇలాంటి స్థితిలో లోపల అణచబడిన భావాలన్నీ ఒక్క ఉదుటున దూసుకు బయటికి వస్తాయి. ఈ స్థితిలో అప్పయ్య దీక్షితుల నోటి నుండి ఆశువుగా వెడలిన కావ్యమే "ఆత్మార్పణ స్తుతి". దీనికి అప్పటి నుంచి "ఉన్మత్త పంచ దశి" అనే పేరొచ్చింది. అదీ ఆ మహా సిద్ధుని ప్రతిభ.

అప్పయ్య దీక్షితులు సంస్కృతంలో చిన్నా పెద్దా నూట నాలుగు రచనలు చేసినా అందులో ముఖ్యమైనవి 60 రచనలు. ఇందులో వేదాంత, శివాద్వైత, వ్యాకరణ, మీమాంస కావ్య వ్యాఖ్యాన, అలంకార, భక్తీ స్తోత్రాలున్నాయి. శివాద్వైతులు అప్పయ్యను తమవారిగా భావిస్తారు. ఎంత శివ భక్తుడో అంతటి వైష్ణవ పారమ్యం ఎరిగిన వాడు. బ్రహ్మ సూత్రాలలో చెప్పబడిన విషయాలను "చతుర్మత సారం"గా రాశాడు. నయ మంజరిలో అద్వైతాన్ని, నయ మణిమాలలో శ్రీకాంత మతం గురించి చెప్పాడు. నయ మయూఖ మాలికలో రామానుజుని విశిష్యాద్వైతం గురించి, నయ ముక్తావథిలో మధ్వాచార్యుల వైష్ణవ మతాన్ని గూర్చి చెప్పాడు. ఇలా బ్రహ్మసూత్ర రహస్యాలను అన్ని మతాలకు అన్వయిన్చేట్లు చెప్పిన మహా విద్వాంసుడు అయ్యప్ప దీక్షితులు. ఇవన్నీ ఆయ మతాలకూ ఆధార గ్రంధాలుగా రిఫరెన్స్ పుస్తకాలుగా పూజనీయ స్ధానంలో ఉన్నాయి.

దీక్షితులు రాసిన వేదాంత గ్రంధాలలో "సిద్ధాంత లేశ సంగ్రహం" ప్రముఖ స్థానాన్ని పొందింది. వివిధ ఆలోచనా ధోరణులను ఏకం చేసి అద్వైత ముఖ్య ప్రవాహంలో కలిపిన అతని వైదుష్యం హర్షణీయం. ఏక జీవ వాదం, నానా జీవ వాదం, బింబ ప్రతిబింబ వాదం, సాక్షిత్వ వాదం మొదలైన వాటిని ప్రశ్నించి ఉన్నది. ఒకటే బ్రహ్మం అయితే ఇన్ని వాదాలేమిటన్నాడు. అందరూ మూల సూత్రాన్ని ఒప్పుకుంటూ భిన్న మార్గాలలో నడిచి దూరమైపోయారన్నాడు. అమలానంద రాసిన "కల్ప తరువు"కు "పరిమళ" అనే అద్భుత వ్యాఖ్యానాన్ని రచించాడు. వాచస్పతి మిశ్ర రాసిన "భామతి"కి కల్పతరువు ఒక వ్యాఖ్యానమే. ఇది ఆది శంకరాచార్యుల సూత్ర భాష్యానికి వివరణం.

బ్రహ్మ సూత్రాలకు "శివార్క మణి దీపిక" అనే అమోఘమైన భాష్యాన్ని అప్పయ్య దీక్షితులు రాయటం మన అదృష్టం. ఇందులో శివ వైష్ణవాద్వైతాన్ని

స్థాపించాడు. ఈ గ్రంధమూ, పరిమళ గ్రంధమూ అప్పయ్య దీక్షితులు మేధో సర్వస్వంగా (మేగ్నం ఓపస్)గా భావిస్తారు. ఇవి విషయంలో, గ్రంధ రూపంలో అతి విశిష్టమైన ఉద్గ్రంధాలు. వెల్లూరు రాజు చిన్న బొమ్మ దేవర అప్పయ్య దీక్షితులతో శివార్క దీపికను బోధింప జేయటానికి 500 మంది విద్యార్ధులతో ఒక కళాశాల నెలకొల్పాడు. వీరందరికీ నేర్పి అద్వైత భావాలలో నిష్ణాతులను చేసి భావ వ్యాప్తి చేయించాడు.

దీక్షితుల దృష్టిలో ద్వైతం కింది మెట్టు. విశిష్టాద్వైతం మధ్య మెట్టు, శివాద్వైతం అద్వైతం ఒకటే అయిన ఆఖరి మెట్టు. శ్రీకాంత శివాచార్యుని శివాద్వైతాన్ని అప్పయ్య అనుసరించి బ్రహ్మ సూత్రాలకు ఈ ధోరణిలో వ్యాఖ్యానం రాశాడు. దీక్షితులు వేదాంత దేశికుల మెప్పు పొందాడు. కువలయానందంలో ముకుందుని కీర్తించాడు. హరిహర అభేదాన్ని అప్పయ్య దీక్షితులు చెప్పినంత గాఢంగా అంతకు ముందెవరూ చెప్పలేదు. మీమాంస శాస్త్ర వ్యాప్తికి అప్పయ్య చేసిన కృషి అద్వితీయం. కౌస్తుభం అనే వ్యాఖ్య రాశాడు. విధి రసాయనం, కువలయానందంలను విజయనగర ప్రభువు పెనుగొండ రాజు వెంకటపతి రాయలు గుర్తించి ఆస్థానానికి సగౌరవంగా ఆహ్వానించి సన్మానించాడు, అంకితం పొందాడు. సిద్ధాంత కౌముది రాసిన భట్టోజి దీక్షితులు అప్పయ్యను రాజుకు పరిచయం చేశాడు. అప్పయ్య రాసిన కువలయానందం చిత్ర మీమాంస ఎందరో విద్యార్ధులకు పఠనీయ గ్రంధాలయ్యాయి. ఆయన రాసిన దుర్గా స్తుతి, ఆదిత్య స్తవ రత్నం భక్తికి పరాకాష్టగా నిలిచాయి. వరద రాజ స్తవంలో అలంకారాలన్నీ వాడి శోభ కల్పించాడు.

అరుణాచలంలోని అమ్మవారు "ఆపీత కుచాంబ"పై చెప్పిన "ఆపీత కుచాంబ స్తవం" రచించగానే అప్పయ్యకున్న జ్వరం తగ్గిపోయిందట. దానికి అంత ప్రభావం ఉంది. మానసోల్లాసం మానసిక ఆందోళన ఉన్న వారికి వర ప్రసాదమే. సౌభాగ్య క్షేమాలకు, ప్రయాణంలో మంచి జరగటానికి "మార్గ బంధు సూత్రం, ఆరోగ్యం కోసం" ఆదిత్య స్తవ రత్నం రాశాడు.

చిదంబరంలో ఉండి నిత్యం నటరాజ స్వామి దర్శనంతో పులకించేవాడు. అక్కడే అప్పయ్య జీవిత పరిసమాప్తి డెబ్భై మూడవ ఏట జరిగింది. చనిపోయే

రోజున రోజూ వెళ్ళే మార్గం గుండా కాక "పంచాక్షర మెట్లు" మీదుగా నటరాజ స్వామిని దర్శించడం అందరూ చూసి ఆశ్చర్యపోయారట. దర్శనం పూర్తి చేసుకొని ఇంటికి వెళ్ళగానే అప్పయ్య దీక్షితులు తుది శ్వాస వదిలాడు. నటరాజ స్వామి అనుగ్రహంతో జన్మించిన అప్పయ్య ఆయన చెంతనే మరణించటం విశేషం. అప్పయ్య ఒక శ్లోకంలో "నేను పవిత్రమైన చిదంబరంలో చనిపోవటానికి సంతోషిస్తున్నాను. నా కుమారులు బాగా చదువుకొని గ్రంథ రచన చేసిన సంస్కారులు. నా కోరికలు ఏవీ లేవు. ఒక్కటే కోరిక. చిదంబరంలో నటరాజ సన్నిధిలో మరణించటమే నా కోరిక" అన్నాడు. అలా కోరికను తీర్చుకొన్న ధన్యజీవి అప్పయ్య దీక్షితులు.

బహుముఖ ప్రజ్ఞాశాలి, దార్శనికుడు అప్పయ్య దీక్షితులు రాసిన మూడు అలంకార గ్రంధాలు - వృత్తివార్తిక, చిత్ర మీమాంస, కువలయానందం. మొదటి దానిలో రెండు పరిచ్ఛేదాలున్నాయి. అభిదా, లక్షణా వృత్తుల భేదాల గురించి చెప్పాడు. వ్యంజనా వృత్తిని ఖండించాడు. ఇది అసంపూర్ణ గ్రంథం. చిత్ర మీమాంస అపూర్వ గ్రంథం అర్ధ చిత్ర కావ్యాలను గురించి చర్చించాడు. ఇదీ అసంపూర్ణమే. కువలయానందంలో అలంకారాలను గురించి వివరణ చేశాడు. అలంకారాల మీద వచ్చిన చివరి గ్రంధంగా దీన్ని భావిస్తారు. ఇతని సిద్ధాంతాలను జగన్నాధ పండితరాయలు ఖండించాడు. కువలయానందానికి పది టీకాలున్నాయి. ఇన్ని టీకాలుండటం దీని ప్రసిద్ధికి నిదర్శనం. పెనుగొండ రాజు వెంకట రాయలకు అంకితమిచ్చాడు. విదేశీ భాషల్లోకి అనువాదం పొందిన గ్రంధం ఇది. అలంకార వివరణ తర్క బద్ధంగా శాస్త్రీయంగా చేశాడు. అలంకారాలు విశ్వనాధుడి వరకు ఎనభై తొమ్మిదికి పెరిగాయి. అప్పయ్య వీటి సంఖ్యను నూట పద్దెనిమిది పెంచాడు. అలంకారాల గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే జయదేవుడు రాసిన చంద్రాలోకం, అప్పయ్య రాసిన కువలయానందం చదవాల్సిందే. ఇవే గతి. ధ్వని లేకపోయినా అలంకారాలతో ఉన్న కావ్యాలు సుందరంగా ఉంటాయన్నాడు. ధ్వని లేకపోయినా కావ్యాన్ని ఆదరించాలన్నాడు. చిత్ర మీమాంసలో చిత్రకావ్యాల భేదాలను వివరించాడు. చిత్రకావ్యం కూడా ధ్వని కావ్యంలాగే మహత్వం ఉన్నదన్నాడు.

కొద్దిగా కూడా ధ్వని లేని చిత్ర కావ్యాల కొమ్ముకాసి ఉత్తమ స్థాయి కల్పించాడు. దీన్ని ఖండించాడు పండితరాయలు. అప్పయ్య దీక్షితుల సోదరుడి పౌత్రుడు నీలకంఠ దీక్షితుల సోదరుడైన మూడవ అప్పయ్య దీక్షితులు "చిత్రమీమాంస దోష ధిక్కారం" అనే గ్రంథంలో జగన్నాథ పండిత రాయల అభ్యంతరాలన్నిటికి దీటైన సమాధానాలిచ్చి రాశాడు.

"ఆంధ్రత్వం ఆంధ్రభాష, మధు మధురమైనవి. ఆంధ్రదేశంలో జన్మించటం పూర్వజన్మ సుకృతం" అని తెలుగును తెలుగు దేశాన్ని మనసారా మెచ్చుకొన్న అప్పయ్య దీక్షితుడు మనవాడే. మనందరి వాడే.❀

85. రూప గోస్వామి శిష్యుడు - గోస్వామి కర్ణ పూరుడు (1524 ad)

చైతన్య శిష్య పరంపరలో ఇంకొక అలంకారికుడు కర్ణపూరుడు. రూప గోస్వామికి సమకాలికుడే కాక శిష్యుడు కూడా. “అలంకార కౌస్తుభం” అనే అలంకార శాస్త్రం రాశాడు. ఇతని అసలు పేరు “పరమానంద సేనుడు”. కర్ణపూరుడు వాడుక పేరు. బెంగాల్‌లో 1524లో పుట్టాడు. చైతన్యుని ప్రభావంతో కృష్ణ భక్తుడై చైతన్యుడి భక్తి సిద్ధాంతాలను ప్రచారం చేయటానికి “చైతన్య చంద్రోదయం” అనే గ్రంధం రాశాడు. కావ్య తత్వాలన్నీ కూలంకషగా చర్చించాడు. తాను శ్రీకృష్ణునిపై భక్తితో రాసిన శ్లోకాలను ఉదాహరణలుగా పేర్కొన్నాడు గ్రంధంలో. రసం ఒక్కటే అని సిద్ధాంతీకరించాడు. శుద్ధమైన మనస్సుకు ఆనందం అనే ధర్మం ఉందని అదే స్థాయి అని చెప్పాడు. స్ఫటికంలో అనేక రంగులు కనిపించినట్లు ఒక్కటే అయిన స్థాయి అనేక విభావాదుల కలయికతో వీరం, అద్భుతం మొదలైన రూపాలను ధరిస్తుంది అన్నాడు. సూర్య ప్రతిబింబాలు యెన్ని ఉన్నా అసలు సూర్యుడు ఒక్కడే అన్నట్లు ఉపాధులలో భేదమే కాని ఆనందంలో భేదం లేదు. రసాలన్నిటికి “స్వాద్వాత్మ” ఒక్కటే అని కర్ణ పూరుడి సిద్ధాంతానికి శాస్త్రీయత ఉందని అందరూ అంగీకరించారు.

కర్ణపూరుడు ‘‘ఆనంద బృందావనం’’ అనే చంపువును ‘‘గౌర గణోద్దీపిక”లను రచించాడు. ఈయన కొడుకు కవి చంద్రుడు కూడా లబ్ధ ప్రతిష్టుడైన కవే.❀

86. పట్టపు రాణి కవయిత్రి - నంజన గూడు తిరుమలాంబ (1529 ad)

విజయనగర రాజు అచ్యుత రాయల భార్య తిరుమలాంబ. కాలం 1529-1542. "వరదాంబికా పరిణయం" అనే చంపూ కావ్యాన్ని సంస్కృతంలో రాసిన కవయిత్రి తిరుమలాంబ. ఆమె ప్రతిభకు ఇది నిదర్శనం. తాను ఏక సంతాగ్రాహిని అని చెప్పుకొన్న విదుషీమణి. మనుష్య రూపంలో ఉన్న సరస్వతీ దేవి అని పేరు పొందింది. కవయిత్రి మాత్రమే కాదు కవులను పోషించిన ఔదార్యం ఆమెది. శకలం వారి ఆడపడుచు అయిన వరదాంబిక, అచ్యుత దేవరాయల వివాహ వర్ణనయే ఈ కావ్య ఇతివృత్తం. మొదటగా అచ్యుత రాయల వంశాన్ని వర్ణించింది. అతని తండ్రి విజయ యాత్రలు ఓబలాంబతో అతడి వివాహం అచ్యుతుని జననం, రాజ్యాభిషేకం వివరంగా చెప్పింది. ఒకరోజు రాయలు కాత్యాయని ఆలయంలో పూజ చేస్తున్న వరదాంబికను చూసి ప్రేమిస్తాడు. ఇద్దరి మధ్యా ప్రేమ అంకురించటం, ఇంతలో విదూషకుడు వచ్చి రాచకార్యంపై తీసుకొని వెళ్ళటం, అయిష్టంగా అతను కదిలి వెళ్ళటం వరదాంబిక విరహ వేదన ఉంటుంది. చెలికత్తెలు వచ్చి ఆమెను అచ్యుత రాయలకిచ్చి ఆమె వివాహం జరిపించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పటం, ఇద్దరి పరిణయం శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో దంపతులకు వెంకటాద్రి జన్మించటం పట్టాభిషేకం జరగటంతో సమాప్తం.

తిరుమలాంబ కథ కన్నా వర్ణనలకే ప్రాధాన్యమిచ్చి కావ్యం రాసింది. అచ్యుతరాయల కంటే తండ్రినే అధికంగా వర్ణించింది. సంస్కృతంపై చక్కని అధికారంతో కావ్యం రాసింది. సందర్భానుసారంగా అన్ని రసాలను వర్ణించి కావ్య గౌరవం పెంచింది. శృంగారాన్ని అంగి రసంగా చేసుకొన్నది. శ్లేష, యమకాలనూ సమయాన్ని బట్టి వాడింది. సైన్యం, యుద్ధాలను, నదులను, ఋతు జలక్రీడ వర్ణనలను అద్భుతంగా చేసింది. అచ్యుత రాయలను నఖ శిఖ

పర్యంతం శోభాయమానంగా వర్ణించింది. స్త్రీ ఇలా పురుష వర్ణన చేయటం అప్పటికి కొత్తా, వింత కూడా. ఈమె గద్యం బాణుని బాటలో సమర్ధంగా నడిచింది. పరి సంఖ్యాలంకారాన్ని చమత్కారంతో ప్రయోగించింది. గద్యం ఓజోగుణ భరితం. అనుప్రాసలతో దీర్ఘ సమాస బంధురంగా రాసింది. ఉదాహరణకు –

"నిరంతరానంద కారిత దిగంతర కందళ మంద సుధారస బంధు సాంద్రతర ఘనాఘన వృందా సందేహ కరస్యన్దమాన మకరంద బిందు బంధుర మాకంద తరుకుల తల్ప కల్ప మృదుల సికతాజాల జాతిల మూలతల మరువక మిళిద లఘు లయ కలిత రమణీయ పానీయ శాలికా బాలికా కరార వింద గలంతికా గల దేల లవంగ పాటల ఘనసార కస్తూరి కాతి సౌరభ మేదుర లఘుతర మధుర శీతలతర సలిల ధారా నిరాకరిష్ణు తదీయ విమల విలోచన మయూఖ రేఖా పసారిత పిపాసా యాస పాదిక లోకాన్" అని రసరమ్యంగా సాగుతుంది. ఆమె గద్యం కన్నా పద్యం హృద్యం.

"సరసి విరహిసి త్వం శాత్రవా వారధి మధ్యే – త్యము పవన సరన్యాం తేలి ఘోరే వానంతే కృతక గిరి తటే త్వం కించటే వింధ్య శైలే – కదా మరిష విగానం కధ్యతా మచ్యుతేంద్ర" తిరుమలాంబ "ఆర్య మహిళే" అని రాసిన దానిలో మహిళలే ఆర్య ధర్మాన్ని నిలబెట్టాలని సూచించింది. కన్నడ దేశాన్ని గురించి, కన్నడ భాషను గురించి తిరుమలాంబ చెప్పిన విషయాలు. ఆమె కన్నడ అభిమానానికి కన్నడ దేశ భక్తికి నిదర్శనాలని కన్నడ భాషా విమర్శకుడు సి.యెన్. మంగళ చెప్పారు. ఇలా కన్నడం గురించి దేశాన్ని గురించి ప్రస్తుతించిన మొదటి కవి తిరుమలాంబ యేననీ ఆయన చెప్పటం తిరుమలాంబ వ్యక్తిత్వానికి మరింత శోభ కూర్చింది.

నంజన గూడు తిరుమలాంబ పేరిట ఒక సాహిత్య పురస్కారాన్ని ఏర్పరచి ప్రముఖులకు అందిస్తున్నారు. ఆ పురస్కారాన్ని పొందిన వారిలో విజయలక్ష్మి పండిట్ కుమార్తె నాయన తారా సెహగాల్ ఉన్నారు. ఈ అవార్డ్ గ్రహిస్తూ నయనతార ఆనాడే పురుషులతో బాటు స్త్రీ కూడా అన్ని రంగాలలోనూ ముందు ఉండాలని ప్రబోధించి ఆచరించి చూపింది తిరుమలాంబ అని కొనియాడింది. ❀

87. వసుచరిత్ర చంపువు కర్త - కాళహస్తి కవి (1575 ad)

అప్పయ్య దీక్షితుల వారి శిష్యుడైన కాళహస్తి కవి 1575 కాలంవాడు. వసుచరిత్ర చంపువు రాశాడు. కంచి కామాక్షీ దేవి భక్తుడు. కావ్యం చివర అనుప్రాసలతో అమ్మవారిని స్తుతించాడు. రచన పదిహేడవ శతాబ్దిలో చేసి ఉంటాడని ఊహిస్తున్నారు.

"కాళహస్తి" మహాత్మ్యం

తెలుగులో రామరాజ భూషణుడు (భట్టుమూర్తి) రచించిన "వసు చరిత్ర"ను సంస్కృతంలో ఈ కవి రాయటం ప్రత్యేకమైన, అపూర్వమైన విషయం. వసు చరిత్రకారునిది మౌలిక రచన. శైలి, సంగీత మాధుర్యంతో నాన్యతో దర్శనీయం. భావాలకు చమత్కారాలకు పుట్టినిల్లు. అలాంటి "వసువు"ను సంస్కృత కవులకు పరిచయం చేసి అందులోనూ వసువును అంటే బంగారాన్ని పండించాడు. అతని ఆలోచనకు హాట్స్ ఆఫ్ అన బుద్ధేస్తుంది. వసుకారుని గురించి ఎక్కడా పేర్కొనకపోవటం కూడా విశేషమే. రామరాజ భూషణుడు పీఠికలోని తెలుగు పద్యాలను సంస్కృతీకరించాడు. తెలుగు శ్లేష చమత్కారాన్ని సంస్కృత సాహిత్యంలోకి దించాడు. కృతికర్త వంశ వర్ణన వదిలేశాడు.

ఆరు ఆశ్వాసాలుగా తెలుగులో ఉన్నట్లే రాశాడు. శ్లేష ధ్వని గుణీభూత వ్యంగ్యం మచ్చుకు మచ్చు గీర్వాణంలోకి మార్చి తన కవితా గీర్వాణాన్నే కాక వసుకారుని తెలుగు సోయగ గీర్వాణాన్ని కనులకు కట్టించాడు. తెలుగులో ఉండే యతిప్రాసలనే వాడి సంస్కృతానికి మాధుర్యం లయా, ఊపు తెచ్చాడు. ఎక్కడా

కవిత్వం కుంటుపడదు. తెలుగు పద్యంలోని భావాన్ని ఒకే శ్లోకంలో పొదివి పట్టాడు. మూలంలోని గద్యాన్ని గద్యంగానే గీర్వాణీకరించాడు. అవసరమైన చోట్ల సీస పద్యాన్ని మూడు శ్లోకాలో చెప్పాడు. ప్రాస సౌందర్యాన్ని రామరాజ భూషణుడికి తగినట్లు సంస్కృతంలోకి తెచ్చి వారేవా అనిపించాడు కాళహస్తి కవి. ఒక ఉదాహరణ చూద్దాం –

"వేణి చలింప గంపిత నవీన మృణాళ భుజాగ్ర కంకణ – శ్రేణి నటింప లోన శఫరీ నిబరీ సకటాక్ష కాంతి. వి

న్నాణముచూప హంసక గణ క్వనంబులు మీర సైకత – శ్రోణి వివర్తితాబ్జ ముఖ శోభితమై కదు సంభ్రమించినన్"

ఇది తెలుగు వసు చరిత్రలో రామరాజ భూషణుడి పద్యం. దీన్ని సంస్కృతంలో కాళహస్తి కవి –

"వేణీ చచాల బిసవద్భుజ కంకణానాం – శ్రేణీ ననార్త విబభుశ్శఫరీ కటాక్షాః

నాణీయసీ పరిరరాణ చ హంసకాలీ – శ్రోణోలసత్పులిన సాచిత మబ్జ వక్త్రం". ❀

88. రస గంగాధర కర్త - జగన్నాథ పండితరాయలు (1590-1667 ad)

జగన్నాధుడు తూర్పు గోదావరి జిల్లా అమలాపురం తాలూకా ముంగండ గ్రామంలో జన్మించాడు. వేగినాటి బ్రాహ్మణుడు. తండ్రి పేరం భట్టు గొప్ప విద్వాంసుడు. తల్లి లక్ష్మి. ఇంటి పేరు ఉపద్రష్ట వారు. తండ్రి దగ్గరే పండితుడు విద్య నేర్చాడు. తండ్రి అద్వైతాన్ని జ్ఞానేంద్ర భిక్షువు వద్ద, న్యాయ వైశేషికాలను మహేంద్రుని దగ్గర, వ్యాకరణ శాస్త్రాన్ని వీరేశ్వరుని వద్దా అభ్యసించి మహా పండితుడనిపించుకొన్నాడు. అలాంటి సర్వ సమర్ధుడైన తండ్రి వద్ద విద్య నేర్వటం జగన్నాధుని అదృష్టం. అందుకే తండ్రిని కీర్తిస్తూ "మహా గురుం" అన్నాడు. పండితుడు రాసిన "మనోరమా కుచమర్ధనం"లో తన గురువు శేష వీరేశ్వరుడనీ చెప్పుకొన్నాడు. అంటే తండ్రికి కుమారుడికి వీరేశ్వరుడు గురువు అన్నమాట. ఇతని కాలం 1590-1667గా లెక్కిస్తున్నారు. రస గంగాధరం అనే ముఖ్యమైన అలంకార గ్రంధం రాశాడు. అందులో అతడు కావ్యానికి చెప్పిన "రమణీయార్ధ ప్రతిపాదక శబ్ద: కావ్యం" అన్న నిర్వచనం ప్రతివారి నాలుకలపైనా నర్తించిన వాక్యం.

ఏదో కారణం వల్లకాని లేక అక్కడ తనను సమర్ధుడుగా సాటివారు గుర్తించనందు వల్ల కాని జగన్నాధుడు స్వగ్రామం వదిలి యవ్వనంలో ఢిల్లీ చేరాడు. అక్కడ ఒక రోజున ఇద్దరి మధ్య తగాదా జరుగుతుంటే చూశాడు. వారు రాజుగారి

కొలువులో ఫిర్యాదు చేసుకొంటే సాక్షిగా వెళ్ళిన జగన్నాధుడు తనకు వారి భాష రాకపోయినా తూ.చా తప్పకుండా వారిద్దరి మధ్య జరిగిన సంభాషణలను చెప్పాడు. అంతటి ఏక సంతాగ్రాహి. చక్రవర్తి ఆశ్చర్యపడి నిజానిజాలు నిర్ణయించి జగన్నాధునిని ప్రతిభకు మెచ్చి ఆస్థాన పండితుని చేశాడట. ఆయనే షాజహాన్ చక్రవర్తి. షాజహాన్ పాదుషా పండితుని సమాదరించాడు. షాజహాన్ తండ్రి జహంగీర్ కొలువులోను జగన్నాధుడు పండితుడుగా చలామణి అవటం విశేషం. జహంగీర్ చనిపోయిన తర్వాత ఉదయపూర్ రాజు జగత్ సింగు ఆశ్రయం పొంది ఆయనపై “జగదాభరణ” కావ్యం చెప్పాడు. 1658లో ఢిల్లీ సింహాసనాన్ని షాజహాన్ అధిష్టించగానే జగన్నాధుడు వచ్చి చేరాడు అని అరవింద శర్మ రాసిన “పండిత రాజ కావ్య సంగ్రహ పీఠిక”లో ఉంది. జగన్నాధుడు ఇక్కడి కొలువులో చేరటానికి ప్రోత్సహించింది షాజహాన్ మామ, ముంతాజమహల్ తండ్రి అయిన ఆసిఫ్ ఖాన్. దానికి కృతజ్ఞతగా పండితుడు ఆయనపై “ఆసిఫా విలాసం” కావ్యం రాసి అంకితమిచ్చాడు. జగన్నాధుని పాండిత్యాన్ని కవిత్వ ప్రాభవాన్ని గుర్తించిన షాజహాన్ జగన్నాధుడిని గొప్పగా సన్మానించి “పండిత రాజు” బిరుద ప్రదానం చేశాడు. సువర్ణాభిషేకమూ చేశాడు.

షాజహాన్ కొడుకు దారాకు బాల్య గురువు జగన్నాధుడే. అందుకే దారా సంస్కృతంలో పేరు పొందిన కవి అయ్యాడు. ఔరంగ జేబు షాజహాన్‌ను కారాగారంలో బంధించి, దారా మొదలైన అన్నదమ్ములని కౄరంగా చంపించి పాదుషా అయ్యాడు 1666లో. ఈ రాజకీయ సంక్షోభానికి క్షోభ పడి జగన్నాధుడు అక్కడ ఉండలేక ఈనాడు అస్సాం అని పిలువబడే కామరూప దేశం చేరి రాజు ప్రాణనాధుని ఆస్థానంలో చేరి, అతనిపై “ప్రాణాభరణ కావ్యం” రాసి ఉంటాడని భావిస్తారు. ముసలితనంలో కాశీ చేరి, తర్వాత మధుర వచ్చి యమునా నదీ తీరంలో కాలం గడిపాడని అంటారు.

ఢిల్లీలో ఉండగా జగన్నాధుడు “లవంగి” అనే ముస్లిం కన్యను ప్రేమించి పెళ్లి చేసుకొన్నాడని ఆమె షాజహాన్ ఆస్థానంలో చెలికత్తె అని, ఆమెను తనకు ఇవ్వమని పాదుషాను కోరాడని ఇస్లాం మతం తీసుకొంటే ఇస్తానని చెప్పి

స్వీకారానంతరం లవంగిని కట్టబెట్టాడని కథ ప్రచారంలో ఉంది. కాని మతం మారాడని ఎవరూ నిర్ధారించలేదు. లవంగిపై "భామినీ విలాస" కావ్యం రాశాడు. కాశీలో గంగా నది ఒడ్డున భార్య లవంగితో కూర్చుని "గంగా లహరి" రచించాడని యాభై రెండవ శ్లోకం పూర్తి అయ్యేసరికి గంగ క్రమంగా పైకి వచ్చి వారిద్దరిని తనలో కలుపుకొందని అంటారు. వృద్ధాప్యంలో ఉండగా మధురలో శ్రీకృష్ణ సన్నిధిలో జగన్నాధుడు జీవించాడని చెప్పటానికి అతడు రాసిన ఒక శ్లోకం ఆధారంగా కనిపిస్తోంది.

"శాస్త్రాణ్యా కలితాని నిత్య విధయ: సర్వేపి సంభావితా – డిల్లీ వల్లభ పాణి పల్లవ తలే నీతనం నవీనం వయ:

సంప్రత్యు జ్ఘిత వాసనమ్మ ధుపురీ మధ్యే హరి: సేవ్యతే – సర్వం పండిత రాజ రాజి తలకే నాకారి లోకాధికం".

జగన్నాధ పాండితీయం

జగన్నాధ పండిత రాయలు రస గంగాధరం అనే అలంకార శాస్త్రాన్ని రాశాడు. ధ్వన్యాలోకం కావ్య ప్రకాశం తర్వాత దీనికే ప్రసిద్ధి ఎక్కువ. ఇందులోని విభాగాలను "ఆననాలు" అన్నాడు. దీన్ని ఒక ఉద్గ్రంధంగా రాయాలని ప్రణాళిక తయారు చేసుకొన్నాడు కాని రాయలేకపోయాడని అంటారు. ఇప్పుడున్న రస గంగాధరంలో రెండే రెండు ఆననాలు ఉన్నాయి. జగన్నాధుడు చెప్పిన "రమణీయార్ధ ప్రతి పాదక: శబ్దం కావ్యం" అన్న రమణాయమైన నూతన నిర్వచనం చెప్పాడు. దీనికి విపరీతమైన వ్యాప్తి కలిగింది. దీనికి మించిన నిర్వచనం లేదని విశ్లేషకుల భావన. ముందుగా కావ్య లక్షణాలు చెప్పి తర్వాతే కావ్య భేదాలను చెప్పాడు. కావ్యాలను ఉత్తమోత్తమ, ఉత్తమ, మధ్యమ, అధమ అని నాలుగు రకాలుగా పేర్కొన్నాడు. ధ్వనితో కూడింది ఉత్తమోత్తమ కావ్యమని, వ్యంగ్య ప్రధానమైంది ఉత్తమ కావ్యమని, గుణీ భూత వ్యంగ్యం ఉన్నది మధ్యమం అని, చిత్ర కావ్యం అధమ కావ్యమని విభజించాడు. మొదటిది జగన్నాధుడు స్వంతంగా చెప్పిన మాట.

జగన్నాధుడు రస గంగాధరంలో రసం గూర్చి విపులంగా చర్చించాడు.

రస చర్చ ఉత్కృష్టంగా ఉంటుంది. ఆనంద వర్ధనుడి ధ్వని సిద్ధాంతానికి గొప్ప వత్తాసు పలికాడు. ధ్వని సిద్ధాంతాన్ని భరతుడి రస సిద్ధాంతంలోకి లాక్కొచ్చాడు. ధ్వనిని మెచ్చినా జగన్నాధుడు రసవాది అనే అనిపించుకొన్నాడు. రుయ్యకుడి మార్గాన్ని కొంతవరకు అనుసరించాడు. అలంకారాలలో "తిరస్కారం" అనే కొత్త అలంకారాన్ని వివరించాడు జగన్నాధుడు. సూత్రాలలోనే రస గంగాధరం రాశాడు. తానే స్వయంగా విపులమైన వ్యాఖ్యనూ రాసుకొన్నాడు పండితుడు. మౌలికమైన తన భావనలు ప్రకటించాడు. అవసరమైన చోట్ల ఆనంద వర్ధన, ముమ్మటులను విమర్శించటానికి వెనుకాడలేదు. జగన్నాధుని పాండితీ గరిమ ప్రతి దశలోనూ ప్రస్ఫుటంగా దర్శనమిస్తుంది. ప్రాచీన పండితులలో చివరివాడుగా జగన్నాధుడు పరిగణింపబడుతున్నాడు. అతనిది ప్రవాహ శైలి. తన కవిత్వం గురించి గర్వంగా –

"కవయతి పండిత రాజే కావ్యం త్వమపి విద్వాంస: – నృత్యతి పినాక పాణౌ నృత్యంత్యన్యేపి భూత భేతాళా:" దీని భావం – "పండిత రాజు కవిత్వం రాశాడు. ఇతర కవులూ రాశారు. శివుడు నృత్యం చేస్తున్నాడు. భూత భేతాళాలూ నాట్యం చేస్తున్నాయి" అని తక్కిన కవులను ఈసడించాడు.

జగన్నాధుడు అనేక చిన్న కృతులను రచించాడు. అందులో గంగా లహరి ఒకటి. దీనికి పీయూష లహరి అనే పేరూ ఉంది. యాభై మూడు శిఖరిణీ వృత్తాలతో కమనీయ మనోహరంగా రాశాడు. రెండవది అమృత లహరి. యమునా లహరీ అని కూడా పిలుస్తారు. శార్దూల శ్లోకాలతో రాసిన యమునా నదీ స్తుతి. గంభీరంగా సరసంగా ఉంటుంది. మూడవది కరుణా లహరి. ఇందులో విష్ణుమూర్తిను వంశస్త, సుందరీమాల భారిణి వృత్తాలలో స్తుతించాడు. విష్ణు లహరి అంటారు. నాలుగవది లక్ష్మి లహరి – నలభై ఒక్క శిఖరిణీ వృత్తాలతో లక్ష్మి స్తుతి చేశాడు. అయిదవది సుధా లహరి ముప్పై స్రగ్ధరా వృత్తాలతో ఉన్న సూర్యస్తుతి ఇది. వీటిని "పంచ లహరి" అంటారు. ఆరవది యమునా వర్ణన – తన రస గంగాధరంలో చెప్పిన మధ్యమ కావ్యానికి ఉదాహరణగా దీన్ని రాశాడు. మిగిలినవి ఆసఫ్ విలాసం, ప్రాణాభరణం, జగాదాభరణం గురించి ముందే

చెప్పుకొన్నాం.

జగన్నాధుని రస గంగాధరం తర్వాత ఎక్కువ ప్రాచుర్యమైనది భార్య లవంగిపై చెప్పిన "భామినీ విలాస కావ్యం". ఇది ముక్తక కావ్య విభాగానికి చెందింది. ఇందులో నాలుగు విలాసాలున్నాయి. ప్రాస్తావిక విలాసం, శృంగార విలాసం, కరుణ విలాసం, శాంత విలాసం. మొదటి విలాసంలో నూట ఇరవై తొమ్మిది, రెండులో నూట ఎనభై నాలుగు, మూడులో పందొమ్మిది, నాల్గవ విలాసంలో నలభై ఆరు శ్లోకాలున్నాయి. వివిధ వృత్తాలలో దీన్ని రచించాడు. కోపించిన స్త్రీని భామిని అంటారు. అన్యోక్తులతో కూడి ఉన్న ముక్తకాలు మొదటి విలాసంలో, స్త్రీ వర్ణన, ప్రణయం రెండవ విలాసంలో, మూడవ దానిలో వియోగ దుఖం, నాల్గవ విలాసంలో వైరాగ్య, శాంత భావాలతో బాటు జగన్నాధుని శ్రీకృష్ణ భక్తి కూడా ఉంటుంది.

పండిత జగన్నాధ రాయలు ఏది రాసినా హృదయానికి తాకేట్లు రాసే నేర్పున్న మహా కవి. చదివి ప్రేరణ పొందుతాం. తన ప్రియురాలి అమృత విలాసమే కవిత్వంగా పరిణమించిందని చెప్పుకొన్నాడు.

"కావ్యాత్మనా మనసి పర్యమణన్ పురామే – పీయూష సార సద్రుశాస్తవ ఏ విలాసాః

తానంత రేణ రమణీ రమణీయ శీలా – చేతో హరా సుకవితా కవితా కధన్నః"

శబ్దాలంకారాలు వాడినా రస సౌందర్యం దెబ్బతినకుండా ఔచిత్యం పాటించాడు. "మధువు, ద్రాక్ష, అమృతం, అధర సుధా అందరికీ ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు కాని తన కవిత్వం మాత్రం అందరికి ఆనందాన్నిస్తుందని జబ్బ చరఛి చెప్పాడు. అలా ఆనందం పొందని వాడు జీవచ్ఛవం అని శాపనార్ధాలూ పెట్టాడు మహానుభావుడు.

"మధు ద్రాక్షా సాక్షా దమృత మధ వామాధర సుధా – కదాచిత్ కేషాం చిన్న ఖలు విదదీరన్నపి ముదం ధృవం తే జీవంతో ప్యాహహా మ్రుతకా మంద మతయో – నేశా మానందం జనయతి జగన్నాధ భణితిః"

ఈ దర్పం, అహంకారం శాస్త్ర రచనలలోనే చూపించాడు పండితుడు. కావ్యాలలో చాలా సౌమ్యంగానే ఉన్నాడు. అతని శాస్త్ర పాండిత్యం అంత ధిషణాహంకారంతో ఉండేదన్న మాట. కవిత్వం, పాండిత్యం, మౌలికత త్రివేణీ సంగమంగా వర్ధిల్లినవాడు జగన్నాధ పండిత రాయులు. తెలుగు వారికి గర్వకారణమైనవాడు. మహోన్నత సంస్కృత సాహిత్యం యుగం జగన్నాధ పండితునితో ముగిసింది. అలాంటి మౌలిక పాండిత్యం ఉన్న కవిశ్రేష్ఠుడు మళ్ళీ జన్మించనే లేదు.❁

89. భక్తికి శాస్త్రీయత కల్పించిన - మధుసూదన సరస్వతి (1600 ad)

క్రీ.శ. పదహారవ శతాబ్దం వాడైన మధుసూదన సరస్వతి శ్రీమహా విష్ణువుకు మహా భక్తుడు. విష్ణుమూర్తిని కేశాల దగ్గరనుండి పాదాల వరకు వర్ణిస్తూ "ఆనంద మందాకినీ" అనే కావ్యం రాశాడు. దీన్ని స్తుతి కావ్యం అంటారు. కోమలమైన భక్తి గొప్ప హృదయానుభూతి ఇందులో ప్రతి శ్లోకంలో దర్శనం ఇస్తుంది. మధుసూదనుడు "భక్తి రసాయనం" అనే గ్రంధాన్ని రాశాడు. ఇందులో శాస్త్రీయ పద్ధతిలో భక్తిని అన్ని కోణాలలోను చర్చించాడు. రూప గోస్వామి భక్తిని రసంగా చెప్పినా, దానికి శాస్త్రీయతను కల్పించినవాడు మధుసూదన సరస్వతి మాత్రమే. ద్వైతం నుండి అద్వైతానికి ప్రయాణం చేశాడు. బెంగాలుకు చెందిన మధుసూదనుడి అసలు పేరు కమల నయనుడు. నవ్య న్యాయ సిద్ధాంతాన్ని చదివి ప్రచారం చేశాడు. వారణాసి చేరి సన్యాసిగా మారి అద్వైతాన్ని జీవితాంతం ప్రచారం చేశాడు. ఇరవైకి పైగా రచనలు చేశాడు. అందులో కృష్ణ - కుతూహలం అనే నాటకం కూడా ఉంది. ఈశ్వర ప్రతిపత్తి ప్రకాశం, భాగవత రసాయనం బాగా ప్రసిద్ధి చెందాయి. అక్బర్ చక్రవర్తితో గొప్ప దోస్తీ ఉండేది. తులసీదాసుకు మంచి మిత్రుడు. ❀

90. హోయసల రాజ చరిత్ర రాసిన - సకల విద్యా చక్రవర్తి (1600 ad)

కర్నాటక హోయసల రాజు రెండవ నరసింహ సోమేశ్వరుని ఆస్థాన కవి "సకల విద్యా చక్రవర్తి". ఇది అతని పాండిత్యానికి పొందిన బిరుదు. ఇతడిని రెండవ విద్యా చక్రవర్తిగా గుర్తించారు. మూడవ చక్రవర్తి రుయ్యకుడి అలంకార సర్వస్వ గ్రంధానికి సంజీవిని టీక రాశాడు. మన కవి గద్యంలో "గద్య కర్ణామృతం" రాశాడు. హోయసల వంశ రాజుల చరిత్రను ఆవిష్కరించే గ్రంథం ఇది. చారిత్రక సత్య సమన్వితం. హోయసల రాజులకు చాళుక్య రాజులకు మధ్య జరిగిన యుద్ధాల వివరాలున్నాయి. సోమేశ్వరరాజు చాళుక్య రాకుమారి దేవికను పెళ్లి చేసుకోవటం ముఖ్య వృత్తాంతం. బాణుడు రాసిన హర్షచరిత్రను స్ఫూర్తిగా దీన్ని రాశాడు. ఇందులో శైలి అర్ధ పౌరాణికం అర్ధ ఐతిహాసం. వాల్మీకి కాళిదాసాదుల ధోరణిలో కావ్యం రాశాడు. ❁

91. తానీషా రాజ గురువు - అక్బర్ షా (1600 ad)

గోల్కొండ రాజు అబుల్ హసన్ తానీషాకు రాజ గురువు, అక్బర్ షా తండ్రి అంటారు. షాకు తపశ్శక్తి కూడా బాగా ఉండేదని నమ్ముతారు. తండ్రి తర్వాత తానీషా కొలువులో రాజగురువు అయ్యాడు. అక్బర్ షా సంస్కృతాంధ్రాలలో నిష్ణాతుడైన పండిత కవి. "శృంగార మంజరి" అనే అలంకార గ్రంధాన్ని షా రాశాడు. దీన్ని ముందు తెలుగులో రాసి తర్వాత సంస్కృతంలోకి అనువాదం చూశాడట. ఆయన మాటల్లోనే -

"తేనాంధ్ర భాషాయాం రచితః శృంగార మంజరీ గ్రంధః - స్వయమా కబరేణ భూ భ్రున్ముకుట మణి రంజితాంఘ్రి కమలేన

తద్విరచితాంధ్ర భాషా కలితాం శృంగార మంజరీచ్చాయాం - సేవద్వం సురవాణీ రచితాం రస తోషితా రసిక భృంగాః"

శృంగార మంజరిలో నాయికా నాయక చర్చ, రసంపై చర్చ చేశాడు షా. ఇందులో నాయికా విభాగం నాయక విభాగం, దూతీ విభాగం, రస విభాగం అనే నాలుగు భాగాలున్నాయి. ఈ గ్రంధానికి ఆధారం భానుదత్తుడి రసమంజరిగా భావిస్తారు. షా ఒక గొప్ప తమాషా చేశాడు. తన పేరుతో అక్బర్‌ను అ, క, వ, ర అని విడగొట్టి అ అంటే బ్రహ్మ, క విష్ణువులను వర అంటే మించిన వాడు అని అర్థం చెప్పుకొన్నాడు. షాకు "బడే సాహెబ్" అనే పేరు కూడా ఉందట. దీనికి కూడా తన సొంత అర్థం చెప్పుకొన్నాడు. దానికి అర్థం - మహేశ్వరుడు అన్నాడు. మహమ్మదీయుల్లో సంస్కృతం నేర్చినవారు తక్కువే. అందులోను సంస్కృత గ్రంధాలను రాసినవారు మరీ తక్కువ. అలాంటి వారిలో ప్రప్రధముడు అక్బర్ షా కవి. ❀

92. సంస్కృత ద్వ్యర్ధి కావ్య కవి - వేంకటాధ్వరి (1650 ad)

క్రీ.శ.1650 కాలంవాడైన వేంకటాధ్వరి "విశ్వ గుణాదర్శం" అనే చంపూ కావ్యం రాశాడు. "లక్ష్మీ సహస్రం" అనే వెయ్యి శ్లోకాల స్తుతి కావ్యం రాశాడు. దీనిలో లక్ష్మీదేవి విష్ణు స్తుతి ఉంది. రసవత్తరమైన స్తోత్ర కావ్యంగా గుర్తింపు పొందింది. "సుభాషిత కౌస్తుభం" అనే కృతి కూడా చేశాడు. రాఘవ యాదవీయం అనే ద్వ్యర్ధికావ్యం సంస్కృతంలో రాశాడు. మొదటి నుంచి చదివితే రామాయణ కథ, కుడివైపు నుంచి చదివితే భాగవత కథా వస్తుంది. అంటే ఒక రకంగా ద్వర్ధి కావ్యం అన్నమాట. ఇది ముప్ఫై శ్లోకాల కావ్యం మాత్రమే.❁

93. తంజావూర్ కృష్ణదేవరాయలు - రఘునాధ రాయలు (1663-1670 ad)

తంజావూరు పాలకుడు రఘునాధ రాయలు 1663-1673 కాలం రాజు. సంస్కృతంలోను, తెలుగులోనూ రచనలు చేశాడు. సంగీతంలో కూడా అసామాన్యుడనిపించాడు. కొడుకు విజయ రాఘవ నాయకుడూ గొప్ప సాహిత్య పోషకుడు, కవి, పండితుడు. తెలుగులోనే రచన చేశాడు. ఈ కాలాన్ని దక్షిణాంధ్ర యుగం అంటారు. రఘునాధుడు తండ్రి అచ్యుత రాయలపై సంస్కృతంలో "అచ్యుతేయాంధ్రాభ్యుదయం" కావ్యం రాశాడు. యక్షగానాలు రాశాడు. వీణా వాదనలో మహా విద్వాంసుడు. క్షేత్రయ్య తంజావూర్ వచ్చి ఈ రాజును దర్శించి తన మువ్వ గోపాల పదాలతో మెప్పించాడు. తంజావూర్ సరస్వతి మహల్ గ్రంధాలయాన్ని, కుంభకోణంలో రామస్వామి దేవాలయాన్ని, ఆది కుంభేశ్వరాలయానికి గోపురం నిర్మించాడు. తంజావూరులోను పశుపతి దేవాలయంలోను స్వామి వార్ల రథోత్సవాలను మహా వైభవంగా నిర్వహింపజేసేవాడు. వీణ విధానంలో గణనీయమైన మార్పులు తెచ్చాడు రఘునాధుడు. జయంత సేన రాగాన్ని సృష్టించాడు. రామానంద తాళం కనిపెట్టాడు. చేమకూర కేంకటకవి, కృష్ణాధ్వరి, మధురవాణి, రామభద్రాంబ ఈ ఆస్థాన కవులు. అనేక కావ్య రచన ఇక్కడ జరిగింది. శృంగారం వరదగా రఘునాధుడి కాలంలో పారింది. అందుకని "క్షీణ యుగం" అన్నారు కూడా. బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలు దానం చేశాడు. బీద బ్రాహ్మణులకు ఖరీదైన బహుమతులందజేశాడు. గుర్రపు సవారిలో, ఖడ్గ యుద్ధంలో సాటిలేనివాడు. కవి, పండిత సంగీతజ్ఞుల పోషణ చేశాడు. ఇంగ్లాండ్, డెన్, పోర్చుగీసు దేశాలతో

మంచి మైత్రి నెలకొల్పాడు.

గోవింద, యజ్ఞ నారాయణ దీక్షితుల ప్రాభవం

ఈయన మంత్రి గోవింద దీక్షితులు "సంగీత సుధ" అనే కృతి చేశాడు. దీక్షితుల కుమారుడు యజ్ఞ నారాయణ దీక్షితులు రఘునాథుని విద్యా గురువే కాక "రఘునాథాభ్యుదయం" అనే సంస్కృత కావ్యంను రాజు జీవిత చరిత్రగా రాశాడు. "రఘునాథ విలాసం" అనే సంస్కృత నాటకం రాసి రాజు ధర్మకార్య విశేషాలను తెలియజేశాడు. "అలంకార రత్నాకరం" అనే అలంకార శాస్త్రాన్ని ప్రతాప రుద్రీయం నమూనాలో రఘునాథ రాయలను వర్ణిస్తూ లక్ష శ్లోకాలలో రాశాడు. ❁

94. ఆస్థాన కవయిత్రి - రామ భద్రాంబ(1663 ad)

తంజావూరు రాజు రఘునాధ రాయల ఆస్థాన కవయిత్రి, ప్రియురాలు రామభద్రాంబ. రాజు జీవిత చరిత్రను "రఘునాధాభ్యుదయం" సంస్కృత కావ్యం రాసింది. శ్రీరామావతారంగా రఘునాధుని భావించి వర్ణించిన కావ్యం ఇది. పన్నెండు సర్గల మనోహర కావ్యం. ఇందులో రఘునాధుని దిగ్విజయాలు, సుపరిపాలన వర్ణించింది. రామభద్రాంబ తెలుగు కవిత్వంలోనూ ఆరితేరింది. తెలుగు పద్యాలకు ప్రత్యేకమైన యతి ప్రాసలను సంస్కృత శ్లోకాల్లో ప్రయోగించటం ఒక గొప్ప ప్రయోగం. సంస్కృత, ప్రాకృత భాషల్లో అనేక సమస్యలను పూరించిందని తెలుస్తోంది. ఈమె చెంగల్వ రాయ కవి శిష్యురాలు. త్రిభాషా కవయిత్రిగా ప్రసిద్ధి చెందింది. అష్టావధానాలలో నిష్ణాతురాలు.

రఘునాధాభ్యుదయంలో రామభద్రాంబ మొదటి సర్గలో చోళ రాజ్య వైభవాన్ని వర్ణించింది. తామ్రపర్ణి, కావేరి నదుల సోయగాలను వర్ణించింది. తరులు, లతలు, పక్షులు, జంతువులూ అన్నీ ఆమె రచనలో చోటు చేసుకొన్నాయి. బ్రాహ్మణులు వేదం, వేదాంగాలలో నిష్ణాతులుగా, వారు నిర్వహించే యజ్ఞ యాగాదులను తనివి తీరా వర్ణించింది. రెండవ అధ్యాయంలో చోళ రాజధాని తంజావూర్ పురాన్ని విశేషంగా వర్ణన చేసింది. అందులోని వీధులను, దగ్గరున్న సముద్రాన్ని నాట్యకత్తెలను, ఎత్తైన భవనాలను, ఏనుగులు, గుర్రాలను వర్ణించి రాజు ధార్మిక పరిపాలనను వివరించింది. మూడవ అధ్యాయంలో రాజు శౌర్య ప్రతాప వితరణలను చెప్పింది. స్త్రీ విద్యకు రఘునాధుడు చేసిన కృషిని తెల్పింది. నాలుగవ సర్గలో రాజు దిన కృత్యాలను పూస గుచ్చినట్లు వర్ణించింది. అయిదులో

కూడా రాజు గురించే రాసినా రాజాస్థానాన్ని సందర్శించిన కేరళ, అంగ మగధ, కలింగ గౌడ, ఆరాట్ట దేశాలనుండి విచ్చేసిన సందర్శకులను ముఖ్యంగా వేదాంతులను, వ్యాకరణ పారీణులను, కవులను, కళాకారులను విపులంగా వివరించింది. రాజు విద్వాంసులను ఆదరించిన తీరు, కళాకారులను ప్రోత్సహించి, వారికి శిక్షణ నిచ్చిన విధానాలనూ తెలియజేసింది రామభద్రాంబ. ❀

95. మౌలికత ఉన్న కవయిత్రి - గౌరీ (1700 ad)

పదిహేడవ శతాబ్దికి చెందిన గౌరీ రాసిన ఇరవై ఎనిమిది శ్లోకాలే దొరికాయి. ఇదులో రాజనీతి, యుద్ధం, శతృరాజు విషయాలు దొర్లాయి. మౌలికత ఉన్న రచయిత్రి అనిపిస్తుంది. సహజ ధోరణిలో లలిత మధుర కవిత్వం రాసింది. ❀

96. ప్రకృతి కవయిత్రి - పద్మావతి (1700 ad)

పద్మావతి కూడా పదిహేడవ శతాబ్దానికి చెందిన కవయిత్రి. దొరికినవి పందొమ్మిది శ్లోకాలు మాత్రమే. ఘూర్జర స్త్రీలతో సహా అనేక విషయాలపై రాసింది గుజరాత్ వాసి అవచ్చు సుందరమైన ప్రకృతి వర్ణనలు చేసింది. కవిత్వం సహజ సుందరం. ❀

97. చమత్కార సిద్ధాంత కర్త - విశ్వేశ్వరుడు (1700 ad)

రెండవ సింగ భూపాలుడి ఆస్థానకవి విశ్వేశ్వరుడు "చమత్కార చంద్రిక" అనే అలంకార శాస్త్రం రాశాడు. ఉదాహరణ శ్లోకాలు రాజు ప్రశంసలతోనే ఉంటాయి. ఎనిమిది విలాసాల కావ్యమిది. వర్ణ వివేక, వ్యాక్య గుణ దోష విచార, అర్ధ దోష ప్రబంధ విశేషక, గుణ రీతి వృత్తి పాకశయ్య వివేక, రస వివేక, శబ్దాలంకార, అర్ధాలంకార, ఉభాయాలంకార అని ఆ విలాసాలకు పేర్లు పెట్టాడు. ఇతనిది చమత్కార సిద్ధాంతం. చమత్కారం - కావ్యం యొక్క మూలతత్త్వంగా చెప్పాడు. "నహి చమత్కార విహితస్య కవే: కవిత్వం కావ్యస్యవా కావ్యత్వం" అని గంటకొట్టి క్షేమేంద్రుడు చెప్పాడు. విశ్వేశ్వరుడి తర్వాత హరిప్రసాదుడు కూడా చమత్కారాన్ని మెచ్చాడు. ఆహ్లాదం, జ్ఞానం, లోకోత్తరత్వం, హ్లాదం, చమత్కారం ఉన్నది రమణీయం అన్నాడు, జగన్నాధుడు కూడా ఇంకో అడుగు ముందుకు వెళ్లి. విశ్వేశ్వరుడు చమత్కారాన్ని తరగతులుగా విభజించాడు. చమత్కారి, శబ్ద చిత్రం, చమత్కార తరం, అర్ధ చిత్రం గుణీభూత వ్యంగ్యం, చమత్కారి తమం, వ్యంగ్యం కలిగి ఉన్నదే కవిత్వం అన్నాడు. చమత్కారాన్ని ధ్వని సరసన నిలబెట్టాడు. అనేక అలంకారాలు ప్రసిద్ధ అలంకారాల నుండే ఉద్భవిస్తాయి అన్నాడు. అలంకార మీమాంస విషయంలో జగన్నాధుడిని సమర్ధించాడు. అలంకార కౌస్తుభానికి తానే స్వయంగా టీక రాశాడు. రస చంద్రిక, అలంకార ప్రదీపం, అలంకార ముక్తావళి, "కవీంద్ర కంఠాభరణం"లో చిత్ర కావ్యాల ప్రామాణికతను పరిశీలించాడు. ఇతని అన్న ఉమాపతి కూడా అలంకారికుడే. అతను చెప్పిన పరికరాలంకారాన్ని విశ్వేశ్వరుడు సమర్ధించాడు. తండ్రి లక్ష్మీపతి కూడా కవే కాక పండితుడు కూడా. ప్రౌఢ ఆచార్యులలో కొందరి దృష్టిలో ఇతనే చివరివాడు. ఎక్కువ మంది సృష్టిలో జగన్నాధుడినే చివరివాడిగా గుర్తించారు. ఇతడు పద్దెనిమిదవ శతాబ్దం పూర్వార్ధంలో ఉన్నవాడు. ❀

98. కృష్ణలీలా తరంగిణి కర్త - నారాయణ తీర్థులు (1700 ad)

నారాయణ తీర్థులు పదిహేడవ శతాబ్దానికి చెందినవారు. ఆంధ్రదేశం తూర్పు గోదావరి జిల్లా కూచిమంచి అగ్రహారంలో జన్మించారు. తరువాత తమిళదేశానికి వెళ్ళారు. శివ రామానంద తీర్థుల శిష్యులు. "కృష్ణలీలా తరంగిణి" అనే కృతిని తీర్థులవారు రాశారు. శ్రీకృష్ణుని చరిత్రకావ్యం ఇది. రుక్మిణీ కల్యాణం వరకు ఇందులో ఉంది. పన్నెండు తరంగాలున్నాయి. శ్లోకాలు సంగీతాత్మకంగా నాద వినోదాన్ని చేకూరుస్తాయి. సంగీత నాట్య శాస్త్రాలలో నిధి. చిన్నతనంలోనే సన్యాసి అయి భక్తి సామ్రాజ్యాన్ని పాలించాడు. ముప్ఫై నాలుగు ప్రసిద్ధ రాగాలను ఉపయోగించాడు. త్రిపుట, అది జంప, ఏక ఆట తాళాలను ఉపయోగించారు. హృద్యమైన పద్యం మహా హృదయమంగా రాశారు తీర్థులు. అనుష్టుప్, భుజంగ ప్రయాతం, ఆర్యా, వసంత తిలక, పృథ్వీ వృత్తాలు విరివిగా వాడారు. పదాలలాగా పాడుతుంటారు. నాట్యం చేస్తూ అభినయించే వీలు ఉన్న తరంగాలు. ఆంధ్రదేశంలో బాగా ప్రచారంలో నారాయణ తీర్థుల తరంగాలు ఉన్నాయి. లీలా తరంగిణిలో పన్నెండు నూట యాభై పాటలు, మూడు వందల రెండు శ్లోకాలు, ముప్ఫై ఒక్క చూర్ణికలు ఉన్నాయి. తరంగాలు, తీర్థుల వారు "హరిభక్తి సుధార్ణవం" అనే మరో రచనా చేశారు. భాగవత దశమ స్కంధ ఇతివృత్తం. మొత్తం పదిహేను రచనలు చేశారు. బెనారస్ హిందూ యూనివర్సిటీలో అవి లభ్యమవుతాయి. ❁

99. భాషార్ణవ కర్త - నుదురుపాటి వెంకన్న (1700 ad)

పుదుక్కోట రాజు ఆస్థానంలో ఉన్న తెలుగు కవి నుదురుపాటి వెంకన్న సంస్కృతం తెలుగులలో దిట్టమైన కవి. "ఆంధ్ర భాషార్ణవం" అనే తెలుగు నిఘంటువు రాశాడు. తొండమాన్ రాజుల వంశావళి రాశాడు. తండ్రి సీతారామయ్య గొప్ప కవే. "ఉద్దండ కవి" బిరుదాంకితుడు తండ్రి. వెంకన్న పార్వతీ కల్యాణం, రఘునాదీయం, మల్లుపురాణం, బృహనన్నాయిక దండకం, తొండమాన్ వంశావళి అనే గ్రంధాలు రాశాడు. ఇతని భాషార్ణవం తెలుగు తమిళ దేశాలలో బాగా ప్రచారమైన పద్య నిఘంటువు. మూడు భాగాలున్న ఈ బృహత్ నిఘంటువు అంతవరకూ ఎవరూ రాయని మహత్తర రచన.

వెంకన్న రాసిన రఘునాధీయం అనే సంస్కృత రచనను సమకాలీనుడు ప్రభువు అయిన రఘునాధరాయ తొండమాన్‌కు అంకితమిచ్చాడు. పార్వతీ కల్యాణం యక్షగానం, మల్లపురాణం తెలుగు రచన. మల్ల జాతి వివరాలుంటాయి. బృహన్నాయక దండకం, రఘునాధ రాయని మీద చెప్పిన తెలుగు కవిత్వం. అద్భుత రచనగా ప్రాముఖ్యం పొందింది. ఇంతకంటే ఈ కవి వివరాలు మనకు తెలియటం లేదు.❁

100. కిల్లినూర్ రాజ - రాజవర్మ (1812-1845 ad)

కరీంద్ర లేక చేర్నూరి అని పిలువబడే కిల్లినూర్ రాజ రాజవర్మ 1812-1845 కాలం సంస్కృత కవి, సంగీతకారుడు. తిరువాన్కూర్ సంస్థాన మహారాజు కవి సంగీతజ్ఞుడు. స్వాతి తిరుణాల్ రాజాస్థానంలో ఉండేవాడు. మనకవి కిల్లినూర్ రాజ ప్రసాదంలో జన్మించాడు. ద్రుత కవిత్వంలో మహా విద్వాంసుడు. అందుకే అతనికి "ద్రుత కవి మణి" అని బిరుదు వచ్చింది. భారీగా మంచి పర్సనాలిటీతో ఉండేవాడు కనుక "కరీంద్రన్". ఆశువుగా నిమిషాల మీద కవిత్వం చెప్పేవాడు. అందుకనే విద్వాన్ అనే బిరుదును మహారాజా స్వాతి తిరుణాల్ నుంచి పొందాడు. కథాకలి లేక అట్టకాలు అనే నాటకాలు సంస్కృతంలో రాశాడు. సంతాన గోపాలం రాశాడు. ❀

101. ధర్మ సింధు సారం కర్త - కొల్లూరు కామశాస్త్రి (1840 ad)

విజయనగర ప్రభువు ఆనంద గజపతి సంస్థాన ఆస్థాన పండితులైన కొల్లూరు కామశాస్త్రి 1804లో జన్మించారు. ఎన్నో సంస్కృత గ్రంథాలను అనువదించటమే కాక స్వయంగా సంస్కృత రచనలూ చేశారు. అందులో ముఖ్యమైనది "ఆంధ్ర ధర్మ సింధుసారం". ఇది కాశీనాధోపాధ్యాయుని సంస్కృత గ్రంథం. మహారాజు కోరిక మేరకు దీన్ని సరళ సుందరమైన తెలుగులో అనువదించారు. మరో పుస్తకం "శూద్ర కమలాకరం" ఇదీ ప్రభువుల ప్రేరణతో రాసిందే. శృతి, స్మృతులలో నిగూఢంగా నిక్షిప్తమైన "సర్వ సమతా భావాన్ని" స్పష్టం చేస్తూ శూద్రాది ధర్మాలను నిర్ణయించే గ్రంథంగా దీన్ని రాశారు. దీని మాతృకను సంస్కృతంలో కమలాకర భట్టాచార్య రాశాడు.

"ఆంధ్ర కాదంబరీ సార సంగ్రహం"ను 1905లో రాసి ప్రచురించారు. ఇది వచన రచన. "లక్ష్మీ నరసింహ తారావళి", "శ్రీ నరసింహ దేవా కర నఖ స్తవః" నే రెండు స్వంత సంస్కృత రచన చేశారు. ఇందులో డెబ్భై నాలుగు సంస్కృత శ్లోకాలున్నాయి. సింహాచల నరసింహ స్వామి స్తోత్రమే ఇది. రాజాగారి కోరికపై టీకా సహితంగా రాసి ప్రచురించారు. మూడవది "శ్రీ కాశీ స్తవః" దీనికీ టీకా రాశారు.

తెలుగులో "రఘునాయక శతకం" మొదలైన వాటిని దారాశుద్ధిగల తెలుగు పద్యాలలో రాశారు. అరవై ఏడేళ్ళు జీవించి 1907లో కామశాస్త్రిగారు స్వర్గస్తులయ్యారు.❁

102. షడ్దర్శన తత్వావగాహి - ముడుంబై నరసింహాచార్య స్వామి (1842 ad)

1842లో పాలకొండ దగ్గర అచ్చుతాపురంలో ముడుంబై నరసింహాచార్యులు జన్మించారు. తండ్రి రాఘవాచార్యులు తల్లి గంగమాంబ. చిన్నతనంలోనే తండ్రి చనిపోగా తాతగారి వద్ద కావ్యాలను దర్శన శాస్త్రాలను చదువుకొన్నారు. మరుగంటి కూర్మాచార్యుల దగ్గర ఆంధ్ర వ్యాకరణం చందోరీతులను అభ్యసించారు. తెలుగు కవిత్వంలో అసమాన ప్రతిభను చూపారు. తాతగారి మరణం తర్వాత ఇరవై ఏళ్ళ వయసులోనే తమ్మునితో కలిసి దక్షిణ దేశ యాత్ర చేసి దివ్య క్షేత్రాలన్నిటిని దర్శించారు. ఆయా దేవస్థానాలలోని పండితులను తన కవనం పాండితీగరిమల చేత మెప్పించి సత్కార్యాలందుకొన్నారు.

గొట్టుముక్కల కృష్ణం రాజు సహాయంతో విజయనగర రాజు ఆనంద గజపతి సంస్థానం దర్శించారు. తన ఆంధ్ర గీర్వాణ కవితా పాటవాన్ని రాజుగారి ముందు ప్రదర్శించారు. వీరి ఇఉభయ భాషా పాండిత్యం అద్వితీయ కవితా వైభవం రాజుగారి మెప్పును పొందాయి. ఘన సన్మానం అందుకొన్నారు. విజయనగరంలో నివాసం ఉన్నారు. రోజూ రాజాస్థానానికి వెళ్లి వచ్చేవారు. రాజుగారి తండ్రి విజయ రామ గజపతి సన్నిధిలో ఒక ఆనంద గజపతిగారు మన కవిని సభకు పరిచయం చేశారు. ఆ రోజు శ్రీకృష్ణ లీలా మహోత్సవం జరిగింది. అప్పుడు ఆచార్యుల వారు ఆశువుగా చెప్పిన పద్యానికి రాజుగారి తండ్రి విజయరామ గజపతి మెచ్చి ప్రతినెల భ్రుతిని ఏర్పరచి ఆస్థాన కవిగా నియమించారు.

ఆచార్యులవారు వేద వ్యాస మహర్షి గూర్చి నలభై రోజులు పంచాగ్ని మధ్యమంలో తపస్సు చేశారు. వ్యాస మహర్షి సాక్షాత్కరించి ఆర్ష ప్రతిభను

ప్రదానం చేశాడు. అప్పటి నుండి నరసింహాచార్య స్వామి అయ్యారు. ప్రభువుకు స్వామిగారిపై అమిత గౌరవ ఆదరాలుండేవి. వ్యాసుడు ప్రసాదించిన బుద్ధి కుశలత వలన దర్శనాలన్నిటికి విపుల విశేష వ్యాఖ్యానాలు రచించారు. దీనితో వీరి అసామాన్య ప్రతిభా విశేషాలను గుర్తించిన ప్రభువు సన్నిధిలోని విద్వత్ పరిషత్తుకు అగ్రాసనాధిపతిని చేశారు. 1873లో ప్రభువు ఆనంద గజపతిరాజు కాలధర్మ చెందారు. ఆచార్యుల వారికి ఉత్సాహం అంతా నీరుకారిపోయింది.

సదా భగవధ్యానంలో కాలం గడిపేవారు. భగవద్ వాఙ్మయ సృష్టికి ఉపక్రమించారు. అమూల్య గ్రంధాలను రాసి ప్రచురించారు. అసంప్రజ్ఞాత యోగఫలంగా ఆచార్య స్వామి శేష జీవితాన్ని గడిపారు. నిత్య భగవత్ సాక్షాత్కారం పొందిన మహాయోగ శ్రేష్టులు స్వామీజీ. వేదాంత దర్శన శాస్త్రాలను శిష్యులకు నిరంతరం బోధించేవారు. స్వంత ముద్రణాలయాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. మూడవ కూతురు పర్యవేక్షణలో తాను రాసిన గ్రంధాలన్నిటిని ముద్రించారు. సర్వ దర్శనాలకు ఆచార్య స్వామి రాసిన వ్యాఖ్యానాలు యాభైకి పైనే ఉన్నాయి. సంస్కృత కావ్యాలు చంపువులు, నాటకాలు రాశారు. తెలుగులో "ముగ్ధ శృంగారం", "ప్రౌఢ శృంగారం", "సంకీర్ణ శృంగారం", "కామినీ దుష్ట శృంగారం", "అంగ శృంగారం" రాశారు.

నృసింహాచార్య స్వామి పదహారవ ఏట రచించిన రుక్మిణీ కృష్ణుల విప్రలంభ శృంగారాన్ని వర్ణించే "రంగేశ శతకం"లోని ప్రతి పద్యం అమృతరస బిందువే. మొత్తం కావ్యం అమృత సింధువే. ఒక రస పేటికే. ఇందులోని ఒక తెలుగు పద్యానికి వీరే సంస్కృతంలో రాసిన ఒక శ్లోక వైభవం చూద్దాం –

"తన్వంగీ కుసుమాస్త్ర ఝూంకరణ వజ్యా దూత చాతూశుగాత్ – భీతా "కిం శరణం భావే దిహ మమే" త్వాలోచ్య నద్యాం జనే:

సాకం జాత మ వేత్య పద్మమ భజత్, తద్బాధాతే హంత తాం – "జ్ఞాతిస్ఛేదన లేన కి" వచ ఇదం స్వార్ధాత్ కదం స్ఖలేత్"

తొంభై రెండేళ్ళ నిండు జీవితాన్ని అనుభవించి ఆచార్య శ్రీ 1924లో వ్యాస సన్నిధికే చేరుకొన్నారు.❀

103. మహా వ్యాఖ్యానకర్త, శ్రీ సత్యనారాయణ స్వామి ప్రతిష్ట చేసిన - అద్దేపల్లి కృష్ణశాస్త్రి (1846 ad)

దివిసీమ రత్నం

కృష్ణాజిల్లా దివి తాలూకా టేకుపల్లిలో (ఘంటసాల గారు పుట్టిన ఊరు) అద్దేపల్లి శివావధాని కుమారులు అద్దేపల్లి కృష్ణశాస్త్రి 1864లో జన్మించి అరవై ఒకటవ ఏట 1907లో నిర్యాణం చెందారు. ఈయన సోదరులు అయిదుగురూ మహా విద్వాంసులే. ఆంగ్ల విద్య నేర్చుకోమని అన్నగారు ధవళేశ్వరంలో చేరిస్తే, ఆ చదువుపై ఇష్టంలేక విజయనగరం వెళ్ళి అప్పన భొట్ల గోపాల శాస్త్రిగారి వద్ద చాలాకాలం శుశ్రూష చేసి సాహిత్య, తర్క వ్యాకరణాలలో పాండిత్యాన్ని సాధించారు. గురువుగారి మంత్రం శాస్త్ర విద్య శిష్యునికి సంక్రమించింది. కృష్ణశాస్త్రి గారికి రాని శాస్త్రమే లేదు. ఈయనతో ఆయనకు రాని దానిపైన కూడా వాదం చేయటానికి ఆనాటి మహా పండితులు జంకేవారు. గణపతి, బాల మహా మంత్రోపాసకులు. పాదుకాంత దీక్ష పొంది మూడు నెలలలో ప్రస్తాన త్రయాన్ని చదివేసిన అపర అగస్త్యులు. వీరి ప్రజ్ఞను కథలు గాథలుగా చెప్పుకొనేవారు.

గోపాలపుర వాసి

తూర్పు గోదావరి జిల్లా రాజోలు తాలూకా గోపాలపురపు నివాసి ఉప్పలపాటి జానకమ్మ అనే క్షత్రియ స్త్రీ విజయనగర ప్రభువు అనుమతితో పన్నెండు మంది పండితులను తన గ్రామానికి దగ్గరలో పొడగట్ల ఒక్కో పండితుడికి ఒక్కో ఇల్లు, నాలుగు ఎకరాల సేద్య భూమి ఇచ్చి పండితులపట్ల తనకున్న భక్తిని చాటుకొన్నది. ఇలా వచ్చి స్థిపడిన వారిలో మన కృష్ణశాస్త్రిగారూ ఒకరు. ఇదిగాక

గురువుగారు గోపాలశాస్త్రిగారు చనిపోయినప్పుడు రాసిన వీలునామా ప్రకారం అయిదెకరాల పొలం, మొత్తం డబ్బూ కృష్ణశాస్త్రి గారికి సంక్రమించింది. శిష్యునిపై గురువుగారికున్న వాత్సల్యానికిది నిదర్శనం. గురువు ములికి నాటివారైతే శిష్యుడు వెలనాటివారు. పుత్రునిలా ఆదరించారు శిష్యుని. గురువుగారి అంత్యక్రియలను శిష్యులు శాస్త్రిగారి చేతుల మీదుగా శాస్త్రోక్తంగా జరిగాయి.

కృష్ణశాస్త్రి ప్రజ్ఞ

1892లో కృష్ణశాస్త్రిగారు శ్రీ సత్యనారాయణ స్వామిని అన్నవరంలో ప్రతిష్ఠించారు. అప్పటికి అన్నవరానికి ఏమీ ప్రాముఖ్యత లేదు. శాస్త్రిగారి మంత్రోపాసన ఎందరికో ప్రేరణ కల్గించింది. విదేశీయులు కూడా ఆయన వద్ద మంత్రం శాస్త్ర రహస్యాలను తెలుసుకొనేవారు. "జగన్మోహన మంత్రం"లో గొప్ప ఉపాసకులు. దీన్ని గురించిన పుస్తకం శాస్త్రిగారు రాస్తే అది జర్మనీ చేరిందట.

గోపాలపురం రాజావారి ఆస్థాన పండితులుగా కృష్ణశాస్త్రిగారు చాలాకాలం పని చేశారు. పురాణ ప్రవచనంలో అందె వేసిన చెయ్యి. వీరికి మించినవారు ఆనాడు లేరట. వీరి ప్రజ్ఞ బహు విచిత్రమైనది. ఒకో శ్లోకానికి 108 రకాల అర్థాలు చెప్పగల మహా నేర్పరి. దీరితో పండిత పామరులందరూ వారి పురాణ శ్రవణం కోసం ఎదురు చూసేవారు.

సంస్కృత భాషలో వీరు రాసిన గ్రంథాలకు లెక్కలేదు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత విధానంను విచిత్ర విధానంలో రాసి ముద్రించారు. వాల్మీకి రామాయణంలోని ఒక్కో శ్లోకానికి వంద రకాల వ్యాఖ్యానం రాసి కాశీ పండితులను మెప్పించిన మహాజ్ఞాని. ఈ గ్రంధానికి "ఏక శ్లోక వ్యాఖ్యానం" అనే పేరు పెట్టారాయన. "అలంకార ముక్తావళి" అనే వ్యాఖ్య రాసి ఆ శాస్త్రంలోను తన అసాధారణ పాండిత్య ప్రకర్షను నిరూపించుకొన్నారు. తర్క శాస్త్రంలో "తర్కామృత తరంగిణి" అనే గ్రంధం రాశారు కాని అముద్రితం❁

104. శివాజీ చరిత్ర రాసిన - అంబికా దత్త వ్యాసుడు (1850-1900 ad)

1850-1900 వాడైన అంబికా దత్తుడు "శివరాజ విజయం" కావ్యం రాశాడు. కాశీవాసి ఇందులో శివాజీ మహారాజు చరిత ఉంది. శివాజీ జీవితంలోని ముఖ్య ఘటనలన్నీ ఉన్నాయి. కల్పనలూ బాగానే చేశాడు.

అంబికా దత్తీయం

స్వతంత్ర హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించే మహోత్కృష్ట ఉద్దేశ్యంతో ఛత్రపతి శివాజీ మహారాజుసమర్ధ రామదాస స్వామి ఆశీర్వాద ప్రోత్సాహాలతో నిర్ణయించుకొని మహమ్మదీయ అత్యాచారాలను నిర్మూలనం చేసి సాధిస్తాడు. కొద్దిమంది సైనిక పరివారంతో జైత్రయాత్ర ప్రారంభిస్తాడు. బీజపూర్ సుల్తాన్ అఫ్జల్ ఖాన్ అనే సైన్యాధికారిని శివాజీ మీదకు పంపిస్తాడు. బుద్ధి బలంతో అతడిని శివాజీ మట్టుపెడతాడు. తర్వాత సయిస్తఖాన్‌ను జయించి చంపి సూరత్ జయించి మహారాష్ట్ర సామ్రాజ్యాన్ని విస్తరిస్తాడు. కొన్ని కల్పిత పాత్రలూ ఇందులో ఉన్నాయి. ఎక్కడా అసహజత్వం లేకుండా రాశాడు. దండి, బాణులను అనుకరించాడు. అవసరమైన అలంకారాలు వాడాడు. పాత్రోచిత భాషతో అలరించాడు. ప్రతి పాత్రా సజీవంగా కన్పిస్తుంది. శివాజీ శీల ఉత్కృష్టతను మనోహరంగా చిత్రించాడు.

శివాజీ మహారాజులో ఉన్న దేశభక్తీ, శౌర్య పరాక్రమాలు, దానం ధర్మ మార్గానుసరణం, నిర్భయం, స్వాభిమానం, ఆత్మగౌరవం, స్త్రీల యెడల ఉన్న గౌరవ సమ్మానం చరిత్రలో ఎక్కడా చూడం. అన్నిటినీ సహజ సుందరంగా వర్ణించాడు. సాంఘిక రాజకీయ విషయాలను ఉత్కృష్టంగా చిత్రించాడు. అన్ని రకాల వర్ణనలు చేశాడు. శివాజీని ఆదర్శమూర్తిగా, వీరునిగా, మహాధీరునిగా, దేశభక్తి ప్రబోధకునిగా, మహత్తరంగా చిత్రీకరించి మెప్పు పొందాడు అంబికా దత్తుడు. చారిత్రక ఇతివృత్తానికి గొప్ప కావ్య గౌరవం కలిగించాడు. ఆధునిక కాలంలో కూడా ఇంతటి ఉత్కృష్ట సంస్కృత కావ్య రచనలు చేసేవారున్నారని అంబికా దత్తుడు నిరూపించి మార్గదర్శనం చేశాడు.❁

105. "నాయన" కావ్య కంఠ వాసిష్ట గణపతి (1878 ad)

రమణ మహర్షి చేత "నాయన" అనిపించుకొన్న మహాభక్తుడు, దేశభక్తుడు అయిన అయ్యల సోమయాజుల గణపతి శాస్త్రి. విద్వత్తు వలన పొందిన బిరుదే "వాశిష్ట గణపతి". ఉత్తరాంధ్ర దేశంలో బొబ్బిలి దగ్గర కలువరాయిలో 1878లో జన్మించారు. పండిత కుటుంబం. పదవ ఏటనే "పాండవ దార్త రాష్ట్ర సంభవ" అనే ఖండకావ్యం రాసిన ప్రతిభాశాలి. వ్యాకరణం, జ్యోతిషం, ఆయుర్వేద, దర్శన విద్యల్లో మహాపండితుడు. మహా మంత్రం శాస్త్రవేత్త. ఇంద్రాణీ సప్తస్తుతి, చండీత్రిశతి, వివిధ చందస్సులతో రాసిన "ఉమా సహస్రం" మొదలైన సంస్కృత కావ్యాలు రాశారు. మహా ఉపాసకులు. విశ్వ మీమాంస, సదాచార బోధిని, గాయత్రి వ్యాఖ్యానం రాశారు. "పూర్ణ" నవలను సంస్కృతంలో రాశారు. మొత్తం మీద డెబ్భై అయిదుకు పైగా రచనలు చేశారు. గణపతి మునిగా ప్రసిద్ధులు. ఈత్మ విచారంలో అద్వితీయంగా ముందడుగు వేశారు భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ❁

106. బహు భాషావేత్త - అభినవ కాళిదాసు పండిత భట్ట మధురానాథ శాస్త్రి (1889-1964 ad)

23-3-1889న జన్మించి డెబ్భై అయిదేళ్ళు జీవించి 4-6-1864న మరణించిన భట్ట మధురానాథ శాస్త్రి రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన అనేక సంస్కృత గ్రంధాలు రాసిన గొప్ప పండితుడు. వ్యాకరణ వేత్త, వేదాంతి, కవి, తంత్ర వేత్త, బహుభాషా శాస్త్రజ్ఞుడు. ఆధునిక సంస్కృత కవుల్లో ప్రాచీన, నవీన రచనలు చేసిన మేధావి. సంస్కృతంలో అనేక ప్రక్రియలను పరిచయం చేసిన ప్రయోగశీలి. యాత్రా సాహిత్యం, రేడియో నాటికలు, వ్యాసాలూ, చిన్నకథలు మొదలైనవి రాసి కొత్త ఒరవడి సృష్టించాడు. గజల్‌లతో సహా టుమ్రీలు, దర్దులు, ధ్రుపదలు అనేక పాటలు రాసి మెప్పించిన కవి. వైవిధ్యం ఆయన సొత్తు. సంస్కృతంలో హిందీని ప్రాకృత వ్రజ భాషను చొప్పించిన మేటి.

బాల్యం విద్యాభ్యాసం

మధురానాథ శాస్త్రి జైపూర్‌లో సాంప్రదాయ "దేవర్షి కుటుంబం"లో జన్మించాడు. వీరిది తరతరాలుగా కవి పండిత కుటుంబం. వీరి పూర్వీకులు తెలంగాణా ప్రాంతం నుండి వచ్చి జైపూర్‌లో ఉన్నారు. గౌతమస గోత్రం. కృష్ణ యజుర్వేద శాఖకు చెందినవారు. వీరి పూర్వీకుడు బావాజీ దీక్షితులు ఆంధ్రదేశం నుండి వారణాసికి వలస వచ్చి, ప్రయాగ, రేవా, బేండీలలో నివాసం ఉన్నారు. వీరి వంశంలో ప్రసిద్ధులైన దేవర్షి కవి కళానిధి అనే సంస్కృత, వ్రజ భాషా పండిత కవిని సాదరంగా జైపూర్ సంస్థానానికి రాజా సవాయ్ జైసింగ్ ఆహ్వానించి గౌరవించి ఆస్థానకవిని చేసి "కళానిధి" బిరుదునిచ్చి సత్కరించాడు. ఈ వంశం

వారే కృష్ణభట్ట, ద్వారకా నాథభట్టు, జగదీశ భట్టు వాసుదేవ భట్టు, మండన భట్టు. వీరందరూ రాజస్థాన కవులే. ఈ దేవర్షి వంశంలో మధురానాధ భట్టు 23-3-1889న జైపూర్‌లో జన్మించాడు.

ఉర్దూ, పారశీక భాషల్లో మొదట విద్యనేర్చి మధురానాధ శాస్త్రి తర్వాత వ్యాకరణం సంస్కృతం జైపూర్ మహారాజా కాలేజిలో అభ్యసించాడు. 1903లో వ్యాకరణంలో సర్వోత్కృష్ట శ్రేణిలోను, 1906లో సంస్కృత ఉపాధ్యాయ పరీక్షలో మొదటి స్థానం సాధించ ఉత్తీర్ణుడైనాడు. 1909లో సంస్కృత ఆచార్య పరీక్షలో అద్వితీయమైన మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించాడు. ఆయన విద్యా గురువులు ప్రసిద్ధులైన పండిత మధుసూదన ఓఝా, పండిత కాశీనాథ్ శాస్త్రి, పండిత గోపీనాథ్ నాంగ్ల్యా, లక్ష్మీనాధ శాస్త్రి, హరిదత్తు ఝూ, శ్రీకృష్ణ శాస్త్రి. మధురానాధుని సహ విద్యార్ధులలో ప్రముఖులు, వేద చూడామణి పండిత మోతీలాల్ శాస్త్రి, మహా మహోపాధ్యాయ పండిత గిరిధర చతుర్వేది. వ్యాకరణ మార్తాండ పండిత లక్ష్మీనాధ శాస్త్రి, లక్ష్మీ రాం స్వామి, రాజగురు పండిత చంద్రదత్తు ఓజా, పండిత సూర్యనారాయణ శర్మ, పండిత గోపీనాధ కవిరాజ్, పండిత చంద్రాధర్ శర్మ గులేరి.

మధురానాధుడు మూడుసార్లు వివాహమాడాడు. 1909లో రాజాస్థాన పురోహితుని కుమార్తె సావిత్రీ దేవిని పెళ్లి చేసుకొని ముగ్గురు సంతానాన్ని పొందాడు. వారు పసితనంలోనే చనిపోయారు. భార్య కూడా మరణించింది. తర్వాత మధురాదేవిని పెళ్లాడితే ఆమె ప్లేగు వ్యాధితో చనిపోతే తృతీయ వివాహంగా పండిత గోపీకృష్ణ కుమార్తె రమాదేవిని వివాహం చేసుకొన్నాడు. ఈమెకు నలుగురు - ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలూ జన్మించారు. కుమారులు, మనుమలు అందరూ ప్రసిద్ధ కవి పండితులైనారు.

ఉద్యోగం - రచన

1926-31 కాలంలో జైపూర్ మహారాజా సంస్కృత విద్యాలయంలో ఉపాధ్యాయుడుగా మధురానాధుడు పనిచేశాడు తర్వాత సంస్కృత అధ్యాపకునిగా, సంస్కృత శాఖాధ్యక్షునిగా సేవలందించాడు. ఉద్యోగం చేస్తూ "సంస్కృత సుబోధిని"

అనే రెండు భాగాల పుస్తకం రచించాడు. పిమ్మట "సులభ సంస్కృతం" రాస్తే దానిని రాజస్థాన్ ప్రభుత్వం పాఠ్య గ్రంథంగా చేసింది. భట్టుకు మొదటి నుండి హిందీ మీద కూడా వల్లమాలిన అభిమానం ఉంది. ఆయన చొరవతో జైపూర్ మహారాజా కాలేజి హిందీ సాహిత్య సమ్మేలన్ వారు నిర్వహించే హిందీ పరీక్షా కేంద్రమైంది. ఈ పరీక్షలు హాజరయ్యే వారి ఒక గుడిలో సాయంకాలం ఉచితంగా క్లాసులు నిర్వహించి తరిఫీదునిచ్చేవాడు.

శాస్త్రి పద్నాలుగవ ఏడు నుంచే సంస్కృతం, హిందీలలో రచనలు చేశాడు. చనిపోయే వరకు సాహిత్య రచన చేస్తూనే ఉన్నాడు. ఆయన సాహిత్యం లక్ష పేజీల వరకు ఉంటుంది. సంస్కృతంలో ఆదర్శ రమణి, గాథా రత్న సముచ్చయం, గీర్వాణ గిరా గౌరవం, గోవింద వైభవం, చషకం, జయాపూర్వ విభవం, ప్రబంధ పారిజాతం, భాతి భావనో భగవాన్, భారత వైభవం, మంజులా నాటికా, మొఘల్ సామ్రాజ్య సూత్రధార్ మాన్సింగ్, రస గంగాధరంపై "సరళ" పేరిట వ్యాఖ్యానం, సంస్కృత సుధా, ధాతు ప్రయోగ పరిజ్ఞానం, ఆర్య నామాది భాషా కావ్య కుంజ, రస సిద్ధాంత, వినోద్వాటిక, సంస్కృత కథా నికుంజ్, బిహాన్ స్తస్య కావ్యాంచి, కావ్య సిద్ధాంతం, స్తుతి కుసుమాంజలి, రస గంగాధర సమీక్ష.

అనేక సంస్కృత కావ్యాల ముద్రణకు సంపాదకత్వం వహించాడు. అందులో కాదంబరి, రస గంగాధరం, సంస్కృత గాథా సప్తశతి, గీర్వాణ గిరా గౌరవం, ప్రబంధ పారిజాతం మొదలైనవి. సంస్కృత పత్రికలైన "సంస్కృత రత్నాకరం", "భారతి"లకు సంపాదకునిగా సేవ చేశాడు.

హిందీ భాషలో – శరణాగతి రహస్య, వ్రజ్ కవితా పాటలు – సంస్కృతంలో గజళ్ళు, హిందూస్థాని సాంప్రదాయ సంగీత కీర్తనలు, టుమ్రీలు, ధ్రుపదలు, దర్దులు రాశాడు. భారతీయ శాస్త్రీయ సంగీతం రవీంద్ర సంగీతాలు అంటే మహా ఇష్టపడేవాడు.

పురస్కారాలు

కవి శిరోమణి, కవి సార్వభౌమ, సాహిత్య వారిధి అనే బిరుదులూ పొంది వివిధ సంస్థల చేత సమ్మానింపబడ్డాడు. మధురానాథ శాస్త్రికున్న పరిజ్ఞానం

చాలా తక్కువ మందికి మాత్రమే ఉందని విమర్శులు ముక్త కంఠంతో చెప్పారు. సంస్కృత సాహిత్యానికి నవీన సూర్యోదయం తెచ్చాడు. ఎన్నో ప్రక్రియలను ప్రవేశపెట్టాడు. 1930–60 కాలాన్ని "భట్ట యుగం" అన్నారు అందుకే. ఉజ్జైన్‌లోని కాళిదాస సమితి "అఖిత భారత సంస్కృత సమ్మేళనం"లో మధురానాధ శాస్త్రిని ఆహ్వానించి "కాళిదాస సమ్మాన్" పురస్కారాన్ని అందించి సత్కరించి "అభినవ కాళిదాసు" బిరుదును ప్రదానం చేసింది. ఈయనపై అనేకమంది పరిశోధనలు చేసి పి.హెచ్.డిలు సాధించారు.

4–6–1964న 75వ ఏట పండిత భట్ట మధురానాధ శాస్త్రి గుండెపోటుతో మరణించాడు. ❁

107. వ్యుత్పత్తి నిఘంటు రచయిత - తాత వెళ్లి మితాచార్ శేషగిరి శాస్త్రి (1847 ad)

తమిళ దేశంలో గీర్వాణ పంట

తమిళనాడు ఉత్తర ఆర్కాట్ జిల్లా తిరువత్తూరు తాలూకాలో పుదూరు ద్రావిడ కుటుంబంలో తాతవెళ్ళి మితాచార్ శేషగిరి శాస్త్రి 1847లో జన్మించారు. వారిది విద్వత్ కుటుంబం. చిన్నతనంలోనే అసాధారణ ప్రతిభా ప్రదర్శనం చూపించారు. మద్రాస్ ప్రెసిడెన్సి కాలేజిలో 1871లో పట్టభద్రులయ్యారు. అదే కాలేజిలో సంస్కృత పండితులుగా పనిచేశారు. తర్వాత 1875లో సంస్కృతాంధ్రాలలో ఎం.ఏ సాధించారు. మద్రాస్‌లో మొట్టమొదటిసారిగా సంస్కృతంలో ఎం.ఏ డిగ్రీ పొందిన వ్యక్తిగా చరిత్రకెక్కారు.

ఉద్యోగ వైభోగం

విద్యాశాఖలో చేరి స్కూళ్ళ ఇన్స్పెక్టర్‌గా, ప్రెసిడెన్సి కాలేజిలో గీర్వాణ భాషా మహోపాధ్యాయులుగా సేవ చేశారు. తర్వాత మద్రాస్ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో "క్యూరేటర్"గా చివరి వరకు నిర్వహించి చివరలో 1893లో "డాక్టర్ అవార్డ్"ను పొందారు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ప్రెసిడెన్సి కాలేజి "ప్రాక్తన శాఖాధ్యక్షులు"గా కొనసాగారు. సంస్కృత, తమిళ భాషలకు పైలాలజికి, మరాఠీ భాషకు ఎన్నో సంవత్సరాలు పరీక్షకులుగా ఉన్నారు.

గబ్బిట దుర్గాప్రసాద్

బహుభాషలలో భాషాసేవ

శాస్త్రిగారు విస్తృత పరిశోధకులు. తులనాత్మక పరిశోధనలు చేసిన భాషాభిమాని. "ఆంధ్ర శబ్ద తత్త్వం" అనే రెండు భాగాల తెలుగులో ఉద్గ్రంథం రాశారు. "తమిళ శబ్ద తత్త్వం" అనే తమిళ భాషలో గ్రంథం రచించారు. "ఆంధ్ర భాషా తత్వ పరిశీలనం" అనే ప్రథమ భాగాన్ని ఇంగ్లీష్‌లో రాశారు. "తమిళ సారస్వత చరిత్ర"ను ఆంగ్లంలో వెలయింపజేశారు. "అర్థానుసార తత్త్వం" తెలుగు గ్రంథమూ రాశారు.

శేషగిరి శాస్త్రిగారి వివిధ భాషా పరిశోధనకు ప్రావీణ్య నైపుణ్యాలకు మేటి. ఉదాహరణలు వీరు రాసిన సంస్కృత, ఆంధ్ర, కన్నడ, తమిళ, మళయాళ భాషలకు రాసిన "ప్రత్యేక వ్యుత్పత్తి నిఘంటువులు" అనితర సాధ్యమైన కృషి ఇది అని భాషా శాస్త్రవేత్తలు బహుధా ప్రస్తుతించారు శాస్త్రిగారిని. కాని ఇవి పూర్తిగా రాయకుండానే శాస్త్రిగారు మరణించటం ఆ భాషలు చేసుకొన్న దురదృష్టం. యాభై నాలుగేళ్ళు మాత్రమే జీవించి ఇంతటి భాషా సంపదను భాషలకు అందజేసిన శేషగిరి శాస్త్రిగారు 1901లో పరమపదించారు.❀

108. కౌముది పాఠ ప్రవచన శ్రేష్ఠ - శొంఠి భద్రాది రామశాస్త్రి (1850 ad)

తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం దగ్గర కొమరగిరిలో శొంఠి భద్రాద్రి రామశాస్త్రిగారు 1850లో జన్మించారు. తల్లిదండ్రులు రంగరామయ్య, కామాంబ. మాతృ, పితృ వంశాలలో ఇరువైపులా అపూర్వ పండిత కవులే. శాస్త్ర నిష్ణాతులే శ్రోత్రియులే నిష్టా గరిష్టులే. సదాచార సంపన్నులే. కనుక చిన్ననాడే రామశాస్త్రిగారికి ఆంధ్ర గీర్వాణాలు సహజంగానే అబ్బాయి. పాండిత్య కవితా ప్రావీణ్యం అలవడ్డాయి. మనోహర కావ్యనిర్మాణ నైపుణ్యం ఉభయ భాషల్లోనూ ఇరవై ఏళ్ళకే పట్టుబడింది.

శాస్త్రిగారు కౌముది పాఠ ప్రవచనంలో ఉద్దండులని దేశమంతా మార్మోగింది. తెలుగులోనూ సమానమైన పాండిత్య గరిమ ఉంది. విస్పష్టంగా బోధించే సామర్థ్యమూ ఉన్నది. ఆంధ్ర ప్రబంధాలు రూపకాలు రచించే నేర్పు వచ్చేసింది. ఉర్లాం సంస్థానంలో రాజామంత్రి ప్రగడ భుజంగ రాయుని ఆస్థాన పండితులయ్యారు.

సంస్కృతంలో అహోబల పండితీయంకు తెలుగులో వ్యాఖ్య రాశారు. లఘు కౌముదిని ఆంధ్రీకరించారు. వసుచరిత్రకు భూమిక రాశారు. సంస్కృతంలో ముక్తావళి అనే రూపకం, శంబరాసుర విజయం అనే చంపువు, శ్రీరామ విజయ చంపువు రాశారు. స్వీయ తెలుగు కృతులు - కాళిందీ పరిణయం, చిత్ర సీమ, జగన్నాథ క్షేత్ర మహాత్మ్యం, మల్లికా, శంతనూపాఖ్యానం, శివరామ శతకం, శ్రీరామ స్తవం ముక్తావళి నాటకం, శ్రావణ మహోత్సవ తారావళి. అరవై అయిదేళ్ళు జీవించి భద్రాద్రి రామశాస్త్రిగారు 1915లో శ్రీరామైక్యమైనారు.❋

109. రావు బహదూర్ -
కిడాంబి రామానుజాచార్యులు (1853 ad)

జిహ్వాగ్రాన సరస్వతీ తాండవం

సంస్కృతంలె ఆశుధారగా కవిత్వం చెప్పి, ఏక సంధాగ్రాహిగా గుర్తింపు పొంది, న్యాయశాస్త్ర మధనం చేసి అసాధారణ ప్రజ్ఞావంతులుగా పేరు పొందిన కిడాంబి రామచంద్రా చార్యులవారు పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడులో 1853లో జన్మించారు. స్వగ్రామంలోనే సంస్కృతాన్ని అధ్యయనం చేశారు. కావ్య, నాటక, అలంకార, వ్యాకరణాలలో ఇరవై ఏళ్ళ వయసుకే అపార పాండిత్యాన్ని సాధించారు. వీరి సునిశిత మేధాశక్తి అందరినీ ఆకర్షించింది.

"నానార్ధ రత్నమాల", "మేదిని" వంటి నిఘంటువులు వీరికి కంఠోపాఠంగా ఉండి జిహ్వాగ్రాన తాండవ మాడుతూ ఉండేవి. వీరి ఏక సంధాగ్రాహనం వల్లనే ఇది సుసాధ్యమైంది. పదహారు, పదిహేడేళ్ళ వయసులోనే అష్టావధానాలు చేసిన చిచ్చరపిడుగు ఆచార్యులవారు సంస్కృతం, తెలుగులలో కవితాధారను మహా ఆశువుగా చెప్పి మెప్పించే నేర్పు వీరిది. అనేక రాజాస్థానాలు సందర్శించి ప్రభు సత్కారాలు అందుకొన్న కవీశ్వరుడు.

మహా విద్యావేత్త

గ్రంధ రచన కంటే విద్యావేత్తగా విశేషంగా గుర్తింపు పొందారు. వీరి రచనలో ముఖ్యమైనవి "హేస్టింగ్ చరిత్ర", "మత విద్య" వంటి తెలుగు ఇంగ్లీష్

గ్రంథాలున్నాయి. 1873లో విజయనగరం చేరి ఆస్థాన ప్రదానామాత్యులు పెనుమత్స జగన్నాధ రాజును, ప్రభువు ఆనంద గజపతి మహారాజును దర్శించారు. తన అసాధారణ వైదుష్యంతో వీరిద్దరి మెప్పు పొంది, ఆదరణకు లోనై అక్కడే హైస్కూల్‌లో చేరి 1874లో ప్రవేశ పరీక్షలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. రాజావారి ఉపకార వేతనం పొంది మద్రాస్ ప్రెసిడెన్సి కాలేజిలో ఎం.ఏ చదివి ఉత్తీర్ణులైనారు. ఆనాటి మొదటి బాచీ విద్యార్థులలో వీరున్నారు. న్యాయ శాస్త్రంపై మక్కువ ఎక్కువవ్వటంతో దానినీ చదివి బి.ఎల్ పట్టా పొందారు.

విద్యా సేవ

విద్యాభ్యాసం మద్రాస్‌లో పూర్తి చేసుకొని మళ్ళీ విజయనగరం చేరుకొన్నారు. వీరిని మహ రాజావారు తమ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించి గౌరవించారు. కొద్దికాలానికే ఆచార్యులవారు పదోన్నతి పొంది 1887లో ప్రధానాచార్యులు అంటే ప్రిన్సిపాల్ అయ్యారు. 1920 వరకు ఆ పదవిని అత్యంత సమర్ధవంతంగా నిర్వహించారు. తర్వాత విజయనగర సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమింపబడ్డారు. విద్యా రంగానికి రామానుజాచార్యుల వారి సేవను గుర్తించిన ఆనాటి ఆంగ్ల ప్రభుత్వం 1912లో “రావు బహదూర్” బిరుదునిచ్చి గౌరవించింది, సత్కరించింది. డెబ్బై ఏడేళ్ళు యశో జీవితాన్ని సార్ధకం చేసుకొని ఆచార్యులవారు 1928లో కీర్తి శేషులయ్యారు❁

110. తర్క తీర్థ - ఆదిభట్ట రామమూర్తి శాస్త్రి (1861 ad)

తర్క సముద్రాన్ని అవలీలగా ఈదిన మహానుభావులు ఆదిభట్ట సుబ్రహ్మణ్యం, మహా లక్ష్మమ్మ దంపతులకు రామమూర్తి శాస్త్రి బొబ్బిలి తాలూకా మురడాం అగ్రహారంలో 1961లో జన్మించారు. ద్రావిడ శాఖకు చెందినవారు. సొంత ఊరిలోనే పంచకావ్యాలు నేర్చారు. శ్రీపాద రామశాస్త్రిగారి దగ్గర తర్క ప్రకరణాలు, నిరుక్తి, పక్షత, వ్యధికరణం, సిద్ధాంత లక్షణం, అవచ్ఛేదకత్వ నిరుక్తి, పక్షత, సామాన్య నిరుక్తి అనే తర్క గ్రంధాలనన్నిటినీ అవలోడనం చేసుకొన్నారు. కాశీ వెళ్లి కర్నాటక సీతారామ శాస్త్రిగారి వద్ద "నవ్యభిచారం", "సత్ ప్రతిపక్షం", "అవయవం" అనే మహోద్గంద్రాలు పఠించారు. వంగ దేశీయులైన వజ్రకుమార విద్యారత్న భట్టాచార్యుల వారి నుండి "వ్యుత్పత్తి వాదం, శక్తి వాదం", "ప్రామాణ్య వాదం", "విధి వాదం", ముక్తి వాదం" అనే అపూర్వ గ్రంథాలన్నీ నేర్చుకొన్నారు. అంటే తర్క శాస్త్రాన్ని ఆమూలాగ్రం మధించి, శోధించి అంతు చూసిన తర్క మార్తాండులన్న మాట. కలకత్తాలో ప్రభుత్వ పరీక్షలో ఉత్తీర్ణులై "తర్క తీర్థ" బిరుదంతో పాటు, అయిదు వందల రూపాయల "నవ రత్న రూప" బహుమతిని పొందారు.

వేదాంత ధిషణ

ఇంతటితో సంతృప్తి చెందకుండా రామమూర్తిగారు కాశీలో ద్రావిడ సుబ్రహ్మణ్య దీక్షితులుగారి దగ్గర వేదాంత సూత్ర, శంకర భాష్యంలో చతుస్సూత్రి వరకు అధ్యయనం చేశారు గీతా భాష్యాన్ని, సూత్ర భాష్యాన్ని, అద్వైత సిద్ధిని, గౌడ బ్రహ్మానందాన్ని స్వీయ ప్రతిభతో స్వయంగా అధ్యయనం చేసి నేర్చుకొని

అసమాన ధిషణతో అగ్రగామి అయ్యారు.

బోధనా సామర్థ్యం

కర్నాటక దేశంలో చిత్రాపూర్‌లో ఉన్న శంకర పీఠ స్వామికి వేదాంతాన్ని బోధించారు. విద్యార్థులకు తర్కాన్ని నేర్పారు. అక్కడే మూడేళ్ళు ఉండి తర్వాత దర్భంగా, మండి మొదలైన సంస్థానాలను దర్శించి పండిత ప్రకాండులను శాస్త్ర చర్చలో మెప్పించి విశేష గౌరవాదరణలు పొందారు. ఉర్లాం సంస్థానంలో తర్క శాస్త్ర పరీక్షాధికారిగా ఉన్నారు. మూడేళ్ళు తూర్పు గోదావరి జిల్లా మండపేటలో, పన్నెండేళ్ళు రాజమండ్రిలో, రెండేళ్ళు విజయనగర మహారాజా వారి సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా ఉండి వందలాది విద్యార్థులకు తర్కాన్ని బోధించి తీర్చిదిద్దారు.

అక్కడి నుండి తిరుపతి చేరి సంస్కృత కళాశాలకు ప్రధానాచార్యులుగా అమూల్యమైన సేవలు కొద్దికాలమే అందజేశారు. తర్వాత దక్షిణ దేశ సంచారం చేస్తూ పండితులతో శాస్త్రార్థ చర్చలు చేస్తూ చివరికి “లుకులాం” అగ్రహారం చేరుకొన్నారు. అక్కడ వితరణ శీలురైన బ్రాహ్మణులు బూర్లె శ్రీరాములుగారు శాస్త్రిగారికి భూమిని, వసతి గృహాన్ని ఏర్పాటు చేసి గౌరవించారు. అక్కడే సుఖ జీవనం సాగిస్తూ విద్యార్థులకు విద్యాబోధన చేశారు.

సన్యాసాశ్రమ స్వీకారం - ముక్తి

రామమూర్తి శాస్త్రిగారు “శక్తి వాదం”పై ఒక వ్యాఖ్యాన గ్రంధం రచించారు. ఆది నుండి శ్రీ విద్యోపాసకులైన వీరు జీవితాంతం కొనసాగించారు. జీవిత చరమాంకంలో రాజమండ్రి చేరి గోదావరీ నది తీరంలో ఆవాసం ఏర్పరచుకొని సన్యాసాశ్రమం స్వీకరించారు. యాభై తొమ్మిది సంవత్సరాలు మాత్రమే జీవించినా జీవితాన్ని అత్యంత సార్ధక చేసుకొని ఎదురులేని తర్క పండితునిగా రాణించిన రామమూర్తి శాస్త్రిగారు 1920లో ముక్తి పొందారు.❁

111. షేక్స్పియర్ నాటక కథలు సంస్కృతంలో రాసిన – మేడేపల్లి వెంకట రమణాచార్యులు (1862 ad)

పండిత వంశం

మేడేపల్లి వెంకట రమణాచార్యులు గోల్కొండ వ్యాపారి బ్రాహ్మణులు. వైష్ణవ మతావలంబులైన ఆచార్యులు. ప్రపత్తి ప్రవరుణులు. ఊరట్ల జమీందారులైన సాగి వారి ఆస్థానం పండితులైన వారి వంశంలో తాత, రామాచార్యుల గారి కుమారుడు రఘునాథ దాసు వీరి తండ్రి గారు. అనకాపల్లి 1862లో జన్మించారు. వీరి మూడవ ఏట తండ్రి ఉద్యోగం కోసం విజయనగరం చేరారు.

తపో నిష్ఠతో సర్వం స్వాధీనం

ఆచార్యులవారు తండ్రి వద్దనే పంచకావ్యాలను చదువుకొన్నారు. విజయనగరం మహారాజా వారి హైస్కూల్‌లో విద్యనార్జించి 1877లో మెట్రిక్ పాసైనారు. కూరెళ్ళ సూర్యనారాయణ శాస్త్రిగారి వద్ద “కౌముది”, “కాశికా వృత్తి”, “తర్క ప్రకరణలు” అభ్యసించారు. సంస్కృత భాషలో గొప్ప పాండిత్యాన్ని సాధించారు. కాలేజీలో గుమాస్తాగా ఉద్యోగించారు. రమణాచార్యులు నిత్య తపో నిష్ఠాపరులు. దీనితో వారికి అలవడని విద్య లేకుండా పోయింది. అన్నిటా అసాధారణ మేధస్సు అలవడింది.

విద్వత్ శిరోమణి ముడుంబై నరసింహాచార్యుల గారి శిష్యులై, వేదాంత విద్యనూ, వారి తమ్ముడు వరాహ స్వామి వద్ద “ద్రావిడ ఆమ్నాయం” నేర్చారు. 1891లో రాజావారి కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయులుగా చేరి 1935 వరకు నలభై అయిదేళ్ళ సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆంగ్ల భాషా పాండిత్యమూ ఉండటంతో ఆచార్యులవారు తులనాత్మక భాషా శాస్త్రంను (కంపారటివ్ ఫైలాలజి), సంస్కృత భాషా శాస్త్రాన్ని అధ్యయనం చేసి అపార విద్వత్తు సాధించుకొన్నారు. వీటిని

బోధించటంలో వీరి నేర్పు అమోఘంగా ఉండేదని ప్రశంసలు పొందారు.

చతుర్భాషా కవితాచార్యం

ఆచార్యులవారి ఆంధ్ర భాషా వైదుష్యమం చిన్ననాటి నుండే అలవడింది. విద్వత్ కవి అయిన మహారాజా వారి ఆస్థానంలో ఉండటం బాగా కలిసి వచ్చింది. రాజావారు "సతతము సంతస మొసంగు సత్య వ్రతికిన్" అనే మకుటం ఇచ్చి ఆస్థాన కవులను శతకం రాయమని కోరారు. వాటిలో ఆచార్యుల వారు రాసిన "సత్యవతీ శతకం" ఉత్కృష్ట కావ్యంగా ఎన్నికై మంచి కీర్తిని తెచ్చి పెట్టింది. ఆచార్యుల వారి తొలి రచనే ఇది. దీనికి ప్రశస్తి రావటం ముదావహమైన విషయం.

"నమ్మాళ్వార్ల గాథా సహస్రమైన "తిరుమొళి"ని పద్యాలుగా ఆంధ్రీకరణం చేసి తన ఉభయ భాషా పటిమను నిరూపించుకొన్నారు. ఈ పద్యాలకే "ఆంధ్రా గీర్వాణ శట కోప సహస్రం" పేరుతో సంస్కృత శ్లోకాలు రాసి ప్రచురించారు. "దేవ వ్రత చరిత్ర" ఆంధ్ర కావ్యాన్ని ప్రౌఢ ప్రబంధ శైలిలో రచించి విద్వత్తును ప్రకటించారు. "నాలాయిరం" అనే నాలుగు వేల ద్రావిడ భాషా గాథలను తెలుగు పద్యాలుగా మలచారు.

పార్ధసారధి శతకం, శ్రీకృష్ణ చరిత్ర, "గద్య" "ఆంధ్ర సేతు బంధ మహాకావ్యం", "ఆంధ్ర హర్ష చరిత్ర" గద్యం రాశారు. అన్నిటికన్నా బాగా అందరినీ ఆకర్షించినది ఆచార్యుల వారు ఆంగ్ల మహాకవి షేక్స్పియర్ రాసిన చారిత్రాత్మకమైన అద్భుత నాటకాల కథలను సంస్కృతంలో రచించటం. ఎవరూ చేబట్టని గొప్ప ప్రక్రియ. ఇవి కాక తెలుగులో "ప్రాకృత భాషోత్పత్తి", "నిఘంటు చరిత్ర", "పాండురంగ మహాత్మ్య విమర్శనం", "ఆర్ష భాగా విభాగం", "అలంకార శాస్త్ర చరిత్ర" అనే అపూర్వ గ్రంధాలను రచించి భాషా శాస్త్రంలో తనకున్న పట్టును నిరూపించుకొన్నారు. ముప్ఫై రెండు ఉపనిషత్ విద్యలకు తెలుగులో విస్పష్ట విపుల వ్యాఖ్యానం రాసి చరితార్థులయ్యారు ఆచార్యులవారు. జీవితాంతం గ్రంధ పఠనం, గ్రంధ రచనలతోనే కాలక్షేపం చేసిన మహా విద్వద్ వరేణ్యులు శ్రీ మేడేపల్లి వెంకట రమణాచార్యుల వారు ఎనభై ఒక్క సంవత్సరాలు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించి 1943లో వేంకట రమణ ధామం చేరుకొన్నారు.

112. క్రోడ పత్ర రచయిత - గుమ్మలూరి సంగమేశ్వర శాస్త్రి (1863 ad)

ఏదైనా ఒక శాస్త్రం మీద రాసిన సంగ్రహ విమర్శను "క్రోడ పత్రం" అంటారు. గుమ్మలూరి సంగమేశ్వర శాస్త్రిగారు రాసిన క్రోడ పత్రాలు నేటికీ తర్క శాస్త్రాధ్యయనం చేసేవారికి కరదీపికలుగా నిలిచాయి. అంతటి ధిషణ శాస్త్రిగారిది. తర్కాన్ని తక్రం (మజ్జిగ) తాగినట్లు అలవోకగా నేర్చి నేర్పిన విదేషీమణి.

జననం - విద్య

శాస్త్రిగారు బొబ్బిలి తాలూకా గంగన్నపాడు గ్రామంలో గుమ్మలూరి లక్ష్మీనారాయణ, వెంకమాంబ దంపతులకు 1863లో జన్మించారు. బొబ్బిలి ఆస్థాన పండితులైన మండపాక పార్వతీశ్వర కవి వద్ద సంస్కృత కావ్యాధ్యయనం చేశారు. సుసర్ల సీతారామ శాస్త్రిగారి దగ్గర తర్క శాస్త్రం చదువుకొన్నారు. శ్రీపాద రామశాస్త్రిగారి నుండి న్యాయ శాస్త్రాన్ని మథించారు. ఇప్పటికే వీరి కీర్తి చంద్రికలు దశదిశలా వ్యాపించాయి.

నేర్చుకోవాలన్న తపన మాత్రం శాస్త్రిగారిని వదిలి పెట్టలేదు. విజయనగరం చేరి భీమాచార్యులవ వారి వద్ద, కాశీ వెళ్లి ప్రఖ్యాత పండితుల వద్ద తాను నేర్చిన పాండిత్యానికి మెరుగులు దిద్దుకొన్నారు. స్వగ్రామం చేరారు. అప్పటికే శాస్త్రిగారి బహుముఖీన ప్రజ్ఞ లోకంలో విశదమై దాదాపు ఎనభై మంది శిష్యులుగా చేరి విద్య నేర్చారు. వీరందరికీ గురుకుల వాసంలో వసతి, భోజనాలు కల్పించి విద్యాబోధనా చేయాలి. అప్పుడే పశ్చిమ గోదావరి జిల్లా కాకర పర్రు గ్రామస్తులు శాస్త్రిగారిని శిష్య సమేతంగా తమ గ్రామం వచ్చి ఉండమని విన్నవించుకొన్నారు. వారి అభ్యర్ధన మేరకు అక్కడికి చేరుకొన్నారు. మూడున్నర ఏళ్ళు గ్రామస్తులిచ్చిన సహకారంతో కాకరపర్రులోనే ఉండి శిష్యులకు విద్యాదానం చేశారు.

ఉద్యోగ వ్యాసంగం

1898లో విజయనగరం మహారాజా ఆనంద గజపతిగారు శాస్త్రిగారిని ఆహ్వానించి తమ సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా నియమించి గౌరవించారు. శాస్త్రిగారి శాస్త్ర వాదనా పటిమ ముందు యెంత కొమ్ములు తిరిగిన పండితులైనా బోల్తా కొట్టాల్సిందే. అంత ఉద్దండ పండితులు సంగమేశ్వర శాస్త్రిగారు. 1921లో మధ్వ స్వామి 'నైయాయిక మహా సభ" నిర్వహించారు. శాస్త్రిగారు పాల్గొని, తన నిరుపమాన వాదనా సామర్థ్యంతో అందరినీ చకితులను చేసి మధ్వస్వామి వారి మెప్పు పొంది ఘనంగా సత్కరింపబడ్డారు. నవద్వీపం వెళ్లి అక్కడి తర్క శాస్త్ర మేధావులను మెప్పించి మురిపించి ప్రశంసా పత్రాలను అందుకొన్నారు.

పాశ్చాత్య ప్రశంస

భారతీయ పండితులే కాదు పాశ్చాత్య పండితులు కూడా శాస్త్రిగారి వాదనా నైపుణ్యానికి అబ్బురపడేవారు. వారి వైదుష్యానికి జోహార్లు పలికారు. అలాంటి వారిలో "జాన్సన్ అనే జర్మనీ పండితుడు" శాస్త్రిగారి శాస్త్ర సామర్థ్యానికి ముగ్ధుడై ఆయన వద్ద చేరి శాస్త్ర రహస్యాలను ఆకళింపు చేసుకొనేవాడు. దీనితో శాస్త్రిగారి కీర్తి దేశంలోనే కాక విదేశాలలోనూ మారుమోగిపోయింది. పాశ్చాత్యులు మెచ్చి శాస్త్రిగారికి గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేశారు.

క్రోడ పత్ర క్రీడీకరణ

శాస్త్రిగారు పిఠాపురం, ఉర్లాం సంస్థానాలలో తర్క శాస్త్ర పరీక్షాధికారిగా ఉన్నారు. సంగమేశ్వర శాస్త్రిగారి పేరు వినగానే అందరికి వీరి "క్రోడ పత్రాలు" చప్పున జ్ఞాపకానికి వస్తాయి. శాస్త్రిగారు రాసిన "మాధురీ పంచ లక్షణీ క్రోడపత్రాలను" 1933లో మైసూరు ప్రభుత్వం ముద్రించి గౌరవిస్తే, "జగదీశ్వర సిద్ధాంత లక్షణ క్రోడపత్రం"ను ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు ప్రచురించి గౌరవించింది. తర్క శాస్త్రం చదివే మన దేశ పండిత విద్యార్థులకు శాస్త్రిగారి క్రోడపత్రాలు కరదీపికలు. యాభై సంవత్సరాలు మాత్రమే జీవించిన ఈ తర్క న్యాయశాస్త్ర మహా విద్వాంసుడు గుమ్మలూరి సంగమేశ్వర శాస్త్రిగారు 1913లో శివైక్యమయ్యారు. ❀

113. సంస్కృతంలోనే ఉత్తరాలు రాసిన - నాగపూడి కుప్పుసామయ్య (1864 ad)

1864లో తమిళనాడులోని తిరుత్తనిలో కుప్పుసామయ్యగారు జన్మించారు. అసలు పేరు రామకృష్ణ శర్మ. మద్రాస్‌లో చదివారు, తిరుపతిలో న్యాయవాదిగా ఉండి, ఇక్కడే స్థిరపడ్డారు. సంస్కృతాంధ్రాలలో గొప్ప పండితులనిపించుకొన్నారు. రెండు భాషల్లో కవిత్వం చెప్పి అనేకమైన గ్రంథ రచన చేసిన సవ్యసాచి.

శత ఘంటం వెంకట రంగశాస్త్రిగారు మహావిద్వాంసుల శిష్యుడై సంస్కృతం అభ్యసించారు. వట్టిపల్లి నర కంఠీరవ శాస్త్రి, వేదం వెంకటరాయ శాస్త్రి, జనమంచి శేషాద్రి శర్మ వంటి ఆనాటి ప్రసిద్ధులు వీరికి ప్రాణ స్నేహితులు. వీరి విద్వత్తును గుర్తించి ప్రభుత్వం తిరుపతి సంస్కృత కళాశాల పాలక మండలిలో సభ్యులనుగా నియమించి గౌరవించి వీరి అమూల్య సేవలను అందుకొన్నది.

నైష్టిక జీవనం వినమ్రత, రుజువర్తనం వీరికి సహజ భూషణాలు. వీటికి శిష్యులు ఆకర్షింపబడి ఆరాధించారు. పారిజాతాపహరణం అనే నంది తిమ్మన ప్రబంధానికి ఎవరూ వ్యాఖ్యానం రచించనందున వీరు చక్కని "పరిమళోల్లాస వ్యాఖ్యానం" బహు సుందరంగా సులభ శైలిలో 1929లో రాసి ప్రచురించి ఆ లోటును తీర్చారు. సంస్కృతాంధ్రాలలో వీరు రచించిన కృతులు అనేకం ఉన్నాయి. అయితే చాలా భాగం అముద్రితాలే కావటం మన దురదృష్టం. మిత్రులకు శిష్యులకు కుప్పు సామయ్యగారు రాసే ఉత్తరాలలో ఎక్కువగా సంస్కృతమే రాసేవారు. అప్పుడప్పుడు తెలుగు పద్యాలతోనే ఉత్తరాలు రాసేవారు. సంస్కృతంలో రాసిన కావ్యాలనన్నిటిని కావ్య సంపుటంగా చేసి "సప్త రత్నావళి" పేరిట 1927లో ముద్రించారు. ఇందులో పదిహేడు లఘుకావ్యాలున్నాయి. పారిజాతాపహరణం వ్యాఖ్యానంలో తన పుట్టుపూర్వోత్తరాలను పేర్కొన్నారు. నాగపూడి గ్రామంలో జన్మించానని, భారద్వాజస గోత్రమని, సామగద్రాహ్యాన సూత్రీకులమని, యజ్ఞేశ్వరార్య పుత్రుడినని కుప్పుస్వామి పండితుడనని, రాజుకొన్నాడు. డెబ్బై ఏడేళ్ళు జీవించి ఈ మహా పండిత కవి 1941లో పరమపదించారు. ❀

114. బహుగ్రంథ పరిష్కర్త, బహుభాషా కోవిదులు - మానవల్లి రామకృష్ణ కవి (1866 ad)

బాల్యం - విద్యాభ్యాసం - ఉద్యోగ జీవితం

మానవల్లి రామకృష్ణ కవిగారు మద్రాస్‌లోని నుంగంబాకంలో వైదిక బ్రాహ్మణ కుటుంబంలో 1866లో జన్మించారు. తండ్రి రామశాస్త్రి. తండ్రి, తాతగారు అష్టాదశ భాషా ప్రవీణులు. తండ్రి నాట్యశాస్త్ర వ్యాఖ్యాత. కవిగారు చెన్నైలో బి.ఏ పాసై సంస్కృతంలో ఎం.ఏ చేశారు. మద్రాస్ చింతాద్రి పేట మిడిల్ స్కూల్, క్రిస్టియన్ కాలేజి హైస్కూల్‌లో, పచ్చయప్ప కళాశాల ఉన్నత పాఠశాలలో అధ్యాపకులుగా పనిచేశారు. ఆరు భాషలో పాండిత్యం సాధించటం వలన వీరిని "కవిగారు" అని సంబోధిస్తారు మర్యాదగా.

తర్వాత కవిగారు వనపర్తి సంస్థానంలో గ్రంథ ప్రచురణ కార్య నిర్వాహకులుగా పదేళ్ళు పనిచేశారు. పిమ్మట మద్రాస్ ప్రాచ్య లిఖిత భాండాగారం ప్రాచీన తాళపత్ర గ్రంధ సంపాదన శాఖకు అధ్యక్షులుగా ఆరేళ్ళు సేవలందించారు. మద్రాస్ ప్రభుత్వ విద్యాశాఖలో చేరి, రాజమండ్రి ప్రభుత్వ కళేజిలో అధ్యాపకులుగా కొంతకాలం ఉన్నారు. అనంతరం తిరుపతి దేవస్థాన విద్యాశాఖాధికారిగా 1935 వరకు కొనసాగారు. మద్రాస్ విశ్వవిద్యాలయ చరిత్ర శాఖలో మెకంజీ రికార్డుల పరిశోధనాలయంలో ఆరు సంవత్సరాలు ఉన్నారు. దశాబ్ద కాలం తిరుపతి పరిశోధనాలయ సంస్కృత శాఖలో రీడర్‌గా ఉండి కొంతకాలం డైరెక్టర్ పదవినీ

చేబట్టారు.

ప్రాచీన గ్రంథ సేకరణ – పరిశీలన – ముద్రణ

ద్రావిడ, కన్నడ, ప్రాచ్య, మళయాళాది భాషలలో గొప్ప పాండిత్యం పొందారు. ప్రాచీన, సంస్కృత, ఆంధ్ర సాహిత్య మన్నా, ఆ భాషా చరిత్ర విమర్శా పరిశీలనం అన్నా కవి గారికి పరమ ప్రీతి. ప్రాచీన గ్రంథ సంపాదన కోసం పరిశీలన కోసం ఎంతో స్వంత ధనాన్ని వెచ్చించిన సాహితీ ప్రియులు. ప్రాచీన గ్రంథ పరిశీలన, సంస్కరణలలో శబ్దార్థ స్వరూప నిర్ణయంలో వీరి ప్రజ్ఞ సునిశితమై అనితర సాధ్యమైనది. సంస్కృతాంధ్రాలలో సరస సహజ సుందరంగా కవిత్వం చెప్పే నేర్పు కవిగారిది. బహు శాస్త్రాలలో వీరి ప్రవేశం, పాండిత్యం మహా విశేషమైనవి. సౌజన్యం, సహృదయత కవిగారికి సహజాతాలు. వనపర్తిలో ఉండగా "విస్తృతి కవులు" శీర్షికతో అనేక ప్రాచీన గ్రంధాలను సంస్కరించి ప్రచురించారు. వీటిలో నన్నేచోడుని కుమార సంభవం, వల్లభ రాయని క్రీడాభిరామం, మడికి సింగన సకల నీతిసారం, బద్దె భూపాలుని నీతిశాస్త్ర ముక్తావళి, భైరవి కవి రాసిన శ్రీరంగ మహాత్మ్యం, ప్రబంధ మణిభూషణం, వేంకటేశ ఉదాహరణం, ఆంధ్ర తిరువాయ్ ఉన్నాయి. కవిగారు "దక్షిణ భారత సంస్కృత గ్రంధమాల" అనే సంస్థను స్థాపించి అతి ప్రాచీన సంస్కృత గ్రంధాలను పరిశీలించి ముద్రించారు. ముద్రించిన వాటిలో దండి రచించిన "అవంతి సుందరి కథ", "చతురర్భాణీ అంటే శూద్రకుని పద్మ ప్రాభృతకం, ఈశ్వర దత్తుని "ధూర్తవిట సంవాదం", వరరుచి రాసిన "ఉభయాభిసారిక", శ్యామలకుని "పాద తాడితం" అనే భాణ చతుష్టయం, భోజుని "శృంగార ప్రకాశం", దిజ్ఞాగుని "కుందమాల నాటకం", విజ్ఞిక రాసిన "కౌముదీ మహోత్సవ నాటకం", వత్సరాజ చరితం ఇంత శ్రద్ధగా ప్రాచీన గ్రంధాలను సేకరించి పరిష్కరించి పరిశీలించి ముద్రించారు రామకృష్ణ కవిగారు. సాహిత్య లోకం వారికి ఎంతో రుణపడి ఉంది.

కవిగారి రచనా పాటవం

కవిగారు కొన్ని స్వతంత్ర కావ్యాలు రచించారు. అందులో "మృగవతి రసవత్కావ్యం", "వసంత విలాసం" కళా పూర్ణోదయాన్ని పోలిన తొమ్మిది ఆశ్వాసాల

ఉత్తమ కావ్యాం అముద్రితం. "పాటలీపుత్రకం" అనేది మరొక పద్య కావ్యం. "కళింగ సేన", "మాలతీ మాధవం" అనేది ప్రకరణాలు. భరతుని నాట్యశాస్త్రాన్ని అభినవ గుప్తాచార్యుల వ్యాఖ్యానంతో పరిష్కరించి గైక్వాడ్ ఓరిఎంటల్ గ్రంథ మాలలో మూడు భాగాలుగా ప్రచురించారు. ఇంకో భాగం అముద్రిలంగానే ఉండిపోయింది. ఇది కవిగారి నాట్యశాస్త్ర జ్ఞానానికి, సర్వంకష ప్రజ్ఞకు ఉదాహరణ. అలాగే "భారత కోశం" అనే మరో అపూర్వ గ్రంథంలో నాట్యశాస్త్ర సంబంధాలైన పదాలన్నిటినీ అర్థ వివరణతో, లక్షణ ఉదాహరణలతో అకారాదిక్రమంగా కూర్చారు. జ్ఞాన వయో వృద్ధులైన కవిగారు రాసిన ఈ గ్రంథాన్ని తిరుపతి దేవస్థానం ప్రాచ్య పరిశోధనాలయం ముద్రించి గౌరవించింది. కవిగారు భాస నాటకాలను కొన్నిటిని అనువదించారు. ఇవికాక ఇంకా చాలా గ్రంథాలను రాశారు. కవిగారు సేకరించి సంస్కరించిన అనేక సంస్కృత గ్రంథాలెన్నో ఇంకా అముద్రితాలుగానే ఉండిపోవటం బాధాకరం. ఇంత సరస్వతీ సేవ చేసిన కవిగారికి లక్ష్మీ ప్రసన్నం మాత్రం కాలేదు. ఇది లోకంలో సహజమే కదా. జీవిత చరమాంకంలో ఈ పండిత కవి ఆర్థిక బాధలను ఎదుర్కొన్నారు. ప్రభుత్వం అందజేసిన ఉపకార వేతనంతో జీవించాల్సివచ్చింది పాపం. రామకృష్ణ కవిగారు పూనుకొని ఉండకపోతే అమూల్య ప్రాచీన గ్రంథాలు వెలుగు చూసి ఉండేవికాదు. తొంభై ఒక్క ఏళ్ళు జీవించిన ఈ సాహిత్యోప జీవి మానవల్లి రామకృష్ణ కవిగారు 21-9-1957లో మరణించి సరస్వతీ సాయుజ్యం పొందారు.❁

115. గురువులకు గురువు, సర్వ శాస్త్రవేత్త - శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రి (1867 ad)

గురువులకు గురువు

దాదాపు అరవై డెబ్భై ఏళ్ళ క్రితం ఏ సంస్కృత పండితుని అడిగినా తాను తాతా సుబ్బరాయ శాస్త్రిగారి శిష్యుడినని కాలర్ సారీ ఖండువా ఎగరేసి చెప్పేవారు. అంతటి విఖ్యాతి వారిది. విజయనగరానికి సమీపంలో ఒంటి తాడి అగ్రహారంలో 25-1-1867న తాతా సూర్యనారాయణావధాని, సోమి దేవమ్మ దంపతులకు సుబ్బరాయ శాస్త్రిగారు జన్మించారు. కొడుకును శాస్త్ర పండితుడిని చేయాలనే బలీయమైన కోరిక ఉన్న వీరి తల్లిగారు కొడుకును చంకన ఎత్తుకొని దాదాపు రెండు కిలో మీటర్లు నడిచి విజయనగరంలో గురువుగారి వద్ద దింపి వచ్చేది. అంత పట్టుదల చూపింది ఆ మహా ఇల్లాలు కుమారుని విద్యకోసం. ఆ శ్రమ ఊరికే పోలేదు. ఫలించింది. తల్లి ఋణం తీర్చుకొన్నారు శాస్త్రిగారు. పెరిగి పెద్దవారైన శాస్త్రిగారు విజయనగరంలో బులుసు సుబ్రహ్మణ్య శాస్త్రిగారి వద్ద చేరి సంస్కృత సాహిత్యం అభ్యసించి ప్రావీణ్యం సాధించారు. శాస్త్రిగారిది పాదరసం లాంటి చురుకైన బుద్ధి. మేధావిగా పరిగణన చెందారు. వీరి శ్రద్ధాసక్తులు, వినయం, మేధావి తనం కర్ణాకర్ణిగా విన్న రుద్రాభట్ల రామశాస్త్రి లక్ష్మణ శాస్త్రి సోదరులు సుబ్బరాయ శాస్త్రిగారిని ఆహ్వానించి, చేరదీసి, వ్యాకరణ అలంకార శాస్త్రాలు నేర్పి అసామాన్య పండితునిగా తీర్చిదిద్దారు. గొప్ప శిష్యుని కోసం వెదికిన ఆ గురు సోదరులు ధన్యులు. వారు నేర్పిన విద్య నేర్చి ఈ

శిష్యుడూ గురూణం తీర్చుకొన్నారు.

బహు శాస్త్ర పరిజ్ఞానం

ధర్మశాస్త్రం నేర్వాలన్న కోరిక కలిగి గుమ్మలూరు సంగమేశ్వర శాస్త్రిగారి శిష్యులై ఆసాంతం అభ్యసించారు. కొల్లూరు కామశాస్త్రి గారిని చేరి వేదాంతం అంతం చూశారు. సంగీతం మీద మోజు కలిగి కట్టు సూర్యనారాయణ గారి వద్ద సంగీత గుట్టు మట్టులన్నీ గ్రహించారు. ఇలా శాస్త్రిగారి బహుశాస్త్ర పరిజ్ఞానం దేశమంతా వ్యాపించి గొప్ప గుర్తింపు నిచ్చింది. ఆంధ్రదేశంలో ఏ శాస్త్రంలో ఏ రకమైన సందేహాలు వచ్చినా చివరికి వీరి దగ్గరకు రావాలిసిందే. వీరి తీర్పే తుది తీర్పు. శిరోధార్యమూ అయింది. అంతటి నిష్పాక్షపాతంగా శాస్త్రబద్ధంగా ధర్మ, న్యాయ బద్ధంగా వ్యవహరించేవారు. గంభీర హృదయులు. తొట్రు పాటు లేని ప్రశాంత మూర్తి శాస్త్రిగారు.

సుదీర్ఘ విద్యాదానం - అరుదైన రికార్డు

ఆనాటి మేటి పండితులలో సుబ్బారాయ శాస్త్రిగారు నాగరికులు అనిపించుకొన్నారు. లౌకిక జ్ఞానంలోనూ అసాధారణ ప్రజ్ఞ ఉండేది. వీటి వలననే విజయనగర పురపాలక సంఘంలోను, సహకార సంఘంలోను సభ్యులై స్థానిక సంస్థలలో ప్రధాన సభ్యులుగా అనేక మార్లు ఎన్నుకో బడ్డారు. అంతటి విశేషమైన మూర్తిత్వం వారిది. విజయనగరం రాజావారి సంస్కృత కళాశాలలో శాస్త్రిగారు నలభై ఏళ్ళు సుదీర్ఘ కాలం ప్రధానాచార్యులుగా పనిచేసి శాస్త్రాధ్యాపనం చేశారు. ఒక రకంగా ఇదొక రికార్డే.

గ్రంథ రచనలో మేటి

భారత దేశంలో ఉత్తమ వ్యాకరణ గ్రంథంగా పరిగణింపబడుతున్న నాగేశ భట్టు రచించిన “శబ్దేందు శేఖరం”ను ఉత్తర దేశ పండితులు ఖండించటం మొదలుపెట్టే గ్రంథాలు కూడా రాశారు. శాస్త్రిగారు వారి వాదాలనన్నిటిని గడ్డిపోచల్లాగా తేలిగ్గా తీసి పారేసి, ఖండనలకు ప్రతిఖండనలు చేసి నాగేశభట్ట హృదయాన్ని ఆవిష్కరిస్తూ “గురు ప్రసాదం” అనే మహా ఉద్గ్రంథం రాసి, నోరు

మూయించారు. ఈ గ్రంథాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవంగా ముద్రించింది, లోకానికి అందించింది. దీనితో మారుమూల ప్రాంతాల వారికి కూడా శాస్త్రిగారి పాండితీ గరిమ తెలిసి శిష్యులై విద్య నేర్చుకొన్నారు. అంతటి ప్రభావం చూపింది. ఆ గురుప్రసాద శిష్యుల పాలిటి వరమే అయింది. శాస్త్రిగారు ఈ గ్రంధాన్ని "స్వర సంధి" వరకు రాశారు. శిష్యులు పేరి వెంకటేశ్వర శాస్త్రి "గురు ప్రసాద శేషం" పేరిట "కారకాంతం" వరకు రాసి పూర్తి చేశారు. అంతటి గొప్ప శిష్యులను తయారు చేశారు తాతా వారు. శాస్త్రిగారి అమోఘ పాండిత్యానికి వారసులుగా వీరు ఉన్నారు అనటానికి ఇది ఒక ప్రత్యక్ష సాక్షం. దీనినీ ఆంధ్రా యూనివర్సిటీయే ముద్రించింది. సుబ్బరాయ శాస్త్రిగారు హరిశాస్త్రి రాసిన "శబ్ద రత్న" వ్యాఖ్యను పరిశీలించి టీకా రాసి పరిష్కరిస్తే ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ప్రచురించింది.

పురస్కార గౌరవ రికార్డ్

1912లో "మహా మహోపాధ్యాయ" బిరుదం శాస్త్రిగారిని వరించింది. ఆ బిరుదు పొందిన మొట్ట మొదటి వ్యక్తి తాతా సుబ్బరాయ శాస్త్రిగారే. ఇదీ ఒక రికార్డే. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ ఇండియా వచ్చినప్పుడు శాస్త్రిగారిని సగౌరవంగా మద్రాస్‌కు ఆహ్వానించి, తన పేరు చెక్కబడిన "సువర్ణ కంకణాన్ని" స్వయంగా శాస్త్రిగారి చేతికి తొడిగి అలంకరించాడు. ఇది ఒక భారతీయ అందునా ఆంధ్ర దేశానికి చెందిన శాస్త్ర పండితునికి లభించిన అరుదైన గౌరవం. ఇది మూడవ రికార్డు. విజయనగరంలోనే కాక ఉర్లాం, పిఠాపురం సంస్థాన పండిత పరీక్షలకు శాస్త్రిగారు ఎప్పుడూ ప్రధాన పరీక్షకులుగా ఉండేవారు. ఇంతటి శాస్త్ర పండితునికి సంఘ సంస్కరణపై మిక్కిలి అభిమానం ఉండటం ఆ రోజుల్లో ఆశ్చర్యపడే విషయం. దురాచారాలను కాలాన్ని బట్టి మార్చుకొని సంస్కరించుకొని శాస్త్ర సమ్మతాలైన వానిని అనుసరించాలని ఎప్పుడూ ప్రబోధించేవారు. మహాత్ముని ఖద్దరు వస్త్ర ధారణా, వీరిపై ప్రభావం చూపింది. నిత్యం సన్నని పొందూరు ఖద్దరు వస్త్రాలే జీవితాంతం ధరించేవారు.

శాస్త్ర వాద తీర్పరి

ఆంధ్ర సాహిత్య పరిషత్తు సమావేశానికి ఒకసారి అధ్యక్ష స్థానంలో ఉండి

ఆంధ్ర భాష ఔన్నత్యం కోసం మార్గ నిర్దేశం చేస్తూ చేసిన ప్రసంగం మహోపన్యాసం అనిపించింది. రాజమండ్రి శ్రోత్రియ మహాసభ, విశాఖ జ్యోతిశ్శాస్త్ర సభలలో పండితులు చేసిన చర్చోప చర్యలకు శాస్త్రిగారినే ఉభయ పక్షాల వారు “తీర్పరిగా” ఉండమని వేడుకోవటం, శాస్త్రిగారి సర్వతోముఖ ప్రతిభకు, నిష్పాక్షికతకు నిలువెత్తు నిదర్శనం. శాస్త్రిగారు కాశీ, దర్భంగా, పుదుక్కోట వగైరా సంస్థానాలను దర్శించి శాస్త్ర చర్చలు జరిపి పండితులను ఓడించి గెలిచి “జయ పత్రాలు” అందుకొన్నారు. శాస్త్ర వాదాలలో అగ్రగణ్యులని గుర్తింపు పొందిన కాశీ పండితుడైన “జయ దేవ మిశ్ర” పండితుడు సుబ్బరాయ శాస్త్రిగారి పేరు విన్నంతనే, “అమాంతం” రెండు చేతులు జోడించి నమస్కరించేవారట. అంతటి మహోన్నత పండితులు మన సుబ్బారాయ శాస్త్రిగారు. సుబ్రహ్మణ్యం పేరులోనే ఉంది ఆ ధిషణ. శాస్త్రిగారి 63వ జన్మ దినోత్సవం నాడు శిష్య, ప్రశిష్య బృంతం ఆత్మీయ పండిత సాహితీ బృంతం అందరూ కలిసి మహా వైభవంగా గురు పూజోత్సవం జరిపి కృతజ్ఞతలు తెలియజేసుకొని ఘనంగా సన్మానించి గౌరవించి చిరకీర్తిని ఆర్జించారు.

మహా మహోపాధ్యాయ, గుగ్గురువులు శ్రీ తాతా సుబ్బరాయ శాస్త్రిగారు 77 సంవత్సరాలు శాస్త్ర సింహులుగా, ఓటమి ఎరుగని పండితులుగా, బహు గ్రంధకర్తగా జీవించి 1944లో కీర్తి శేషులయ్యారు. ❀

116. అవధూత - శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర యతి (1868 ad)

ఆతుర సన్యాసం

ఎన్నో సంస్కృత గ్రంధాలు రచించిన సదాశివ బ్రహ్మేంద్ర యతి తమిళదేశంలో జన్మించారు. కాలం పద్దెనిమిదవ శతాబ్దంగా భావిస్తున్నారు. జన్మ నామం శివరామ కృష్ణుడు. కావేరీ తీరంలో "తిరు విశవల్లూరు" అనే షాహాజీ పురంలో జన్మించారు. తండ్రి మోక్షం సోమసుందరం అవధాని, గురుకుల విద్యాభ్యాసంలో విద్య నేర్చారు. అప్పటికే వివాహమైంది. భార్య పుష్పవతి అయిందన్న వార్త గురుకులంలో ఉండగా మామగారు వార్త పంపారు. గుర్వాజ్ఞతో ఆఘమేఘాల మీద మామగారింటికి చేరుకొన్నారు. కాని అక్కడ ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. నడిచి అంత దూరం వెళ్ళటంతో విపరీతమైన బడలిక కలిగి ఆకలి కూడా విజృంభించింది. ఎవరికీ అల్లుడిగారి అతీ గతీ పట్టలేదు. ఎవరి పనుల్లో వారు ఉండిపోయారు. ఇది అవమానంగా, బాధగా అనిపించింది. అంతే - శివరామ కృష్ణకు ఆ క్షణంలో సంసారంపై తీవ్ర విరక్తి కలిగింది. వెంటనే సన్యసించాడు. తురీయాశ్రమ నామమే "సదాశివ బ్రహ్మేంద్రుడు". ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది అంటారు కాని ఒక సంఘటనే ఆయన జీవితాన్ని మలుపు తిప్పేసింది. సంసార జంఝాటం నుంచి తప్పించింది.

కంచి వారి శిష్యరికం - యోగ సిద్ధి సాధన

ఆనాటి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీ పరమ శివేంద్ర సరస్వతి సన్నిధిని చేరి శిష్యులైపోయారు సదాశివ బ్రహ్మేంద్రులు. వారి వద్దనే విజ్ఞాన గ్రంథాలన్నీ క్షుణ్ణంగా అభ్యసించారు. నిత్యాభ్యాసం పూర్వ జన్మ సంస్కారం, స్వంత మేధస్సులతో అనేక యోగ శక్తులను స్వాధీనం చేసుకొన్నారు. పరిపూర్ణ సిద్ధులు అనిపించుకొన్నారు.

భాగవత జడ భరతుని లాగ అవధూతగా మారిపోయారు. గురువుగారి దగ్గరకు వచ్చిన శాస్త్ర వాదులను ఎదుర్కొని గురువుగారి తరఫున తానే వాదించి గురు విజయం చేకూర్చేవారు. ఈ విషయాన్ని అసూయా గ్రస్త శిష్యులు గురువుగారికి "మోశారు". గురువుగారు తెలుసుకొని శిష్యుడినే మందలించి అలాంటి పని చేయవద్దన్నారు. ఆ రోజు నుండి నిరంతర మౌనమే వ్రతంగా గడిపారు.

మహిమా విభూతి

సదాశివుని మహత్తులు చాలా ప్రచారంలో ఉన్నాయి. ఒకసారి ఒక పొలంలో చేయి తలకింద దిండుగా పెట్టుకొని పడుకొంటే ఒక రైతు వచ్చి సర్వ సంగ పరిత్యాగికి దిండు కావాల్సి వచ్చిందా అని ఎద్దేవా చేశాడట. తన యోగశక్తి రైతుకు చూపించాలన్న తపనతో చెయ్యి లేకుండానే గాలిలో తేలి పడుకొన్నారు. అదే రైతు మళ్ళీ వచ్చి ఒక్కొక్కడికి యోగి అయినా అహంకారం వదలలేదు అన్నాడట. అప్పుడు అర్ధమయింది తన అహంకారానికి అంతం చేయటానిక రైతు వేషంలో వచ్చినవాడు సాక్షాత్తు భగవంతుడే అని గ్రహించారు. ఏది దొరికితే అది తింటూ ఎక్కడ చోటు దొరికితే అక్కడే ఉంటూ పరమహంసలా, అవధూతలాగా సంచరించారు. శిష్యుడు పొందిన ఉన్నత యోగ స్థితిని గుర్తించి తాను ఆ ఉన్నత దశను అందుకోలేకపోయానని బాధపడేవారట. పుదుక్కోట రాజు తొండరమాన్‌కు దక్షిణామూర్తి మంత్రోపదేశం చేసినట్లు కనపడుతోంది. తంజావూర్‌లో వున్ననల్లూర్ మరియమ్మ, దేవదాన పట్టిలో కామాక్షీ దేవాలయం, తంజావూరులో నాలుకాల్ మండపంలో వెంకటేశ్వర దేవాలయంలో హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠించటానికి

ప్రోత్సహించారు. కుంభకోణంలో తిరు రాఘవేంద్ర రాహు స్థలంలో వెంకటేశ్వర దేవాలయంలో మహా మహిమాన్విత గణపతి యంత్రాన్ని ప్రతిష్టించి అక్కడ గణపతిని ప్రతిష్ట చేసి దేవాలయం కట్టించారు.

బ్రహ్మేంద్ర యతి సాహిత్య వైభవం

జీవిత చరమాంకంలో అవధూతగారు "నేరూరు"లో ఉండిపోయారు. తాను మిథున మాసంలో శుద్ధ దశమి రోజున ముక్తి పొందుతానని, ఆ రోజే కాశీ నుండి ఒక బ్రాహ్మణుడు "బాణ లింగాన్ని" తెస్తాడని, దాన్ని తమ సమాధిపై ప్రతిష్టించమని శిష్యులకు ముందే చెప్పారు. వారు అన్నట్లే ఖచ్చితంగా జరిగింది. ప్రతి ఏడాది ఆ తిథినాడు బ్రహ్మాండమైన ఉత్సవం నిర్వహిస్తారు.

సదాశివేంద్ర యతి రచించిన పుస్తకాలు అనేకం ఉన్నాయి. బ్రహ్మ సూత్రాలపై "తత్వ ప్రకాశిక" వ్యాఖ్యానం, "యోగ సుధాకరం" అని పతంజలి సూత్రాలకు వ్యాఖ్యానం, "సిద్ధాంత వల్లి", "కేసరవల్లి" అనే రెండు గ్రంథాలను అప్పయ్య దీక్షితుల సిద్ధాంతాలకు సంగ్రహ రూపాలుగా రాశారు. "నవ మణి మాల", "ఆత్మాను సంధానం", స్వప్నోదితం", "స్వానుభూతి ప్రకాశిక", "ఆత్మవిద్యా విలాసం" రాశారు. ఇవి కాక ద్వాదశోపషత్తులపై వ్యాఖ్యానాలు రచించారు. పురాణాలలో ఉన్న అపూర్వ అద్వైత వేదాంత విశేషాలను సేకరించి గ్రంథస్తం చేశారు. హాయిగా తేలికగా భజన రూపంలో అద్వైత వేదాంతాన్ని పాడుకొనే పాటలుగానూ రాశారు. ❁

117. ఖచర మణి పేటికర్త, సకల శాస్త్రాభిజ్ఞ - అలుకూరు గోల్లాపిన్ని మల్లికార్జున శాస్త్రి (1871 ad)

అలుకూరు మల్లికార్జున శాస్త్రి పాత నిజాం రాష్ట్రం రాయచూరు మండలం అలుకూరు గ్రామంలో వెంకటరామ శాస్త్రులు, సుబ్బమాంబ దంపతులకు 1871లో జన్మించారు. వీరిది గోల్లాపిన్ని వంశం. భారద్వాజస గోత్రీకులు. ఆపస్థంభ సూత్రం. వీరి వంశపు వారంతా దిగ్గజాలైన సంస్కృతాంధ్ర కవి పండితులే, శాస్త్ర నిధులే. ఏడు తరాలకు పూర్వం వీరి వంశంలో మోటప్ప అనే ఆయనకు “పల్లెలాంబ” అనే గ్రామదేవత ప్రత్యక్షమై బంగారు, పలకా బలపం ఇచ్చి ఆ వంశంలో ఏడు తరాల వరక అందరూ పండితులే అవుతారని దీవించిందిట. శాస్త్రిగారి భార్య సుబ్బమాంబ. అత్తాకోడళ్ళది ఒకే పేరు అవటం విశేషం.

బాల విద్యా కిశోరి

నాలుగవ ఏట వీధిబడికి పంపించారు. ఆరోజు సాయంత్రమే ఉపాధ్యాయుడు ఈ బాలుడిని వెంట బెట్టుకొని ఇంటికి వచ్చి తండ్రిగారితో తనకు వచ్చిన విద్యనంతా ఒక్క రోజులోనే ఆ బాలుడు నేర్చేసేడని, ఇక తానూ బోధించటానికి ఏమీలేదని చెప్పి అప్పగించాడు. అంతటి బాలమేధావి శాస్త్రిగారు. తండ్రి వెంకట రామశాస్త్రులుగారి దగ్గరే నాటకాంతక సాహిత్యం, తత్వ బోధినీ వ్యాఖ్యాన సహితంగా కౌముదిని, న్యాయ వేదాంత శాస్త్రాలను అధ్యయనం చేశారు. తండ్రిగారి వెంట గద్వాల, వనపర్తి, ఆత్మకూరు సంస్థానాలను బాల్యంలోనే దర్శించి తన విద్యా వైదుష్యాన్ని ప్రదర్శించి పండిత బృందంచే మెప్పు పొంది “భారతీ బాల

లీలా రూపుడు" అనే బిరుదు పొందారు.

సకల శాస్త్రాభిజ్ఞులు

తండ్రిగారి మరణం తర్వాత గడేహోతూరు వెంకట రామశాస్త్రులుగారి వద్ద శిష్యరికం చేసి జ్యోతిష శాస్త్రాన్ని నేర్చుకొన్నారు. కాళహస్తి చేరి విక్రాల రాఘవాచార్యుల అంతేవాసి అయి మహాభాష్యంత వ్యాకరణం, ముహూర్త జాతక సిద్ధాంత స్కంద త్రయ జ్యోతిష శాస్త్రాలలో సర్వ ప్రధములుగా ఉత్తీర్ణులైనారు. గురువు రాఘవాచార్యులవారు "కన్ను స్వామి" అనే మారుపేరుతో "Indian Ephimeries" రాశారు. గురువుగారి అనుమతితో కలియుగం దశ సహస్ర వర్షాల (పదివేల సంవత్సరాలు)కు సరిపడా తిథి, వార, నక్షత్ర, యోగ, కరుణ, ఘటికా, విఘటికల ప్రమాణాన్ని అతివేగంగా అత్యంత సులభంగా బోధించే మహాగ్రంథ రాజం "ఖచర మణి పేటి" అనే బృహత్తర పంచాంగం రచించి జ్యోతిషంలో కొత్త దారి చూపారు. గురు ఆశీస్సులతో కాళహస్తి దేవాలయంలో నిష్టగా కూర్చుని "శని వర్గు" గుణిస్తుంటే శనీశ్వరుడు ప్రత్యక్షమైనాడు. ఈ గ్రంథాన్ని గురుదేవులకు అంకితమిచ్చి తన గురుభక్తిని చాటుకొన్నారు. శాస్త్రిగారి తమ్ముడు రామశాస్త్రిగారు గొప్ప సూర్యోపాసకులు. సూర్యోదయం నుండి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు సూర్యుని తదేకంగా చూస్తూ ధ్యానమగ్నులై ఉండేవారు. మన శాస్త్రిగారి లాగానే ఆయనా త్రికాలజ్ఞాని.

స్వగ్రామం ఆలూరుకు తిరిగి వచ్చి తాతగారైన సుబ్బాశాస్త్రుల వారివద్ద సమగ్ర వేదాంత శాస్త్రం నేర్చుకొని ఇరవైవ ఏట విద్యా వ్యాసంగాన్ని ముగించారు. ఇంత పిన్న వయసులో ఇన్ని విద్యలు నేర్వటం, అన్నిటా ప్రతిభ చూపటం శాస్త్రిగారి ప్రత్యేకత. బళ్ళారి, కడప వగైరా సంస్థానాలు పర్యటించి శతావధానాలతో మెప్పించి సన్మానాలు పొందారు. గద్వాల, వనపర్తి, ఆత్మకూరు సంస్థానాలలో తన పాండిత్య ప్రదర్శనతో ఆకర్షించి గౌరవ సత్కారాలందుకొన్నారు.

బిరుదులు - సన్మానాలు

కవి సార్వభౌమ, సకల శాస్త్రాభిజ్ఞ బిరుదులూ వీరి కవితా ప్రాగల్భ్యానికి సకల శాస్త్ర పారంగత్వానికి పొందారు. శాస్త్రిగారు "వాసుదేవానంద" అనే అలంకార

శాస్త్ర గ్రంథం రచించారు. కాని ఇది ముద్రితం కాలేదు. కాని ఇది చిత్ర, విచిత్ర కవితా భాండారం. ఇందులో అమితాశ్చర్యపరచేది “సహస్ర దళ పద్మబంధం”. 1008 దళ పద్మంలో అనేక శ్లోకాలు నిక్షిప్తమైన అపూర్వ సృష్టి. అయిదు వందల శ్లోకాలతో పదహారు ప్రకరణాలతో ఉన్న అపూర్వ గ్రంథం ఇది. ఇందులో ఉన్న నూరు శ్లోకాలతోనే గ్రంథం ప్రచురింపబడింది. దీనిని నలభై రోజుల్లో శాస్త్రిగారు రాశారంటే అమితాశ్చర్యం వేస్తుంది. వివిధ ఛందస్సులతో “పురుషోత్తమ శతకం” రాశారు. ధర్మ శాస్త్ర రత్నాకరమూ రాశారు. పతంజలి భాష్యార్థం అనే గొప్ప రచనా చేశారు.

దీర్ఘ సత్ర యాగం

శాస్త్రిగారు 15-1-1906 తమ స్వగ్రామం అలుకూరులో ఒక ఏడాది పాటు “దీర్ఘ బ్రహ్మ సత్ర యాగం” నిర్వహించారు. వందలాది పండితులు, రాజులు, మంత్రులు, ధనవంతులు, వేలాది మంది పేదలకు కుల, మత భేదం లేకుండా అన్న సంతర్పణ జరిగింది. అందరిని సత్కరించి పంపిన రాత్రి శ్రీ విరూపాక్ష స్వామి కలలో కన్పించి “అవబ్రుధ స్నానం” కాశీలో చేయమని ఆజ్ఞాపించాడు. బంధుజనంతో కాశీ వెళ్లి ఆ కార్యక్రమం సంతృప్తిగా నిర్వహించి ప్రయాగ, గయాది క్షేత్ర సందర్శనం చేసి ఇంటికి తిరిగి వచ్చారు.

జగద్గురువుల ఆశీః ప్రశంస

“జ్యోతిష శాస్త్ర సుధర్మ సారం” అనే మరో గ్రంధాన్నీ రాశారు. ఆది శంకరాచార్యుల వారి జన్మస్థలమైన కర్నాటక దేశంలోని “కాలడి” గ్రామంలో శృంగేరీ పీఠాధిపతులు శ్రీ నృసింహ భారతీ తీర్థ స్వాములవారు శంకరాచార్యుల విగ్రహ ప్రతిష్ఠ చేసినప్పుడు జరిగిన పండిత సభలో శాస్త్రిగారు తాను రచించిన “జ్యోతిష శాస్త్ర సుధర్మసార” గ్రంధాన్ని మహా స్వాములకు అంకితమిచ్చారు. ఆ సభలో జగద్గురువులు ఆ గ్రంధంలో నుండి 2000 సంవత్సరంలో స్వామివారు అడిగిన తిథికి పంచాంగ గణన చేయమని సభాసదులను కోరారు. చాలామంది చెప్పలేమని చేతులెత్తేశారు. కొందరు కనీసం మూడు గంటల వ్యవధి కావాలన్నారు. అప్పుడు మల్లికార్జున శాస్త్రిగారు ఇరవై నిమిషాలలో గణన చేసి స్వామివారితో

సహా అందరినీ ఆశ్చర్యపరచారు. వీరి విద్వత్తును అభినందించి జగద్గురువులు "పండిత సార్వభౌమ" బిరుద ప్రదానం చేసి సత్కరించారు. అప్పుడు జగద్గురువులు "ఉపాధి భేదం చేత మీరు అక్కడ. మేము ఇక్కడ. మీరే మేము. మేమే మీరు" అని ప్రశంసించారు.

శాస్త్రిగారి మహిమలు

గద్వాల రాజురాంభూపాల్ మరణించగా సంస్థానం పదేళ్లు "కోర్ట్ ఆఫ్ వార్డ్స్"లో ఉంది. అప్పుడు వారసుడైన సీతారాం మల్లికార్జునుని శరణు వేడాడు. ఈయన ఒకే ఏడాది గడువు పెట్టి, హంపీ విరూపాక్షునికి "అగ్ని స్తోమ, కోటి బిలార్చన చేయ సంకల్పించి అందరి సహకారంతో ఆ పని పూర్తి చేశారు గడువు లోపలే సీతారాంకు. గద్వాల రాజ్యం దక్కింది.

ఒకసారి యవ్వనంలో శాస్త్రిగారు ఎండలో నడిచి వస్తున్నప్పుడు ఒక రైతు వర్షాల్లేక కరువు బారిన పడి జనం అల్లాడిపోతున్నారని కనికరించమని వేడుకొన్నాడు. "పెద్ద వర్షం వస్తుంది. ఇంటికి పో" అన్నారు శాస్త్రి. అంతే. కుండపోతగా వర్షం కురిసింది. ఇంకోసారి స్వగ్రామం బయట ఏటి ఇసుకలో ధ్యాన నిష్ఠలో ఉండగా విపరీతంగా వర్షం కురిసి ఇసుకలో శాస్త్రిగారు కూరుకుపోయారు. కొన్ని రోజుల తర్వాత,ఆ వాగు ఎండిపోయింది. నీటికోసం చలమలుపించి మంచి తవ్వుతుంటే శాస్త్రిగారు పద్మాసనంలో అలానే చలించకుండా ఆశ్చర్యపరిచారు. ఒకసారి ఏదైనా మహిమ చూడమని అడిగితే ఒక శివాలయంలో నాలుగు స్తంభాల మధ్య శివుడికి ఎదురుగుండా కూర్చొని కనులు మూసుకొని ఒక్కసారిగా శరీరాన్ని గాలిలోకి లేపి, ఆ స్తంభాల మధ్య చుట్టూ వేగంగా గిరగిరా తిరిగి, మళ్ళీ కిందికి దిగి శివుని ధ్యానించారు.

మరోసారి మల్లేశ్వరాలయంలో బావమరిది దోనే కంటి రామయ్య భాగవతంలో "పురంజనో పాఖ్యానం" చదువుతుంటే శాస్త్రిగారు ఆధ్యాత్మ పరంగా వ్యాఖ్యానం చేస్తున్నారు. పూర్తవగానే రామయ్య "అంతేనా బావా?" అన్నాడు. శాస్త్రిగారు "అంతేరా" అన్నారు. వెంటనే లేచి భుజంపై ఖండువా దులిపి మళ్ళీ భుజం మీద వేసుకొని అదే పోత పోయాడు. తల్లీ, శాస్త్రి భార్య మొత్తుకొన్నా

వెనుతిరిగి చూడలేదు. "వాడిక రాడులే అంతే" అని వారికి సమాధానం చెప్పారు శాస్త్రి. అంటే ఆత్మబోధ అయిందన్న మాట బావమరిదికి.

శాస్త్రిగారి లీల ఇంకోటి. గద్వాలరాజు మూడురోజుల పండిత గోష్టిలో ఉండగా ఒక రోజు నిజాం ప్రభువు తాను రాయచూరు వస్తున్నానని తనను అక్కడ కలుసుకోమని రాజుకు ఫర్మాని పంపాడు. ఏమి చేయాలో తోచక శాస్త్రిగారిని అడిగాడు రాజు. కంగారేమీ పడక్కరలేదని నిజాం రాదనీ రేపే ఆ విషయం తెలుస్తుందని చెప్పాడు. ఇరకాటంలో పడ్డాడు రాజు. అనుకొన్నట్లే నవాదు వాడీ వరకు వచ్చేసరికి కడుపునొప్పి ఎక్కువై హైదరాబాద్ తిరిగి వెళ్లిపొయ్యినట్లు మర్నాడు వార్త వచ్చింది. అంతటి వస్యవాక్కు శాస్త్రిగారిది.

1917లో అలుకూరు గ్రామంలో ప్లేగు వ్యాధి విపరీతంగా వ్యాపించింది. పుష్కరిణి నీళ్ళను మల్లికార్జునగారు శాస్త్రి "అష్ట దిగ్బంధం" చేసి నీళ్ళు తిరగద్దని చెప్పారు. "మరికా దేవి" ప్రత్యక్షమై అంత కఠోర నియమం పనికిరాదనీ అది తనకే నష్టం అనీ చెప్పింది. తానొక్కడే ఆ ఊర్లో ఉండిపోయి, అందరినీ ధర్మవరానికి పంపేసి తుంగభద్ర ఒడ్డున రామాపురంలో ఒంటరిగా ఉండిపోయారు. ప్లేగు సోకింది. కుండపోతగా వర్షం కురుస్తోంది. సహాయానికి కూడా రాలేని పరిస్థితి. వైద్య సాయం అందలేదు. 5-9-1917 నాడు చనిపోయారు. ధర్మవరంలో ఉన్న అల్లుడు రామశాస్త్రి, టెలిగ్రాం చేసి వచ్చాడు. అప్పటికే ఆలస్యమైంది. ఊళ్ళోవారే దహనం చేశారు. చితాభస్మం వర్షానికి కొట్టుకుపోయి, ఆయన తాలూకు ఏ ఆనవాలూ లేకుండా పోయింది. నలభై ఆరేళ్ళ వయసులో చనిపోయిన మహాజ్ఞాని, కవి, పండిత సార్వభౌములు అలుకూరు గొల్లాపిన్ని మల్లికార్జున శాస్త్రిగారు. ❁

118. ఆంధ్ర ఆస్థాన కవి - శ్రీ కాశీ కృష్ణాచార్యుల వారు (1872 ad)

బందరు జననం - గుంటూరు నివాసం

1872లో శ్రీ కాశీ కృష్ణాచార్యుల వారు కృష్ణాజిల్లా మచిలీపట్నంలో జన్మించారు. భరద్వాజస గోత్రీకులు. తండ్రి లక్ష్మణాచార్యులు, తల్లి అక్కి పిచ్చమాంబ. గుంటూరులోని శ్రీరామ చంద్రాపురం అగ్రహారం వారైన శ్రీకాశీ కృష్ణమాంబ, వేద వ్యాస దంపతులు కృష్ణాచార్యుల వారిని దత్తత తీసుకొన్నారు.

బహుముఖీన పాండిత్యం

గుంటూరులో అధరాపురపు శ్రీనివాసాచార్యుల వద్ద సాహిత్యాధ్యనం చేశారు. తరువాత నడిచి విజయనగరం చేరి మహిశూర భీమాచార్యుల దగ్గర తర్కాన్ని అభ్యసించారు. పేరి వెంకటశాస్త్రిగారి నుండి పాణినీయ వ్యారణం నేర్చారు. అక్కడ నుండి గోదావరీ తీరం చేరి కాకరపర్తి నివాసి గుమ్ములూరి సంగమేశ్వర శాస్త్రిగారి దగ్గర తర్క శాస్త్రానికి మెరుగులు దిద్దుకొని, ఆనాటి మహామహులైన తార్కిక శిరోమణులతో సరి సమాన పాండిత్యాన్ని పొందారు. వేదాంత శాస్త్ర అంతాన్ని చూశారు. సంగీతంలో ప్రవేశించి నిధి అనిపించుకొన్నారు. వీణా వేణు, వాయులీన, మృదంగ, జంత్ర వాద్యాలలో నిష్ణాతుడయ్యారు. ఇవే కాక కుమ్మరి, కమ్మరి, నేత, వడ్రంగం పనులలోను అధిక ప్రావీణ్యం సాధించి తనకు రాని విద్య లేనేలేదు అనిపించారు. విజయనగరంలో సకల కళా ప్రపూర్ణులు అయ్యారు.

వివాహ - సంతానం - ఉద్యోగం

కృష్ణాచార్యుల వారికి పదకొండేళ్ళ వయసులోనే శ్రీమతి కుంభారి లక్ష్మీ నరసాంబతో వివాహం జరిగింది. ఒక కుమారుడు ముగ్గురు కుమార్తెలకు

జన్మనిచ్చారు. గుంటూరు టౌన్ హైస్కూల్, గుడివాడ హైస్కూల్‌లో దాదాపు పదేళ్ళు సంస్కృత, ఆంధ్ర అధ్యాపకులుగా ఈ "పుంభావ సరస్వతి" పనిచేశారు.

కృష్ణాచార్యీయం

పదేళ్ళ వయసులోనే కృష్ణాచార్యుల వారు పద్య రచన చేశారు. పందొమ్మిదవ ఏట మొదటి అవధానాన్ని గుంటూరులో చేశారు. తర్వాత వారి అవధాన ప్రక్రియ నిర్వక్ర పరాక్రమంతో జైత్రయాత్రలా సాగింది. 1-12-1911న బందరులో శతావధానం చేసి దేశం నలుమూలల నుంచి ప్రశంసా వర్షాన్ని అందుకొన్నారు. ప్రతిభను నిరూపించుకొన్నారు. పలుచోట్ల అవధానాలు చేసి అవధాన కీర్తిని దశదిశలా చాటారు. వినుకొండ, అనపర్తి, గద్వాల, ఆత్మకూరు, వెంకట గిరి, నూజివీడు, పిఠాపురం, విజయనగరం మొదలైన సంస్థానాలలో శతావధానాలు చేసి, ఆశు కవితలు చెప్పి మెప్పించి శెభాష్ అనిపించి సంస్థానాధీశుల చేత ఘన సన్మానాలను అందుకొన్నారు. అవధాన సరస్వతిని ఊరూరా ఊరేగించిన అవధాన సరస్వతి శ్రీకృష్ణాచార్యులవారు.

కృష్ణాచార్యులవారు జీవితాన్ని గీర్వాణ భాషా ప్రచారానికే అంకితం చేశారు. దీనికోసం "మాతృభాషా సమాజం" అనే సంస్థను స్థాపించి కృషి చేశారు. విద్యార్థులు తేలికగా సంస్కృతం నేర్చుకోవటానికి మూడు భాగాలుగా "బాల బోధినులు" రాశారు. "క్రియాదర్శం", "సంవాదం", "వాల్మీకి చరితం", "ఆంధ్ర సంస్కృత నిఘంటువు" అనే గ్రంథాలు రాశారు. ఇవే కాక "గోష్ఠీవన మహాత్మ్యం" (సంస్కృతం, తెలుగులలో) "అవధాన యాత్ర" అనేక మంది దేవీ దేవతలపై అష్టకాలు, దండకాలు, శతకాలు, స్తోత్రాలు ఈ సాహితీ సరస్వతి లేఖిని నుండి జాలువారాయి. ఒకసారి నెల్లూరులో ఒక అరగంటలో "శ్రీరంగ నాయక శతకాన్ని" సంస్కృతంలో ఆశువుగా చెప్పి ఆశ్చర్య చకితులను చేశారు. ఆచార్యులవారు మహావక్త. ధారాళంగా ఎంతసేపైనా అనర్గళంగా ఉపన్యసించే నేర్పున్న వారు.

బిరుదులు - సత్కారాలు

శ్రీకృష్ణాచార్యులవారికి అవధాన శిరోమణి, మహా మహోపాధ్యాయ, విద్యా వారధి, పౌరాణిక రత్న, కళా ప్రపూర్ణ, డి.లిట్ మొదలైన బిరుదులూ గౌరవాలతో

సన్మానాలందుకొన్నారు. ఇవన్నీ వీరి కవితాశక్తికి పాండిత్య ప్రకర్షకు నిదర్శనాలు. వీరి సంస్కృత భాషా సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి చేత 15–8–1960న ఘన సన్మానం చేయించింది. గుంటూరు పురప్రముఖులు ఆచార్యులవారికి 1961 ఫిబ్రవరి 15, 16 తేదీలలో “సంస్కృత సామ్రాజ్య పట్టాభిషిక్తుని”గా చేసి, రత్న, కనక కిరీటాలతో అలంకరించి అపూర్వ వైభవంతో నభూతో నభవిష్యతి అన్నట్లుగా కలకాలం నిలిచిపోయే ఘనాతి ఘన తర, ఘన తమ సత్కారం చేసి తమ ఆత్మీయతను, ఆప్యాయాన్ని, గౌరవాన్ని, విధేయతను ప్రదర్శించారు.

1962లో కాశీ కృష్ణాచార్యులవారిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ “నడయాడే సరస్వతి”ని “ఆస్థాన కవి”గా నియమించి గౌరవం కల్గించి అద్భుత సత్కారం చేసి తన బాధ్యతను నెరవేర్చుకొన్నది. 1963లో నేను రాజమండ్రి ప్రభుత్వ ట్రెయినింగ్ కాలేజిలో బి.ఇ.డి. చేస్తుండగా మా కాలేజి సాంస్కృతిక వారోత్సవాలలో పాల్గొనటానికి “ఈ వృద్ధ తాపసి” 91 ఏట వచ్చారు. సభపై అంతస్తులో జరుగుతోంది. వారు మెట్లు ఎక్కి పైకి రాలేరని ఒక కుర్చీలో వారిని కూర్చోబెట్టి నేనూ మిగిలిన మిత్రులం కలిసి మా చేతులతో వారిని నెమ్మదిగా మెట్ల మీద నుంచి సభా వేదికకు మోసుకొంటూ చేర్చాం. ఆ సాహిత్య సంగీత సరస్వతిని స్పృశించి, పైకి మోసుకొని వెళ్ళే మహద్భాగ్యం నాకు కలిగిందని మహానందం పొందాను. అలాగే మళ్ళీ కిందికి దించి తీసుకొచ్చి పాదాలపై ప్రణమిల్లాం. వారు సంస్కృతంలోనే మాట్లాడారు. అతి సరళమైన భాషలో. అందరికి అర్థమయ్యింది. వారు ఇతరులతోనూ సంస్కృతంలోనే మాట్లాడేవారని చెప్పుకోగా విన్నాను. అవసరం వస్తే తప్ప అంతా సంస్కృతంలోనే సంభాషించేవారట. అంతటి దీక్ష వారిది. వారి బాల బోధినులు చదివి ఎందరో సంస్కృతం అభ్యసించారు వారు. ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసేవారు. ప్రతి పట్టణంలోను పరీక్షా కేంద్రాలు ఉండేవి. సంస్కృత భాషా వ్యాప్తికోసం తన జవ సత్వాలను ధారపోసిన ఈ అపర సరస్వతి శ్రీ కాశీ కృష్ణాచార్యుల వారు 96వ ఏట 1967 బ్రహ్మైక్యం చెందారు.❀

119. సంస్కృత హరికథలు రాసిన - బంకుపల్లి మల్లయ్య శాస్త్రి (1876 ad)

బాల్యం - విద్యాభ్యాసం

ఆరామ ద్రావిడ శాఖకు చెందిన బంకుపల్లి మల్లయ్యశాస్త్రిగారు 1876లో గంగన్న, సూరమ్మ దంపతులకు ఉర్లాం సంస్థానం వారి ఆశ్రమంలో జన్మించారు. భారద్వాజస గోత్రీకులు. బాల్యం ఉర్లాంలోనే గడిచింది. బళ్ళమూడి లక్ష్మణశాస్త్రిగారి దగ్గర కావ్య, నాటక, అలంకార, సాహిత్యాలలో ప్రజ్ఞ సాధించారు. పిమ్మట తుని సంస్థాన పండితులు, షడ్దర్శన ప్రవీణులు మహా మహోపాధ్యాయ పరవస్తు రంగాచార్యుల వద్ద శిష్యులై వ్యాకరణ శాస్త్రం నేర్చారు. ఉర్లాం "శ్రావణి" వారి పరీక్ష రాసి పండిత సత్కారం పొందారు. తర్వాత విజయనగర పండితులు, తర్క వేదాంత పారం ఎరిగిన కూరెళ్ళ పూర్యనారాయణ శాస్త్రిగారి అంతేవాసియై భాష్యాంతం, తర్కం అభ్యసించారు. భార్య చనిపోవటంతో కొంత వైరాగ్య భావన ఏర్పడింది.

సకల కళానిధి

బంకుపల్లి కామశాస్త్రిగారి వద్ద మంత్రం శాస్త్రం నేర్చుకొన్నారు. భువనేశ్వరీ మంత్రం దీక్ష గురువుగారి వద్ద తీసుకొని అనుష్టించి సిద్ధి సాధించారు. 1897లో శ్రీకాకుళం ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా ఉద్యోగించారు. విద్య నేర్పటం కన్నా విద్య నేర్వటం పైన శాస్త్రిగారికి ఆసక్తి మెండుగా ఉండేది. భల్లమూడి దక్షిణామూర్తి శాస్త్రిగారి దగ్గర పంచదశ ప్రకరణం, గీతాభ్యాసం పూర్తి చేశారు. తర్వాత శ్రీ కూర్మం వెళ్లి నౌదూరి వెంకట శాస్త్రిగారి నుండి మనోరమ, పరిభాషేందు శేఖరం మొదలైన శాస్త్ర గ్రంధాధ్యయనం చేశారు. భాష్యాంతము, వ్యాకరణం బోధించే సామర్ధ్యాన్ని పెంపొందించుకొన్నారు.

పర్లాకిమిడి ఉన్నత పాఠశాలలో ఆంధ్ర పండితులుగా రెండేళ్ళు పనిచేసి, రాజావారి అనుగ్రహ పాత్రులై పర్లాకిమిడి సంస్థాన పండితులుగా తర్వాత సంస్కృత

ఉపన్యాసకులుగా నియమింపబడి గౌరవం పొందారు. ఇంతటితో సంతృప్తి చెందితే వారు బంకుమల్లివారు అనిపించుకోరు. చదువుపై మంచి "మంకు పట్టు" ఉండేది బంకుపల్లి వారికి. ఆస్థాన దైవజ్ఞులు నీల మణి పాణిగ్రాహి గారివద్ద జ్యోతిష శాస్త్రం అభ్యసించారు. సూర్య సిద్ధాంతం అనుసరించి దృక్ సిద్ధాంత పంచాంగం గణించే నేర్పు సాధించి పంచాంగ రచన చేశారు. దీనితోనూ ఆగలేదు. గంటి సూర్యనారాయణ గారి దగ్గర వేదాంత, మీమాంసా శాస్త్రాలు చదువుకొన్నారు. ఇంతటితోనూ ఆగలేదు. గిడుగు రామమూర్తిగారి వద్ద ఆంగ్ల భాషాజ్ఞానమూ పొందారు. అయినా వీరి విజ్ఞాన తృష్ణ తీరలేదు. పోకల సింహాచలంగారి వద్ద సంగీతం నేర్చుకొన్నారు. శాస్త్రిగారి లయజ్ఞానం ఆదిభట్ల నారాయణ దాసుగారినే ఆశ్చర్యపరచింది.

నిత్య నేర్వరి

నేర్వటం అనేది శాస్త్రిగారికి ఒక సద్గుణ వ్యసనం అయింది. భారత రామాయణాలను, వసు చరిత్రాది ప్రబంధాలను "పురాణ హరి కథ" పేరుతో నృత్యం, గీతం, తాళ, లయబద్ధంగా పాడి ఆంధ్రదేశంలో పల్లె పట్టణం అనే తేడా లేకుండా తిరిగి పాడి ప్రదర్శించి పండిత పామర రంజనం చేశారు. పర్లాకిమిడి రాజావారు స్థాపించిన "నాటక సంఘం" సభ్యులై సంస్కృతాంధ్ర నాటకాలలో పాత్రధారులై రసజ్ఞుల మన్ననలు అందుకొని నటనలోను తన కళా విశ్వరూపాన్ని ప్రదర్శించారు. శాస్త్రిగారు సకల కళా వల్లభులనిపించుకున్నారు. ఇంతటి ఉపజ్ఞ ఇన్ని విషయాలలో ప్రదర్శించినవారు దాదాపు లేనేలేరని ఘంటా పథంగా చెప్పవచ్చు.

ఆచరణ సంస్కర్త

సనాతన ధర్మానురక్తులైన శాస్త్రిగారు గొప్ప సంస్కారవంతులు. ధర్మశాస్త్రాన్ని మదించిన వీరు రజస్వలానంతర వివాహం, హరిజనోద్యమం, విధవా పునర్వివాహం శాస్త్ర సమ్మతాలేనని పండిత సభలలో వాదోపవాదాలు చేసి దక్షిణ దేశమంతా ప్రచారం చేసి ఆధునిక భావాలకు అండగా నిలిచారు. పండితులతో చర్చించారు. వారిని మెప్పించారు, ఒప్పించారు. వివాహ తత్త్వం, అస్పృశ్యత అనే గ్రంథాలు తెలుగులో రచించి జనసామాన్యానికి ధర్మ రహస్యాలు తెలియజేశారు.

శాస్త్రిగారు అనర్గళంగా, అసాధారణంగా, యుక్తియుక్తంగా, చాతుర్యంగా సంస్కృతాంధ్రాలలో సంభాషించే మహా వక్త కూడా. శాస్త్రిగారు మాటల మనిషి మాత్రమే కాదు చేతల మనిషి కూడా. అదే వారి విశిష్ట వ్యక్తిత్వం. స్త్రీ పునర్వివాహం మొదలైన ఆదర్శాలను ప్రచారం చేయటమే కాదు తన కుమార్తెకు కూతురికి సంస్కరణ వివాహాలు జరిపించిన గొప్ప సంస్కారవంతులు. "అధీతి బోధా చరణ ప్రచారం"తో జీవితాన్ని సార్థకం చేసుకొన్న పుణ్యమూర్తి శాస్త్రిగారు. పండిత దిగ్గజం అని ప్రశింసింపబడ్డారు.

గ్రంథ రచన

కావూరి వినయాశ్రయం వారి ప్రేరణతో విద్యారణ్యుల భాష్యానికి అనుగుణంగా నాలుగు వేదాలను ఆంధ్రీకరించిన అసాధ్య రచయిత. వీటిలో ఋగ్వేదాన్ని ఆశ్రమం వారి ముద్రించారు. వీరివి అముద్రిత గ్రంథాలెన్నో ఉండిపోయాయి. వీటిలో అరవిందుని పురుషోత్తమ తత్త్వం, ఆధారంగా భగవద్గీతపై రాసిన "గీతా రహస్యం" అనే గ్రంధం, సాహిత్య దర్పణానికి ఆంధ్రానువాదం ఉండటం ఆంధ్రులు చేసుకొన్న దురదృష్టమేమో? శాస్త్రిగారు ఎన్నో యక్షగానాలు రాశారు. వాటిలో పర్లాకిమిడి రాజవారికి అంకితమిచ్చిన చైతన్య చరిత్ర, ముద్దాడ వెంకటప్పల నాయనకు అంకితం చేసిన రుక్మిణీ కల్యాణం ముద్రణా భాగ్యానికి నోచుకోవటం మన అదృష్టం. కంస వధ, కృష్ణ జననం, రామకృష్ణ పరమహంస చరిత్ర మొదలైనవి అచ్చు అవ్వాల్సినవి.

సంస్కృత హరికథలు

సంస్కృతంలో సీతా కల్యాణం, జానకీ వహ్ని ప్రవేశం అనే హరికధలు రాసి, చెప్పి "చీకటి సంస్థానాధిపతులచే" "పురాణ వాచస్పతి" బిరుదు పొంది భూరి బహుమతులందుకొన్న పౌరాణిక విద్వాంస కవి శాస్త్రిగారు. భార్యా సమేతంగా కాశీ యాత్ర సంపూర్తి చేసి తిరిగి వస్తూ ఈ విద్వాన్మణి బంకుపల్లి మల్లన్న శాస్త్రిగారు ఖర్గపూర్‌లో అకస్మాత్తుగా డెబ్భైవ ఏట మరణించి తీరని లోటును సంస్కృతాంధ్ర సాహిత్యానికి కలిగించారు.❁

120. న్యాయ భూషణ, న్యాయ స్థాపక - పేరి లక్ష్మీ నారాయణ (1877 ad)

విద్యోపాసన

పశ్చిమ గోదావరి కోనసీమలోని పేరూరు అగ్రహారంలో శ్రీ విద్యోపాసకులైన పేరి అనంత రామావధానులు, వెంకమాంబ దంపతులకు లక్ష్మీ నారాయణ శాస్త్రిగారు 1877లో జననమొందారు. తండ్రిగారే ప్రధమ గురువుగారు. తాతగారైన వేదాధ్యన సంపన్నులు, నిత్యపార్థివ లింగ పూజా దురంధరులు, శ్రీ విద్యోపాసకులైన సుబ్బావదానుల వారు. చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన దురదృష్టివంతులు వీరు. తల్లిగారు అన్నీ అయి పెంచారు. అల్లారు ముద్దుగా పెరిగారు. ఎనిమిదవ ఏట శాస్త్రిగారికి ఉపనయనం చేశారు.

పదహారో ఏడు వచ్చేదాకా నైయాకరణ చూడామణి అయిన మందా చెన్నయ్య శాస్త్రిగారి దగ్గర శిష్యులై సంస్కృత కావ్య నాటక, న్యాయ, వేదాంత, ప్రకరణలను క్షుణ్ణంగా అధ్యాయం చేసి కరతలామలకం చేసుకొన్నారు. దురవ గాహనమైన శాస్త్ర విషయాలను అతి సునాయాసంగా అర్థం చేసుకొని వంట బట్టించుకొన్నారు. తన దిషణా సంపదతో గురువుగారినే ముచ్చట పడేట్లు చేశారు.

విజయనగరం రాజావారి సంస్కృత కళాశాలలో న్యాయశాస్త్ర అధ్యాపకులైన గుమ్మలూరి సంగమేశ్వర శాస్త్రిగారు అనే అపర గౌతముల వద్ద పదేళ్ళు, పిఠాపుర సంస్థాన వైయాయిక సార్వభౌములని పేరొందిన శ్రీపాద లక్ష్మీనరసింహ శాస్త్రిగారి అంతేవాసిగా రెండేళ్ళు మొత్తం పన్నెండేళ్ళు న్యాయ శాస్త్రాన్ని మధించారు.

విద్యా బోధన

తన అసాధారణ వైదుష్యంతో పిఠాపురం, ఉర్లాం మున్నగు సంస్థానాలను సందర్శించి పండితులను ప్రభువులను మెప్పించి గొప్ప సన్మానాలు అందుకొన్నారు. అన్ని శాస్త్ర పరీక్షలలో సర్వోత్తములుగా ఉంటూ అందరికీ చేరువయ్యారు. ఆస్థానంలో న్యాయ వేదాంతాలను అతి సులభ విధానంలో బోధిస్తూ ఎందరో శిష్యులకు విద్య నేర్చి తీర్చి దిద్దారు. దీనితో వీరి కీర్తి చంద్రిక దశ దిశలా వ్యాపించింది.

1902లో విజయగనర సంస్కృత మహా విద్యాలయంలో న్యాయ శాస్త్రాధ్యాపకులుగా పదవీ బాధ్యతలు చేబట్టారు. 1913లో గురువు సంగమేశ్వర శాస్త్రి గారు పదవీ విరమణ చేసిన పిమ్మట లక్ష్మీ నారాయణశాస్త్రి గారు ప్రధాన న్యాయశాస్త్ర పండితులుగా నియమింపబడి సేవలందించారు.

వైదుష్య ప్రదర్శన - బిరుద సత్కారాలు

1924లో రాజాగారి ఆజ్ఞతో రాజస్థాన్‌లోని జయపుర సంస్థానాన్ని దర్శించారు. అక్కడ మహా విద్వత్ సభలో తన ప్రతిభా సామర్థ్యాలను వాదనా పటిమను, ధీశక్తిని ప్రదర్శించి మెప్పించి "న్యాయ భూషణ" బిరుదాన్ని సత్కారాన్ని అందుకొన్నారు. విజయవాడలోని "త్రిలింగ విద్యా పీఠం" వ్యవస్థాపక అధ్యక్షులు ముదిగొండ వెంకట రామశాస్త్రిగారు శాస్త్రిగారిని ఆహ్వానించి శాస్త్ర ప్రదర్శన చేయించి "న్యాయ స్థాపక" గౌరవ బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ గౌరవాన్ని పొందిన ఆంధ్రులలో వీరు అయిదవ వారు. అధీతి బోధనా చరణతో జీవితాన్ని ధన్యం చేసుకొన్నారు. ఆనాటి బ్రిటిష్ ప్రాభుత్వం శాస్త్రిగారికి "మహా మహోపాధ్యాయ" బిరుదును అందజేసి తగిన గౌరవం కలిగించింది. న్యాయ వేదాంతాలనే కాకుండా మంత్రం, జ్యోతిష శాస్త్రాలను అధ్యయనం చేసి అనుష్ఠించిన నైష్ఠికులు శాస్త్రిగారు. వీటిని నిరంతరం శిష్యులకు బోధించేవారు.

రచనా పాటవం

ఒక పట్టాన లొంగని తల పండిన మహా విద్వాంసులకే కొరుకుడు పడని ఉదయనాచార్యుడు రాసిన "కుసుమాంజలి"ని శాస్త్రిగారు అతి సులువుగా, సరళంగా ఆంధ్రీకరించారు. గదాధర భట్టాచార్యుని "హేత్వభాస సామాన్య నిరుక్తి", "నవ్యభిచార సామాన్య నిరుక్తి" అనబడే నవ్యన్యాయశాస్త్ర మహా గ్రంథాలకు "లలిత" అనే సరళ వివరణలు రాసి అందరికి అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల శాస్త్రిగారి అసాధారణ న్యాయశాస్త్ర పాండిత్యం అవగాహన, వ్యుత్పత్తి, అనుసరణలు తెలుస్తున్నాయి. ఇదేగాక మాధవాచార్యుల "సర్వ దర్శన సంగ్రహం"లోని ఎన్నో భాగాలను అనువదించారు. దురదృష్టవశాత్తు ఈ గ్రంథం ముద్రణకు నోచుకోలేదు. డెబ్బై రెండేళ్ళు జీవించిన ఈ న్యాయశాస్త్ర కోవిదులు, న్యాయ భూషణులు పేరి లక్ష్మీ నారాయణ శాస్త్రిగారు 1949లో నారాయణ సన్నిధానం చేరారు. ❀

121. వైయాకరణి - వఝల చిన సీతారామ శాస్త్రి (1878 ad)

వైయాకరణి అని పేరు పొందిన వఝల చిన సీతారామ శాస్త్రిగారు ముఖ లింగేశ్వర వాస్త్రి, వేంకటాంబ దంపతులకు 25-6-1878న జన్మించారు. ఒజ్ఞ (ఉపాధ్యాయుడు) అనే పేరు వఝలగా మారి ఉండచ్చు. వీరి కుటుంబంలో గణిత శాస్త్రాధ్యయనం, ముహూర్త నిర్ణయం, జాతక పరిశీలన మొదటినుంచి ఉన్నాయి. శాస్త్రిగారికి గొప్ప పాండిత్యం ఉపజ్ఞ, బుద్ధి సూక్ష్మత, సూక్ష్మ పరిశీలనా బుద్ధి, బుద్ధి తీక్షణత, వివేచన, విషయ సంగ్రహణం సహజంగా అబ్బిన గొప్ప లక్షణాలు. ఆంధ్ర శబ్ద చింతామణి, వికృతి వివేకంలను తన వ్యాకరణ పరిశోధనకు మూల గ్రంథాలుగా స్వీకరించారు. వీటిని జోడించి "వైయాకరణ, పారిజాతం", "వ్యాకరణ సంహితా సర్వస్వం" అనే రెండు అపూర్వ వ్యాకరణ గ్రంథాలను రచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వఝలవారు భాషా పండితులుగా నియమింపబడ్డారు. విజయనగర సంస్కృత కళాశాల, మద్రాస్, ఆంధ్ర విశ్వవిద్యాలయాలలో బోధనా వృత్తిలో దశాబ్దాల పాటు పనిచేసి భాషాసేవ చేశారు. చిన తాతగారు చిన వెంకట సిద్ధాంతిగారి వద్ద ముహూర్త సిద్ధాంత విభాగాలు, లీలావతి గణితం అభ్యసించారు. మరొక చిన తాతగారి వద్ద సంస్కృత వ్యాకరణ, ధర్మ శాస్త్రాలను నేర్చారు. నడాదూర్ అనంతాల్వార్ దగ్గర తర్క వేదాంతాలను నేర్చుకొన్నారు.

మూల గ్రంథాలలోని కొన్ని సంజ్ఞా పరిచ్ఛేద సూత్రకారికలను కలిపి "వైయాకరణ పారిజాతం" రాశారు. ఇందులో ప్రత్యేకతలు కవి సంశయ విచ్ఛేదనాలననుసరించి ధ్వని శాస్త్రాన్ని వివరణాత్మకంగా శాఖాద్యాదులననుసరించి

లిపి స్వభావాన్ని నిర్ణయించారు. ప్రాచీన శాసనాలలో ఉన్న లేఖన సంప్రదాయాలను పరిశోధించారు. పూర్వ లాక్షణికులు చేసిన రేఫా, శకట రేఫల పరిశోధనలను సమీక్షించారు "సంహితా సర్వస్వం"లో చింతామణి, వికృతి వివేకాలను బాల వ్యాకరణ ప్రణాలికా బద్ధంగా విభజన చేసి, కల్పతరు వ్యాఖ్యను చేర్చి మహాద్భుత బృహద్గ్రంధంగా రచన చేశారు. బాల వ్యాకరణ సంజీవనీ వ్యాఖ్య దీనికి ముఖ్యమైన అనుబంధంగా ఉంది. దీనిలో అనేక లక్షణ గ్రంధాల పరామర్శ ఉంది.

వజ్ఝల వారి నివిత పరిశీలనా దృష్టికి దృష్టాం తాలే – అధర్వ కారికావళి పీఠికలు, బాల సరస్వతీయ పీఠిక, చింతామణి విషయ పరిశోధనలు. వీరి బాల వ్యాకరణ ఉద్యోతం వ్యాకరణ సంహితా సర్వస్వం అని చెప్పవచ్చు. వీరు రాసిన "ద్రావిడ భాషా పరిశీలనం" భాషా పరంగా శాస్త్రిగారి పరిశోధనా తీక్షణ దృష్టికి గీటురాయి. ఇందులో ప్రతిపాదించిన సిద్ధాంత సారమే "ద్రావిడ భాషాసామ్యాలు" అనే ఉత్కృష్ట గ్రంధం. వీరి నిశిత పరిశీలనా నైపుణ్యానికి గొప్ప ఉదాహరణలే – "వసుచరిత్ర విమర్శ", "హరిశ్చంద్ర నలోపాఖ్యాన పీఠిక"లు. ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి 29–5–1964న ఎనభై ఆరవ ఏట పరమపదించారు.❁

122. కళానిధి, విద్యా వాచస్పతి - విక్రాల రామచంద్రా చార్యులు (1879 ad)

బాల మేధావి

కవి పండిత శ్రేష్టులు సకల శాస్త్ర నిధి మహోపన్యాసకులు విక్రాల రామచంద్రాచార్యులుగారు 1879 జూన్ ఆరున ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా కలికివాయి గ్రామంలో జన్మించారు. తండ్రి కళత్తూర్ విక్రాల రాఘవాచార్యులు తల్లి కనకమ్మ. వీరి వంశంలో "కవి వసంతా రామం"గా ప్రసిద్ధులైన విక్రాల వంశ మూల పురుషులు విక్రాల నరసింహాచార్యుల వారు భగవత్ రామానుజులకు ప్రత్యేక శిష్యులు. వారి తర్వాత అరవై నాలుగు పురుషాంతరాలు గడిచిపోయాయి. వంశంలో జన్మించిన వారంతా ప్రసిద్ధ కవి పండితులే అవటం మరో విశేషం.

రామచంద్రాచార్యుల వారు బాల మేధావిగా పరిగణింపబడ్డారు. బాల్యంలోనే అసాధారణ ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించారు. అయిదవ ఏట అక్షరాభ్యాసం జరిగిన ఒక్క రోజులోనే ఒత్తులు గుణింతాలుతో సహా తెలుగు అక్షరాలన్నీ నేర్చేసి అందర్నీ ఆశ్చర్యపరచారు. ఏడవ ఏటనే "లీలావతీ గణిత సార సంగ్రహం" మొదలైనవి ఆపోశన పట్టేశారు. ఒకేఒక్క రోజు రాత్రి పంచాంగ రచనకు అవసరమైన లెక్కలన్నిటినీ గ్రహించేశారు. పదమూడవ ఏట తండ్రిగారి వద్దే షట్ శాస్త్రాలు అభ్యసించి తిరుగులేని పండితులనిపించుకొన్నారు. తర్వాత మేనమామ పర్ణశాల రాఘవాచార్యుల వద్ద సాహిత్య, వ్యాకరణ, తర్క శాస్త్రాలను నేర్చుకొన్నారు. అనంతరం శ్రీ కాళహస్తి వెళ్లి అక్కడ సింగరాజు సూర్యనారాయణ ఉపాధ్యాయుల వారి వద్ద కృష్ణ యజుర్వేదం అధ్యయనం చేశారు. రామదత్తా నంద తీర్థుల వద్ద సిద్ధాంత, జాతక, ముహూర్త, వాస్తు, ప్రశ్న భాగాలు నేర్చుకొన్నారు.

యవ్వన విజయం

పద్దెనిమిదేళ్ళ వయసులో "శూల మేని"లో జరిగిన యాగానికి సదస్య

బాధ్యత వహించి యాగాన్ని నిర్విఘ్నంగా, యధావిధిగా నిర్వహించి మహా మహా వాళ్ళకే సంభ్రమం కలిగించారు. మద్రాస్ వెళ్లి మహాభారత రహస్యాలను, జ్యోతిష్ శాస్త్రాన్ని గూర్చి మహోపన్యాసాలు చేసి అందరిని అలరించి స్వర్ణ సింహ తలాటపు మురుగులు, గడియారం బహుమతులుగా పొందారు.

పూనాలో మొదటి ఓరిఎంటల్ సమావేశం జరిపితే మద్రాస్ నుండి ఆచార్యులవారు ప్రతినిధిగా హాజరై, అక్కడి ప్రముఖ విద్వాంసుల ప్రశంసలను పొందారు. తిరువనంతరపుర విద్వత్ సభలో తలపండిన విద్వాంసులనే తన ఉపన్యాస ఝరితో తల పంకింపజేసి "విద్యారణ్య పంచానన" గౌరవాన్ని, తిరువాన్కూర్ మహారాజావారి ఘన సన్మానాన్ని అందుకొన్నారు.

నడి వయసు సూరీడు

1922 కలకత్తా ఓరియెంటల్ కాన్ఫరెన్స్‌లో సాధికార పూరిత ప్రసంగం చేసి, గవర్నర్ నుండి విశిష్ట సత్కారం పొందారు. నవ ద్వీపంలో విద్వన్మండలిలో ప్రసంగించి, తన సర్వ శాస్త్ర విజ్ఞానం, వక్తృత్వాలకు విశేష ఆదరాన్ని పొంది సర్ ఆశుతోష్ ముఖర్జీ నుండి "విద్యా వాచస్పతి" బిరుదును, మహా గౌరవ ప్రదమైన సత్కారాన్ని అందుకొన్నారు. మరో సభలో "కళానిధి" బిరుదు వరించింది. 1923లో నండూరి గ్రామంలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్ వార్షిక సభ ఆచార్యులవారికి "మహోపాధ్యాయ" గౌరవం కల్పించి కీర్తించింది. చాలా రాజాస్థానాలను సందర్శించి ప్రభువులను మెప్పించి విదా&ంసులను ఆశ్చర్యపరచి అఖండ సన్మానాలందుకొన్నారు.

గీర్వాణ రచనాచార్యం

విక్రాల రామచంద్రాచార్యుల వారు సంస్కృతాంధ్రాలలో మొత్తం 89 గ్రంధాలు రాసి, సాహిత్య రచనలో మేటి అనిపించుకొన్నారు. అందులో ముఖ్యంగా సంస్కృతంలో 16 ఉద్గ్రంధాలు రచించారు. వాటిలో "త్రేతాకాండ మంత్రం భాష్యం", "అపస్తంభాది షట్ శాఖా నిరూపణం", "అనువాక నిర్ణయం" ఉన్నాయి. ఇవికాక గీర్వాణ భాషలో రాసిన "అబ్దనామ నిర్వచనం", "సంఖ్యాను శాసనం", "జ్యోతిర్దశా నిర్ణయం", "మానాంతర బోధం" మొదలైన జ్యోతిష్ శాస్త్ర సంబంధమైన

పద్నాలుగు గ్రంథాలున్నాయి. మానాంతర బోధనం అనే వీరి జ్యోతిష్ శాస్త్ర ఉద్గ్రంథం. ఇంగ్లీష్‌లోకి "ది డేట్ కాల్క్యులేటర్" పేరు మీద అనువాదం పొంది విశ్వవ్యాపితంగా కీర్తి చంద్రికలను వెలయించింది.

ఆచార్య ఆంధ్ర రచనోత్సవం

ఆచార్య శ్రీ తెలుగులో 40 గ్రంథాలు రాశారు. అందులో "కల్ప సూత్రసంగ్రహం", "దివ్య దేశమార్గ బోధిని", "వేదాంతపు జడ్జిమెంట్", "వర్ధిష్ణుహితోపదేశం" రెండు భాగాలలో "రామజాతకం", "స్త్రీ పునర్వివాహ శాస్త్రీయతా నిరూపణం" మొదలైనవి ఉన్నాయి.

రాజకీయాచార్యకం

విక్రాలవారు రాజకీయ ప్రవేశం చేసి, అక్కడా తమ అవక్ర పరాక్రమం చూపి, సాహిత్య సేవతో బాటు సంఘ సేవలోనూ పునీతులయ్యారు. 1904లో ఒంగోలు తాలూకా బోర్డు సభ్యులుగా నియమితులై రాజకీయ అరంగేట్రం చేశారు. పిమ్మట తొమ్మిదేళ్ళు నెల్లూరుజిల్లా బోర్డు సభ్యులుగా సేవలందించారు. 1911లో "దక్షిణ భారత సంస్థ"లో సభ్యులయ్యారు. 1912లో మద్రాస్ పచ్చయప్ప కాలేజి ప్రెసిడెంట్‌గా ఇతోధికంగా విద్యా సేవ చేసే అవకాశం పొంది సంతృప్తిగా విద్యాసేవ చేశారు. తన స్వంత గ్రామం కలికివాయిలో ఇంట్లోనే "సరస్వతీ పుస్తక భాండాగారం" సమకూర్చుకొని వాణీమాత నిత్యసేవలో జీవితాన్ని ధన్యం చేసుకొన్నారు. సుమారు అర్ధ శతాబ్ది కాలం మాత్రమే అంటే యాభై మూడేళ్ళు మాత్రమే జీవించిన ఈ కళానిధి మహోపాధ్యాయ, విద్యా వాచస్పతి శ్రీ విక్రాల రామచంద్రాచార్యుల వారు 7-4-1932 గీర్వాణ లోకం చేరారు.❀

123. భారతీయ గణితశాస్త్రాన్ని కొత్త మలుపు త్రిప్పిన జగద్గురు - శ్రీ భారతీ కృష్ణ తీర్ధజీ మహారాజ్ (1884 ad)

జననం - విద్యాభ్యాసం

వెంకట రమణ అనే పేరుతో 1884లో జన్మించిన భారతీ కృష్ణ స్వామీజీ తండ్రి నరసింహ శాస్త్రి మద్రసాక రాష్ట్రంలోని తిన్నెవెళ్లిలో తహసీల్దార్‌గా పంచేశారు. పదోన్నతి పొంది డిప్యూటీ కలెక్టర్‌గా రిటైర్ అయ్యారు. తిన్నెవల్లి తిరుచిరాపల్లిలోనే వెంకట రమణ కాలేజి విద్యాభ్యాసం పూర్తి చేశారు. 1899లో మద్రాస్ యూనివర్సిటీ నుండి మెట్రిక్ పరీక్ష సర్వ ప్రధములుగా పాసైనారు. వీరి సంస్కృతా పరిజ్ఞానాన్ని వక్తృత్వ పాటవాన్ని గుర్తించిన మద్రాస్ సంస్కృత సంస్థ "సరస్వతి" బిరుదును అందించి గౌరవించి సత్కరించింది.

వెంకట రమణ శ్రీవేదం వెంకటరాయ శాస్త్రిగారి వద్ద సంస్కృతం అధ్యయనం చేశారు. తర్వాత బి.ఏ సర్వ ప్రధములుగా పాసై, బొంబాయిలో "అమెరికన్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్" నిర్వహించిన ఎం.ఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఇరవై ఏళ్ళ వయసులో 1904లో మరికొన్ని సబ్జెక్టులు సంస్కృతం, తత్వ శాస్త్రం, ఇంగ్లీష్, గణితం చరిత్రలలో ఎం.ఏ పరీక్ష రాసి అన్నిటా సర్వ ప్రధములుగా ఉత్తీర్ణులయ్యారు. తత్వ శాస్త్రం, సనాతన ధర్మం, సామాజిక శాస్త్రం, చరిత్ర, రాజనీతి శాస్త్రం, సాహిత్యం మొదలైన పలు విషయాలపై వెంకట రమణ రాసిన వ్యాసాలను చదివి ఆయన అవగాహనా పటిమకు అబ్బురపడి W.T.Stead పండితుడు "రివ్యూ ఆఫ్ రివ్యూస్"లో 1905లో ప్రచురించాడు.

ఉద్యోగం - యోగ సాధన

1905లో గోపాలకృష్ణ గోఖలే మార్గదర్శకత్వంలో వెంకట రమణ జాతీయ విద్యా ఉద్యమంలో పాల్గొన్నారు. ఆడి నుండి ఆధ్యాత్మిక విద్యలో ఆసక్తి ఉన్న వెంకట రమణ 1908లో శృంగేరీ పీఠాధిపతి జగద్గురు శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతీ స్వామిని వారిని సందర్శించారు. తర్వాత రాజమండ్రి జాతీయ కళాశాలకు మొట్టమొదటి ప్రిన్సిపాల్‌గా నియమింపబడి 1911 వరకు పనిచేశారు. పదవికి రాజీనామా చేసి శృంగేరీ పీఠం చేరి జగద్గురువుల వద్ద వేదాంత విద్యనూ అభ్యసిస్తూ అరణ్య వాసం చేస్తూ, యోగ సాధనలో ఎనిమిదేళ్ళు గడిపారు.

పీఠాధిపతిత్వం

పూనా, బొంబాయి, అలమనేరు మొదలైన చోట్ల “శంకర దర్శనం”పై ధారావాహిక మహోపన్యాసాలు చేశారు. 1919 జూలై నాలుగున వారణాసి శారదా పీఠంలో జగద్గురువులు స్వామి త్రివిక్రమ తీర్థజీ మహారాజా గారి వద్ద సన్యాస దీక్ష గ్రహించి “స్వామి శ్రీభారతీ కృష్ణతీర్థ జీ మహారాజా”గా ప్రసిద్ధి పొందారు. 1921లో శారదా పీఠాన్ని అధిష్టించారు. వెంటనే భారతదేశ యాత్ర మొదలుపెట్టి సనాతన ధర్మంపై ఉనన్యాస పరంపరనిచ్చారు. 1925లో గోవర్ధన పీఠాధిపతి పదవి స్వీకరించారు.

గణిత శాస్త్రంలో గణనీయ కృషి - వేద గణిత పిత

ప్రాచీన భారతీయ విజ్ఞానంలో స్వామీజీ కృషి గణనీయమైనది. వారి గణిత శాస్త్ర సేవ చిరస్మరణీయం. వేదాలను వేదాంగాలను శాస్త్రీయ దృక్పథంతో పరిశోధించి “అధర్వణ వేదానికి అనుబంధం” నిర్మించారు. గణిత శాస్త్రానికి సంబంధించిన 16 సూత్రాలను పున: నిర్మించారు. ఈ సూత్రాల సహాయంతో పెద్ద పెద్ద లెక్కలను మానసికంగానే గణన చేసి జవాబులు తెలుసుకొనే వినూత్న ప్రక్రియను స్వామీజీ ఆవిష్కరించారు. అంక గణితం, బీజ గణితం, కలన గణితం(కాల్క్యులస్) అవకలన సంకలనాలలో ఎన్నో గణిత సమస్యలకు 5, 10, 15, 40 వరకు సోపానాలు చేయటానికి బదులు ఒకే పంక్తిలో చేసు పద్ధతులను సోదాహరణంగా స్వామీజీ వివరించారు.

ప్రధాన సంఖ్యలన్నిటికి పాజిటివ్ నెగిటివ్ ఆస్క్యులేటర్స్ (ధన, రుణ వేష్టనం)తో భాజనీయతా నికష అంటే డివిజబిలిటీ టెస్ట్‌ను సూచించారు. అంటే గణిత శాస్త్రాన్ని అత్యంత ఆకర్షణీయంగా, ఆసక్తిదాయకంగా అతి సులభంగా తయారు చేశారన్న మాట. దీనితో గణిత శాస్త్రాన్ని ఒక కొత్త మలుపు త్రిప్పిన ఘనత కృష్ణతీర్థ స్వామీజీకే దక్కింది. ఏదో పుస్తకాలు రాసి కూర్చోకుండా వీటిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ఆచార్యులకు విద్యాలయాల్లో, కాలేజీలలో విశ్వవిద్యాలయాలలో బోధించి చక్కని అవగాహన కల్పించి స్ఫూర్తినిచ్చారు. అందుకనే స్వామిని ఫాదర్ ఆఫ్ వేద గణిత అంటే వేద గణిత పిత అని గౌరవంగా సంబోధిస్తారు.

గ్రంథ రచన

1958 ఫిబ్రవరిలో స్వామీజీ అమెరికా, కెనడా దేశాలు పర్యటించి ఉపన్యాసాలిచ్చారు. స్వామీజీ రాసిన భక్తి శ్లోకాల సంఖ్య 3,000లకు పైనే ఉన్నాయి. వీటిని సంకలనం చేసి ప్రచురించారు. సనాతన ధర్మంపై స్వామి కృష్ణజీ రాసిన గ్రంథాన్ని బొంబాయ్ భారతీయ విద్యాభవన్ ప్రచురించింది. వీరి ప్రసిద్ధ గణిత గ్రంథం ఆంగ్లంలో రాసిన "వేదిక్ మేథ మాటిక్స్". దీన్ని వీరి మరణానంతరం ఢిల్లీలోని మోతీలాల్ బనార్సిదాస్‌వారు ముద్రించారు. అపూర్వ భారతీయ విజ్ఞాని, గణిత మేధావి, సనాతన సారధి – జగద్గురు శ్రీభారతీ కృష్ణ తీర్థజీ మహారాజ్ డెబ్భై ఆరేళ్ళ వయసులో నిర్యాణం చెంది శ్రీకృష్ణ పరమాత్మ సన్నిధికి చేరుకొన్నారు. ❁

124. కాళిదాస సములు - శ్రీ పేరి కాశీనాధ శాస్త్రి (1885 ad)

"యధా కాళిదాస స్తధా కాశీనాధ" అనిపించుకొన్న మహా సంస్కృత విద్వాంస కవిపండితులు శ్రీ పేరి కాశీనాధ శాస్త్రిగారు. విశాఖపట్నం మండలం గజపతి నగరం తాలూకా పురిటి పెంట గ్రామంలో 1885లో జన్మించారు. తండ్రి వెంకటశాస్త్రి. తల్లి మహాలక్ష్మమ్మగార్లు. తండ్రిగారే ప్రధమ గురువులు. తండ్రి వద్ద వ్యాకరణాన్ని ఔపోసన పట్టారు. మధ్వశ్రీ భీమాచార్యుల వారి వద్ద న్యాయ శాస్త్రాన్ని అభ్యసించారు. కొల్లూరు కామశాస్త్రిగారి దగ్గర వేదాంత, అలంకార శాస్త్రాలను నేర్చారు.

కాశీనాధ శాస్త్రిగారు విజయనగర మహారాజా ఆస్థాన పండితులు. తర్వాత రాజావారి సంస్కృత కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయునిగా చేరి జీవితాంతం కొనసాగారు. పాఠ ప్రవచనంలో ప్రసిద్ధులనిపించుకొన్నారు. వాదశక్తిలో ప్రతివాద భయంకరులే. మహా విద్వాంసులైనా, కవిగా కూడా కీర్తిగాంచారు. మహారాజు ఆనంద గజపతి భోజరాజు అని కాశీనాధ శాస్త్రిగారు కాళిదాస మహాకవి అని ఆ రోజులలో అందరూ చెప్పుకొనేవారు. అనేక కవితలు రాసి వెలువరిస్తూ నానా రాజ సందర్శనం చేస్తూ సత్కార పురస్కారాలు అందుకొంటూ జైత్రయాత్ర చేశారు. పండిత, కవి మహా జన మధ్య ఎన్నో కనకాభిషేకాలు అందుకొన్న మహాశాస్త్ర విద్వాంసులు.

గోదావరీ లహరి, బ్రహ్మసూత్ర భాష్యానువాదం అనే రెండు గ్రంధాలు రాసి ముద్రించారు. ఉత్తర శాకుంతలం అనే గ్రంధ వ్రాతప్రతి ఇప్పటికీ విజయనగర రాజ గ్రంధాలయంలో ఉందని చెబుతారు. శాస్త్రిగారు పూర్తిగా గ్రాంధిక వాది. ఆనాటి మరో గ్రాంధిక భాషావాది అయిన కల్లూరి వెంకట రామశాస్త్రిగారికి వత్తాసుగా ఉండేవారు. ఉర్లాం మొదలైన సంస్థానాల్లో శాస్త్రిగారు విద్వత్ పరక్షకులుగా ఉండి సన్మానాలనందుకొన్నారు. వీరి సంతానం ఆరుగురు. అందులో ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు. ప్రసిద్ధ శాస్త్ర పారంగతులు మహా మహోపాధ్యాయ శ్రీ తాతాసుబ్బరాయ శాస్త్రిగారు కాశీనాధ శాస్త్రిగారికి అల్లుడుగారు. అరవై రెండేళ్ళు జీవించి శాస్త్రిగారు 1920లో మరణించారు.❀

125. పండిత ప్రవర - మల్లాది రామకృష్ణ చయనులు (1885 ad)

1885లో మల్లాది రామకృష్ణ చయనులుగారు గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వెలనాటి బ్రాహ్మణ కుటుంబంలో రాఘవయ్య, అచ్చమ్మ దంపతులకు జన్మించారు. వీరిని హైదరాబాద్ వాస్తవ్యులు దత్తతకు స్వీకరించగా అక్కడ పార్సీ ఉర్దూలను నేర్చుకొన్నారు. గోరంట్లకు తిరిగి వచ్చి సంస్కృత భాష నేర్చారు. కావ్యాలు చదివి అమలాపురం వెళ్లి ఏలేశ్వరపు తమ్మన్న శాస్త్రిగారి దగ్గర కావ్యం, నాటకం, సాహిత్యం అభ్యసించారు. పేరూరులో మందా చెన్నయ్యగారి నుండి తర్కం నేర్చారు. పేరి నరసింహ శాస్త్రిగారి వద్ద వ్యాకరణం శ్రీపాద రామమూర్తిగారి దగ్గర, విజయనగరంలో భీమాచార్యుల వారి దగ్గర తర్కాన్ని మెరుగు పరచుకొన్నారు. ఇరవై రెండవ ఏటనే వాదాలు చేసి పండితులను గెలిచే సామర్థ్యం పొందారు. అమరావతికి చెందిన గుడిమెళ్ళ వెంకట సుబ్బయ్యగారి కుమార్తె కృష్ణవేణమ్మను పెండ్లాడారు.

ఇరవై నాలుగో ఏట మైసూర్ వెళ్లి పజమాని సుందర రామశాస్త్రిగారి వద్ద బ్రహ్మసూత్ర శంకర భాష్యాన్ని చదివారు. అప్పయ్య దీక్షితులకు తొమ్మిదవ తరంవారైన త్యాగరాజ శాస్త్రి దగ్గర, కల్పతరువు, వ్యుత్పత్తి వాద వాచాస్పత్యాది గ్రంధాలు చదివారు.

విజయవాడలో నివాసం ఉన్నారు. ముప్పై ఆరవ ఏట తిరువయ్యూర్ వెళ్లి స్థల పురాణం బాలకృష్ణ శాస్త్రిగారి వద్ద ఉపనిషత్ భాష్యం మొదలైనవి నేర్చుకొన్నారు. పుష్పగిరి, హంపి విరూపాక్ష పీఠాలకు ఆస్థాన పండితునిగా నియమింపబడ్డారు. వైదిక కర్మానుస్థానం వీరు యధావిధిగా పాటించారు. అమరావతిలో జ్యోతి స్టోమం, బెజవాడలో చయనం చేశారు. అప్పటి నుండి

రామకృష్ణ చయనులు అయ్యారు. వేదాంత విషయాలను అతి సూక్ష్మగా, సూటిగా తేలికగా అర్ధం అయ్యేట్లు చెప్పగల సామర్ధ్యం చయనులుగారిది. మహావక్తగా విఖ్యాతి పొందారు. వేదాంత ప్రవచనానికి కాశీ పండితులు మెచ్చుకొని “పండిత ప్రవర” బిరుదునిచ్చి సత్కరించారు. పంజాబు రాష్ట్రంలో సంచారం చేసి అక్కడి వారిని మెప్పించి “వ్యాఖ్యాన వాచస్పతి” బిరుదును అందుకొన్నారు. బాల బోధిని, భ్రమ మంజరి అనే వేదాంత గ్రంధాలను సంస్కృతంలో రచించారు. ప్రాయశ్చిత్త పశు విషయక విమర్శ గ్రంథాలనూ మహా భారత కధా తత్వ నిర్ణయం అనే గ్రంథాన్ని చయనులుగారు రచించారు. డెబ్భై ఆరేళ్ళు జీవించి రామ కృష్ణ చయనులుగారు 1941లో స్వర్గం చేరారు.❁

126. ధర్మ శాస్త్ర నిధి, న్యాయాధీశ కవి - గుండేరావు హర్కారే (1887 ad)

బహుభాషా వేత్త, సంస్కృతానేక భాషా రచయిత, ధర్మశాస్త్ర నిధి శ్రీ గుండేరావు హర్కారే 13-3-1887న హైదరాబాద్‌లో రామారావు, సీతాబాయి దంపతులకు జన్మించారు. అరబ్బీ పారశీక భాషలను నేర్చి, మెట్రిక్ చదివి, హైదరాబాద్ న్యాయస్థానంలో గుమాస్తాగా ఉద్యోగం ప్రారంభించారు. తర్వాత తెలుగు, మరాఠీ సంస్కృతం, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో పాండిత్యాన్ని సాధించారు. వృత్తిని అంకితభావంతో నిర్వహించటం గమనించి వీరిని అనువాదకునిగా చేసి పిమ్మట ఉన్నత న్యాయస్థాన మండలి ప్రధాన న్యాయమూర్తి అంతరంగిక కార్యదర్శిగా ప్రభుత్వం నియమించి వారి బహుభాషా పాండిత్యానికి సరైన గౌరవాన్ని కలిగించింది. న్యాయ రాజస్వ, గణాంక శాఖలలో ఉన్నత పరీక్షలు, ఉద్యోగం సక్రమంగా నిర్వహిస్తూనే వ్రాసి ఉత్తీర్ణులయ్యారు.

సాహిత్యంలో గుండెలు తీసిన బంటు

భట్టుమూర్తి వసుచరిత్రలోని మొదటి, రెండు ఆశ్వాసాలను మరాఠీలోకి అనువదించి, అందులోని కావ్య సౌందర్యాన్ని గొప్పగా వివరించారు గుండారే హర్కారే గారు. గద్వాల సంస్థానంలో 1919లో మున్సిఫ్ మేజిస్ట్రేట్‌గా హర్కారే నియమింపబడ్డారు. క్రమంగా పదోన్నతి పొందుతూ, జిల్లా న్యాయాధీశునిగా, కలెక్టర్‌గా, సెషన్స్ జడ్జిగా ఎదిగి పదవీ విరమణ చేశారు.

న్యాయాధీశులుగా ఉంటూనే తీరిక వేళల్లో న్యాయ, వ్యాకరణ, పూర్వ మీమాంస మొదలైన శాస్త్రాధ్యయనం చేసి లోతైన పరిశోధన చేసి, మద్రాస్

విశ్వవిద్యాలపు న్యాయ శిరోమణి, సాహిత్య శిరోమణి పరీక్షలు రాసి, ఉత్తీర్ణులైనారు. ధర్మ శాస్త్రంలో, తులనాత్మక సాహిత్య శాస్త్రాలలో పి.ఒ.ఎల్. పరీక్షనిచ్చి అత్యద్భుత ప్రతిభతో పాసైనారు.

ప్రతిభా పురస్కారం

హర్కారేగారి న్యాయ శాస్త్ర కోవిదత్వానికి మెచ్చి న్యాయశాస్త్ర కేంద్రమైన నవ ద్వీపంలో పండిత పరిషత్తు మెచ్చి "వాచస్పతి" బిరుదు ప్రదానం చేసి గౌరవించింది. అయోధ్య, బెల్గాం నగర పండిత సభలు "విద్యాభూషణ"నిచ్చి గౌరవించాయి. ఆలివర్ గోల్డ్‌స్మిత్ ఆంగ్లంలో రాసిన "ట్రావెల్"ను సంస్కృతంలో పద్యాను వాదం చేశారు. దీనికి మైసూరు ప్రభుత్వం స్వర్ణ పతాకాన్ని ప్రదానం చేసి సమ్మానించింది. పూనా తిలక్ విద్యా పీఠం వీరిని పూర్వ మీమాంసా శాస్త్ర పరీక్షకులు గాను, మైసూర్ విద్వత్ పరీక్షకు సాహిత్యశాస్త్ర పరీక్షకులుగా సగౌరవంగా నియమించి వారి విద్వత్తును వినియోగించుకొన్నాయి.

వైవిధ్యభరిత రచనలు చేయటంలో హర్కారేగారు సర్వ సమర్ధులనిపించుకొన్నారు. ఆంగ్లంలో ధామస్ గ్రే రాసిన "ఎలిజీ", గోల్డ్‌స్మిత్ రచించిన "ద డిజర్టెడ్ విలేజ్" వర్డ్స్‌వర్త్ రచన "ఇంటిమేషన్ టు ఇమ్మోర్టాలిటి" షేక్స్‌పియర్ "హేమ్లెట్ మిడ్ సమ్మర్ నైట్స్"లను సంస్కృతంలోకి శ్లోకానువాదం చేశారు. పార్శీలోని "మస్నావీ షరీఫ్", అరబ్బీ భాషలో ఉన్న "ఖురానే షరీఫ్"ను సంస్కృతంలోకి అనువాదం చేసి తన పాండిత్య సామర్ధ్యాలను నిరూపించారు. యాజ్ఞ వల్క్య స్మృతికి "మితాక్షరా" అనే వ్యాఖ్యానం, ఖురాన్‌కు "ఖురానే మితాక్షరా" పారిభాషిక పద వివరణలతో ఉర్దూ భాషలోకి అనువదించారు. యాస్కుని నిరుక్తంను కొంతవరకు రాశారు. మరాఠీ సాహిత్య చరిత్రను తెలుగులోకి అనువదించారు. శబ్ద బోధ ప్రక్రియకు న్యాయ మీమాంసలను ఆధారంగా సులభ వివరణ రచించారు. తెలుగు విజ్ఞాన సర్వస్వం, సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశంలలో హరారే రచించిన "ఉర్దూ భాషా చరిత్ర", "కుమరిల భట్టు" వ్యాసాలు చోటు చేసుకొన్నాయి.

అఖిలభారత ప్రాచర్య విద్మన్ మహాసభలో "అభినవగుప్త పాదుని రస

వివరణ"పై ప్రత్యభిజ్ఞా సిద్ధాంత ప్రభావాన్ని గూర్చి రాసిన విమర్శనా వ్యాసం అత్యుత్తమమైనదిగా, తలమానికమైనదిగా గుర్తింపు పొందింది. ఇలాంటి పరిశోధనా వ్యాసాలు గుండేరావుగారి లేఖిని నుంచి ఎన్నో ప్రవహించాయి. "ప్రత్యయ కోశం" వీరు రచించిన వ్యాకరణ గ్రంధాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత శాఖ ప్రచురించి గౌరవించింది. "సంస్కృతం", "భారతి", "మధురవాణి", "ఎడ్యుకేషనల్ రివ్యు", "ఇస్లామిక్ కల్చర్" మొదలైన పత్రికలలో వీరి రచనలు వెలువడటం ఆ పత్రికలు చేసుకొన్న అదృష్టం. రేడియోలో అనేక భాషలలో శాస్త్రీయ వైజ్ఞానిక విషయాలపై సూఫీ – భారతీయ వేదాంతాల తులనాత్మక పరిశీలనపై హర్కారేగారు మాట్లాడిన ప్రసంగాలు దాదాపు ఎనిమిది వందల పేజీలపైనే ఉన్నాయి అంటే అమితాశ్చర్యమేస్తుంది.

చెన్నై కుప్పుస్వామి శాస్త్రి పరిశోధనా సంస్థ, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం, తెలుగు రచయితల సంఘం, వీరిని సగౌరవంగా ఆత్మీయంగా సన్మానించి తమను తాము సన్మానం చేసుకొన్నాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి వీరిని విశిష్ట సభ్యులుగా స్వీకరించింది. భారత రాష్ట్రపతి వీరి శాస్త్ర నిష్టకు ప్రతీకగా "మాన్యతా ప్రమాణ పత్రం" (సర్టిఫికేట్ ఆఫ్ ఆనర్) అందజేసి సత్కరించారు. పాణినీయ సంస్కృత వ్యాకరణం ఆధునిక విజ్ఞాన శాస్త్రాల వంటిదేనని నిరూపిస్తూ, రూప నిష్పత్తి ప్రక్రియను సులభంగా బోధించటానికి వీలుగా "వ్యాకరణ యంత్రం"ను నిర్మించిన సాంకేతిక విజ్ఞాని హర్కారే. దీనికోసం ఒక పరిశోధనా విభాగాన్ని ఏర్పరచి, కంప్యూటర్ విధానంలో ఆ యంత్రాన్ని ప్రవేశపెట్టాలని కోరుకొన్నారు. ఆ కల సాఫల్యం కాకుండానే మహాశాస్త్ర విజ్ఞాన కవి పండిత బహుభాషా మర్మజ్ఞ, న్యాయాధిపతి శ్రీ గుండేరావు హర్కారే తొంభైవ ఏట 3-12-1979న కైవల్యం పొందారు. వారులేని లోటు పూరింపరానిది. ❁

127. కావ్య తీర్ధ - శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి (1890 ad)

1890లో పంచాగ్నుల వెంకటేశ్వర్లు, అలమేలు మంగ దంపతులకు ఆదినారాయణ శాస్త్రి జన్మించారు. వెలనాటి వైదికులు భారద్వాజ గోత్రీకులు. ఆపస్థంభ యజుశ్శాఖాధ్యాయులు. వీరి పూర్వీకులది ప్రకాశం జిల్లా ముక్తి నూతనపాడు. 1908లో మద్రాస్ వెళ్లి ఆంధ్ర పత్రిక కార్యాలయంలో పని చేశారు. ఉగాది సంచికలు వీరి ఆధ్వర్యంలోనే వెలువడేవి. 1930లో అక్కడే ఆర్ష భారతీ గ్రంధమాలను స్థాపించారు. స్వబ్బుత గ్రంధాలు కొన్ని ప్రచురించారు. తర్వాత బరంపురం, కల్లికోట రాజావారి కళాశాలలో తెలుగు పండితులు చేరి జీవితాంతం అక్కడే పని చేశారు. గొప్ప రసజ్ఞులైన కావ్య విమర్శకులని పేరొందారు. ప్రాకృత భాషకు యెనలేని సేవ చేసిన ఆధునికులు.

శాస్త్రీయం

ఆది నారాయణ శాస్త్రిగారు "కావ్య తీర్ధ" బిరుదాంకితులు. నవీన సాహిత్యంపైన కూడా ఆదరణ ఉన్నవారు. సంస్కృతంలో ఉన్న శాస్త్రీయ గ్రంధాలు జన సామాన్యానికి అర్ధం కావాలని కోరుకొనేవారు. తన వంతు ప్రయత్నంగా రాజశేఖరుని కావ్య మీమాంస, వాత్సాయనుని కామ సూత్రాలు గౌతముని ధర్మసూత్రాలను విశేషమైన అంశాలు చేర్చి సులభ ఆంధ్ర వివరణలతో రాసి "ఆర్య భారతీ గ్రంధమాల" ద్వారా ముద్రించారు. కౌటిల్యుని అర్ధ శాస్త్రానికి విలువైన విశేష వ్యాఖ్యానం చేశారు. "ఆంధ్ర లిపి పరిణామం"పై అనిర్వచనీయ

గ్రంథమే రాశారు. కాని ఇవేవీ దొరకపోవటం దురదృష్టం. నవ్య సాహిత్యంపై మక్కువే కాక వ్యావహారిక భాషా వాదానికి గిడుగు పిడుగుతో బాటు పల్లకీ మోసిన బోయీ కూడా. నవ్య సాహిత్య పరిషత్తును ఊరూరా ఊరేగించి ఎన్నో విలువైన వ్యాసాలూ రాసిన నూత్న దృక్పథం ఉన్నావారు

గిడుగు రామమూర్తిగారి షష్టిపూర్తికి వెలువరించిన ప్రత్యేక సంచికలో "ప్రాకృత వాఙ్మయం - ప్రజా సేవ" వ్యాసం రాసి తనకున్న ప్రాకృత భాషా పరిజ్ఞానాన్ని లోకానికి చాటారు. ప్రతిభ, రెడ్డి రాణి పత్రికలలో శాస్త్రిగారి వ్యాసాలూ వచ్చేవి. నందూరి సుబ్బారావుగారి "ఎంకి పాటలు"పై వచ్చిన విమర్శలను త్రిప్పికొట్టి దాని సాహిత్య గౌరవాన్ని అందరికీ తెలియజేశారు. అరవై ఒక్క ఏళ్ళు మాత్రమే జీవించిన శాస్త్రిగారు 1951లో పరమపదించారు.❁

128. బాలవ్యాస, వ్యాకరణాలంకార - వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి (1894 ad)

విద్యార్జన

వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు తూర్పు గోదావరిజిల్లా కాకినాడ తాలూకా వాజులూరులో భావనారాయణ, కామేశ్వరమ్మ దంపతులకు 1894లో జన్మించారు. షష్టినాడు పుట్టారు కనుక చదువుల మేటి సుబ్రహ్మణ్యేశ్వరుని పేరు పెట్టారు. పేరు సార్ధకం చేశారు శాస్త్రిగారు. మాతామహులు రేగిళ్ళ కామశాస్త్రిగారి దగ్గర సంస్కృత కావ్యాలు చదివి, పిఠాపురం చేరి పేరి పేరయ్య శాస్త్రిగారి వద్ద సిద్ధాంత కౌముదిని నేర్చారు. పిఠాపురాస్థాన విద్వాంసులైన వేదుల సూర్యనారాయణ శాస్త్రిగారి సన్నిధానంలో మహా భాష్యాంతం వ్యాకరణాన్ని మంజూషతో సహా ఆపోసన పట్టారు. ఆస్థాన తర్క విదా&ంసులైన శ్రీపాద లక్ష్మీ నారాయణ శాస్త్రిగారి శిష్యులై న్యాయశాస్త్రాన్ని నేర్చుకొన్నారు. ఆస్థాన వేదాంతి దెందుకూరి నరసింహ శాస్త్రిగారి వద్ద వేదాంత శాస్త్రాన్ని గ్రహించారు.

విద్యాదానం

అనేక ప్రాంతాల నుండి తన వద్దకు విద్య నేర్వటానికి వచ్చిన యాభైకి పైగా విద్యార్థులకు భోజన వసతులు ఏర్పాటు చేసి విద్య గరపారు. శిష్యులకు కావ్య నాటకాలంకారాలను వ్యాకరణాన్ని బోధించారు. 1930-50 మధ్య ఇరవై ఏళ్ళు పిఠాపురంలోని వీరి గృహం ఒక ఆదర్శ గురుకులంగా భాసించేది. నిత్య పాఠ ప్రవచనాలు, ఆర్ష గ్రంథ పరిశీలనం, గ్రంథ రచన చేయటం వీరి దిన కృత్యమైపోయింది. వీరి శిష్యులందరూ వీరి అంత పాండిత్య సంపాదించి గురువుగారి పేరు నిలబెట్టి శాస్త్ర పాఠాలు చెప్పి శాస్త్ర విద్యా ప్రచారం చేసి ఆర్ష ధర్మాన్ని నిలబెట్టినవారే. అలాంటి వారిలో కప్పగంతుల సుబ్రహ్మణ్య శాస్త్రి, ముళ్ళపూడి నారాయణ శాస్త్రి, ప్రతాప హనుమచ్ఛాస్త్రి మొదలైనవారున్నారు.

ప్రజ్ఞా సుబ్రహ్మణ్యీయం

పిఠాపురం ప్రజల అభ్యర్ధన మేరకు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు శ్రీ మద్రామయణాన్ని ధారావాహికంగా ప్రవచనం చేసి అందరి అభిమానాన్ని సంపాదించి ఘన సత్కారంతోబాటు గురువుగారి సమక్షంలో "బాల వ్యాస" బిరుదును, గుర్తుగా బంగారు ఉంగరాన్ని తమ గురు బ్రహ్మ చేత వెలికి తొడిగించుకొన్న అదృష్టవంతులు. ఆంధ్ర దేశంలోని విద్వత్ లోకం వీరికి "తర్క వ్యాకరణ వేదాంత కేసరి", "మహోపాధ్యయ" గౌరవంతో సన్మానించింది. విజయవాడ పండిత పరిషత్తు "వ్యాకరణాలంకార" బిరుదు నందజేసింది. అయోధ్య సంస్కృత పత్రికాధిపతులు "మహా భారత మర్మజ్ఞ"తో గౌరవించి సత్కరించారు. ఇతర రాష్ట్రాలవారు ఆహ్వానించి సన్మానించారు.

మహా గ్రంధ రచన

శాస్త్రిగారు విమర్శనా సాహిత్యంలో అందెవేసిన చేయి. వ్యాసభారతంపై వచ్చిన దుర్విమర్శలకు దీటైన సమాధానాలు చెప్పి, భారత ప్రామాణ్యాన్ని నిరూపించి "మహాభారత తత్వ కధనం" అనే ఆరు భాగాల మహాగ్రంధం రచించారు. "కర్ణోత్పత్తి" గ్రంధం కూడా రాశారు. "శ్రీమద్రామాయణ తత్వ కధనం", "రామయణ రహస్యాల సమీక్ష" అనేవి మరో రెండు ముఖ్య గ్రంధాలు రాశారు. నాస్తికత్వానికి సరైన సమాధానాలు విపులంగా రాసి "ఆస్తికత్వం" అనే పేరుతో మూడు భాగాల అద్భుత రచన చేశారు. సంస్కృత భాషలో "మహాభారత తత్వ దీప:" అనే మహోన్నత గ్రంధం రాశారు. ఈ గ్రంధానికి ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పురస్కారాలు అందజేశాయి. ఈ దేశంలోనే కాక విదేశాలలోనూ విద్వాంసుల ప్రశంసలనూ అందుకొన్న గ్రంధ రాజం ఇది. శాస్త్రీజీ అనేక పత్రికలకు వివిధ విషయాలపై ఎన్నో వ్యాసాలూ రాసి జ్ఞాన బోధ చేశారు. "శాస్త్రిగారి వాణి ఆర్ష వాఙ్మయానికి భద్ర కవచం" అన్నారు విద్వాంసులు. అన్నిటా విఖ్యాత ప్రామాణికులు సుబ్రహ్మణ్య శాస్త్రిగారు. ఈ విద్యా తపస్వి వారణాసి వారు ఎనభై నాలుగు సంవత్సరాలు ఆరోగ్యంగా జీవించి సార్ధక జీవనం సాగించి 1979లో ఆ వారణాసి విశ్వనాధునిలో ఐక్యమయ్యారు. ❁

129. ఆధునిక యుగ మహా గీర్వాణ పండిత కవి - వేదాల తిరువేంగళాచార్యులు (1895 ad)

వేదాల తిరువేంగళాచార్యుల వారు గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పెద్దవరం అగ్రహారంలో 1895లో జన్మించారు. వైష్ణవ కుటుంబంలోని వీరు సంస్కృత ఆంధ్ర భాషలను చిన్నతనంలోనే అభ్యసించారు. ఈ రెండు భాషల్లో మహా పాండిత్యాన్ని సంపాదించారు. దర్శన, అలంకార శాస్త్రాలను మధించారు. స్వంత గ్రామంలోనే పండితుల వద్ద ప్రాథమిక విద్య నేర్చారు. ఒంటబట్టిన గీర్వాణ తెలుగు భాషా పాండిత్యాల వలన సంతృప్తి చెందక విద్యా తృష్ణ తీరక ఆచార్యుల వారు దేశ పర్యటన చేశారు.

విజయపగరం చేరి మహా మహోపాధ్యాయ తాతా సుబ్బరాయ శాస్త్రిగారి వద్దను, పేరి లక్ష్మీ నారాయణ శాస్త్రిగారి దగ్గరా న్యాయ, వ్యాకరణ, అలంకార శాస్త్రాధ్యయనం కూలంకషగా నిష్ఠతో చేశారు. న్యాయ శాస్త్ర శిరోమణి పరీక్షకు హాజరై సర్వోత్తములుగా ఉత్తీర్ణత సాధించారు. పిఠాపురం రాజాస్థాన విద్వాంసులు శ్రీ గుదిమెళ్ళ వెంకట రంగాచార్య స్వామి సన్నిధిలో న్యాయ, వేదాంత, మీమాంస, సాహిత్య, వ్యాకరణ, తంత్ర, సంప్రదాయక విజ్ఞానంలో మెరుగులు దిద్దుకొని సంపూర్ణ ప్రజ్ఞావంతులనిపించుకొన్నారు. అంటే సమస్త శాస్త్రాలలో అపార ప్రజ్ఞా పాటవాలను సాధించి తమ ధీమత్వాన్ని ప్రకటించారు. సమకాలీనులలో వేదాలవారి వంటి వారెవరూ లేరని చెప్పుకొనేవారు.

విశిష్టాద్వైత సిద్ధాంతంలో పరిపూర్ణులైన ఆచార్యులవారు ద్వైత, అద్వైత, శుద్ధాద్వైత సిద్ధాంతాలలోనూ అపూర్వ ప్రావీణ్యం పొందారు. ఇంతటి సమదృష్టి

ఉన్నవారు ఆకాలంలో చాలా అరుదుగా ఉండేవారు. "చతుర్మత తత్వ సారం" అని వీరు రాసిన అపూర్వ గ్రంధం తెలుగు భాషా సమితివారి బహుమతిని పొందింది. సంస్కృత అధ్యాపకులుగా వీరి సేవలు నిరుపమానమై నిలిచాయి. మహా పండితులైన శ్రీ శ్రీనివాస శిరోమణి వంటివారు ఆచార్యులవారి ప్రముఖ శిష్యులై వర్ధిల్లారు.

పూరీ జగన్నాధ క్షేత్ర సంస్కృత కళాశాల, కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం, చిట్టి గూడూరు శ్రీలక్ష్మీ నరసింహ సంస్కృత కళాశాలలో ఆచార్యులవారు సంస్కృతాధ్యాపకులుగా సేవలు అందజేశారు. గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల వీరి ప్రతిభను గుర్తించి సంస్కృత అధ్యాపకులుగా స్వీకరించి సేవలందుకొన్నది.

ఆచార్యులవారు ఆంధ్ర ధ్వన్యాలోకనం(లోచన సహితం), కావ్యాలంకార సూత్ర వృత్తి, రస గంగాధరం(పూర్వ, ఉత్తర ఖండాలు), వ్యక్తి వివేకం (ఆంధ్రానువాదం), తెనాలి రామకృష్ణుని కవిత్వం భారతోపన్యాసాలు, భాగవత ఉపన్యాసాలు, రాజ్య ప్రదానం అనే నవల, జాతక కధలు, గోపికా వల్లభ శతకం, చతుర్మత తత్వ సారం, కావ్య ప్రకాశిక (ఆంధ్రానువాదం) వంటి ఎన్నో గ్రంధాలు రచించారు. చివరి రోజులు గుంటూరులోని ఆనంద తీర్ధ అగ్రహారంలో గడిపారు. డెబ్భై ఏడవ ఏట వేదాల తిరువేంగళాచార్యుల వారు మార్చి 1972లో పరమపదం చేరుకొన్నారు❁

130. అజాత శత్రువు - పళ్ళేపూర్ణ ప్రజ్ఞాచార్యులు (1897 ad)

ఆంధ్ర ఆస్థానకవి శ్రీ కాశీ కృష్ణాచార్యులవారి అల్లుడుగారు పళ్ళేపూర్ణ ప్రజ్ఞాచార్యులు. ఆ పేరుకు అన్ని విధాలా సార్ధకతను సాధించిన విద్వత్కవి వరేణ్యులు. 15-6-1897న నెల్లూరు జిల్లా కొవ్వూరు దగ్గర సంగంలో జన్మించారు. అనేకచోట్ల విద్యనభ్యసించారు. వేదుల సూర్యనారాయణ శాస్త్రి, నోరి సుబ్రహ్మణ్య శాస్త్రిల వద్ద వ్యాకరణం చదివారు. వేమూరి రామ బ్రహ్మం, దెందులూరి పానకాల శాస్త్రుల దగ్గర తర్కాన్ని అభ్యసించారు. ఈ శాస్త్రాలలో గురువును మించిన శిష్యులనిపించుకొన్నారు. గురుకుల విద్య చాలా క్లిష్టతరంగా సాగింది.

ఆచార్యులవారు చివరికి గుంటూరులో స్థిరపడ్డారు. కాశీ కృష్ణాచార్యుల వారి వద్ద కావ్యాలంకార, వేదాంతాలను నేర్చుకొన్నారు. కాశీవారి అల్లుడై "ఆంధ్ర కాదంబరి" కావ్యం రాసి మామగారికి అంకితమిచ్చి ఋణం తీర్చుకొన్నారు. 1916 నుండి ఇరవై ఏళ్ళు గుంటూరు టౌన్ హైస్కూల్, 1937 నుండి మరో ఇరవై ఏళ్ళు గుంటూరు హిందూ కాలేజిలోను సంస్కృత ఉపాధ్యాయ, అధ్యాపకులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. తర్వాత కే.వి.కే సంస్కృత కళాశాలలో, సంస్కృతాంధ్ర పండితులుగా సేవలందించారు.

భాష్యాంత వైదుష్యంతో శోభిల్లిన ఆచార్యుల వారికి ఇసుమంతైనా అసూయకాని, గర్వం కాని లేకపోవటం మహా విశేషం. జీవితం అంతా "పఠన, పాఠనాలకే" అంకితం చేసిన విద్వన్మూర్తి ఆచార్యులవారు. ఆకాలంలో కొప్పరపు కవులకు తిరుపతి కవులకు కవితా స్పర్ధలు తారస్థాయిలో ఉండేవి. పూర్ణ ప్రజ్ఞా చార్యులవారు మాత్రం ఏ ముఠాకూ చెందకుండా సమకాలీన సాహితీ లోకంలో

"అజాత శత్రువు"గా నిలిచారు.

ఆచార్యులవారు యెంత ప్రాచీన సంప్రదాయ వాదులైనా నవీనతను కాదనలేదు. మామగారు కృష్ణాచార్యుల వారితో కలిసి అష్టావధాన శతావధానాలను జంటవధానాలుగా నిర్వహించారు. తానూ స్వయంగా కూడా అవధానాలు చేశారు. ఎన్నో ఆశు కవితా ప్రదర్శనలిచ్చారు. "కవి శేఖర", "మహోపాధ్యాయ", "విద్యాలంకార", "సాహిత్య రత్న" వంటి బిరుదులు పొందారు. ఆచార్యులవారు రాసిన గ్రంథాలు వందకు పైగా ఉన్నాయి. 6-3-1976న శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డి.లిట్ బిరుదు నందుకొన్నారు.

వంద గ్రంథాలు రాసినా ఆచార్యులవారి ముద్రిత గ్రంథాలు నలభై మాత్రమే. "శ్రీరామ కల్యాణం" అనే పద్య కావ్యం తొలి రచన. "కైకేయీ సౌశీల్యం" మరో పద్య కావ్యం. "ఆంధ్ర కాదంబరి" అనువాద రచన. ద్విపద మేఘదూతం రచించారు. సంస్కృత, ప్రతిమ, ప్రతిజ్ఞా యౌగంధ రాయణం, చారుదత్త నాటకాలకు తెలుగు అనువాదం చేశారు. రాఘవేంద్ర, జయతీర్థ, వాదిరాజు, వ్యాస రాయ, పూర్ణ బోధ, విజయ కావ్యాలలో ద్వైతమత సిద్ధాంతాలను పొందుపరచారు. ఆంధ్ర మహాభారతానికి విరాట పర్వం వరకు ప్రామాణికమైన లఘు టీక రాశారు. ఆచార్య శ్రీ శాస్త్ర పాండిత్యానికి గొప్ప ఉదాహరణ "శత లక్షిణి" అనే విమర్శ గ్రంథం. ఈ గ్రంథమే తిరుపతి కవులకు వాద ప్రతివాదాలలో "కర దీపిక"గా నిలిచింది అని అంటారు. ఎనభై ఏళ్ళ సంపూర్ణ సార్థక జీవితం గడిపి పళ్ళేపూర్ణ ప్రజ్ఞాచార్యులవారు 1977లో "పూర్ణ ప్రజ్ఞ"లోకి చేరుకొన్నారు. ❁



131. తెనాలి రాముని కథలను సంస్కృతీకరించిన ఆ జన్మ సిద్ధ కవి - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి (1897 ad)

గోదావరి జిల్లా కంద్రిక అగ్రహారంలో సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు సుబ్బయ్య, బుచ్చి నరసమ్మ దంపతులకు 10-12-1897న జన్మించారు. కృష్ణాజిల్లా చిరివాడ వాస్తవ్యులు శతావధాని వేలూరి శివరామ శాస్త్రిగారి వద్ద కావ్య, నాటక, అలంకార, వ్యాకరణ శాస్త్రాలు అధ్యయనం చేశారు. తిరుపతి, మద్రాస్ ప్రాచ్య కళాశాలలలో చదివి శిరోమణి, విద్వాన్, పి.ఓ.ఎల్ మొదలైన పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. సికందరాబాద్ మహబూబ్ కాలేజి హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా చేరి ముప్ఫై అయిదేళ్ళు పనిచేశారు. తర్వాత రావు బహద్దూర్ వెంకట రామరెడ్డి కాలేజిలో సంస్కృతోపన్యాసకులుగా 1954 నుండి ఎనిమిదేళ్ళు ఉన్నారు.

శాస్త్రిగారి భార్య అకాల మరణం చెందారు. ఈ బాధను మర్చిపోవటానికి సాహిత్య రచన ప్రారంభించారు. రచన అంటే వీరికి నిద్రాహారాలు గుర్తుకురావు. అలా పనిచేసి రామరాజ భూషణుని "కావ్యాలంకార సంగ్రహం" కావ్యానికి సమగ్రమైన వ్యాఖ్య రాసి సమర్ధతను రుజువు చేసుకొన్నారు. ఈ అపూర్వ గ్రంథం ప్రాచ్య, పాశ్చాత్య, అలంకారికుల పాలిటి చింతామణి, కల్ప వృక్షమే, కామధేనువే అయింది. వీరి "తత్సమ చంద్రిక" వ్యాకరణ గ్రంథం వ్యాకరణ శాస్త్రంలో

తలమానికమైనది. చిన్నయసూరి బాల వ్యాకరణానికి కూడా వ్యాఖ్యానం రాశారు. సంస్కృతాంధ్ర వ్యాకరణాలు మొత్తం చదివి అర్ధం చేసుకొని వ్యాఖ్యానించి రాసిన శాస్త్రిగారిపై రెండు గ్రంధాలు వ్యాకరణ విద్యార్ధులకు, వ్యాకరణం బోధించే పండితులకు శిరోధార్యాలుగా నిలిచాయి.

శాస్త్రిగారు సంస్కృతంలో 20కి పైగా గ్రంధాలు రచించారు. తెలుగులో 25 వరకు అరుదైన పుస్తకాలు రాశారు. రెండు భాషలలోను వీరు రచించిన గ్రంధాలు మృదు మధుర శైలిలో ఉండి రసజ్ఞులను ఆకట్టుకొన్నాయి. వీటిలో కొన్ని ముక్తకాలు, కొన్ని ఖండ కావ్యాలు ఉన్నాయి. తెలుగు నుంచి సంస్కృతంలోకి, సంస్కృతం నుండి తెలుగులోకి శాస్త్రిగారు తర్జుమా చేసిన గ్రంధాలెన్నో ఉన్నాయి. అంటే అనువాదకులుగా శాస్త్రిగారు గొప్ప కృషి చేశారు. రచనలన్నీ శిష్ట వ్యాకరణ ప్రయోగాలతో ఉంటాయి. అందుకే వీరిని "ఆ జన్మ సిద్ధ కవి" అన్నారు. జాతక కధలను కొన్నిటిని "జాతక కథా గుచ్ఛం" పేరుతో సంతరించారు. గోవర్ధనుడి "సప్తశతీ సారం"ను తెలుగులోకి అనువాదం చేశారు. ముక్కు తిమ్మన పారిజాతాపహరణంను "భర్తృదానం"గాను, పోతన గారి కొన్ని భాగవత ఉపాఖ్యానాలను "భాగవతానువాద:", పింగళి సూరన కళా పూర్ణోదయ ప్రబంధాన్ని "కళా పూర్ణోదయం"గా సంస్కృతీకరించారు. దీని వలన తెలుగు కవుల ప్రబంధ నిర్మాణ సౌందర్యాన్ని యావద్భారత సంస్కృత పండితులకు మృష్టాన్న భోజనంగా అందజేశారు. రుక్మిణీ కల్యాణంను "కీర సందేశం"గా రాశారు. ద్వంద్వ యుద్ధం, ఖడ్గ తిక్కన, వాసవదత్త, రేణుక విజయం, వివేకానందం అనే సుప్రసిద్ధ రచనలు చేశారు.

అమృత కణాలు, స్మరగీతి మొదలైన ముక్తక సంకలనాలు తెచ్చారు. "నడి మంత్రపు సిరి" అనే అధిక్షేప కావ్యాన్ని రాశారు. తెలుగులోని మను చరిత్రాది పంచ మహాకావ్య కధలను "ఆంధ్ర ప్రబంధ కథలు"గా రాశారు. దీనినే "ఆంధ్ర కావ్య కతా:"గాను, తెనాలి రామకృష్ణుని కధలను "ఆంధ్ర దేశ హాస్య కధా:"గాను సంస్కృతంలో రాసి ఆ భాషాభిమానులకు తెలుగు రుచి చూపించి పరిచయం చేశారు. శాస్త్రిగారు "కాదంబరీ పరిణయ:" అనే స్వతంత్ర సంస్కృత నాటకం

రాశారు. స్వంత తెలుగు రచనలను సంస్కృతంలోకి అనువదించుకొన్న వారిలో సూర్యనారాయణ శాస్త్రిగారే ప్రప్రధములు. ఆ కీర్తి చిరస్మరణీయం.

వనపర్తి, గద్వాల, సంస్థానాధీశులు శాస్త్రిగారిని ఆహ్వానించి, గౌరవించి, సత్కరించారు. ప్రతి ఏటా వార్షికాలు ప్రదానం చేశారు. ఎందరో జమీన్‌దారులు, సాహిత్య సంస్థలు శాస్త్రిగారిని సన్మానించాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీలో విశిష్ట సభ్యులను చేసి ప్రభుత్వం గౌరవించింది. ఖమ్మం జిల్లా ఇల్లెందు విద్వత్ సమావేశంలో “విద్యా రత్న” బిరుదు అందుకొన్నారు. ఆఖరి శ్వాస వరకు సాహిత్య జీవనం సాగించిన సాహిత్య జీవి సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి గారు ఎనభై అయిదేళ్ళు జీవించి 14-10-198న సరస్వతీ సన్నిధానం చేరారు. వారి లోటు సాహిత్య లోకంలో తీరనిదిగా మిగిలిపోయింది. ❀

132. రాజగురు, విద్యా వాచస్పతి - విద్యాధర శాస్త్రి (1901-1983 ad)

1901లో జన్మించి ఎనభై రెండేళ్ళ జీవితం గడిపి బికనీర్ సంస్థాన "రాజగురు" హోదా పొంది 1983లో మరణించిన విద్యాధర శాస్త్రి రాజస్థాన్‌లోని చురులో జన్మించాడు. లాహోర్‌లోని పంజాబ్ యూనివర్సిటి నుండి సంస్కృతంలో డిగ్రీ పొంది, ఆనాటి ఆగ్రా యూనివర్సిటి నేటి అంబేద్కర్ యూనివర్సిటిలో నుండి సంస్కృత ఎం.ఏ సాధించాడు. జీవితకాలం బికనీర్‌లో గడిపాడు. 1962లో భారత రాష్ట్రపతి నుండి "విద్యా వాచస్పతి" బిరుదునందుకొన్నాడు.

బికనీర్‌లోని దుంగార్ కాలేజిలో సంస్కృత అధ్యాపకుడుగా 1928లో ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా పదోన్నతి పొంది 1956లో పదవీ విరమణ చేశాడు. తరువాత ఆలిఘర్‌లో ఉన్న హీరాలాల్ బరాశాని కాలేజిలో సంస్కృత శాఖాధ్యక్షునిగా సేవలందించాడు. 1958లో సంస్కృత, రాజస్థానీ, హిందీ విద్యా వ్యాప్తికోసం "హిందీ విశ్వభారతి" సంస్థను స్థాపించి జీవితాంతం ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు.

బికనీర్ సంస్థానంలో "రాజ గురు". హోదాలో ఉంటూ ఎందరో విద్యార్థులను ప్రభావితం చేశాడు. ఆయన ప్రముఖ శిష్యులలో నరోత్తమ దాస్, బ్రహ్మానంద శర్మ, కాశీరాం శర్మ, కృష్ణ మోహతా, రేవత్ సరస్వతి వంటి దిగ్గజాలున్నారు.

విద్యాధరీయం

తాతగారు హరనాం దత్ శాస్త్రిగారి జీవిత చరిత్రను సంస్కృతంలో "హర నామామృతం" అనే మహాకావ్యాన్ని విద్యాధర శాస్త్రి రచించాడు. ప్రపంచాన్ని అభివృద్ధి చేయటమే ఈ కావ్య పరమావధిగా రాశాడు. రెండవ మహాకావ్యం

"విశ్వ మానవీయం" ఇందులో ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధిని అభివర్ణిస్తూ మానవుడు చంద్ర మండలంపై కాలుమోపే మహత్తర సంఘటనను కూడా చేర్చటం ఆయన మానవీయ, నవీన భావ అవగాహనకు నిదర్శన. చంద్రగుప్త విక్రమాదిత్యుని కాలంలో సాంస్కృతిక వ్యాప్తిని వివరించే "విక్రమాభి నందనం" రాశాడు. ఇందులో శంకరాచార్య, రాణీ పద్మావతి, రాణా ప్రతాప్, గురు గోవింద సింగ్, శివాజీ వంటి త్యాగ ధనుల జీవితాలను తెలియజేశాడు. "విక్రమాభ్యుదయం" అనే చంపూ కావ్యమూ రాశాడు. "వైచిత్ర్య లహరి"లో అడ్డూ ఆపూ లేని స్వేచ్ఛా జీవితాన్ని హాస్య స్ఫోరకంగా చిత్రించి మార్గదర్శనం చేశాడు. అలాగే "మత్త లహరి"లో ఒక మత్తుమందు భాయీ సమాజంలోని అందర్నీ సంఘ కట్టుబాట్లు ఛేదించుకొని తనతో కలిసి మందు కొట్టమని ఆహ్వానించే విషయాన్ని సరదాగా రాశాడు. "హిమాద్రి మహాత్మ్యం"ను 1962లో పండిత మదన మోహన మాలవ్యా శత జయంతి సందర్భంగాను, భారత చైనా యుద్ధ సమయంలో రాశాడు. ఈ కావ్యంలో మాలవ్యాజీ దేశ ప్రజలను హిమాలయాలను రక్షించాలి. పర్యావరణం కాపాడాలని చేసే సందేశం ఉంది. మహాకవి కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలం" నాటకంపై వ్యాఖ్యానంగా "శాకుంతల విజ్ఞానం" రాశాడు. దీనిలో ప్రేమ సౌందర్యాన్ని ఆరాధనీయతను వివరించాడు.

1915లో విద్యాధరుడు రాసిన ''శివ పుష్పాంజలి'' మొదటగా ప్రచురితమైంది. ఇందులో ఒకే ఛందస్సును వాడకుండా వైవిధ్యంగా గజళ్ళు. ఖవ్వాలీలు కూడా చేర్చాడు. దీనితోబాటు "సూర్య స్తవం" కూడా ముద్రించాడు. అన్ని వేదాంత విషయాలకు అద్వైతమే భూమిక అని తెలియజేస్తూ "లీలా లహరి" రాశాడు. "పూర్ణానందం" అనే సంస్కృత చారిత్రక నాటకం, "కాళీ దైన్యం", "దుర్బల బలం" అనే నాటకాలూ కూడా శాస్త్రి రాశాడు. ఇందులో భౌతిక సుఖాల కంటే పారమార్థక జీవన విధానం శ్రేష్టం అనే నీతిబోధ ఉంది. తులసీదాసు శ్రీకృష్ణునిపై రాసిన గీతాలను "కృష్ణ గీతావళి" పేరిట సంకలనం చేసి ప్రచురించాడు.

అవార్డులు - రివార్డులు

వారణాసిలోని విశ్వసంస్కృత సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఆనాటి రాష్ట్రపతి శ్రీ

బాబు రాజేంద్ర ప్రసాద్‌గారిచే అభినందన సత్కారాలు అందుకొన్నారు. 1962లో రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణగారి నుంచి "విద్యా వాచస్పతి" బిరుదు పొందారు. రాజస్థాన్ సాహిత్య అకాడెమీ ఉదయపూర్ వారి నుంచి "మనిషి" అనే మహా బిరుదును పొందారు. భారత స్వాతంత్ర్య రజతోత్సవ సందర్భంగా రాష్ట్రపతి శ్రీ గిరిగారి నుండి సంస్కృత విద్యావేత్త సన్మానం పొందారు. అఖిల భారత సంస్కృత ప్రచార సభ "కవి సామ్రాట్" బిరుదుతో సత్కరించింది. బికనీర్ భారత విద్యా మందిరం వారు 1980లో ఘనంగా పౌరసన్మానం చేసి గౌరవించారు. వీరికి "హరిత్ రుషి" స్మారక పురస్కారం కూడా లభించింది.

విద్యాధర శాస్త్రి సర్వ గ్రంధాలను "విద్యాధర గ్రంధావళి" పేరున ప్రచురణ పొందాయి. ❀

133. స్వాతంత్ర్య సమరయోధ కవి పండితులు - శ్రీ జటావల్లభుల పురుషోత్తం (1906 ad)

బాల్యం - విద్య - ఉద్యోగం

తూర్పు గోదావరి జిల్లా ఆత్రేయపురం నివాసి జటావల్లభుల కృష్ణ సోమయాజులు మహా లక్ష్మమ్మ దంపతులకు జటావల్లభుల పురుషోత్తం గారు 17-2-1906లో మాతామహుని ఇంట నడవ పల్లిలో జన్మించారు. మహా పండిత ప్రకాండుడైన పుల్య ఉమా మహేశ్వర శాస్త్రిగారి వద్ద ముంగండ అగ్రహారంలో సంస్కృతం నేర్చారు. విజయనగరం మహారాజా కళాశాలలో చేరి ఇంగ్లీష్‌లో బి.ఏ డిగ్రీ పొందారు. పిఠాపురం మహారాజా కాలేజిలో ట్యూటర్‌గా చేరి కొంతకాలం పని చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యా పీఠంలో ప్రిన్సిపాల్ అయ్యారు. ఆ విద్యా సంస్థ కార్యదర్శి వల్లూరి సూర్యనారాయణ రావుగారి కోరికపై "స్మృతి కాలం స్త్రీలు", "వేదకాలపు స్త్రీలు" అనే రెండు పరిశోధనాత్మక గ్రంధాలు రాశారు.

కొవ్వూరులో పని చేస్తున్నప్పుడే మద్రాస్ యూనివర్సిటి నుండి సంస్కృతంలోను తెలుగులోను ఎం.ఏ పట్టా పొందారు. 1948లో పదవికి రాజీనామా చేసి విజయవాడ ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ ప్రభుత్వ కళాశాలలో సంస్కృత శాఖాధ్యక్షులుగా చేరి 1961 వరకు పదమూడు సంవత్సరాలు సేవలందించారు. మళ్ళీ కొవ్వూరు గీర్వాణ విద్యా పీఠంలో సంస్కృత శాఖాధ్యక్షులై,

తరువాత కాకినాడ పిఠాపురం రాజ వార కాలేజికి బదిలీ అయి 1966 ఉద్యోగ విరమణ చేశారు. 1956-60 వరకు నేను విజయవాడ ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ కాలేజిలో ఇంటర్, డిగ్రీలు చదువుతుండగా శ్రీ జటావల్లభుల పురుషోత్తం గారు సంస్కృత శాఖాధ్యక్షులుగా పనిచేశారు. వారిని నిత్యం చూస్తూ వారి ఉపన్యాసం వినే అదృష్టం పొందినవాడిని.

సంస్కృతీ సేవ

ఉద్యోగ విరమణ పిమ్మట పురుషోత్తంగారు భారతీయ సంస్కృతిపై అభిమానాన్ని పెంచుకొని అందులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి అపూర్వ గ్రంధ రచన చేశారు. వేదాలు, ధర్మ శాస్త్రాలు, ఇతిహాస పురాణాలు మొదలైన వాటిలో ప్రతి విషయంపై “హిందూ మతం”, “భారతీయ విజ్ఞానం”, “ధర్మ మంజరి”, “భారతీయ వైభవం”, “ఆధ్యాత్మిక వ్యాసాలూ”, “భగవద్గీతా ప్రవేశం”, “మహా కవి సందేశం”, “అపూర్వ పండిత గరిమ”తో సుబోదాంగా రాశారు. వీరిది పూర్తిగా శాస్త్రీయ దృష్టి. “చిత్ర శతకం” సంస్కృతంలో రాశారు. “జగద్గురు ప్రశస్తి” అనే కావ్యాన్ని కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖర యతీంద్రులపై సంస్కృతంలో రచించారు. చిత్ర శతకంలో అనేక అంశాలపై చమత్కారంగా సంస్కృతంలో శ్లోకాలు రాశారు.

వేసవులలో ప్రతి ఏడాది “ధర్మశాల పాఠశాల” నడిపారు. అందులో సుమారు రెండు నెలలు వివిధ ధర్మశాస్త్ర విషయాలను బోధించేవారు. పురుషోత్తంగారు స్వాతంత్ర్య పిపాసి. భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని “క్విట్ ఇండియా” ఉద్యమంలో ప్రముఖ పాత్రను పోషించారు. దీనికి ఫలితంగా అరెస్ట్ కాబడి దాదాపు ఆరు నెలలు 1-4-1943, 10-11-43 వరకు కారాగార వాసం అనుభవించారు. ఆయన ఎప్పుడూ శుద్ధ తెల్ల ఖద్దరునే ధరించేవారు. ఆకుపచ్చ కండువా వేసేవారు. ధోవతి, లాల్చీ వేసేవారు.

గౌరవాలు - పురస్కారాలు

ఆంధ్రప్రదేశ్ భాషాభివృద్ధి సంఘంలో ప్రభుత్వం వీరిని సభ్యులుగా నియమించి సలహాలు స్వీకరించింది. సంస్కృత భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం

తీసుకోవలసిన చర్చలను ఒక నివేదికగా రాసి ప్రభుత్వానికి అందజేశారు. 1972లో కాకినాడ పురజనులు పురుషోత్తం గారికి కనీ వినీ ఎరుగని రీతిలో ఘన సన్మానం చేసి కృతజ్ఞతను తెలియజేసి ధన్యులయ్యారు. ఆ సందర్భంగా "పురుషోత్తమ దర్శనం" అనే ప్రత్యేక పుస్తకం ప్రచురించారు. అరవై ఆరేళ్ళు మాత్రమే జీవించి ఈ సాహితీ జీవి పురుషోత్తంగారు 28-10-1972న "పురుషోత్తమ ప్రాప్తి" పొందారు.

గంగా సమానః ఖలు శుద్ధ ధర్మః సత్ కామ ఏవం యమునోపమశ్చ తన్మేళనం యత్ర తదేవ పూతం క్షేత్రం ప్రయాగాస్య మహో గృహేస్తి.

ధర్మం అనే గంగ, కామం అనే యమున, దాంపత్యమనే అంతర్వాహినియైన సరస్వతితో కలిసి త్రివేణీ సంగమమై తనరారే ప్రయాగయే భార్య అట. ఇది పురుషోత్తంగారి ఒకానొక ముక్తకం.

ప్రాచీన కాలంలో ఎందరో మహానుభావులు, కవి పండితులు, సంస్కృత భాషా వ్యాప్తికి జవజీవాలనిచ్చి, ప్రజల మధ్యకు సంస్కృతాన్ని తెచ్చారు. వారికి వందనాలు. ఆధునిక కాలమ్‌లో అమరావానికి నీరాజనం పట్టి, సులువుగా నేర్చుకొనే దారి చూపి, ఆ భాషోద్ధరణకు బాలలు కూడా సులభంగా నేర్చుకొనే వీలుగా సంస్కృత ప్రబోధినులను రచించి జీవిత సర్వస్వం దేవభాషా సేవనంలో కరగించిన త్యాగధనుల్లో ఆస్థానకవి శ్రీ కాశీ కృష్ణాచార్యులు, శ్రీ జమ్మల మడక మాధవ రామశర్మ, శ్రీ జటావల్లభుల పురుషోత్తం గార్లు చిరస్మరణీయులు, ప్రాతస్మరణీయులు. వారికి ప్రత్యేక నమో వాకాలు.

ఇప్పుడు శ్రీ జటావల్లభుల పురుషోత్తంగారు వ్రాసిన కొన్ని ముక్తకాలను మీకు పరిచయం చేస్తాను. వారు విజయవాడలో ఎస్.ఆర్.ఆర్ అండ్ సి.వి.ఆర్ కళాశాలలో సంస్కృత శాఖ ఆచార్యులుగా పనిచేశారు. ఇవి ఈ నాటి సాంఘిక స్థితికి, ధర్మ చ్యుతికి అద్దం పడతాయి. మన బాధ్యతనూ బాగా గుర్తు చేస్తాయి. చమత్కారంగానూ వుంటాయి. ముందుగా సంస్కృత భాషామతల్లికి వారి శ్లోకంతోనే వందనం చేస్తాను.

"సుధా స్రవంతీ సురభాషి తాయా - సుచ్చానా సూక్తి సురత్న వార్ధిః -

సుకావ్య సందోహ నిదిశ్చ వాణీ – సా సంస్కృతాఖ్యా, సుకృతి కలాభ్యా"

"మాతాహి భాష వితతేశ్చ లోకే – మాతేవ రక్ష్య త్య పితా(శితాన్హి – నా మాతృభాషా భువి సంస్కృతాఖ్యా – వాచ్యః కదం మాతృ పదేవ చాన్యాః"

01 – అపకారం చేసేవానికి కూడా ఉపకారం చేస్తుందట భారతదేశం. ఆమె ఉదాత్త బుద్ధి, ఎత్తైన హిమాలయ శిఖరమనే శిరస్సు వల్లనే తెలిసిపోతుందట.

"పున్యావనే, ద్రోహమతీ న్విదేశ్యం – సదర్భ నిష్టాన్, ఖలుసే హిషే, త్వం – వుచ్చై శ్శిరత్వం, తవ శూచితం, హి – హిమాద్రి శృంగేన మహోన్నతేన"

02 – ఆ పరబ్రహ్మను ప్రత్యక్షంగా చూసిన రమణ మహర్షి, శ్రీరామకృష్ణ పరమహంస మున్నగు మహర్షులు ఈ భూమిమీదనే ఎందుకు పుట్టారు? అని ప్రశ్నించే వారికి సమాధానం "నక్షత్రాలు ఆకాశంలోనే పుట్టి ఎందుకు ప్రకాశిస్తున్నాయి?"

"నాన్యస్య భూమే ర్భరతాస్య జాతాః – శ్రీ రామకృష్ణో రమణాదయశ్చ – అత్రైవకిం, బ్రహ్మవిదాం, సుజన్మ – తారోదయః కిం గగనే న భూమౌ"

03 – లోకంలో అందమైన వాటిని చూసి మానవుడు తృప్తి చెందాడు. కానీ స్త్రీని చూసి వికారం చెందటం వాడి దౌర్భాగ్యం.

"దృష్టాహి శోభాం, గగనే మలే తాం – తార గానశ్యాం భుసి పద్మ పంక్తిః – జనః తుస్తో స్త్కిమ భాగ్యమస్య – స్త్రీ రత్న మాలోక్య వికార మేగతి"

04 – కొత్తగా కాపురానికి వచ్చి నట్టింట్లో ఎప్పుడు తిరుగుతుందా అని వువ్విళ్ళూరిన అత్తగారు – కోడలు రాగానే ఆమె వ్యక్తిత్వాన్ని సహించలేదట. ఇది లోక సహజం.

"కదా స్నుశామే గృహవర్తినేశ్యాత్ – కదాను పుత్రస్య తయా శుఖం స్యాత్ – స్వశ్రూర్వి లపైవ మనల్ప కాలమ్ – సమాగాతాం న సహేత చిత్రం"

05 – భార్య అంటే ఎవరో కాదట. ధర్మం అనే గంగా, కామం అనే యమునా, అంతర్వాహినిగా దాంపత్యమనే సరస్వతితో కలిసి ప్రయాగ త్రివేణీ సంగమమేనట.

"గంగా సమాన: ఖలు శుద్ధ ధర్మః – సత్కామ ఏవం యమునో పమశ్చ – తన్మేలనం యాత్ర తదేవ పూతం – క్షేత్రం ప్రయాగాస్య మహో గృహేస్తి".

06 - స్త్రీకి గౌరవం ఇవ్వాలి అనే ప్రబుద్ధుడు తన కుమార్తె వంట చేయటానికి ఒప్పుకోడు. కానీ వంటలక్కతో వండించుకొని తృప్తిగా తింటాడు. ఆమె కూడా స్త్రీ అన్న స్మృతి వాడికి వుండదు ఇదీ లోకరీతి.

"చిత్రోహి వా దోస్తీ మదీయ కన్యా - మహాససే నైవ నియోజ నీయా - పూజ్యా శ్రియ: స్థార్థి కథన్ను భుక్తి - ద్ఋత్యాహి పక్త్రీ; దకిం న సా స్త్రీ"

07 - ఈ రోజు మెడలో పూలదండ వేసి, హారతులిచ్చి, గౌరవించి మెచ్చి మేక తోలు కప్పుతారు. రేపే ఏదో నెపం మోపి ఆ కంఠాన్నే నరికేస్తారు. అందుకని కీర్తిని నమ్మరాదు.

"కన్చిత్ప్రజానే, త్రుపదేని వేశ్య - స్వదేశ విద్రోహిని, మా మానవతి - కన్తేద్య నిక్షిప్యచ, పుష్ప మాలాం - శ్వస్తీ ప్రదండం పరికల్ప ఏరన్"

08 - మానవుడు చిత్ర స్వభావుడు. తన కొడుకు చేసే దోషాలు తెలుసుకోడు. వాడిలో లేని మంచిగుణాలన్నీ వున్నాయని భావిస్తాడు. వాడి కోసం ఎన్నో తప్పులు చేసి లోకాపవాదం పొందుతాడు. పుత్ర ప్రేమ గుడ్డిది. గుడ్డి రాజు దృత రాష్ట్రుడు దీనికి మంచి ఉదాహరణ.

"జనో న జానాతి, హి పుత్ర దోషాన్ - గుణాంశ్చ తస్మిన్న సతోపి పశ్యేత్ - పాపం తదర్థం, బహుదా కరోతి - బలీః, లోకే సుత మాల మోహః"❁

134. అభినవానంద వర్ధన, రస జగన్నాథ- శ్రీ జమ్మలమడక మాధవరామ శర్మ (1907ad)

గుంటూరు జిల్లా తెనాలి తాలుకా కోడి తాడిపర్రు జమ్మల మడక వారి అగ్రహం. అందులో జమ్మల మడక వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి హనుమయమ్మ దంపతులకు మాధవరామశర్మ గారు 13-4-1907న జన్మించారు. తాతగారు రామయ్యగారి దగ్గరే వెలి బూడిదలో అక్షరాలు దిద్దారు. తల్లి దగ్గర పన్నెండో ఏడు వచ్చే దాకా పాలు తాగారు. అదే తన కంఠస్వర వరం అన్నారు. ఉపనయనం తర్వాత తాతగారి వద్దే సహస్ర గాయత్రి జపించి రామ హృదయం నేర్చారు. తండ్రి "తాడి పర్రు శాస్త్రులుగా, సాహితీ చక్రవర్తులు"గా పేరుపొందారు. వీరివద్ద సంస్కృతం అధ్యయనం చేసి పొలం పనులు చేయటం అలవాటు చేసుకొన్నారు. ఇసుకలో చెడుగుడు ఆడుతుంటే "స్పటిక వినాయకుడు" దొరికితే బుద్ధి మార్చుకొని చదువుపై శ్రద్ధ వహించారు. దీన్ని తర్వాత పూజా మందిరంలో ప్రతిష్ఠించి నిత్యార్చన చేసేవారు. పాలేళ్ళకు పూరిపాకలో ఆముద దీపాల వెలుగులో చదువు నేర్పేవారు.

ఇంగ్లీషు నేర్వడం- చదువుకు స్వస్తి- అధ్యయన అధ్యాపనం

మొదటి ప్రపంచ యుద్ధం అయిపోగానే తురుమెళ్ళ జార్జి కరోనేషన్ స్కూల్‌లో మూడవ తరగతి చదివి ఇంగ్లీష్ అక్షరాలూ నేర్చుకొన్నారు. స్కూలులో నాటకంలో "ఉపానందుడు" పాత్ర ధరించి మద్రాస్ మంత్రి పాత్రో చేతులమీదుగా సిరా బుడ్డి పుస్తకం బహుమానంగా పొందారు. లెక్కలలో పూజ్యం. తిలక్ మరణంతో విద్యార్థుల సమ్మె జరిగి చదువుకు స్వస్తి చెప్పారు. తాతగారి దగ్గర

ఒంటరిగా కావ్యాలు, గ్రంథాలు నేర్చారు. అలంకార శాస్త్రాలన్నీ కరతలామల కలైనాయి. వాటిలోని పద్యాలూ శ్లోకాలు అన్నీ కంఠతా వచ్చేశాయి. పుస్తకం అక్కరలేక పోయేది. తెనాలి సంస్కృత కళాశాల న్యాయ శాస్త్రాధ్యాపకులు శ్రీ కురుగంటి శ్రీరామమూర్తి గారు మాధవరామశర్మ గారి వద్ద తర్క ప్రకరణ గ్రంథాలు చదివారు అంటే, వీరి విద్వత్ యెంత గొప్పదో తెలుస్తోంది. కాశీ విద్యాకేంద్రం అని తెలిసి అక్కడ చదవాలని ఎవరికీ చెప్పకుండా వెళ్ళి దశాశ్వ మేధ ఘాట్‌లో సావిత్రీ జపం చేశారు. కాని తలిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకొని వెళ్ళారు. ఇలా కాశీ చదువు సాగలేదు.

భావ వేగి

భావ వేగి అయిన శర్మగారు ఇంటి పట్టున ఉండక విద్యాకేంద్రం విజయనగరం తాతా సుబ్బరాయశాస్త్రి గారనే రాయడు శాస్త్రిగారి వద్ద శాస్త్రాలు నేర్వాలని వెళ్ళి రాజాగారి సంస్కృత కళాశాలలో చేరి "సాహిత్య విద్యా ప్రవీణ" చదివి ఉత్తీర్ణులై, తర్కం నేర్వాలనుకోన్నారుగాని సాహిత్యం అభ్యసించారు. రాయడు శాస్త్రి గారి అంతేవాసులై సకల శాస్త్రాలు నేర్చేసారు. రామశాస్త్రిగారి వద్ద తర్కం, గంటి సూర్యనారాయణ శాస్త్రిగారి దగ్గర మీ మాంస, రామానుజచార్యుల వద్ద శాస్త్ర దీపిక, నౌదూరి వెంకటశాస్త్రి, కంభంపాటి రామశాస్త్రిగారి నుండి వ్యాకరణం నేర్చారు. అలంకార కౌస్తుభం, వక్రోక్తి జీవితం, అభినవ భారతిపై పట్టు సాధించారు. రాయడు శాస్త్రి గారి వద్ద ఉన్నప్పుడే మాధవ రామశర్మ మాధవ "రాయ" శర్మ అయ్యారు.

ఉద్యోగం

జీతం తీసుకోకుండా పన్నెండేళ్ళు తెనాలి సంస్కృత కళాశాలలో సాహిత్యా లంకార భాష శాస్త్ర అధ్యాపకుడుగా, ఉపాధ్యక్షుడు, ప్రిన్సిపాల్‌గా సేవలందించిన మహోన్నత మూర్తి. ఈ బోధన వల్లనే తనకు గ్రంథాలు రాసే భావ వ్యూహం కలిగిందన్నారు. తర్వాత నెల్లూరు వేదం సంస్కృత కళాశాలలో "సర్వధ్యక్షులు"గా పని చేశారు. పిమ్మట గుంటూరు క్రైస్తవ కళాశాలలో సంస్కృతాంధ్ర భాషాధ్యాపకుడుగా ఉన్నారు. అక్కడ రిటైరై కే.వి.కే.సంస్కృత కాలేజిలో అయిదేళ్ళ

పని చేశారు, నాగార్జున యూనివర్సిటిలో తెలుగు విభాగంలో ఉద్యోగించారు.

వివాహం- సంతానం

శర్మగారు వేదాంతం వారి ఆడబడుచు శ్రీమతి కామాక్షీ హైమవతిని వివాహమాడారు. వారికి ఇద్దరు కుమారులు ఇద్దరు కుమార్తెలు కలిగారు. రెండవ కుమారునికి భవభూతి శర్మ అని నామకరణం చేసి ఆ మహాకవిపై తనకున్న భక్తి తాత్పర్యాలను చాటుకొన్నారు. అయిదవ కాన్పు సమయంలో శర్మగారి భార్య చనిపోయారు. అప్పటినుండి పిల్లలకు తానే తల్లి అయ్యారు శర్మగారు.

గ్రంథ రచన

శర్మగారు సంస్కృతాంధ్రాలలో 29 గ్రంథాలు రచించారు. వారికి వాల్మీకి, కాళిదాసు భవభూతి, అభినవ గుప్తుడు, క్షేమేంద్రుడు అభిమాన రచయితలు. జగద్గురు శ్రీ కళ్యానంద భారతీ మహాస్వామి వారి చేత మంత్ర విద్యా దీక్ష స్వీకరించారు. ఆ సంస్కారమే తన రచనా వ్యాసంగానికి దోహదం చేసిందని తెలియజేసారు. సంస్కృతంలో శర్మగారు ఆనందవర్ధనుని ధ్వన్యాలోక అలంకార శాస్త్రానికి సంగ్రహ సంస్కృత రచన "ధ్వని సారం" రాశారు. దీక్షా గురువులైన శ్రీ కళ్యానంద భారతీ స్తుతిగా "కళ్యాణ భారతి" రాశారు. శర్మగారికి పుట్టపర్తి సత్యసాయిబాబా అంటే అమితాభిమానం. సంస్కృతంలో "సత్యసాయి పురాణం"గా నలభై వేల శ్లోకాలతో సర్వ పురాణ సారంగా రచించారు. తెలుగులో మంత్రం శాస్త్రగ్రంథంగా శ్రీ జగన్నాధ పండితరాయని రసగంగాధరానికి వ్యాకహారికాంధ్ర భాషా వివరంగా "నవరస గంగాధరం", "విద్యానాధుని ప్రతాప రుద్రీయానికి" ఆంధ్ర ప్రతాప రుద్రీయం, ముమ్మటుని కావ్య ప్రకాశానికి ప్రామాణికాలైన పది వ్యాఖ్యానాల సారంగా "కావ్య ప్రకాశం", "రుయ్యకుని అలంకార సర్వస్వానికి "అలంకార సూత్రం", భరతుని నాట్య శాస్త్రానికి వ్యాఖ్యానంగా "నాట్య వేదం", "క్షేమేంద్రుని రచనకు "ఔచిత్య విచార చర్చ" కుంతకుని గ్రంథానికి అనువాదంగా "వక్రోక్తి జీవితం", భగవద్గీత ఆరు వేల శ్లోకాలకు వ్యాఖ్యానం, మహా భారతాన్ని ధర్మశాస్త్రంగా నిరూపిస్తూ "శ్రీమన్మహాభారతం- ధర్మశాస్త్రం" మొదలైనవి రచించారు. ఇంకా కొన్ని గ్రంథాలు ముద్రించాల్సినవి ఉన్నాయి. "సాహిత్యం అంటే సర్వ

పురుషార్ధ సాధనంగా రసభావ స్పురణ, తత్పర్యవసానమూ ఉండాలి” అని శర్మగారి అభిప్రాయం.

పుట్టపర్తి నారాయణాచార్యులు, విశ్వనాథ సత్యనారాయణ గారల రచనలంటే శర్మగారికి యెనలేని అభిమానం. వారంటే ఆరాధనా భావమూ.

ఆధ్యాత్మిక జీవనం

నిత్య సంధ్యావందనం, ధ్యానం, మంత్రజపం చేసేవారు. ఇలవేల్పు అయిన శ్రీ లలితా పర భట్టారిక సహస్ర నామ రహస్యాలను బోధించేవారు. ఫాలభాగంలో భస్మం, గంధం, కుంకుమ ధరించేవారు. శర్మగారి ప్రత్యేకత క్రాపుతోపాటు “పిలక” ఉండటం. ధోవతి, దానికి అందమైన కుచ్చెళ్ళతో ప్రత్యేకంగా దర్శనమిచ్చేవారు. ఉత్తరీయం కప్పుకొంటే మహారాజ ఠీవి జ్యోతకమయ్యేది. కంచి పరమాచార్య వారి కటాక్షం పొందారు. శృంగేరీ స్వాముల వారి ఆశీస్సులందు కొన్నారు. సత్యసాయిబాబాకి ప్రీతిపాత్రులయ్యారు. తను సేకరించిన అయిదు వేల అపూర్వ గ్రంథాలను సత్యసాయి కాలేజి లైబ్రరీకి బహూకరించారు. భద్రాద్రిలో శ్రీరామనవమి కల్యాణం రోజున ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు. “నారాయణి నమోస్తుతే” అనే మాట తరచుగా వాడేవారు.

భువన విజయ సృష్టికర్త

మాధవరామశర్మ గారే శ్రీకృష్ణ దేవరాయల భువన విజయంకు ద్రష్ట, స్రష్ట. తిమ్మరుసు పాత్ర ధరించేవారు. దాని రూపకర్త గారే ఏ.సి.కాలేజిలో మొదటిసారి దాన్ని ప్రదర్శించారు. విశ్వనాథ, గడియారం, పుట్టపర్తి, మధునా పంతుల వంటి సాహితీ దిగ్గజాలు పాల్గొన్న సభ అది.

సభలూ సమావేశాలు

శర్మగారు మహా వక్త. అనర్గళంగా ఏ విషయంపైన నైనా మాట్లాడేవారు. ముందు సంస్కృతంలో ధారళంగా ప్రసంగించి తర్వాతే తెలుగులో మాట్లాడేవారు. అంతటి గీర్వాణ భాషాభిమానం వారిది. శర్మగారిది “కంచు కంఠం”. ఆనాడు “జకార త్రయం” అని పిలవబడే ఉద్దండ మహోపన్యాసకులు శ్రీ జమ్మల మడక మాధవ రామ శర్మ, శ్రీ జటావల్లభుల పురుషోత్తం, శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణ

మూర్తి గార్లు ఆస్థానకవి శ్రీ కాశీ కృష్ణాచార్య వారి 90వ జన్మదినోత్సవం నాడు శర్మగారి ఆధ్వర్యంలో గుంటూరులో "సంస్కృత సామ్రాజ్యం" అనే అపురూప సభ నిర్వహించారు. ప్రత్యేక సంచిక తెచ్చారు.

బిరుదులు- సత్కారాలు

మాధవరామశర్మ గారి మహా విద్వత్తుకు అంతేస్థాయిలో 18 బిరుదులూ లభించాయి. అదేరీతిలో సత్కార సన్మాన పురస్కారాలు పొందారు. వీరి బిరుదులలో మహోపాధ్యాయ, దర్శనాచార్య, లాక్షణిక సామ్రాట్, శాస్త్ర విశారద, సాహిత్య సామ్రాట్, అభినవానంద వర్ధన, రస జగన్నాథ, నవ విద్యానాద, సాహిత్య వాచస్పతి, ధర్మ విద్యా ప్రవీణ, సంస్కృత విద్యాభూషణ మచ్చుకు కొన్ని మాత్రమే.

నాగార్జున విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్, డి.లిట్ ఇచ్చి గౌరవించింది. అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం వార్షికం ఇచ్చి సన్మానించేది. ఆలిండియా ఓరియంటల్ కాన్ఫరెన్స్‌లో ప్రతినిధిగా పాల్గొన్నారు. నవద్వీపంలో గౌడీయ మఠం తరపున పాల్గొని సంస్కృతంలో గంటసేపు ప్రసంగించి ఆనాటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబాసునే ఆశ్చర్య చకితుల్ని చేసి "భారతదేశంలో ఇంత అనర్గళంగా సంస్కృతంలో ఇంతసేపు ప్రసంగించే వ్యక్తి ఉన్నారా?" అని అప్రతిభులను చేశారు. వీరికి వచ్చిన శాలువాలు సన్మానపత్రాలకు లెక్కేలేదు. అనేకచోట్ల పల్లకీలో ఊరేగించారు. ఎన్నో రేడియో ప్రసంగాలు చేశారు. సత్యసాయి పెన్ను, రిస్ట్‌వాచీ బహూకరించారు. కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు "సాహితీ మాధవం" అనే ప్రశంసా పద్యం రాసి చివరలో "అభినవానంద భరత" "భావార్థ" "మధుర రస పథ విహారి మాధవ రామ సూరి" అని కీర్తించారు. సాహిత్య వాదస్పతి పండిత పరమేశ్వర, సాహిత్య విద్యాధర శ్రీ జమ్మల మడక మాధవ రామశర్మగారు ఎనభై ఒక్క ఏడాది సార్థక జీవితం గడిపి గీర్వాణ భాషా సేవలో పునీతులై 13-7-1988న "మాధవ సదనం" చేరుకొన్నారు.

ఆధారం:- శర్మగారి శతజయంతి(2007) కుమారుడు శ్రీ జమ్మల మడక భవ శర్మ రచించి ప్రచురించిన పుస్తకం "మా నాన్న- జమ్మల మడక మాధవ రామ శర్మ"నుండి. ❀

135. స్వర్ణ కమల గ్రహీత, నడిచే పాణిని - పేరి సూర్యనారాయణ శాస్త్రి (1910 ad)

గురుముఖ విద్య

20-8-1910 జన్మదినంగా కల పేరి సూర్యనారాయణ శాస్త్రిగారు విజయనగరం జిల్లా పెదనందిపల్లిలో సర్వేశం, సోమమ్మ దంపతులకు జన్మించారు. పేరి అప్పల నరసయ్య శాస్త్రి గారి వద్ద కావ్యనాటక, అలంకారాలను అధ్యయనం చేశారు. పేరి వెంకటేశ్వర శాస్త్రిగారి నుండి భాష్యంత వ్యాకరణం అభ్యసించారు. "వైయాకరణ భూషణ సారం", "లఘు మంజూష", "శబ్ద కౌస్తుభ", "భాట్ట దీపిక", "కావ్య ప్రకాశిక", "రస గంగాధరం" గ్రంధాలను తాతారాయుడు శాస్త్రిగారి శిష్యరికంలో నేర్చారు. "ఖండన అద్వైత ప్రస్తానం", "చతుస్తంత్రి", "న్యాయ కాణాది" మున్నగు వానిని పేరి లక్ష్మీ నారాయణ శాస్త్రి, కొల్లూరు సోమశేఖర శాస్త్రి, కొల్లూరు లక్ష్మణమూర్తి శాస్త్రిల నుండి గురుముఖతా అధ్యయనం చేశారు.

వ్యాకరణ బోధనా సామర్థ్యం

విద్యార్థిగా ఉంటూనే ఉద్యోగం చేశారు. సింహాచల సంస్కృత పాఠశాల అధ్యాపకులయ్యారు. 1940 విజయనగర మహారాజా వారి సంస్కృత కళాశాలలో అధ్యాపకులుగా నియమింపబడ్డారు. ముప్పై ఏళ్ళు విద్యాబోధన కొనసాగించారు. వేలాది మంది ప్రతిభావంతులైన శిష్యులను తయారుచేశారు. "కౌముది" అంటే ఇనప ముద్ద అని భయపడే వారు బోధకులు అలాంటి అయ: పిండమైన కౌముదిని వెన్నెలంత ఆహ్లాదంగా శాస్త్రిగారు బోధించి మనసుకు ఆహ్లాదం కలిగించేవారు. ఒకరకంగా "కౌముది శాస్త్రి"గారు అనిపించుకొన్నారు.

అమూల్య గ్రంథ రచనా పాటవం

విద్యాబోధనా కొనసాగిస్తూనే అమూల్య గ్రంథ రచనా చేశారు. సంస్కృత

భాషలో “నాగేశ లఘు మంజూష”కు “నాగేశ భావ ప్రకాశ వ్యాఖ్య”, “వైయాకరణ భూషణ సారం”కు “తత్వ దర్శిని” వ్యాఖ్య, “ఖండ దేవ భట్ట రహస్యం”కు “భావ ప్రకాశ వ్యాఖ్య” “వైయాకరణ భూష సారం”కు “తత్వ దర్శిని వ్యాఖ్య”, “ఖండదేవ భాట్ట రహస్యం” రచించిన మహాపండితులు సూర్యనారాయణ శాస్త్రిగారు. తెలుగు భాషలో న్యాయ, వైశేషిక, సాంఖ్య, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంసలకు వ్యాకరణ శాస్త్రాన్ని కూడా జోడించి “షడ్ దర్శనములు” పేరిట అనువదించారు. వృత్తి విచార” అనే గ్రంధం “పంచ వృత్తి విచారం”కు ఆంధ్రానువాదంగా రచించారు. పతంజలి మహర్షి “అద్వైత ప్రకరణం”ను “ఆంధ్ర వివరణ సారం”, “పరమార్ధ సారం”గా తెలిగీకరించారు. “భర్తృహరి వాక్య నదీయం”ను శ్రీభాష్యం అప్పలాచార్యుల వారితో కలిసి అనువదించారు. “కుమార సంభవ విమర్శ”ను శాస్త్రిగారు రాశారు. పత్రికలకు అనేక వ్యాసాలు రాశారు. అందులో ముఖ్యమైనవి “స్పాటి స్పోటనం”, “బహువ్రీహి సమాసం” బాగా ప్రసిద్ధి చెందాయి. ఆంధ్రా యూనివర్సిటి సైన్స్ అధ్యాపకులు వసంతరావు వెంకట రావు గారితో కలిసి ఆంధ్ర ప్రభలో “కాల తత్త్వం” ధారా వాహికగా రాశారు. “కౌముదికి” తెలుగులో సులభ విధానంలో “వ్యాకరణ సిద్ధాంత మంజరి” పేరిట అనువాదం చేశారు. రస గంగాధర వ్యాఖ్యలన్నీ క్రోడీకరించి “జగన్నాధ గూడార్ధ దీపిక” రాసి జగన్నాధ పండితుని శేముషీ వైభవాన్ని ఆవిష్కరించి తన ఆరాధనా భావాన్ని చాటుకొన్నారు.

జంగమ పాణిని – అలంకారాలైన బిరుదులు, సత్కారాలు

ఈ ప్రతిభను గుర్తించి శృంగేరీ పీఠాధిపతులు శాస్త్రిగారిని “జంగమ పాణిన:” అంటే “నడిచే పాణిని” అని గౌరవించి ఘనంగా సత్కరించారు. మన రాష్ట్రంలోనే కాకుండా ఉజ్జయిని, జయపూర్, పూనా మున్నగు ప్రదేశాలలో జరిగిన విద్వత్ సభలకు ఆహ్వానింపబడి సన్మానితులయ్యారు. శాస్త్రిగారికి గొప్ప నటనా కౌశలం దర్శకత్వ ప్రతిభా ఉన్నాయి. ఉజ్జయిని నగరంలో 14 రాష్ట్రాల మధ్య “కాళిదాస అభిజ్ఞాన శాకుంతల” నాటక పోటీ జరిగితే అందులో “రాజ పురోహితుడు”గా నటించి నాటకాన్ని నిర్వహించి ప్రధమ స్థానాన్ని ఉత్తమ ప్రదర్శనకు ఉత్తమ నటనకు ఎంపికై “స్వర్ణ కమలం” బహుమతిగా పొందిన విశేష ప్రజ్ఞాశీలి.

వ్యాకరణ రత్న, వ్యాకరణాచార్య, ఉపనిషద్ధర్మ వాచస్పతి, దర్శనాచార్య, పద వాక్య ప్రమాణజ్ఞ వంటి సార్థక బిరుదులెన్నో శాస్త్రిగారిని వరించి సార్థకమై, గౌరవం పొందాయి. "విశ్వ సంస్కృత భారతి" సంస్థ శాస్త్రిగారిని సగౌరవంగా ఆహ్వానించి లక్ష రూపాయల నగదు, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించింది. కాశీ విశ్వవిద్యాలయం "మహా మహోపాధ్యాయ" గౌరవ బిరుదునిచ్చి, గౌరవించి, సన్మానించింది. అరవైవ ఏడు మీద పడినా, పదవీ విరమణ చేసినా శాస్త్రిగారు శిష్యులకు బోధించటం మానలేదు. సంస్కృత బోధనా చేస్తూనే ఉన్నారు. రాజమండ్రి గౌతమీ విద్యాపీఠం, మంత్రాలయం, తిరుపతి కేంద్రీయ విద్యాపీఠాలలో సంస్కృతం బోధిస్తూనే ఉన్నారు. అదే వారికి మహదానందమైన వ్యాపకంగా ఉండేది.

ఎనభై అయిదేళ్ళు చక్కని ఆరోగ్యంతో జీవించి, అధ్యయన, అధ్యాపన, గ్రంథ రచనలను నిరంతరం కొనసాగించి సార్థక జీవి అనిపించుకొన్న పేరి సూర్యనారాయణ శాస్త్రిగారు 1995 సెప్టెంబర్‌లో "సవిత్రు మండల నారాయణ మూర్తి"ని చేరుకొన్నారు. ❁

గబ్బిట దుర్గాప్రసాద్

136. కులపతి - కప్పగంతుల సుబ్రహ్మణ్య శాస్త్రి (1911 ad)

బాల్యం - విద్యాభ్యాసం

1911లో పశ్చిమ గోదావరిజిల్లా నిడమర్రు మండలం "చిన నింద్ర కొలను" గ్రామం (ఫత్తేపురం)లో పోతుకూచి వారి కన్నాపురం అగ్రహారంలో వేద శాస్త్ర పారంగతులు కప్పగంతుల కామావధానులు, మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి వద్దే వేదాధ్యయనం చేశారు. పిసుపాటి రామచంద్రయ్యగారి దగ్గర ఆంధ్ర, ఆంగ్ల, హిందీలను నేర్చుకొన్నారు. గుంటూరులో ప్రతాప కృష్ణమూర్తి శాస్త్రిగారి దగ్గర సాహిత్యం చదివారు. కంభంపాటి రామమూర్తి, అభినవ విద్యారణ్య, పద్మ విభూషణ్ ఉప్పులూరి గణపతి శాస్త్రి, బాలవ్యాస వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రిగారల నుండి "భాష్యంత వ్యాకరణం" ఆసాంతం నేర్చుకొన్నారు. బ్రహ్మశ్రీ మండలీకం వెంకట రామశాస్త్రిగారి శిష్యులై వేదాంత, న్యాయ శాస్త్రాలను సంపూర్ణంగా గ్రహించారు. చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారి వద్ద "కావ్యజ్ఞ శిక్షా భ్యాసం" చేశారు.

ప్రతిభా సుబ్రహ్మణ్యీయం

సుబ్రహ్మణ్య శాస్త్రిగారు మహావక్త. వారి వాగ్ధాటి అమోఘం. కాళిదాస శ్రీ హర్షాది కవుల సౌందర్య ప్రతిభపై ఎన్నో ప్రసంగాలు చేశారు. వ్యాకరణ శాస్త్ర గాంభీర్యాన్ని గూర్చి, సంస్కృత సాహిత్య లోతులపైనా, వేదం శాస్త్ర విషయాల గురించి, వేదాంత శాస్త్ర రహస్యాలపైనా పలు ప్రసంగాలు చేసి శ్రోతలను ఆకట్టుకొనేవారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో స్థిరపడ్డారు.

సంస్కృత విద్యాలయ ప్రారంభం

ఏలూరులో గుండు కృష్ణమూర్తి, సోమంచి లింగయ్య, సభావతి వంటివారి సహాయ సహకారాలతో పవరుపేటలో 'హేలాపురి సంస్కృత పాఠశాల"ను

4-3-1943న స్థాపించి ప్రాచీన సంప్రదాయ విధానంలో విద్యార్థులకు సాహిత్య, వ్యాకరణ, వేదాంత శాస్త్రాలు బోధించేవారు. విద్యార్థులకు ఉచిత భోజన వసతి, ప్రతిభావంతులైన వారికి ఉపకార వేతనాలు కల్పించి ప్రోత్సహించారు. శాస్త్రిగారు ఈ విద్యాలయానికి "కులపతి"గా వ్యవహరించేవారు. విద్యా ప్రవీణ భాషా ప్రవీణ హిందీ బి.ఏ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణనిచ్చేవారు. ఉపాధి అవకాశాలున్న విద్యలనూ నేర్పించేవారు.

పెదముత్తేవి ముముక్షు పీఠాధిపతులు శ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులు, ప్రసిద్ధ సంస్కృత కవి పండితులు ఏలూరు పాటి అనంతరామయ్య, మానాప్రగడ శేషసాయి, సూరి భోగేశ్వర శాస్త్రి, కప్పగంతుల వీరభద్ర శాస్త్రి, శ్రీమాన్ రొంపి చర్ల శ్రీనివాసాచార్యులు మొదలైన ఉద్దండ శాస్త్ర పండితులందరూ ఈ పాఠశాలలో చదివి సుబ్రహ్మణ్య శాస్త్రిగారి శిష్యరికం చేసినవారే. ఆనాటి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీ పి.ఎల్.శివరాం. ఈ విద్యాలయంలోనే చదివి, శాస్త్రిగారి వద్ద వేదాంత శాస్త్రాన్ని అధ్యాయం చేశారు. ఈ సంస్కృత విద్యాలయాన్ని రాష్ట్రంలోనే ప్రామాణికమైన విద్యా సంస్థగా శాస్త్రిగారు తీర్చిదిద్దారు.

ఉపన్యాస లహరి - వితరణ

శాస్త్రిగారు భారత భాగవత రామాయణ పురాణాలపై వేదాంత భాష్య విచారణపై ఎన్నో ప్రవచనాలు, ప్రసంగాలు చేసి వచ్చే ఆదాయాన్ని విద్యాలయ విద్యార్థుల పోషణకు, విద్యాలయాభివృద్ధికి వినియోగించిన ధర్మ పరాయణులు. వీరి సంస్కృత భాషా సేవకు పాండిత్యానికి కంచి కామకోటి పీఠాధిపతులు గౌరవించి సత్కరించి ప్రశంసించారు. నిరంతర గీర్వాణ విద్యాసేవలో జన్మ చరితార్థం చేసుకొన్న కప్పుగంతుల సుబ్రహ్మణ్య శాస్త్రిగారు 14-10-1974న అరవై మూడవ ఏట సుబ్రహ్మణ్య సన్నిధి చేరారు. ❀

137. ఆంధ్ర బిల్హణ - కప్పగంతుల లక్ష్మణశాస్త్రి (1911 ad)

సంస్కృతమే అన్నీ

కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారు మహబూబ్ నగర్ జిల్లా వనపర్తిలో 2-7-1911న, శ్రీనివాస శాస్త్రి, పద్మావతి దంపతులకు జన్మించారు. తిరుపతి, అన్నామలై, మద్రాస్ సంస్కృత కళాశాలలో చదివి సాహిత్య శిరోమణి, వేదాంత శిరోమణి డిగ్రీలు పొందారు.

ఉద్యోగం - ఎదుగుదల

వనపర్తి సంస్థానంలో ఆస్థాన విద్వాంసులుగా గౌరవ స్థానం అలంకరించారు. అక్కడే హైస్కూల్‌లో భాషా పండితులుగా పనిచేశారు. తర్వాత హైదరాబాద్ ప్రభుత్వ సమాచార శాఖలో అసిస్టెంట్ డెరెక్టర్‌గా చేరారు. పిమ్మట ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో డిప్యూటీ డైరెక్టర్ అయ్యారు. ఈ పదవిలో ఉండగానే ప్రాచ్య కళాశాల ఉపాధ్యాయుల జీతాలను మిగిలిన డిగ్రీ కళాశాలల ఉపాధ్యాయుల జీతాలతో సమానంగా ఉండేట్లు చేసి భాషా పండితులకు గౌరవ ప్రదమైన జీతాలు వచ్చేట్లు చేసి అందరి అభిమానానికి పాత్రులయ్యారు.

సంస్కృత భాష స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగి దేశమంతా తిరిగి సంస్కృత భాషావ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. మళ్ళీ సమాచార శాఖలో డిప్యూటీ డైరెక్టర్ అయి, "హైదరాబాద్ టుడే", "ఆంధ్రప్రదేశ్" మొదలైన ప్రభుత్వ పత్రికలకు సంపాదకులుగా ఉన్నారు.

లక్ష్మణ శాస్త్రీయం

మాదిరాజు విశ్వనాధ రావు అనే తోటి కవితో కలిసి "బిల్హణుని విక్రమామ్క

దేవ చరిత్ర" కావ్యాన్నీ, "కర్ణ సుందరి" నాటకాలను ప్రబంధ శైలిలో ఆంధ్రీకరించారు. "తెలుగు - సంస్కృత కోశం", "సంస్కృత వాచకాలు" రచించారు. "విజ్ఞాన సర్వస్వం". "సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశం"లలోను వివిధ పత్రికలలోనూ లెక్కకు మించి వ్యాసాలూ రాశారు. శాస్త్రిగారు మహా వక్త. తెలుగు సంస్కృతం, కన్నడ, తమిళ, మరాఠీ, హిందీ, ఉర్దూ భాషలలో ఉద్దండ పండితులు. ఆ భాషలలో అనర్గళంగా ప్రసంగించే నేర్పున్న వారు. ఈ భాషలలోని ఎన్నో గ్రంధాలను తెలుగులోకి అనువాదం చేశారు. భారత ప్రధమ రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్‌గారు హైదరాబాద్ సందర్శించినప్పుడు లక్ష్మణ శాస్త్రిగారు కావ్య ప్రబంధ ధోరణిలో స్వాగత శ్లోకాలు రాసి ఆహ్వానించారు. ఆ శోభ చూద్దాం -

"నిష్ణాత: ప్రాచ్య విద్యా స్వనితర ధిషణే - దుర్గమే రాజ్య తంత్రే - విద్వాన్ పాశ్చాత్య తంత్రే ష్వఖిల భారత భూ - వాసినాం భాగ్య సీమా - రాజ్యానాం పాలనే చ ప్రభురతి నిపుణో - ప్యప్రద్రుష్యోభిగ్య: - జీయాత్ రాజేంద్ర విద్వానతి శత శరదం - భారతం సేవ మాన:"

సత్కార పురస్కార బిరుదాంకితాలు

కాశీ సంస్కృత విశ్వవిద్యాలయం. ఆంధ్రా, ఉస్మానియా విశ్వవిద్యాలయాల బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యులై సేవలందించారు. "సుర భారతి" వ్యవస్థాపక అధ్యక్షులు. ఆంధ్ర సారస్వత పరిషత్ స్థాపక సభ్యులు. తిరుపతిలో జరిగిన విద్వత్ సభలో శాస్త్రిగారికి "ఆంధ్ర బిల్హణ" బిరుద ప్రదానం చేసి గౌరవించారు. ఉత్తర ప్రదేశ్‌లోని మదన మోహన మాలవ్యా విద్యా సంస్థాన్ "సుధీంద్ర మౌళి"తో గౌరవించి సన్మానించింది. "బ్రహ్మ భూషణ" అన్నది వీరి సాహితీ పాండితికి లభించింది. కాశీ విద్వత్ పరిషత్తు శాస్త్రిగారిని "మహా మహోపాధ్యాయ" బిరుదంతో సన్మానించింది. తిరువాన్కూర్, గ్వాలియర్ జగద్గురు శంకరాచార్యుల వారి చేత కప్పగంతుల వారు ఘనంగా సత్కరింపబడ్డారు. విద్యామంత్రి మండలి వెంకట కృష్ణారావుగారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జలగం వెంగల రావుగారి నిర్వహణలో జరిగిన ప్రధమ ప్రపంచ తెలుగు మహాసభలో లక్ష్మణ శాస్త్రిగారు ప్రత్యేకంగా సన్మానం అందుకొన్నారు. దేశంలోని ప్రముఖ సాహిత్య సంస్థలన్నీ శాస్త్రిగారిని

ఆహ్వానించి వారి ఉపన్యాస లహరిలో తడిసి విశేష సత్కార, పురస్కారాలు అందజేశాయి.

వీలైనప్పుడల్లా వివిధ ప్రదేశాలను సందర్శిస్తూ అక్కడి స్థానిక భాషలైన హిందీ, మరాఠీ, కన్నడం, తమిళం మొదలగు భాషలలో ప్రసంగించి వారిని ముగ్ధులను చేసేవారు. వీరి ఆధ్వర్యంలో ఏర్పడిన "సార్వభౌమ సంస్కృత ప్రచార కార్యాలయం"కు అధ్యక్షులుగా వ్యవహరించారు. వీరి పాండిత్యాన్ని మెచ్చుకొన్న పండిత ద్వివేదీ శాస్త్రి సంస్కృతంలో వీరిని

"మూర్తిర్మత్త గజేంద్ర దర్ప దళినీ వాణీ వినోద ప్రియా – వ్యాఖ్యాలేఖ కవిత్వ కౌశల కళా పారంగతా, శేముషీ

శక్తి సంస్కృత భాషణే ప్యనుపమా విద్వజ్జనే స్వాదరః – శ్రీ మల్లక్ష్మణ శాస్త్రిణాంగుణ గుణాః కేషాంన తోషా వహాః" అని శ్లాఘించారు.

శాస్త్రిగారు తుది శ్వాస వదిలే వరకు "కాశీ సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం" ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా (సమ్మాన్య ప్రాచ్యాచార్యులు)గా ఉన్నారు. శాస్త్రిగారు అందరికి మిత్రులే. తర తమ భేదం లేనివారు. అందరూ శాస్త్రిగారికి అత్యంత ఆత్మీయులే మిత్రబృందంలోని వారే. అదీ వారి ప్రత్యేకత. డెబ్బై సంవత్సరాలు సార్థక జీవనం గడిపి 10–1–1981 తేదీన ఈ సంస్కృత సాహితీ వాఙ్మయ శిఖరం నేల వ్రాలింది❀

138. శంకరాద్వైత నిష్ణాతులు - చదలవాడ సుందర రామశాస్త్రి (1912 ad)

ఆంధ్రదేశంలో వావిళ్ళ రామస్వామి అండ్ సన్స్ ప్రెస్ ప్రఖ్యాతి చెందింది. దీని స్థాపకులే వావిళ్ళ రామస్వామి శాస్త్రిగారు. వీరు సంస్కృతాంధ్రాలలో అరుదైన పుస్తకాలన్నీ సేకరించి పరిష్కరించి ప్రచురించారు. పుస్తక ముద్రణకు ఒక "హాల్ మార్కు రామస్వామి శాస్త్రిగారు. వీరి అల్లుడే చదలవాడ సుందర రామశాస్త్రిగారు. 1840లో జన్మించారు. రామశాస్త్రిగారు సంస్కృతాంధ్రాలలో దిట్ట. పందొమ్మిదవ శతాబ్దపు ప్రసిద్ధ పండితులలో ఒకరుగా గుర్తింపు పొందారు. శంకరాద్వైతంలో నిష్ణాతులు. సంస్కృతంలో స్రగ్ధరా వృత్తంలో "ఆదిత్య స్తవం" అనే శతకం రచించారు. ఇది మయూరుడు సంస్కృతంలో రాసిన సూర్య శతకానికి దీటుగా ఉందని పండితులు ప్రశంసించారు. భగవద్గీతా భాష్యాలన్నీ క్షుణ్ణంగా అధ్యయనం చేసి, పరిశీలించి, పరిశోధించి "ఆనంద చంద్రిక" అనే వ్యాఖ్యానంతో ఆరు సంపుటాలు ప్రచురించారు. వాల్మీకి మహర్షి రాసిన శ్రీ మద్రామాయణానికి ప్రతిపద, టీకా తాత్పర్యాలు రాసి 15 సంపుటాలుగా ముద్రించారు. మామగారు మరణించిన తర్వాత వావిళ్ళ వారి ప్రెస్ బాధ్యతలను చేబట్టి ప్రచురణను కొనసాగించారు. డెబ్భై అయిదేళ్ళు జీవించి 1925లో మరణించారు.❁

139. గణితావధాన శేఖర - పులివర్తి శరభాచార్యులు (1912 ad)

విశ్వ బ్రాహ్మణ కుటుంబంలో పులివర్తి శరభాచార్యులు 1912లో జన్మించారు. సువర్ణ రుషి గోత్రీకులు. తండ్రి నాగభూషణం, తల్లి శేషమ్మ. తెనాలి కొల్లూరులో పుట్టారు. బి.ఏ, బి.ఇడి పాసై ప్రభుత్వ విద్యాశాఖలో ప్రవేశించారు. జిల్లా విద్యాశాఖాధికారిగా అంచెలంచెలుగా పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు.

శరభాచార్యులకు చిన్ననాటి నుండి ఆధ్యాత్మ గురువులైన తత్వానందుల వారి శిష్యులుగా ఉన్నారు. దీనితో ప్రభుత్వోద్యోగం చేస్తూనే, ఆధ్యాత్మ భావ పరంపరాలలో ఉన్నత శ్రేణి సాధించారు. బాల్యంలోనే కవిత్వ ధార అబ్బింది. సంస్కృతంలో గొప్ప ప్రవీణ్యాన్ని సాధించి "నివేదనం", "మరుత్సందేశ:", "యశోధరా" అనే కావ్యాలను "కలాదర్శ" అనే సంస్కృత నాటకాన్ని రాశారు. తెలుగులో "కల్హార మాల", "రత్న గర్భ", "కర్మ భూమి" రాశారు. ఆచార్య శ్రీ ఆంగ్ల భాషలోను నిష్ణాతులు. ఇంగ్లీష్‌లో "డాక్టర్స్ వార్" అనే కావ్యం రచించి ఆశ్చర్యపరచారు అంటే త్రిభాషా కవులన్న మాట. అందుకే "త్రిభాషా కవి" కవి బిరుదునందుకొన్నారు. వీరు రాసిన సంస్కృత కావ్యాలను వంగవోలు ఆదిశేష శాస్త్రి తెలుగులోకి సరస సరళ భాషలోకి అనువదించారు.

జిల్లా విద్యాశాఖాధికారిగా ఉంటూనే అష్టావధాన విద్యనూ నేర్చుకొని వందకు పైగా అవధానాలు చేసి రసజ్ఞుల మెప్పు పొందారు. గణితంలోనూ అవధానం చేయవచ్చునని నిరూపించి ఆ విద్యను కనిపెట్టి, ఆ విద్యలో ఆద్యులై సాటిలేని మేటి అనిపించుకొని గణితావధానాలు చేశారు. ఈ వింత అవధానం

అందరిని ఆకర్షించింది. చాలా ప్రదర్శనలిచ్చారు. "గణితావధాన శేఖర" గౌరవ పురస్కారాలనందుకొన్నారు. వీరు చేసిన అవధాన విశేషాలు, పద్యాలు అన్నిటిని సంకలితం చేసి "అవధాన వాణి" గ్రంథంగా విడుదల చేశారు. వినయం, విజ్ఞత మూర్తీభవించిన అవధాన శేఖరులు ఆచార్యులవారు. జీవితమంతా ఆధ్యాత్మిక దారిలో గడిపిన వీరు అతి నిరాడంబరంగానే ఉండేవారు. ఏనాడూ హళ్ళూ, అధికారం, ఆర్భాటం, హోదా, దర్జా, డాబు, దర్పం లేకుండానే ఉన్నారు. ఎంత ఎదిగారో అంత ఒదిగి ఉన్న వివేకమూర్తి. ప్రజ్ఞా పాటవ ప్రదర్శనా చేయని హుందాతో కూడిన అరుదైన వ్యక్తిత్వం వారిది. అరవై ఎనిమిది సంవత్సరాలు ప్రజాసేవలో సాహితీ సుజనుల మధ్య గడిపిన పులివర్తి శరభాచార్యులవారు 1980లో శంభు లోకం చేరారు.❋

140. రేడియోలో సంస్కృత పాఠాలు బోధించిన సర్వోదయ ప్రచారకులు – కే.వేం.నృ.అప్పారావు (1913 ad)

విద్యా వైదుష్యం

కేశిరాజు వెంకట నృశింహ అప్పారావుగారు 1913లో మార్చి పద్నాలుగున తూర్పు గోదావరిజిల్లా దేవీ పట్నంలో జన్మించి, ప్రాథమిక విద్య అక్కడే చదివి తర్వాత కొవ్వూరు జిల్లా బోర్డ్ హైస్కూల్‌లో సెకండరీ విద్య పూర్తి చేశారు. కొవ్వూరు ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో విద్య నేర్చారు. హిందీలో రాష్ట్ర భాష పరీక్ష పాసైనారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి సంస్కృతాంధ్రాలలో ఉభయ భాషాప్రవీణ డిగ్రీ పొందారు. “ఇండో యూరోపియన్ భాషాశాస్త్రం”పై పరిశోధన చేసి పత్రాన్ని సమర్పించి ఆంధ్ర విశ్వ కళా పరిషత్ నుండి పి.ఓ.ఎల్ డిప్లమా తీసుకొన్నారు. నాగపూర్ యూనివర్సిటీ నుండి ఎం.ఏ డిగ్రీ సాధించారు.

విద్యాబోధన – రాజకీయ ప్రవేశం

కొవ్వూరులో వాడ్రేవు జోగాయమ్మ సంస్కృత కళాశాల అంటే ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. దేశభక్తి మెండుగా ఉన్న అప్పారావుగారు ఉద్యోగం చేస్తూనే 1941 వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్ట్ అయి నాలుగు మాసాలు జైలు శిక్ష అనుభవించిన దేశ భక్తులు. క్విట్ ఇండియా ఉద్యమంలోనూ పాల్గొని ఏడాదిన్నర జైలు శిక్ష అనుభవించారు. గాంధీగారి పిలుపై స్పందించి ఎన్నో నిర్మాణాత్మక కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఆచార్య వినోభా భావేగారి సర్వోదయ ప్రభావం అప్పారావుగారిపై పడింది. తెనాలి నుండి వెలువడే "సామ్య యోగం" అనే సర్వోదయ పక్షపత్రికకు గౌరవ సంపాదకులుగా సేవ చేశారు.

సామాజిక సేవ

కొవ్వూరులో రెబ్బా ప్రగడ మందేశ్వర శర్మగారు స్థాపించిన "వీర మందిరం" అనే సంస్థ ద్వారా ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న గిరిజనుల విద్యా సంస్కృతుల అభివృద్ధి కోసం అవిశ్రాంత కృషి సల్పారు. వారి జీవితాలలో వెలుగులు పూయించారు.

కేశవ నృసింహీయం

1938 నుండి పదేళ్ళు కొవ్వూరు సంస్కృత కాలేజిలో అధ్యాపకులుగా పని చేసి, ఉపాధ్యక్షులుగా పదోన్నతి పొందారు. 1948 నుండి 1974 వరకు ఆంధ్ర గీర్వాణ కళాశాలాధ్యక్షులుగా సేవలందించారు. 1975లో ఆంధ్రా యూనివర్సిటిలో సంస్కృత శాఖలో రిసెర్చ్ ఫెలోగా ఉన్నారు. సంస్కృతం, హిందీ భాషలలో ఎన్నో పుస్తకాలు రచించారు. అందులో ఖండకావ్యాలు, కథలు, విమర్శనా వ్యాసాలున్నాయి. వీరి సంస్కృత కావ్యాలు – "పంచవటి", "గంగా లహరి" మొదలైనవి. వీటికి తెలుగు అనువాదమూ తామే చేసి ప్రచురించారు. "బృందావనం" అనే కావ్యాన్ని సంస్కృతం, హిందీ, తెలుగు భాషలలో రచించి తన పాండిత్య ప్రకర్షను ప్రకటించుకొన్నారు.

గాంధీజీ బోధనలను ఏర్చి కూర్చి "గాంధీ గీతా"గాను, వినోబా భావే సామ్యవాద సూత్రాలకు వివరణాత్మకంగా "సంయోగ కారికాః" అనే గ్రంధాన్ని రాశారు. వీరి కథలు "ఆకాశవాణి" ద్వారా చాలా ప్రసారమయ్యాయి. వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు సాంఖ్య యోగాత్మకంగా మాత్రా ఛందస్సులో రాసిన "మనిషి – మహర్షి" అనే గేయ కావ్యాన్ని అదే రాగ తాళ లయలతో మాత్రా ఛందస్సులోనే సంస్కృతంలో రచించి యెనలేని కీర్తిని పొందారు. వినోబా హిందీలో రాసిన "శిక్షణ విచార ధారా"ను తెలుగులోకి తర్జుమా చేశారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం నాటకాన్ని తెలుగు నాటకంగా మలిచారు. తెలుగులో ఖండ కావ్యంగా

"వసుంధరా సాంత్వనం" రచించారు. తన తెలుగు వ్యాసాల సంపుటిని "వ్యాస పీఠం"గా వెలువరించారు. ఆంగ్ల భాషలో "ఎస్సేస్ ఆన్ సింథేసిస్" వ్రాసి ముద్రించారు. విజయవాడ ఆకాశవాణి ద్వారా "అమర భారతి" పేరిట విద్యార్థులకు సులభంగా సంస్కృత బోధనా కార్యక్రమాన్ని ఎన్నో ఏళ్ళుగా నిర్వహించిన ఘనత నృసింహ అప్పారావుగారిది. "కేయూరాని విభూషణాని" అనే శ్లోకంతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం ఎందరినో ప్రభావితం చేసింది. శబ్ద ప్రయోగాలు శ్లోక, వివేచనా, కవితా ప్రతిభా, కవి చేసిన చమత్కారాలను అప్పారావుగారు అరటి పండు వొలిచి చేతిలో పెట్టినంత సులువుగా వివరించి ఉత్సుకతను కలిగించేవారు.

పురస్కార గౌరవాలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎకడమిక్ కౌన్సిల్ సభ్యులుగా నియమించి అప్పారావు గారిని గౌరవించింది. సంస్కృత బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యులుగా సేవ చేశారు. వీరి సాహిత్య సాంఘిక సేవా కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకొని ఆంధ్రవిశ్వవిద్యాలయం 1974లో "కళా ప్రపూర్ణ" బిరుదు గౌరవం అందజేసి సత్కరించింది. అప్పారావుగారు అరవై నాలుగేళ్ళు జీవించి 1977 జనవరి పన్నెండున అకాల మరణం పొంది సాహితీ లోకానికి వెలితి మిగిల్చారు. ❁

141. రాయల్ సొసైటీ సభ్యుడు - రాం కరణ్ శర్మ (1927 ad)

బీహార్‌లోని శరణ జిల్లా శివపూర్‌లో రాం కరణ్ శర్మ 1927లో జన్మించాడు. పాట్నా యూనివర్సిటి నుండి సంస్కృత హిందీ భాషల్లో ఎం.ఏ డిగ్రీ పొందాడు. సాహిత్యాచార్య, వ్యాకరణ శాస్త్రి, వేదాంత శాస్త్రి పట్టాలను సాధించాడు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న బెర్కిలీ యూనివర్సిటి నుండి భాషా శాస్త్రంలో పి.హెచ్.డి ని "ముర్రే బి ఎమన్యు" గైడెన్స్‌లో చేశాడు. సంస్కృత ఆంగ్లాలలో బహు రచనలు చేశాడు. సంధ్య, పాథేయ శతకం, వీణ అనే సంస్కృత పద్యకావ్యాలు, రాయసా, సీమా అనే నవలలు మహా భారతంలో కవిత్వ మూలాలు అనే గొప్ప పరిశోధనాత్మక విశ్లేషణాత్మక గ్రంథం రాశాడు. ఎన్నో వైద్య గ్రంథాలను అనువదించాడు. మహాకావ్యాలను, పురాణాలను అనువాదం చేశాడు. ఇండాలజీ (భారతీయ చరిత్ర సాహిత్యం వేదాంతం సంస్కృతీ)పై జరిగిన ఎన్నో సెమినార్‌లలో పాల్గొని అనేక పరిశోధనా పత్రాలను రాసి వెలువరించాడు.

పురస్కారాలు

కేంద్ర సాహిత్య అకాడెమి నుండి సంస్కృతంలో అవార్డ్ అందుకొన్నారు. భాషా సాహిత్య పరిషత్ అవార్డ్, ఢిల్లీ సంస్కృత అకాడెమి అవార్డ్‌లను పొందాడు.

కృష్ణకాంత్ హాన్దీక్ మెమోరియల్ అవార్డ్ సంస్కృత భాషా వ్యాప్తికి చేసిన సేవకు లభించింది. బిర్లా ఫౌండేషన్ వాచస్పతి పురస్కారాన్ని అందజేసింది. రాయల్ ఏసియాటిక్ సొసైటీ, అమెరికన్ ఓరిఎంటల్ సొసైటీలలో విశిష్ట సభ్యులుగా నియమింపబడి గౌరవం పొందారు.

దర్భాంగలోని కామేశ్వర సింగ్ సంస్కృత యూనివర్సిటి వైస్ చాన్సెలర్‌గా 1974–80 కాలంలో పనిచేశాడు రాంకరణ్ శర్మ. వారణాసిలోని సంపూర్ణానంద్ సంస్కృత యూనివర్సిటికి కూడా ఉప కులపతిగా 1984 నుండి ఒక ఏడాది సేవ చేశాడు. అమెరికాలోని చికాగో, కొలంబియ, పెన్సిల్వేనియా యూనివర్సిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు.

రాం కరణీయం

రాంకరణ్ శర్మ సంస్కృతంలో సంధ్య, పాథేయ శతకం, వీణా, కవిత, సర్వం సహా కావ్యాలను రాశాడు. రాయిసంసీమ అనే సంస్కృత నవలలు రచించాడు. ఇంగ్లీష్‌లో Elements of poetry in Maha Bharata, Anthology of midieval Indian literature, Researches in Indian and Buddhist philosophy (essays in honour of Professor Alex wayman) రాశాడు. ఇవి కాక శివ సహస్ర నామ శతకం, శివ సుఖీయం, గగన వాణి, చరక సంహిత, రేజు వెనతీవ హితకారే – ఆయుర్వేద, సర్వ మంగళ సుమనోమల, దీపికా – ఇవి కాక గణేశ పురాణంను స్వీయ సంపాదకత్వంలో వెలువరించాడు.

అంతర్జాతీయ భావవ్యాప్తికి శర్మ అనేక సెమినార్‌లను దేశ విదేశాలలో నిర్వహించాడు. భారత ప్రభుత్వానికి విద్యా సలహాదారుగా ఉన్నాడు. ఎన్నో విశ్వవిద్యాలయాలు గౌరవ సలహాదారుగా శర్మ సేవలను వినియోగించుకొన్నాయి❁

142. సాహిత్య రత్న రహస్ బిహారీ ద్వివేది (1935 ad)

ఉత్తర ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో రహస్ బిహారీ ద్వివేది 2-1-1947 జన్మించాడు. సంస్కృతంలో రాష్ట్రపతి ప్రశంసా పత్రం 2012లో అందుకొన్నాడు. సంస్కృత సాహిత్యంలో ఆచార్య డిగ్రీని, సాహిత్య రత్నను, ఎం.ఏ.లను పొందాడు. 1977లో మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న రాణి దుర్గావతి యూనివర్సిటి నుండి సంస్కృతంలో పి.హెచ్.డి పొందాడు. సంస్కృత మహా కావ్యాల గురించి థీసిస్ సమర్పించాడు. తర్వాత జబల్పూర్‌లో రాణి దుర్గావతి యూనివర్సిటి సంస్కృత శాఖలోనే అధ్యాపకునిగా చేరి శాఖాధ్యక్ష హోదా పొందాడు. ఆకాలంలో 16మంది ఆయన వద్ద డాక్టరేట్ థీసిస్ చేశారు. విద్యా వాచస్పతి డిగ్రీని పొందాడు.

సంస్కృత, హిందీ, ఆంగ్లాలలో సుమారు యాభై పరిశోధనా పత్రాలను సమర్పించిన మేటి విద్యావేత్త ద్వివేది. అందులో ముఖ్యమైనవి – ఏడవ శతాబ్దంలో సంస్కృత మహా కావ్యాలపై విమర్శనాత్మక పరిశోధన చేసి పి.హెచ్.డికి థీసిస్‌ను రాశాడు. తరువాత "అర్వాచీన సంస్కృత కావ్యాను శీలనం"ను ఆధునిక సంస్కృత కావ్యాలను విశ్లేషిస్తూ 1981లో రాశాడు. దీన్ని మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో ఉన్న సాగరిక సమితి ముద్రించింది. సంస్కృత విమర్శనా వ్యాస సంకలనంగా "సాహిత్య విమర్శనం"ను 2002లో తెస్తే, సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం ప్రచురించింది. స్వస్తి సందేశం, స్వరిత సందేశం, సంస్కృత వాఙ్మయ విజ్ఞాన్, తీర్థ భారతం అనే భారతీయ యాత్రా స్థలాలపై గ్రంథం రాశాడు.❀

143. విద్యా సాగరుడైన ఆచార్య జ్ఞాన సాగర్ (1940 ad)

ఇరవైవ శతాబ్దానికి చెందిన దిగంబర జైన ఆచార్య కవి జ్ఞానసాగరుడు. అనేక మహా కావ్యాలు రాసి ఆచార్య విద్యాసాగర్ బిరుదు పొందాడు. అసలు పేరు భూరామల్ చబ్ద. తండ్రి పేరు చతుర్భుజ్. తల్లి ఘ్రిత్ భారిదేవి. రాజస్థాన్‌లోని సికార్ జిల్లా రానోలిలో జన్మించాడు. అయిదుగురు పిల్లలో రెండవవాడు. స్వగ్రామంలో ప్రాథమిక విద్య నేర్చి, సంస్కృతాన్ని వారణాసిలో వర్నిజి స్థాపించిన ప్రసిద్ధ "స్వాద్ వాద్" మహా విద్యాలయంలో అభ్యసించాడు. అచార్య శాంతి సాగర్ సాంప్రదాయానికి చెందిన ఆచార్య వీర సాగర్ వద్ద జైన మతావలంబిగా (క్షుల్లక్) దీక్ష పొందాడు. దీక్ష పొందిన తర్వాత ఆయన పేరు "క్షుల్లక్ జ్ఞాన భూషణ్"గా మారింది. అక్కడ నాలుగేళ్ళు సాధనలో గడిపి, అదే సంప్రదాయానికి చెందిన ఆచార్య శివసాగర్ ఆశీస్సులతో జైపూర్‌లోని ఖనియాజి ఆశ్రమంలో 1959లో జైనముని అయ్యాడు. 1968లో పదోన్నతి పొంది రాజాస్థాన్‌లోని నశీరాబాద్‌లో ఆచార్య పదవి అధిష్టించాడు. నశీరాబాద్‌లోనే 1-6-1973లో నిర్యాణం చెందాడు.

సంస్కృతంలో మహా నిధి అయిన జ్ఞానసాగర్ అనేక అమూల్య గ్రంధాలు రచించాడు. ఆయన గ్రంధాలపై కనీసం ముప్పై మంది విద్యార్థులు పరిశోధన చేసి డాక్టరేట్ డిగ్రీలు సాధించాకంటే ఆయన గ్రంధ విస్తృతి యెంత ఉత్తమమైనదో తెలుస్తుంది. మూడు వందల మంది రిసెర్చ్ పేపర్లు ఆయన గ్రంధాలపై రాసి ప్రచురించారు. సంస్కృత భాష మృతభాష అని, దాని పని అయిపోయిందని, దాన్ని ఒంకెవరూ చదవరూ, దాని జోలికి పోరు అని భావిస్తున్న కాలంలో జ్ఞానసాగర్ నాలుగు సంస్కృత మహాకావ్యాలు రాశాడు. ఇవికాక మూడు జైన గ్రంధాలు రాశాడు. వీటిని చదివి మహా మహా సంస్కృత విద్యావేత్తలు, పండితులే ఆశ్చర్యం పొంది ముక్కుమీద వేలేసుకొన్నారు. అంతటి ఉత్తమోత్తమ సాహిత్య సృష్టి చేశాడు జ్ఞానసాగర్. ఆయన పేరుమీద కేంద్ర ప్రభుత్వం పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది. ❀

144. సాహిత్య అకాడెమి పురస్కార గ్రహీత - రేవా ప్రసాద్ ద్వివేది (1947 ad)

మధ్యప్రదేశ్‌లో నర్మదా నదీ తీరంలో నాదేర్ గ్రామంలో పండిత నర్మదా ప్రసాద్ ద్వివేది, లక్ష్మీదేవి దంపతులకు రేవా ప్రసాద్ ద్వివేది 22-12-1935న జన్మించాడు. ఎనిమిదేళ్ళ వయసులో తలిదండ్రులను కోల్పోయిన దురదృష్టవంతుడు. కాశీకి వెళ్లి సంస్కృతాన్ని అభ్యసించాడు. సంస్కృత పూర్వ ఆధునిక సాహిత్యాన్ని అధ్యయనం చేశాడు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి సాహిత్యాచార్య సంస్కృతంలో ఎం.ఏ డిగ్రీ పొందాడు. రాయపూర్‌లోని రవిశంకర యూనివర్సిటిలో పి.హెచ్.డి సాధించాడు. మధ్యప్రదేశ్ జబల్పూర్ యూనివర్సిటి నుండి డి.లిట్ పొందాడు. ప్రతిభా విశేషంతో సంస్కృత ఆచార్య పదవిని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పొంది 1977-95 వరకు నిరాఘాటంగా పద్ధెనిమిదేళ్ళు పనిచేశాడు. ఈ విశ్వవిద్యాలయ "డీన్"గా రెండుసార్లు సేవలందించాడు రేవా ప్రసాద్ ద్వివేది. వారణాసిలో "కాళిదాస సంస్థాన్" ఏర్పరచిన ఘనత ద్వివేదీదే.

రేవా ప్రసాదీయం

రేవా ప్రసాద్ సంస్కృతంలో "సీతా చరిత్రం", "స్వాతంత్ర సంభవం" అనే మహాకావ్యాలు రాశాడు. మొదటగా "ఉత్తర సీతాచరితం" మొదలుపెట్టి 1956 నుండి పన్నెండేళ్ళు 1968 వరకు రాశాడు. ఇది రామాయణాన్ని అనుసరించి రాసినదే. ఉత్తర రామాయణ కథ ఉంది. దీన్ని ఆనాటి సాంఘిక రాజకీయ పరిస్థితులను స్పృశిస్తూ దేశ భక్తి ప్రపూర్వాకంగా రాశాడు. 1991లో రెండవ మహాకావ్యమయిన "స్వాతంత్ర్య సంభవం"కు కేంద్ర సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. ఇందులో భారత స్వాతంత్రోద్యమ చరిత్రను విపులంగా వర్ణించాడు. అణుయుగంపై రాసిన సంస్కృత కవితలను "ప్రమత:" పేరుతో ప్రచురించాడు. మధ్యప్రదేశ్ జీవన వాహిని అయిన రేవా అంటే నర్మదా నదిని

స్తుతిస్తూ "శ్రీ రేవా భద్ర పీఠం" అనే కావ్యాన్ని రాశాడు. శతపత్రం అనే కవిత సంపుటిని, "యూతిక" అనే నాలుగు అంకాల నాటకాన్ని రేవా రాశాడు. కావ్యాలంకారిక, నాట్యమ శాసనం, సాహిత్య శరీరం అనే మూడు అలంకార శాస్త్ర గ్రంధాలను సంస్కృతంలో రాశాడు. వీటిపై తానే హిందీలో వ్యాఖ్యానాలు రాశాడు. 1976లో కాళిదాస సమగ్ర సాహిత్యాన్ని ముద్రించాడు. కాళిదాసకృత ఋతు సంహార, రఘు వంశ కావ్యాలపై సమగ్ర వ్యాఖ్యానం రాశాడు ద్వివేది. సంస్కృత అలంకార శాస్త్రాలపై హిందీలో వ్యాఖ్యానాలు రాశాడు.

ప్రసాద్‌కు పురస్కారాలు

1978లో రాష్ట్రపతి పురస్కారం అందుకొన్నారు. స్వాతంత్ర్య సంభవ కావ్యానికి సాహిత్య అకాడెమి, కల్పవల్లి, వాచస్పతి, శ్రీవేణిల నుండి నాలుగు పురస్కారాలు లభించాయి. అలంకార శాస్త్ర రచనకు మహా మహోపాధ్యాయ పి.వి.కాణే పురస్కారాన్ని బంగారు పతాకాన్ని పొందాడు. మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల నుండి మొత్తం తొమ్మిది అవార్డులను అందుకొన్న ఘనత రేవా ప్రసాద్ ది.భోపాల్ సంస్కృత అకాడెమి "వ్యాస పురస్కారాన్ని" అందజేస్తే, రెండు సార్లు మిత్ర పురస్కారం ఒకసారి "భోజ" అవార్డ్ గ్రహించాడు. న్యూ ఢిల్లీలోని రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్. మధ్యప్రదేశ్ కాళిదాస సంస్థాన్, సంస్కృత అకాడెమి మొదలైన అనేక సంస్థలు ద్వివేదిని అనేక హోదాలలో నియమించి సేవలు అందుకొన్నాయి.❁

145. జగద్గురు శ్రీరామ భద్రాచార్య (1950 ad)

14-1-1950లో గిరిధర్ మిశ్రాగా జన్మించిన రామభద్రాచార్య బహుభాషావేత్త, కవి, వేదాంతి, బహు గ్రంథకర్త, మహా విమర్శకులు, నాటకకర్త, గాయకులూ, సంగీత దర్శకులు "చిత్రకూట కథాకారులు" అన్నిటికి మించి నలుగురు జగద్గురువులలో ఒకరుగా సుప్రసిద్ధులు. సర్యుపరీన బ్రాహ్మణ కుటుంబంలో రామభద్రాచార్య ఉత్తరప్రదేశ్‌లోని జానాపూర్ జిల్లా శాండీ కుర్ది గ్రామంలో జన్మించారు. వీరిది వాశిష్ట గోత్రం. తల్లి శచీదేవి. తండ్రి పండిత రాజదేవ మిశ్రా. ఈయన మేనత్త భక్త మీరా బాయి భక్తురాలు.

రామభద్రాచార్య చిత్రకూటంలో సంత్ తులసీదాస్ స్మారకార్థం "తులసీ పీఠం" స్థాపించారు. దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా పనిచేశారు. చిత్రకూటంలోని జగద్గురు రామభద్రాచార్య వికలాంగుల విశ్వవిద్యాలయాన్ని స్థాపించి దాని చాన్సలర్‌గా జీవితాంతం ఉన్నారు. వికలాంగులు గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చేయటానికి ఏర్పడిన ప్రత్యేక విశ్వవిద్యాలయం ఇది. రామభద్రాచార్య చిన్ననాట రెండవ నెలలోనే కంటిచూపు కోల్పోయారు. జీవితాంతం అంధ జీవితమే గడుపుతున్నారు. ఎన్ని వైద్యాలు చేసినా చూపు రాలేదు. ఎవరైనా చదివితే విని, అర్థం చేసుకొని, అనంత జ్ఞానాన్ని సంపాదించారు. తానూ చెప్పి ఎవరి చేతనైనా రాయిస్తారు. అలానే అనంత గ్రంథ రచన చేశారు. ఇదొక అద్భుతమైన విషయం. కానీ, విననట్టిది. పదిహేడవ ఏడు వరకు ఏ విద్యనూ నేర్చుకోలేక పోయారు. బ్రెయిలీ లిపిని ఏ సందర్భంలోనూ వాడని విద్యావేత్త ఆయన. ఆదర్శ గౌరీశంకర్ సంస్కృత విద్యాలయంలో చేరారు. ఏక సంథాగ్రాహి అవటం వలన చదివి వినిపించినదంతా ఆకళింపు చేసుకొనే వారు. సంపూర్ణానంద్ సంస్కృత

యూనివర్సిటిలో వ్యాకరణం చదివారు. ఆచార్య, మాస్టర్ డిగ్రీలు సాధించారు. యూనివర్సిటి గ్రాంట్ కమిషన్ నుంచి స్కాలర్షిప్ పొంది అయిదేళ్ళు చదివి సంస్కృతంలో విద్యా వారధి డిగ్రీ పొందారు. "ఆధ్యాత్మ రామాయణములో పాణిని ప్రయోగం" అనే అంశంపై పరిశోధన చేసి అందులో అపాణినీయ ప్రయోగాలపై ప్రత్యేక దృష్టితో రాశారు. పి.హెచ్.డి సాధించిన తర్వాత అదే వర్సిటీలో వ్యాకరణ శాఖ అధ్యక్ష పదవికి ఆహ్వానించినా, హిందూ మతం సంస్కృత వ్యాప్తి కోసం కృషి చేస్తానని సున్నితంగా తిరస్కరించి తన కోరికను సఫలం చేసుకొన్నారు.

రామభద్రాచార్య 22 భాషలలో నిష్ణాతులు, ఆశువుగా కవిత్వం చెప్పగల నేర్పున్నవారు. సంస్కృత, హిందీ, అవధి, మరాటీ మొదలైన భాషలలో అనేక గ్రంథాలు రచించారు. వందకు పైగా గ్రంథాలు యాభైకి పైగా పరిశోధన పత్రాలు రాశారు. ఇందులో నాలుగు సంస్కృత మహా కావ్యాలున్నాయి. తులసీదాసు రామచరిత మానస్, హనుమాన్ చాలీసా, పాణిని సంస్కృత "అష్టాధ్యాయి"లపై విపులమైన వ్యాఖ్యానాలు రచించారు. "ప్రస్తావన త్రయం"కు సంస్కృతం భాష్యం రాశారు. సంస్కృత వ్యాకరణం న్యాయ, వేదాంతాలలో మహా పండితునిగా గుర్తింపు పొందారు. భారతదేశం మొత్తం మీద తులసీదాస్పై పూర్తి సాధికారత ఉన్న శ్రేష్ట విద్వాంస పండితులని గుర్తింపు పొందారు. రామచరిత మానస్కు అద్భుత వ్యాఖ్యానం రచించారు. రామాయణ భాగవతాలకు "కథా కళాకారుని"గా ప్రసిద్ధి చెందారు. ఆయన కథా ప్రదర్శనలు భారత దేశంలోని ప్రతి పట్టణంలోను నిర్వహించారు. అవి రేడియో, టి.విల ద్వారా ప్రసారమై గొప్ప గుర్తింపు లభించింది. విశ్వ హిందూ పరిషత్ అగ్ర నాయకులలో రామభద్రాచార్య ఒకరు.

రామభద్రాచార్య జీవితాంతం బ్రహ్మచారిగా ఉన్నారు. వైష్ణవ సంప్రదాయాన్ని అనుసరించి వైరాగ్యం పొంది రామానంద సంప్రదాయంలో విరక్త దీక్ష తీసుకొన్నారు. ❀



146. శతావధాని - గణేష్ (1960 ad)

సంస్కృత, కన్నడ, ఆంధ్ర భాషలలో శతావధానం చేసి ఆశు అవిత్వంలో దిట్ట అనిపించుకొన్న బహు భాషావేత్త ఆర్.గణేష్ కర్నాటకలోని కోలార్‌లో 4-12-19 6న జన్మించాడు. తండ్రి శంకర్ అయ్యర్. తల్లి అలివేలమ్మ. చిన్నప్పుడు సంస్కృత, తమిళ, కన్నడ, తెలుగు భాషా పరిచయం ఏర్పడింది. సంస్కృత కావ్యాలు చదివి జీర్ణం చేసుకొని పదహారో ఏటనే కవిత్వం చెప్పాడు. స్కూలులో ఇంగ్లీష్ అభ్యసిస్తూ ప్రాకృత, పాళీ, గ్రీక్, లాటిన్, ఇటాలియన్ భాషల్లో ప్రావీణ్యం సంపాదించాడు. మెకానికల్ ఇంజినీరింగ్‌లో బి.ఇ పాసైనాడు. మెటలర్జీలో ఎం.ఎస్ చేశాడు. మెటీరియల్స్, సైన్స్ మెటలర్జీలలో పరిశోధన చేశాడు. సంస్కృతంలో ఎం.ఏ డిగ్రీని కన్నడంలో హంపి యూనివర్సిటి నుండి డి.లిట్‌ను "అవధాన కళ"పై థీసిస్ రాసి పొందాడు.

శతావధానం

చక్కని చిక్కని ఆశుధారా కవిత్వం, సునిసిత మేధ, అవగాహన, ధారణా, జ్ఞాపక శక్తి, హాస్య స్ఫూర్తి, చిక్కులను అధిగమించే ఓర్పు నేర్పు విస్తృత లోక పరిశలన, బహుశాస్త్ర పరిచయం, ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అన్నీ పుష్కలంగా ఉన్న గణేష్ అష్టావధాన శతావధానాలను అలవోకగా చేసి పృచ్ఛకులను, సభాసదులను మెప్పించాడు. సంస్కృత, కన్నడ, తెలుగు మూడు భాషలలో గణేష్ 1000కి పైగా అవధానాలు చేసి అపర గణేశుడనిపించాడు. అమెరికా యూరప్

దేశాలలో ఇరవైకి పైగా అవధానాలు చేసి మెప్పు పొందాడు. 15-12-1991న మొదటి శతావధానాన్ని బెంగళూర్‌లోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించాడు. మరో పదిహేను రోజుల్లో మరొక అవధానాన్ని చేశాడు. ఇలా జైత్రయాత్ర సాగించి 2012లో పూర్తిగా కన్నడంలోనే చేశాడు.

గ్రంథ రచన

అవధానాలు చేసి ఊరుకోలేదు గణేష్. "శతావధాన శారద", "శతావధాన శ్రీవిద్య", "శతావధాన శాశ్వతి" అనే గ్రంథాలు కూడా రాశాడు. ఇవి అవధాన విద్యలో రాణించాలనుకొన్నవారికి కరదీపికలుగా ఉన్నాయి. నాట్యాలకు పాటలు రాశాడు. యక్షగాన విద్య అభ్యసించి, "ఏక వ్యక్తీ యక్షగానం" అనేదాన్ని తాను తయారుచేసి ఎన్నో ప్రదర్శనలిచ్చి తన ప్రజ్ఞను చాటాడు. ఈ విద్యకు "మంటప ప్రభాకర ఉపాధ్యాయ" అనే బిరుదు పొందాడు. షేక్స్పియర్ నాటకం హామ్లెట్‌కు కన్నడాను సరణంగా "హొరాషియో" రాసి తానే ముఖ్యపాత్ర ధరించి ప్రదర్శించాడు.

సంస్కృతంలో గణేష్ అన్వేషణం అనే ఏకాంకిక, సాంబ లహరి అనే ఖండ కావ్యం, శంకర వివేకీయం అనే పద్య కావ్యం, అంతః కాంతి, సౌగంధిక చిత్ర చూళిక (చిత్ర కావ్యం), శ్రీకృష్ణ లహరి, శ్రీ జాంబ లహరి, శృంగార లహరి, జటా శకుంతల, ఇళా కైవల్యమ్, ఏవం అపిర్వతః, చాటు చంద్రిక, శ్రీ చంద్రేశ్వరి స్తవం, మధుసద్మ అనే సంస్కృత కవిత్వ సంకలనం.

కన్నడంలో వితాన, నిత్య నీతి మొదలైన ఇరవై గ్రంథాలను రాశాడు.

బిరుదులూ పురస్కారాలు

గణేష్‌కు కర్ణాటక ప్రభుత్వం "రాజ్యోత్సవ ప్రశస్తి" పురస్కారాన్ని అందించి గౌరవించింది. కావ్య కంఠ ప్రశస్తి, రాష్ట్రీయ యువ ప్రతిభా పురస్కార, బాదరాయణ - వ్యాస పురస్కారం, తుంకూర్ యూనివర్సిటి నుండి గౌరవ డాక్టరేట్, చిత్ ప్రబంధ అవార్డ్, ఎర్యా, సేదియాపు అవార్డులెన్నో ఆయన్ను వరించాయి. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశీలి డా. ఆర్. గణేష్ నడిచే సరస్వతిగా, గణపతిగా భాసిస్తున్నాడు. ❀